

మీర్ లాయక్ అలీ

# హైద్రాబాద్ విషాదం

అనువాదం : డా. ఏనుగు నరసింహారెడ్డి

మీర్ లాయక్ అలీ హైద్రాబాద్ దేశభక్తుడు. ఇంజనీరింగ్ పట్టభద్రుడైన లాయక్ అలీ పారిశ్రామికవేత్తగా ఎదిగారు. తొలుత ఒక కన్‌స్ట్రక్షన్ కంపెనీ నిర్వహించారు. విజయవంతమైన వాణిజ్యవేత్తగా రాణించారు. 1947 డిసెంబర్ 1వ తేదీన హైద్రాబాద్ సంస్థానపు ప్రధానిగా నియమించబడి, 1948 సెప్టెంబర్ 17 వరకు కొనసాగారు. సెప్టెంబర్ 17 నుండి భారత సైన్యం చేత గృహ నిర్బంధం చేయబడ్డాడు. అనూహ్యంగా 1950 మార్చి 3న పోలీసుల కన్ను గప్పి తప్పించుకొని కరాచీ చేరుకున్నారు. హైద్రాబాద్‌ను ఎక్కువగా ప్రేమించే ఆయన తన హయాంలో సంస్థానం పతనం కావడాన్ని జీర్ణించుకోలేకపోయారు.

భారత్, హైద్రాబాద్ ద్వైపాక్షిక సంబంధాలలో మెరుగుదల కోసం నిరంతరం ప్రయత్నించి విఫలమైన సందర్భాల్ని జ్ఞప్తికి తెచ్చుకొని చేసిన రచన ఇది. 1962లో తొలిసారి ట్రాజెడీ ఆఫ్ హైద్రాబాద్' శీర్షికన ప్రచురించబడింది. 1971 అక్టోబర్ 24వ తేదీన న్యూయార్క్‌లో మరణించారు. మదీనాలో సమాధి చేయబడ్డారు.

ఏనుగు నరసింహారెడ్డి నల్లగొండ జిల్లా చిట్యాలవాసి. 1968లో కల్లోనికుంట గ్రామంలో జన్మించి, ఉన్నత విద్యాభ్యాసానంతరం రెవిన్యూశాఖలో డిప్యూటీ కలెక్టరుగా పని చేస్తున్నారు. కవిగా, రచయితగా ప్రసిద్ధుడైన నరసింహారెడ్డి 'సమాంతర స్వప్నం, నేనే, మట్టిపాట, కొత్తపలక' కవితా సంపుటాల్ని ప్రచురించారు. కవిత్వం మాత్రమే కాదు, కథలు, వ్యాసాలు రచించారు. సామాజిక, రాజకీయ, సాహిత్య అంశాల్ని విశ్లేషిస్తూ తన అభిప్రాయాల్ని వ్యక్తం చేస్తున్నారు. చరిత్రని ఇష్టంగా అధ్యయనం చేయడం అలవాటు.

మీర్ లాయక్ అలీ రచించిన 'ట్రాజెడీ ఆఫ్ హైద్రాబాద్'ను 'హైద్రాబాద్ విషాదం' పేరున 'పాలపిట్ట' కోసం అనువదించారు.

మీర్ లాయక్ అలీ

# హైద్రాబాద్ విషాదం

చారిత్రక రచన

అనువాదం

**డా॥ ఏనుగు నరసింహారెడ్డి**

పాలపిట్ట–బుక్స్
హైదరాబాద్

# HYDERABAD VISHAADAM
# (TRAJEDY OF HYDERABAD)

by **Mir layak ali**

Translated by **Dr. Anugu Narashima Reddy**

Cell: 89788 69183


| | | |
|---|---|---|
| Cover Design | : | Brahmam Bhavana Grafix<br>Hyderabad@9848254745 |
| First Edition | : | 2016 |
| For Copies | : | Palapitta Books<br>16-11-20/6/1/1<br>403, Vijayasai Residency<br>Saleem Nagar, Malakpet<br>Hyderabad - 500 036<br>palapittabooks@gmail.com<br>Phone: 040-27678430<br><br>Anugu Narasimha Reddy<br>3-14-50, Vijayasri Colony<br>Sahara Road<br>Vanasthalipuram<br>Hyderabad-500 070 |
| Printed at | : | Karshak Printers<br>Vidyanagar<br>Hyderabad |
| Price | : | ₹150/- |

# చరిత్రపై భిన్నమైన చూపు

చరిత్రని అర్థం చేసుకోడానికి దానిని అన్ని కోణాల్నించి దర్శించాలి. చరిత్రని చరిత్రగా స్వీకరించాలి. ఎందుకంటే చరిత్రను మనం మార్చలేం. దానిని యధాతథంగా స్వీకరించడం తప్ప మరో మార్గం లేదు. చరిత్రని ఎవరు ఎలా చూస్తారు, ఎలా చెబుతారు, ఎలా వ్యాఖ్యానిస్తారన్నది కూడా ప్రధానం. ఈ క్రమంలో ప్రత్యక్షసాక్షుల కథనానికి మరింత ప్రాధాన్యం వుంటుంది. సానుకూలంగానో, ప్రతికూలంగానో చరిత్రలో భాగస్వాములయ్యే వారి మాటల్ని సావధానంగా ఆలకించాలి. చారిత్రక పరిణామాల పట్ల మన అవగాహన విస్తృతికి ఇది తోడ్పడుతుంది. కనుకనే 'హైద్రాబాద్ విషాదం' గురించి తెలుసుకోవడం అవసరం.

1947 ఆగస్టు 15 నుండి 1948 సెప్టెంబర్ 17 వరకు నడిచిన హైద్రాబాద్ చరిత్ర చాలా ఉద్విగ్నభరితమయింది. 1947 ఆగస్టు 15 నాడు ఏడవ నిజాం మీర్ ఉస్మాన్ అలీఖాన్ ఒక ప్రకటన చేస్తూ ఇండియా, పాకిస్తాన్‌లలాగే హైద్రాబాద్ కూడా స్వతంత్ర దేశంగా కొనసాగుతుందని ఇటు ఇండియాలో కానీ అటు పాకిస్తాన్‌లో కానీ విలీనం కాదని ప్రకటించాడు. తద్విరుద్ధంగా 1948 సెప్టెంబర్, 17న ఆయనే భారత సైన్యంతో కాల్పుల విరమణ ప్రకటించి ఇండియాలో విలీనానికి అంగీకరించాడు. ఆయన ఎంత తప్పనిసరైన పరిస్థితుల్లో అందుకు అంగీకరించాడో ఎవరైనా ఊహించవచ్చు.

అభిప్రాయ భేదాలున్నప్పటికీ నిజామాంధ్ర ప్రజానీకం భారతదేశంలో విలీనాన్ని కోరుకున్నారని, ఖాసీంరజ్వీ లాంటి ముస్లిం అతివాదులు హైద్రాబాద్‌ను పాకిస్తాన్‌లో విలీనం చేయించదలుచుకున్నారని ఒక అభిప్రాయం ఏర్పడింది. నిజాం ఒక్కడే దీన్ని స్వతంత్ర దేశంగా ఉంచదలచి విఫలమయ్యాడు.

మొదటి వర్గం వారి దృష్టి కోణం నుండి హైద్రాబాద్ చరిత్రను పరిశీలించడానికి రావినారాయణరెడ్డిగారి వీర తెలంగాణ– నా అనుభవాలు, జ్ఞాపకాలు, సుందరయ్యగారి విప్లవ పథంలో నా పయనం, ముందుముల నరసింగరావుగారి యాభయి సంవత్సరాల హైద్రాబాద్, భీంరెడ్డి నరసింహారెడ్డి అనుభవాలు, మనకు తెలియని మన చరిత్రలాంటి పుస్తకాలున్నాయి. ఇవన్నీ చరిత్రను విప్లవకారుల దృష్టి కోణం నుంచే చూసి రాయబడ్డాయి. జె.ఎన్.చౌదరి ఆత్మకథ, కె.ఎమ్.మున్షీగారి ఆత్మకథ 'ఎండ్ ఆఫ్ ఎన్ ఎరా', సయ్యద్ అహ్మద్‌గారి 'హైద్రాబాద్ ఆఫ్ ది సెవెన్ లావెస్' గ్రంథాలు నడిచిన ఇటీవలి చరిత్రను భిన్నంగా చూపించాయి.

మీర్‌లాయక్ అలీగారి 'ట్రాజెడీ ఆఫ్ హైద్రాబాద్' ఈ కోణంలో ఓ విలక్షణమైన రచన. ఆనాటి నిజాం రాష్ట్ర ప్రధానిగా, హైద్రాబాద్ దేశభక్తుడిగా, హైద్రాబాద్ రాష్ట్ర స్వాతంత్ర్యం కోసం తీవ్రంగా ప్రయత్నించి విఫలమైన వ్యక్తి. ఆనాటి న్యాయాన్యాయాలను తనదైన తూనికరాళ్ళతో బేరీజు వేసి ఆవేదనతో రాసిన గ్రంథమిది. 'ట్రాజెడీ ఆఫ్ హైద్రాబాద్' గ్రంథాన్ని ఇటీవల దక్కన్ సోసైటీ వారు ఇంగ్లీషులో ప్రచురించారు. దానికి కుర్రా జితేంద్రబాబు సంపాదకులుగా వ్యవహరించారు.

ఆంగ్లంలోని ఈ పుస్తకాన్ని ప్రముఖ కవి, రచయిత డా. ఏనుగు నరసింహారెడ్డి తెలుగులోకి అనువాదం చేశారు. ఇందులోని కొన్ని భాగాలు 'పాలపిట్ట' పత్రికలో ప్రచురితమయ్యాయి. ఇప్పుడు మీర్ లాయక్ అలీ రచించిన పుస్తకం మొత్తం పాఠకుల ముందుకు వచ్చింది.

*– పాలపిట్ట బుక్స్*

# అనువాదం గురించి

పదిహేను సంవత్సరాలకు పైగా వివిధ జిల్లాలలో పని చేసాక 2011లో హైద్రాబాద్ కలెక్టరేట్‌లో డిప్యూటీ కలెక్టర్‌గా చేరాను. అప్పటి కలెక్టర్ గుల్జార్ నటరాజన్, జాయింట్ కలెక్టర్ యోగితా రాణాలు నన్ను బాగా ఆదరించారు. కొత్త కొత్త పనులు చెబుతుండేవారు. ఏదైనా కఠినమైన సమస్య వచ్చినప్పుడు చర్చించేవారు. అలా నాకు హైద్రాబాద్ ప్రాంతానికే పరిమితమైన సమస్యల పట్ల అవగాహన పెంచుకోవలసి వచ్చింది. ఈ క్రమంలో జాగీర్ల రద్దు చట్టాన్ని లోతుగా చదవాల్సి వచ్చింది. సీనియర్ ఐ.ఏ.ఎస్. అధికారి రాజయ్య హైద్రాబాద్ స్టేట్ లాస్ మీద రాసిన పుస్తకం చూసాను. జాగీర్ల రద్దు జరిగి అవి దివానీలో కలిపివేయబడ్డ వేగం నన్ను చకితున్ని చేసింది. అంత తక్కువ కాలంలో జాగీర్దార్ల వ్యవస్థను కుప్పకూల్చడం చాలా గొప్ప విషయంగా అనిపించింది. ఈ విషయమై 'చరిత్ర కెక్కని భూవిప్లవం' పేరు మీద ఆంధ్రజ్యోతి డైలీలో నేనొక వ్యాసం రాసాను.

ఈ విషయాలను చిరకాల మిత్రులు గుడిపాటితో చర్చిస్తున్నప్పుడు ఉత్సాహంతో నాకొక పుస్తకం తెచ్చి ఇచ్చాడు. అది మీర్ లాయక్ అలీ రాసిన 'ట్రాజెడీ ఆఫ్ హైద్రాబాద్'. అది ఇచ్చి ఈ పుస్తకం చదివి ఒక వ్యాసం ఏదైనా రాయండి అన్నాడు. కె.జితేంద్రబాబు సంపాదకత్వంలో డాక్రి వాళ్ళు ప్రచురించిన ఆ పుస్తకం చదివి ఆశ్చర్యపోయాను. అది మనకు తెలియని మన చరిత్రలా అనిపించింది. ఇందులో రెండు విషయాలు నన్ను ఆకర్షించాయి. ఒకటి – వస్తువు, రెండు – దాన్ని చెప్పిన పద్ధతి. ట్రాజెడీ ఆఫ్ హైద్రాబాద్‌లో మొదటి అధ్యాయం 'దేశ విభజన తర్వాత'. ఇది ఒక చేయితిరిగిన కథారచయిత రాసినట్లు ఉంది. ఆశ్చర్యకరంగా రచయిత ఒక వ్యాపారవేత్త. తప్పనిసరై రాజకీయవేత్తగా మారాడు. హైద్రాబాద్ సంస్థానం చివరి

ప్రధానిగా పనిచేసాడు. మీర్ లాయక్ అలీ విదేశాలలో ఉన్నత విద్య అభ్యసించి హైద్రాబాద్ సంస్థానంలో మంచి వ్యాపారవేత్తగా ఎదిగాడు. మహ్మద్ అలీ జిన్నాకు ప్రియమైన వ్యక్తి. పాకిస్తాన్‌కు ఐక్యరాజ్యసమితిలో ప్రతినిధిగా పని చేసాడు. అయిష్టంగా ప్రధాని పదవి చేపట్టిన అలీ, తన హయాంలోనే సంస్థానం పతనం కావడాన్ని జీర్ణించుకోలేకపోయాడు. ఇండో హైద్రాబాద్ సంబంధాలలో భారత్ ధోరణి ఈయనను బాగా కలవరపెట్టింది. భారత్ హైద్రాబాద్ మీద చేసిన సైనికచర్యకు ముందు నడిచిన రాజకీయం ఇందులోని విషయం. మొదటి చాప్టర్‌ను తెలుగు అనువాదం చేసి గుడిపాటికి చూపించాను. అలా ఆసక్తితో మొత్తం పుస్తకం అనువాదమయింది. పాలపిట్ట మాసపత్రికలో సీరియల్‌గా వస్తూ ఉంది.

ఈ సీరియల్ చదువుతూ అనేకమంది పెద్దలు, మిత్రులు నాతో మాట్లాడారు. ఈ పుస్తకం తెలుగులో ఇప్పటికే రావలసింది అన్నారు. కొందరు కంటెంట్‌కు, రచయితకు వ్యతిరేకంగా కూడా మాట్లాడారు. ఇది అనువాదంలా లేదని మంచి తెలుగులో ఉందని నన్ను ఉత్సాహపరిచారు. డా॥ కె.వి.రమణాచారి, శ్రీ బి.నరసింగరావు, డా॥ నందిని సిధారెడ్డి, డా॥ సుంకిరెడ్డి నారాయణరెడ్డి, శ్రీ కోమటిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, శ్రీ జెమిని గోవర్ధన్‌రెడ్డి, ఆచార్య జయధీర్ తిరుమలరావు, శ్రీ దేశపతి శ్రీనివాస్, శ్రీ వేణు సంకోజు, శ్రీ. వి.పి.చందన్‌రావు, డా॥ రూప్‌కుమార్ డబ్బీకార్, శ్రీ సురేష్ పోద్దార్, శ్రీ దివికుమార్, శ్రీ జి.నర్సారెడ్డి, శ్రీ ఆశారాజు, శ్రీ పి.సి.రాములు, డా॥ అమ్మంగి వేణుగోపాల్, శ్రీ వంగ రవీందర్ రెడ్డి, డా॥ గుమ్మన్నగారి బాలశ్రీనివాసమూర్తి, శ్రీ చింతపట్ల సుదర్శన్, శ్రీ కాసుల ప్రతాపరెడ్డి, శ్రీ సామిడి జగన్‌రెడ్డి, శ్రీ వేముగంటి మురళీకృష్ణ, శ్రీ కోర, శ్రీ మొయినుద్దీన్, శ్రీ కె.పి.అశోక్‌కుమార్, శ్రీ సంగిశెట్టి శ్రీనివాస్, శ్రీ కె.నవీన్‌కుమార్, శ్రీ డాకారెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి, శ్రీ మహ్మద్ ఖదీర్‌బాబు మొదలుగా అనేకమంది పెద్దలు, మిత్రులు ఈ పుస్తకం తొందరగా బయటకు రావాలని ఆకాంక్షించారు. అరుణ, చైతన్య సింధు కందాటి, తేజస్విని, గీతాంజలిలు నా అనువాదంలో సహకరించారు. అందరికీ కృతజ్ఞతలు.

**– డా॥ ఏనుగు నరసింహారెడ్డి**

అనువాదకుడు

# విలీన నేపథ్యం, పూర్వాపరాలు

హైద్రాబాదు సంస్థానం భారతదేశంలో విలీనం అయిన సందర్భంలో అనేకానేక సంప్రదింపులు, సంఘటనలు జరిగాయి. నిజాం ప్రభుత్వం, భారత ప్రభుత్వం భిన్న వాదనలను ప్రజలముందు ఉంచాయి. ఆనాటి చరిత్రను అర్థం చేసుకోవడానికి ముఖ్యంగా నిజాం ప్రభుత్వం భారత ప్రభుత్వంతో జరిపిన సంప్రదింపులకు, చర్చలకు, రెండు ప్రభుత్వాల మధ్య జరిగిన ఉత్తర ప్రత్యుత్తరాలకు సంబంధించి శ్వేతపత్రాన్ని నిజాం ప్రభుత్వం, భారత ప్రభుత్వం 1948లో ప్రచురించి ప్రజల ముందుంచాయి. భారత ప్రభుత్వంలో ఉపప్రధానిగా, హోంశాఖామంత్రిగా ఉన్న సర్దార్ పటేల్‌కు అత్యంత విశ్వాస పాత్రుడు వి.పి.మీనన్ 'స్వదేశసంస్థానాల విలీనం' (Integration of the Indian states) అన్న గ్రంథంలో భారత ప్రభుత్వపు ఉద్దేశాలను, ఆనాటి కాంగ్రెస్ పార్టీ విధానాన్ని సమర్థిస్తూ నిజాంకు వ్యతిరేకంగా అనేక విషయాలను ప్రస్తావించాడు. ఇతను భారత ప్రభుత్వం తరపున నిజాం ప్రభుత్వంతో జరిగిన అన్ని సంప్రదింపుల్లోనూ ప్రధాన పాత్ర పోషించాడు. భారత ప్రభుత్వం తరుపున నిజాం సంస్థానంలో ఏజెంట్ – జనరల్‌గా ఉన్న కె.ఎం.మున్షీ తన పాత్రను వివరిస్తూ ఆనాటి సంఘటనలను తనదైన కోణంలో 'The end of the era' అన్న గ్రంథంలో వివరించాడు. భారతదేశ ఆఖరి బ్రిటీషు వైస్రాయి మరియు గవర్నరు జనరల్‌గా వ్యవహరించిన లార్డ్‌మౌంట్ బాటన్ వ్యక్తిగత కార్యదర్శిగా పని చేసిన 'ఎలెన్.కాంబెల్ జాన్సన్', 'Mission with Mountbatten' అన్న గ్రంథంలో సంప్రదింపులకు సంబంధించి రోజువారీ వివరాలను వివరించాడు. మీర్ లాయక్ అలీ ఈ గ్రంథంలో నిజాం తరపున భారత ప్రభుత్వంతో జరిగిన సంప్రదింపులలో పాల్గొని తనదైన విశ్లేషణను ఆనాటి సంఘటనలకు సంబంధించి వివరించాడు. ఈ రచనలన్నీ వివిధ

కోణాల్లో నిజాం సంస్థానం భారతదేశంలో జరిగిన విలీనం గూర్చి, హైద్రాబాద్ సంస్థానంపై 'పోలీసు చర్య'గా పిలవబడుతున్న సైనికదాడికి ముందు జరిగిన సంఘటనలకు సంబంధించి వివరిస్తున్నది.

ఈ గ్రంథంలోని చారిత్రక సంఘటనలను, సందర్భాన్ని అర్థం చేసుకోవడానికి ముందు జరిగిన పరిణామాలను కొంత అవలోకనం చేసుకోవాల్సిన అవసరం ఉంది.

1857 వరకే సంస్థానాలన్నిటిని నిర్మూలించిన బ్రిటీషువారు ఆనాటి నుండి వాటిని ప్రత్యేకంగా జాగీర్దారి విధానపు పుట్టినిళ్ళలాగా, భారత ప్రజల రాజకీయ, ఆర్థిక జీవితాలను ఏకం కాకుండా నిరోధించే వ్యవస్థలుగా కాపాడుతూ వచ్చారు. తాము నిష్క్రమిస్తే ఇక్కడ సార్వభౌమత్వం కూడా అంతమొంది దేశం చిన్నాభిన్న మౌతుందని కొందరు బ్రిటీషురాజకీయ నాయకులు ఆశించారు. కానీ భారత దేశానికి స్వాతంత్ర్యం ప్రకటించగానే అనేక సంస్థానాల పాలకులు నిరంకుశాధికారాన్ని స్వయంగా ఒదులుకుని భారత ప్రభుత్వంలో కలిసిపోయారు. 1947లో భారతదేశం స్వాతంత్ర్యం పొందేనాటికి దేశంలోని నలుమూలలా వ్యాపించి భిన్నాభిన్న వ్యవస్థలతో దేశ స్వరూపాన్ని అతుకుల బొంతలా ఉంచిన 566 సంస్థానాలున్నాయి.

దేశం బలపడాలంటే దేశంలో సంతృప్తికరమైన పాలన ఏర్పడి పాదుకోవాలంటే ఈ సంస్థానాల విలీనీకరణ వీలైనంత తొందరగా చేయాలని భావించింది భారతకేంద్ర నాయకత్వం, దీనికి అనుగుణంగా తగిన చర్యలు తీసుకోవడమే గాకుండా, సంస్థానాల్లో పాదుకొని ఉన్న మధ్యయుగాలనాటి జమిందారీ విధానాన్ని నిర్మూలించి, ప్రజాస్వామిక వ్యవస్థలు నెలకొల్పాలని, సంస్థానాల ఆర్థికాభ్యుదయం సాధ్యపడేటట్లు చేయాలని ప్రభుత్వం ప్రయత్నించింది. సంస్థానాలను దేశంలో విలీనం చేయడానికి, పక్కనే ఉన్న రాష్ట్రాలలో ఆ సంస్థానాలను కలిపివేయడం, కేంద్రప్రభుత్వ పాలన కిందికి తీసుకురావడం, పక్కపక్కన ఉన్న మిగిలిన సంస్థానాలలో కలిపి నిలబడగల సమాఖ్యలను ఏర్పరచడం లాంటి ఆశయాలతో భారత ప్రభుత్వం ప్రత్యేకమైన సంస్థాన శాఖను ఏర్పాటు చేశారు. వారు 1948 – 49 సంవత్సరాలలో 23, 598 చదరపు మైళ్ళ విస్తీర్ణం గలిగిన, 56 లక్షల జనాభా గలిగిన 6 సంస్థానాలను పక్కన ఉన్న రాష్ట్రాలలో విలీనం చేశారు. వీటిలో బరోడా, కొల్లాపూర్, సిరోహి, దంతాలను బొంబాయి రాష్ట్రం లోనూ, మయూర్భంజ్ ఒరిస్సాలోను, టెహ్రోఘర్వాల్ సంయుక్త రాష్ట్రాలలో కలిపివేశారు. 8268 చదరపు మైళ్ళ విస్తీర్ణం గలిగిన 14 లక్షల జనాభా

గలిగిన బిలాస్‌పూర్, భోపాల్, రాంపూర్ సంస్థానాలు కేంద్ర ప్రభుత్వ పాలన కింద చీఫ్ కమిషనర్ రాష్ట్రాలుగా చేయబడ్డవి.

పాటియాలా, కపుర్థలా, మలేర్‌కొట్లా, ఫరీద్ కోట్, నాభా, జింద్, నాలఘర్, కల్సియా సంస్థానాలు కలిపి పాటియాల తూర్పు పంజాబ్ సంస్థానాలుగా ఏర్పాటు చేయబడ్డాయి. దక్షిణ భాగంలో ఉన్న తిరువాన్కూర్, కొచ్చిన్‌లను కలిపివేశారు. స్వాతంత్ర్యం వచ్చిన రెండు సంవత్సరాలలో 214 సంస్థానాలు పక్క రాష్ట్రాలలో కలిపివేయబడ్డాయి. 304 సంస్థానాలు ఆరు పెద్ద సమాఖ్యలుగా చేయబడ్డాయి. కాశ్మీర్, హైద్రాబాద్, మైసూర్, మణిపూర్, త్రిపుర, కుచ్‌బీహార్, ఖాసీ పర్బత్ సంస్థానాలు కాశీ సంస్థానాలు మొత్తం 8 మాత్రం విలీనీకరణలో మిగిలాయి.

ఈ మిగతా సంస్థానాల విషయం పక్కన పెడితే హైద్రాబాద్ సంస్థానం విషయం మాత్రం వీటికి భిన్నంగా నడిచింది. హైద్రాబాద్ సంస్థానం భారతదేశంలోని అన్ని స్వదేశీ సంస్థానాల కంటే వైశాల్యంలో జన సంఖ్యలో ఆదాయ వనరులు వాటన్నిటిలో పెద్దది. ఈ సంస్థాన వైశాల్యం 82,698 చదరపు మైళ్ళు. 1931 నాటి జనాభా లెక్కల ప్రకారం 1,44,36,148 మంది ప్రజలు ఈ సంస్థానంలో జీవిస్తున్నారు. ఇందులో తెలుగు మాట్లాడేవారి సంఖ్య 69,72,534, మరాఠీ మాట్లాడేవారి సంఖ్య 37,86,336, కన్నడం మాట్లాడేవారి సంఖ్య 15,07,272. హైద్రాబాద్ సంస్థానం మొదటి నుండి స్వతంత్ర ప్రభుత్వాన్ని నడుపుతూ కరెన్సీని, టెలిఫోన్, టెలీగ్రాఫ్ సౌకర్యాలతో పాటు సివిల్ సర్వీసు, విశ్వవిద్యాలయాలు, రైల్వేలు, పరిశ్రమలు, సైన్యం మరియు పోలీసు వ్యవస్థలు కలిగి ఇతర స్వదేశీ సంస్థానాలకు భిన్నంగా స్వతంత్రదేశంగా ఉండింది. శతాబ్దంపైగా బ్రిటీషువారు నిజాం ప్రభుత్వ పాలనలో జోక్యం చేసుకొంటున్న ప్పటికి హైద్రాబాద్ సంస్థానం ఎప్పుడూ బ్రిటీషు సార్వభౌమాధికారం కిందికి వెళ్ళడంగాని, బ్రిటీషు ఇండియాలో భాగంగా ఉండటం గాని జరగలేదు. బ్రిటీషు ప్రభుత్వంతో స్నేహపూర్వకమైన, విశ్వసనీయమైన మైత్రితో కూడిన సంబంధం మాత్రమే ఉండింది. హైద్రాబాద్ సంస్థానం ప్రతిదశలోనూ చారిత్రకంగా ఒక స్వతంత్ర రాజ్యంగా ఉన్నది.

బ్రిటీషు వారు భారతదేశం వదలివెళ్ళాలని నిర్ణయం తీసుకొంటున్న సమయంలో సంస్థానాలను పట్టించుకోవడంగాని, వాటి హక్కులను గుర్తించడం గాని చేయలేదు. బ్రిటీషు ప్రభుత్వం నిజాంతో చేసుకున్న ఒప్పందాలను, ఒడంబడికలను, ఏకపక్షంగా రద్దు పరుస్తున్నట్లు ప్రకటించింది.

భారతదేశానికి స్వాతంత్ర్యాన్ని ఇవ్వాలనే ఆలోచన రెండవ ప్రపంచయుద్ధం ముగిసిన తర్వాత అధికారంలోకి వచ్చిన లేబరు ప్రభుత్వానికి కలిగింది. లేబర్ పార్టీ అధికారంలోకి రాగానే భారత సమస్యకు పరిష్కారాన్ని సూచించాలని భావించి 1946లో బ్రిటీషు కాబినెట్, భారత రాజ్యాంగాన్ని నిర్మించడానికి, భారత నాయకులతో చర్చించడానికి, ముగ్గురు వ్యక్తులతో కూడిన ప్రతినిధి బృందాన్ని మార్చి 24న భారతదేశానికి పంపించడం జరిగింది.

రెండవ ప్రపంచయుద్ధం ముగిసిన తర్వాత ప్రపంచవ్యాప్తంగా జరుగుతూ వస్తున్న పరిణామాలు భారత సంస్థానాధీశుల ఆలోచనల్లో మార్పు తెచ్చాయి. భారతదేశంలోని ఇతర సంస్థానాలన్నీ కలిసి ఒక సంఘాన్ని ఏర్పాటు చేసుకొని బొంబాయిలో సమావేశమై శాసనసభల ఏర్పాటు గూర్చి, ఆస్తి హక్కు, స్వేచ్ఛ, సమానత్వం, సంఘాలని ఏర్పాటు చేసుకునే హక్కు మొదలైన విషయాల గూర్చి చర్చించుకుని ఒక నిర్ణయానికి వచ్చి ఉన్నారు.

హైద్రాబాద్ సంస్థానం ఇతర సంస్థానాధీశులు ఏర్పాటు చేసిన ఈ సంఘంలో క్రియాశీల పాత్ర వహించడం గాని, పాల్గొనటం గాని చేయలేదు. హైద్రాబాద్ సంస్థానం స్వతంత్రంగా రాజ్యాంగ సంస్కరణల వైపు అడుగులు వేస్తూ ఎంతో కాలంగా ప్రజల నుండి, ప్రజాస్వామ్య వాదుల నుండి వస్తున్న ఒత్తిడిని చల్లబరచడానికి ప్రయత్నిస్తూ వచ్చింది. ప్రధానమంత్రిగా ఉన్న చత్తారీ నవాబు ప్రవేశపెట్టిన రాజ్యాంగ సంస్కరణలను ప్రజలు తిరస్కరించారు. 1938లో ప్రకటించిన సంస్కరణల కంటే మరింత అసంతృప్తి కరంగా ఈ సంస్కరణలు ఉన్నాయని ప్రజలు భావించారు. ఈ సంస్కరణలలో శాసనసభ సభ్యుల సంఖ్య 85 నుండి 132 కు పెంచడం జరిగింది. ఈ సభ్యులలో ఎన్నికైన సభ్యులకంటే నియామక సభ్యులకే ఎక్కువ ప్రాధాన్యత ఇవ్వడంతో రైల్వేలు, టెలీగ్రాఫ్, కరెన్సీ, నాణాల ముద్రణ, భూ ఆదాయం కంటే ముఖ్యమైన విషయాలన్నిటిపై శాసనసభలో బిల్లు ప్రవేశపెట్టే అధికారం ప్రభుత్వ నియామక సభ్యులకు ఇవ్వడంతో కాంగ్రెస్ పార్టీవారికి, ఇత్తెహాద్ ముస్లిమీన్‌వారికి ఈ సంస్కరణలు రుచించలేదు. బిరారు సైన్యం, పోలీసు, రాజ్యసభ, విదేశీ సంబంధాలు మొదలైన ముఖ్యవిషయాలపై సభ చర్చించరాదని కూడా సంస్కరణలలో పేర్కొన్నారు. ఇలా చేసిన అనేక సంస్కరణలను ప్రజల్లో రాజకీయ పార్టీల్లో తీవ్ర అసంతృప్తికి కారణం అయినాయి.

1946లోనే హైద్రాబాద్ స్టేట్ కాంగ్రెస్‌పై నిషేధం ఎత్తివేయబడింది. అప్పటికే కాంగ్రెస్ బాధ్యతాయుత ప్రభుత్వం ఏర్పాటు చేసుకోవాలని, ప్రజల సార్వభౌమత్వాన్ని

గుర్తించాలని, స్వతంత్ర భారత యూనియన్‌లో సమీకృత భాగంగా రాజ్య రాజ్యాంగ నిర్మాణాధికారం ప్రజలకు ఇవ్వాలని కోరుతూ వస్తున్నది. ఇత్తెహద్ ముస్లిమీన్ వారు ఇస్లామిక్ డొమినియన్ ఏర్పడాలని కోరుతూ వస్తున్నారు. నిజాం సార్వభౌమ అధికారంతో సర్వస్వతంత్రుడిగా ఉండాలని ఉవ్విళ్ళూరుతున్నాడు.

ఇటువంటి సందర్భంలో 1946 మార్చిలో కేబినెట్ మిషన్ తన ప్రధాన ప్రతిపాదనలను వెల్లడించింది. అందులో సంస్థానాలకు సంబంధించి భారతదేశం స్వతంత్రం కావడంతో బ్రిటీష్ ప్రభుత్వానికి సంస్థానాలకు మధ్య అమలులో ఉన్న పాత ఒప్పందాలు, సంబంధాలు యాంత్రికంగా ముగుస్తాయని, సార్వభౌమాధికారం కొనసాగడం గాని, కొత్త ప్రభుత్వానికి బదలీచేయడం గాని కుదరదని పేర్కొన్నది. దీనితో బ్రిటీషు వారితో సంస్థానాధీశులు వివిధ సందర్భాల్లో చేసుకొన్న వివిధ ఒప్పందా లు ఒడంబడికల ద్వారా సంక్రమించిన రక్షణ, విదేశీ వ్యవహారాలు, కమ్యూనికేషన్లు మినహా సంస్థానాలకు తిరిగి చెందుతాయి. ఈ దృక్పథాన్ని నిజాం అందిపుచ్చుకున్నాడు. జాతీయవాదులకు కాంగ్రెస్ వారికి ఈ ప్రకటన ఎదురుదెబ్బ.

1946 సెప్టెంబర్‌లో జవహార్‌లాల్ నెహ్రూ కేంద్రంలో మధ్యంతర ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసి రాజ్యాంగ సభకు ఎన్నికలు జరిపించి, డిసెంబరు నుండి రాజ్యాంగ నిర్మాణానికి చర్చలు ప్రారంభించాడు. సంస్థానాలను రాజ్యాంగ సభలోకి ఆహ్వానించి విధివిధానాలను నిర్ణయించటానికి ఒక సంఘాన్ని ఏర్పాటు చేశాడు. బరోడాలాంటి పెద్ద సంస్థానాలు గతంలో ఏర్పాటు చేసుకొన్న సంస్థానాధీశుల సంఘం నియమాలను ఉల్లంఘించి భారత రాజ్యాంగ నిర్మాణ చర్చలకు ప్రతినిధులను పంపడం జరిగింది.

ఇటువంటి నేపథ్యంలో 1947 ఫిబ్రవరి 20న బ్రిటీష్ ప్రధానమంత్రి అట్లీ ఒక ప్రకటన చేస్తూ కేవలం 16 నెలల తర్వాత 1948 జూన్ లోపల భారతీయలకు అధికార బదలాయింపు జరుగుతుందని ప్రకటించాడు. రాజ్యాంగ నిర్మాణ చర్చల్లో తనకు ఆసక్తి లేదని ప్రకటించాడు.

నిజాం కూడా స్వతంత్రానంతరం స్వతంత్ర ప్రభువుగా తన హోదాను భారత స్వాతంత్ర్యం తర్వాత పున:ప్రారంభించాలనుకున్నాడు. కాబట్టి రాజ్యాంగ నిర్మాణ చర్చల్లో తనకు ఆసక్తి లేదని ప్రకటించి ప్రతినిధులను పంపలేదు. నిజాం దృష్టిలో రాజ్యాంగ చర్చల్లో పాల్గొనటమంటే పారతంత్ర్యాన్ని అంగీకరించడమే అని భావించాడు. తనకు బ్రిటీషు సార్వభౌమునితో మాత్రమే స్నేహ సంబంధం అని, తాను బ్రిటీషు కామన్వెల్త్‌లో మాత్రమే సభ్యునిగా ఉంటానని భావించాడు.

ఇలాంటి సందర్భంలో ప్రధాని చత్తారీనవాబ్‌ను పంపించి సర్ మీర్జా ఇస్మాయిల్‌ను ప్రధానమంత్రిగా హైద్రాబాద్ సంస్థానానికి నిజాం నియమించాడు. ఇతని నియామకాన్ని మహ్మదలీ జిన్నా వ్యతిరేకించాడు. నిజామును కలిసి ఆ నియామకాన్ని ఆపాలని కోరటానికి స్వయంగా హైద్రాబాద్ వచ్చి నిజామును కలిశాడు. కాని నిజాం ప్రధాన మంత్రి నియామకం గూర్చి జిన్నాతో చర్చించడానికి నిరాకరించాడు. మహ్మద్ అలీ జిన్నా అసంతృప్తితో తిరిగి వెళ్ళాడు. బ్రిటీషు వారి నుండి బిరారు ప్రాంతాన్ని మీర్జా ఇస్మాయిల్ తనకు ఇప్పించగలడనే విశ్వాసం నిజాంకు ఉండింది. దానికి కారణం మీర్జా ఇస్మాయిల్ ఢిల్లీలోని కాంగ్రెస్ నాయకత్వానికి అత్యంత సన్నిహితుడు మాత్రమే గాక వారు గౌరవించే వ్యక్తి.

అప్పటికి ప్రఖ్యాత న్యాయవాదిగా ఉన్న సర్ వాల్టర్ మాంక్టన్‌ను నిజాం రాజ్యాంగ సలహాదారుగా నియమించుకొన్నాడు. ఇతడు హైద్రాబాద్‌లోని ముస్లిం స్త్రీని ఇష్టపడగా అతని రెండవ వివాహానికి సహకరించడం మాత్రమే గాక ఇతన్ని హనీమూన్‌కు కూడా నిజాం సహకరించాడు. సర్ వాల్టర్ మాంక్టన్ కూడా నిజాం ఆలోచనలకు అనుగుణంగా సైద్ధాంతిక బలాన్ని అందించే ఒక నివేదిక తయారు చేసి ఇచ్చాడు. అందులో 'భారతీయులు డొమినియన్ హోదాకు బదులుగా సంపూర్ణ స్వాతంత్ర్యాన్ని కోరుకున్న పక్షంలో నిజాం ప్రభుత్వం భారతదేశం నుండి పూర్తిగా విడిపోవడానికి సిద్ధంగా ఉందని, బ్రిటీషు సార్వభౌమత్వం యాంత్రికంగా తొలగిపోతుందని, తన నిర్ణయాలను అమలు పరచడానికి ఎటువంటి అధికారం లేకపోవడంవల బ్రిటీషు ప్రభుత్వంతోని అటువంటి బాధ్యతను కొనసాగించడం సాధ్యం కాదని' నివేదికలో వివరించాడు.

అటువంటి పరిస్థితులలో భారతీయ సంస్థానాలకు హైద్రాబాద్ సంస్థానానికి అందుబాటులో ఉన్న ప్రత్యామ్నాయాలను మాంక్టన్ తన నివేదికలో వివరించాడు. అందులో హైద్రాబాద్ సంస్థానం ఇతర సంస్థానాలకంటే భిన్నమైనటువంటిదైనప్పటికి, వైశాల్యం, వనరులు ఎక్కువగా ఉన్నప్పటికి, భారతదేశంకంటే భిన్నంగా విదేశీ, రక్షణ విధానాన్ని అనుసరించడం కష్టమైన పని అని కూడా వచ్చే సవాళ్ళను వివరించాడు. అయినప్పటికి నిజాం స్వతంత్రంగా ఉండాలని, హైద్రాబాద్ సంస్థానం స్వతంత్రదేశంగా ఉండాలని భావించాడు.

సర్ మీర్జా ఇస్మాయిల్ ప్రధానమంత్రిగా ఉన్నకాలంలో సంస్థానంలోని గ్రామీణ ప్రాంతాల్లో ముఖ్యంగా నల్లగొండ, వరంగల్, ఖమ్మం జిల్లాల్లో బలమైన ఫ్యూడల్

వ్యవస్థను సవాల్ చేస్తూ కమ్యూనిస్టులు బలపడుతూ వచ్చారు. తిండి గింజల రూపంలో పన్నులు వసూలు చేసే విధానం (లెవీ), తిండి గింజల సేకరణ విధానం, అది అమలు జరుగుతున్న పద్ధతి, గ్రామీణ ప్రాంతాల్లో రైతాంగాన్ని తీవ్రమైన అసంతృప్తికి గురిచేశాయి. పోలీసుల దౌర్జన్యాలు, తిండిగింజల బలవంతపు వసూళ్ళు, రెవిన్యూ అధికారుల దౌర్జన్యం నుండి తిరుగుబాటు తప్ప మరేదారి ప్రజలకు కనిపించక ప్రభుత్వ అధికారులపై తిరుగుబాటును ప్రకటించారు. వారికి ఆంధ్ర మహాసభ, కమ్యూనిస్టు పార్టీ అండగా నిలిచి ఉద్యమించాయి.

ఇత్తెహాద్ ముస్లిమీన్ వారు కూడా తమ బలాన్ని విస్తరించుకునే క్రమంలో రజాకార్ (స్వచ్ఛందసేవకులు) లను పెంచుతూ నిజాం రాజ్యాన్ని నిలపడానికి వీరు ఉద్యమించారు. ఈ రెండు ఉద్యమాలు నిజాంను, ఫ్యూడల్ వ్యవస్థను కూల్చడానికి ఒకటి, నిలపడానికి మరొకటి ఒకదానితో మరొకటి పోటీ పడి బలబడినాయి. ఈ రెండు ఉద్యమాల నాయకులు ప్రధాన మంత్రికి శత్రువులైనారు. ఇత్తెహాద్ ముస్లిమీన్‌వారు మీర్జా ఇస్మాయిల్‌ను శత్రువుగా భావించి ప్రతిచర్యనూ విమర్శిస్తూ వచ్చారు. ముఖ్యంగా ఇత్తెహాద్ ముస్లిమీన్ పార్టీ అధ్యక్షుడు సయ్యద్‌ఖాసిం రజ్వీ, పారిశ్రామికవేత్త – వాణిజ్యవేత్త, ఈ గ్రంథరచయిత మీర్ లాయక్‌అలీ, అతని బావమరిది మొయిన్ నవాజ్‌జంగ్, సయ్యద్ తకిద్దీన్‌లు మీర్జా ఇస్మాయిల్‌ను తీవ్రంగా వ్యతిరేకించి ప్రతిచర్యను విమర్శించి అతని వ్యతిరేక ప్రచారం చేశారు.

1947 మార్చిలో లార్డ్‌లూయిమౌంట్ బాటన్ భారతదేశపు ఆఖరి వైశ్రాయిగా వచ్చాడు. ఇతడు నిజాంకు రాజ్యాంగ సలహాదారుగా ఉన్న సర్‌వాల్టర్ మాంక్టన్‌కు మిత్రుడు, బంధువు. భారతదేశానికి రాజ్యాధికారం బదలాయించడమే తన ప్రధాన కర్తవ్యమని రాగానే ప్రకటించాడు.

భారత జాతీయ నాయకులకు, బ్రిటీష్ ప్రభుత్వానికి మధ్య సంప్రదింపులు జరిపి ఎట్టకేలకు 3 జూన్ 1947న మౌంట్‌బాటన్ ప్రకటన చేస్తూ భారతదేశం, భారత్ –పాక్‌లుగా విభజింపబడి అధికారం రెండు ప్రభుత్వ పాలకులకు అప్పగించ బడుతుందని ప్రకటించాడు. వెంటనే నిజాం 11 జూన్ 1947న ఫర్మానా విడుదల చేస్తూ హైద్రాబాద్ సంస్థానంలో హిందువులు – ముస్లిములు కలసి సహజీవనం చేస్తున్నారని బ్రిటీష్ ఇండియా మతతత్వ విధానం ఆధారంగా జేసుకొని విభజిస్తున్నదని పేర్కొంటూ నిజాం పూర్వీకులు, నిజాం హిందువులను, ముస్లింలను రాజ్యానికి రెండు కళ్ళుగా భావిస్తున్నారని ఇరువర్గాల వారు కలసి జీవిస్తున్నందువల్ల హైద్రాబాద్

అందరి ఉమ్మడి రాజ్యం అని పేర్కొన్నాడు. అందువల్ల నిజాం భారతదేశంలోకాని, పాకిస్తాన్‌లో కాని విలీనం కాకుండా స్వతంత్ర దేశంగా ఉంటానని ప్రకటించాడు. నిజాం భారత్, పాకిస్తాన్‌లతో స్నేహ సంబంధాలు కొనసాగించాలని అభిలషించాడు.

నిజాం మాంక్టన్‌కున్న సంబంధాలను, పరిచయాలను దృష్టిలో పెట్టుకుని అతనిచేత హైద్రాబాద్ సంస్థాన విషయమై మౌంట్ బాటన్‌తోను, వి.పి.మీనన్‌తోను సంప్రదింపులు ప్రారంభించాడు.

1947 ఆగస్టు 15న భారతదేశపు విభజన జరిగి స్వాతంత్ర్యం ప్రకటించబడింది. పాకిస్తాన్ ఏర్పడింది. భారతదేశంలో ఉన్న సంస్థానాలన్ని ఒకదానితర్వాత ఒకటిగా భారతదేశంలో విలీనం అవుతూ వచ్చాయి. నిజాం మాత్రం హైద్రాబాద్ ఒక ప్రత్యేక దేశంగానే మనుగడ సాగించగలదన్న వాదంపైన ఆధారపడి స్వాతంత్ర్య హక్కును ప్రకటించుకున్నాడు. భారత ప్రభుత్వ నిజాం వాదనను వ్యతిరేకించింది. బ్రిటీషు సార్వభౌమత్వానంతరం అధికారం భారత ప్రభుత్వానికే సంక్రమిస్తుందని, నిజాం స్వతంత్రుడుకాదని భావించింది. భౌగోళిక స్వరూపం మాత్రమే కాదు, ఆర్థిక, రాజకీయ అస్థిత్వం కూడా భారతదేశంలో అంతర్భాగంగా ఉండిందని భావించింది. సంస్థానాలన్ని కూడా భారతదేశంలో అంతర్భాగాలే అని ప్రకటించింది. భారత ప్రభుత్వం నిజాం వాదనను నిరాకరించింది. హైద్రాబాద్ ప్రధాన సమస్య భూస్వామ్య వ్యవస్థ కారణంగానే ఉత్పన్నమైనదని భారత ప్రభుత్వం భావించింది. భౌగోళికంగా, సాంస్కృతికంగా, ఆర్థికంగా, హైద్రాబాద్ సంస్థానం ఎప్పుడూ భారతదేశానికి వెలుపల లేదని, ఈ రెండు పరస్పరం ఆధారపడి ఉన్నాయని భారత ప్రభుత్వం భావించింది. 1947 నవంబర్ వరకు భారత ప్రభుత్వం నిజాంపై పెద్దగా వత్తిడి చేయలేదు. ఆ తర్వాత వత్తిడి ప్రారంభించింది. లార్డ్ మౌంట్ బాటన్ కూడా గవర్నర్ జనరల్‌గా తన ప్రయత్నం తాను చేస్తూ వచ్చాడు. భారత ప్రభుత్వంలో జరిగే సంప్రదింపులలో నిజాంకు సహకరించ డానికి, సర్ వాల్టర్ మాంక్టన్‌ను బ్రిటీష్ ప్రభుత్వం సహకరించి ప్రోత్సహించింది.

ఢిల్లీ హైద్రాబాద్‌ల మధ్య అనేక సంప్రదింపులు జరిగిన తర్వాత 29 నవంబర్ 1947న యధాతథ ఒడంబడిక (stand still agrement) ఇరు ప్రభుత్వాల మధ్య కుదిరింది. వాణిజ్య ఒప్పందం కూడా ఇరు ప్రభుత్వాల మధ్య కుదిరింది. హైదరాబాద్ సంస్థానానికి అధినివేశ రాజ్యాల సమాఖ్య అయిన బ్రిటీషు సామ్రాజ్యంలో అధినివేశ రాజ్యానికుండే ప్రతిపత్తి ఉందని అట్టి రాజ్యాలకున్న ప్రత్యేక హక్కులూ, సదుపాయాలు

ప్రాతిపదికలుగా హైద్రాబాద్ భారతదేశంతో తనకు ఉండే సంబంధాన్ని స్వతంత్రంగా నిర్ణయించుకునే అవకాశం మాత్రమే ఉందని భావించి ఈ ఒప్పందాన్ని భారత ప్రభుత్వంతో చేసుకుంది. భారత ప్రభుత్వం కూడా హైద్రాబాద్‌లో బలంగా ఉండి ఇత్తెహాదుల్ ముస్లిమీన్ నాయకులు చేస్తున్న ప్రకటనలు ముఖ్యంగా హైద్రాబాద్ సంస్థానం భారతదేశంలో కలిస్తే దక్షిణ హిందూదేశంలో నెత్తురు వరదలై పారుతుందని ఉద్రేక పూరిత ఉపన్యాసాల నేపథ్యంలో తీరికగా సమస్యను పరిష్కరించాలనుకుని భారతదేశం నిజాంతో యథాతథ ఒడంబడికను చేసుకున్నది. ఆ ఒడంబడిక ప్రకారం భారత ప్రభుత్వం హైద్రాబాద్‌లో ఉండేటందుకు తన ఏజెంట్ జనరల్ ఒకరిని నియమించవచ్చు. కె.ఎం.మున్షీని భారత్ ప్రభుత్వం ఏజెంట్ జనరల్‌గా నియమించింది.

యథాతథ ఒడంబడిక ఉల్లంఘనకు సంబంధించి భారతదేశం – హైద్రాబాద్‌లు ఒకరిపై మరొకరు నేరారోపణ చేసుకున్నారు. యథాతథ ఒడంబడిక ప్రకారం 1947 ఆగస్టు 15కు ముందు నిజాం, బ్రిటన్ ప్రభుత్వాల మధ్య ఉన్న అన్ని ఒప్పందాలను నిజాం భారత ప్రభుత్వాల మధ్య తాత్కాలికకంగా కొనసాగించడానికి వీలుపడింది.

1947 డిసెంబర్‌లో కొత్త ప్రధానిగా ఈ గ్రంథరచయిత మీర్ లాయిక్ అలీ హైద్రాబాద్ సంస్థానానికి వచ్చాడు. ఇతడు 1903లో జన్మించాడు. మాంచెస్టర్ యూనివర్సిటీ నుండి సివిల్ ఇంజనీరింగ్ పట్టభద్రుడైనాడు. నిజాం ప్రభుత్వంలో సహాయ ఇంజనీరుగా ఉద్యోగంలో ప్రవేశించి, సర్ అక్బర్ హైదరీకి అత్యంత ప్రీతిపాత్రుడై ప్రభుత్వ కాంట్రాక్టుల ద్వారా లక్షలు సంపాదించి, హైదరాబాద్ కన్‌స్ట్రక్షన్ కంపెనీ ప్రారంభించి, నిజాం రాజ్యంలో ప్రముఖ పారిశ్రామికవేత్తగా ఎదిగాడు. మహ్మదలీ జిన్నాకు అత్యంత సన్నిహితుడు. బ్రిటీష్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెకానికల్ ఇంజనీరింగ్ సంస్థలో సభ్యుడు కూడా. పాకిస్తాన్ తరుపున ఐక్య రాజ్య సమితికి మొదటి ప్రతినిధిగా కూడా పనిచేశాడు. 1947 వరకు ప్రత్యక్ష రాజకీయాల్లో కనపడకపోయినప్పటికి, అనేక సంఘటనల్లో వెనుకనుండి నడిపించాడు. ప్రధానమంత్రి అయిన తర్వాత అన్ని వ్యాపార లావాదేవీలనుండి దూరంగా ఉన్నాడు. హిందువులతో స్నేహసంబంధాలు కొనసాగించాడు.

ప్రధానమంత్రి కాగానే హైద్రాబాద్ సంస్థానంలోని కాంగ్రెస్ వాదులందరిని జైలునుండి విడుదల చేశాడు. దానితో కాంగ్రెస్ నాయకుల్లో ఇతనికి మంచి పలుకుబడి ఏర్పడింది. నిజాం సార్వభౌమత్వం కాపాడటానికి, హైద్రాబాద్ సంస్థానం స్వతంత్ర దేశంగా ఉండటానికి మీర్ లాయిక్ అలీ అన్ని సంప్రదింపుల్లో నిజాం తరుపున

సమర్థవంతంగా తన వాణిని వినిపించాడు. 25 మే, 1948న లార్డ్‌మౌంట్ బాటన్ భారతదేశం విడిచి వెళ్ళే ముందు హైద్రాబాద్ సంస్థాన విషయమై ఐదు గంటల సుదీర్ఘ కాలం చర్చించాడు. భారత ప్రభుత్వంతో మీర్ లాయిక్ అలీ జరిపిన సంప్రదింపులు, ఒప్పందాల వివరాలు, తదనంతరం పోలీసు యాక్షన్‌కు దారి తీసిన పరిస్థితులు చక్కగా ఈ గ్రంథంలో వివరించాడు.

ఏనుగు నరసింహారెడ్డి గారు ఆంగ్లంలో నుండి తెలుగులోకి సులభంగా, పాఠకులకు అర్థమయ్యే రీతిలో అనువదించి అందిస్తున్నందుకు వారికి మా 'డాక్రి' తరుపున ప్రత్యేక ధన్యవాదాలు. ఈ గ్రంథాన్ని గతంలో 'పాలపిట్ట' పత్రికలో సీరియల్‌గా వేయడమే కాకుండా ఈ గ్రంథాన్ని ముద్రిస్తున్న పాలపిట్ట సంపాదకులు 'గుడిపాటి' గారికి నా అభినందనలు.

ఈ గ్రంథం చరిత్ర విద్యార్థులకు హైద్రాబాద్ సంస్థానం భారతదేశంలో విలీనం జరగడానికి దోహద పడిన కారణాలను, జరిగిన సంఘటనలను, జరిపిన సంప్రదింపులను అర్థం చేసుకోవడానికి దోహదపడుతుందని భావిస్తున్నాను.

**– కె.జితేంద్రబాబు**

**5.12.2015**

**సాహితీసదన్**

**మునగాల**



హైద్రాబాద్ రాజ్య సంరక్షణ పోరాటంలో అసువులు బాసిన వేలాదిమందికి, మౌనంగా అప్పటి వేదనల్ని ఇంకా అనుభవిస్తున్న అసంఖ్యాకులకు ఈ గ్రంథం అంకితం.

**– మీర్ లాయక్ అలీ**

# ప్రథమ ముద్రణకు ముందుమాట

హైద్రాబాద్ రాజ్య పతనం తర్వాత కొద్ది సరుకులతో నేను తప్పించుకోవడానికి ముందు భారత సైన్యాలు విధించిన గృహనిర్బంధంలో ఉన్నప్పుడు ఈ పుస్తకంలోని చాలా భాగాలు రాసుకున్నాను. పాకిస్తాన్ చేరుకున్నాక వీటికి కొంత మెరుగులు దిద్దాను. కొన్ని అంశాలు చేర్చాను. అంతర్జాతీయ ప్రచురణకర్తల నుండి ఈ పుస్తకానికి చాలా డిమాండు వచ్చింది. నేను ఇక్కడ చెప్పలేని కొన్ని కారణాల వల్ల ఈ పుస్తక ప్రచురణ ఆలస్యం చేయమని చెప్పాను. ఓ మూడు సంవత్సరాలయ్యాక మొదట అమెరికా ప్రచురణకర్తలకు, ఆ తర్వాత ఇంగ్లాండు ప్రచురణకర్తలకు ఈ పుస్తకాన్నిచ్చాను. రెండు చోట్ల నుండి మార్పులను, కుదింపులను చేయాలని సూచనలు వచ్చాయి. ముఖ్యమైన సంఘటనల వివరాలు రాకుండా పోతాయని నేను అందుకు అంగీకరించలేదు. ముక్కలు చేసి ప్రచురించటం కన్నా అసలు ప్రచురించకపోవడమే మేలు అనుకున్నాను.

ఇన్ని ఆలస్యాలు, అవరోధాల మధ్య ఇలా ఈ పుస్తకం బయటికి రావడానికి ఎన్.ఎమ్.ఖాన్ గారి ప్రోత్సాహమూ, పట్టుదలా ఉన్నాయి. అందుకు నేను కృతజ్ఞుణ్ణి. నిశ్శబ్దంగా, శక్తివంతంగా ఆయన ఇచ్చే ప్రోత్సాహం పట్ల నాలాగే పాకిస్తాన్‌లో ఎందరో ఆయనకు రుణపడి ఉంటారు.

**– మీర్ లాయక్ అలీ**

43/5–సి,

పి.ఇ.సి.హెచ్.ఎస్– 6

కరాచి

# ఉపోద్ఘాతం

మొదటి ప్రపంచ యుద్ధానంతరం ప్రపంచాన్ని ఇంక ఎంతోకాలం పాలించలేమని బ్రిటీష్ వాళ్లు ఒప్పుకున్నారు. శతాబ్దానికి పైబడ్డ వాళ్ళ వలస సామ్రాజ్యాన్ని ఇంక నిలుపుకోలేమని వాళ్ళు భావించుకున్నారు. రాబోయే అగత్యం అందరికీ స్పష్టంగా తెలుస్తుంది. కేవలం విధివిధానాలు, పరిణామం రూపం దాల్చబోయే కాలం గురించి మాత్రమే భిన్నాభిప్రాయాలున్నాయి.

రెండవ ప్రపంచ యుద్ధంలో గెలుపొందాక అనూహ్యంగా కన్సర్వేటివ్‌లు ఓడిపోయి, లేబర్ పార్టీ బ్రిటన్ పార్లమెంటును కైవసం చేసుకుంది. విసిగిపోయి ఉన్న మాజీ సైనికుడు లార్డ్ వేవెల్ భారత వ్యవహారాలను లేబర్ పార్టీ పార్లమెంటుకు వివరించాడు. పౌర అధికారులకు భిన్నంగా తన ఆదేశాలను పాటించని ట్రూపుల మీద ఒక మిలటరీ అధికారి ఆవేశం చాలా ఎక్కువగా ఉంటుంది. భారతసైన్యంలోని చిన్న క్రమశిక్షణా రాహిత్యాన్ని కూడా వ్యవహారం తలకిందులైనట్లుగా ఆయన భావించసాగాడు. అందుకు తీవ్ర చర్యలు ప్రతిపాదించేవాడు. 1947 ఫిబ్రవరిలో బ్రిటీష్ ప్రధాని అట్లీ అందర్నీ ఆశ్చర్యంలో ముంచుతూ భారతదేశంపై బ్రిటిష్ పాలన 1948 జూన్‌కల్లా ముగిసిపోతుందని ప్రకటించాడు. బ్రిటీష్ ట్రూపులను, పరిపాలనా అధికారులను విడతల వారీగా తీరప్రాంతాలకు రప్పించి అక్కడి నుండి స్వదేశానికి పంపించే ప్రణాళికలు తయారు చేయబడ్డాయి. ఆఫ్రికా తదితర దేశాలలోని యుద్ధక్షేత్రపు అనుభవాల్ని చూశాక బ్రిటన్ అధికారుల ఆస్థిపాస్తులు, వారి వ్యక్తిగత రక్షణ, తరలింపుపై వేవెల్‌కు శ్రద్ధ పెరిగింది. భారతదేశపు సమస్యల గంభీరత ఆయనకు ద్వితీయశ్రేణి ప్రాధాన్యత గల అంశంగా తోచింది.

భారతీయులకు అధికారం బదలాయించే మార్గదర్శకాలు తయారు చేయడానికిగాను 1946 మార్చిలో బ్రిటీష్ క్యాబినెట్ మిషన్‌ను భారత్‌కు పంపించడం జరిగింది.

బ్రిటీష్ వారి నుండి అధికారం బదలయింప బడడానికి పూర్తి హక్కుదారు తామేనని హిందూ మెజారిటీలతో కూడుకున్న అఖిల భారత కాంగ్రెస్ భావించుకోవడమే ఇక్కడ సమస్య. వంద మిలియన్ల ముస్లింలు హిందూ జాతిలో కలిసిపోతారని మెజారిటీ హిందువుల భావన. ఇతర మైనారిటీలలో ప్రధానమైన సిక్కులు రాజకీయ అంధకారంలో, గందరగోళంలో ఉండిపోయారు. ఇక ఉపఖండంలో మూడవ వంతు స్వతంత్ర రాజ్యాలు. అవి కొన్ని ఫ్రాన్స్ అంత పెద్దవి. కొన్ని మోనాకో అంత చిన్నవి. కొన్ని భారతదేశంలోని చాలా ప్రాంతాల కంటే పురోగామి దృక్పథం గలవి. అవి ఏ నిర్వచనానికీ అందని అస్పష్ట, ద్రవస్థితిలో మిగిలిపోయాయి.

దాదాపు వంద మిలియన్ల సంఖ్యలో ఉండికూడా భారతదేశంలోని ముస్లిం మైనారిటీలు కాంగ్రెస్‌లాంటి హిందూ సంస్థల భావజాలంలో, దయలేని బ్రిటీష్ పాలనలో మగ్గి ఒకే ఒక్క జాగరూక మేధావి మహ్మద్అలీ జిన్నా చేత పూర్తిగా ప్రభావితం కాలేకపోయారు. ప్రతి సందర్భానికి జిన్నా స్పందించేవాడు. ఆయన వంద మిలియన్ల ముస్లింల కోసం స్వతంత్ర దేశం పాకిస్తాన్ ఏర్పాటుకు డిమాండు చేశాడు. మొదట ఆ డిమాండును పరిహాసం చేశారు. తర్వాత రాజకీయ ఎత్తుగడగా అభివర్ణించారు, చివరకు అదొక న్యాయమైన కోరికగా అంగీకరించి ఏదో ఒక రూపంలో దాన్ని ఇవ్వడానికి ప్రతిపాదించారు. భారత్‌ను మొత్తం ఒక్క దేశంగా భావించి వదిలి పోవడం బ్రిటన్ ఉద్దేశం. అందుకే కేంద్రంలో సరళమైన సమాఖ్య ఏర్పడి రక్షణ, సమాచార, విదేశీ వ్యవహారాలు చూసేందుకు అనుగుణమైన వ్యవస్థను క్యాబినెట్ మిషన్ ప్రతిపాదించింది. నిజానికి ఉపఖండంలో మూడు ప్రధాన విభాగాలు గుర్తించబడ్డట్లే ఉన్నాయి. అవి ఎ) హిందూసాంద్ర ప్రాంతాలు, బి) ముస్లిం సాంద్రప్రాంతాలు, సి) ముస్లింలు కొద్దిగా అధికంగా ఉన్న ప్రాంతాలు.

ఈ ప్రతిపాదనను వ్యతిరేకిస్తే బ్రిటీష్ పాలన ఇంకా కొనసాగుతుందనే ఉద్దేశంలో కాంగ్రెస్ ఆ ప్రతిపాదనను స్వాగతించింది. అధికారాన్ని బదలాయించుకోవాలన్న తొందరలో ఉంది కాంగ్రెస్. పాకిస్తాన్ డిమాండుకు ఇది దగ్గరి దారి అవుతుందని ముస్లిములు కూడా దీన్ని అంగీకరించారు. ఇతర మైనారిటీలు గందరగోళంలో ఉండి పోగా స్వతంత్ర రాజ్యాలు బేఖాతరు చేయబడ్డవి. కాంగ్రెస్ నాయకుల వ్యక్తిగత లక్ష్యాలు తీరేటట్లయితే ఈ ప్రతిపాదన అమలులోకి వచ్చేది. తమ అధికారానికి మార్గం సుగమమయ్యే అవకాశం లేనందున క్యాబినెట్ మిషన్ ప్లాన్‌కు వాళ్ళు గండి కొట్టారు. జిన్నా క్యాబినెట్ మిషన్ ప్లాన్‌ను వ్యతిరేకించి దేశాన్ని విభజించి పాకిస్తాన్ ఏర్పాటుకు పట్టుబట్టాడు.

నిజాయితీ, చిత్తశుద్ధి ఉన్న వేవెల్ బ్రిటీష్ పౌరులను స్వదేశానికి, తరలించే విషయం లో శ్రద్ధ కనబరచాడు కానీ ఇటు ముస్లిం నాయకులతో సరిగ్గా వ్యవహారం నడిపించలేదు. ఉపఖండంలో దావానలంలా వ్యాపిస్తున్న మతఘర్షణలు ఆయనను కలచివేశాయి. వాటిని అదుపులో పెట్టడానికి ఆయన సైనిక, వ్యూహాత్మక చర్యలు చేపట్టాడు. ఈ ఆందోళన మధ్యనే ఆయన బదిలీ అయ్యాడు. అధికార బదిలీ అనే స్పష్టమైన లక్ష్యంతో 1947 ఆరంభంలో లార్డ్ మౌంట్‌బాటెన్ నియమించబడ్డారు. 1948 మధ్యలోగా అధికార బదిలీ పూర్తి చేయడం ఆయన లక్ష్యం. తన అమ్ముల పొదినిండా ఆయుధాలతో వచ్చాడు బాటెన్. ప్రభుత్వం నుండి స్పష్టమైన ఆదేశముంది, ప్రతిపక్షపు ఆశీస్సులున్నాయి. రాచకుటుంబంతో మంచి సంబంధాలు (దేశీయ రాజులను ప్రభావితం చేయడానికి ఇదే ముఖ్యం), సమర్థులైన సిబ్బంది, చురుకుదనం, శక్తియుక్తులు, భయపెట్టగల, బుజ్జగించగల సామర్థ్యం, పచ్చి అబద్ధాలు – అర్ధ సత్యాలు ఆయనకున్న ఆయుధాలు. గౌరవం ఇచ్చీ, గౌరవం తగ్గించీ పనులు సాధించగల సామర్థ్యం మొదలైనవన్నీ ఆయన ఆయుధాలే.

గాంధీజీ ఆలోచన దేశ విభజనకు వ్యతిరేకమే. కానీ కనుచూపు మేరలో అధికారం ఆయన శిష్యులను నిరాహార పద్ధతులకు కానీ ఆయన బోధనలకు కానీ కట్టుబడి ఉంచలేకపోయింది. మళ్ళీ జైలు ఊచలు లెక్కించాలని ఎవరికీ లేదు. తాత్కాలిక ప్రభుత్వాధి నేతగా అధికారం రుచి చూసిన నెహ్రూ దాన్ని వదులుకోవడానికి సిద్ధంగా లేడు. తన రాజ్యం ఉపఖండం అంతా విస్తరించాలని ఆయన కోరుకున్నాడు. దేశ విభజన జరిగినా సరే కానీ అధికారాన్ని కోల్పోవడానికి, మౌంట్ బాటెన్‌కు ఇబ్బంది కలిగించడానికి ఆయన ఇష్టపడలేదు. జిన్నా, ఇతర ముస్లిం నాయకులతో ఒక అవగాహనకు రాలేకపోతే బ్రిటన్ అధికారం మరింత కాలం కొనసాగే అవకాశం ఉందని పటేల్ నమ్మాడు. జిన్నాను సంతృప్తి పరచడమో, తొక్కివేయడమో జరగాలి. విభజన జరిగినట్లైతే మెజారిటీ హిందువులు లేదా మెజారిటీ ముస్లింలు ప్రాతిపదికన పంజాబ్, బెంగాల్‌లు విభజించబడాలని ఆయన ప్రతిపాదించాడు.

ఇది పాకిస్తాన్‌కు రెండు చేతులు నరికినట్లు ఉంటుందనిపించింది. కాని కొంత వరకు జిన్నా సమ్మతించవచ్చు. ఈ రెండు ప్రాంతాలు విభజించబడగూడదంటే జిన్నా ద్విజాతి సిద్ధాంతానికి ప్రాతిపదిక దెబ్బతింటుంది. ఇలా జరిగినట్లయితే ఆర్థికగా, రాజకీయంగా, వ్యూహాత్మకంగా ఎంతోకాలం మనజాలక మళ్ళీ పాకిస్థాన్ హిందూ భారత దేశంలో కలవవలసిందేనని కొంత మంది హిందూనాయకుల నమ్మకం.

1947 జూన్ తొలి రోజుల్లో హిందూ, ముస్లిం, సిక్కు నాయకులకు వైస్రాయ్

కొత్త ప్రతిపాదనలు చేసినప్పటికీ బ్రిటీష్ ప్రభుత్వం పంజాబ్ బెంగాల్‌లను విభజిస్తూ దేశ విభజనకు అంగీకరించింది. బ్రిటీష్ పాలన కింద ప్రతీ విభజించిన ప్రాంతం ఉంటుంది. విభజనకు అన్ని వర్గాలు అంగీకరించినట్లయితే ఒకే రోజు అంటే 15వ ఆగస్టు నాడు అధికారం బదలాయించబడుతుంది. నెహ్రూ, పటేల్, ఇతర కాంగ్రెస్ నాయకులకు స్వాతంత్ర్య ఫలం మీద చాలా ఆశలున్నాయి. ఎలాంటి అవరోధాలు లేని పాకిస్తాన్ కోసం జిన్నా, ముస్లింలీగ్ ఎదురు చూస్తున్నాయి. సిక్కుల మనసులో ఏముందో ఎవరికీ తెలియదు. విభజన ప్రణాళికను జూన్ 3, 1947న ఆల్ ఇండియా రేడియోలో మౌంట్ బాటెన్, నెహ్రూ, జిన్నా, బల్దియోసింగ్ ప్రకటించారు. స్వతంత్ర రాజ్యాల ప్రస్తావనే లేదు. అయితే గతంలో ప్రతిపాదించిన విధంగా అవి రెండు దేశాలలో ఏదో ఒకదానిలో కలవవచ్చని లేదా స్వతంత్రంగానైనా ఉండవచ్చని భావించబడ్డది. బ్రిటీష్ పాలన మాత్రం 15 ఆగస్టు, 1947న పరిసమాప్తమవుతుంది.

ఎప్పుడు, ఏ విధంగా విభజన రేఖ గీయబోతున్నారన్నది తర్వాత తలెత్తిన ప్రశ్న. ఆస్తుల విభజన, సైన్య విభజన రెండవ ప్రశ్న. రెండు దేశాలకు ఎవరు గవర్నరు జనరల్స్ అవుతారని, లేదా రెండు దేశాలకు లార్డ్ మౌంట్ బాటెన్ ఒక్కరే గవర్నర్ జనరల్‌గా ఉంటారా అన్న ప్రశ్న తలెత్తింది.

జులై 9న నిజాం మౌంట్ బాటెన్‌కు ఒక లేఖ రాశారు. దేశ విభజన జరుగుతున్నందున హైద్రాబాద్ స్థాయిని స్పష్టం చేయడమే ఆ లేఖ ఉద్దేశం. ఇటు భారత్‌లో కానీ అటు పాకిస్తాన్‌లో కాని కలవకుండా హైద్రాబాద్ స్వతంత్రదేశంగా ఉంటుంది అన్నాడు నిజాం. గతంలో ఉన్న ఒప్పందాల వల్ల ఉపఖండంతో వ్యవహరించినప్పుడు హైద్రాబాద్ విషయంలో సరియైన మర్యాదలను పాటించేలా చూడవలసిందిగా రాజప్రతినిధి ద్వారా బ్రిటన్ ప్రభుత్వానికి నిజాం విజ్ఞప్తి చేశాడు. ఈ లేఖకు జవాబుగా నిజాం లేఖ బ్రిటన్‌కు పంపబడిందని తగిన ప్రతిస్పందన వస్తుందని ఆశిస్తున్నట్లు మౌంట్‌బాటెన్ రాశాడు. అయితే నిజాం లేఖకు ఎలాంటి జవాబు రాలేదు. కారణమేమిటంటే తర్వాత కాలంలో మౌంట్‌బాటెన్ చెప్పినట్లు ఆ లేఖ బ్రిటన్ ప్రభుత్వానికి చేరనే లేదు.

ఇది చాలా కీలకమైన సమయం. దొమ్మీలు సామూహిక హత్యాకాండలు ఉపఖండమంతా వ్యాపిస్తున్నాయి. దేశంలోని చాలా ప్రాంతాల నుండి సురక్షిత ప్రాంతమైన హైద్రాబాద్‌కు కాందిశీకుల వలస ప్రారంభమయింది. మిలటరీ ద్వారా అలజడులన్నింటినీ అణచివేస్తామన్న మౌంట్‌బాటెన్ హామీలు నీటి మూటలుగా మిగిలిపోయాయి. అమాయకులైన ముస్లిం స్త్రీ, పురుషులు, పిల్లలను చంపడమే అప్పటి సిక్కుల లక్ష్యంగా

కనిపించింది. నెహ్రూ తను జన్మించిన ముస్లిం ప్రాంతమైన కాశ్మీర్ ఆక్రమణలో మునిగిపోయాడు. తన ప్రణాళికను అమలు చేస్తున్నందుకు మౌంట్‌బాటెన్ ఆశీస్సులు పొందాడు. మౌంట్‌బాటెన్‌కు రాజకుటుంబంలో ఉన్న సాన్నిహిత్యాన్ని ఉపయోగించుకుని నయానా, భయానా స్వదేశీ రాజులను లొంగదీసుకోవడంలో పటేల్ తలమునకలై ఉన్నాడు. నమ్మదగిన స్వభావం లేని మౌంట్‌బాటెన్‌ను భారత్ లాగా గవర్నర్ జనరల్‌గా నియమించుకుని నూతనంగా ఏర్పడ్డ పాకిస్తాన్ మనుగడకు ముప్పు తీసుకురావడానికి జిన్నా ఇష్టపడలేదు. మౌంట్ బాటెన్ అందుకు నొచ్చుకున్నాడు. నెహ్రూతో చేతులు కలిపి పాకిస్తాన్‌కు చేయదగ్గ నష్టాలన్నీ చేశాడు. ముస్లిం సాంద్ర ప్రాంతాలైన గురుదాస్‌పూర్ మొదలైన పాక్ ప్రాంతాలు భారత్‌కు చేరేదాకా, కాశ్మీర్‌తో భారత్‌కు నేరుగా సంబంధాలు ఏర్పడేదాకా, బహిరంగంగా ప్రకటించవలసిన రాడ్‌క్లిఫ్ అవార్డును విభజన తర్వాత చాలా రోజులు తొక్కిపెట్టి పాక్‌కు కావలసినంత నష్టం చేశాడు. హైద్రాబాద్ కూడా అదేరోజు స్వాతంత్ర్యం ప్రకటించుకుంది. భవిష్యత్తు ఒప్పందాలకు భూమికగా ఉండేందుకు హైద్రాబాద్ భారత్‌తో యధాతథ ఒప్పందానికి ప్రయత్నించింది. అనేక ప్రయత్నాల తర్వాత 1947 నవంబర్ మాసాంతంలో యధాతథ ఒప్పందం కుదిరింది. కుతంత్రాలకు వ్యతిరేకంగా హైద్రాబాద్ చేసిన పోరాటం స్వతంత్ర దేశంగా నిలబడేందుకు పడిన వేదన, ప్రపంచ అభిప్రాయానికి వ్యతిరేకంగా కుటిల పన్నాగాలతో హైద్రాబాద్‌ను ఆక్రమించడానికి భారత్ 1948 సెప్టెంబర్ 17న జరిపిన క్రూర మిలటరీ చర్య ఈ గ్రంథంలోని ప్రధాన వస్తువు. హైద్రాబాద్‌ను స్వతంత్ర దేశంగా మనుగడ సాగనీయగూడదని భారత్ వేసిన ఎత్తుగడను అమలు చేసుకున్న వివరాలు ఇవి.

**– మీర్ లాయక్ అలీ**

# విషయ సూచిక


1. దేశ విభజన తర్వాత . . . . . . . . . . . . . . . . . . . . . .29
2. పాకిస్తాన్ జాతిపితతో నా సమావేశం . . . . . . . . . . . . . .38
3. హైద్రాబాద్ సంస్థానం - నిజాం నవాబులు . . . . . . . . . . . . .43
4. స్టేట్ కాంగ్రెస్, హిందూ మహాసభ ఇతర సంస్థలు . . . . . . . . . .58
5. బహద్దూర్ యార్‌జంగ్, ఇత్తెహాదుల్ ముస్లిమీన్ . . . . . . . . . . .69
6. సర్ అక్బర్ హైదరీ అలీ, నిష్క్రమణ . . . . . . . . . . . . . . . .78
7. సంక్షోభంలోకి సర్ మీర్జా ఇస్మాయిల్ . . . . . . . . . . . . . .84
8. మీర్జా నిష్క్రమణ, ఛత్తారి పునరాగమనం . . . . . . . . . . . . .96
9. రజాకార్లు. . . . . . . . . . . . . . . . . . . . . . . . . .103
10. ప్రధాని పదవి . . . . . . . . . . . . . . . . . . . . . . . .114
11. మధ్యంతర ప్రభుత్వ ఏర్పాటు . . . . . . . . . . . . . . . . . .121
12. ఏజంట్ జనరల్ ఆగమనం . . . . . . . . . . . . . . . . . . .126
13. ఏజంట్ జనరల్ మున్షీ . . . . . . . . . . . . . . . . . . . .132
14. గాంధీజీ హత్య . . . . . . . . . . . . . . . . . . . . . . .138
15. భారతదేశం–హైద్రాబాద్ సమస్యలు . . . . . . . . . . . . . . .144
16. ఢిల్లీ పెద్దలు . . . . . . . . . . . . . . . . . . . . . . . .152
17. అంతర్గత పర్యవసానాలు . . . . . . . . . . . . . . . . . . .161
18. ఢిల్లీ కరాచీల మధ్య . . . . . . . . . . . . . . . . . . . . .167
19. హైద్రాబాద్ ప్రతినిధి బృందం చాతుర్యం . . . . . . . . . . . .176
20. సరిహద్దుల్లో చేజారిన పరిస్థితులు . . . . . . . . . . . . . . .182
21. భారత్ నుండి కొత్తగా బెదిరింపులు . . . . . . . . . . . . . .188
22. ఢిల్లీలో కొత్త ఎత్తులు . . . . . . . . . . . . . . . . . . .196
23. నిజాం పరీక్ష . . . . . . . . . . . . . . . . . . . . . . . .205
24. ఒత్తిడిలో ప్రజాభిప్రాయం . . . . . . . . . . . . . . . . . . .215
25. చర్చల ముగింపు . . . . . . . . . . . . . . . . . . . . . . .226
26. ఐకమత్యానికి ఢిల్లీ ప్రమాద ఘంటికలు . . . . . . . . . . . .236

27. ఏడుగురు నానజ్ అమరవీరులు . . . . . . . . . . . . . . . . . . . . 244
28. కొన్ని అంతర్గత ఒత్తిడులు . . . . . . . . . . . . . . . . . . . . . . . 254
29. మరణశయ్య మీద జిన్నా . . . . . . . . . . . . . . . . . . . . . . . . . . 262
30. మహానేత అస్తమయం . . . . . . . . . . . . . . . . . . . . . . . . . . 268
31. దండయాత్ర ప్రారంభం . . . . . . . . . . . . . . . . . . . . . . . . . . 277
32. కొనసాగిన దండయాత్ర . . . . . . . . . . . . . . . . . . . . . . . . . . 286
33. దిగజారిన అంతర్గత పరిస్థితి . . . . . . . . . . . . . . . . . . . . . 295
34. క్షీణించిన సామర్థ్యం, లొంగుబాటు . . . . . . . . . . . . . . . . . . 302

**అనుబంధం**

1. లాయక్ అలీ ఎలా తప్పించుకున్నాడు? . . . . . . . . . . . . . . . . . . . . 316

# 1. దేశ విభజన తర్వాత

అది బొంబాయి శాంతాక్రజ్ విమానాశ్రయం. 1947 నవంబర్ మాసపు తొలివారంలో ఓ రోజు. హైద్రాబాద్ వెళ్ళే దక్కన్ ఎయిర్‌వేస్ విమానం కోసం ఆహ్లాదకరంగా ఉన్న లాంజ్‌లోకి నింపాదిగా నడుస్తూ ఉండగా నా పేరు మైక్‌లో అనౌన్స్ అవుతున్నట్లనిపించింది. "... అలీగారూ, దయచేసి పోలీస్ ఆఫీస్ డెస్కును ఒక్కసారి సంప్రదించండి" అనౌన్స్ రిపీట్ అయింది. నేను పోలీసు డెస్క్ దగ్గరికి వెళ్ళి 'పిలుస్తుంది నన్నేనా?' అడిగాను. పోలీస్ అధికారి తన దగ్గరున్న లిస్టును జాగ్రత్తగా పరిశీలించి 'అవును' అన్నాడు.

'ఏమిటి విషయం?' అని అడిగాన్నేను.

'మీరు హైద్రాబాద్ వెళ్తున్నారా?'

'అవును'

'పాస్‌పోర్ట్ ఉందా?'

అమెరికాకు వెళ్ళి వస్తుండడం వల్ల నా దగ్గర పాస్ పోర్ట్ ఉంది. కొంచెం ఆలోచించి ఆ విషయమే పోలీస్ అధికారికి చెప్పాను. పాస్‌పోర్ట్ చూపించే క్రమంలో అనేక దేశాల వీసాలు, రాయబారుల మర్యాదలకు సంబంధించిన ఎన్నో పత్రాలు నా దగ్గర కనిపించినా ఆ అధికారి కనీస ఆసక్తికానీ, గౌరవం కానీ చూపించలేదు. పాస్‌పోర్ట్ నెంబరు, తేదీ ఓ కాగితం మీద రాసుకొని నేను వెనక్కైనా తిరగకముందే దాన్ని ముద్దచేసి ఓ డస్ట్‌బిన్‌లో వేసాడు.


'హైద్రాబాద్ వెళ్ళడానికి పాస్‌పోర్ట్ అవసరమవుతుందని అనుకోలేదు' అన్నాను పోలీసు అధికారితో.

‘ఆ! అవును. హైద్రాబాద్ వేరే దేశం కదా?” అన్నాడా అధికారి.

విమానం ఎక్కడానికి ముందు ఎన్నడూ లేనివిధంగా నా లగేజీని శల్యపరీక్షకు పంపాల్సి వచ్చింది. కొంతసేపయ్యాక లాంజ్‌లో హైద్రాబాద్ వెళ్తోన్న ఓ పరిచయస్తున్ని కలిసాను. ఆయన ఆందోళనకరంగా కనిపించాడు. విషయం ఏమిటని ప్రశ్నించాను. పాస్‌పోర్ట్‌కానీ, ప్రత్యేక అనుమతి పత్రం కానీ కావాలని పోలీసులు సతాయిస్తున్నారని, అవేవీ తన దగ్గర లేకపోవడం వల్ల చాలా కష్టమవుతుందని చెప్పాడు. పోలీసు అధికారితో అతను ఆవేశంగా వాదించాడు. చివరికి పోలీసు అధికారి అతని ప్రయాణానికి అనుమతించాడు. అక్కడే హైద్రాబాద్ వెళ్తున్న కొంతమంది హిందూ మిత్రులను కూడా కలిసాను. మాటల్లో భాగంగా కొంతసేపయ్యాక వాళ్ళను పాస్‌పోర్ట్ కోసం పోలీసులు వేధించారా? లగేజీని చెక్ చేసారా? అని అడిగాను. వాళ్ళు అదేం లేదని చెప్పారు. ఈ నిబంధనలన్నీ హైద్రాబాద్ వెళ్తున్న ముస్లింలకేనని వాళ్ళలో ఒకాయన చెప్పాడు. అంటే విదేశీయులుగా చూస్తున్నది హైద్రాబాద్ వాసులను కాదు, హైద్రాబాద్ ముస్లింలను మాత్రమే.

అందరం విమానం ఎక్కాం. పవిత్ర ఖురాన్లోని వాక్యాలని లోగొంతుకతో స్మరించుకున్నాను. (ప్రతీ ప్రయాణంలో నేను ఇలా ప్రార్థన చేస్తుంటాను.) విమానం గాల్లో ఎగిరాక ‘హమ్మయ్య’ అని ఊపిరి పీల్చుకున్నాను. ప్రయాణంలో కొంతమంది హిందూమిత్రులతో సంభాషణ ప్రారంభించాను. హైద్రాబాద్‌కు చెందిన ఎగుమతులు దిగుమతుల మీద భారత ప్రభుత్వం విధించిన ఆంక్షల వల్ల వ్యాపారం పడిపోయిందని వాళ్ళు చెప్పారు. చాలా నష్టాలొచ్చాయని బాధ వ్యక్తంచేసారు. నేను న్యూయార్క్‌లో ఉన్నప్పుడే ఈ ఆంక్షల గురించి విన్నాను. కాని వాటి తీవ్రత వీళ్ళ మాటలు విన్నాక తెలిసింది. నేను తిరిగి హైద్రాబాద్ వస్తున్నందుకు వాళ్ళు సంతోషపడుతున్నట్లు అనిపించింది. వ్యాపార వర్గాలకు ఏదైనా మేలు చేకూర్చే పనిని నేను చేస్తానని భావిస్తున్నట్లు వాళ్ళ మాటల ద్వారా తెలిసింది.

అంతలోనే నాకు కునుకు పట్టింది. రైలు, విమాన ప్రయాణాల్లో కునుకు తీయడం నాకొక అలవాటుగా మారిపోయింది. విమానం హైద్రాబాద్ భూభాగంలోకి ప్రవేశించేటప్పటికి నాకు మెలకువ వచ్చింది. విమానం నుండి చూస్తే బీదర్ పీఠభూమిని తన శీతల పవనాలతో సేదదీరుస్తున్న మంజీరానది కనిపించింది. మంజీర ఒకచోట ‘యూ’టర్న్ తీసుకున్న దృశ్యం కన్నుల పండుగ చేస్తుంది. తిరిగి మాతృభూమికి చేరిన ఆనందం నాలో.




ఆర్థిక, సాంకేతికపరమైన సమస్యల పరిష్కారానికి ఏర్పాటయ్యే ప్రభుత్వ ప్రతినిధి బృందాల సభ్యుడిగా 1945 తొలినాళ్ళ నుండి నేను అమెరికా, ఐరోపా దేశాలకు ప్రయాణం చేస్తూనే ఉన్నాను. ఆ రకంగా విదేశాల్లోనే ఎక్కువ కాలం గడుపుతున్నాను. లేక్ సక్సెస్‌లో జరిగిన ఐక్యరాజ్య సమితి సమావేశానికి పాకిస్తాన్ ప్రతినిధిగా హాజరై తిరుగు ప్రయాణంలో ఉన్నానిప్పుడు. ఇదంతా ఎలా జరిగిందనే విషయాన్ని ఇంకో అధ్యాయంలో వివరిస్తాను.

విమానం హకీంపేట్ ఏర్‌పోర్ట్‌లో లాండ్ అయింది. అళందులిల్లహ్ (అల్లాకు ధన్యవాదాలు) అనుకున్నాను నాలో నేను. విమానం దిగుతుండగా నా భార్యాపిల్లలు, కొందరు మిత్రులు రన్‌వే దగ్గర కనిపించారు. విమానం దిగి నడుస్తుండగా ప్రాచ్య దేశాలకే పరిమితమైన ప్రత్యేకమైన అభిమానంతో కూడిన వందనం చేస్తూ స్వాగతం పలికారు నా మిత్రులు. సంఖ్యలో కొద్దిమందే కాని నన్ను ఉత్సాహపరిచేవాళ్ళు. ముందుగా కొంచెం దూరంలో నిలుచున్న నా భార్యను, నా సోదరీమణులను కలిసాను. ఇంకా వారితో ఏమీ మాట్లాడే అవకాశం లేకుండానే నా మిత్రుడొకరు నన్ను కొంచెం పక్కకి లాగి 'నువ్వు తిరిగొచ్చి మంచి పని చేసావు' అన్నాడు గుసగుసగా.

'ఎందుకు? నేను రాననుకున్నారా ఏం?' అన్నాను.

'అవును'

కొంచెంసేపాగి 'కొన్ని క్లిష్టమైన పరిస్థితుల్లో నువ్వు లేకపోవడం బాధ కలిగించింది' అన్నాడు. ఇటీవల ఒకటి రెండు సందర్భాలలో నేనుంటే పరిస్థితి కొంత వేరుగా ఉండి ఉండేదని కూడా చెప్పాడు. అతను మొత్తంగా ఏం చెప్పదలుచు కున్నాడో నాకు అర్థం కాలేదు. ఐనా అంతమంది ముందు అంతకంటే ఎక్కువ అడగలేకపోయాను.

ఏర్పోర్ట్ నుండి మా ఇంటికి అర్ధగంట ప్రయాణం. నా విదేశీ ప్రయాణ కాలంలో ప్రధానిగా పనిచేసిన చత్తారి అసహాయ స్థితిని గురించి నా భార్య చెప్పింది. పదవికి రాజీనామా చేసి హైద్రాబాద్ నుండి వెళ్ళిపోయినాడని చెప్పింది. నిజానికి అతడు హైద్రాబాదును వదిలి వెళ్ళాడని నాకు ముందే తెలుసు. కాని అందుకు దారితీసిన పరిస్థితుల గురించిన వివరాలు పూర్తిగా తెలియవు. ఇత్తహాదుల్– ముస్లిమీన్ సమూహాలు పెద్ద ఎత్తున వచ్చి చత్తారి, అలీ నవాజ్‌జంగ్, మాంక్టన్‌ల గృహాలను ముట్టడించాయని వివరించింది. ఆ గృహ నిర్బంధాల కారణంగానే వారు ఢిల్లీ వెళ్ళలేకపోయారని, భారత దేశంతో యథాతథ ఒప్పందానికి తుదిరూపు ఇవ్వలేక పోయారని చెప్పింది. చత్తారి తరచూ నా గురించి అడుగుతుండేవాడని, నేనెంత తొందరగా తిరిగి రాగలుగుతానా అని ఎదురుచూస్తూ ఉండేవాడని చెప్పింది. హైద్రాబాదును వదిలి వెళ్ళేముందు చత్తారి నాకొక సందేశం పెట్టి వెళ్ళాడు. తాను హైద్రాబాద్ వదిలి వెళ్ళేలోపు నన్ను చూడలేకపోతున్నందుకు ఆవేదన చెందాడు. మేం కలుసుకునే ఒక సందర్భం తొందరలో రావాలని కోరుకున్నాడు.

అత్యంత గంభీరమైన పరిస్థితుల్లో నేను హైద్రాబాద్‌కు తిరిగివచ్చానని నాకు అర్థం కాసాగింది. ఐనప్పటికీ, పరాజయం చేరువలో ఉన్న ఆందోళనకరమైన, బలహీనమైన సంస్థానపు పరిస్థితులను అప్పటికి నేను సరిగ్గా అంచనా వేయలేక పోయాను. చత్తారి ప్రభుత్వంలో శాంతిభద్రతలను చూస్తున్న మొయిన్ నవాజ్‌జంగ్‌తో మాట్లాడాను. సంస్థానపు సంఘటనల పూర్తి వివరాలను అతను తెలియజేశాడు. దిగజారిన ఇండో– హైద్రాబాద్ సంబంధాలను కూడా వివరించాడు. భారత ప్రభుత్వంతో 'యథాతథ ఒప్పందం ముసాయిదా'లో ఏర్పడ్డ ప్రతిష్టంభనను తొలగించ డానికి ఆ తర్వాత మొయిన్ నవాజ్‌జంగ్ ఆధ్వర్యంలో ఒక ప్రతినిధి బృందం ఏర్పడ్డది. రెండు ప్రభుత్వాల మధ్య సానుకూలత కోసం 'ముసాయిదా యథాతథ ఒప్పందం' అనధికారికంగా చత్తారి పాలనాకాలంలోనే ప్రారంభమయింది. ఐతే భారత ప్రభుత్వం

ఇందులో ఎలాంటి ఆసక్తి కనబరచలేదని అర్థమయింది. ఒకవంక ముసాయిదా ఒప్పందంలో పురోగతి కోసం మొయిన్ నవాజ్‌జంగ్ ఆధ్వర్యంలో ప్రతినిధి బృందాన్ని ఏర్పాటుచేసిన నిజాం నవాబు సుల్తాన్ అహ్మద్ ద్వారా మౌంట్ బాటన్‌కు ఒక వర్తమానం పంపించాడు. చత్తారి ప్రతిపాదించిన యథాతథ ఒప్పందం ముసాయిదా లో పురోగతి కోసం నియమించబడిన ప్రతినిధి బృందాన్ని ఉపసంహరించుకుంటు న్నట్లు, విస్తృతమైన ప్రజాభిప్రాయం మేరకు మరొక ప్రతినిధి బృందాన్ని ఏర్పరచనున్నట్లు దాని సారాంశం. ఈ వర్తమాన ప్రభావంతో ముసాయిదా ఒప్పందంలో పురోగతిలోని సమస్యలు ద్విగుణీకృతమైనాయని నవాజ్ జంగ్ చెప్పాడు. పాపం జంగ్! ఇంత కృతజ్ఞతలేని బాధ్యతను ఇలాంటి పరిస్థితులలో ఎలా తీసుకున్నావంటే 'నిజాం చెప్పినప్పుడు ఇంక చేయగలిగిందేముంది? నాకు మరో మార్గం లేదు' అన్నాడు. వీలైనంత ప్రయోజనాత్మకంగా ఆ పనిని కొనసాగించడమే అప్పటికి ఆయన ధర్మం.

కొన్నిరోజుల తర్వాత ఆయన తన ప్రతినిధి బృందంతో చర్చల కోసం ఢిల్లీకి వెళ్ళారు. అదే సమయంలో స్వంత పనుల మీద నేనూ ఢిల్లీ వెళ్ళాను. మొయిన్ జంగ్ ప్రతినిధి బృందం ప్రతిరోజూ ఉదయాన రాష్ట్రాల వ్యవహారశాఖకు వెళ్తుండడమూ, సాయంకాలానికి నిరాశాపూరితమైన నిరుత్సాహభరితమైన ముఖాలతో వస్తుండడమూ గమనించాను. ఈ ప్రతినిధి బృందంతో వ్యవహరించడం అప్పటి రాష్ట్రాల వ్యవహారాల కార్యదర్శి వి.పి.మీనన్‌కు కూడా కష్టంగానే ఉండేది. భారతప్రభుత్వ పెద్దలు చెప్పిన అన్యాయమైన, సహేతుకంకాని విషయాలను ఆయన ఈ ప్రతినిధి బృందానికి ఓర్పుగా నేర్పుగా వ్యక్తీకరిస్తూ సహేతుకమైనవిగా ఒప్పించాలి మరి! భారత ప్రభుత్వ పెద్దలతో మాట్లాడే మాటలకు హైద్రాబాద్ ప్రతినిధి బృందంతో మాట్లాడే 'మాటలకు' మాత్రమే తేడా ఉండేది కాని భావం మాత్రం ఒకటే అయ్యేంత శ్లేషలు వాడాల్సిన విచిత్రమైన పరిస్థితి వి.పి.మీనన్‌ది. దాంట్లో ఆయన సిద్ధహస్తుడు కూడా!

ఇప్పుడు భారతదేశంగా పిలువబడుతున్న దేశంలో ముస్లింలు ఎదుర్కొన్న దయనీయ పరిస్థితులను గురించిన వివరాలు ఆనాడు ఢిల్లీలో చాలా తెలిసివచ్చాయి. సామూహిక హత్యాకాండలు, మజీదుల ఆక్రమణలు, ముస్లిం సాధువుల సమాధుల విధ్వంసం, సర్వత్రా వ్యాపించిన అభద్రతాభావం, కామన్వెల్త్ దేశమైన ఆ కొత్త దేశంలో ముస్లింల అసహాయ దైన్యస్థితిని గురించి చాలా విన్నాను. ఢిల్లీకి వచ్చిన ప్రతిసారి సందర్శించే ముస్లిం సాధువుల సమాధులను ఈసారి చూడలేకపోయినందుకు చాలా బాధపడ్డాను. ఆ సమాధి ప్రాంతాలు సిక్కులు ఇతర నాన్ ముస్లిం సైనికుల చేత నిండిపోయినవట. అక్కడి సమాధులను సందర్శించేందుకు ఏ ముస్లిం కూడా

సాహసించలేకపోయాడు. నా గుండె పిండేసినట్లయింది.

మరుసటిరోజు ఉదయం కొత్త ఢిల్లీలోని బ్రిటిష్ ఇండియా పాలనా చిహ్నాల పక్కనున్న కింగ్స్ వే వెంట నడిచి చూడాలనుకున్నాను. నా కోర్కె నన్ను వెక్కిరించింది. సురక్షితంగా అలా బయటికి వెళ్ళి రావాలంటే ఒక అర్మెడ్ ప్లటూన్ రక్షణగా కావాలని అర్థమయింది. కొత్త ఢిల్లీలోని నిజాం పాలెస్‌కు అనుబంధంగా ఉన్న గెస్ట్‌హౌజ్ తోటలోనే నడిచితీరాల్సి వచ్చింది.

ఎలాంటి సహేతుకమైన కారణం లేకుండానే భారతీయ రేవుల్లో పెద్ద సంఖ్యలో నిలిచిపోయిన నా విలువైన వస్తువులను విడిపించడం ద్వారా కొనసాగించాల్సిన వ్యాపారాల కోసం తరచూ ఢిల్లీ వెళ్ళాల్సివచ్చేది. కాని భారత ప్రభుత్వ యంత్రాంగంలోని గందరగోళ పరిస్థితుల్లోని గంభీరత ఒకవైపు, హైద్రాబాద్‌పై శత్రుత్వం ఒకవైపు నాకు చాలా నష్టం చేసాయి. ఈ పరిస్థితుల్లో భారతదేశంలో పాకిస్తాన్ హైకమీషన్ జిహాద్‌హుస్సేన్ ఒకరోజు నా దగ్గరికి భోజనానికి వచ్చాడు. అప్పుడు నాకు అర్జంటుగా జిన్నాగారి అపాయింట్‌మెంట్ కావాలని అడిగాను. అందుకు ఆయన బదులిస్తూ జిన్నా కూడా నన్ను త్వరగా చూడాలని, ఐరాస సమావేశ వివరాలు తెలుసుకోవాలని అనుకుంటున్నట్లు తెలిపాడు. పాకిస్తాన్ ప్రతినిధి బృందం ఐరాసలో చేసిన పని గురించి కూడా ఆయన ఆసక్తితో ఉన్నట్లు తెలిపాడు. ప్రస్తుతం జిన్నా లాహోర్లో ఉంటున్నందున అపాయింట్‌మెంట్ తీసుకొని పోనూ రానూ ఏర్పాట్లు చేస్తానని చెప్పాడు. అన్నట్లే వెంటనే అపాయింట్‌మెంట్ తీసుకొని పశ్చిమ పంజాబ్ వెళ్తున్న కాందిశీకుల విమానంలో సీటు ఏర్పాటుచేసాడు. నేను వెళ్ళాల్సింది లాహోర్ వరకే అయినా అంతకు మూడురెట్ల దూరం ఉండే పెషావర్ వరకు టిక్కెట్ బుక్కయింది. ప్రయాణంలో కలుగబోయే అసౌకర్యం గురించి ముందే చెప్పాడు. నేను అన్నిటికీ సిద్ధమయ్యాను. ఆరోజు సాయంకాలం ఫోను చేసి మరుసటిరోజు ఉదయం 5 గంటలకు విమానం ఉందని ఉదయం 4 గంటలకే రిపోర్ట్ చేయాలని చెప్పాడు. జిన్నాతో అపాయింట్‌మెంట్ ఖరారయిందని చెప్పాడు. చలికాలం, నిజాం ప్యాలెస్ సెక్యూరిటీ వెంట రాగా అనుకున్న సమయానికి ముందే ఏర్‌పోర్ట్‌కు చేరుకున్నాను.

మాటల్లో చెప్పడానికి వీలులేనంత విషాదాన్ని పాలెం ఏర్‌పోర్ట్‌లో చూసాను. వేలాది శరణార్థులు అక్కడ తమ ప్రయాణం కోసం వేచి ఉన్నారు. స్త్రీలు, పిల్లలు, పురుషులు అన్ని వయసుల వాళ్ళు దిగాలుపడి వేచి చూస్తూ ఉన్నారు. అక్కడున్నవాళ్ళలో కొందరు చలికి వణుకుతూ, కొందరు దగ్గుతూ అవస్థ పడుతున్నారు. పిల్లలు బాధతో అరుస్తూ ఉన్నారు. స్త్రీలు బొంగురు పోయిన గొంతులతో ఒకరిమీద ఒకరు కేకలు

వేసుకుంటున్నారు. వృద్ధులంతా ఒకచోట చేరి వంతులవారిగా హుక్కా పీలుస్తున్నారు. ఒకరు కొద్దిగా పీల్చి విపరీతంగా దగ్గుతూ ఇంకొకరికి అందిస్తున్నారు. కస్టమ్స్ అధికారి లగేజీని పరిశీలించడానికి ప్రయత్నిస్తున్నాడు. ప్యాసెంజర్లకు తమ లగేజీ ఎక్కడుందో అర్థంకావటంలేదు. కొందరు తమ విలువైన వస్తువుల్ని, బెడ్డింగుల్ని నెత్తిమీద పెట్టుకొని వస్తున్నారు. మైక్రోఫోన్ లేకుండానే ప్యాసెంజర్ల పేర్లు పిలుస్తున్నారు. ఆ పిలుపు చాలాదూరం వరకు బాగానే వినిపిస్తున్నా ప్యాసెంజర్ల స్పందన తక్కువగానే ఉంది. అతికష్టం మీద నేను బుకింగ్ క్లర్క్ దగ్గరికి చేరుకొని నా టిక్కెట్ చూపించాను. ఫ్లైటు ఆరుగంటలక్కాని బయలుదేరదని అందువల్ల ఓ గంట తర్వాత రమ్మన్నాడు. అందువల్ల మానవ దైన్యాన్ని, హృదయాన్ని మెలిపెట్టే దృశ్యాల్ని మరిన్ని చూడగలిగాను. ఒకచోట గజగజ వణికిపోతున్న వ్యక్తిని చూసాను. జాలిపడి దగ్గరికి వెళ్ళి 'బలహీనమైన శరీరంతో చలికి వణికే బదులు కాస్త గాలి చాటుకి వెళ్ళవచ్చుకదా' అన్నాను. అందుకాయన ఇది చలి వల్ల వచ్చే వణుకు కాదని నరాల బలహీనతవల్ల తరచుగా వస్తున్న ఫిట్స్ అని చెప్పాడు. మానవ శరీరంలో నరాల బలహీనతవల్ల వచ్చే ఫిట్స్ గురించి ఏకరువు పెట్టసాగాడు. అతడు చెప్పే వైద్య వివరాలు నాకు ఆసక్తి కలిగించ లేదు. అయినా అతడు నావెంట నడుస్తూ చెబుతూనే ఉన్నాడు. అతను నా వివరాల కోసం నన్ను అనుసరిస్తున్న గూఢచారేమోనని అనుమానమొచ్చింది. నేను అతన్ని వదిలించుకోవాలని ఎంత ప్రయత్నించినా కుదరలేదు. అతను 5 గంటల ఫ్లైట్‌లో లాహోర్ వెళ్ళాలని వచ్చాడు కాని ఫ్లైట్ ఆరుక్కాని రాదని చెప్పుకొచ్చాడు. ఇంక ఇతను విమానంలో కూడా వదలడని అర్థమయింది. 'మీరెక్కడెళ్తున్నారని' నన్నడిగాడు. నేనతనికి జవాబివ్వకుండా వెళ్తూ ఉంటే కూడా నన్నే అనుసరించాడు. అకస్మాత్తుగా అతనిలో వణుకు తగ్గింది. నేను అతనికో సిగరెట్ ఆఫర్ చేస్తే పొగ తాగనంటూ తిరస్కరించాడు. మళ్ళీ వణుకుడు రోగం గురించి మొదలుపెట్టాడు. నేను మాత్రం అతని మానాన అతన్ని వదిలేసాను.

ఆఖరికి ఆరున్నరకి విమానమెక్కాం. నేను అనుకున్నట్లుగానే అతను నన్ను అనుసరించాడు. అతని మొహంలో సంతోషం కనిపించింది. మేమంతా కిందనే కూర్చున్నాం. అతను నా తర్వాత కూర్చున్నాడు. కుర్చీలు, సీట్లు ఏమీ లేవు ఆ విమానంలో. ప్యాసెంజర్లకు వాళ్ళ లగేజీలకు అదనపు జాగా కోసం అన్నీ తొలగించారు. పిల్లలు, పెద్దలు, వృద్ధులు తమ లగేజీలతో ఆహారపు సామగ్రితో అసౌకర్యంగా కూర్చున్నారు. లగేజీని ఒక మూలకు పెట్టి పిల్లలు, మహిళలకు కొంచెం వెసులుబాటు కలిగేలా కూర్చోబెట్టవచ్చు కదా అని సలహా ఇచ్చాను. సరేనని

వెంటనే నా సలహా పాటించారు. కొద్ది నిమిషాల్లోనే అనుకున్నట్లు సర్దుకొని కొంత సౌకర్యంగా కూర్చున్నాం. అలా సర్దుకొని కూర్చోవడం వల్ల బాత్‌రూమ్‌కు నడిచేందుకు దారి కూడా ఏర్పడింది.


ఒక ముసలాయన మా ముందటికి వచ్చి కూర్చోబోయాడు. నాతోపాటు వస్తున్నాయన ఆ ముసలాయన్ని పేరుపెట్టి పలుకరించాడు. ఆ ముసలాయన ఆశ్చర్యంగా చూస్తున్నాడు. నాతో ఉన్నాయన ఆ ముసలాయన్ని మరోమారు పేరుపెట్టి పలుకరించాడు. అప్పుడు ఆ ముసలాయన మా దగ్గరికి వచ్చి కూర్చున్నాడు. ఆ ముసలాయన అతని కళ్ళల్లోకి తదేకంగా చూసాడు. ఓ క్షణం తర్వాత 'డాక్టర్ సాబ్! డాక్టర్ సాబ్! నీకేమయింది? నీ గడ్డాన్ని ఏం చేసావ్? చెంపల చుట్టూ నిండైన గడ్డాన్నేం చేసావ్?' అంటూ ఆదుర్దాగా ప్రశ్నల వర్షం కురిపించాడు. దానికి ప్రతిగా నాకు సహచరుడిగా వస్తున్న వ్యక్తి ఆ వివరాలడగవద్దన్నట్లు సైగ చేసాడు. చివరికి వాళ్ళిద్దరూ లో గొంతుకతో చేసుకున్న సంభాషణ ద్వారా నాతో వస్తున్న వ్యక్తి మంచి పేరున్న డాక్టరని అర్థమయింది. ఢిల్లీలోని మంచి శ్రీమంతులుండే ప్రాంతంలో మంచి ఇల్లు, బాగా నడిచే డిస్పెన్సరి కూడా ఉందని అర్థం అయింది. ఈ అలజడి రోజుల్లో ఒకనాడు పోలీసులు అతని ఇంటిమీద దాడిచేసి ఇల్లు ఖాళీ చేయమని హెచ్చరించారట. దాంతో భయపడిపోయిన ఆయన భార్య పిల్లలు పాత ఢిల్లీలోని వాళ్ల అమ్మగారింటికి వెళ్ళిపోయారు. డాక్టరు ఆయన ఇద్దరు పనివాళ్ళు మిగిలిపోయారు. స్వంత ఇంటిని అందులోని వస్తువులను ఉన్న పళంగా వదిలేసి వెళ్ళడం ఎంతో కష్టమనిపించింది. పోలీసులు రెండోసారి రైడింగు చేసినప్పుడు కూడా తను తన ఇంటిని వదిలివెళ్ళేది లేదని గట్టిగానే చెప్పాడట. ఆ మాటకి పోలీసు బృందంలోని ఒక వ్యక్తి ఒక పిస్టల్ చూపించి ఇది మీ గదిలోనే దొరికిందని అందుకు నిన్ను అరెస్టు చేస్తున్నామని చెప్పాడట. మిగిలిన పోలీసులు ఇంకేం దొరుకుతుందా అని చుట్టూ చూడసాగినారట. తమకు దొరికిన వాటిని పంచుకోవడం కోసం వాళ్ళలో వాళ్ళు ఘర్షణ కూడా పడ్డారట. వాళ్ళు ఆ ఘర్షణలో ఉండగా అదను చూసి డాక్టర్ కిటికీ నుండి దూకి తప్పించుకున్నాడు. ఆ రాత్రి ఎలాగోలా ఒక మిత్రుడి ఇల్లు చేరి తలదాచుకున్నాడు. మరుసటిరోజు అక్కడే గడిపాడు. మరుసటిరోజు సాయంకాలం వాళ్ళ అత్తగారింటికి వెళ్ళాడు. అతనిమీద అరెస్ట్ వారెంట్ ఉన్నట్లు అర్థం చేసుకున్నాడు. శుభ్రంగా గడ్డం గీసుకొని యూరోపియన్ దుస్తుల్లో తయారుకావాలని నిశ్చయించుకున్నాడు. తద్వారా తన రూపాన్ని గణనీయంగా మార్చుకున్నాడు. కొద్దిరోజుల్లో పాకిస్తాన్ హై-కమిషనర్‌ను సంప్రదించి తనకూ తన కుటుంబానికి ఇమ్మిగ్రేషన్ అనుమతిపొంది విమానం టిక్కెట్లు

కూడా పొందాడు. కానీ కుటుంబానికి, తనకూ వేర్వేరు విమానాల్లో సీట్లు దొరికాయి. కొద్దిరోజుల కింద రెండు వేర్వేరు విమానాలలో తన కుటుంబాన్ని పంపించి ఇప్పుడు తను తప్పించుకుంటున్నాడు.

విషయమంతా తెలిసింది కాబట్టే మరి పనిమనుషులేమయ్యారని నేను అడిగాను. అతనికి తెలియదు. వివరాలు కనుక్కుంటుంటే తన బ్యాంక్ అకౌంట్ సీజ్ చేసారని మాత్రం తెలిసింది. అందువల్ల డాక్టర్ తన మామను కొంత డబ్బు అడిగి తీసుకున్నాడట. విలువైన నగలు అమ్మగా వచ్చిన కొన్ని వందల రూపాయలను ఏర్ చార్జీలకు వెచ్చించాడు. ఒక్కరోజు క్రితమే తన మామతోపాటు ఆయన కుటుంబ సభ్యులందరిని చంపివేసారని ఇంటిని దోచుకున్నారని తెలియవచ్చింది. ఈ వివరాలన్ని చెబుతూ డాక్టర్ మళ్ళీ వణకడం మొదలుపెట్టాడు. మళ్ళీ తన వణుకుడు రోగానికి కారణాలను చెప్పడం మొదలుపెట్టాడు. ఆ ప్రయాణం పూర్తయ్యేదాకా అతను వణుకుతూనే ఉన్నాడు.

అలా చూసిన దృశ్యాల వల్ల విన్న దయనీయ గాథల వల్ల నా కడుపులో తిప్పినట్లయినిపించింది. ఆవిధంగా మాత్రం నాకెన్నడూ జరగలేదని భావిస్తూ లాహోర్ చేరాను. ఇప్పటిదాకా చూసిన మానవ దీనగాథలకు తెరపడుతుందని భావించాను. కాని అలాంటి అద్భుతమేమీ కనిపించలేదు. విమానాశ్రయం లోను, లాహోర్ రోడ్లమీద గుంపులు గుంపులుగా జనం బాధలతో ఆందోళనతో కనిపించారు.

రోడ్లు, రైలు, విమానమార్గాల ద్వారానే కాకుండా బండ్ల బాటలో, కాలి నడకన గుంపులుగుంపులుగా వస్తున్న శరణార్థుల సమూహాలే ఎక్కడ చూసినా. వారిలో కాలినడకన వచ్చినవారే ఎక్కువని విన్నాను. ప్రయాణం మొదలుపెట్టిన వారెందరో మార్గమధ్యంలో రోడ్ల మీద తమ దురదృష్టాన్ని తలపోస్తూ అలసిసొలసి నడుస్తున్నారు. కష్టాలను అధిగమించినవాళ్ళెలాగో చివరికి పాకిస్తాన్ చేరారు. వారి భవిష్యత్తు ఏమిటో వారికి తెలియదు. ఒక్కటిమాత్రం వాళ్ళకి స్పష్టంగా తెలుసు– వాళ్ళిక శత్రువుకు అందనంత దూరంలో మాత్రం ఉన్నారు.



# 2. పాకిస్తాన్ జాతిపితతో నా సమావేశం

జిన్నా ఆరోగ్యం ఇంకా కుదుట పడలేదని డాక్టర్లు ఆయన్ని కొద్దిమందితో మాత్రమే కలవనిస్తున్నారని లాహోర్‌లో తెలిసింది. ఆయన రోజుకు ఒక గంట మాత్రమే పనిచేయగలుగుతున్నారు. అయినా ఆరోజు ఉదయం 11-12గంటల మధ్య నాకు అపాయింట్‌మెంట్ దొరికింది. జిన్నాగారు పట్టుబట్టడం వల్ల డాక్టర్లు ఇందుకు అయిష్టంగానే అంగీకరించినట్లు తెలిసింది. అదీ ఈ అపాయింట్‌మెంట్ పూర్తయి, ఇక ఆరోజుకి ఇంకే పని చేయకూడదనే కండీషన్ మీద. ఇవేవీ పట్టించు కోకుండా మా చర్చలు మధ్యాహ్నం రెండు గంటల దాకా సాగాయి. మధ్య మధ్య ఇక ముగిద్దామని నేను గుర్తు చేస్తూనే ఉన్నా ఆయన అందుకు అంగీకరించలేదు. ఇతరులు కూడా డాక్టర్ సలహాను అతిక్రమించి చాలా మాట్లాడుతున్నారనీ ఆయనకు గుర్తు చేస్తూ ఉన్నారు. శ్రీమతి జిన్నా కూడా రెండుమార్లు మా గదిలోకి వచ్చి ఇక ముగించమని గుర్తు చేసింది. ఈ గదిలోకి తాను పిలిచేవరకూ ఎవరూ రావద్దని ఆయన కోప్పడ్డారు. ఒకసారి నేనే లేచి వెళ్ళిపోదామని అనిపించింది కానీ నాకు ధైర్యం చాలలేదు. గడియారం రెండు కొట్టాక భోజనానికి అని లేచాడు జిన్నా. నన్ను భోజనానికి పిలవలేకపోతున్నందుకు క్షమాపణ చెప్పాడు. ఒక్క నిముషం వృధా చేయకుండా 'త్వరగా కోలుకోవాలి' అంటూ శుభాకాంక్షలు చెప్పి బయటకు వచ్చాను. మూడు గంటల సుదీర్ఘ చర్చలవల్ల ఆయనను నీరసం ఆవహించి, జ్వరం వచ్చిందని అది తగ్గడానికి కొన్ని రోజులు పట్టిందని తెలిసింది.

మా చర్చ కొంతసేపు ఐక్య రాజ్య సమితి (ఐరాస) అంశాల గురించి జరిగింది. మొదలు అక్కడ జరిగిన వివరాలన్నీ వరుసగా చెప్పమని జిన్నా అడిగారు. పాకిస్తాన్ ఐరాసలో చేరిన సందర్భంగా జరిగిన సంబరాల గురించి చెప్పమన్నాడు. నేను చెప్పినదాంతో సంతృప్తిపడకుండా నన్ను మరింత వివరాలు చెప్పేవిధంగా క్రాస్ చేశారు. పాకిస్తాన్ చేరిక సందర్భంగా ఇతర దేశాల ప్రతిస్పందన మరీ ముఖ్యంగా అమెరికా, సోవియెట్ యూనియన్‌ల స్పందన గురించి అడిగి తెలుసుకున్నాడు. దేశ విభజన సందర్భంగా తలెత్తిన విషాదాన్ని ఆయనే నాకు వివరంగా చెప్పాడు. బెంగాల్, పంజాబ్ విభజన అవార్డు ఎంతో అన్యాయంగా ఉందని వాపోయాడు. మా సంభాషణ ఇతర అనేక విషయాలమీద సాగి చివరకు హైదరాబాద్ వద్దకు వచ్చి ఆగింది.

హైదరాబాద్ పట్ల జిన్నాకు స్పష్టమైన అభిప్రాయాలున్నాయి. రాచరికానికి ఇక కాలం చెల్లిందని, పరిపాలన ప్రజల చేతుల్లోకి వెళ్ళాల్సిందేనన్నాడు. హైదరాబాద్ సంస్కృతి వారసత్వం ఆ దేశ హిందూ ముస్లింలకు గర్వకారణం అన్నాడు. ఉపఖండంలోని పరిస్థితులు ఉద్రిక్తంగా, ఘర్షణపూరితంగా ఉన్నప్పటికీ హైదరాబాద్ లో ప్రశాంతమైన పరిస్థితులున్నాయి. అందుకు కారణం అక్కడి ప్రత్యేకమైన వారసత్వం, సంస్కృతి, మత సహిష్ణుత మాత్రమే అన్నాడు. అక్కడ ప్రభుత్వ పరిపాలనా బాధ్యతలు ముస్లీంలు, హిందువులు సంయుక్తంగా నిర్వహించాల్సి ఉంటుంది. అక్కడి (హైద్రాబాద్) హిందువులకు పరిపాలనలో సరియైన భాగస్వామ్యం ఉన్నప్పటికీ వాళ్ళు హైదరాబాద్ రాజ్యాన్ని భారతదేశంలో కలిపేయడానికి ప్రయత్నించడం ఆశించదగినది కాదు. అందువల్ల ప్రయోజనం లేకపోగా నష్టముందన్నది జిన్నా స్పష్టమైన అభిప్రాయం.

హైదరాబాద్‌లోని ముస్లింలు సివిల్, మిలటరీ ఉద్యోగాలలో తప్ప వ్యాపారం లాంటి రంగాలలో చాలా వెనుకబడి ఉన్న సంగతి కూడా జిన్నాకు తెలుసు. ముస్లింలు ఇతర సామాజిక ఆర్థిక రంగాలకు విస్తరిస్తూ, హిందువులు ప్రభుత్వరంగాలలోకి రావల్సిన ఒక ట్రాన్సిషన్ పీరియెడ్ (పరివర్తన కాలం) యొక్క ఆవశ్యకత ఉంది. శాసన వ్యవహారాలలోను, పరిపాలనలోనూ సమాన ప్రాతినిధ్యం రావాలి. అందరికీ ఆమోదయోగ్యమైన స్థితి కోసం ప్రయత్నించాల్సి ఉంది. సంస్కృతి, వారసత్వాన్ని కాపాడుకుంటూ సమాజంలోని ప్రతి రంగానికి ఆదర్శంగా హైద్రాబాద్ నిలవాలి. భారతదేశం మధ్యప్రాంతం, దక్షిణ ప్రాంతం నుండి హైద్రాబాద్‌లోకి ముస్లింల వలసలు పెరగవచ్చు. హైద్రాబాద్ వారికి ఆశ్రయాన్ని రక్షణనూ కల్పించగలదు.

హైద్రాబాద్‌లోకి ప్రవేశించడం ద్వారా ఆత్మవిశ్వాసం, రక్షించబడ్డామన్న భావన కలిగించడం ద్వారా పరిసర ప్రాంతాల ముస్లిం ప్రజలకు హైద్రాబాద్‌కు ఎప్పుడైనా వెళ్ళగలమన్న ధీమాతో వారు ఉన్న ప్రాంతాల్లోనే ఉండగలుగుతారు. ఈ వాస్తవాలను గమనించడం ద్వారా అక్కడి హిందూ సమూహాలు ముస్లిం మైనారిటీల పట్ల అసహజంగా ప్రవర్తించకుండా ఉంటాయి. ఈ సంభాషణలో ఏ ఒక్క సందర్భంలో కూడా జిన్నా హైద్రాబాద్‌ను పాకిస్తాన్‌లో కలపవలసిన అవసరముందని కానీ కలపాలని కానీ సలహా ఇవ్వలేదు. ఇండియాలో కలపమనే భారత వాదాన్ని కూడా ఆయన ప్రస్తావించలేదు. తమలో కలుపుకోవడం కంటే పాక్షిక స్వతంత్ర దేశంగా ఉంచడం ద్వారా హైద్రాబాద్‌ను భారతదేశం ఒక గొప్ప శక్తి కేంద్రంగా ఉపయోగించుకోవచ్చు. భారతదేశపు నాయకులకు హైద్రాబాద్ ఉద్దేశాల పట్ల తప్పుడు సమాచారం అంది ఉండవచ్చు. కాని అలాంటి తప్పుడు సమాచారం ఆధారం లేనిదని తొందరలోనే అర్థమవుతుంది. కాబట్టి రెండు పక్షాలు ఒకర్నొకరు అనుమానించుకోకుండా గౌరవ ఆదరాలతో చొరవ తీసుకుని అపనమ్మకాలను తొలగించుకోవాలి. ఈ వ్యవహారాలను చక్కదిద్దడంపై శ్రద్ధ కనబరుస్తూ నిజాం ముందు ముందు దూరదృష్టితో, జాగరూకతతో, శ్రద్ధతో నిర్ణయాలు తీసుకుంటాడని ఆశించారు.

గతంలో నిజాం ప్రదర్శించిన ఊగిసలాట ధోరణి వల్ల ఆయన బలహీన పడ్డారని కచ్చితంగా నమ్ముతూ భవిష్యత్‌లో అలాంటివి పునరావృతం కానివ్వరని ఆశించాడు. రెండు దేశాల మధ్య సత్సంబంధాలు సత్వరం నెలకొల్పాలన్న స్పష్టమైన గ్రహింపు ఆయనకుంది. సరియైన 'యధాతథ ఒప్పందం' కుదుర్చుకోవడమే కాకుండా దాన్ని సున్నితంగా అమలు పరచాలి అంటాడు. 'యధాతథ ఒప్పందాన్ని' ఇరుపక్షాలు ఒక సంవత్సర కాలంపాటు సరిగ్గా వినియోగించుకున్నట్లయితే పరస్పర సందేహాలు, అనుమానాలను ఇద్దరికీ ఆమోదయోగ్యమైన దిశగా పరిష్కరించుకోవచ్చు అంటాడు. బాధ్యతాయుత ప్రభుత్వం, భారతదేశంలో విలీనం అన్న స్టేట్ కాంగ్రెస్ తీర్మానాలను నేను ఆయన దృష్టికి తీసుకురాగా ఆయన మొదటిదాన్ని పూర్తిగా అంగీకరించాడు. రెండవ తీర్మానం సంస్థానంలోని మెజారిటీ హిందు సమూహాల అభిప్రాయంగా కాకుండా నేరుగా ఎఐసిసి ప్రభావంతో చేసిన తీర్మానంగా చూసాడాయన. హిందువుల లోని ఒక వర్గం హైద్రాబాద్‌లో పూర్తి బాధ్యతాయుత ప్రభుత్వాన్ని సాధించే పోరాటానికి అనుభవం గల్గిన ఎఐసిసి నుండి పూర్తి మద్దతు అవసరమని భావించిన మాట కూడా నిజం. దాని మూలంగానే కావచ్చు హైద్రాబాద్ ఇండియాలో విలీనం కావాల్సి రావడం. తీర్మానం రాసినవారు వెల్లువెత్తిన ప్రజాభిప్రా యపు ఒత్తిడి వల్ల

రెండవ భాగాన్ని కొట్టివేసినట్లుగా భావించి నిజాం, హైద్రాబాద్ ప్రభుత్వం, ముస్లింలు ముందుకు సాగవలసి ఉంటుందని జిన్నా అభిప్రాయపడ్డాడు.

మాటల సందర్భంగా నేను బాధ్యత తీసుకుని హైద్రాబాద్ మంత్రివర్గాన్ని ఏర్పాటు చేయాలని కొందరు మిత్రుల అభిప్రాయంగా చెప్పి ఎలా ఉంటుందని అడిగాను. అందుకాయన నిజాం మనసు, దృక్పథం దృఢంగా ఉంటే, సరే అనేవాడినని, కానీ నిజాం గతం తెలిసినవాడిగా 'వద్దు' అంటున్నానని అన్నాడు. ఒక స్వేచ్ఛాజీవిగానే హైద్రాబాద్‌కు, ముస్లిం కమ్యూనిటీకి ప్రత్యేకంగా పాకిస్తాన్‌కు నేను ఎంతో మంచి చేయగలనని జిన్నా అన్నాడు. హైద్రాబాద్ ప్రధానిగా పనిచేయదగ్గ ఇతరులు తప్పనిసరిగా ఉంటారని ఆ బాధ్యత స్వీకరించడం ద్వారా తన దృష్టికోణం నుంచి ఎలాంటి ఫలితమూ లేదని చెప్పాడు. అయినా అది నేను నిర్ణయించుకోవలసిన విషయం తప్ప తను నిర్ణయించే విషయం కాదంటూ అది తాను మామూలుగా చెప్పిన విషయమని స్పష్టం చేశాడు. చివరగా హిందు, ముస్లిం నాయకులు నన్ను సంప్రదిస్తే, ప్రత్యేకంగా నిజాం స్వయంగా గట్టిగా పట్టుబడితే తప్ప ఇతరేతర ఏ ఒత్తిడికీ లొంగి ప్రధాని బాధ్యతలకు అంగీకరించవద్దని మాత్రం చాలా స్పష్టంగా చెప్పాడు జిన్నా.

ఒకవేళ హైద్రాబాద్‌ను విలీనం చేసేందుకు భారత్ బలప్రయోగం చేస్తే పరిస్థితి ఏమిటని జిన్నాను అడిగాను. దానికి తాను జ్యోతిషం చెప్పే వాడిని కానని చెబుతూ అలాంటి బలప్రయోగం జరగకపోవచ్చనే అన్నాడు. హైద్రాబాద్ వ్యవహారాల లో బలప్రయోగం తలపెడితే ప్రపంచదేశాల దృష్టిలో భారత్ చులకనవ్వడమే కాకుండా అది భారత స్వాతంత్ర్య చట్టం స్ఫూర్తికి విరుద్ధం కూడా అవుతుంది అన్నాడు. హైద్రాబాద్, భారత్ మధ్య గౌరవ ప్రదమైన సంబంధాల కోసం, హైద్రాబాద్‌కు కావల్సిన రాజకీయ స్థాయి కోసం తను చేతనయినంతగా ప్రయత్నం చేస్తానని జిన్నా ముగింపుగా చెప్పాడు.

ఆరోజు రాత్రి నేను లియాఖత్ అలీఖాన్ దగ్గర బసచేసి మరుసటిరోజు లాహోర్‌ను వీడాను. తిరుగు ప్రయాణంలో పెద్ద విశేషాలు లేవు. కొద్దిమంది సిక్కు ప్రయాణీకులు, పాకిస్తాన్ దేశపు కొద్దిమంది అధికారులు విమానంలో ఉన్నారు. విమానం టేకాఫ్ తీసుకున్నాక కిందికి చూశాను. గుంపులు గుంపులుగా కాందిశీకులు ఉంటారని భావించాను. కానీ అలాంటి దృశ్యాలేం కనిపించలేదు. మధ్యాహ్నం దాటింతర్వాత ఢిల్లీలో దిగాను. మోయిన్ నవాజ్‌జంగ్ బృందం తమ ముసాయిదా చర్చల్లోనే

ఉన్నారు ఢిల్లీలో. జిన్నాను కలిసి వచ్చినందున ఏవైనా విలువైన సలహాలిస్తానేమోనని వాళ్ళు ఎదురు చూశారు. జిన్నాతో నా లాహోర్ చర్చల వివరాలు వారికి తెలిపాను తప్ప వారు చర్చించనున్న అంశాలపైనేనేమీ సలహా ఇవ్వలేదు. ఏదైనా స్పష్టమైన, ఉత్తేజకరమైన వర్తమానం లాహోర్ నుంచి ఉంటుందని భావించి వారు భంగపడ్డట్లు అనిపించింది  నాకు.

# 3. హైద్రాబాద్ సంస్థానం - నిజాం నవాబులు

దేశ విభజనకు ముందూ, ఆ తర్వాత జరిగిన మారణహోమం సందర్భంలో హైద్రాబాద్ సంస్థానానికి ఉన్న రాజకీయ ప్రాధాన్యాన్ని సరిగ్గా అంచనా వేయాలంటే మొదట నిజాం వ్యక్తిగత స్వభావాన్ని అర్థం చేసు కోవాలి. తన సంస్థాన ప్రజలతో, స్వంత ప్రభుత్వంతో పాలకుడిగా ఆయన కున్న సంబంధాల్ని అర్థం చేసుకోవాలి. సంస్థానంలోపల, బయట అతన్ని ప్రభావితం చేసిన అంశాల్ని, అతను ప్రభావితం చేయగలిగిన అంశాల్ని అర్థం చేసుకోవాలి. ఏడు శతాబ్దాలుగా కొనసాగిన ముస్లిముల రాజకీయాధిపత్యపు చారిత్రక వాస్తవం, ఈ ప్రాంతపు సంస్కృతి కూడా చిన్నదికాదు. శతాబ్దిన్నర కాలంగా బ్రిటిష్ వారితో కొనసాగిన ఒడంబడికల, భౌతిక ఆదాన ప్రదానాల విషయం కూడా ప్రత్యేకంగా పేర్కొనదగినది.

13వ శతాబ్దాంతానికి దక్కన్ పీఠభూమి, దాని పరిసర ప్రాంతాలు మూడు రాజ్యాలుగా ఉండేవి. దేవగిరి కేంద్రంగా పశ్చిమ ప్రాంతాన్ని యాదవులు పాలిస్తుండే వారు. (దేవగిరి తర్వాత కాలంలో దౌల్తాబాద్‌గా పిలువబడింది.) హైద్రాబాద్ సంస్థానపు పశ్చిమ ప్రాంతం, బూబ్ ప్రావిన్సు లోని చాలా భాగం యాదవ రాజ్యంగా ఉండేది. తూర్పున వరంగల్ కేంద్రంగా ఆంధ్ర రాజ్యముండేది. అక్కడి రాజులు ఈనాటి హైద్రాబాద్ సంస్థానంలోని తూర్పుభాగాన్ని, మద్రాసు ప్రావిన్సులోని ఉత్తర భాగాన్ని పాలిస్తూ ఉండేవారు. దక్షిణాన దేవసముద్రం రాజధానిగా హొయనాలులు పాలిస్తుండేవారు. హైద్రాబాద్ దక్షిణ ప్రాంతం, మద్రాసు ప్రావిన్సులోని పశ్చిమ ప్రాంతాలు, బాంబే ప్రావిన్సులోని కొంత భాగం, మైసూరు రాష్ట్రం హొయనాలుల ఆధీనంలో ఉండేది. ఢిల్లీ పాలకుడైన జలాలుద్దీన్ ఖిల్జీ అల్లుడైన అల్లా ఉద్దీన్ ఖిల్జీ అవద్ గవర్నరుగా ఉండి మొదట 13వ శతాబ్దాంత కాలంలో యాదవ రాజ్యంపై



దండెత్తి ఆక్రమించాడు. యాదవరాజు ఓటమిని అంగీకరించి కప్పంకట్టేందుకు ఒప్పుకొని ఢిల్లీ సుల్తానుతో సంధి కుదుర్చుకున్నాడు. జలాలొద్దీన్ అనంతరం ఆయన అల్లుడు అల్లాఉద్దీన్ ఢిల్లీ పీఠాన్ని అధిరోహించాడు. కాలక్రమంలో యాదవరాజు కప్పం కట్టడం లో అలసత్వం వహించాడు. ఆగ్రహించిన సుల్తాన్, మాలిక్ కపూర్ ఆధ్వర్యంలో దాడికి పంపాడు. మాలిక్ కపూర్ దక్షిణాది దండయాత్ర ప్రారంభించి యాదవులనే కాకుండా ఓరుగల్లు సామ్రాజ్యాన్ని, హొయసాల సామ్రాజ్యాన్నీ జయించాడు. అలా జయించిన రాజ్యాల్ని తిరిగి వారికి అప్పగిస్తూ ఢిల్లీ సుల్తానుకు విధేయులుగా ఉంటూ వార్షిక కప్పం కట్టడానికి ఆదేశించాడు. ఆవిధంగా 14వ శతాబ్దారంభం నాటికి దక్షిణ చివరి ప్రాంతాలు తప్ప, దక్షిణ భారతదేశమంతా ఢిల్లీ ముస్లిం సుల్తానుల ప్రత్యక్ష పాలనలోకి వచ్చింది.

ఖిల్జీల తర్వాత ఢిల్లీలో తుగ్లక్‌ల పాలన ప్రారంభమయింది. తుగ్లక్‌లు దక్షిణాదిన కొనసాగుతున్న పరోక్ష పాలనను తొలగించి ప్రత్యక్ష పాలన ప్రారంభించారు. రాజధానిని కొంతకాలంపాటు దేవగిరికి మార్చి దానికి దౌల్తాబాద్ అని పేరుపెట్టారు. ఆ తర్వాత రాజధాని ఢిల్లీకి తిరిగి మారినప్పటికీ ముస్లిం సంస్కృతి, ముస్లింల రాజకీయ శక్తి దక్కన్‌లోనూ, దాని చుట్టుపక్కల ప్రాంతాలలో శాశ్వతంగా స్థిరపడిపోయింది. తర్వాతకాలంలో ఢిల్లీ పాలకులు బలహీనమైనప్పుడు అనేక ముస్లిం రాజ్యాలు దేశంలో వేళ్ళూనాయి. గుల్బర్గా కేంద్రంగా హసన్‌గంగూ బహమనీ రాజ్యాన్ని ఏర్పాటు చేసాడు.

దక్షిణాన తుంగభద్రానది వరకు బహమనీ సామ్రాజ్యం విస్తరించింది. తర్వాత కాలంలో బహమనీ సామ్రాజ్యం ఐదు చిన్న ముస్లిం రాజ్యాలుగా విడిపోయింది. కుతుబ్ షాహీలు గోల్కొండలో, ఆదిల్‌షాహీలు బీజాపూర్‌లో, నిజాంషాహీలు అహ్మద్‌నగర్‌లో, బరీద్‌షాహీలు బీదర్‌లో, ఇమాద్‌షాహీలు బేరార్‌లో సామ్రాజ్యాలు ఏర్పాటు చేసుకున్నారు. కాల క్రమంలో ఈ రాజ్యాలన్నీ ఔరంగజేబు పాలన కిందికి వెళ్ళాయి.

ఔరంగజేబు  మరణం తర్వాత మొగల్ సామ్రాజ్యం బలహీనమై పోయింది. ఇరాన్ నుండి నాదిర్షా దండెత్తాడు. ఢిల్లీ పట్టణాన్నంతా ఊచకోత కోయమని ఆదేశించాడు. ఢిల్లీలోని ప్రజలంతా చంపివేయబడే వరకు తన కత్తిని ఒరలో పెట్టనని మజీదులో కూర్చొని శపథం చేసాడు నాదిర్షా. ఆ సమయంలో మొగలాయిల కోర్టులోని ఉదాత్తుడైన అసఫ్‌జా మోకాళ్ళ మీద కూర్చొని రక్తపాతాన్ని ఆపివేయమని నాదిర్షాను వేడుకున్నాడు. ఆ ప్రార్థన విన్న నాదిర్షా ప్రార్థన చేసిన అసఫ్‌జా తెల్లని గడ్డం మీద గౌరవ సూచకంగా ఊచకోతను ఆపివేసాడు. నాదిర్షా ఇరాన్ తిరిగి వెళ్ళగానే ఢిల్లీ దర్బారులో కుట్రలు మొదలైనాయి. కొంత వెసులుబాటు కలిగిన తర్వాత దక్కను వెళ్ళాలని భావించాడు ఆందోళనలో ఉన్న అసఫ్‌జా. చివరకు దక్కన్ గవర్నరుగా నియమించబడ్డాడు. దక్కన్ వెళ్ళే మార్గంలో ఆయన ఔరంగాబాదులో ఆగాడు. ఔరంగాబాద్‌లో దర్వేష్ అనే ముస్లిం సాధువు ఉండేవాడని చెబుతారు. తన దగ్గరున్న కొన్ని ఎండు రొట్టెముక్కలను అసఫ్‌జాకు పెట్టాడట. అసఫ్‌జా వాటిలో ఏడు రొట్టెముక్కలను భక్తితో తిన్నాడట. దర్వేష్ అసఫ్‌జాను దీవిస్తూ ఏడు తరాలు తన రాజ్యం ఈ ప్రాం తంలో కొనసాగుతుందని ఆశీర్వదించాడట. అప్పటి నుండి 'కుల్చా' అని పిలువబడే ఆ రొట్టెముక్కలే రాజలాంఛనాలైనాయి. హైద్రాబాద్ ముస్లిం సంస్కృతికి, రాజకీయ శక్తికీ కేంద్రమయింది. 1857 తిరుగుబాటు తర్వాత భారత ఉపఖండంలోనే హైద్రాబాద్ ముస్లింల సాంస్కృతిక కూడలిగా మారింది.

అసఫ్‌జాహీ రాజవంశానిది మొదటినుండి మనుగడ కోసం పోరాటమే. మరాఠాలు ఎప్పుడు పక్కలో బల్లెమే. పరస్పర శత్రు శిబిరాలైన బ్రిటిషు, ఫ్రెంచివారు చెరోవైపు నుంచి ఒత్తిడి పెంచేవారే. నిజాం నవాబులు తరచుగా ఒకరిపైకి ఇంకొకర్ని ప్రయోగించవలసిన పరిస్థితిని ఎదుర్కొన్నారు. కాలక్రమంలో బ్రిటిష్ వాళ్ళు తమ సార్వభౌమత్వాన్ని రాతల్లో కాకపోయినా చేతల్లో ప్రదర్శిస్తూనే వచ్చారు. సందర్భాను సారంగా చేసిన సహాయాన్ని గుర్తు చేస్తూ బ్రిటిష్‌వారు చేసే డిమాండ్లకు తరచుగా నిజాం నవాబులు తలొగ్గుతూ బ్రిటిష్‌వారి రాచరికాన్ని హైద్రాబాద్ పొలిమేరల్లో

కూడా అడుగు పెట్టనిచ్చారు. 1778లో ఒక బ్రిటిష్ రెసిడెంటు నియమించబడి అప్పటినుండి వారసత్వంగా మారుతున్న నవాబు లందరి మీద ఒక కన్నేసి పెట్టారు. అనేక ఒప్పందాల ద్వారా నిజాం నవాబులకు, బ్రిటిష్ వారికి సంబంధా లేర్పడినవి. ఒప్పందాలకు మించిన సంబంధాలను బ్రిటిష్ వారు కోరలేదు.

18వ శతాబ్ది అర్ధభాగం నుండి హైద్రాబాద్ స్వతంత్ర రాజ్యంగా మనగలిగింది. ఢిల్లీతో సంబంధం లేకుండా బ్రిటిష్ వారితో ఫ్రెంచి వారితో సహా ఇతర రాజ్యాలతో యుద్ధాలు, ఒడంబడికలు చేసుకోగలిగింది. సంస్థానంలో కొంత భూభాగాన్ని బ్రిటిష్ వాళ్ళకు ఇవ్వాలని మొగల్ పాలకులు ప్రతిపాదించినప్పుడు నిజాం దాన్ని అడ్డుకున్నాడు. 1763 ప్యారిస్ ఒప్పందం ద్వారా ఈ భూభాగంపై నిజాం సార్వభౌమత్వం గుర్తించ బడింది. భారతదేశంలో బ్రిటిష్‌వారి ఆధిపత్యం విస్తరించిన కొద్దీ హైద్రాబాద్ రాజకీయ చరిత్ర అంతా బ్రిటిష్ వారితోగల సంబంధాల చరిత్రగా మారిపోయింది. సమయానుసారంగా కుదుర్చుకున్న ఒడంబడికలు, ఒప్పందాలలోని పురోగమనం మీదే ఇక్కడి చరిత్ర నడిచింది. 1759లో ప్రారంభమైన ఈ ఒడంబడికలు 1902 దాకా కొనసాగాయి.

తొలినాటి నుంచి కొనసాగుతున్న స్నేహ సంబంధాలన్నీ శాశ్వత స్నేహ సంబంధాల ఒడంబడిక, 1802 ద్వారా మరింత బలపడ్డాయి. ‘ఒక పక్షానికి శత్రువైనవాడు రెండో పక్షానికీ శత్రువే. ఒక పక్షానికి మిత్రుడైనవాడు రెండో పక్షానికీ మిత్రుడే’ అని పరస్పరం ప్రకటించుకున్నారు.

1768, 1789, 1798లలో కుదిరిన ఒప్పందాల ప్రకారం బ్రిటిష్‌వారు హైద్రాబాద్ రక్షణ కోసం కొంత సైన్యాన్ని నిజాం రాజ్యంలో ఉంచారు. అంతేకాకుండా నడుస్తున్న ఒప్పందాల ప్రకారం హైద్రాబాద్ తరఫున బ్రిటన్ విదేశీ వ్యవహారాలు నిర్వహిస్తూ ఉండేది. బ్రిటిష్ సార్వభౌమత్వపు ఆధిపత్యపు ధోరణి తరచూ వివాదాలకు దారితీస్తూ ఉన్నా సూత్రబద్ధంగా బ్రిటిష్ వారు, నిజాం రాజు ఎవరికి వారు స్వతంత్ర ప్రభువులే.

బ్రిటిష్ వారి సార్వభౌమత్వం సూటిగా చెప్పబడకున్నా స్థానిక దేశీయ రాజుల మీద వారి ఆధిపత్యం స్పష్టంగా తెలుస్తూనే ఉండేది. ఓ బ్రిటిష్ రాజనీతివేత్తే అన్నట్లు సార్వభౌమత్వం సార్వభౌమత్వమే. అవసరాల్ని ఆసరాగా చేసుకొని ఏకపక్షంగా వ్యవహరించగలిగే బ్రిటిష్ రాజ్యం భారత దేశంలో తిరుగులేని శక్తిగా ఎదిగింది.

సార్వభౌమాధికార శక్తి నిర్వచించబడ్డా, నిర్వచించబడకున్నా బ్రిటిష్ రాజ్యపు



ప్రతినిధిగా వైస్రాయ్ తన సార్వభౌమత్వాన్ని తన ఏజెంటైన బ్రిటిష్ రెసిడెంటు ద్వారా ప్రయోగిస్తూనే ఉండేవాడు. ఐతే హైద్రాబాద్‌లో చట్టాలు చేయాలని మాత్రం బ్రిటన్ ఎన్నడూ భావించలేదు. బ్రిటిష్ రాజ్యంలో భాగంగా కూడా హైద్రాబాద్ ఎన్నడూ చూడబడలేదు. హైద్రాబాద్ నిజాం డొమెనియన్‌గా భావించబడేది. ఇక్కడి విషయాలు కూడా బ్రిటిష్ విషయాలుగా కాక 'బ్రిటన్ రక్షణలో ఉన్నవి'గా అంతర్జాతీయంగా ప్రకటించబడేవి. హైద్రాబాద్ రాజ్యానికి స్వంత ప్రభుత్వ వ్యవస్థ, శాసన వ్యవస్థ, కార్యనిర్వా హక వ్యవస్థ, న్యాయ వ్యవస్థ ఉండేది. బ్రిటిష్ ప్రభుత్వ ఆనవాళ్ళు కూడా ఇక్కడ ఉండేవి కావు. స్వంత సైన్యం, పోలీసు, కస్టమ్స్, కరెన్సీ, పోస్టు, కమ్యూనికేషన్లు, రైల్వేలు, ఇతర ప్రభుత్వ సేవలు అన్నీ ఉన్న హైద్రాబాద్ సర్వసత్తాక స్వతంత్ర దేశం. దీని సార్వభౌమత్వాన్ని ఏ స్థాయిలో ఎవరూ ధిక్కరించలేదు.

సమయానుసారంగా కుంచించుకుపోతూ బ్రిటన్, ఫ్రాన్స్ దేశాలంతటి వైశాల్యంగల హైద్రాబాద్ సంస్థానం చివరికి బ్రిటనంత చిన్నదిగా మారి పోయింది. భౌతిక, ఆర్థిక, వ్యక్తిగత బలహీనతలతో నిజాం రాజులు కాలక్రమేణా రాజ్యభాగాలను వదులుకోవలసి వచ్చింది. అతి విశాలమైన బేరార్ ప్రాంతాన్ని, కడప, కర్నూలు, బళ్ళారి, అనంతపురం జిల్లాలతో కూడిన దత్త మండలాన్ని, అత్యంత ప్రాధాన్యం వహించగల హైద్రాబాద్ రాష్ట్ర తూర్పు ప్రాంత జిల్లాలను సంస్థానం వదులుకుంది. తద్వారా సముద్ర తీరం లుప్తమై మిగతా ప్రపంచంతో నేరుగా సంబంధాలు నెరపలేని పరిస్థితి దాపురించింది. అలా విశాలమైన హైద్రాబాద్ రాజ్యం ఎనభై మూడువేల చదరపు మైళ్ళ విస్తీర్ణానికి, పద్దెనిమిది మిలియన్ల జనాభాకు పరిమిత మవడమే కాకుండా సముద్ర తీరానికీ, తద్వారా వచ్చే ప్రపంచ సంబంధాలకు

భారతదేశంపై ఆధారపడవలసి వచ్చింది. సమృద్ధమైన ఖనిజ సంపద, ఆహార ధాన్యాలు, పత్తి, నూనెగింజల ఎగుమతులతో ఆర్థికంగా బలిష్టమై, భారతదేశంలోని ఇతర ప్రాంతాలతో పోల్చినప్పుడు పారిశ్రామికంగా ఎంతో ముందంజలో ఉన్న హైద్రాబాద్‌పై అందరూ ఈర్ష్యపడి చచ్చే పరిస్థితి నుండి మతవాదులైన అఖిల భారత కాంగ్రెసు నాయకుల స్వాతంత్ర్య భ్రమలు నిజం అయ్యే దిశగా సంస్థానం బలహీన పడింది.

భారత స్వాతంత్ర్య చట్టం, 1947 వచ్చిన తర్వాత స్నేహ సహకారం పేరుతో హైద్రాబాద్‌పై కొనసాగుతున్న బ్రిటిష్ ఆధిపత్యం ఒక్కసారిగా ఆగిపోయింది. అప్పటివరకు అమలులో ఉన్న ఒప్పందాల తాలూకు హక్కులు, బాధ్యతల నుండి బ్రిటన్ తనను తాను ఉపసంహరించుకుంది. ఏకపక్షంగా బ్రిటిష్ వారు ఒప్పందాలన్నీ వదిలివేసుకున్నందున ఆరోజు నుండి హైద్రాబాద్ రాజ్యం సర్వ స్వతంత్ర దేశంగా మారింది. నిజాం స్వతంత్ర ప్రభువుగా కొనసాగగలిగే అవకాశం వచ్చింది.

1911లో అధికారంలోకి వచ్చిన ప్రస్తుతపు ఏడవ నిజాం మీర్ ఉస్మాన్ ఆలీఖాన్ అసఫ్‌జాహీ రాజవంశంలో ప్రత్యేకమైన పరిస్థితిని ఎదుర్కొన్నారు. ఒక రాజుగా శతాబ్దిలో మూడవ భాగపు కాలపు అనుభవం ఆయనకు దక్కింది. బయటి ప్రపంచానికి ఆయనొక విశాలమైన రాష్ట్రానికి నిరంకుశ ప్రభువు, ప్రపంచంలోనే ధనవంతుడైన వ్యక్తి. ఆయనకు అంత పేరుప్రతిష్టలు ఎలా వచ్చాయనేది వివరించడం కష్టం. బయటి ప్రపంచం తన గురించి ఏమనుకుంటుంది, ఏం రాస్తుంది అనే దాన్ని ఆయన పెద్దగా పట్టించుకునేవారు కాదు. చాలామంది పత్రికల వాళ్ళ దృష్టిలో అత్యంత ధనవంతుడయి కూడా అంతుచిక్కని వ్యక్తిగా ఆయన మిగిలిపోయాడు. నిజానికి ఆయన నిగూఢమైన మనిషి కాదు. రాష్ట్రపు ఆర్థిక వ్యవస్థ, ఆయన పెట్టుబడులు స్వల్పమేకానీ ధన సంపద మాత్రం ఎక్కువ. నిజాంకు పూర్వీకుల నుండి వచ్చిన రకరకాల వైవిధ్యభరితమైన నగలు, విలువైన 'జాకోబ్ డైమండ్' నుండి సాధారణ ఆభరణాల వరకు ఉండేవి. విలువైన చారిత్రక ప్రాధాన్యతగల పురాతన వస్తువుల సముదాయమే ఉండేది. అలాంటి వస్తు సముదాయం విలువ ఎంత అని ఎప్పుడూ అంచనా వేయలేదు, అది ఎవరూ ఊహించలేనిది కూడా. నిజాం వార్షికాదాయం రెండుకోట్ల యాభైలక్షల రూపాయలు– అంటే ఆరు నుండి ఏడు మిలియన్ డాలర్లకు సమానం. ఆయనకు ఆదాయపు పన్నుకాని, ఇతర పన్నులుకానీ ఏవీ లేవు. ఆ కోణంలో ఆయన ప్రపంచంలోనే ధనవంతుడు. ఇంత ఆదాయంలోనూ ఆయన



పొదుపు చాలా తక్కువగానే ఉండేది. ఆదాయ మంతా బంగారం, కరెన్సీల రూపంలోనే ఉండేది, అది భారత ప్రభుత్వ, హైద్రాబాద్ ప్రభుత్వాలలోని స్థానిక బ్యాంకులలో తక్కువ వడ్డీకి సెక్యూరిటీల రూపంలో, టైం డిపాజిట్ల రూపంలో పెట్టబడేది. పూర్వీకుల నుండి వచ్చిన ఆభరణాలు, విలువైన వస్తువులు, విస్తారమైన జామీను, నిలువ ఉన్న నగదుతో కలిపి 400 నుండి 500 మిలియన్ రూపాయలు లేదా వంద మిలియన్ డాలర్ల వరకు ఉంటుందని నా అంచనా. వ్యక్తిగత, కుటుంబ అవసరాలను తగ్గించుకొని చిన్న మొత్తంలో కూడా పొదుపు చేయడం ఆయనకొక వ్యసనంగా మారింది. చివరికి అలా పొదుపు చేసిన సొమ్ము చాలా తక్కువేనని తేలింది. అందుకు ఆయన త్యజించిన సౌఖ్యాలు, మోసిన చెడ్డపేరే ఎక్కువ అయింది. డబ్బుకోసం ఆయన ప్రయత్నం, దానిపై ఆయన కున్న ఆసక్తి ఊహకు అందనిది. వాళ్ళ నాన్న దాతృత్వం గురించి తరచుగా అందరూ జ్ఞాపకం చేసుకుంటూ ఆదాయాన్ని లెక్కచేయకుండా ఖర్చు పెట్టేవాడని  కొనియాడేవాళ్ళు.

నిజాం నవాబు సరళమైన అలవాట్లున్నవాడు. కొద్దిగా మామూలు భోజనం చేసేవాడు. రోజంతా చాయ తాగుతూ, చైన్‌స్మోక్ చేస్తూ ఉండేవాడు. రోజూ పొద్దున, సాయంత్రం కొద్ది డోసులో నల్లమందు తీసుకోవడానికి అలవాటుపడ్డాడు. దినచర్యకు

కట్టుబడి నిమిషమైనా తేడా రాకుండా చూసుకునేవాడు. సంస్థానం వెలుపలి, బయటి రాజకీయాలను స్పష్టంగా తెలుసుకుంటూ ఉండేవాడు. పత్రికలు, జర్నల్స్‌ను బాగా అధ్యయనం చేసేవాడు. అప్పుడప్పుడు కవిత్వం రాస్తూ ఉండేవాడు. పెద్ద కుటుంబ పరివారము, అంతఃపురము ఉన్నప్పటికీ ఆయన ఏకాంత జీవి. మధ్యాహ్నం పూట నగరంలో కారు రైడింగు తప్ప మిగతాదంతా సాధారణ జీవితమే. 60 సంవత్సరాలకి (1940 నాటికి) పైబడ్డ బక్కపలుచటి మనిషి ఐనప్పటికీ మానసికంగా, ఇతరత్రా చాలా చురుకైనవాడు. మొదట డబ్బుకు తర్వాత తన వ్యక్తిగత ఆధిపత్యానికే ప్రాధాన్యతనిచ్చేవాడు. వయసు పెరిగినకొద్దీ ఆయన అధికార కాంక్ష ఎంతగా పెరిగిందంటే ఈర్ష్యతో ప్రభుత్వానికి కూడా స్వేచ్ఛనివ్వకపోయేవాడు.

ప్రభుత్వం ఏదైనా మంచిపనిచేస్తే సహించలేక, అందులో లోపాలు వెతుకుతూ తరచుగా బహిరంగంగా విమర్శిస్తూ అణచివేసేవాడు. అదే సందర్భంలో ప్రభుత్వం బలహీనంగా అసమర్థంగా ఉంటే అసంతృప్తితో ఎలాంటి చర్యకైనా వెనుకాడేవాడు కాదు. ఇవి ఆయనలోని వింత ధోరణులు కాగా బ్రిటన్ రాజ ప్రతినిధుల న్యాయమైన, అన్యాయమైన డిమాండ్లకు మాత్రం తన శక్తికీ, అధికారానికీ మించి బహిరంగంగానే తలొగ్గక తప్పేది కాదు. ఆయనను ఎలా ఆడించాలో ఎలా అణచిపెట్టాలో బాగా తెలిసిన బ్రిటిష్ వాళ్ళు, తమ అవసరాలు నెరవేర్చుకోవడం కోసం ఆయన చేసే 'అతి'ని కూడా కళ్ళు మూసుకొని భరించేవాళ్ళు. వాళ్ళు చాలా ఖాళీగా ఉన్నప్పుడు ఆయన బలహీనతలను ఆసరా చేసుకొని ఆయనకు నష్టం కలిగించదగ్గ, ఇబ్బంది పెట్టదగ్గ ఏ అవకాశాన్నీ వదులుకోలేదు. 'రెసిడెంటు' పేరుతో ఉన్న బ్రిటిష్ రాజ ప్రతినిధుల ఏజెంటు ఎప్పుడూ నిజాంకు కష్టాల కారకుడుగా మిగిలిపోయాడు. కాలక్రమేణా బ్రిటిష్ రెసిడెంటు నిజాంకు అవశ్య క్లేశంగా మారిపోయాడు.

సందర్భానుసారంగా తను చేసే 'అతి'కి అడ్డురాకుండా, తన వ్యక్తిగత ప్రజాదరణ తగ్గకుండా, తన రాచరికపు ఔన్నత్యానికి భంగం వాటిల్లకుండా మంచి పరిపాలన చేయగల మంత్రివర్గాన్ని ఏర్పరచే దిశగా నిజాం తన క్యాబినెట్‌ను తరచూ మార్చుతూ వచ్చాడు. తరచుగా అత్యుత్సాహంతో కొత్త మంత్రులను నియమిస్తుండడమూ, మంత్రులు కూడా అదే ఉత్సాహంతో బాధ్యతలు స్వీకరిస్తూ అతికొద్ది కాలంలోనే అసంతృప్తికి గురవుతుండడం జరిగేది. ఇలా స్థిరత్వం లేని పాలనలో ఏ మంత్రీ తన పనిమీద శ్రద్ధ పెట్టలేకపోగా తనచర్యలు ఎంత తొందరలో బజారున పడతాయో, తన మంత్రి పదవి ఎప్పుడు ఊడిపోతుందో అనే ఊగిసలాటలో ఉండే వారు. నిజాం అధికారంలోకి



రాగానే సాలార్‌జంగ్‌ను నియమించుకున్నాడు కానీ ఆయనతో ఎన్నడూ సంతోషంగా లేడు. సాలార్‌జంగును చిన్నచిన్న విషయాలలోనే తప్ప మిగతా పెద్ద వ్యవహారాలలో బ్రిటిష్ సలహాలనే తీసుకునే వాడు. తర్వాత నిజాం తండ్రి వద్ద చాలా కాలం పనిచేసిన కిషన్ పెర్షాద్ వచ్చాడు. అందరినీ స్తుతించడంలో దిట్ట అయిన కిషన్ పెర్షాద్ పెద్ద కాలమే పనిచేసాడు. ఆ తర్వాత అలసత్వానికి మారుపేరుగా నడుస్తున్న పాలనను చక్కదిద్దడం కోసం స్వయంగా నిజామే ప్రధాని బాధ్యతలు స్వీకరించాడు. సందర్భం ఆయనకు బాగానే కలిసి వచ్చింది. తను బాగానే పనిచేయగలిగాడు. తన ఉద్దేశ్యాలను, లక్ష్యాలను ముందుకు తీసుకు పోవడంలో విజయం సాధించాడు. ఆయన ఆలోచనల ప్రకారం ప్రధాన మంత్రికి వచ్చే ఆకర్షణీయమైన వేతనం కూడా ఆయనకే వచ్చింది. శాశ్వతంగా తను ఆ పదవిని నిర్వహించాలనే అనుకున్నాడు నిజాం, కానీ రాజ ప్రతినిధి అందుకు ఒప్పుకోలేదు. అధికారమూ మరియు వేతనంతో కూడిన ప్రధానిని నియమించడానికి ఒప్పుకోక తప్పని పరిస్థితి వచ్చింది.

బ్రిటిష్ ఇండియాలో పేరున్న న్యాయవాది, రాజకీయ ఆసక్తిగలిగిన సర్ అలీ ఇమామ్ గొప్ప అంచనాలతో ప్రధానిగా నియమించబడ్డాడు. ఆయన ప్రధానిగా నియామకం కాగానే మంత్రిమండలి ఏర్పాటయింది. పరిపాలనలో కొన్ని సంస్కరణలు ప్రవేశపెట్టబడ్డాయి. మంత్రులు, అధ్యక్షుడు (ప్రధానికి కొత్త పేరు పెట్టారు), మంత్రి మండలి మరియు నిజాం మధ్య అధికారాల విభజన జరిగింది. ఈ ఏర్పాటుచేసిన

బ్రిటిష్ వాళ్ళు సంతృప్తిగా ఊపిరి పీల్చుకున్నారు. ఆ సమయంలో వారికి ఇండియాలో చాలా తలనొప్పులున్నందువల్ల ఇమామ్ ఇక్కడి వ్యవహారాల్ని చూసుకుంటాడని వారి నమ్మకం.

అలీ ఇమామ్ దూరదృష్టిగల రాజకీయ నాయకుడు. కానీ ఆయనకు కార్యనిర్వహణలోగాని, పరిపాలనలోగానీ అనుభవం లేకపోవడంవల్ల ఇబ్బంది తలెత్తుతుండేది. ఈ ఇబ్బందిని అధిగమించడం కోసం రాష్ట్రం బయటి నుండి ఉద్యోగులను పెద్ద సంఖ్యలో దిగుమతి చేసుకున్నాడు. ఆ చర్య సహజంగానే చాలా చెడ్డపేరు తెచ్చి పెట్టింది. అలా దిగుమతి అయిన కొందరు అధికారుల అవివేకపు పనులు, చెడ్డపనుల వల్ల వ్యక్తిగతంగా ఇమామ్‌కు చెడ్డపేరు వచ్చింది. వ్యక్తిగత మేధస్సు, నిజాయితీ ఎంత ఉన్నప్పటికీ ఇమాం ప్రయత్నాలేవీ ప్రశంసాపాత్రం కాలేకపోయాయి.

హైద్రాబాద్ సంస్థానంలో ముస్లింలు చాలా తక్కువ సంఖ్యలో ఉన్న మైనారిటీలని అలీ ఇమాం తొందరలోనే గమనించాడు. ముస్లింలు, నిజాం రాజవంశం మనుగడ కోసం భారతదేశపు ఇతర ప్రాంతాల నుండి హైద్రాబాద్‌కు ముస్లింల వలసలను ప్రోత్సహించాలని; విశాలమైన, తక్కువ జనాభా గలిగిన సంస్థానపు ఉత్తర మరియు ఈశాన్య ప్రాంతపు జిల్లాలలో వారిని స్థిరపరచాలని భావించాడు. తదనుగుణంగా ఆయన ఒక వలసల పథకాన్ని ప్రారంభించాడు. అలాంటి వలసల నుండి ఎకరాకు ఇంత అని రాయల్టీ వస్తుందని నిజాంకు చెప్పి దీన్ని ఆకర్షణీయమైన పథకంగా మార్చాడు. వలసలకు కేటాయించిన భూములలోని ఖనిజ సంపద, కలప మీద వలసదారులకు హక్కు కల్పించాడు. పథకం యొక్క అసలు ఉద్దేశ్యం తెలియని ధనికులైన వ్యాపారులు బొంబాయి, ఇతర ప్రాంతాల నుండి వచ్చి వందల, వేల ఎకరాల భూములకు రాయల్టీ చెల్లించి స్వంతం చేసు కున్నారు. అలా నిజాంకు కొంత డబ్బు వచ్చింది కాని వలసలు ఏర్పాటు కాలేదు. అలీ ఇమాం ఆశించినట్లు ఎలాంటి వలసలు రాలేదుగానీ, ఆదాయాన్నిచ్చే ఉద్యోగాల కోసం కొన్ని కుటుంబాలు హైద్రాబాద్ నగరానికి వచ్చాయి.

ఒకానొక సందర్భంలో కాశ్మీరు సంస్థానాన్ని, హైద్రాబాద్ సంస్థానాన్ని పరస్పరం మార్పిడి చేసుకోవాల్సిందిగా ఆగాఖాన్ గట్టిగా సలహా ఇచ్చినట్లు చెబుతారు. ముస్లింల జనాభా అధికంగా ఉన్న కాశ్మీర్‌లో నిజాం నవాబులకు కొనసాగింపు స్థిరంగా ఉంటుందని ఆయన వాదన. ఆగాఖాన్ ఆలోచనా విధానం ఎలా ఉన్నప్పటికీ

అప్పుడున్న పరిస్థితులకు అది సరిపడలేదు. ఒకే స్వభావం గలిగిన హిందూ, ముస్లిం సమాజాలు అలాంటి నిర్ణయం తీసుకోవలసిన అవసరాన్ని కల్పించలేదు. పైగా ఏడు శతాబ్దాలకు పైబడిన పాలనలో ముస్లింల అవసరాలు, చారిత్రక, ధార్మిక, సాంస్కృతిక, భౌతిక వ్యవహారాలు హైద్రాబాద్‌తో ముడిబడిపోయాయి. ఏ అవసరం కోసమూ వదులుకోలేనంత బలీయమైన సంబంధాలవి. తన భార్యలు, పిల్లలు, వస్తువులతో కదిలిపోయి జమ్మూ కాశ్మీర్ రాజధాని పాలెస్‌లో చేరిపోవడమన్నది ఒక్క నిజాంకే సంబంధించిన విషయంకాదు. దానికి తోడు అనేక దయనీయమైన విషయాలుంటాయి. రెండున్నర మిలియన్ల మైనారిటీ ముస్లిములుంటారు.

ఎంతో సూక్ష్మబుద్ధిగల నిజాం దీనిని ఎప్పుడూ గంభీరంగా తీసుకోలేదు, దాని గురించి ఆలోచించ లేదు. ముస్లింల అల్ప సంఖ్యాకతను ఆయన ఎప్పుడూ పెద్దగా పట్టించుకోలేదు. రోజువారీ కార్యకలాపాలలో తలమునకలయ్యే నిజాం తన మంత్రులు బహు అరుదుగా చేసే మంచి పనులతో గొప్పగా సంతృప్తి చెందేవాడు. ప్రతి మూడు వారాలకొకసారి బ్రిటిష్ రెసిడెంటుతో తన కలయిక పట్ల ఆయనకు ఎంతో శ్రద్ధ ఉండేది. ఆ కలయిక బాగా జరిగినా బాగా జరగకపోయినా ఆయనకున్న ఇతర సమస్యల మీద దాని ప్రభావం తప్పకుండా పడేది. పోలీసు ఉన్నతాధికారి రోజువారీ సంఘటనల నివేదికను ప్రతిరోజు ఉదయాన్నే నేరుగా ఆయనకే సమర్పించేవాడు. కొన్నిసార్లు ప్రధానమంత్రికి గానీ, సంబంధిత మంత్రికి గానీ తెలియకముందే ఆయన తెలుసుకొనేవాడు. బహదూర్ యార్ జంగ్ గానీ ఇతర రాజకీయ నాయకులు ఎవరైనా కానీ ఆయన ప్రభుత్వాన్ని తిట్టిపోస్తే ఆయన ఎంతో సంతోషించేవాడు. అలాంటి ప్రకటన లేదా ఉపన్యాసంలోని ప్రతి పదాన్ని చాలా ఆసక్తితో చదివేవాడు. కానీ వ్యక్తిగతంగా తన గురించి ఏమైనా వస్తే మాత్రం అదెంత సాధారణమైన వ్యాఖ్యానమైనా, పరోక్షమైన విమర్శ అయినా ఎంతో ఆందోళనకు గురయేవాడు.

పాలకుడిగా నిజాం అన్ని విషయాలూ తెలుసుకుంటూ ఉండేవాడు. తెల్లవారు జామునే తన దినచర్యను మొదలుపెట్టి వార్తాపత్రికలను శ్రద్ధగా చదివి స్వయంగా ముఖ్యమైన వార్తల 'నోట్' తయారు చేసుకునేవాడు. సాధారణంగా ఇంగ్లీషు పేపర్లు చదివేవాడు. స్థానిక దినపత్రికలతోపాటు, 'మీజాన్' ఇంగ్లీషు ఎడిషన్, 'రహబర్' ఉర్దూ ఎడిషన్ ఆయనకు ఇష్టమైనవి. తర్వాత ఇతర పత్రికలు ముఖ్యమైన వార్తల మార్కింగులతో ఆయనకు సమర్పించబడేవి. తనకు ఆసక్తి ఉన్న జర్నల్సు, పుస్తకాలు కూడా చదివేవాడు. నగరంలో స్థానికంగా జరిగే చిల్లర ముచ్చట్లు, చిన్నచిన్న గొడవల

గురించి కూడా తెలుసుకుంటూ ఉండేవాడు. దర్బారులోని మనుషుల ద్వారా ఇలాంటి విషయాలు ఆయనకు చేరుతూ ఉండేవి. పోలీసు ఉన్నతాధికారి కూడా కొంత సమాచారం చేరవేసేవాడు. రోజూ అర్ధగంటపాటు పోలీసు అధికారి తోనూ, ఒకటీ రెండు గంటలు దర్బారీలతోనూ ముచ్చట్లయిన తర్వాతే ఆయన విశ్రాంతికి మళ్ళేవాడు. ఇష్టం వచ్చిన ముచ్చట్లు నడుస్తూ ఉండేవి ప్రొద్దుటిపూట. పెద్దపెద్ద అంతర్జాతీయ రాజకీయాల నుండి మొదలుపెట్టి కొత్తగా కుదరబోతున్న పెండ్లి సంబంధాల వదంతుల దాకా, ఎవరు ఎవరి బిడ్డ పెండ్లికి ఎంత కట్నమిచ్చారు, ఏ పెండ్లికి ఎంతమంది చుట్టాలొచ్చారు, ఏ డాక్టరమ్మ ఏ డెలివరీ కేసుకు అటెండయింది లాంటి పిచ్చాపాటి ముచ్చట్లు ఎన్నో నడుస్తుండేవి దర్బారులో. దర్బారీలు పసందైన ముచ్చట్లు ఎత్తుకొని వచ్చేవాళ్ళు. దర్బారుకు వచ్చేవాళ్ళలో ఎవరి రాజకీయాలు వాళ్ళకుండేవి. అయితే నిజాం మాత్రం తన సూక్ష్మ దృష్టితో తనను ప్రభావితం చేయడానికి ప్రయత్నించే వాళ్ళ మాటలను ఇట్టే పసిగట్టేవాడు. ఎంతవరకు రానివ్వాలో అంతవరకు రానిచ్చి శృతిమించబోయేవాళ్ళను వెంటనే అదుపులో పెట్టేవాడు.

ఈ దర్బారీల వల్ల ప్రతి ప్రధానికి కొంత ఇబ్బంది కలగడమే కాకుండా కొన్ని సమస్యలు కూడా వచ్చేవి. దర్బారులో మాట్లాడేది, చర్చించేది అందరికీ తెలిసిపోతూనే ఉండేది. దర్బారు మనుషుల్లో మంత్రుల, ప్రధానమంత్రుల మనుషులు కూడా ఉండేవారు. దర్బారు ముచ్చట్ల సారాంశం మంత్రులకు తెలిసిపోవడమే కాకుండా నవాబు దృష్టిలో తామెలాంటి వారిగా ఉన్నామో కూడా వాళ్ళకొక సూచన దొరుకుతుండేది. అయితే నిజాం ఏది బయటికి చెప్పబోతున్నాడో ఏది రహస్యంగా ఉంచనున్నాడో మాత్రం ఎవరికీ తెలిసేది కాదు. బహు అరుదుగా రాజకీయంగాగానీ, పరిపాలనాపరంగాగానీ తాను తీసుకోబోయే నిర్ణయానికి సంబంధించిన చర్చ ఒకరోజు ముందు నగరంలో పాకిపోయేది. ఎక్కువ సందర్భాలలో మాత్రం ఎవరు ఎంత గింజుకున్నా తన మనసులో మాటను బయటపడనిచ్చేవాడు కాదు.

బహద్దూర్ యార్‌జంగ్ సెలవుల్లో పోతే నిజాం ఈర్ష్యతో మండిపడేవాడు. ఒకటీ రెండు సందర్భాలలో ప్రభుత్వం ఆయన మీద చర్యకు ఉపక్రమిస్తే నిజాం ఎంతో సంతోషంతో ఎండార్సు చేసాడు. రెచ్చగొట్టే ఉద్దేశ్యంతో ఎవరైనా కొద్దిపాటి ఆరోపణలు చేస్తే ప్రభుత్వం ఉదాసీనంగా వ్యవహరిస్తే నిజాం అసంతృప్తితో, అసహనంతో రగిలిపోయేవాడు. ఏ నాయకుడు ప్రజాభిప్రాయాన్ని చూరగొని తనకు చెడ్డపేరు తీసుకురాగలిగే స్థాయికి ఎదుగుతున్నాడో అని ఆయన అవగాహన కలిగి ఉండేవాడు. బహద్దూర్ యార్‌జంగ్ 'హైద్రాబాద్‌కు ముస్సోలినీ' అవుతాడని ఎవరో

అంటే అది నిజమే అవుతుందని నమ్మి తద్వారా ముందుముందు చెడ్డపేరు వచ్చి తనకు గోతులు తవ్వలేని పరిస్థితిలో పడతాడని సంతోషించాడు. అదే సందర్భంలో తన స్వంత మంత్రుల మీద నిఘా కోసం కూడా బహద్దూర్ యార్‌జంగ్‌ను ఉపయోగించుకున్నాడు. హిందువులా, ముస్లింలా అన్న తేడా లేకుండా పేరున్న నాయకులందరి మీద ఇలాంటి ఏర్పాట్లే చేసిపెట్టుకున్నాడు నిజాం.

నిజాం మంచి రాజకీయ అవగాహన గలిగినవాడు. హేతుబద్ధమైన ఆలోచనలో, వాస్తవాల విశ్లేషణలో, సంఘటనల్లో పురోగతిని అంచనా వేయడంలో ఆయన దిట్ట. ఒక అవగాహనకు వచ్చాక ఆయన సత్వరం చర్యలు తీసుకునేవాడు. కొన్ని సమయాల్లో తొందరపడేవాడు కూడా. ఆయన మత స్వభావంతో ఉండేవాడు కానీ ఇతరుల నమ్మకాల్ని, అభిప్రాయాల్ని గుర్తించి గౌరవించడంలో అద్భుతమైన ప్రజ్ఞ కనబరచేవాడు. వ్యక్తిగత స్వేచ్ఛను చాలా గౌరవించే వాడు. తనకు ఇష్టంలేని విషయాలు ఎన్నో జరిగాయి కానీ అందుకు కారణమైన వ్యక్తులు వారి వ్యక్తిగత అభీష్టం మేరకు మాత్ర మే అలా ప్రవర్తించినందున అందులో తల దూర్చే హక్కు తనకు లేదని భావించేవాడు. తన అధికారిక కార్యభారాన్ని చూసి విసుగు చెందకుండా అవగాహన, నమ్మకం ఆధారంగా నిర్వర్తించేవాడు. మెదడు మీద సమస్యలు లేకుంటేనే ఆయన అసంతుష్టిగా ఉన్నట్లు అనిపించేది. ఆయన దగ్గర ఆలస్యమైన పని ఏదన్నా ఉందంటే అది ఆయన ఆఫీసువల్లనే కానీ ఆయనవల్ల కాదు. చాలా అరుదుగా ఏదైనా కేసు తన దగ్గర ఆగి పోయిందంటే అది పరిపాలనాపరమైన లేదా రాజకీయపరమైన గంభీరమైన కారణాల వల్లనే.

తిరుగులేని నియంతృత్వం, సందర్భానుసారంగా బయటపడే 'అతి' ఉన్నప్పటికీ రాజ్యాంగం పట్ల, సరియైన నిబంధనల పట్ల ఆయన ఎంతో గౌరవభావంతో ఉండేవారు. ఏదైనా ప్రతిపాదన ప్రాథమికంగా తప్పని కాని, అసంగతమైందని కాని అనిపిస్తే వివరణల కోసం వెనక్కి పంపించే వాడు లేదా పునర్విచారణ కోసం అడిగేవాడు కానీ నిబంధనలను ఎప్పుడో ఒకమారు తప్ప విచక్షణారహితంగా అతిక్రమించేవాడు కాదు. అతి పెద్ద తప్పిదం ఉంటే తప్ప ప్రభుత్వ ప్రతిపాదనలను తిరస్కరించే వాడు కాదు. తనకు వ్యక్తిగతంగా ఇష్టంలేని ప్రతిపాదనలను కూడా తనకు వ్యక్తిగతంగా నష్టం చేయనంత వరకు ఆమోదిస్తూనే ఉండేవాడు. ఆయనకున్న హక్కుల ప్రకారం తరచూ ప్రభుత్వం మీద పెత్తనం చేయవచ్చు, కానీ ఆయన ఆ ఆధిపత్యాన్ని వదులు కున్నాడు. ఆయన లక్ష్యసాధన మార్గాలన్నీ తిన్నగాకాక పరోక్షంగానే ఉంటాయి కానీ ఆయన తనను తాను రాజ్యాంగ పరిధిలోని నిబంధనల కిందే ఉంచుకున్నారు.

ఎంతో సహనశీలి ఆయన. నిజాం చాలా తక్కువ సమయాల్లోనే కోప్పడేవారు.

సరియైన దృష్టి పెట్టక, సరిగ్గా అవగాహన చేసుకోలేకపోయిన విషయాలలో మాత్రం ప్రభుత్వానికి ఖచ్చితమైన సూచనలిస్తుండేవాడు. ఇత్తెహాదుల్ మీద ఆయనకు మిశ్రమ అభిప్రాయాలుండగా, బయటి నుండి వచ్చిన సంఘమైన స్టేట్ కాంగ్రెసు అంటే ఆయనకు అయిష్టం. పెద్ద నాయకులు ఇచ్చే ఉపన్యాసాల్ని, ప్రకటనల్ని శ్రద్ధగా పరిశీలించే వాడు. వాటి మీద తన స్వంత అభిప్రాయాల్ని ఏర్పరచుకునే వాడు. శ్రద్ధగా వరుసగా వాటి సంఘటనల వివరాల్ని పొందుపరచుకునేవాడు. చాలా అద్భుతమైన జ్ఞాపకశక్తితో తనకు కావలసిన రికార్డులను క్షణాల్లో వెతికి తీసేవాడు.

ఇత్తెహాద్ సంస్థతో నిజాంకు రహస్య ఒప్పందాలున్నాయని కొందరు తరచుగా ఆరోపిస్తుండేవారు. ఇలాంటి ఆరోపణలు చేసేవారు నిజాం తన కుటుంబంతో సహా ఎవరినీ సహించలేనంత ఈర్ష్యగల్గిన నియంత అన్న సంగతిని మరిచిపోయేవారు. విశాలమైన ప్రజాస్వామిక రాజకీయ ఉద్యమాలేవీ నిజాంకు నచ్చవు. ఆయన ఎవరితోనూ కలవడు. నిజమేమిటంటే ఇత్తెహాద్ గురించి ఆయన వ్యక్తపరిచిన బహిరంగ అభిప్రాయాలు నిజం. అంతకంటె ఎక్కువగానీ తక్కువగానీ ఏమీలేదు. రాజకీయ పోరాటాన్ని ఆయన నమ్మలేదు. తరచుగా ఖాసీం రజ్వీ ఉపన్యాసాలను ఆరా తీస్తుండేవాడు. ఖాసింరజ్వీ కొన్ని ఉద్రేకపూరితమైన ప్రసంగాలు చేసినప్పుడు ఇలాంటి ప్రకటనలు సహించేది లేదని రహస్యంగానైనా చాలా నిక్కచ్చిగా చెప్పాడు. నెహ్రూ, పటేల్ నాయకత్వంలోని భారత ప్రభుత్వం ధోరణివల్ల ఖచ్చితమైన ఏ చర్యా తీసుకోలేని పరిస్థితి తలెత్తింది. రోజురోజుకూ మారుతున్న బలీయమవుతున్న పరిస్థితుల వల్ల ఆయన రిస్క్ తీసుకొనే శక్తిని కోల్పోయాడు.

నిజాం జీవితకాలపు ఆసక్తి అంతా స్వంత డబ్బు, సంపద, అధికారం మీదే. మిగిలినవన్నీ ఆయనకు రెండవ ప్రాధాన్యాలే. తన హోదాను, అధికారాన్ని ప్రశ్నించని సంస్థలు, సంఘాలు అన్నీ ఆయనకు మంచివే. లేదా ప్రాచ్య దేశాల సాంప్రదాయం ప్రకారం అలాంటి సంస్థలను మచ్చిక చేసుకునే మార్గాలను వెతికేవాడు. తనను అగౌరవపరచిన, తనకు వెనక గోతులు తవ్విన బ్రిటిష్ రెసిడెంటు అన్నా, రాజ ప్రతినిధులన్నా ఆయన తీవ్రంగా అసహ్యించుకునేవాడు కానీ మౌనంగా భరించాడు. జీవితంలోని సంఘటనలను ఎదుర్కొనే సహనశీలత, ఎలాంటి సందర్భాలలోని వేదననైనా భరించేశక్తి ఆయనకుంది. కొన్ని కఠినమైన, ఆందోళనాపూరితమైన రాజకీయ సందర్భాలలో వాటిని ఏమాత్రం లక్ష్యపెట్టకుండా మిత్రులను, శత్రువులను సమానంగా



తికమకపెడుతూ ఆయన అల్పమైన అంతర్గత కుటుంబ వ్యవహారాలలో మునిగిపోయేవాడు!

ఈ నేపథ్యంలో, ఈ స్వభావంతో ఉన్న నిజాం భారతదేశాన్ని వదిలి వెళ్ళి పోవాలనుకున్న బ్రిటిష్ వారి నిర్ణయానంతర సంఘటనల్ని ఎదుర్కోవలసి వచ్చింది. దేశాన్ని విభజించాలన్న నిర్ణయం జరగడానికన్నా ముందే, హైద్రాబాద్‌ను తమలో కలిపేసుకోవాలన్న కుట్రకు ఇండియన్ కాంగ్రెసు నాయకులు తెర తీసారు. హిందూ దేశం మధ్యలో ఉండబోయే అభ్యుదయ, అర్ధ స్వతంత్ర ముస్లిం రాజ్యాన్ని హిందూ నాయకులు సహించలేక పోయారు. నిజాం ఈ శక్తుల పట్ల ఎలా ప్రతిస్పందించాడు, అతి ముఖ్యమైన వేగవంతమైన ఈ సంఘటనల్ని ఎలా ఎదుర్కొన్నాడన్నది తరువాతి అధ్యాయాల్లో చూద్దాం.


# 4. స్టేట్ కాంగ్రెస్, హిందూ మహాసభ ఇతర సంస్థలు

కలగాపులగమైన దేశీయ మతతత్వంతో నిండి ఉన్న అవిభక్త భారత దేశపు బహుముఖీన రాజకీయ పోరాటాలన్నింటి ఒకే ఒక లక్ష్యం కేవలం ఆంగ్లేయ పాలనను ఒదిలించుకోవడం. అఖిల భారత కాంగ్రెసులోని భిన్నమైన వ్యక్తుల్ని కూడా ఈ లక్ష్యమే ఒక తాటిమీదికి తెచ్చింది. ఈ ఒక్క లక్ష్యంతో కాంగ్రెసు బహిరాంతరాల్లో కూడా బలపడింది. లేకపోతే, ఉపఖండంలో మిలియన్ల కొద్దీ జనాభా ఉన్న కులమతాలు పరస్పరం అపనమ్మకాలతో, హిందూమతంలో అణగదొక్కబడిన కులాలకు సహజం గానే అగ్రవర్ణ హిందువులపై ఉండే ద్వేషంతో ఆ రాజకీయ సంస్థ అంత విశాలవేదికగా నిలదొక్కుకోగలిగి ఉండేది కాదు. అయితే ఈ నిజం ఆ సంస్థను నడుపుతున్న అగ్రవర్ణ హిందువులకు మాత్రమే తెలుసు, ఇంకెవరూ దీన్ని ఉపయోగించుకోలేకపోయారు.

ఈ కారణాన నిమ్నవర్ణాలపై తమ ఆధిపత్యం, దోపిడీని స్థిరపరుచుకునే దిశగా బ్రిటిష్ పాలనను మరికొంతకాలం పొడిగించడం లక్ష్యంగా అగ్రవర్ణాల ఆధిపత్యంలోని కాంగ్రెసు ప్రయత్నించింది. నిమ్నవర్ణాలు, ఇతర కులాల సందేహాలు ఎప్పటికీ అపరిష్కృతంగానే ఉండిపోయినవి. అగ్రవర్ణాల చేతులలో కేంద్రీకరించబడిన సంపద వల్ల వారి అధికారం నిలబెట్టుకోవడానికి, ప్రభుత్వాలను స్థాపించడానికి ఉపయోగపడ్డది.

వారు నివసించిన ప్రత్యేక పరిస్థితుల వల్ల హిందువులు హైద్రాబాద్‌లో ప్రత్యేకంగానే చూడబడ్డారు. ఇక్కడ హిందువులు చెప్పుకోదగిన గౌరవాన్ని అనుభవించారు. భూములు, వ్యాపారం, పరిశ్రమలు అన్నీ దాదాపుగా వారి చేతుల్లోనే ఉన్నాయి. సజీవమైన ముస్లిం సంస్కృతి విలసిల్లుతున్న కారణంగా హిందూ మతంలోని కులపర మైన అసహిష్ణుత కూడా తక్కువగానే ఉండేది. ఇక్కడ ప్రత్యక్షంగా బ్రిటిషు పాలన లేకపోవడం వల్ల సామాన్య ప్రజలకు 'పరాయిపాలన' అంటే పుస్తక





పరిభాషగానే మిగిలిపోయింది. భారతదేశంలోని ఇతర ప్రాంతాలతో పోల్చినప్పుడు ఇక్కడి ప్రజల ఆర్థిక పరిస్థితి మెరుగ్గానే ఉండేది. సరిపడా ఆహారం, దుస్తులు, వసతి అందరికీ అందుబాటులో ఉండేది. పేదరికం ఉన్నప్పటికీ సామాన్య ప్రజలలో తీవ్రమైన అసంతృప్తి లేదు. అయితే తమ సంఖ్యకు తగినట్లుగా ప్రభుత్వ ఉద్యోగాలలో ప్రాతినిధ్యం లేదనే హిందువులవాదన న్యాయబద్ధమైనదే. ఆ విషయమై వారికెంతో కోపం ఉండేది. నిజాం ముస్లిం కాబట్టే అలా జరుగుతుందనే బాధ కొందరు హిందువులలో ఉండేదికానీ వారి సంఖ్య, వాళ్ళ ప్రభావం చాలా తక్కువ. నిజానికి ప్రజాస్వామ్య ప్రభుత్వపు ఆకాంక్షలు ఆ కాలంలో ఉన్నప్పటికీ శతాబ్దాలుగా సాగుతున్న నిజాం రాచరికం అలాంటి ఆలోచనలకు తలొగ్గలేకపోయింది. తక్షణ ప్రజా ప్రభుత్వపు డిమాండు కొద్దిమంది అగ్రశ్రేణి మేధావులకే పరిమితమయింది. మిగిలిన వాళ్ళకు, సామాన్య ప్రజలకు మాత్రం అదొక సైద్ధాంతిక చర్చలాగే అనిపించేది. ప్రజా బాహుళ్యంలో గొప్ప రాజకీయ పోరాటం రాకపోవడం అనేది అగ్రకుల హిందువులకు ఎంతో కష్టంగా తోచేది. భారతదేశంలోని బ్రిటిష్ పాలిత ప్రాంతాల ఉద్యమకారులతో పోల్చుకొని వీళ్ళు ఊహల్లో తేలిపోయి కార్యక్రమాలు రూపొందించుకొనేవారు. అక్కడ చేసినట్లే చేయబోయి విఫలమై ఇక్కడి ప్రజల అవసరాలకు తగ్గట్లు మసలుకోలేకపోయేవారు.

హైద్రాబాద్‌లో ఎన్నో హిందూ రాజకీయ సంఘాలుండేవి. వాటిల్లో కొన్ని చాలాకాలం కిందటే ఏర్పడ్డవి. కొన్ని ముఖ్యమైన సంఘాలకు ఇక్కడ పెద్ద సంఖ్యలోనే సభ్యత్వముండేది. అయితే వాటికి బ్రిటిష్ ఇండియాలోని సంఘాలతో సంబంధముండడమే కాకుండా వాటి అనుబంధ సంఘాలుగా పనిచేస్తూ, అక్కడి నుండి ఆదేశాలను, ఆర్థిక సహాయాన్ని పొందుతూ ఉండేవి. స్టేట్ కాంగ్రెస్, హిందూ మహాసభ ఇలాంటి వాటిల్లో ముఖ్యమైనవి. ఈ సంస్థల నాయకులు బ్రిటిష్ ఇండియాలో నడుస్తున్న వాటి మాతృసంస్థలకు నిబద్ధులు, అక్కడి మాతృసంస్థలు చేపట్టే కార్యక్రమాలు ఇక్కడ గూడా చేపట్టి ప్రజా మద్దతు పొందలేక విఫల మవుతుండేవారు. అందుకు కారణం బ్రిటిష్ ఇండియాలో వాళ్ళు పోరాడుతున్న సమస్యలు ఇక్కడ నామమాత్రం. అనేక కారణాల వల్ల ఇక్కడి సంస్థల నాయకులు మాతృసంస్థలకు నిబద్ధులయ్యారు. నైతిక, సైద్ధాంతిక అవగాహన కోసమే కాకుండా; ఆర్థికపరమైన, ఎత్తుగడల పరమైన మద్దతు కోసం, కొన్ని సమయాల్లో వ్యక్తిగత అవసరాల కోసం కూడా మాతృసంస్థలపై ఆధార పడేవారు. వారికి హైద్రాబాద్ హిందువుల భావనల పట్ల అవగాహన లేకపోవడమో, పాక్షిక అవగాహన కలిగి ఉండడమో జరిగేది. ఇక్కడి హిందూ సమాజంపై అవగాహన పొందడానికి వారి మాతృసంస్థలకు ఇతరేతర సమస్యల వల్ల సమయం దొరకకపోయి ఉండవచ్చు.

ఈ పరిస్థితుల్లో, హైద్రాబాద్ స్థితిగతుల పట్ల వాస్తవిక అవగాహన లోపించడం వల్ల ఇక్కడి హిందూ రాజకీయ వేదికల నాయకులు తరచూ విఫలమవుతూ ఉండేవారు. అందువల్ల వీరికి మాతృసంస్థల నుండి తరచూ అక్షింతలు పడుతూ ఉండేవి. ఎవరైనా ఇందుకు గల సరియైన కారణాలు విశ్లేషించడానికి ప్రయత్నిస్తే హిందూ సమాజంలో రాజకీయ ఏకాభిప్రాయం లేకపోవడం వల్ల తాము విఫలమవుతున్నామని చెప్పుకొచ్చేవారు. తెలివైన వాళ్ళు తమకు తాముగా ఈ సంస్థలకు దూరంగా ఉండడం వల్ల అవి అశక్తుల, అసమర్థుల చేతుల్లో ఉండిపోయినయి. ప్రతిభావంతులైన సరోజిని నాయుడులాంటి వారు ఇక్కడ జరిగే అసమంజసమైన పోరాటంలో ఉండలేక బ్రిటిష్ ఇండియాలో తమ శక్తిసామర్థ్యాలను ప్రదర్శించారు. గౌరవప్రదమైన కార్యక్రమం ఏదీ చేయకుండా ఇక్కడి హిందూ సంస్థల నాయకులు, సులభసాధ్యమైన మత విద్వేషాలను రెచ్చగొట్టే పనికి పూనుకున్నారు. నిజానికి ఈ ఆలోచన బ్రిటిష్ ఇండియాలోని వాటి మాతృ సంస్థలదే. అయితే స్థానిక నాయకత్వం దానిని శక్తివంచన లేకుండా ప్రయత్నించింది.

మొదట వారి లక్ష్యం నెరవేరినట్లే అనిపించినా మత వాదం లేని ఇక్కడి ప్రజలలో అది పనిచేయలేదని అర్థమయింది. ఈ పాచిక పారక పోవడంతో అబద్ధాలు ప్రచారం చేయడం మొదలుపెట్టారు. హైద్రాబాద్‌లో హిందువులకు తెల్లబట్టలు వేయడానికి కానీ, గుర్రం ఎక్కడానికి కానీ స్వేచ్ఛలేదని ప్రచారం మొదలుపెట్టారు. ముస్లింలు అవినీతిపరులని, హిందూ ప్రజల మీద దాడులు, అరాచకాలు కొనసాగిస్తు న్నారని ప్రచారం చేసారు. ఇలాంటి పచ్చి అబద్ధాలు పుట్టించిన వాళ్ళు తొందరలోనే ప్రజల దృష్టిలో పలుచనయ్యారు. నిజానికి గ్రామాధికార్లంతా హిందువులు, నిరంతరం ప్రజల మధ్యన ఉండేవారు. వారి సాధకబాధకాలన్నీ ముస్లిం ఉన్నతాధికార్లే తీరుస్తారన్న అవగాహన ప్రజలకుంది. అలా ముస్లిం అధికారులు అవినీతిపరులని, క్రూరులని జరిగిన ప్రచారం ఒక జోక్‌గా మారడం వల్ల ఆ ఆరోపణల పట్ల ఎవరూ శ్రద్ధ పెట్టలేదు.

అయితే ఈ ఆరోపణల ప్రభావం హైద్రాబాదేతర భారతదేశంపై పడింది. బ్రిటిష్ ఇండియాలోని హిందువులు హైద్రాబాద్‌లోని హిందువులకు ఏదో ఆపద వాటిల్లిందని, తోటి హిందువులుగా వారికి సాయం చేయాలని భావించసాగారు.

1937లో బ్రిటిష్ వాళ్ళు వాళ్ళ అధికారాన్ని కొంతవరకు భారత ప్రజలకు అప్పజెప్పడానికి సిద్ధపడి ప్రొవిన్షియల్ అటానమిని ఏర్పరిచారు. దాని ప్రకారం ప్రాదేశికమైన వ్యవహారాలకు సంబంధించినంత వరకు ప్రజలు తమకు నచ్చిన పద్ధతుల్లో పరిపాలన చేసుకోవచ్చు. ఇది ఇతర ప్రాంతాలకు వ్యాపించింది. హైద్రాబాదు హిందూ నాయకులు కూడా కొత్త రాజకీయ అవకాశాల కోసం ఎదురు చూడడం మొదలయింది. ప్రొవెన్షియల్ అటానమీ అనేది ఆలిండియా కాంగ్రెస్ విజయంగా చెప్పవచ్చు. తద్వారా వాళ్ళకి రాజకీయాధికారం అందివచ్చింది. హైద్రాబాద్‌కు మూడువైపులా ప్రొవిన్షియల్ అటానమీలలో కాంగ్రెస్ అధికారం పొందడం వల్ల ఇక్కడి కాంగ్రెస్ నాయకులకు నైతిక, వాస్తవిక సహాయం చేయగలిగే స్థితికి చేరుకున్నారు. హైద్రాబాద్ నాయకత్వాన్ని ఎలా బలోపేతం చేయగలమా అని ఆలోచించి కొంత అశాంతియుతమైన వాతావరణాన్ని సృష్టించాలని మొదట అనుకున్నారు. తద్వారా ప్రజల దృష్టిని ఆకర్షించవచ్చున్నది వాళ్ళ ఆశ. అందుకు అనుసరించే మార్గాలు, సాధించవలసిన లక్ష్యాలు తర్వాత నిర్వహించుకుందామనుకున్నారు. బ్రిటిష్ ఇండియాలో సత్యాగ్రహం పేరుతో నిరసనలు చేసి గణనీయమైన ప్రజా మద్దతు కూడగట్టిన కాంగ్రెస్ హైద్రాబాద్‌లో కూడా అందుకు ప్రయత్నించింది. నిజానికి

బ్రిటిష్ ఇండియాలో కూడా సత్యాగ్రహం విజయవంతం కావడానికి చాలా కాలమే పట్టింది.

ఇక హైద్రాబాద్‌లో అయితే బ్రిటిష్ ఇండియాలాంటి పరిస్థితులే లేవు, త్యాగాల అవసరమే లేదు, సత్యాగ్రహాన్ని ప్రచారం చేసే వాలంటీర్లు కూడా లేరు. కాబట్టి ఇక్కడి రాజకీయ సంస్థలు, బయటి నుండి వచ్చే కాంగ్రెస్ కార్యకర్తలు, వాలంటీర్లు కలిసి సంయుక్తంగా ఉద్యమం నడపాలని నిర్ణయించు కున్నాయి. స్టేట్ కాంగ్రెస్, హిందూ మహాసభ, ఆర్య సమాజిస్టులు చేతులు కలిపారు. వారు నడిపిన ఉద్యమానికి స్పందన నిల్. అది ఎప్పుడయినా ఆగిపోయే పోరాటంగానే భావించబడింది. అయితే అదృష్టవశాత్తు చుట్టుముట్టు ప్రావిన్సులలో కాంగ్రెస్ ప్రభుత్వాలు స్థిరపడి, ఇక్కడి ఉద్యమాన్ని కొనసాగించడానికి చాలా ఆసక్తి చూపించారు. కాంగ్రెస్ నిర్ణయాలిలా ఉన్నా మద్రాసు నుండి, సెంట్రల్ ప్రావిన్స్ నుండి ఆశించిన సహాయమేమీ అందలేదు. కాని బొంబాయి పరిస్థితి వేరు. అక్కడి కాంగ్రెస్ ప్రభుత్వంలో ఉద్యమ వ్యవహారాలు అక్కడి హోంమంత్రి కె.ఎమ్.మున్షీ చేతిలో పెట్టబడ్డాయి. ఈ కాలంలో ఆయన సాధించిన ఘనకార్యాల వల్లనే తర్వాతికాలంలో హైద్రాబాద్‌లో 'ఏజెంట్ జనరల్ ఆఫ్ ఇండియా'గా నియమించబడ్డాడు. ఈయన బోంబే ప్రావిన్సు నుండి వేలాది యువ వాలంటీర్లను హైద్రాబాద్ తరలించి, సహాయంచేసి, ఉత్సాహపరిచి అక్కడి ప్రభుత్వ సహాయ సహకారాలందించాడు. నిజానికి ఈ వాలంటీర్ల పని చిన్నది. రాష్ట్రానికి రావడం, పూలమాలలు ధరించడం, ఏదైనా పట్టణానికి వెళ్ళి చట్టాలను ఏదో ఒక పద్ధతిలో ఉల్లంఘించడం. నిజాం జైళ్ళల్లో వాళ్ళని బాగానే చూస్తారని వాళ్ళకు చెబుతుండే వాళ్ళు. వాళ్ళను బాగా చూసేవిధంగా బోంబే ప్రభుత్వం ఏర్పాట్లు కూడా చేస్తుందనేవారు. వాళ్ళ కుటుంబాలకు ఆర్థిక ఇబ్బందులు రాకుండా చూసుకుంటామనే హామీ కూడా ఉండేది.

మొదట ఈ ఉద్యమం హైద్రాబాద్ ప్రభుత్వానికి కొన్ని తలనొప్పులు తెచ్చింది. కొన్ని వేలమంది సత్యాగ్రహుల చొరబాటుతో సరిహద్దుల వద్ద అరెస్టు చేస్తూ భద్రతా చర్యలను పటిష్టం చేయాల్సి వచ్చింది. అయితే బొంబాయి ప్రభుత్వ ప్రోత్సాహం, ఆలిండియా కాంగ్రెస్ ఆర్థికదన్ను, బొంబాయి ప్రభుత్వ ఏజెన్సీల సహకారం ఎంత లభించినప్పటికీ స్థానిక ప్రజా మద్దతు లేకపోవడం వల్ల తగినంత మంది వాలంటీర్లను ఇక్కడ తయారు చేసుకోలేకపోయింది. అందువల్ల బొంబాయి హోంమంత్రి ఉద్యమ ప్రోత్సాహాన్ని వదులుకున్నారు బయటి ఉద్యమ నిర్మాతలు. హైద్రాబాద్ ప్రభుత్వం కూడా ఈ న్యూసెన్సు అంతిమ ఫలితాన్ని అంచనావేసి ఎదురు చూడసాగింది. ఈ

మధ్యకాలంలోనే ప్రభుత్వానికి, రాజకీయ నాయకులకు మధ్య ఉద్యమాన్ని నిలుపుదల చేయాలనే ఒక ఒప్పందం కుదిరింది. ఈ ఒప్పందం కుదరడమే తమ ఘనవిజయంగా ఉద్యమ ప్రేరకులు చెప్పుకున్నారు. హైద్రాబాద్ ప్రభుత్వం తక్షణపు తలనొప్పి తగ్గిందని భావించి ఉద్యమకారుల కోరికలను, మొత్తం వ్యవహారాన్నే కొద్దిరోజుల్లో మరిచి పోయింది.

గతంలో ఎన్నడూలేని మతతత్వ బీజాలను ఈ ఉద్యమం నాటగలిగింది. హిందువులకు, ముస్లింలకు మధ్య విభజన వచ్చింది, ప్రత్యేకంగా బోంబే ప్రావిన్సు దగ్గరగా ఉండే పడమటి జిల్లాల్లో. ఉద్యమం చాలా స్పష్టంగా విఫలమైనప్పటికీ కె.ఎమ్.మున్షీ వంటి బలమైన ఆలిండియా కాంగ్రెస్ నాయకుల అసలు లక్ష్యం నెరవేరింది. ఈ రాష్ట్ర ప్రజలు సత్యాగ్రహాన్ని ఆదరించలేదు.

ఈ ఉద్యమం నిజాం వ్యతిరేకమైనదే కాకుండా సత్యాగ్రహులు వెళ్ళిన ప్రతిచోట ముస్లింలను హిందువులను వేరుచేసి, ముస్లింల మీద, వారి ఆస్తిపాస్తుల మీద దాడులకు కారకులవడం వల్ల ముస్లింలు ఈ ఉద్యమాన్ని వ్యతిరేకించారు. శతాబ్దాలుగా కలిసిమెలసి ఉన్న ముస్లింలకు ఇది నచ్చలేదు. ఇక్కడి ప్రభుత్వం హిందూ రాజకీయ సంస్థల పట్ల గట్టిగా వ్యవహరించలేదని ముస్లింల రాజకీయ వేదిక అయిన ఇత్తెహాద్ అభిప్రాయం. మైనారిటీ సమూహపు రక్షణ కోసం, వారి హక్కుల కోసం పోరాడాల్సిన అవసరాన్ని గుర్తించిన సంఘటనలు అప్పుడు జరిగాయని వారి భావన. ఈ భావనతో సంఘటనల నుంచి అనుభవాలను స్వీకరిస్తూ తోటి మతస్తుల సత్వర రాజకీయ జాగరూకతను సూచిస్తూ ఒక బలమైన రాజకీయ కేంద్రంగా ఇత్తెహాదుల్ ముందు కొచ్చింది. సత్యాగ్రహ సంఘటనల వివరాలను పత్రికల ద్వారా ప్రజావేదికల ద్వారా వివరిస్తూ మైనారిటీలైన ముస్లింలు తక్షణం మేల్కొని తమను తాము నిలబెట్టుకోలే కపోతే ఏం జరుగనుందో వివరించేవారు. ప్రతిదీ మత దృష్టితో చూస్తున్న హిందువుల సహజ చర్యలకు ఇత్తెహాదీల నినాదం తలెత్తడానికి మధ్య ఎక్కువ వ్యవధిలేదు. అంటే ఆలిండియా కాంగ్రెస్ లక్ష్యం పూర్తిగా నెరవేరిందన్నమాట. వాళ్ళు భవిష్యత్తుకు దారులు పరుచుకున్నారు. దేశీయ నవలాకారుడు కె.ఎమ్.మున్షీ ఈ సందర్భానికి మంచి రంగులద్ది, నవలా వస్తువుగా స్వీకరించి మత విద్వేషాలను చిత్రించాడు.

మత విద్వేషాలను రెచ్చగొట్టడం తప్ప ఇంకే పురోగతి సాధించలేని ఉద్యమాన్ని నడిపిన హైద్రాబాద్ స్టేట్ కాంగ్రెస్, ఇతర హిందూ రాజకీయ సంస్థలు మళ్ళీ కునుకు తీయడం మొదలుపెట్టాయి. ప్రజలు స్పందించ గలిగే మరో అంశం తెరమీదకు

వచ్చేవరకు ఆ సంస్థల నాయకులు ఆగలేకపోయారు.

ఈ సంఘటనల తర్వాత రెండవ ప్రపంచ యుద్ధం మొదలై బ్రిటిష్ వారికీ, ఆలిండియా కాంగ్రెస్‌కు మధ్య విభేదాలొచ్చాయి. బ్రిటిష్ వాళ్ళు బయటి వ్యవహారాల్లో తలమునకలై ఉన్నందువల్ల భారతదేశంలో కొత్త సమస్యలు కొనితెచ్చుకోదలచుకోలేదు. కాంగ్రెస్ ఇదే అవకాశంగా భావించింది. బ్రిటిష్ వాళ్ళు గట్టిగానే ఉన్నారు. ప్రొవెన్షియల్ అటానమీ కాలపరిమితి పూర్తయి కాంగ్రెస్ మంత్రివర్గాలపాలన పూర్తయింది. బ్రిటిష్ ప్రభుత్వం ప్రముఖ కాంగ్రెస్ నాయకులను మూకుమ్మడిగా అరెస్టు చేసింది. అందువల్ల హైద్రాబాద్‌లోని స్టేట్ కాంగ్రెస్ ఇతర హిందూ రాజకీయ సంస్థలకు ప్రేరణ, ఆదేశాలు, సహాయం అందకుండాపోయాయి. హైద్రాబాద్ ప్రభుత్వానికి యుద్ధం గొప్ప ఊరటనిచ్చింది.

కొంతకాలం పాటు ఇత్తెహాదీలు, స్టేట్ కాంగ్రెస్ చల్లబడ్డాయి. రాజకీయ అవగాహన కోసం స్టేట్ కాంగ్రెస్, ఇత్తెహాదుల్ మధ్య మొక్కుబడి వ్యవహారాలు నడిచాయి. గతంలో స్టేట్ కాంగ్రెస్ నాయకులు కుదుర్చుకున్న ఒప్పందాలను ఆలిండియా నాయకుల సూచనలతో అమలు పరచకపోవడం, కొత్త ఒప్పందాలను ప్రతిపాదించడం వల్ల ఈసారి స్పష్టమైన లక్ష్యంతో ముందుకు రావలసిందిగా ఇత్తెహాదిస్ పట్టుబట్టారు. ఒప్పందం కుదరబోయే ప్రతి సందర్భంలో ఇత్తెహాదీలు కొత్త విషయాలను ముందుకు తెస్తారని కాంగ్రెస్ ఆరోపించింది.

నిజమేమిటంటే ఏ పక్షం కూడా స్పష్టమైన ప్రతిపాదనను ముందుకు తేలేదు. మరో వంక ప్రభుత్వం దీన్నొక వెసులుబాటుగా తీసుకొని యుద్ధం మిషతో రాజకీయ పార్టీల సహేతుకమైన, సమస్యాత్మక ప్రతిపాదనలను కూడా పక్కన పెట్టింది. పరిస్థితులను ఆసరాగా చేసుకొని ప్రభుత్వం ముఖ్య మైన విషయాల మీద కూడా శ్రద్ధ పెట్టలేదనే రాజకీయ పార్టీల విమర్శ కొంతవరకు నిజమనే చెప్పాలి. ఏ పార్టీకైనా ఏదైనా అవకాశం వచ్చినా దాన్ని బలహీనంగానే ఉపయోగించుకొనే స్థితిలో ఉన్నామని అంతర్గత చర్చల్లో ఒప్పుకొనేవారు. ఎప్పుడైనా ఇత్తెహాదీలు కాంగ్రెస్ అభిప్రాయాన్ని ఒప్పుకుంటే, తదుపరి చర్చలకు అదొక ఆరంభబిందువయ్యేది, కొత్త నాయకులు దాన్ని ఒప్పుకుంటూ చర్చలకొచ్చేవారు.

నిజానికి రాజకీయాల చరిత్రలోనే అతి తక్కువ కృషి చేసి అతి ఎక్కువ పేరు, ప్రాధాన్యత సంపాదించింది ఒక్క హైద్రాబాద్ స్టేట్ కాంగ్రెసే. బ్రిటిష్ ఇండియాలో కాంగ్రెస్ చేసిన ప్రజా పోరాటాల వల్ల అది ప్రజల హృదయాలలో గొప్ప ముద్ర

వేసుకొంది. హైద్రాబాద్ స్టేట్ కాంగ్రెస్‌లో నాయకత్వమూ లేదు, ఒక లక్ష్యమూ, త్యాగమూ, ప్రణాళిక దాని చరిత్రలోనే లేవు. పేరు లాగానే ఆలిండియా కాంగ్రెస్ ఆర్థిక దన్నుతో, ఆదేశాలతో మాత్రమే పని చేస్తూ ఉండేది. ఇతర హిందూ సంస్థలు బాగా నడిచేవి. మంచి నాయకత్వం ఉండేది. వాటిలో నిర్మాణాత్మకమైన ఆలోచనలో కొంత త్యాగ గుణం ఉండేది. అందుకు కారణం అవి వేరే పేర్ల మీద నడవడమే.

రెండవ ప్రపంచ యుద్ధారంభం నుండి అది ముగిసేదాకా ఆలిండియా కాంగ్రెస్, రాష్ట్ర కాంగ్రెస్ తెర వెనక్కి వెళ్ళిపోయాయి. తమ మాతృసంస్థ తిరిగి వెలుగులోకి వచ్చిన తర్వాతే స్టేట్ కాంగ్రెస్ మళ్ళీ నిద్రమత్తు వదిలించుకుంది. కొన్ని సంవత్సరాల సుదీర్ఘ విరామం తర్వాత 1947 తొలినాళ్ళలో మళ్ళీ ప్రజల్లోకి వచ్చింది. భారతదేశ భవిష్యత్తుపై చర్చించేందుకు బ్రిటన్ పంపిన 'క్రిప్స్' మిషన్‌తో భారత నాయకుల చర్చల సంద ర్భంగా బలోపేతమయింది. చిరకాలంగా ఎదురుచూస్తున్న స్వాతంత్ర్యం కనుచూపు మేరల్లోకి వస్తుండగా, రాష్ట్రాల వ్యవహారాలు ఆలిండియా కాంగ్రెస్ నాయకులకు బాగా అర్థం కాసాగినాయి. ఇండియన్ యూనియన్ మనుగడలోకి రాగానే రాష్ట్రాల విలీనం మొదలయ్యే సూచనలు కనిపించ సాగాయి. ఆలిండియా కాంగ్రెస్ ఆదేశాలను శిరసావహించడం తప్ప స్టేట్ కాంగ్రెస్‌కు సొంత గొంతుక లేదు. అందువల్ల బహిరంగంగా స్టేట్ కాంగ్రెస్ తన రెండు లక్ష్యాలను ప్రకటించింది.

ఒకటి: భారతదేశంలో విలీనం,

రెండు: బాధ్యతాయుత ప్రభుత్వం.

రాష్ట్ర కాంగ్రెస్ సమావేశంలో అధ్యక్ష పదవికి గట్టి పోటీ ఎదురయింది. ఎంతో గౌరవనీయుడైన సీనియర్ కాంగ్రెస్ కార్యకర్త ఇక్కడి భూమి పుత్రుడు హైద్రాబాద్‌తో ఏ సంబంధమూలేని రామానంద తీర్థతో తలపడ్డాడు. ఓటింగు కథ వింతగా నడిచింది. రామానంద తీర్థతో పోటీపడ్డ బి.రాంకిషన్ రావుకు బ్యాలెట్ పేపర్ అందజేయగానే గౌరవం కొద్దీ ఆయన రామానంద పేరు రాసాడు. సహజంగానే దయలేనివాడైన రామానంద మాత్రం తన స్వంత పేరు రాసుకున్నాడు. రామకిషన్ రావుపై రామానంద ఒక్క ఓటు గౌరవంతో గెలిచారని ఫలితం ప్రకటించబడ్డది.

రామానందతీర్థ అసలు పేరు వేరు. రాష్ట్రపు పడమటి జిల్లాల్లో ఉపాధ్యాయుడుగా పనిచేసే తీర్థ రాష్ట్ర కాంగ్రెస్‌పై శ్రద్ధ పెట్టాడు. కిందిస్థాయి కార్యకర్తల మీద కూడా ఈర్ష్యపడే వాడనే పేరుంది ఆయనకు. నాయకత్వ లక్షణాల్లేవు, మంచి వక్త కూడా కాదు. చాలా ఆతృతగలవాడు. అయితే పరిమితులు కూడా తెలిసినవాడు.

హిందూ ప్రజల స్వభావాన్ని అర్థం చేసుకొని, తనకున్న పరిమితులతోనైనా ముందుకు రాగలుగుతాననుకున్నాడు. మతతత్వ విషయాలతో ప్రజలను అంగీకరింపజేయవచ్చని భావించి, దైవత్వానికి చిహ్నంగా భావించే 'స్వామి' అనే బిరుదు తగిలించుకొని 'రామానంద తీర్థ ఆలయం'తో మమేకమయ్యాడు. అట్లా ఆయన స్వామి రామానంద తీర్థ అయ్యాడు. మహాత్మాగాంధీలాగా తను కూడా 'మహాత్మ' అనిపించుకోవాలని ఆశపడ్డట్లున్నాడు.

స్వామిగా తనను తాను ప్రచారంలోకి తెచ్చుకొని ప్రజల దృష్టిని ఆకర్షించడంలో తెలివి ప్రదర్శించాడు. స్థానికంగా బడిపిల్లలను తయారు చేసుకొని సత్యాగ్రహాన్ని ప్రారంభించి చిన్న కార్యక్రమం నిర్వహించాడు. అదో పసలేని చిన్న కార్యక్రమం కావడంతో స్థానిక పాలకులు దాన్ని పట్టించుకోకపోతే పోయేది. గతంలోలాగే ఆ ఉద్యమం ఆగిపోయి ఉండేది.

కాని స్థానిక పరిపాలకులు దానికి అనవసర ప్రాధాన్యతనిచ్చి చిన్నచిన్న సంఘటనలకు సామూహిక అరెస్టులు చేసి, నిర్బంధాలు పెంచారు. పెద్దగా ఏ గొడవా చేయనివాళ్ళను కూడా అదుపులోకి తీసుకున్నారు. ఈ చర్యల వల్ల సామాన్య ప్రజలలో ప్రభుత్వం పలుచనయింది, చిన్న ఉద్యమానికి అనవసర ప్రచారం లభించింది. స్థానిక పోలీసు అధికారులకు పెద్దరికం దొరకడం, అందువల్ల అవినీతి మొదలవడమూ జరిగింది. ఒక దురదృష్టకరమైన సందర్భం దాపురించింది.

కేవలం ఈ సంఘటనతోనే కోరుకొని జైలుకువెళ్ళే అవకాశాన్ని సంపాదించుకొని ఒక నాయకుడిగా మారిపోయాడు. ఆయన అనుయాయులు బ్రిటిష్ ఇండియాకు వెళ్ళి 'చర్యల కమిటీ' పేరు మీద అక్కడ తిష్టవేసారు. వారికి ఆలిండియా కాంగ్రెస్ కమిటీ పూర్తిగా నీరాజనాలు పట్టింది. కనుచూపు మేరలో స్వాతంత్ర్యం కనిపిస్తుండడంతో కాంగ్రెస్ చాలా బలమైన సంస్థగా మారింది. చర్యల కమిటీ పేరు మీద ఆలిండియా కాంగ్రెస్ నిజంగానే గట్టి చర్యలు తీసుకుంది. సరిహద్దుల వెంట హైద్రాబాద్ భూభాగంలో చిన్నచిన్న దాడులకు ఉపక్రమించింది. హైద్రాబాద్‌లో ఉన్న కాంగ్రెస్ సీరియస్ కార్యకర్తలు ఇక్కడ ఉదాసీనంగా ఉండిపోగా రాష్ట్రం దాటి చర్యల కమిటీ సభ్యులైన వాళ్ళంతా సుఖవంతమైన, పనిలేని, ఖరీదైన జీవితం గడపగలిగారు.

ఉద్యమానికి అవసరమైన నిధులు, ప్రచారం కోసం సామగ్రి అందించి హైద్రాబాద్ సరిహద్దుల మీద సాయుధ దాడులు చేయడానికి శక్తివంతులైన, అనుభవజ్ఞులైన వారిని పంపించింది కాంగ్రెస్. ఈ ఆక్షన్ కమిటీ సభ్యులు అందరూ

ఇతరులు చేసే పని చూసేవారే. 1937, డిసెంబర్‌లో స్టేట్ కాంగ్రెస్‌మీద నిషేధం ఎత్తివేసే నాటికి వాళ్ళు విశ్రాంతిగల విలాస వంతమైన జీవితం గడుపుతుండేవారే. నిషేధం ఎత్తి వేసాక జైళ్ళ నుండి విడుదలైన పెద్ద మనుషులు వాళ్ళ రక్షణకు ఉన్న హామీ వల్ల వాళ్ళిక అదే జీవితానికి అలవాటు పడ్డారు.

గాంధీజీ అడుగుజాడల్లో పూర్తి అహింసా మార్గంలో నడిచినట్లు స్టేట్ కాంగ్రెస్ నాయకులు ఎప్పుడూ గొప్పగా చెప్పుకుంటారు. అయితే, హైద్రాబాద్ స్టేట్ కాంగ్రెస్ ఆక్షన్ కమిటీ 1948 నవంబర్ మాసాంతంలో తాము సాధించిన విజయాల లిస్టును ప్రచురించింది. అందులో తాము సాధించిన ఘనకార్యాలలో ఈ కింది వాటిని కూడా పేర్కొన్నారు.

175 పోలీసు ఔట్‌పోస్టుల మీద దాడి

120 చోట్ల రైల్వే కమ్యూనికేషన్‌ల కత్తిరింపు

615 కస్టమ్స్ మరియు పోలీసు ఔట్‌పోస్టుల విధ్వంసం

(టైమ్స్ ఆఫ్ ఇండియా, 29.11.1948)

నిజానికి ఇవన్నీ ఆలిండియా కాంగ్రెస్ లెక్కకు మిక్కిలిగా డబ్బులిచ్చిన మనుషులు చేసారు. ఆక్షన్ కమిటీ సభ్యులు కనుచూపు మేర ఎక్కడా లేరు, వాళ్ళు సురక్షితమైన, సుదూర ప్రాంతంలో ఆనందంగా వీక్షిస్తూ ఉన్నారు.


1947, డిసెంబర్‌లో స్వామి విడుదలయ్యాడు. కొద్దిరోజుల తర్వాత ఆక్షన్ కమిటీని సంప్రదిస్తానని ప్రకటించి ఇండియన్ యూనియన్ భూభాగానికి వెళ్ళిపోయారు. ఆయన వీరాభిమానులు నెలలకొద్దీ వీక్షించారు, ఆయన సంప్రదింపులు పూర్తికాలేదు. ఢిల్లీ వెళ్ళాడు. హైద్రాబాద్‌కు వ్యతిరేకంగా వేసిన పథకాలలో స్టేట్ కాంగ్రెస్ చేసింది శూన్యమని ఢిల్లీ పెద్దలు ఆయనతో అన్నారు. ఢిల్లీ స్థాయిలో చేయగలిగిందేమీలేదని అర్థమై నాలుగునెలల తర్వాత హైద్రాబాద్ వచ్చి చూస్తే ఇక్కడా తన పలుకుబడి ఏమీ లేదని తేలిపోయింది.

సత్యాగ్రహాన్ని పునఃప్రారంభించాలనుకున్నాడు కానీ అనుచరులెవ్వరూ దొరకలేదు. ఆయన గతప్రాధాన్యత తగ్గిపోయింది. ఇక చివరి ప్రయత్నంగా స్వంతంగా శాసనోల్లంఘనకు దిగాలనుకున్నాడు. ఇలాంటి కష్ట సమయాలలో శాంతిభద్రతలు దిగజారిపోయే ఏ పనీ చేయవద్దని ఆయన స్నేహితులు సూచిస్తే, తప్పనిసరిగా అరెస్టు కావడం మినహా తనకు వేరే కెరీర్ ఏమీలేదని నిజాయితీగా ఒప్పుకున్నాడు.



ప్రజల కళ్ళల్లో తనమీద గౌరవపు చూపు తగ్గిందని, ఏదైనా ఒక గొప్ప పని చేసి దాన్ని తిరిగి సాధించుకోవాలని ఆయన భావించాడు. ఆ విధంగా అరెస్టు కాబడి, హైద్రాబాద్ రాష్ట్రం భారత సైన్యానికి దాసోహమనేదాకా జైల్లో ఉన్నాడు. ఆయన ఇతర మిత్రులు, ఆక్షన్ కమిటీలో సభ్యులైనవాళ్ళు, చాలాకాలం వరకు, వాళ్ళ గౌరవానికి ఎంతమాత్రం లోటు రాదనుకునే వరకు హైద్రాబాద్‌కు తిరిగి రాలేదు. ఇక్కడి ప్రజలు తమను రక్షకులుగా, జాతీయ నాయకులుగా నీరాజనాలు పడుతూ స్వాగతిస్తారని ఆశిస్తూ వాళ్ళు తిరిగివచ్చారు కాని వాళ్ళనెవరూ ఎంత మాత్రం పట్టించుకోలేదు.

ప్రజలకు అన్నీ తెలుసు.



# 5. బహద్దూర్ యార్‌జంగ్, ఇత్తెహాదుల్ ముస్లిమీన్

బ్రిటిష్ ఇండియాలోని తమ మాతృసంస్థల చేత ప్రేరేపించబడ్డ స్టేట్ కాంగ్రెస్, హిందూ మహాసభ, ఇతర హిందూ రాజకీయ సంస్థల మతతత్వ చర్యలకు తప్పనిసరైన పరిస్థితిలోనే ముస్లింల నుండి ప్రతిచర్య మొదలయింది. అంతకుముందు ముస్లింలలో రాజకీయ కార్యకలాపాలే ఉండేవి కావు. ముస్లింలకు ప్రేరణనిచ్చే సంస్థ ఏదీ బ్రిటిష్ ఇండియాలో ఉండేది కాదు. బయట ముస్లింలీగ్ ఒక్కటే ఉండేది. ఆలిండియా కాంగ్రెస్ మూర్ఖత్వం, సంకుచితత్వం వల్ల ఇతర హిందూ సంస్థల రెచ్చగొట్టే చర్యల వల్లే ముస్లింలీగ్ ప్రాధాన్యతను సంతరించుకుంది. ఆలిండియా కాంగ్రెస్‌లోని నాయకులెవరైనా ఆనాడు మైనారిటీల పట్ల కొంత ఉదాత్తంగా ప్రవర్తించి ఉన్నా, దేశ విభజన సందర్భంగా అంతంత పెద్దపెద్ద సంఘటనలు జరిగి ఉండేవి కావు. ముస్లింలీగ్ చివరివరకూ చేసిన బేరసారాలకు అన్నిటికంటె ప్రధాన కారణం హిందూ నాయకుల సంకుచిత, హ్రస్వదృష్టి. ఈ కారణాలే ముస్లిం మైనారిటీలు ఐక్యంగా ఉండడానికి, ముస్లింలీగ్ రాజకీయ సంస్థగా ఎదగడానికి దోహదపడ్డాయి.

హైద్రాబాద్‌లో కూడా అంతే. మైనారిటీలుగా ఎలాంటి అభద్రతను ఎదుర్కొనని ఇక్కడి ముస్లింలు, అకస్మాత్తుగా ఒకవేళ హిందూ మెజారిటీలు ఏకమై విపరీత పోకడలు పోతే తలెత్తే పరిస్థితిని ఎదుర్కోవడానికి సిద్ధం కాకపోతే తమ మనుగడే ప్రశ్నార్థకమవుతుందని భావించాల్సి వచ్చింది. సాధారణంగా ఇలాంటి రాజకీయ అభిప్రాయం ఏర్పడడానికి కొంత సమయం పట్టాలి. కానీ చైతన్యవంతమైన నాయకత్వం ఆ అభిప్రాయాన్ని చాలా  తొందరగా కూడగట్టగలిగింది.

ముస్లింల ఐక్యతకు నిర్వచనంగా మారిన ఇత్తెహాదుల్ ముస్లిమీన్ ద్వారా బహద్దూర్ యార్‌జంగ్ హైద్రాబాద్ ముస్లింల జాగృతికి కారకుడైనాడు. తర్వాత 'ఇత్తెహాద్' పేరుతో ఆ ఉద్యమం ప్రాచుర్యంలోకి వచ్చింది. బహద్దూర్‌ఖాన్ నాకు చదువుకునే రోజుల నుండీ తెలుసు. అతనిది నా వయసే. లావుగా, మొద్దబ్బాయిలా ఉండేవాడు. బాగా ధనికుడైన కులీనుడు. మేం సిటీలో ఒకే ప్రాంతంలో ఉండేవాళ్ళం, ఒకటే దారి వెంట వేర్వేరు స్కూళ్ళకు పోయేవాళ్ళం. ఆ తర్వాత గొప్ప రాజకీయ నాయకుడయ్యే వరకు ఆయన్ని చూసే అవకాశం కలుగలేదు. ఓ మండువేసవి సాయంకాలాన రైలు ప్రయాణంలో అనుకోకుండా కలిసాం. పరిచయాలయ్యాక మనసు విప్పి మాట్లాడుకున్నాం. మేం మధ్యలో కలిసింది లేకున్నా నా గురించి తనకు అన్నీ తెలుసని చెప్పాడు. నిజానికి అతని గురించి నాకూ అన్ని విషయాలు తెలుసు. చిన్ననాటి స్కూలు సంగతులు మాట్లాడుకున్నాం. తనెంత లావుగా వికారంగా ఉండేవాడో గుర్తు తెచ్చుకొని నవ్వుకున్నాడు. నేను మాత్రం మర్యాద కోసం అలాంటిదేదీ గుర్తుకులేదన్నట్లు నటించాను. ఒకరినొకరు కలుసుకున్న ఆనందంలో రాజకీయాలు కానీ, ఇతర ఏ సీరియస్ విషయాలు కానీ మాట్లాడుకోలేదు. ఆ తర్వాత చాలాసార్లు అతన్ని కలిసాను కానీ ఎప్పుడూ పెద్దగా రాజకీయాలు మాట్లాడలేదు. మామూలు ముచ్చట్లే నడిచేవి. 'రాజకీయాలంటే ఇష్టమేనా?' అని ఒకరోజు అడిగాడు. 'ప్రత్యేకమైన ఇష్టం మాత్రం ఏమీలేదు' అన్నాను నేను. మా స్నేహం బాగా పెరిగిన తర్వాత కూడా 'ఇత్తెహాద్'లో చేరమని అతడు నన్నడగలేదు. కొన్ని సంవత్సరాల తర్వాత మరింత దగ్గరయ్యాక రాజకీయాల గురించి, ఆర్థిక పరిస్థితుల గురించి ఇతరత్రా చాలా మాట్లాడుకున్నాం.

ఆయన్ని కలిసిన ప్రతిసారీ ఆయన గ్రహణ శక్తికి ఆశ్చర్యపోయేవాణ్ణి. చూస్తుండగానే అత్యంత ప్రభావవంతమైన నాయకుడుగా, గొప్ప వక్తగా ఎదిగి పోయాడు. తన వాగ్ధాటితో ఎంత పెద్ద సమూహాన్నైనా తను అనుకున్న అభిప్రాయానికి

ఒప్పించగలనని అతను నమ్మేవాడు, అది నిజం కూడా. భోజనం విషయంలో, బట్టల విషయంలో, పనివాళ్ళ విషయంలో పెద్దగా శ్రద్ధ పెట్టకపోయేవాడు. మిగతా విషయాలలో చాలా మర్యాదగా, చాలా తొందరగా అంగీకరించే తత్వంతో, నిజాయితీ గా ఉండేవాడు. ఆ తర్వాత కొన్ని సందర్భాలలో అతడి రాజకీయ దృక్పథాన్ని నేను తీవ్రంగా తప్పు బట్టాను. అయినా దాన్ని అతడు మామూలుగానే తీసుకున్నట్లు అని పించింది. కానీ నా అభిప్రాయాలలోని వాస్తవికతను గమనించి వాటిని ఆచరణలో పెట్టేవాడు. అప్పుడప్పుడు నా దగ్గరకు వచ్చి విషయాల వారీగా నా అభిప్రాయాన్ని అడుగుతూ ఉండేవాడు. ప్రతి విషయం పట్లా ఆయనకొక అభిప్రాయమైతే ఉండేది కానీ ఇతరుల అభిప్రాయాలలోని వాస్తవికతను అంగీకరించడానికి ఆయన ఎప్పుడూ సిద్ధంగా ఉండేవాడు. తనది తప్పుడు అవగాహన అయితే అది చాలా ధైర్యంగా ఒప్పుకునేవాడు. ప్రతి చర్చలోనూ ఆయనకు 'విషయాలు' ఉండేవి. ఆ విషయాన్ని ఎప్పుడూ దాటిపోయేవాడు కాదు. చాలా తక్కువ సందర్భాలలో ఆయన ఆవేశంలోకి వచ్చేవాడు.ప్రజా పోరాటాలకు పెద్ద మొత్తంలో డబ్బు అవసరం ఉంటుందనే అభిప్రాయాన్ని ఆయన అసలు నమ్మేవాడు కాదు. చాలా కొద్దిసార్లు మాత్రమే ఆర్థిక సాయం కోసం నా దగ్గరకి వచ్చాడు. అవి కూడా అనాథలకు సహాయం కోసం, పాఠశాలలకు సహాయం కోసం, లేదా అలాంటి ప్రత్యేకమైన అవసరం కోసం మాత్రమే. ఇలాంటి డిమాండ్లు కూడా అతి తక్కువసార్లు పెట్టేవాడు, కాదు అనలేనంత న్యాయంగా. కొన్నిసార్లు ఏ విషయం చెప్పకుండా కూడా వందలో, వేలో రూపాయలు కావాలని ఉత్తరం పంపే వాడు. నేను ఇచ్చేవాణ్ణి. తర్వాత ఆ డబ్బు దేనికి వాడాడో చెప్పేవాడు. చాలావరకు తను అడిగి తీసుకున్న డబ్బును చివరి నిముషంలో వైపరీత్యంలో చిక్కుకున్న వాళ్ళకోసం, ఆగిపోబోయిన పెళ్ళిళ్ళను నడిపించడం కోసం, విద్యార్థుల కాలేజీ ఫీజులకోసం, కోర్టు వ్యవహారాలలో ఇండ్లు కోల్పోకుండా రక్షించడం కోసం వాడుతుండేవాడు. రాజకీయ ఉద్యమం కోసం డబ్బులు అడిగినట్లు ఒక్క సందర్భం కూడా నాకు గుర్తురావట్లేదు. పూర్వీకుల నుండి ఆయనకు సంక్రమించిన ఆస్తిపాస్తుల నుండి, తన రాజకీయ సహచరుల నుండి మాత్రమే ఉద్యమ అవసరాలకు డబ్బు స్వీకరించేవాడు. ఆయన రాజకీయ అవసరాలకు డబ్బు అవసరం చాలా తక్కువగా ఉండేది, ఆయన శత్రువులు గందరగోళపడేది అక్కడే. తన మతం విముక్తి, భవిష్యత్తు విజయాలలో తన ఆర్థిక లాభం దాగుందని ఆయన అనేవాడు.

ఒకరోజు రాత్రి నవాబ్ ఛత్తారి నివాసంలో డిన్నర్‌లో ఉండగా బహద్దూర్ యార్‌జంగ్ మరణించినట్లు వార్త వచ్చింది. నమ్మశక్యం కాక మళ్ళీ వాకబు చేసి

ధ్రువపరుచుకున్నాం. అవును! తన స్నేహితులొకరి ఇంట డిన్నర్ పార్టీలో ఈ విషాదం చోటు చేసుకుంది. విషయం నిర్ధారించుకున్న తర్వాత నేను, గులాం మహ్మద్ ఏర్పాట్ల కోసం కదిలాం. మేం వెళ్ళేటప్పటికే అక్కడ పెద్ద సమూహం చేరిపోయింది. ఆయన స్నేహితులు పెద్ద పెట్టున ఏడుస్తున్నారు. ఇంటి యజమాని కన్ను మూసిన దైన్యం, గందరగోళం! ఏదో కుట్ర జరిగిందని కొందరు బహిరంగంగానే మాట్లాడుకుంటున్నారు. గులాం మహమ్మన్, నేనూ గంటకు పైగా మౌనంగా నిలబడ్డాం. మాటల కందని గంభీరత ఆవరించింది. మరుసటి రోజు శవాన్ని పోస్టుమార్టంకు పంపాలా వద్దా అని చర్చ బయలుదేరింది. చివరగా పోస్టుమార్టం లేకుండా ఖననం చేయాలని నిర్ణయించబడింది. ప్రతి ముఖ్యమైన శవయాత్రలన్నింటికి వచ్చినట్లే నిజాం హాజరయ్యారు. ఆయన సమక్షంలో మృతుడి సమీప బంధువుల దుఃఖ ధ్వానాన్ని మరుగుపరిచే రాజలాంఛనాలు బహదూర్‌యార్ జంగ్‌ను మరుభూమికి చేర్చాయి.

హైద్రాబాద్‌లో గతంలో ఎన్నడూ చూడనంత జనం బహదూర్‌యార్ జంగ్ అంతిమ యాత్రలో పాల్గొన్నారు. కులాలకు, మతాలకు అతీతంగా శవయాత్రకు రెండువైపులా మైళ్ళకొద్దీ దూరంలో ప్రజలు, ఇండ్ల కప్పులెక్కి, కిటికీలు తెరిచిపెట్టుకొని ఆయన కడసారి దర్శనం చేసుకొన్నారు. ఒక్క చిన్న దుకాణమైనా ఆ రోజు తెరుచుకోలేదు హైద్రాబాద్‌లో. నలువైపులా దుఃఖం.బహదూర్ యార్‌జంగ్ అంతిమయాత్ర ముగిసాక అందరినీ ఒక పెద్ద ప్రశ్న వెంటాడడం మొదలుపెట్టింది. ఇత్తెహాదుల్ అధ్యక్షుడిగా ఉన్న బహద్దూర్ యార్‌జంగ్ వారసుడెవరు? దేశంలో ఇత్తెహాదుల్ ఒక గొప్ప సంస్థగా గుర్తించబడినందున దాని అధ్యక్షుడయ్యే వ్యక్తికి అంతే గొప్ప రాజకీయ ప్రాభవం ఉంటుంది. ఇస్లామిక్ ధర్మాల గురించి లోతైన అవగాహన కలిగి ఉండిన బహుదూర్ యార్‌జంగ్ ప్రతి ధార్మిక చర్చలోనూ తనదైన ఆధిక్యతను కనబరచేవాడు. ఆయన వాదనా పటిమ, ఉపన్యాస శైలి భారతదేశంలోనే కాక మధ్యప్రాచ్య దేశాలలో కూడా ఆయనకెంతో కీర్తిప్రతిష్టలను ఆర్జించిపెట్టింది. ఆయనలోని నిజాయితీ, ధార్మిక సమగ్రత తన మతంలోని వారికే కాక ఇతర మతస్థుల ముందు కూడా మహోన్న తంగా నిలబెట్టింది. ఇత్తెహాదుల్ నిర్మాణంలోనేకాక, హైద్రాబాద్ సంస్థానం లోని ముస్లింల రాజకీయ జాగృతికి, క్రమశిక్షణకు ఆయన చేసిన సేవ నిరుపమానమైనది. చాలా పెద్దపెద్ద నిర్ణయాల్ని తీసుకొని వాటిని ఏకాభిప్రాయంతో తన మతంలో అమలు జరపగలిగేవాడు.

ఆయన జీవితకాలంలో ఎంతోమంది ఆయన మీద ఈర్ష్యతో రగిలి పోయేవారు కానీ ఆయనకు ఎదురుబడి నిలిచే సామర్థ్యం ఎవరికీ ఉండేది కాదు. సమాజంలో

చాలా పేరున్న అబ్దుల్ హసన్ సయ్యద్ అలీకి కొంతమంది హిందూ మత పెద్దలకు మధ్య జరిగిన అవగాహనను ఆయన తిరస్కరించాడు. అయినా రెండు సమూహాలు ఆయన నిర్ణయాన్ని ఆహ్వానించారు. అప్పటి నుండి అబ్దుల్‌హసన్‌ను అనుమానించడం మొదలు పెట్టారు. హిందూ ముస్లిములకు మధ్య పెరుగుతున్న అగాధం పట్ల ఆయనకు అవగాహన ఉంది. అందుకే వాస్తవికమైన, దూరదృష్టిగల పెద్దపెద్ద రాజకీయ విషయాలపై దృష్టి పెట్టాలనుకున్నాడు. అధిక సంఖ్యాకులైన హిందువులకు పాలనలో సరియైన భాగస్వామ్యం కల్పించాలనుకున్నాడు. ఆర్థికంగానూ, ఇతర రంగాలలోనూ ముస్లింలు హిందువులతో సమానస్కందులుగా ఎదిగేంతవరకు సమూలమైన రాజకీయ మార్పులను కట్టడి చేయాలని మాత్రమే ఆయన ఉద్దేశం. అంతదాకా హిందువులను కట్టడి చేస్తూ రాజకీయాధికారం ముస్లింల చేతుల్లో ఉండాల్సిందేనని ఆయన భావన. తద్విరుద్ధంగా జరిగితే ముస్లింలు హిందువులకు ఆర్థిక బానిసలుగా మారే ప్రమాదముందని ఆయన నమ్మేవారు. రాజకీయాధికారం చేజిక్కితే హిందువులు ఇతర మతాల వాళ్ళను గౌరవనీయమైన స్థానానికి రానీయరని ఆయన బలంగా నమ్మేవాడు. ఏడువందల సంవత్సరాల ముస్లింల పాలన తర్వాత కూడా ముస్లింలు సంస్థానంలో అల్ప సంఖ్యాకులేనని, ఈ పరిస్థితి మారి ఇప్పుడున్న సంఖ్య పెరిగి బలమైన మైనారిటీ శక్తి ఏర్పడాలని ఆయన కోరుకునేవాడు. అదే సందర్భంలో ప్రస్తుత పరిపాలనలో గణనీయమైన మార్పులు రావాలనీ, అందరికీ సమానావకాశాలు కల్పించబడాలనీ బలంగా నమ్మేవాడు. రాష్ట్రంలో తొందరలో రాజకీయ సంస్కరణలు రావాలని ఆయన కోరుకొనేవాడు కానీ ముస్లింలకు భద్రమైన కాలం వచ్చేంతవరకు శాసనమండలిలో ముస్లిం సభ్యులు నాన్ ముస్లిం సభ్యులు అన్న వ్యత్యాసం ఉండాలని చెప్పేవాడు. ఆయన రాచరికాన్ని ఇష్టపడేవాడు కాదు; దయాళువైన నిజాం పాలనలో కూడా ఎన్నో సుగుణాలు ఉన్నప్పటికీ కొన్ని దుర్లక్షణాలు కూడా ఉన్నాయని ఆయన భావన. కాబట్టి సాధ్యమైనంత తొందరగా హైద్రాబాద్‌లో ప్రజాస్వామిక పాలన రావాలనేవాడు. ఈయన వాదాలన్నీ హిందువులు కూడా అంగీకరించేవారు– ఒక్క శాసనమండలిలో ముస్లిం సభ్యులు, నాన్ ముస్లిం సభ్యులు ఉండాలన్న వాదనను తప్ప. హిందువుల దృష్టితో అది హేతురహితమైన వాదన. అందుకే వాళ్ళు దాన్ని ఒప్పుకోలేదు. హైద్రాబాద్ సంస్థానం కేవలం ముస్లిం నవాబుది కాదు, ముస్లిం లందరిదీ అన్న తన ప్రతిపాదిత సిద్ధాంతాన్ని అమలు పరచుకొనే దిశగా ఆయన శాసనమండలిలో ముస్లిం సభ్యులు, నాన్ ముస్లిం సభ్యులు అన్న వాదం లేవదీసాడు. చివరి శ్వాస వరకూ ఆయన దానికి కట్టుబడి ఉన్నాడు. ఆయన జీవించి ఉంటే

ముస్లింలు ఆర్థికంగా హిందువులతో సమానంగా ఎదిగేవరకు ఆయన ప్రవచించిన సిద్ధాంతం వదిలి ఉండేవాడు కాదు.

ఆయన అడుగుజాడల్లో నడవడం ఎవరికైనా అంత సులభం కాదు. అబుల్ హసన్ మీద పెద్దగా ప్రచారంలో లేని వరంగల్ అడ్వకేటు ఫాజిల్ హుస్సేన్ పోటీ చేసాడు. ఫాజిల్ హుస్సేన్ తన రాజకీయ వారసుడని బహదూర్ యార్‌జంగ్ ఒక ప్రసంగంలో చెప్పాడని అంటారు. ఏకాభిప్రాయం కోసం చేసిన ప్రయత్నాలు, రాజీ చర్చలు అన్నీ విఫలమై ఇద్దరు అభ్యర్థులు పోటీదారులుగా మిగిలారు. ఇత్తెహాద్‌కు పార్లమెంటుగా భావించబడే 'మజ్లిస్-ఇ-షోరా'లో తనకు సునాయాస విజయం లభిస్తుందని అబుల్ హసన్ ధీమాగా ఉన్నాడు. అదే నాయకుడిని ఎన్నుకునే సంస్థ. ఆయన ప్రత్యర్థులు కూడా ధీమాగానే ఉన్నారు. ఇద్దరి మద్దతుదారులు గట్టిగానే తయారయ్యారు. ముస్లింలతో చీలిక ప్రమాదం ఏర్పడ సాగింది. కొందరు ముస్లిం ప్రముఖులను వెంటబెట్టుకొని నేను రాజీ చేయాలని పోయాను.

బహదూర్ యార్‌జంగ్ మరణించగానే ఎన్నిక పెట్టాల్సిన తరుణం వచ్చిందని అందరూ భయపడసాగారు. ఇద్దరు అభ్యర్థులలో ఎవరో ఒకరు ఉపసంహరించుకో వలసిందిగా కోరాను. ఇద్దరూ బెట్టు మీదే ఉన్నారు. ఎన్నికకు ముందురోజు రాత్రి ఇద్దరు అభ్యర్థులను, వారి మద్దతుదారులను చాలా సముదాయించి విఫలమయ్యాను. అబుల్‌హసన్ తనకు 90 శాతం ఓట్లు వస్తాయని, ఒకవేళ తనకు ఘనమైన విజయం చేకూరకుంటే తను పదవిని చేపట్టనని నమ్మకంగా చెప్పాడు. ఈ మాట విన్న నేను మూడింట రెండు వంతులు మెజారిటీ రాకపోతే అబుల్ హసన్ గెలిచినా తన పదవిని ఫజిల్ హుస్సేన్‌కు ఇచ్చివేయాలని ప్రతిపాదించాను. ఆ ప్రతిపాదనను అబుల్‌హసన్ సంతోషంగా అంగీకరించాడు. తెల్లారిగట్ల మూడుగంటలు అవుతుంది. ఇంకా కొత్త మార్పులకు నేను సిద్ధపడలేదు. ప్రతిపాదన రాసాను. అబుల్‌హసన్ దానిమీద సంతకం చేసి వెళ్ళిపోయాడు. ప్రత్యర్థి ఇంత సహేతుకమైన ఒప్పందాన్ని కూడా ఒప్పుకోలేదు. ఎన్నిక రోజు మధ్యాహ్నం ఫాజిల్‌హుస్సేన్‌ను ఈ ఒప్పందంపై సంతకం పెట్టించడానికి అడిగి, ఒప్పించలేకపోయాను. ఆయనింకా ఎటూ నిర్ణ యించుకోలేదు. ఎన్నిక సమయం దగ్గరపడేదాకా ప్రయత్నించి వెళ్ళిపోయాను. ఇక్కడ చెప్పదగిన విషయమేమిటంటే ఫాజిల్ ఈ ఒప్పందం మీద సంతకం పెట్టలేదన్న విషయం అబుల్ హసన్‌కు తెలియదు.

సాయంత్రం ఓ మిత్రుడి ఇంట్లో ఉండగా అబుల్ హసన్‌కు 65 శాతం ఓట్లు

రాగా ప్రత్యర్థికి మిగతా ఓట్లు వచ్చాయని తెలిసింది. 'దురదృష్టవంతుడు ఫాజిల్. సంతకం పెట్టి ఉంటే పదవి వచ్చేది' అని అరిచాను నేను. అయినప్పటికీ అతను ఏమీ చేయలేడు ఎందుకంటే అబుల్‌హసన్ సంతకం చేసిన కాగితం నా దగ్గర ఉంది. అయితే మేం రేడియో విని ఆశ్చర్యపోయాం. అబుల్‌హసన్ తన విజయాన్నే కాకుండా తన క్యాబినెట్ విజయాన్ని కూడా స్వాగతించాడు. తన ప్రత్యర్థి సంతకం చేయకపోవడం వల్ల బతికిపోయాడు. లేకపోతే దుఃఖంలో మునిగి ఉండేవాడు. ఇతరులకి చెప్పేదేం లేదనుకున్నా.

అబుల్ హసన్ ఈ గౌరవం ఎక్కువ కాలం నిలుపుకోలేదు. ఆయన ప్రతి కదలికను, ప్రతి చర్యను ముస్లింలు అనుమానంగానే చూడసాగారు. ప్రజా వ్యతిరేకతతో ఆయన తొందరలోనే పదవిని కోల్పోయాడు. ఈసారి ఎలాంటి పోటీలేకుండా మజహర్ అలీ కమల్ ఎన్నికయ్యాడు. నిజమైన పెద్దరికం గలిగిన, నిజాయితీపరుడు, శాంత స్వభావుడు, మెతక మనిషిగా పేరున్న మజహర్ అలీ కమల్ ఈ పోస్టుకు పనికిరాడని తేలిపోయింది. ఆయనకున్న మంచి పేరు వల్ల మాత్రమే కొంతకాలం ఈ పదవిలో కొనసాగాడు. ఇత్తెహాదుల్ అధ్యక్షుడికి గత కాలం నుండి వస్తున్న పట్టు సడలి, గౌరవం తగ్గి, ప్రతిష్ట మసకబారసాగింది. ఈ పోస్టుకు ఉండాల్సిన దానికన్నా ఎక్కువ మంచితనం ఆయనకుండేది. ఫలితంగా తీవ్రమైన, ఘర్షణ పూరితమైన శక్తులు అధికారాన్ని చేజిక్కించుకోవడానికి ప్రయత్నాలు ప్రారంభించాయి. చివరగా ఈ పదవి కోసం రియాజ్, రజ్వి, అనీస్‌లు పోటీపడ్డారు. మొదటి ఇద్దరిలో ఎవరో ఒకరు రాకపోతే పరిస్థితులు ఆందోళనకరంగా ఉంటాయని ఎక్కువమందిమి భావించాము.

ఈ ముగ్గురిలో అనీసుద్దీన్ చాలా న్యాయబద్ధంగా ఉంటాడు. ముస్లిం పెద్దల నుండి ఒక విజ్ఞప్తి జారీ చేయబడ్డది. రాబోయే కష్టతరమైన రోజుల్ని దాటడానికి సరియైన వ్యక్తిని ఎన్నుకోండని దాని సారాంశం. ఆ విజ్ఞప్తి మీద నేను కూడా సంతకం చేసాను. ఈ విజ్ఞప్తిని రియాజ్ గ్రూపు నిశితంగా విమర్శించింది. రియాజ్ 'వక్త్' అనే పత్రికను నడిపేవాడు. నాకు రియాజ్ గురించి కొంత తెలుసు కాని అతడు నన్ను ప్రభావితం చేయలేకపోయాడు. నాకు ఖాసిం రజ్వీ అసలే తెలియదు. కానీ ఆవేశపరుడని విన్నాను. నాలాంటి ఇత్తెహాదుల్ బయట ఉన్న వ్యక్తులకు, ఇలాంటి కష్టతరమైన పరిస్థితులలో ముస్లింలను శాంతిగా ఉంచే, దూరదృష్టిగల నాయకుడు కావాలి అనిపించింది. మేం విన్నదాన్ని బట్టి ఖాసిం రజ్వీ దీనికి సరిపోడని అనిపించింది. మా విజ్ఞప్తి అనీసుద్దీన్ అహ్మద్‌కు ఎలాగూ లాభం చేయలేకపోయింది.



ఖాసీం రజ్వీ చాలా ఎక్కువ ఓట్లు తెచ్చుకున్నాడు. రెండో అభ్యర్థి ఖాసీంరజ్వీకి చాలా దూరంలో ఉన్నాడు. అనీసుద్దీన్ ఎక్కడో మూడోస్థానంలో ఉన్నాడు. నేను నిరాశపడ్డాను. రాబోయే పరి ణామాలను ఊహించుకొని భయపడ్డాను. షోరా ఓటర్లు ఎన్నుకున్న నాయకుడే ఇత్తెహాదుల్ అధ్యక్షుడు. అంతకుమించి ఎవరూ ఏమీ చేయలేరు. వాళ్ళు ఖాసిం రజ్వీని ఎన్నుకున్నారు.

కొన్నిరోజుల తర్వాత ఒక మిత్రుడు నా దగ్గరకు వచ్చి 'ఇప్పుడు ఖాసీంరజ్వీ ఎన్నికయ్యాడు కదా, అతనికి అన్నిరకాల అభిప్రాయాలు కావాలి, అందరినీ కలవాలి, అతన్ని ఏ వర్గమూ బహిష్కరించే పరిస్థితి రాకుండా చూడాలి' అన్నాడు.

నేను అవునన్నాను.

అదే మిత్రుడు ఒకరోజు ఫోన్ చేసి ఖాసిం రజ్వీ నన్ను కలవాలనుకుంటున్నాడని చెప్పి, ఒక రోజు అల్పాహారానికి తీసుకువచ్చాడు. సరదాగా కాఫీ తాగుతూ ఆ రోజు ముచ్చట్లని కాసేపు మాట్లాడుకున్నాం. మేం సాధారణ పరిభాషలో మాట్లాడుకుంటూ ఉండగానే రజ్వీ లేచి నిలబడి తన చేతిని నా ముఖానికి దగ్గరగా చూపుతూ 'లాయక్ అలీ సాబ్! మీరు, మీ స్నేహితులు నన్ను మోసగాడని అనుకుంటున్నారట' అని

కొద్దిసేపు ఆగాడు. మళ్ళీ వెంటనే 'అనుభవం మీ అభిప్రాయం తప్పని తేలుస్తుంది లెండి' అన్నాడు. చాలా నాటకీయంగా ఈ మాటలని తిరిగి కూర్చున్నాడు. నేను కొంచెం ఇబ్బందిగా ఫీలై వెనక్కి జరిగి కూర్చున్నాను. తర్వాత కొద్దిసేపటికే మా సమావేశం ముగిసింది. ఆ తర్వాత చాలారోజుల వరకు రజ్వీని చూడలేదు. కొన్ని ఫంక్షన్‌లలో కలిసినప్పటికీ ఎక్కువగా మాట్లాడుకొనే అవకాశం కలుగలేదు.

ఖాసింరజ్వీ ఇత్తెహాదుల్ అధ్యక్షుడిగా ఎన్నికైన తర్వాత నేను చాలాకాలం విదేశాలలో ఉన్నాను. మధ్యమధ్యలో హైద్రాబాద్‌కు వచ్చి పోతున్న కాలంలో ముస్లింల మధ్య పరస్పర వ్యతిరేకమైన పార్టీలున్నట్లు, పార్టీలలో గ్రూపులు ఉన్నట్లు అనిపిస్తుండేది. ఖాసింరజ్వీకి వ్యతిరేక వర్గం రియాజ్ గ్రూప్. వాళ్ళు తరచూ ఖాసింరజ్వీని ఉదాసీనుడని, కావలసినంత ఆవేశం లేనివాడని విమర్శిస్తుండేవాళ్ళు. అనీసొద్దీన్ పార్టీ అవసరమైన దానికన్నా ఎక్కువ తీవ్రవాద స్వభావంగలదని విమర్శ ఉండేది. 'మీరు ఖాసింరజ్వీ ఒకచోట కూర్చొని చర్చించుకొని భేదాభిప్రాయాలు తొలగించుకొమ్మని, ఆ తర్వాత ముస్లింలకు ఉపయోగపడే మంచి పనుల గురించి ఏమైనా ఆలోచించ'మని నేను అనీస్ పార్టీ వాళ్ళకు చెప్పాను. మస్‌దూసి, కలీమొద్దీన్ అన్సారీ ఆ పార్టీలో ముఖ్యులు. నా విఫలమైన సూచనల తర్వాత ఒకరోజు వాళ్ళు ఖాసిం రజ్వీతో కలిసి జిన్నా దగ్గరికి వెళ్ళి తమ భేదాభిప్రాయాలు తొలగించుకోవాలని నిర్ణయించుకున్నారు. ఆ సమావేశానికి నేనే ఏర్పాట్లు చేసాను. వాళ్ళూ వెళ్ళారు కాని భేదాభిప్రాయాలు సమసిపోలేదు. పరస్పరం ఈర్ష్య ఉండేది. ఖాసింరజ్వీ చుట్టూ వితండవాదులు ఉండేవారు. వాళ్ళు ఆయనకు నచ్చని విషయాల్లోకి కూడా లాగేవారు. పెద్దరికం కాపాడుకోవడం కోసం, వాళ్ళ వాదనలను ఆయన అంగీకరించవలసి వచ్చేది. అవి ఆయన స్వంత అభిప్రాయాలకంటే తీవ్రంగా ఉండేవి.

# 6. సర్ అక్బర్ హైదరీ అలీ, నిష్క్రమణ



రెండవ ప్రపంచ యుద్ధకాలపు జీవన్మరణ సమస్యల మధ్య బ్రిటిష్ వాళ్ళు భారతదేశంలో ఏ పనీ సులభంగా చేయలేకపోయారు. డంకిర్క్‌లోనూ, ఆ తర్వాత దూరప్రాచ్యంలో జపాన్‌తో ఎదురైన సవాళ్ళతో వాళ్ళ పరిస్థితి ఇబ్బందికరంగా తయారైంది. ఇవి కాంగ్రెసుకు కలిసివచ్చాయి. పురాతన కాలం నుండి సగటు హిందువుకు గల డబ్బు ఆశను చూసినట్లయితే బ్రిటిష్ వాళ్ళు ఎప్పుడో ఈ దేశాన్ని వదిలి వెళ్ళి ఉండాల్సింది. అయితే తెలివికి పెట్టింది పేరైన బ్రిటిష్ వాళ్ళు దీనిని పూర్తిగా ఉపయోగించుకొని హిందువుల నుండి అన్నిరకాల సేవలను కొనుగోలు చేసుకొని దేశం మీద తాత్కాలికంగానైనా మంచి పట్టు సాధించారు. కరెన్సీ నోట్లను విస్తృతంగా చెలామణి చేసారు. అయినప్పటికి బ్రిటిష్ వాళ్ళ పరిస్థితి అస్థిరపడింది. అలాంటి పరిస్థితుల్లో మాత్రం బ్రిటిష్ ప్రతినిధుల నుండి ఎన్నో అవమానాలను, ఈసడింపులను ఎదుర్కొన్న నిజాం నవాబు, హైద్రాబాద్ ప్రజలే వారికి నమ్మదగ్గ వాళ్ళుగా కనిపించారు. అప్పుడు నమ్మదగిన మిత్రుడు సర్ అక్బర్ హైదరీ హైద్రాబాద్ ప్రధానిగా ఉన్నాడు.

యువకుడిగా హైద్రాబాద్ అడ్మినిస్ట్రేటివ్ సర్వీసులో చేరిన అక్బరీ హైదరీ ఆర్థిక శాఖను దశాబ్దానికి పైగా నిర్వహించి, తన చిరకాల కోరికగా ప్రధాని అయ్యాడు. ఆయన గతంలో నిర్వహించిన బాధ్యత గులాబీ పడక ఏమీ కాదు. 1935 చట్టం ఫలితంగా కొత్త సైన్యాన్ని వదులుకోవలసి వచ్చింది. చుట్టూ ఉన్న మద్రాసు, బొంబాయి,

సెంట్రల్ ప్రావిన్సులలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చింది. మద్రాసు ప్రావిన్సులో సి.రాజగోపాలాచారి తన మంత్రివర్గ సహచరులతో కలిసి భారతదేశానికే ఒక మోడల్ పరిపాలన అందించడానికి ప్రయత్నించాడు. హైద్రాబాద్‌తో సత్సంబంధాలను కొనసాగించాడు. సెంట్రల్ ప్రావిన్స్ ప్రభుత్వం స్థానిక సమస్యల్లో మునిగిపోగా, బొంబాయి ప్రభుత్వంలోని మంత్రులు మాత్రం హైద్రాబాద్‌లోని నాన్ కాంగ్రెస్ ప్రభుత్వాన్ని సహించలేకపోయారు. వారి శక్తి సామర్థ్యాలన్నింటినీ ఇక్కడ సివిల్ డిస్-ఒబీడియెన్స్ ఉద్యమాన్ని తయారుచేయడానికి ఉపయోగించారు. ముఖ్యమైన శాఖలను నిర్వహించే మొరార్జీదేశాయ్, కె.ఎం.మున్షీ వ్యక్తిగతంగా శ్రద్ధ తీసుకొని ప్రచారాన్ని నడిపించారు. బ్రిటిష్ ఇండియాలో సామూహిక సహాయ నిరాకరణ ఉద్యమం నిర్వహించిన సీనియర్ వ్యక్తులను ఇందుకు ఉపయోగించుకున్నారు. వందల మైళ్ళు విస్తరించిన పశ్చిమ సరిహద్దు నుండి వాలెంటీర్ల బ్యాచులను పంపి ఇక్కడి ప్రజలకు సహాయ నిరాకరణను ప్రబోధించి స్వాతంత్ర్యం కోసం పోరాడాలని ప్రచారం చేయించారు. వాళ్ళ పద్ధతులు సింపుల్- రోడ్లకు అడ్డంగా కూర్చొని ట్రాఫిక్‌ను జాం చేయడం దగ్గర నుండి ప్రభుత్వ భవనాలను కాలబెట్టడము, లూటీ చేయడం వరకు. ఎవరూ ఆహ్వానించని గుంపులు సరిహద్దు దాటి ప్రవేశించాయి- వాళ్ళలో కొందరిని అరెస్టు చేసి నిర్బంధించడం జరిగింది. స్టేట్ కాంగ్రెస్, ఆర్యసమాజ్, హిందూ మహాసభలతో కొన్ని స్థానిక సంస్థలు వారితో చేతులు కలిపాయి. మొదట్లో ఈ ఉద్యమం తీవ్రమవుతుందేమోననే భయం పరిపాలకులకు ఏర్పడింది. కాని నాలుగైదు వేల మంది వాలంటీర్లను అరెస్టు చేయగానే ఉద్యమం ఆగిపోయింది. మొరార్జీ దేశాయ్, మున్షీ, తీర్థలాంటి వాళ్ళు ఎంత ప్రయత్నించినా ఇక్కడి ప్రజల నుండి వచ్చిన స్పందన చాలా తక్కువ. వాళ్ళు ఇచ్చిన నినాదాలు మొదట కొంతమేరకు స్థానికులను ఆకర్షించినప్పటికీ తర్వాత పరిహాసాల పాలైనాయి. కొద్దికాలానికే ఉద్యమం పేలవమయింది. అయితే ప్రభుత్వ సమాచారం వల్ల తమ అనుమానాలు నివృత్తి అయినందున, రాజ్యాంగ సంస్కరణలు ప్రవేశపెట్టబడుతున్నందున ఉద్యమాన్ని నిలిపి వేస్తున్నట్లు ప్రకటించారు.

రాజ్యాంగ సంస్కరణలు అక్బర్ హైదరీకి చిక్కు సమస్యగా మారాయి. రెండవ ప్రపంచ యుద్ధానికి ముందు బ్రిటిష్ వాళ్ళు చేపట్టిన భారత ఫెడరేషన్ వల్ల అక్బర్ హైదరీ కావలసినంత చెడ్డ పేరు మూటగట్టుకున్నాడు. ఈ ఫెడరేషన్ చర్చల సారాంశం పట్ల నిజాం నవాబు, సంస్థానంలోని హిందువులు, ముస్లింలు ఎంతో వ్యతిరేకతతో ఉన్నారు. ముస్లింల ప్రతినిధిగా బహద్దూర్ యార్‌జంగ్, అక్బర్ హైదరీ మీద విమర్శలు

గుప్పించసాగాడు. ఫెడరేషన్‌లోని భాగస్వామ్య పక్షాల మధ్య అంగీకారం కుదరక పోవడం, రెండవ ప్రపంచ యుద్ధమేఘాలు దేశాన్ని ఆవరిస్తూ ఉండడం వల్ల ప్రధాన సమస్య తెరమరుగైనప్పటికీ అక్బర్ హైదరీ మీది అపనమ్మకం అలాగే ఉండిపోయింది. ఆయన ప్రతిపాదించిన సంస్కరణలు హిందువులు, ముస్లిముల తిరస్కారానికి గురయినవి– కేవలం వ్యతిరేక కోణం నుండే. రెండు మతాల నుండి రాజకీయ ఆధిపత్య పోరాటం అది. పైగా ఆయన అనుమానాస్పదంగా దూరం నుండి చూస్తున్న నిజాం నవాబుతో సున్నితమైన సంబంధాలను కాపాడుకోవాలి. పట్టుదలలు పెరుగ జొచ్చాయి. అన్ని రాజకీయపార్టీలు రహస్య, బహిరంగ ప్రణాళికలను సిద్ధం చేసుకో జొచ్చాయి. రెండవ ప్రపంచ యుద్ధం అక్బర్ హైదరీకి కలిసి వచ్చింది. యుద్ధ సన్నాహాల మాటున ఆయన తక్షణ సమస్యల నుండి తప్పించుకున్నాడు. బ్రిటిష్ ఇండియాలోలాగా చాలా రక్షణ ఆర్డినెన్సులు ఇచ్చాడు. కాంగ్రెస్ బలహీనపడింది. వివిధ ప్రావిన్సులలోని కాంగ్రెస్ మంత్రివర్గాలు రద్దయినాయి. ఇతర రాజకీయ పార్టీల చర్యలు ఏమీ లేనందున ఇత్తెహాదుల్ ప్రతి చర్యలు కూడా లేవు. ఆ కారణం వల్ల అక్బర్ పాలన కొంత కాలమైనా సవ్యంగా నడిచింది.

యుద్ధకాలపు కష్టమైన రోజులలో బ్రిటిష్ వాళ్ళకు అక్బర్ హైదరీ మంచి మిత్రుడయ్యాడు. అప్పుడు ఆయన సలహాలు విన్నారు. అలాగే వాళ్ళు చెప్పిందల్లా ఆయన చేసాడు. మొదట బ్రిటిష్ వాళ్ళకు ఆ తర్వాత బ్రిటిష్ పక్ష దేశాలకు, సైన్యానికి, సామగ్రికి హైద్రాబాద్ ఒక ప్రధానమైన వనరుగా మారింది. హైద్రాబాద్ విధ్వంసానికి గురిగాని ప్రాంతంగా ఉండిపోయింది. అన్ని చెల్లింపులూ బ్రిటిష్ ఇండియా కరెన్సీలో జరుగుతుండగా దానికి ప్రతిచర్యగా హైద్రాబాద్ కరెన్సీ సర్క్యులేషన్ కూడా పెరిగింది. అంతర్గత రాజకీయ సమతౌల్యాన్ని పాటించడంతోపాటు బలమైన యుద్ధ ప్రయత్నాలు చేయడమే అక్బర్ హైదరీ చేసిన పని. నిజానికి ఆయన జీవితంలో సంతోషకరమైన అద్భుతమైన రోజులవి. ఆయనకు నష్టం ఎక్కడ జరిగిందంటే–రాష్ట్ర పాలనలో ఆయన విజయవంతమవడం, బ్రిటిష్ వాళ్ళ దగ్గర ఆయన పలుకుబడి పెరగడం నిజాం సహించలేకపోవడం వల్ల. ఈ విషయం అక్బర్ హైదరీకి తెలుసు, కానీ ఆయనకు ఏ నష్టము జరగని విధంగా పరిస్థితులున్నాయి. సంస్థానంలోపలా, బయటా ప్రజాభిప్రాయాన్ని ప్రభావితం చేయగల నిజాంను ఆయన లక్ష్యపెట్టలేదు.

ఉస్మానియా యూనివర్సిటీని తన కలల పంటగా భావించేవాడు హైదర్ అలీ. అవిభక్త భారతదేశంలోని మిగతా విశ్వవిద్యాలయాలన్నింటిలో ఇంగ్లీషు

మాధ్యమం కొనసాగుతూ ఉండగా ఉస్మానియాలో మాత్రం దేశీయ ఉర్దూ భాషలో బోధన కొనసాగుతూ కూడా మిగిలిన యూనివర్సిటీల స్థాయికి ఏమాత్రం తగ్గకుండా గర్వంగా నిలబడ్డది. ప్రతి డిపార్ట్‌మెంట్‌లోనూ ఇంగ్లీషు, ఇతర భాషల నుండి పెద్ద సంఖ్యలో పుస్తకాలు అనువాదమవుతూ ఉండేవి. అనువాద శాఖ ఒకటి ఈ పనిని విస్తరిస్తూ ఉండేది. వ్యవసాయం, పరిశ్రమలు, ఆర్థికాభివృద్ధికి ఆయన చేసిన సేవలు చెప్పదగినవి. రాష్ట్ర ఆర్థిక పరిస్థితిని ఆయన స్థిరపరిచాడు. ఇతర రంగాలలో కూడా ఆయన ప్రయత్నాలు విజయం సాధించాయి. ఒక్క విషయంలోనే ఆయన దురదృష్టవంతుడు– అదేమిటంటే ఆయన శ్రమ, వ్యక్తిగత ప్రతిష్ట గుర్తించబడలేదు.

పిల్లలు ఎప్పుడూ పిల్లకాయ చేష్టలే చేస్తారు. ఒక చిన్న విషయాన్ని పట్టుకొని గొడవ చేసి వేలాదిమంది యూనివర్సిటీ నుండి ప్రధాని నివాసానికి వచ్చారు. ఇంటిని చుట్టుముట్టి విధ్వంసానికి దిగారు. ఇంట్లో కొన్ని వస్తువులను పగలగొట్టారు, ఫర్నిచర్ ధ్వంసం చేసారు. అయితే ఇంట్లో ఉన్న మనుషుల తెరువు రాలేదు. పోలీసు ఉన్నతాధికారి వచ్చాడు. విద్యార్థుల్ని బయటికి పంపించే క్రమంలో ఆయన గాయపడ్డాడు. కొద్దిసేపయాక గొడవ సద్దుమణిగింది. ఎక్కడి వాళ్ళక్కడికి వెళ్ళి పోయారు. ఒక గంటలో ఈ తతంగమంతా జరిగిపోయింది కాని ఇదెందుకు జరిగింది, జరగకుండా ఏం చేయాల్సి ఉండె అనే ఆలోచన చాలామందికి వచ్చింది.

అక్బర్ హైదరీని గౌరవప్రదంగా హైద్రాబాద్‌కు దూరం చేయడమెలా అని నిజాం ఆలోచించాడు. బ్రిటిష్ వాళ్ళు అక్బర్ హైదరీ సేవలను బ్రిటిష్ ఇండియా కోసం అడిగేట్లు చేసారు. ఆ విషయం అక్బర్ హైదరీకి తెలియకుండానే ఢిల్లీకి తన సమ్మతి తెలిపాడు నిజాం. నిజానికి అక్బర్ హైదరీ ఆ ప్రతిపాదనను తిరస్కరించవచ్చు కానీ ఇదీ మంచిదే అనుకొని ఓ శుభోదయాన హైద్రాబాద్‌ను విడిచిపెట్టాడు. రెండవ ప్రపంచ యుద్ధం ఉచ్ఛ స్థితిలో ఉండగా 1941లో ఇదంతా జరిగింది.

బ్రిటన్ ప్రతినిధి సిఫారసు మేరకు నవాబ్ ఛత్తారిని అక్బర్ హైదరీ వారసుడిగా నియమించాడు నిజాం. బ్రిటిష్ బ్యూరోక్రసీకి సమన్వయంగా, మర్యాదగా ఉండడం నేర్చుకొన్నాడు ఛత్తారి. పదవి స్వీకరించిన తర్వాత పరిపాలనలో ఎలాంటి పెద్దపెద్ద మార్పులు చేయలేదు. బ్రిటిష్ రెసిడెంటుతో సన్నిహిత సంబంధాలు ఏర్పరచుకున్నాడు. తెలివిగా, జాగ్రత్తగా రాజ్యాంగ సంస్కరణలకు దూరంగా ఉన్నాడు. ఎలాంటి కార్యక్రమాలు లేకుండా కాలం గడుస్తుంది, రాజకీయ గ్రూపులు ఆందోళనలో పడిపోయాయి. అకస్మాత్తుగా బహద్దూర్ యార్‌జంగ్ చనిపోయాడు. ఇత్తెహాదుల్

బలహీనుల చేతుల్లోకి పోయింది, అంతర్గత ఈర్ష్యలు, గొడవలు పెరిగిపోయాయి. స్టేట్ కాంగ్రెస్ ప్రజల్లో కలవలేకపోయింది. అక్బర్ హైదరీ మొదలుపెట్టిన యుద్ధ ప్రయత్నాలు యథాతథంగా నడుస్తున్నాయి. నియంత్రణలేని ఆహారధాన్యాల ఎగుమతి వల్ల రాష్ట్రం మిగులు స్థాయి నుండి లోటుకు వచ్చింది. ఆ లోటు సరిగ్గా తెలిసివచ్చేవరకే సరుకుల దాచివేత, బ్లాక్ మార్కెటింగ్ పెరిగిపోయింది. అయితే ఈ సమస్యలేవి ఛత్తారిని కదిలించలేదు. తనదైన బ్యూరోక్రాటిక్ పద్ధతిలో ఆయన పాలన కొనసాగింది.

మానవ స్వభావం విచిత్రమైనది. గంభీరమైన సమస్యలు లేకపోతే పెద్ద సంఘర్షణలు ఎదురు కాకపోతే ప్రజలు అల్పమైన ఉదాసీనతలో కూరుకుపోతారు. ఛత్తారి కాలంలో ఇలాంటి సంఘటన ఒకటి జరిగింది. రాష్ట్రంలోని ఒక మిషన్ హాస్పిటల్‌లో ఒక చిన్న మజీదును అవివేకంతో స్థానిక అధికారులు కూల్చారు. తూర్పు దేశాల్లో ప్రార్థనా స్థలాల పట్ల ఇలాంటి అగౌరవాన్ని ఎంతమాత్రం సహించరు. బ్రిటిష్‌వాళ్ళ శాంతి భద్రతల పర్యవేక్షణలో ఇది ఒక అతి సాధారణ విషయంగా తీసుకోబడ్డది.

ఈ విషయమై ఎన్ని విజ్ఞప్తులు వచ్చినా ఆయన వ్యక్తిగత శ్రద్ధ పెట్టక అధికారులకు అప్పజెప్పాడు. అధికారులు దాని మానాన దాన్ని వదిలిపెట్టారు. ఛత్తారి రాబోయే ప్రమాదాన్ని పసిగట్టాడు. తన సంబంధిత మంత్రివర్గ సహచరుడిని ఇబ్బంది పెట్టడం ఇష్టం లేకపోయినా ఒక ఆంగ్లేయుడి ఆదేశంతో ఆయన కదిలాడు. యధావిధిగా సంబంధిత మంత్రికి మృదువుగా చెప్పి పని చూడమన్నాడు. ఆయన మెతకవైఖరి బెడిసికొట్టింది.

ప్రభుత్వానికి వ్యతిరేకంగా పెద్ద ప్రజా సమావేశం జరిగింది. ఆ సమావేశంలో రెచ్చిపోయిన ప్రజలు ప్రధాని అధికార నివాసం 'షా మంజిల్' వైపు నడిచారు. షా మంజిల్ గేట్లు తెరిచి ఉన్నాయని, సెక్యూరిటీ చాలా తక్కువగా ఉందని ప్రజలు గమనించారు. అదే సమయంలో ఛత్తారి మంత్రివర్గ సమావేశం జరిపి జరిగిన పొరపాటును సరిదిద్దే నిర్ణయం తీసుకున్నాడు. కాలం దాటి పోయింది. ఆయన తీసుకున్న నిర్ణయం ప్రజలకు తెలియజేసే లోపే షా మంజిల్ పొగలో, మంటల్లో చిక్కుకుపోయింది. ధైర్యవంతులైన ఆయన ఉద్యోగులు, బ్రిటిష్ సహచరులు ఆయనను, ఆయన కుటుంబాన్ని భవనం వెనక వైపు నుండి తప్పించారు. భవనంలోని ఫర్నిచరంతా బూడిదయింది. ప్రజల గుంపు అక్కడి నుండి ఆయన బ్రిటిష్ సహచరుడు, శాంతి భద్రతల మంత్రివద్దకు నడిచింది. అక్కడ కూడా విధ్వంసం సృష్టించింది. రెండు

భవనాల విధ్వంసం జరిగాక ప్రజలంతా చెదిరిపోయి, ప్రజల వెంట నడిచిన నాయకులు మాత్రం అరెస్టయ్యారు.

హైద్రాబాద్ పరిపాలనా చరిత్రలో ఇటువంటి సంఘటన ఎప్పుడూ జరగలేదు. ప్రభుత్వం ఇంత ఉదాసీనంగా ఎప్పుడూ ప్రవర్తించలేదు. ప్రభుత్వం ఇంతటి అప్రతిష్టకు ఎప్పుడూ గురికాలేదు. జరిగిన విధ్వంసం విలువ లెక్కించదగినదేమీ కాకపోయి నప్పటికీ భవిష్యత్ రాజకీయ పరిణామాల మీద ఇది ఒక పెద్ద ముద్రనే వేసింది. ఛత్తారి ఆందోళన నుండి తేరుకోలేదు. ఛత్తారిని నిజాం రాజీనామా చేయమన్నాడు, ఛత్తారి నిష్క్రమించాడు. బ్రిటిష్ రాజప్రతినిధి పట్టుబట్టినందున శాంతిభద్రతలను చూసే బ్రిటిష్ మంత్రి మాత్రం ఉద్వాసన నుండి మినహాయించబడ్డాడు.

# 7. సంక్షోభంలోకి సర్ మీర్జా ఇస్మాయిల్



భవిష్యత్తును ప్రభావితం చేయగలిగే ప్రాథమిక అంశాలపై ఇండియన్ కాంగ్రెస్, ముస్లింలీగ్ నాయకులు, బ్రిటిష్ ప్రతినిధుల మధ్య ఢిల్లీలో చర్చలు జరుగుతున్న కాలంలో, సర్ మీర్జా ఇస్మాయిల్ హైద్రాబాద్‌లో వ్యవహారాలు చూస్తున్నాడు. ముస్లింలీగ్ ప్రాతినిధ్యమేదీ ఆయనకు నచ్చదన్నది జగమెరిగిన సత్యం. హైద్రాబాద్ ప్రధాని పదవికి తన అభ్యర్థిత్వాన్ని జిన్నా వ్యతిరేకించిన సంగతి, ఆయన మరిచిపోలేదు. ముస్లింల కోసం పని చేయాల్సిందిగా జిన్నా ఇచ్చిన ఆహ్వానాన్ని అంగీకరించడం పట్ల ఆసక్తి లేదని మీర్జా రాసిన లేఖను కూడా జిన్నా పత్రికలకు విడుదల చేసాడు. జిన్నా ఆహ్వానాన్ని తిరస్కరించడానికి కారణాలు వ్యక్తిగతమైనవే తప్ప, అంతకంటే గంభీరమైన విషయాలేమీ లేవు. ఆ ఉత్తరాన్ని బయట పెట్టడంవల్ల మీర్జా ప్రతిష్ట బాగా దెబ్బ తిన్నది. ప్రధాని పదవికోసం ఉన్న అవకాశాలను దెబ్బతీసింది– దాన్నతడు ఎన్నడూ క్షమించలేదు. అయినా నిజాం మాత్రం మీర్జాను ప్రధానిగా నియమించాడు. కాని తొందర్లోనే అసంతృప్తికి గురై దాన్ని బహిరంగంగా వ్యక్తపరచడం ఆరంభించాడు.

ఈ పరిస్థితుల్లో మిర్జా రాజీనామా చేస్తాడని అందరూ భావించారు కానీ ఆయన మొండిగానే వ్యవహరించాడు. ప్రధానిగా ఛార్జ్ తీసుకున్న తర్వాత అంత సులభంగా పదవిని వదలడానికి సిద్ధపడలేదు. ఒక దశలో మిర్జాకు నిజాంకు మధ్య పెద్ద ఘర్షణే నడిచింది. ఇత్తెహాద్ అంతా గమనిస్తూనే ఉంది. ఇత్తెహాదుల్‌కు మిర్జా అంటే ఎంత మాత్రమూ పడదు కానీ నిజాం మీద గౌరవంతో ఆయనను ప్రధానిని కానిచ్చారు. ఎలాంటి నిరసన ప్రదర్శనలు చేయలేదు. నవాబు మీద గౌరవంతో తమ అంతర్గత భావనలను అణుచుకున్నారు. అధికారం చేపట్టాడు కనుక అతనికి కూడా ఒక అవకాశం ఎందుకివ్వకూడదు అని ఒక వర్గం భావించింది. మీర్జా కూడా ప్రజలకు ఒక విజ్ఞప్తి చేస్తూ తన గతాన్ని బట్టి కాకుండా ఇప్పుడు చేయబోయే పనిని బట్టి అంచనా వేయమని కోరాడు.

మీర్జా ప్రకటించనంత గొప్పగా ఏం చేయలేదు. ఉద్దేశ్యపూర్వకంగా కాకపోవచ్చు కాని ఆయన చర్యలు ప్రజలకు ఆగ్రహాన్నే తెప్పించాయి. ఎత్తైన కాంపౌండులు కూల్చడం, రోడ్ల వంపుల్ని తీర్చడం, పార్కులను విద్యుద్దీకరించడం లాంటి పట్టణాభివృద్ధి కార్యక్రమాలలో సమయాన్ని వెచ్చించడం తప్ప మీర్జా ఏ ముఖ్యమైన పనీ చేయలేదు. దేశానికి ఆయన కొత్తవాడు కాబట్టి శ్రద్ధగా విషయాలను అవగాహన చేసుకొని ప్రాథమ్యాలను నిర్ణయించుకుంటాడనుకున్న నమ్మకం వమ్మయింది. కాని తన అపారమైన అనుభవంతో ఏదో అద్భుతం చేస్తానన్నట్లు ప్రవర్తించేవాడు. మంచి సలహాలను పెడచెవిన పెట్టేవాడు. పదేపదే చెబితే వాటిని వ్యతిరేకించేవాడు. నమ్మకమైన చాలా గౌరవప్రదమైన వ్యక్తుల ద్వారా నగరానికి సమీపాన ఉన్న బ్రిటిష్ జనరల్ వద్ద పెద్ద సంఖ్యలో ఆయుధాలు, మందుగుండు ఉందని తెలిసింది. ముప్పై, నలభై మిలియన్ రూపాయల ఖర్చుతో వాటిని నిజాం ప్రభుత్వం సేకరిస్తే బాగుండేదని వాటి అసలు విలువ అంతకు ఎన్నో రెట్లు అదనంగా ఉంటుందని ప్రభుత్వంలోని అధికారులు భావిస్తూ ఉన్నట్లు తెలిసింది. ఈ ప్రతిపాదనను నేను ఆయన దగ్గరకు తీసుకువెళ్తే మీర్జా నిర్ద్వంద్వంగా తిరస్కరించాడు. హైద్రాబాద్‌కు యుద్ధం చేసే అవసరం లేదని, అది డబ్బును వృథా పుచ్చడమేనని చెప్పాడు. మొఖం మీద 'నో' అని చెప్పే ఒక చెడ్డ అలవాటు ఆయనకు ఉండేది. ఆయన నుండి అవును అనే మాట రానే రాదని ప్రజలు, అధికారులు భావించడం మొదలు పెట్టారు.

ఇత్తెహాద్‌కు అనుకోకుండా ఆయన అప్పాయింట్‌మెంట్ దొరకడం, ఆయన అనూహ్యంగా కొన్ని హామీలు ఇవ్వడంతో కొంత సంతృప్తి చెందారు. వాళ్ళ డిమాండ్లను తక్షణం పరిష్కరిస్తానని ఆయన హామీ ఇచ్చినప్పటికీ ఇత్తెహాదుల్‌కు ఏమంత నమ్మకం

కుదరలేదు. వాస్తవానికి ఆయన ప్రవర్తన కూడా తద్విరుద్ధంగానే ఉండేది. కొంతకాలానికి నిర్దిష్టంగా లేని సాధారణమైన కొన్ని ఆదేశాలు ఇచ్చాడు కానీ వాటిని ఆచరణలో పెట్టేట్లు కనిపించలేదు. ఇంకొక పక్క ఆయన తొందరపాటు ప్రకటనలు ముస్లింలకు కోపం తెప్పించి, ఆయన ఎంత తియ్యగా మాట్లాడినా ఎవ్వరికీ నచ్చకుండా పోయింది. అన్నివైపులా మీర్జాకు వ్యతిరేక అభిప్రాయం రూపు దాల్చడంతో తను బలహీనపడ్డట్లు ఆయన భావించాడు. కొన్ని సందర్భాలలో ఆయన తన వ్యక్తిగత భద్రతపై కూడా ఆందోళన చెందాడు. పోలీసు ఉన్నతాధికారిని పిలిచి భద్రత గురించి తరచూ విచారించేవాడు. తన ఇంట్లో, తన వ్యక్తిగత గదిలో అనూహ్యమైన సంఘటనల కేమైనా అవకాశం ఉందా అని ఆరా తీసేవాడు.

తనకు సమయం దొరికినప్పుడు రాజ్యాంగ సంస్కరణల గురించి వివిధ రాజకీయ పక్షాలతో మాట్లాడుతుండేవాడు. నూతన రాజ్యాంగం ఏర్పాటు అమలుకు సంబంధించిన తాత్కాలిక బాధ్యతలు మోయిన్ నవాజ్ జంగ్ నిర్వహిస్తుండేవాడు. వివిధ రాజకీయ పక్షాలకు మీర్జా ఇస్మాయిల్ తరచూ ఆచరణ సాధ్యం కాని హామీలను ఇస్తూ ఉండేవాడు. అలాంటి చర్యల వల్ల వివిధ రకాలైన, పరస్పర విరుద్ధమైన రాజకీయ పక్షాలతో వ్యవహరించడం మోయిన్ నవాజ్ జంగ్‌కు తలకు మించిన భారంగా మారేది. కొన్నికొన్నిసార్లు అతి ముఖ్యమైన విషయాలను సర్ మీర్జా ద్వారా లేదా అడ్డంకులు వేయడం ద్వారా అప్రయోజకంగా లేదా తిరోగమనాత్మకంగా మార్చేవాడు. స్టేట్ కాంగ్రెస్ మాట వినకపోవడం వల్ల దాని నాయకులు ఆయనకు చాలానే చికాకులు కలిగించేవారు. అయినా ఆయన లక్ష్యపెట్టేవాడు కాదు, పైగా అది తన పురోగతికి కొలమానంగా భావించేవాడు. ఆవిధంగా కాంగ్రెసుకూ, కొంత హిందూ సెక్షనుకూ ఆయన చెడ్డవాడైపోయాడు. తను బహిరంగంగా మద్దతిచ్చే ఆలిండియా కాంగ్రెస్ కూడా ఆయనకు మద్దతు పలకడం మానుకుంది. అన్ని సమూహాల మీద తన పట్టు కోల్పోతున్నట్లు ఆయనకు తొందరలోనే అర్థమయింది. ముస్లిం సమాజంలోనూ, హిందూ రాజకీయ సంస్థలలోనూ ఆయన పట్టు కోల్పో యారు. నిజాం అంతకు ముందే ఆయన మీద నమ్మకం కోల్పోయాడు.

కాంగ్రెస్ బహిష్కరించినప్పటికీ రాజ్యాంగ సంస్కరణలు ప్రవేశపెట్టబడి, కొత్త రాజ్యాంగం ప్రకారం శాసనసభకు ఎన్నికలు జరిగాయి. ఈ పురోగతి చిన్నదని చెప్పలేం. ఒకవేళ కాంగ్రెస్ ఎన్నికల్లో పాల్గొని ఉంటే హిందూ స్థానాలను చాలానే గెలిచి ఉండేది; అయినా కాంగ్రెస్ లేకుండా కూడా పోలింగు, పోటీ బాగా జరిగింది. కొత్త అసెంబ్లీ సమావేశమయింది. ముస్లిం సీట్లన్నీ ఇత్తెహాద్ గెలుచుకుంది. ఇత్తెహాద్

మీద పోటీ చేసిన వాళ్ళందరివీ డిపాజిట్లు పోయినవి. ఆవిధంగా అసెంబ్లీలో ఇత్తెహాద్ తిరుగులేని శక్తిగా మారి ఆధిపత్యం చూప నారంభించింది. ఖాసిం రజ్వీ అసెంబ్లీలో దాని నాయకుడు. అసెంబ్లీ సమావేశాల కంటె ముందే ఆయన ఆదేశాలు జారీ చేయడం మొదలుపెట్టాడు. మొదట రాజ్యాంగ వ్యవహారాలలో సంతృప్తికరమైన వివరణ రానట్లయితే ఆయన సభకు రానన్నాడు. సభలోని ప్రధానపక్షాల నుండి కనీసం ఇద్దరు మంత్రుల్ని తీసుకోవాలని కొత్త రాజ్యాంగం ప్రతిపాదిస్తుంది. ఇత్తెహాద్ నుండి జాబితాను ఇవ్వమని మీర్జా, ఖాసీం రజ్వీని అడిగాడు. హిందూ, ముస్లింల నుండి ఒక్కొక్క మంత్రిని తీసుకుందామని ప్రతిపాదించారు. రజ్వీ ఒక్కపేరు కంటే ఎక్కువ ఇవ్వనన్నాడు. ఇద్దరి పేర్లు అడగడం ద్వారా మీర్జా ఒక ఎత్తుగడ వేసాడు. ఇద్దరి పేర్లు తీసుకొని మొదటి పేరు ఒక్కదాన్నే అంగీకరించాడు. ఇలాంటి చిల్లర ఎత్తుగడల మీద చిరాకుపడ్డ రజ్వీ తర్వాత దాన్ని అసలు పట్టించుకోలేదు.

నిజాం జాగ్రత్తగా, అయిష్టంగా ఇదంతా గమనిస్తూ ఉన్నాడు. మీర్జాను ప్రధానిగా నియమించడం తను చేసిన పెద్ద పొరపాటని నిజాం గర్వంగా చెప్పుకుంటూ ఉండేవాడు. రానూ రానూ ఆయన మీద నిజాంకు కోపం పెరిగిపోయింది. కనీసం హిందూ కమ్యూనిటీ లేదా కాంగ్రెస్ పార్టీ నుండైనా మంచిపేరు సంపాదిస్తాడనుకుంటే ఆయన అందులో కూడా పూర్తిగా విఫలమయ్యాడు. రాజకీయ పరిస్థితిని ఆయన ఎంత మాత్రం మెరుగుపరచలేకపోయాడు. పరిపాలనలో ఏ రంగంలో కూడా పురోగతి లేదు. పడిపోయిన, పొట్టిగా తయారైన సిటీ కాంపౌండు గోడలను చూసి, సాంప్రదాయకమైన తెల్లని గోడల మీదుగా వేయించిన పాలిపోయిన పసుప్పచ్చ రంగు (ఇది మీర్జా ఫేవరేట్) చూసి నిజాం అసహనానికి లోనయ్యేవాడు. ప్రజాభిప్రాయం తనకు వ్యతిరేకంగా ఉండడం, నిజాంకు తన పట్ల గల వ్యతిరేక ధోరణి చూసే పరిస్థితిలో మార్పు రానట్లయితే కష్టమని మీర్జా అర్థం చేసుకున్నాడు. కాబట్టి దూరదృష్టి గల ఏదైనా ఒక గొప్పపని చేసి ప్రజా విశ్వాసాన్ని, నిజాం ప్రాపకాన్ని పొందాలని మీర్జా నిర్ణయించుకున్నాడు.

తన తండ్రి కాలంలో బ్రిటిష్ రాజ ప్రతినిధి లార్డ్ కర్జన్ విభజించి ఇండియాలో కలుపుకున్న బేరార్ ప్రావిన్సును తిరిగి పొందాలన్నది నిజాం జీవితకాలపు కాంక్ష. గతంలో ప్రధానుల ద్వారా నిజాం ఈ దిశగా చేసిన ప్రయత్నం వల్ల హైద్రాబాద్ సార్వభౌమత్వం నామమాత్రంగా గుర్తించబడి సంవత్సరానికి ఒకసారి జెండా ఎగురవేయబడింది. నాగపూర్‌లో ఒక ఏజెంటు జనరల్‌ను నియమించుకోగలిగింది. సెంట్రల్ ప్రావిన్స్‌లో నాగపూర్ ఒక ప్రాధాన్యత గలిగిన ప్రాంతంగా ఉంది. నిజానికి

అది బ్రిటిష్ ఇండియాలో ఒక భాగమే. ఇలాంటి దయనీయమైన సందర్భంలో బేరారు ప్రతిపాదన నిజాం ముందుకు తెచ్చాడు మీర్జా. తన వ్యక్తిగత ప్రతిష్టను ఉపయోగించి కాంగ్రెస్, బేరార్‌లోని హిందువుల ద్వారా ఆ ప్రావిన్సును తిరిగి సంపాదించుకుందామని మీర్జా నిజాంకు చెప్పాడు. తన ప్రయత్నం పట్ల చాలా నమ్మకంతో ఉండి, బేరార్ ప్రయాణానికి సిద్ధమయ్యాడు. అయితే ఆయనది వ్యర్థ ప్రయత్నమవుతుందని నాగపూర్ ఏజెంట్ జనరల్ చాలా స్పష్టంగా చెప్పాడు. మీర్జా ఇస్మాయిల్ ఆహ్వానించగానే హైద్రాబాద్‌ను సందర్శించడానికి బేరార్ హిందువులు సిద్ధంగా లేరని, వాళ్ళు తిరిగి హైద్రాబాద్ సంస్థానంలో కలిసిపోవడానికి పెద్దగా ఆసక్తి చూపరని కూడా ఆయన సూచించాడు.

అయినా మీర్జా ఇస్మాయిల్ మితిమీరిన ఆత్మవిశ్వాసంతో నిజాంకు ఒక వర్తమానం పంపించాడు. బేరార్ స్థానిక నాయకులు హైద్రాబాద్‌ను సందర్శించేందుకు నిజాం పాదాల చెంత తమ ప్రభుభక్తిని సమర్పించేందుకు తగిన ఏర్పాట్లు చేసినట్లు ఆ వర్తమానం సారాంశం. హైద్రాబాద్‌కు బేరార్ నాయకులు వచ్చాక వారిని కలుసుకోవచ్చనే ఉద్దేశంతో ఆయన ఢిల్లీకి ప్రయాణమయ్యాడు. అయితే ఆయన తిరిగి హైద్రాబాద్ వచ్చేసరికి మర్యాదకోసం హైద్రాబాద్‌ను సందర్శిస్తామని ఒప్పుకున్న బేరార్ నాయకులు ఇండియన్ కాంగ్రెస్ అధిష్టానం హెచ్చరికతో, హైద్రాబాద్‌ను సందర్శించలేమని క్షమాపణలు చెప్పారు. ఆట ముగిసింది. ఆయనకు హైద్రాబాద్‌లో ఇంకెంత మాత్రమూ స్థానం లేకుండా పోయింది. తిరిగి ఎన్నడూ రాలేకుండా ఆయన స్వస్థలం బెంగుళూరుకు వెళ్ళిపోయాడు.

నిజాంకు మరోమారు ప్రధానిని వెతుక్కోవలసిన పని పడింది. ఇండియాలో బ్రిటిష్ వారి పట్టు సడలిపోతున్నా హైద్రాబాద్‌లో మాత్రం అలాంటి ఛాయలు కనబడకుండా చూసుకున్నారు. బ్రిటిష్ రెసిడెంట్ రాజ ప్రతినిధితో చర్చించడం ఒక గౌరవంగా భావించి ప్రధాని ఎంపికలో వాళ్ళ భాగస్వామ్యం ఉండాలని కోరుకున్నాడు. బ్రిటిష్‌వాళ్ళ ప్రాపకం పొందడానికి మరొక అవకాశం దొరికింది కాబట్టి దాన్ని వదులుకోకూడదనుకున్నాడు. నిజానికి హైద్రాబాద్ సంస్థానానికి ప్రధాని పదవి ఎవరైనా నిర్ణయించి వేయగల సాధారణ అంశం. కాని గతంలో ఎన్నడూ లేనంత సంక్లిష్టంగా ఉన్నాయి హైద్రాబాద్ పరిస్థితులు. భారతదేశంతో సంబంధాలు ఇబ్బందికరంగా ఉన్నాయి. రాష్ట్రంలో పరిస్థితులు సున్నితంగా ఉన్నాయి. ముఖ్యంగా ముస్లింలు ఏది ఏమైనా భారత్‌కు అతీతమైన దేశంగా ఉంచాలని కాంక్షతో ఉన్నారు. ప్రయత్నించు లేదా మరణించు అనే పరిస్థితులు ఏర్పడ్డాయి. రాష్ట్రం సరిహద్దుల

వెంట దాడులు ఎక్కువ కావడంతో అశాంతి వాతావరణం అలుముకుంది. తమ జీవితాలను దాని గౌరవాన్ని, తమ ఇండ్లనూ బతుకు దెరువును కాపాడుకోవడం కోసం పోరాడ వలసిన పరిస్థితులు తలెత్తనున్నాయని ప్రజలు, ముఖ్యంగా ముస్లింలు అవగాహనకు రావలసిన పరిస్థితులు ఏర్పడ్డాయి. ఇంకొక వైపు బ్రిటిష్ వాళ్ళ నిష్క్రమణ ఖాయమైపోయి, స్వాతంత్ర్యకాంక్ష అందరి కళ్ళల్లో ప్రతిఫలించసాగింది.

ఛత్తారి హైద్రాబాద్‌కు రాగానే స్వతంత్ర భారత దేశంతో నెరపాల్సిన సంబంధాల మీద దృష్టి పెట్టాడు. అప్పటికి ప్రతి ఒక్కరూ ఎదుర్కొన్న క్లిష్ట సమస్య అదే. ఛత్తారి, సర్ వాల్టర్ మాంక్‌టన్‌ను హైద్రాబాద్‌కు ఆహ్వానించాడు. మాంక్‌టన్‌కు, గవర్నర్ జనరల్ లార్డ్ మౌంట్‌బాటన్‌కు మంచి స్నేహసంబంధాలున్నాయని, అందువల్ల సాధారణ చర్చలకు, వ్యక్తిగత అభిప్రాయాలు పంచుకోవడానికి ఇది ఉపయోగపడు తుందని ఒక అభిప్రాయం ఉండేది. నిజాం యధాప్రకారం మౌంట్‌బాటన్‌కు అత్యంత ప్రాధాన్యం ఇచ్చాడు. తనకు నిజమైన రక్షకుడిగా భావించాడు. అయితే ఒకవేళ ఆయన భారత్ పక్షాన హైద్రాబాద్‌తో మంచి సంబంధాలను నెరిపేవాడే అయినా ఆయన చేతిలోకి ఏ అధికారమూ బదిలీ కాలేదన్న వాస్తవాన్ని నిజాం గమనించలేక పోయాడు. నిజంగా నిజాం ఎదుర్కోవలసిన వ్యక్తులు పండిట్ నెహ్రూ, సర్దార్ పటేల్ కానీ మౌంట్ బాటెన్ కాదు. ఈ విషయాన్ని ఛత్తారి కానీ మాంక్‌టన్ కాని నిజాంకు సరిగ్గా అర్థం చేయించలేకపోయారు. దేశీయ రాజులను, సంస్థానాధీశులను దారికి తెచ్చుకోవడానికి, లోబరుచుకోవడానికి మాత్రమే కాంగ్రెస్ పార్టీ స్వతంత్ర భారతదేశానికి లార్డ్ మౌంట్‌బాటెన్‌ను గవర్నర్ జనరల్‌గా అంగీకరించిందన్న వాస్తవాన్ని కూడా వీళ్ళు పసిగట్టలేకపోయారు. బ్రిటిష్ రాజప్రతినిధి అన్నా, గవర్నర్ జనరల్ అన్నా దేశీయ రాజులకు భయమూ భక్తీ ఉన్నాయని కాంగ్రెస్‌కు తెలుసు. మౌంట్‌బాటెన్ కాంగ్రెస్ నాయకులను ప్రసన్నం చేసుకోవడానికి ఏదైనా చేయగల సమర్థుడు. వాళ్ళ ఆకాంక్షల కోసం ఆయన ఏమైనా చేస్తాడు. మొదట్లో మౌంట్‌బాటెన్ నిజాంకు కొంత మానసిక ధైర్యాన్నిచ్చాడు కాని తర్వాత కాలంలో అనేక కష్టాలకు, తీరని నష్టాలకు తెరలేపాడు.

ఢిల్లీలో వేగంగా మారుతున్న పరిణామాలన్నీ నిజాం సలహాదారులు ఆయనకి సరిగ్గా వివరించినట్లు చెప్పలేం. చాలా విషయాలలో ఆయనకు తప్పుడు సమాచారం, తప్పుడు సలహాలే అందినవి. ఛత్తారి తొలిరోజుల్లో హైద్రాబాద్ కోసం ధైర్యవంతమైన నిర్ణయాలు తీసుకున్నాడు. కాని ఆయన స్వంత రాష్ట్ర అధికారుల నుంచి అంత దూకుడుగా పోవద్దని స్పష్టమైన బెదిరింపులు వచ్చాయి. ఆయన స్వరాష్ట్రం యూ.పీ.

లోని ఆయన ఎస్టేటు, ఇతర ఆస్తులకు ఎసరు పెడతామని హెచ్చరికలు వచ్చాయి. ఒక సందర్భంలో ఉత్తరప్రదేశ్ ప్రముఖుడొకరు బహిరంగసభలో మాట్లాడుతూ యూపీ జమీందారులు ఇతర రాష్ట్రాలలో కూర్చొని ఇండియన్ యూనియన్‌కు వ్యతిరేకంగా పనిచేస్తే, అలాంటి వాళ్ళ కోసం యూపీ జైలుగేట్లు తెరిచి ఉంటాయని హెచ్చరించాడు. ఇలాంటి బెదిరింపుల మధ్య ఆయన హైద్రాబాద్ ప్రధానిగా ఏమీ సుఖపడలేదు. అయినా ఆయన చేయగలిగినంత చేసాడు. మాంక్టన్, రాజ్యాంగ వ్యవహారాల మంత్రి అలీయార్ జంగ్‌తో కలిసి ఇండియన్ యూనియన్ నాయకుల అనుమానపు చూపులొక వైపు, హైద్రాబాద్‌కు చెందిన హిందూ ముస్లింల చూపులు మరోవైపు వెంటాడుతుండగా అనేక పర్యాయాలు ఛత్తారి ఢిల్లీ పర్యటనకు వెళ్ళాడు. ఛత్తారిని ఆయన స్వభావరీత్యా కాకుండా అలీయార్ జంగ్‌తో ఉన్న స్నేహం వల్ల ముస్లింలు ఆయనను వ్యతిరేకించారు. అది ఒక దురదృష్టం. ఇత్తెహాద్ నుంచి నామినేట్ చేయబడిన మంత్రి కానీ, ప్రజల హిందూ మంత్రి కానీ ఆయన స్థానాన్ని సుస్థిరం చేయడానికి సహాయపడలేదు. ప్రజల అనుమానాలు– ఛత్తారి, అలీ యార్ జంగ్, వాల్టర్ మాంక్టన్ మీద పెరుగుతూనే పోయాయి.

భారత సమాఖ్య, బేరార్ మీద నిజాంహక్కులు అన్న అంశాల మీద లండన్‌లో జరిగే యుద్ధపూర్వ రౌండ్‌టేబుల్ సమావేశంలో హైద్రాబాద్ ప్రతినిధి వర్గానికి సలహాలివ్వడానికి గాను బ్రిటిష్ రాజసలహాదారుడైన వాల్టర్ మాంక్టన్‌ను అక్బర్ హైదరీ నియమించాడు. ముందే చెప్పినట్లు, ఇండో హైద్రాబాద్ సంబంధాలతో సలహాలివ్వడానికి, నివేదికలు, ఉత్తర ప్రత్యుత్తరాలు తయారు చేయడానికి, 1947–48 ఇండో హైద్రాబాద్ చర్చలలో మౌంట్‌బాటన్‌కూ, నిజాంకు మధ్య వ్యక్తిగతమైన స్నేహ సమన్వయానికి నియమించబడ్డాడు. కాలక్రమేణా నిజాంకు దగ్గరయ్యాడు. హైద్రాబాద్‌ను ఇష్టపడ్డాడు. సంవత్సరాలుగా సాగిన ప్రేమకు పర్యవసానంగా ఇక్కడే పెళ్ళి చేసుకున్నాడు. నిజామే పిల్లనిచ్చాడు. ప్రభుత్వమే వారికి హనీమూన్ ఏర్పాట్లు చేసింది. చిరకాలం గుర్తుండిపోయే అరేబియన్ నైట్స్ కథల్లోలా ఆ జంట ఆనందించింది.

మాంక్టన్‌కు హైద్రాబాద్ మీద ప్రేమకు అనేక కారణాలున్నాయి. ఆయనకు ఆకర్షణీయమైన వేతనం ఉండేది. కొందరైతే హైద్రాబాద్ ఆయనకు భవిష్యత్తు నిచ్చిందనే వారు. తర్వాత కాలంలో ఆయన ఆదాయం కోసం చూడకుండా హైద్రాబాద్ కోసం ఎలా పని చేయగలననే దానిపైనే దృష్టి పెట్టాడు. అయినా స్థానిక రాజకీయాలు ఆయనను ఛత్తారి, అలీ యార్ జంగ్‌తో ముడిపెట్టడం ఆయనను చాలా బాధ

పెట్టింది.

ఒకరోజు పరిస్థితులు వేడెక్కి ఉన్న సందర్భంలో, అది కూడా ముస్లింల అశాంతి వల్ల తను ఛత్తారీని తన మానాన తనను వదిలేసి వెళ్ళిపోతానని బెదిరించాడు. ఆ పరిస్థితి నుండి బయటపడడానికి నన్ను సహాయం అడిగాడు. ఆ రోజుల్లో నేను ఎక్కువకాలం విదేశాలలో ఉండేవాడిని. నాకు రాజకీయాల పట్ల అవగాహన ఉండేది కాదు. ఇత్తెహాద్ ఒక పత్రికా ప్రకటన చేస్తూ ప్రభుత్వ పథకాలను తీవ్రంగా విమర్శించింది. మాంక్టన్ మీద కూడా నమ్మకం లేదని ప్రకటించింది. ఛత్తారి తరఫున, వాళ్ళ ప్రకటనను ఉపసంహరించుకోమని ఇత్తెహాద్‌ను అడిగి విఫలమయ్యాను. రజ్వీ, మాంక్టన్‌లను ఒక్కచోట చేర్చి వారి వారి ఆలోచనలను పంచుకునేట్లు చేయడం ఒక్కటే నాకు మిగిలింది. రాజ్యాంగ వ్యవహారాల మంత్రి వల్లనే వారి మధ్య ఎక్కువ విభేదాలు వచ్చాయని నా అభిప్రాయం.

ఒక విధమైన రహస్యపు మాయ పొర వెనుక నడిచే ప్రభుత్వ వ్యవహారాలు బయటనుండి చూసే సామాన్యులకు తెలియక పోతుండటమే ఇత్తెహాదుల్‌కు వచ్చిన ఇబ్బంది. ఇత్తెహాద్‌కు మాంక్టన్‌కు మధ్య ప్రధాన సమస్య కూడా ఇదే. చివరగా రాజ్యాంగ వ్యవహారాల మంత్రి ఆమోదం లేకుండానే ఇత్తెహాద్ నాయకుడు మాంక్టన్‌ను కలిసాడు. వాళ్ళు హృదయ పూర్వకంగా మాట్లాడుకున్నారు. ఇది కొంతవరకు సమస్యలను తగ్గించినట్లు అనిపించింది, వ్యవహారాలు కొంతకాలం ప్రశాంతంగా నడిచాయి. రాజ్యాంగ వ్యవహారాల శాఖ ఇంకా కొంతమంది ప్రజా నాయకులను విశ్వాసంలోకి తీసుకున్నట్లయితే వ్యవహారాలు కొంత భిన్నంగా ఉండి ఉండేవని రెండు పక్షాలు అభిప్రాయపడ్డాయి. భారతదేశంతో చర్చల బృందంలోని కొందరు సభ్యులకు కూడా బయటికి కనిపించకుండా జరిగే వ్యవహారాల వివరాలు తెలియనివ్వలేదని ఒక అభిప్రాయం ఏర్పడింది. దాంతో అనుమానం, ఆందోళన, ఇబ్బంది పెరగజొచ్చాయి.

ఖాసీం రజ్వీ, వాల్టర్ మాంక్టన్‌ల చర్చల వల్ల ఏర్పడ్డ సానుకూల వాతావరణం నిలువలేదు. అనవసరమైన రహస్యాల వల్ల మళ్ళీ అనుమా నాలు మొదలయ్యాయి. రాజకీయ కల్లోలం మొదలయింది. ఛత్తారి అందరినీ బుజ్జగించడానికి ప్రయత్నించి విఫలమయ్యాడు. ఖాసీం రజ్వీ ఆయన సహచరులు ఇండియాతో చర్చల్లో ఏదో అపసవ్యత ఉందని భావిస్తూ ప్రభుత్వానికి వ్యతిరేకంగా గళమెత్తారు. ఎంతో వ్యక్తిగత ప్రతిష్ట, గౌరవ నీయమైన స్థాయి ఉన్న నిజాంను కూడా వదిలిపెట్టలేదు.



ఇదే సమయంలో రెండు వేల మైళ్ళ రాష్ట్ర సరిహద్దు వెంట తరచుగా, బలమైన దాడులు ఇండియా నుండి జరగడం మొదలయింది. సంఘ విద్రోహ శక్తుల హింసాత్మక సంఘటనలు కూడా మొదలైనాయి. వీటికి ఇండియాలోని అధికారుల నుండి గట్టి అండ ఉంది. వివిధ కమ్యూనిస్టు బ్యానర్ల్లు కూడా వీటి వెనుక ఉన్నాయి. ఈ సమయంలో ప్రభుత్వ యంత్రాంగంలోని బలహీనత, అనిశ్చితిని ఆధారం చేసుకొని రాష్ట్రంలోని కొన్ని ప్రాంతాలలో ఆకర్షణీయమైన కమ్యూనిస్టు నినాదాలతో ఈ శక్తులు ముందుకు వచ్చాయి. కొన్ని చోట్ల, ప్రధానంగా తూర్పు జిల్లాలలో సాయుధ గ్రూపులు కొంత అశాంతి సృష్టించాయి. పోలీసులు అశక్తులుగా మిగిలిపోయారు. ఆయుధాలు గాని, మందుగుండు కానీ వాళ్ళకు చాలా తక్కువ. ఇది రహస్యమేమీ కాదు. ఇండియా బార్డర్ల నుండి అక్కడి అధికారుల మద్దతు, ఆధునిక ఆయుధాలు, కావలసినంత మందుగుండు వారికి లభిస్తుండగా ఇక్కడి పోలీసులు కాలం చెల్లిన ఆయుధాలతో వాళ్ళను ఎదుర్కోవలసి వచ్చేది. అలాగే అంతర్గతంగా కమ్యూనిస్టులను కూడా. ఫలితంగా పోలీసుల పరిస్థితి దెబ్బతిన్నది, చట్టాన్ని గౌరవించే పౌరులది కూడా. సహజంగానే ముస్లింలు అధికంగా ఉన్న ప్రాంతాలలో ఈ అరాచకాన్ని ఎదుర్కోవడానికి ప్రయత్నం జరిగింది, తద్వారా ఈ ప్రాంతాల మీద దాడులు పెరిగి పోయాయి. పెద్ద సంఖ్యలో ముస్లింలు చంపబడ్డారు, వాళ్ళ ఇండ్లు దోచుకోబడ్డవి, కాల్చబడ్డవి.

ఈ సంఘటనల వల్ల పోలీసుల మీద, ప్రభుత్వం మీద అసంతృప్తి పెరిగి పోయింది. ఏదైనా ఒక పెద్ద సంఘటన జరగ్గానే పోలీసు ఉన్నతాధికారి సంబంధిత మంత్రి దగ్గరకు పరుగెత్తడము, సంబంధిత మంత్రి ప్రధాని దగ్గరకు పరుగెత్తడము జరిగేది కాని ఎవరు కూడా అవసరమైన ఆయుధాలను కానీ మందుగుండును కానీ సమకూర్చ లేకపోయారు. మామూలుగా ఆయుధాల కోసం ఇండియాకు పెట్టిన ఇండెంట్లు ఢిల్లీ అధికారుల డెస్కుల్లో మూలుగుతూ ఉండేవి.

భారత ప్రభుత్వంలో కూడా నిజంగా అధికారంలోకి రాకముందు నుంచే కాంగ్రెస్ నాయకులు హైద్రాబాద్‌కు ఆయుధాల సరఫరాను రహస్య వ్యవహారాలతో తొక్కపెడుతుండేవారు. భారతదేశానికి భవిష్యత్తు ప్రభువులు కాబోయేవారు హైద్రాబాద్ విషయంలో తమ మార్గాన్ని సుగమమం చేసుకోవడానికి ఈ తతంగమంతా నడిపారు. ఛత్తారి ప్రభుత్వం విదేశాల నుండి ఆయుధాలను సమకూర్చుకోవడానికి అన్యమనస్కం గానే ప్రయత్నించింది. యూరప్ మరియు ఇతర ప్రాంతాల నుండి ఆయుధాలను దిగుమతి చేసుకోవాలనే ప్రయత్నం విఫలమై ఒక కుంభకోణంగా తేలింది. ఆయన ప్రయత్నం, ఆయన నియమించిన మనుషులు ఇందులో విఫలమయ్యారు. ఈ ప్రయత్నాలవల్ల ఒక్క బ్యారల్ కానీ ఒక్క రౌండు మందు గుండు కానీ ఎక్కడినుండీ పొందలేకపోగా భారత ప్రభుత్వానికి, హైద్రాబాద్‌కు వ్యతిరేక ప్రచారం చేసుకోవడానికి ఒక అంశాన్ని ఇచ్చినట్లయింది. 'నిజాం ఇండియాతో యుద్ధానికి సిద్ధపడుతున్నాడు' అని దేశం లోపల వెలుపల ప్రచారం చేసారు.

సహజంగా సున్నిత మనస్కుడైన, పరిశీలనా దృక్పథం గలిగిన నిజాం సరిహద్దుల వెంటా, రాష్ట్రం లోపల జరుగుతున్న అలజడి, అశాంతి పట్ల కలత చెందినట్లు కనిపించలేదు. ఆయన ముఖ్య సమస్యల్లా ఇండియాతో రాజకీయ సంబంధాలు మెరుగు పడడం గురించే. లార్డ్ మౌంట్‌బాటెన్ సహకారంతో మాత్రమే ఆ సంబంధాలు మెరుగు పడతాయని ఆయన ప్రగాఢ విశ్వాసం. స్వయంగా నిజాము, ఆయన పూర్వీకులు బ్రిటిష్ వారికి చాలా మంచి మిత్రులని ఆయన నమ్మేవాడు. అందువల్ల ఎట్టి పరిస్థితుల్లోనూ బ్రిటిష్ వాళ్ళు తనకు నష్టం జరగనివ్వరని, వాళ్ళకున్న మంచి పేరును చెడగొట్టుకోరని ఆయన నమ్మకం. ఆయన మౌంట్‌బాటెన్‌ను ఎప్పుడూ కలవలేదు కాని బాటెన్ శక్తి మీద, సచ్ఛీలత మీద ఆయనకు పూర్తి విశ్వాసం; ఇంగ్లాండుకు సోదర రాజ్యం ప్రభువుగా. అయితే మౌంట్‌బాటెన్ నేరుగా కాంగ్రెస్ సేవ చేస్తున్నాడు కాని బ్రిటిష్ రాయల్ ఫ్యామిలీ సచ్ఛీలతను కాపాడే పరిస్థితిలో లేడని నిజాం గమనించలేకపోయాడు. నవాబుకున్న ఈ తిరుగులేని విశ్వాసమే తరచుగా ఛత్తారిని ఆశ్చర్యపరుస్తూ, ఇబ్బందికి గురిచేస్తూ ఉండేది.

ప్రేరేపించబడ్డ సరిహద్దు దాడులను, అంతర్గత తూర్పు జిల్లాలలో ఏర్పడ్డ అశాంతిని చర్చలు, అవగాహన ద్వారా కానీ సరియైన ఆయుధ సంపత్తి లేని పోలీసుల ద్వారా కానీ ఎదుర్కోలేని ఛత్తారి అందుకు సైన్యాన్ని ప్రయోగించాడు. సైన్యంలో చాలా భాగం సరిహద్దుల వెంబడి ఆహార ధాన్యాల అక్రమ రవాణాను అరికట్టే నిమిత్తం నియమించబడి సామర్థ్యాన్ని కోల్పోయింది. భారతదేశపు నలుమూల

లా బ్లాక్ మార్కెటింగ్ పెరిగిపోయి చాలామందికి అదొక లాభసాటి వ్యాపారంగా మారిపోయింది; కస్టమ్స్, పోలీసు ఔట్ పోస్టులు వారిని నిలువరించలేక పోయాయి. ఆవిధంగా సాయుధ దళాలు అక్రమ రవాణా నిరోధానికి, సరిహద్దు దాడులను అరికట్టడానికి, శాంతిభద్రతల నిర్వహణకు వినియోగించబడ్డాయి. మిలటరీ కేంద్రాలలో మిగిలి ఉన్న దళాలను కూడా ఇలాంటి కార్యక్రమాల కోసమే సిద్ధంగా ఉండమని ఆదేశాలు వెలువడ్డాయి. ఈ ఏర్పాట్లు చూడడానికి బాగానే కనిపించినా సైన్యానికి కావలసిన మందుగుండే లేదని తొందరలోనే తెలిసిపోయింది. ఆయుధాలు లేని పోలీసుల పరిస్థితే సైన్యానికి దాపురించి ఎప్పుడూ ఏం జరుగుతుందో తెలియని పరిస్థితి తలెత్తింది.

సరిహద్దు దాడులను, అంతర్గత అలజడిని ఎదుర్కోవడంలో బాధితులుగా మారిపోయినవారు ప్రధానంగా ముస్లింలే. ఈ దాడులలో కొంత మంది హిందువులు, క్రిస్టియన్‌లు కూడా బాధితులయ్యారు. అప్పటిదాకా ప్రభుత్వాన్ని నిందించడమే పనిగా పెట్టుకున్న ఇత్తెహాద్; పోలీసులు, సైనికులకున్న అరకొర వనరులను, వారి స్వల్ప సంఖ్యను గమనించింది. వాస్తవికంగా ఆలోచించి, స్థానికంగా పెద్దసంఖ్యలో పౌర ఆత్మరక్షక దళాలను, ప్రాథమికంగా ముస్లింలతో ఏర్పాటు చేసి ఆత్మరక్షణ కోసం ఆయుధాలు అందించాలనుకుంది. రాబోయే ఊచకోతను ఎదుర్కోవడా నికి; ఆస్తిపాస్తుల, సరంజామాల లూఠీని, విధ్వంసాన్ని నిలువరించడానికి సమీపాన ఉండే గ్రామాలకు, చిన్న పల్లెలకు వెళ్ళి ముస్లిం స్త్రీలను, పురుషులను ఇత్తెహాద్ వాలెంటీర్లు సిద్ధపరచడం మొదలు పెట్టారు. ఇనుపచువ్వలు బిగించిన పొడవాటి బరిసెలను సరఫరా చేసి వాటి వినియోగం మీద శిక్షణ ఇచ్చారు. పాతకాలపు కత్తులు అన్ని చోట్లా అందుబాటులో ఉండేవి. వాటిని బాగుచేసి, సాన బట్టించారు. కొందరు తమ పూర్వీకులు వాడిన మజల్ లోడెడ్ గన్‌లను వాడగలిగి ఉన్నారు.

ప్రతి ఒక్క స్త్రీ లేదా పురుషుడు తాము వాడగలిగిన ఆయుధాలను సిద్ధపరుచు కున్నారు. అలా ఒక్క రాత్రికే అద్భుతంగా లెక్కలేనన్ని పౌర రక్షక దళాలు ఏర్పడ్డాయి. నలుగురు–ఐదుగురు సభ్యులున్న చిన్న దళాలు కొన్నయితే, వందకు పైగా సభ్యులున్న దళాలు కొన్ని. మరీ తక్కువ మందే ఉన్న చోట్ల, ఇండ్లూ, భూములూ వదిలివేసి పెద్ద కేంద్రాలకు రమ్మని సూచనలు వెళ్ళాయి. వేలకొద్దీ కుటుంబాలు  అలా సురక్షిత ప్రాంతమని భావించిన చోట్లకు చేరుకున్నాయి. ఇండ్లు, పశువులు, భూములు, పంట పొలాలు అన్నీ వదిలేసి తీవ్రమైన అభద్రత మధ్య సురక్షిత ప్రాంతాలకు వెళ్ళిపోయారు.

'రజాకార్లు' అని పిలువబడే విద్యార్థులతో కూడిన వాలంటీర్లను మారుమూల గ్రామాలకు పంపి ఆత్మరక్షణ కోసం శిక్షణ ఇప్పించాడు ఖాసీం రజ్వీ. కానీ ఆయన ప్రయోగం పూర్తిగా చేయి దాటిపోయింది. ఈ ఉద్యమం దావనలంలా రాష్ట్రమంతటా వ్యాపించి ఖాసీం రజ్వీ ఊహకు అందనంత ఆటవికంగా మారిపోయింది. స్థానిక ప్రజలను ఉత్తేజ పరచడానికి వెళ్ళిన రజాకార్లు కొద్దిమందే– ఇతర అనుచరులంతా తమంత తాముగా రజాకార్లుగా భావించుకొని పెద్దసంఖ్యగా మారిపోయారు. అలా, ఒక్కసారిగా రజాకార్లు పెరిగిపోయి ప్రపంచం దృష్టిని ఆకర్షించారు. ఇంకొక చోట రజాకార్లు, వారి కార్యక్రమాల గురించి వివరంగా మాట్లాడుకుందాం.

ఇంత జరుగుతున్నా నిజాం శ్రద్ధ రజాకార్ల విస్తృతి మీదనో, బార్డరులో జరుగుతున్న దాడుల మీదనో, స్థానికంగా తలెత్తిన అశాంతి మీదనో లేదు. అప్పటికి ఇండియాతో జరగవలసిన రాజకీయ ఒప్పందాలలో ఆలస్యం మీద, ఖాసీం రజ్వీ, ఇతర ఇత్తెహాదుల్ నాయకుల ఉపన్యాసాలలో ఆయనకు నచ్చని అంశాల మీద ఆయన శ్రద్ధ. ఇంకోవైపు ఛత్తారి తన మీద తాను విశ్వాసం కోల్పోయినవాడుగా కనిపించాడు. ఆయన కాలిక స్పృహలో లేనట్లుగా, తనలో తాను ఆలోచనల్లో మునిగి పోయినట్లుగా తరచూ కనిపించే వాడు. శాఖల మధ్య సమన్వయం కొరవడింది. ఏ పని చేయడానికి ఆయన చొరవ తీసుకోలేదు. ఇలాంటి పరిస్థితిలో, స్థానిక అశాంతి మధ్య ఇండియాతో చర్చల్లో అతి స్వల్ప ప్రగతి మాత్రమే కనపడసాగింది. మాంక్టన్ ఒక్కడే ఢిల్లీకి పోతూనో, వస్తూనో ఉండేవాడు.

# 8. మీర్జా నిష్క్రమణ, ఛత్తారి పునరాగమనం

కొనసాగుతున్న పరిస్థితుల్లో అధికారం నిలుపుకోవడం మినహా భారత ప్రభుత్వంతో ఇంకే దీర్ఘకాలిక ఒప్పందమూ సాధ్యంకాదని వాల్టర్ మాంక్టన్ ఒక నిశ్చయాభిప్రాయానికి వచ్చాడు. హైద్రాబాద్ పట్ల మరింత స్థిరంగా, ఖచ్చితంగా వ్యవహరించగల పరిస్థితిలో ఉన్నామని భారత ప్రభుత్వం భావించింది. మౌంట్ బాటన్ నుండి వచ్చిన యథాతథ ఒప్పందం ప్రతిపాదనను కనీసం ఒక్క సంవత్సరం కోసం రెండుపక్షాలు అంగీకరించాయి. ఒక్క సంవత్సరం తర్వాత హైద్రాబాద్‌ను బలప్రయోగం యొక్క అవసరం లేకుండానే పరోక్ష పద్ధతుల ద్వారానే దారికి తెచ్చుకోవచ్చని ఇండియా భావించింది. అప్పటికీ అశాంతిలో మునిగి ఉన్న నిజాం, భవిష్యత్తులో రానున్న పరిణామాలను ఊహించకుండా ఒక్క సంవత్సరం వరకైనా తనూ, తన రాష్ట్రం క్షేమంగా ఉంటుందని భావించాడు. అలా రెండు పక్షాలు ఒప్పందానికి అంగీకరించాయి. ప్రాథమికంగా యథాతథ ఒప్పందం డ్రాఫ్టును మౌంట్ బాటెన్‌తో అనధికార సంప్రదింపుల అనంతరం మాంక్టన్ తయారు చేసాడు. కానీ భారత నాయకులు ఢిల్లీలో దాన్ని పూర్తిగా మార్చేసారు.

మాంక్టన్ హైద్రాబాద్‌కు అనుకూల అంశాలను డ్రాఫ్టులో చేర్చడానికి విఫల యత్నం చేసాడు. అన్ని రాష్ట్రాలను భారత దేశపు ఆధిపత్యంలోకి తేవడం ద్వారా భారత దేశంపట్ల తన ప్రభుభక్తిని నిరూపించుకున్నాడు. లార్డ్‌మౌంట్ బాటెన్ హైద్రాబాద్‌కు కూడా అలాంటి ముగింపునే తయారు చేసాడు. ముగింపు ఏమిటన్నది కూడా ఆయనకు ద్వితీయ ప్రాధాన్యమే. ఢిల్లీ పెద్దలకు పనికి వచ్చే లొసుగులు అందులో చాలా ఉన్నాయి. వాటి గురించి వాళ్ళకు అవగాహన కలిగించడం కూడా



ఆయనకు కష్టమేమీ కాదు. ఢిల్లీ పెద్దల పట్ల ఆయన ప్రభు భక్తి గుర్తించబడ్డది. డ్రాఫ్టుకు రూపురేఖలు ఢిల్లీపెద్దలే ఇచ్చి ఆయనను నమ్మకంగా తయారు చేయమన్నారు, కానీ ఆయన మీద ఓ కన్నేసి భవిష్యత్తులో తమను ఇబ్బంది పెట్టగల అత్యుత్సాహాన్ని ప్రదర్శించకుండా చూసారు. ఒప్పందం ఎలా ఉన్నా అది రాబోయే దుర్దినాన్ని వాయిదా అయినా వేయగలుగుతుంది అని నిజాం నమ్మకం. ఏది ఏమైనా ప్రస్తుతపు పీట ముడి వీడేందుకు ఒప్పందం అవసరమని, తద్వారా తను కొంత మేర సంతృప్తితో హైద్రాబాద్‌ను వీడవచ్చని ఛత్తారి సంతోషపడ్డాడు.

అందరూ ఊహిస్తున్నంత సమీపంలో ఆ దుర్దినం రాకుండా పోయేందుకు, అనవసరమైన రహస్యాలను కాపాడాల్సిన అవసరం లేకుండా ఉండేందుకు ఆ చర్యలు ఉపకరించాయి. జాతీయ కాంగ్రెసు ఆదేశాలననుసరించి రాష్ట్రంలో అంతర్గత పోరాటం నిర్వహిస్తున్నట్లు, సరిహద్దు దాడులు కొనసాగిస్తున్నట్లు చెప్పుకోవడం కోసం రాష్ట్ర కాంగ్రెసు అధ్యక్షుడు, అనేక మంది ఇతర నాయకులు ఇదే సమయంలో అరెస్టయ్యా రు. ఇతర నాయకులు కొద్దిపాటి ఉద్యమం చేసి, పెద్ద పెద్ద నినాదాలు చేస్తూ హైద్రాబాద్‌ను వదిలి, సరిహద్దులు దాటి సుఖవంతమైన ఆశ్రయం తీసుకున్నారు.

నిజానికి వాళ్ళు ఇండియాలోని నాయకులకు ఎంతో దగ్గరగా అందుబాటులో ఉండాల్సింది. కాని వాళ్ళు ప్రతిపాదిత ఒప్పందాన్ని ఆహ్వానించారు. బయటి నుండి వస్తున్న సంకేతాలు రాష్ట్రం లోపలి హిందూ, ముస్లీం నాయకులను సమానంగా అనుమానాలకు గురిచేయసాగాయి. తమ భవిష్యత్తు స్థితిగతులను శాసించే వ్యవహారాల పట్ల కొనసాగుతున్న రహస్యాలను శాసన సభలోపల, బయట కూడ హిందూ నాయకులు తీవ్రంగా వ్యతిరేకించారు. బయట కనిపించే దానికి భిన్నమైన లోగుట్టు ఏదో ఉందని ఇత్తెహాద్ గ్రూపులు అనుమానించ సాగాయి.

ప్రధాన పాత్రధారుల ప్రవర్తనలోని నిజాయితీని అన్ని సమూహాలు శంకించ సాగాయి. కేబినెట్‌కి ప్రధాన బాధ్యుడు, ప్రతినిధి బృందం సభ్యుడికి కూడా అన్నింటిపైనా అనుమానం కలిగేది. ఆయన ఎన్నోమార్లు తనకు తగిన సమాచారం ఉండడం లేదని ఫిర్యాదు చేయాల్సి వచ్చేది. తన హిందూ సహచరుల పరిస్థితి కూడా అంతే. ఛత్తారి మౌనం సహజమైందా? లేదా ఉద్దేశ పూర్వకమా? ఎవరికీ తెలియదు. ప్రతి ఒక్కరికీ తెలిసిందేమిటంటే ఆయన తన స్థాయికి తగ్గట్టుగా కాకుండా రాజ్యాంగ వ్యవహారాల మంత్రి సూచనలతో ఎక్కువగా ప్రభావితమయ్యేవాడు.

రాజ్యాంగ వ్యవహారాల మంత్రి అలీయవార్‌జంగ్‌కు వ్యతిరేకంగా వీస్తున్న పవనాలు; హిందూ, ముస్లీం నాయకులు కలిగించే ఆటంకాలు నిజాంను చాలా ఇబ్బంది పెట్టినట్లు అర్థం కాగాసాగింది. అందుకే వెంటనే ప్రతినిధి బృందంలోని ముగ్గురు సభ్యులు – అలీయవార్ జంగ్, రహీం, రెడ్డిలను తొలగించి మాంక్‌టన్, అలీనవాజ్‌జంగ్, సర్ సుల్తాన్ అహ్మద్‌లను ఛత్తారి నాయకత్వంలో నియమించాడు. సుల్తాన్ అహ్మద్ హైద్రాబాద్ వాడు కాదు. న్యాయసలహాదారు హోదాలో అప్పుడప్పుడు రాజాస్థానానికి వస్తుండేవాడు. ఆ విధంగా హైద్రాబాద్ భవిష్యత్తుపై చర్చించి, నిర్ణయం తీసుకోవాల్సిన నలుగురు ప్రతినిధుల బృందంలో ఒకరు ఆంగ్లేయుడు, ఇద్దరు రాష్ట్రేతరులు (ఛత్తారి, సుల్తాన్ అహ్మద్ బ్రిటిష్ ఇండియావాసులు). అలీ నవాజ్ జంగ్ హైద్రాబాద్ ముస్లిం అయినప్పటికీ ఏ రాజకీయ పక్షానికీ చెందనివాడు. ఇక హిందువుల నుంచి ఒక్క ప్రతినిధి కూడా లేడు. ఈ చర్య రాష్ట్రంలోని హిందువులకూ, ముస్లింలకు చాలా ఆగ్రహం తెప్పించింది. మొత్తం వ్యవహారం మీద ఇత్తెహాదీలకు ఎన్నో అనుమానాలు ఉండగా, తమ వాదన వినిపించగల ఒకే ఒక్క ప్రతినిధిని కూడా బృందం నుండి తొలగించడంతో తమల్ని తప్పించే తతంగమేదో జరుగుతుందని అవగాహనకు వచ్చారు.

1947 అక్టోబరు మాసాంతంలో మౌంట్‌బాటెన్ దగ్గర నుండి మాంక్ టన్ డ్రాఫ్టు ప్రతిని తెచ్చాడు. తన మంత్రివర్గంలోని చాలా మంది మంత్రులు వ్యతిరేకించినా నిజాం దాన్ని అంగీకరించాడు. నూతనంగా ఏర్పాటైన ప్రతినిధిబృందాన్ని ఢిల్లీకి పంపి మౌంట్‌బాటెన్‌కు, భారత ప్రభుత్వ నాయకులకు ముసాయిదా మీద తమ అంగీకారాన్ని తెలియజేయాలని నిజాం, ఛత్తారి నిర్ణయం తీసుకున్నారు. అక్టోబర్ 28న ప్రతినిధి బృందం ఢిల్లీ వెళ్ళాలని నిర్ణయమైంది. ఇత్తెహాదీలు కలవరానికి గురైనారు. భవిష్యత్తు పరిణామాలకు బాధ్యులం కాకూడదన్న ఉద్దేశ్యంతో డ్రాఫ్టును వ్యతిరేకించిన మంత్రులంతా రాజీనామా లేఖలను సిద్ధం చేసుకున్నారు.

నగరంలో ఒక ఆందోళన ఆవహించింది. ఇత్తెహాదీలు చలించిపోయారు. ఏదైనా చర్య తీసుకోవడానికి ఒక రాత్రే మిగిలింది. తెల్లవారితే ప్రతినిధి బృందం ఢిల్లీకి వెళ్ళిపోతుంది; హైద్రాబాద్ భవిష్యత్తు ముగిసుపోతుందన్న ఆందోళన ఇత్తెహాదీలది. సరిహద్దుల వెంట ఆత్మరక్షక దళాల నిర్వహణ కోసం తయారైన కొందరు వాలంటీర్లు వాళ్ళకున్నారు. అర్ధరాత్రి దాటిన తర్వాత ఢిల్లీకి వెళ్ళే ప్రతినిధుల ఇండ్లను పెద్ద సంఖ్యలో వాలంటీర్లతో ముట్టడించి వాళ్ళు ఢిల్లీ వెళ్ళకుండా చేయాలని ఒకరు సూచించారు. ఆ సూచన వచ్చిన కొద్ది నిమిషాల్లోనే నగరంలోని ప్రతి ఇంటి తలుపు తట్టి ప్రజలకు తమ ప్రణాళిక చెప్పారు వాలంటీర్లు. ఇండ్లలోని ప్రజలు లేచి రేపు ఉదయానికి తమ స్థితి ఎలా ఉండబోతోందో చర్చించుకోసాగారు. ఏదో ఒకటి చేయడానికి ఒక అవకాశం దొరికితే– వాళ్ళే రోడ్డుకు అడ్డంగా పడుకోవాల్సి వస్తే – ఆ అవకాశం దొరికినందుకు వాళ్ళు ఆనందించారు. స్త్రీలు, పురుషులు, వృద్ధులు, పిల్లలు అంతా బయటికి వచ్చి పక్కవాళ్ళకు, స్నేహితులకు తెల్లవారేలోగా ఏం చేయాలో చెప్పుకున్నారు. ఇత్తెహాదీలు నిర్ణయం తీసుకున్న రెండు గంటల్లోనే వేలకొద్ది ప్రజలు నగరంలోనే ఉన్న ప్రతినిధి బృందంలోని సభ్యుల నివాసాలకేసి నడవసాగారు. తెల్లవారే సరికి అంగుళం జాగా ఖాళీ లేకుండా ప్రతినిధి బృందం సభ్యుల ఇండ్ల ముందు ప్రజలు వేలాదిగా చేరిపోయారు. ఉదయానికల్లా పరిసర ప్రాంతాల్లో మైళ్ళకొద్దీ దూరం రోడ్లు ప్రజా సంద్రాలయ్యాయి.

గృహనిర్బంధ నిర్ణయం అర్ధరాత్రి దాటాకే తీసుకోబడ్డది. నిర్ణయం విద్యుత్ ప్రవాహంలా ప్రజలకు చేరిపోయింది. ఆ పిలుపుకోసమే ఎదురు చూస్తున్నట్లు ప్రజలు ప్రతిస్పందించారు. వేగంగా చోటు చేసుకుంటున్న సంఘటనలు, ఊహించని ప్రజా స్పందన, ఎగిసి పడుతున్న అలల్లా ప్రజాసమూహాలు ప్రధాని నివాసాన్ని, ఇతర

ప్రతినిధి బృందం సభ్యుల నివాసాల ను ముంచి వేయడంతో పోలీసులను నిశ్చేష్టులను చేసింది. ఒకవేళ ఆ ప్రజా సమూహాన్ని ఎదుర్కొంటే హైద్రాబాద్ పోలీసులంత సాహసికులు ఇంకెవరూ ఉండరని చెప్పవచ్చు. ఉదయానికి నిజాంకు విషయమంతా తెలిసిపోయింది. ఆయన ఆందోళన, కోపంతో ఊగిపోయాడు. ఈ పరిస్థితుల్లో ప్రతినిధి బృందం ప్రయాణం అసాధ్యమని ఛత్తారి నిజాంకు ఫోన్‌లో చెప్పాడు. ప్రతినిధి బృంద ప్రయాణాన్ని ఆయన వాయిదా వేసాడు. నిజాం నిర్ణయం బహిరంగంగా ప్రకటించబడ్డది.

ప్రజా సమూహం వెంటనే అక్కడికి చేరుకున్నంత వేగంగా, క్రమశిక్షణగా, ప్రశాంతంగా వెనక్కు వెళ్ళిపోయింది. ఇత్తెహాదీలకు ఇది ఊహించని ఘన విజయం. ప్రజల్లో పట్టుంటే ఎలాంటి విజయాలు సాధించవచ్చో ఖాసిం రజ్వీకి అర్థమయ్యింది. తన ఒంటెత్తు పోకడలు ఎక్కువ కాలం నడవవని నిజాంకు తెలిసి వచ్చింది. ఆయనకు ప్రజల్ని కలుపుకు పోవాలని అర్థమయింది. ప్రజల్ని కలుపుకుపోవడమంటే ప్రజా నాయకుల్ని విశ్వాసంలోకి తీసుకోవడం.

హైద్రాబాద్‌కు అది శుభదినం. కేవలం ఏకస్వామ్యం నడవదని, ప్రజా మద్ధతుతోనే తన ప్రతిష్ట కూడా ముడిబడి ఉంటుందని నిజాంకు అర్థమైన రోజది. తన రాజరికం అటు హిందువుల, ఇటు ముస్లింల మద్దతు ఉంటేనే సరిగ్గా కొనసాగుతుందని కూడా ఆయనకు తెలిసి వచ్చింది. పోలీసులు, సైన్యబలగం సాధారణ పరిస్థితుల్లో పనికి వస్తాయి కాని, ఇలాంటి సంక్షోభ సందర్భాలతో వాటిని మాత్రమే నమ్ముకోగూడదని బ్రిటిష్ వాళ్ళకు లాగే నిజాంకూ అర్థమయింది. నిజానికి ఆయనకు హిందూ సమూహం మద్దతు సంపాదించాలనే ఆసక్తి ఉండేది కాని అప్పటి స్టేట్ కాంగ్రేసు నాయకత్వం పట్టువిడుపులు లేకుండా, రాజభక్తి లేకుండా వ్యవహరించేది.

ఆనాడు కాంగ్రెసు చాలా కొద్దిపాటి హిందూ సమాజానికే ప్రాతినిధ్యం వహించేది, కానీ హిందువులకు ప్రాతినిధ్యం వహించే ఏ సంస్థా దానంత శక్తిమంతంగా లేదు. ఆలిండియా కాంగ్రెసుకు అనుబంధంగా మాత్రమే అది నడిచేదన్నది రహస్యమేమీ కాదు. ఆలిండియా కాంగ్రేసు ఉద్దేశ్యాలన్ని నిజాంకు వ్యతిరేకమేనన్నదీ బహిరంగమే. స్వతహాగా తను ముస్లిం కాబట్టి, ఇక్కడి ముస్లీం సమూహాల పూర్తి మద్దతు పొందాల్సిన సహజమైన ఆవశ్యకత ఏర్పడింది నిజాంకు. సంఖ్యాపరంగా ముస్లీంలు మైనారిటీలు అయినప్పటికీ రాజకీయ అవగాహన కలిగి ఉండడం, చైతన్యశీలంగా ఉండడం, ఇత్తెహాదుల్ అవగాహనకు దగ్గరగా ఉండడం నిజాంకు తెలుసు. వాళ్ళు హిందువులకు దక్కవలసిన రాజకీయాధికారానికి వ్యతిరేకం కాదు. ఎందుకంటే హిందువులు

మాతృభూమి పక్షాన ఉన్నారు కాని స్టేట్ కాంగ్రెసు పక్షాన లేరు.

నిజాం ఒక అభిప్రాయానికి రావడానికి ఈ అవగాహన పనికి వచ్చింది. ఈ సంఘటనల తర్వాత నిజాం మంత్రివర్గ సమావేశాన్ని ఏర్పాటు చేశాడు. మొదటిసారి దానికి ఆయనే అధ్యక్షత వహించాడు. నిస్సంకోచంగా తమ అభిప్రాయాలు చెప్పమని హాజరైన ప్రతి ఒక్కరినీ అడిగాడు. ధైర్యంగా, సునిశితంగా విమర్శించగలిగే వాల్టర్ మాంక్టన్ పోలీసుల ఏర్పాట్ల పట్ల అసంతృప్తి వెలిబుచ్చాడు. విషయం ఇంతదూరం వెళ్ళడం పట్ల పోలీసు ఉన్నతాధికారి బాధ్యత వహించాలన్నాడు. మంత్రులు భిన్నాభిప్రాయాలు వెలిబుచ్చారు. కొందరు ప్రభుత్వ ప్రస్తుత ధోరణిని సమర్థించారు, కొందరు వ్యతిరేకించారు.సమావేశంలో ఏ నిర్ణయం తీసుకోలేదు కానీ ఒకటి మాత్రం స్పష్టమయింది. ప్రభుత్వంలో మార్పులు రావాలి. ప్రజాభిప్రాయాన్ని ప్రతిబింబించే శక్తిమంతుడైన నాయకుడి మీద ప్రభుత్వ బాధ్యతలు ఉంచాలి.

తన మెదడులో ఒక ఆలోచన మెరిస్తే వెంటనే అమలు చేయడం నిజాంకు అలవాటు. ఆ సభకు అధ్యక్షత వహించిన తర్వాత ఆయన ప్రజానాయకుల కోసం వేట ప్రారంభించాడు. మొదటిసారి ఖాసీం రజ్వీని ఇంటర్వ్యూ చేసాడు. ఢిల్లీకి వెళ్ళవలసిన యథాతథ ఒప్పందం ప్రతినిధిబృందంలోని సభ్యులందరినీ మార్చ దలిచాడు. ఛత్తారి స్థానంలో మొయిన్ నవాజ్ జంగ్‌ను ప్రతినిధి బృందం నాయకుడిగా నియమించాడు. రెడ్డి, రహీంలను హిందూ ముస్లిం ప్రతినిధులుగా బృందంలో చేర్చాడు. వాల్టర్ మాంక్టన్‌కు ఎక్కడా స్థానం దొరకలేదు. ఆయన లండన్‌కు సిద్ధమయ్యాడు.

ప్రతినిధి బృందంలో మార్పులు ఢిల్లీకి రుచించలేదు. ఇద్దరు ప్రజా ప్రతినిధులు, ఒక అనిశ్చితి గలిగిన అధికారి నాయకత్వంలో చర్చలు కష్టమని నెహ్రూ, పటేల్ భావించారు. మాంక్టన్ తెరమీద కనిపించక పోయేసరికి మౌంట్ బాటెన్‌కు ఏదో వెలితి ఉన్నట్లు తోచింది. తను చేసింది మంచిదేనన్న నమ్మకం నిజాంకూ లేదు. చివరగా తన వైపు కాఠిన్యం తగ్గించుకోవాలనుకున్నాడు. అందుకు మౌంట్‌బాటెన్‌కు ఒక వర్తమానం పంపిస్తూ తన చర్యలను చూసి అపార్థం చేసుకోవద్దని తానున్న పరిస్థితిని అర్థం చేసుకోవలసిందిగా విన్నవించుకున్నాడు. దురదృష్ట వశాత్తూ ఆ వర్తమానాన్ని తీసుకు పోవడానికి ఎంచుకున్న వ్యక్తి రద్దయిన ప్రతినిధి బృందంలోని సభ్యుడు సుల్తాన్ అహ్మద్. కోపంతో రగిలిపోతున్న సుల్తాన్ అహ్మద్ వర్తమానం తీసుకుపోవడం మాత్రమే కాకుండా కొత్త ప్రతినిధి బృందం విఫలమయ్యేందుకు

చేయాల్సిన ప్రయత్నాలన్నీ చేసాడు. కొత్త ప్రతినిధి బృందం ఢిల్లీ వెళ్ళింది. అక్కడి వాతావరణం చల్లగా ఉంది, వారికి దొరికిన ఆహ్వానం మరింత చల్లగా ఉంది.


కావలసినంత సరదాగా ఉండగలిగే మౌంట్‌బాటెన్ కూడా చాలా ప్రత్యేకంగా ప్రవర్తించి భారతదేశం తరఫున ప్రతినిధి బృందాన్ని ఇబ్బందికి గురిచేసాడు. ఇదివరకే చర్చించిన డ్రాఫ్టును తిరిగి మెరుగు చేయాల్సిన కష్టతరమైన బాధ్యత ప్రతినిధి బృందం మీద పడింది. అది సమయాన్ని వృధా పుచ్చుకునే ఒక మూర్ఖపు పనిగా గోచరించింది. ప్రతినిధి బృందం సెక్రెటెరియెట్ వద్ద డ్రాఫ్టును మెరుగుజేయడంలో తలలు బద్దలు కొట్టుకుంటూ దయనీయమైన పరిస్థితుల్లో ఉండగా, సుల్తాన్ అహ్మద్ మాత్రం నిజాం రాజప్రతినిధిలాగా దర్పం ప్రదర్శిస్తూ ఉన్నత స్థాయిలో కుట్రలు చేస్తూ తిరుగసాగాడు.

హైద్రాబాద్ దృష్టికోణం నుండి ఇవన్నీ దురదృష్టకరమైన సంఘటనలు. తర్వాత కాలంలో మౌంట్ బాటెన్ నిజాంకు ఒక లేఖ రాస్తూ డ్రాఫ్టు మార్చకుండా, ప్రతినిధి బృందాన్ని మార్చకుండా ఉండి ఉంటే ఇండో–హైద్రాబాద్ సంబంధాల చరిత్ర ఎంతో సంతోషం నిండిన పాళీతో రాయాల్సిన చరిత్ర అయి ఉండేది అన్నాడు. అది నిజమే అయి ఉండొచ్చు కానీ యధాతథ ఒప్పందం అనేదే లేకుంటే హైద్రాబాద్ గట్టి రాజకీయ పునాదుల మీద మాత్రం నిలిచి ఉండి ఉండేది.

వాస్తవానికి ఒరిజినల్ డ్రాఫ్టులో నుండి పెద్దగా మార్పులేమీ లేనప్పటికీ ప్రతినిధి బృందంతోని సభ్యుల మార్పుల వల్ల ఒప్పందంలో అనుబంధపు లేఖలను చేర్చడానికి ఢిల్లీ అంగీకరించింది. ఒకవేళ ఈ ఒప్పందాన్ని గౌరవించడం జరిగితే అది ఈ కొత్త ప్రతినిధి బృందం సాధించిన విజయంగా చెప్పుకోవలసి ఉండేది.

కొత్త ప్రతినిధి బృందం ఏర్పాటు కాగానే ఛత్తారి తన అనారోగ్యాన్ని తక్షణ కారణంగా చూపి హైద్రాబాద్‌ను వదలడానికి సిద్ధమయ్యాడు. మంచికో, చెడుకో భారత ప్రభుత్వంతో యధాతథ ఒప్పందపు చర్చలను ఒక దారిలో పెట్టి, నిజాం తన కొత్త ప్రభుత్వ ఏర్పాటులో తలమునకలయ్యాడు.

# 9. రజాకార్లు



తమకు వ్యతిరేకంగా చేసిన ప్రచారానికి భారతీయ పత్రికలకు ఖాసీం రజ్వీ, హైద్రాబాద్‌లోని రజాకార్లు నిజానికి రుణపడ్డట్లే లెక్క. ఎందుకంటే ఆ వ్యతిరేకత వల్లే వాళ్ళు ప్రచారంలోకి వచ్చారు. ఖాసీం రజ్వీ మీద, రజాకార్ల మీద దాదాపు ప్రతిరోజు ఏదో ఒక విపరీత కథనం ఏడాది పాటు కొనసాగింది. రజాకార్ అనే పదంలోని మొదటి అక్షరాలు 'రజ్' అనేవి రజ్వీని సూచించేవి అనే అపార్థానికి దారితీసింది. నిజానికి రజాకార్ అంటే వాలంటీర్ (స్వయం సేవకుడు). రజ్వీ రాక ముందు నుండి ఇత్తెహాద్‌లో రజాకార్‌లు ఉండేవారు. స్టేట్ కాంగ్రెస్‌తోసహా ఇతర సంస్థలలోని వాలంటీర్లను కూడా రజాకార్లు అనే అనేవారు, ఎందుకంటే ఉర్దూలో ఆ భావాన్ని చెప్పే పదం అంతకంటే వేరేది లేదు.

రాష్ట్రపు పడమటి జిల్లాలలో వృత్తిని నిర్వహిస్తున్న న్యాయవాది ఖాసిం రజ్వీ, స్థానిక ఇత్తెహాద్ బ్రాంచికి నాయకుడు కూడా. ఇత్తెహాద్ సంస్థలో నిస్వార్థపరుడైన, ఉత్సాహవంతుడైన వ్యక్తిగా ఆయనకు పేరుంది. ఒక సందర్భంలో తమకు ఉన్న ఒకే ఒక ఇల్లును ఇత్తెహాద్‌కు ఇవ్వదలచి ఆయన కుటుంబాన్నంతా రోడ్డుమీద పడేసాడు. అయితే బహద్దూర్ యార్‌జంగ్ అందుకు ఒప్పుకోలేదు కాని రజ్వీ చర్యలు ఆయనకు ఎంతో ప్రతిష్టను తెచ్చిపెట్టాయి. ఆయన జిల్లాలో ఇత్తెహాద్ శాఖను సమర్థవంతంగా నిర్వహించాడు. తర్వాత ఘనమైన మెజారిటీతో ఆయన ఇత్తెహాద్‌కు అధ్యక్షుడైనాడు. ఆయన అధ్యక్షుడయ్యే నాటికి సంస్కరణల చర్చ తెరమీదికి వచ్చింది. అప్పటి ప్రధాని

మిర్జా ఇస్మాయిల్‌కు, రజ్వీకి సంస్కర ణలకు సంబంధించి ఎంతో భేదాభిప్రాయముండేది. ఈ గొడవలో రజ్వీదే పైచేయి. అప్పుడప్పుడు బహిరంగ ఉపన్యాసాలలో ఆయన ఆవేశపూరితంగా ప్రసంగించి చేసే కొన్ని ప్రకటనల వల్ల ఆయన మిత్రులు ఇబ్బందికర పరిస్థితిని ఎదుర్కొనేవారు. ఆయన శత్రువులకు మంచి అస్త్రాలు అంది వచ్చేవి. తర్వాత విచారం వెలిబుచ్చి, భవిష్యత్తులో అలా జరగకుండా చూసుకుంటాననే వాడు కాని మళ్ళీ ప్రజా సమూహాన్ని చూడగానే పాత పద్ధతిలోనే విరుచుకుపడేవాడు. సాధారణంగా హైద్రాబాద్‌లో రాజకీయ ప్రదర్శనల్లో నిజాంను నేరుగా ఎవరూ ప్రస్తావించకపోయేవారు కాని రజ్వీ నిజాంను కూడా వదిలిపెట్టలేదు. అందుకు నిజాంకు చాలా కోపం వచ్చింది. కాని రజ్వీ చేసే విమర్శలను రాజ్యాంగ పద్ధతుల ద్వారా నిలువరించడం చాలా కష్టమయింది.

దేశ విభజనకు కొంత ముందుగా హైద్రాబాద్ రాష్ట్ర సరిహద్దులలో పెద్ద సంఖ్యలో, బలంగా దాడులు ప్రారంభమైనాయి. అవి సరిహద్దులలోని ముస్లింల ప్రాణాలను, ఆస్తులను లక్ష్యంగా చేసుకొని సాగినాయి. ఆ దాడులను చూస్తూ ఎవరూ మౌనంగా ఉండలేకపోయారు, ముస్లింల సంరక్షణ కోసం పనిచేస్తామనుకున్న ఇత్తెహాద్ ఎంతమాత్రం సహించలేక పోయింది. తన మతస్థుల మాన, ప్రాణాల, ఆస్థిపాస్తుల రక్షణకు చర్యలు తీసుకోవాలసిందిగా ఖాసీం రజ్వీ ప్రభుత్వాన్ని కోరాడు. ఆయుధాలు కానీ, మందుగుండు కానీ కావలసినంతగా లేకుండా ఉన్న పరిస్థితిలో అటు పోలీసులు కానీ, ఇటు సైన్యం కానీ ఏమీ చేయలేదని ఆయనకు అర్థమయింది. బయటి నుండి దాడులకు ప్రణాళికలు వేస్తుంది కాంగ్రెస్. భారత ప్రభుత్వం కాంగ్రెస్ చేతిలో ఉంది. ఈ పరిస్థితుల్లో రాజ్యాంగ హక్కుల ప్రకారం ఇండియా నుండి ఆయుధ సంపత్తిని ఆశించడం, తద్వారా కాంగ్రెస్ ప్రేరేపిత దాడులను ఎదుర్కోవాలనుకోవడం హైద్రాబాద్ మూర్ఖత్వమే అవుతుందని రజ్వీ ప్రకటించాడు.

సరిహద్దుల నుండి బాధితులు నగర ప్రాంతాలకు వచ్చి తమ దీన గాథలను వెళ్ళబోసుకోసాగారు. రాష్ట్రంలోని అశాంతి మూకలు కొన్ని దీన్నొక అవకాశంగా తీసుకొని సరిహద్దు దాడులు చేసేవారిలో కలిసి పోయాయి. తూర్పు జిల్లాలలో కమ్యూనిస్టులు పెద్ద ఎత్తున అలజడి ప్రారంభించడానికి ఇది తగిన సమయంగా భావించారు. నలువైపులా పరిస్థితి చేజారిపోతుండగా ప్రభుత్వ యంత్రాంగం ధైర్యం కోల్పోసాగింది. ఖాసీం రజ్వీకి వేరేమార్గం తోచలేదు. వేగంగా స్థానిక ప్రజలతో ఆత్మరక్షక దళాలను తయారుచేయాలని పార్టీ ముందు ప్రతిపాదించాడు. ఎక్కడైతే పరిస్థితిని ఎదుర్కోగలిగినంత సంఖ్యలో ముస్లింలు లేరో అక్కడికి ఇతర ప్రాంతాల



నుండి వాలంటీర్లను పంపించాలన్నాడు. తద్వారా మారుమూల ప్రాంతాలలోని ముస్లింలను సురక్షిత ప్రాంతాలకు తరలించే ఏర్పాట్లను చేయాలన్నాడు.

ఇత్తెహాద్ ఆయన ప్రతిపాదనలను ఆమోదించింది. ఇదంతా ప్రభుత్వానికి తెలిసింది. అయితే ఇత్తెహాద్‌ను అభ్యంతరపెట్టదగ్గ ప్రత్యామ్నాయమేదీ తన వద్ద లేక మిన్నకుంది. మతపరమైన ఆవేశంలో ఆయన ప్రణాళికను అమలు చేయడానికి సిద్ధపడ్డాడు. అప్పటికే ఉన్న వాలంటీర్లకు స్వల్పంగా శిక్షణ ఇవ్వబడ్డది. ఏం చేయాలి? ఎలా చేయాలి? అనే సవివరమైన సూచనలు ఇవ్వబడ్డాయి. అలా వాళ్ళు అలజడి ప్రాంతాలకు తరలి వెళ్ళారు. స్థానికంగా నివసించేవారిని జమచేసి, వాళ్ళ దగ్గర ఉన్న ఆయుధాలను ఎలా ఉపయోగించాలి, ఎలా క్రమశిక్షణగా మెలగాలి అనేది నేర్పించడం ఆ వాలంటీర్ల పని. ఒక్కో దళానికి ఒక్కో స్థానికుడు నాయకత్వం వహిస్తాడు. ఈ ఆత్మరక్షణ దళాలకు స్థానికంగా లభించే కత్తులు బల్లాలే ఆయుధాలు. అవకాశమున్నచోట పాత 'మజుల్ లోడెడ్ గన్స్' కూడా వాడారు. నగర కేంద్రం నుండి పోయిన వాలంటీర్లకు తుపాకులు, మంచి కత్తులు ఉండేవి. చాలా చోట్ల స్థానికులు సత్వరం శిక్షణ తీసుకొని సిద్ధమయ్యారు. వాళ్ళు మరికొందరికి శిక్షణ ఇచ్చేవారు. అలా వాలంటీర్ల సంఖ్య పెరిగిపోయింది. కొత్తవాళ్ళు, పాత వాలంటీర్లు అందరూ తమను తాము రజాకార్లు అని పిలుచుకున్నారు.

రజాకార్ల గమనం రెండు రకాలుగా సాగింది. ప్రతి స్థానిక రజాకార్ యూనిట్ రెండు గ్రూపులుగా విభజింప బడేది. మొదటి గ్రూపు స్త్రీలు, పిల్లలను, ఆస్థిపాస్తులను రక్షించేది. మరో గ్రూపు ముందుకు నడుస్తూ దాడులు చేసేవారిని లేదా అశాంతి మూకలను ముందస్తుగా ఎదుర్కొనేది. దాడులు చేసేవారిని కాకుండా ఇతరులను ముట్టుకోవద్దని వాలంటీర్లకు ఖచ్చితమైన ఆదేశాలున్నవి. శాంతియుతంగా ఉండే ముస్లింలకు, హిందు వులకు సమానంగా రక్షణ కలిగించాలని కూడా ఆదేశాలున్నవి. ఆ కాలపు అవసరం వల్ల, ఉద్యమ వినూత్నత వల్ల రజాకార్లకు అనూహ్యమైన స్పందన వచ్చింది. శారీరక సామర్థ్యమున్న ముస్లింలు చాలాచోట్ల రాజాకార్లుగా తమంత తాముగా చేరిపోయారు. అలాగే గణనీయమైన సంఖ్యలో హిందువులు, ఇతర మతస్తులు కూడా చేరారు. అలా ముస్లింలు, హిందువులు, పెద్ద కులాలు, చిన్న కులాలు, క్రిస్టియన్లు ఇతరులు కూడా చేరారు. ఒక్కసారి చేరితే వాళ్ళంతా రజాకార్లు, కులమూ మతమూ లేదు. అయితే సంఖ్యలో ముస్లింల తిరుగులేని ఆధిక్యత వలన తరచుగా రజాకార్లు అంటే ముస్లీం వాలంటీర్లు అనే అర్థమే స్థిరపడిపోయింది. రజాకార్లుగా సభ్యత్వం చాలా సులభం. ఏదైనా ఒక ఆయుధం లేదా ఇనుపమొన గలిగిన బరిశె ఉండి రజాకార్ ప్రధాన లక్ష్యానికి కట్టుబడితే చాలు, సమీప కేంద్రంలో నమోదు అయ్యేవాడు.

ప్రతి గ్రామంలో వారానికి ఒకరోజు నిర్ధారించిన సమయంలో రజాకార్లు సమావేశమై డ్రిల్లు నిర్వహించుకొని, మార్చింగ్ చేసేవారు. కొందరు రజాకార్లు తమ పూర్వీకులవి కానీ, కొనుక్కొని కాని, ఇతరులను అడుక్కొని కాని తుపాకులు సంపాదించుకున్నారు. దేశవ్యాప్తంగా అలాంటి తుపాకులు చాలా సంఖ్యలో ఉండేవి. కొద్దిగా ఖర్చుపెట్టగలిగితే ఆయుధాలను కొనుక్కోవడం సులభం. ఎందుకంటే ఆయుధాలను కలిగి ఉండరాదనే నిబంధించే 'ఆర్మ్స్ ఆక్ట్' ఏదీ అప్పుడు లేదు. అయినా ఆయుధాలు అలంకారప్రాయమే. రాజాకార్లు పట్టిన ఆయుధాలలో సగం వరకూ ఒక్కసారి కూడా పేల్చనివి, భయపెట్టడానికే.

ప్రఖ్యాతి పొందిన రజాకార్ల ఉద్యమం అలా ఒక్కసారిగా పుట్టుకొచ్చింది. ఖాసీం రజ్వీ రజాకార్ల నమోదును తనకు తోచినట్లు పెంచి చెప్పేవాడు. ఎన్ని వేలుగానైనా ప్రకటించుకునేవాడు. నమోదు సంఖ్య మాత్రం తక్కువగానే ఉండేది. ఇదివరకెప్పుడూ లేని విధంగా ఈ ఉద్యమం ప్రజలలో గొప్ప ప్రభావాన్ని చూపించింది. దూర ప్రాంతంలో, మారుమూలగా నివసించే ప్రజలలో గతంలో ఏర్పడ్డ భయం తొలగిపోయి ఏ సమస్యనైనా ఎదుర్కోగలమనే ఒక మానసిక సమర్థత ఏర్పడింది. ఈ సంసిద్ధత

గతంలో జరిగిన అసంఖ్యాక దాడులను చెప్పుకోదగ్గ రీతిలో నియంత్రించగలిగింది.

రజాకార్లలో మెల్లగా క్రమశిక్షణ పెరుగజొచ్చింది. ఖాసీం రజ్వీ ఆయన సహచరులు మారుమూల రజాకార్ కేంద్రాలను సందర్శించి ఆయుధాలను అటు నుంచి ఇటు, ఇటు నుంచి అటు పంచడం దళాల నైతిక బలాన్ని పెంచడం జరిగింది. ఆ ఆయుధాలను ఎన్నడూ ప్రయోగించక పోయినప్పటికీ ఒక ధైర్యం, ఒక గౌరవం కోసం గ్రామాలలోని రజాకార్లు వాటిని స్వీకరించేవారు. ప్రభుత్వం ఖాసీం రజ్వీ మీద గట్టి నిఘా పెట్టింది. పదివేల వరకు కత్తులు, నాలుగైదు వేల వరకు పాత తుపాకులు, కొన్ని వందల రైఫిళ్ళు, గన్నులు ఆయన వద్ద ఉండేవి. కొన్నింటికి మందుగుండు లేకపోయేది. ఓ డజన్ 303 రైఫిళ్ళు, కొన్ని డజన్ల రివాల్వర్లు సంపాదించి వాటినే ఘనంగా ప్రదర్శించేవాడాయన. ఒక ఉత్సాహవంతుడైన రిపేరు షాపతను ముడు నాలుగు స్టంట్‌గన్‌లను మొరటుగా అనుకరణతో తయారు చేసాడు. వాటికోసం రెండు వందల రౌండ్ల మందు గుండు సంపాదించాడు. దానికతడు ఎంతో గర్వపడ్డాడు. అతని అనుచరులు కూడా తమ ఆయుధ సంపత్తిని వేయిరెట్లు ఎక్కువచేసి చెప్పుకున్నారు.

ఖాసీం రజ్వీ ఏ పని చేసినా తన సహచరుల్లో గొప్ప ఉత్సాహాన్ని నింపగలిగేవాడు. ప్రతి రజాకారు ఏదో ఒక ఆయుధాన్ని పొందగలిగాడు. ఉత్సాహవంతుడైన ఒక రజాకారు తన భూమినంతా అమ్మి మూడు నాలుగు వేల రూపాయలతో (అప్పుడది వేయి డాలర్ల విలువ) స్థానిక వర్క్‌షాపులో స్టెన్‌గన్‌లాంటిది కొన్నాడు. ఆ స్టెన్‌గన్ ఉల్టా జామ్ అయి అతని ప్రాణాన్నే తీసింది.ఒక రైఫిల్ కానీ, అరడజను తుపాకులు దొరుకుతాయంటే ఖాసీం రజ్వీ ఎంత దూరమైనా వెళ్ళేవాడు. గత కొంతకాలం కింద తాత్కాలిక మిలటరీ క్యాంపు నడిచిన ప్రదేశం ఒకటుందని అక్కడ ఆయుధాలు దొరికే అవకాశం ఉందని భావించి అక్కడికి వెళ్ళి అయిదు రోజులపాటు సెప్టిక్ గుంతలు తవ్వించి ఆయుధాలు వెతికాడు. అదృష్టంకొద్దీ 303 తుపాకులకు పనికివచ్చే కొన్నివందల మందుగుండ్లు దొరికాయి. దాంతో ఆయుధాల నిధి దొరికిందని రజ్వీ భావించాడు. తొందరలోనే వేలకొద్దీ రైఫిళ్ళను, లక్షలాది సంఖ్యలో మందుగుండును పంపిస్తానని ఆయన మిత్రులకు వర్తమానం పంపించాడు. ఆయన వ్యక్తిగత పర్యవేక్షణలో చాలా గుంతలు తవ్వించాడు. ఏ కొత్త ఆయుధమూ దొరకలేదు. కాని సెప్టిక్ గుంతలు తవ్వడం వలన విసురుకున్న దుర్వాసనతో ఆయన చాలా రోజులే మంచం పట్టాడు.

ఎన్ని అవాంతరాలొచ్చినా రజాకార్ల ఉద్యమం గొప్ప మానసిక విజయాన్ని సాధించింది. ఖాసీం రజ్వీ తన సహచరులలో గొప్ప నైతిక స్థయిర్యాన్ని నింపగలిగాడు. కులానికి, మతానికి అతీతంగా ప్రజలను వారి ఆస్తిపాస్తులను కాపాడాలనే కచ్చితమైన ఆదేశాలిచ్చాడు. అయితే రజాకార్లు ప్రజల పట్ల దుడుకుగా వ్యవహరిస్తున్నట్లు సమాచారం అందుతూ వచ్చింది. అక్కడక్కడ జరిగిన సంఘటనల వల్ల రజాకార్లంటే కోపం, భయం ఏర్పడింది. భారతీయ పత్రికలు ఇలాంటి సమాచారం కోసమే కాచుకొని కూర్చున్నాయి. కాంగ్రెస్ ప్రభావంలో పనిచేస్తున్న పత్రికలు చిన్న చిన్న సంఘటనలను కూడా పెద్దవి చేసి ప్రచురించాయి. కొన్ని కల్పిత కథలను కూడా రాసాయి. రజాకార్లు పెద్ద సంఖ్యలో తిరుగుతున్నారని, రాష్ట్రంలో అలజడి, భయోత్పాతం సృష్టిస్తూ, లూటీలు, దహనాలు, హత్యలు చేస్తున్నారని ప్రచారం జరిగింది. హిందుస్తాన్ టైమ్స్ ఈ ప్రచారాన్ని పెద్దఎత్తున ప్రారంభించింది. వరుస కథనాల వల్ల భారతీయ సమాజం, తెలివైన రాతల వల్ల విదేశాలలో కూడా రజకార్ల మీద దుష్ప్రచారం జరిగింది.

హైద్రాబాద్‌లోని కొన్ని హిందూ కుటుంబాలకు భారతదేశంలో బంధువులు ఉండేవారు. అక్కడివాళ్ళు తమ బంధువులను తాత్కాలికంగా హైద్రాబాద్ వదిలి రావలసిందిగా హెచ్చరించారు. అందుకు కారణం త్వరలో భారత ప్రభుత్వం హైద్రాబాద్ మీద మిలటరీ దాడి చేయబోతుంది; ఆ సమయంలో అసహనంతో రజాకార్లు దిక్కుతోచక హిందువులను ఊచకోత కోస్తారు. అలా పది నుండి పదిహేను వేల కుటుంబాలకు చెందిన దాదాపు యాభై-అరవై వేల మంది హిందువులు రాష్ట్రంలోని వివిధ పట్టణాల నుండి ఇండియన్ యూనియన్ ప్రాంతానికి వెళ్ళిపోయారు. అలా వెళ్ళిన వారు తమ ఆస్థిపాస్తులను బంధువులకు, సేవకులకు అప్పగించి వెళ్ళారు. నాయకులు, పత్రికలు దీన్ని పెద్దది చేసి లక్షలాదిమంది హిందువులుహైద్రాబాద్‌ను వదిలి వెళ్తున్నారని ప్రచారం చేసారు. హైద్రాబాద్‌లో ఇక హిందువుల మనుగడ, గౌరవం ప్రమాదంలో పడిందన్నారు.

రజాకార్ల ఆవిర్భావం తర్వాత సరిహద్దులలో దాడులు ఆగి ప్రశాంతత ఏర్పడింది. ఇప్పుడు కొత్త ప్రమాదం వచ్చింది. ఈసారి దాడులు చేసేవారు మంచి ఆయుధాలు మందుగుండు సామాగ్రితో ఉన్నారు. ప్రతి గ్రూపు శిక్షణ పొందిన వ్యక్తిచే నడుస్తుంది ఆయుధాలు సరిగా లేని రజాకార్లు చాలా సందర్భాలలో వారితో సరితూగలేదు; అప్పటికి చొరబాట్లు ఎక్కువగా లేనందు వల్ల సరిహద్దు దళాలది కూడా ఏకపక్ష విజయం ఏమీ కాకుండా పోయింది. అక్కడక్కడా కమ్యూనిస్టుల

అలజడి అంతర్గతంగా జరుగుతున్న చట్ట విరుద్ధ కార్యక్రమాలు, అశాంతి కట్టడి చేయబడ్డాయి. మొత్తం మీద పరిస్థితి ప్రశాంతంగా ఉంది. కొన్ని సందర్భాలలో రజాకార్లతో తలపడే చిన్న చిన్న ఘర్షణలలో సరిహద్దు దాడులు చేసేవారు పెద్ద మొత్తంలో ఆయుధాలను మందుగుండను వదిలెళ్ళేవారు. అలా రజాకార్ల ఆయుధాగారాలు సమృద్ధమయ్యాయి. అలా సంఖ్యలోనూ, బలంలోనూ రజాకార్ల వ్యవస్థ బలపడింది.

ఖాసీం రజ్వీ సివిల్ దుస్తులను వదిలివేసి గర్వంగా మిలటరీ దుస్తులను ధరించసాగాడు. మొదట మిలటరీ జనరల్‌లా స్టార్స్‌తోనూ తర్వాత ఫీల్డు మార్షల్‌లా తనకు తాను తయారయ్యేవాడు. యూనిఫారం ధరించి పిస్టల్ చేబూనిన ఇద్దరు సైనికులతో ఎర్ర రిబ్బను అలంకరణతో ఖాసిం రజ్వీ ఒక పాత జీపులో తిరిగేవాడు. ఆయుధాల పట్ల వ్యామోహంలోనూ, మార్షల్‌లాగా ప్రవర్తిస్తాడనడంలోనూ అతిశయోక్తి ఏమీ లేదు. భారతదేశంలో విలీనం గురించిన సందర్భాన్ని మాట్లాడాల్సి వచ్చినప్పుడు రజ్వీ అగ్రహోదగ్రుడయ్యేవాడు. మత సామరస్య నిర్వహణ పట్ల ఆయన చాలా ఆసక్తిగా ఉండేవాడు. రజాకార్లలో హిందువుల సంఖ్యను పెంచడం ఆయన జీవితాశయాలలో ఒకటిగా ఉండేది. రజాకార్ల ఛత్రఛాయలో ఉన్నవారు అన్నివర్గాల ప్రజలను కలుపుకుపోవాలని, అందరి అభిప్రాయాలను గౌరవించే సహనశీలతను పెంచుకోవాలని ఆయన బోధిస్తూ ఉండేవాడు. రజాకార్లలో సమభావన కోసం, జాతులకు అతీతంగా లక్ష్యసాధనలో ముందుకు పోవడం కోసం ఆయన సూక్ష్మంగా పరిశీలిస్తూ ఉండేవాడు. ఆయా అంశాలను సరిగా నిర్వహించడంలోనే హైద్రాబాద్ భవిష్యత్తు ఇమిడి ఉందని అంటుండేవాడు. ఆ విధంగా మత సామరస్యానికి హైద్రాబాద్ ఒక నమూనా కాగలదని ఆయన నమ్మేవాడు. ఇండియాకు పాకిస్తాన్‌కు ఈ విషయంలో మార్గదర్శి కాగలదని భావించాడు.

ఖాసిం రజ్వీ నమ్మకాలు, ఆశయాలు కొంత పిడివాదం లాగా అనిపించినప్పటికీ ఆ నమ్మకాల పట్ల ఆయనకున్న నిజాయితీని శంకించే ఆధారాలేవీ లేవు. అర్ధ మిలటరీ సంస్థ అయిన రజాకార్ల లాంటి సంస్థతో భవిష్యత్తులో ఏర్పడబోయే దుష్పరిణామాల పట్ల కూడా ఆయనకు అవగాహన ఉంది. పరిస్థితులు అనుకూలించగానే దాన్ని రద్దు చేయాలని కూడా అనుకున్నారు.

వాస్తవంగా కానీ, మాటవరసకి కానీ హైద్రాబాద్‌ను ఇండియాలో కలపడమన్న దాన్ని ఆయన తీవ్రంగా వ్యతిరేకించారు. ఆయన, ఆయన అనుచరులు ఈ విధానానికి

తీవ్రంగా కట్టుబడ్డారు. అందుకోసం ఎంతకైనా పోరాడడానికి సిద్ధపడ్డారు. హైద్రాబాద్ సర్వస్వతంత్రదేశంగా ఉండడం అసాధ్యమన్న వాస్తవం కూడా ఆయనకు తెలుసు. హైద్రాబాద్ భౌగోళిక స్వరూపరీత్యా భారతదేశం ప్రతిపాదించే కొన్ని పరిమితులను అంగీకరించక తప్పదని కూడా తెలుసు. అయితే ప్రస్తుతమున్న, భవిష్యత్తులో రానున్న ఆర్థిక పరిస్థితులు ఆయనకు తెలియవు. ఇతర విషయాలలో తన అభిప్రాయాలను బాగానే ప్రచారంలో పెట్టేవాడు. ఇత్తెహాద్‌లో తనకు వ్యతిరేక వర్గం పట్ల చాలా జాగరూకతతో ఉండేవాడు. ఇంకా, రజ్వీ అత్యంత గట్టివాళ్ళైన తన సహచరుల కన్నా, క్యాబినెట్ మంత్రులకన్నా కాలానుగుణంగా, వాస్తవాల ఆధారంగా, చాలా ధైర్యంగా రాజీపడే నిర్ణయాలు కూడా తీసుకునేవాడు. ముస్లింలీగ్‌తో కానీ, జిన్నాతో కానీ ఆయనకు వ్యక్తిగత సంబంధాలు లేవు. ప్రభావాలు లేవు.

సహేతుకమైన, వాస్తవికమైన దృక్పథంతో రజ్వీ ఉన్నప్పటికీ ప్రజా సమూహాలలో ఆయన చేసిన బహిరంగ ప్రకటనలు హైద్రాబాద్‌కు లెక్కలేనంత నష్టం చేసాయి. ఒకసారి ఇండియా, హైద్రాబాద్ మీదికి సైనికచర్యకు పూనుకున్నట్లయితే ఢిల్లీ ఎర్రకోట మీద నిజాం పతాకం ఎగురుతుందని, బంగాళాఖాత జలాలు నిజాం పాదాలను కడుగుతాయనీ ప్రకటించాడు. అలాంటి రెచ్చగొట్టే ప్రకటనలు చాలా బాధ్యతా రహితంగా చేయడం వల్ల అత్యంత దురదృష్టకర పరిణామాలుగా రూపొందాయి. ఒకనాటి ముస్లిం రాజ్యాధికారానికి ప్రతీక అయిన ఢిల్లీలోని ఎర్రకోటను చర్చకు తేవడం ద్వారా భారతదేశ వ్యాప్తంగా పెద్ద కలకలం చెలరేగింది. ఖాసిం రజ్వీ హెచ్చరిక ఒక ఇండియన్ మినిస్టర్ ప్రసంగానికి జవాబుగా వచ్చింది. కొద్దిరోజుల ముందు ఒక బాధ్యతాయుతమైన భారత ప్రభుత్వంలోని మంత్రి ఢిల్లీలో ఒక హామీ ఇస్తూ మువ్వన్నెల జెండా నిజాం రాష్ట్రంలోని గ్రామగ్రామాన త్వరలోనే ఎగురుతుందని ప్రకటించాడు.

హైద్రాబాద్‌లోని బాధ్యతాయుతమైన హిందూ నాయకులు చాలామంది ఖాసిం రజ్వీ వ్యక్తిగత మిత్రులు. ఖాసిం రజ్వీ ముస్లింవాది అయినప్పటికీ హిందువులకు కానీ ఇతర మతస్తులకు కానీ ఆయన వ్యతిరేకం కాదని వాళ్ళకు తెలుసు. హిందూ నాయకుల మధ్య పరస్పర అనైక్యత, ఒక సమూహం ఒప్పుకుంటే మరొక సమూహం వ్యతిరేకించడం చూసాక వాళ్ళందరినీ ఒక తాటి మీదికి తేవడం కష్టమని రజ్వీకి అర్థమయింది. స్టేట్ కాంగ్రెస్ ఆలిండియా కాంగ్రెస్‌కు అనుబంధంగా ఉంటూ ఏదీ ముందుకు సాగనిచ్చేది కాదు. హైద్రాబాద్ స్టేట్‌కు వ్యతిరేకంగా ఆలిండియా కాంగ్రెస్ నూరిపోస్తున్న మాటల

ప్రకారం నడుచుకునే స్టేట్ కాంగ్రెస్ నాయకులంటే ఖాసిం రజ్వీకి చాలా కోపం.

ఖాసిం రజ్వీది చాలా సాధారణ వ్యక్తిగతజీవితం. ప్రజాధనం పట్ల ఆయన నికార్సువైఖరి ఆయన సహచరులకు నచ్చలేదు. పదివేల మంది రజాకార్ల సమావేశం కోసం ఒకసారి యాభైవేల రూపాయలు కావాలని అడిగితే అయిదువందలు ఇచ్చాడట. పెద్దమొత్తాల సారూప్య విలువలు కూడా ఆయనకు తెలిసేవి కావు. లక్షకూ, మిలియన్‌కూ గల తేడా కూడా తెలియదాయనకు. ప్రభుత్వం నుండీ, నిజాం నుండి ఆయనకు భారీగా ఆర్థిక సహాయం అందేదని భారతీయ పత్రికలు ఎంతో ప్రచారం చేసేవి కాని నిజానికి ఆయన చేతి ద్వారా నడిచే డబ్బు ఆశ్చర్యకరంగా చాలా చిన్నమొత్తం. ఆయన సహచరులు డబ్బు అడిగితే ఆయన నుంచి వచ్చే జవాబు డబ్బులేదనే.

వాళ్ళు చేసే పనిమీదనే ఆయన ఆసక్తి. అలాంటి స్పష్టమైన న్యాయం కాని పద్ధతి ఆయన రాజకీయ కార్యకలాపాలను ఎంతగానో సరళం చేసినప్పటికీ వాటి ప్రభావం మాత్రం ఎప్పుడూ తక్కువకాలేదు. ఈ ధోరణి ఆయన సహచరులలో పట్టుదలను పెంచి వనరులను పెంచుకొనేటట్లు చేసింది. అవిభక్త భారతదేశంలో ఎన్నో రాజకీయ ప్రయత్నాలు ప్రజాధనాన్ని దుర్వినియోగం చేయడం వల్ల విఫలమైనాయి. ఎందరివో రాజకీయ వ్యక్తిత్వాలు మసకబారుతాయి. ఖాసిం రజ్వీకి ఆయన సహచరులకు ఉన్న సొమ్మే తక్కువ కాబట్టి కుంభకోణాలకు అవకాశమే లేదు.

రజ్వీ గురించి తెలియనివాళ్ళు, తెలిసినా కావాలని మాట్లాడేవాళ్ళు ఆయనకు ప్రభుత్వపు ఆర్థికమద్దతు ఉందని అంటూ ఉండేవాళ్ళు. ఖాసిం రజ్వీకి అత్యవసరాలలో ప్రైవేటు చందాలు చిన్నచిన్న మొత్తాలలో ప్రత్యేకించిన పనులకోసం అందుతుండేవి. కొన్ని ప్రత్యేకమైన అవసరాలకు మాత్రం ప్రభుత్వం నుండి వేల రూపాయలకు మించకుండా అందుతుండేది. ఒకే పెద్ద మొత్తం సరిహద్దు బాధితుల సహాయం కోసం ప్రభుత్వం నుండి ఇత్తెహాద్‌కు అందింది. అది కూడా అయిదు లక్షల లోపే. రజాకార్ ఉద్యమం కోసం ప్రభుత్వం నుండి ఆయన ఆశించింది కానీ స్వీకరించింది కానీ ఏమీ లేదు. నిజాం వ్యక్తిగతంగా మద్దతు ఇచ్చారన్నది కూడా ఒక అసంగతమైన ప్రచారం. నిజాం గురించి, ఆయన స్వభావం గురించి తెలిసిన వారెవ్వరైనా నిజాం తన స్వంత డబ్బు ఇచ్చే అవకాశం ఉందని ఊహించలేరు.

తన ఆర్థిక వనరుల గురించి, ఆయుధ సంపత్తి గురించి బయటివాళ్ళ ఊహలను ఆయన చాలాకాలం తలకిందులు చేసాడు. భారతీయ పత్రికలు రజాకార్ల శక్తిసామర్థ్యాల

గురించి అద్భుతమైన కథనాలను ప్రచారం చేసాయి. అయితే రజ్వీ ఎన్నడూ వాటిని ఖండించేవాడు కాదు. అలా ఆ కథనాలు పెరిగి పెరిగి విస్తృత ప్రచారానికి నోచుకున్నాయి. అయితే ఆ కాలానికి ఆ ప్రచారం ఆయన లక్ష్యానికి ఉపయోగపడింది.

ఖాసిం రజ్వీ బుద్ధి కుశలతకు ఒక ఉదాహరణ వుంది: 1947 మే మాసంలో నిజాం పుట్టినరోజు సందర్భంగా ఇత్తెహాద్ ఒక ర్యాలీ నిర్వహించింది. 50 వేల మంది ముస్లింలు, ముస్లిమేతరులైన వాలంటీర్ల మార్చ్ ఫాస్ట్ అది. దానికి కొన్ని వారాల ముందు ప్రదర్శన కోసం ఆయుధాలను సేకరించ ప్రయత్నించి విఫలయ్యాడు రజ్వీ.

ఆయుధాలు కావాలని ప్రభుత్వాన్ని అడిగాడు. మిలటరీ కానీ, పోలీసులు కానీ కొన్ని గంటల కోసం కూడా ఆయుధాలు ఇవ్వడానికి సమ్మతించలేదు. 50 వేల మందిలో కేవలం అయిదు వందల మంది ప్రదర్శించగలిగే ఆయుధాలు మాత్రమే అందుబాటులో ఉన్నాయి. అప్పుడు కారణాలను వివరిస్తూ ఏ రజాకారు కూడా మార్చ్‌ఫాస్టులో ఆయుధాలను ప్రదర్శించగూడదని విజ్ఞప్తి చేసాడు. పేరేడు జరిగే రోజున స్త్రీలు, పురుషులు, పిల్లలు, వయోవృద్ధులు, యువకులు యూనిఫారంలోనూ, యునిఫారం లేకుండానూ వేలాదిగా తరలివచ్చారు. పెద్దసంఖ్యలో ప్రజలు చూస్తుండగా ఆయుధరహితంగా జరిగిన పెరేడు అది.

భారతదేశంలోని, విదేశాలలోని పెద్దసంఖ్యలో వున్న పాత్రికేయులను ఈ సంఘటన ఆకర్షించింది. పెరేడును చూడడానికి అమెరికా, ఐరోపా దేశాలలోని ప్రధాన పత్రికల ప్రతినిధులు హాజరయ్యారు. మొత్తం కార్యక్రమం విజయవంతంగా జరిగింది. కార్యక్రమం పూర్తయ్యాక రజ్వీనీ పాత్రికేయులు చుట్టుముట్టారు. ప్రతి ఒక్కరూ రజాకార్ల ఆయుధ సంపత్తి మీదే ప్రశ్నలు వేశారు. చాలా అమాయకంగా రజాకార్లకు ఆయుధాలు లేవని జవాబిచ్చాడు. భారత పత్రికలో అనేక కథనాలు చదివిన వాళ్ళందరూ ఈ అమాయకపు జవాబు నమ్మలేదు. ఇతర ప్రాంతాలలో రజాకార్లు ఆయుధాలతో సంచరించడం ప్రజలు చూసారు. రజ్వీ అమాయకపు జవాబు వాళ్ళకు మింగుడు పడలేదు. రజాకార్ల ఆయుధ సంపత్తి చాలానే ఉన్నప్పటికి రజ్వీ దానిని మాయోపాయం చేత వాళ్ళ శక్తియుక్తులను కప్పి ఉంచాడని, అనేక కథనాలు ప్రచారంలోకి వచ్చాయి. కొందరు దీనిని రజ్వీ మాయగా అర్థం చేసుకున్నప్పటికీ ఎక్కువమంది రజ్వీ మాటలను నమ్మారు.

రజాకార్ల గురించి చాలా గొప్పగా మాట్లాడ్డం ద్వారా రజాకార్ల అంతరంగాలలో

సుస్థితిని పెంపొందించడం అయన లక్ష్యంగా ఉండేది. బయటివాళ్ళకి కూడా అదొక పాఠంగా మారేది. రజాకార్లు ఒక గొప్ప సైనికశక్తి కాదని, ప్రజా శాంతికి విఘాతం కలిగించే శక్తి కాదని ఇండియా లోని నాయకులకు బాగా తలుసు. కాని దాన్నొక శక్తివంతమైన భయంకరమైన సమూహంగా చిత్రించడం వాళ్ళకప్పుడు అవసరం.

హైద్రాబాదుకు వ్యతిరేకంగా భారత ప్రభుత్వం వేసిన పథకాలలో భాగమే రజాకార్లకు వ్యతిరేకంగా అల్లిన ఆటవిక కథనాలు. రజాకార్ల బలం గురించి, అరాచకాల గురించి చెప్పడం భారతీయ ప్రభుత్వపు ఎజెండాగా మారింది. భారతదేశపు దుష్ప్రచారాన్ని నమ్మి ప్రపంచ స్థాయి పత్రికలు ఒకటి వెంట ఒకటి తమ ప్రతినిధులను హైద్రాబాదుకు పంపసాగాయి.

చాలా వార్తా సంస్థలు అదనపు ప్రతినిధులను నియమించాయి. ఒకరి వెంట ఒకరు, గుంపులు గుంపులుగా, స్త్రీ పురుషలనే భేదం లేకుండా పాత్రికేయులంతా తిరిగి భారతీయ పత్రికలు ప్రచురిస్తున్న అద్భుతాలు, ఘోరాలు ఏవీ కనపడక ఇదంతా భారత ప్రభుత్వం తమ అవసరాల కోసం సృష్టించిన కథనాలుగా నిర్ధారించుకున్నాయి. విదేశీ పాత్రికేయుల కథనాలతో కంగుతిన్న భారత ప్రభుత్వం ఈ కథనాలను తప్పు పట్టింది. విదేశీ పత్రికలను, పాత్రికేయులను, హైదరాబాద్ ప్రభుత్వం పెద్ద మొత్తంలో లంచమిచ్చి కొనుగోలు చేసిందని ఆరోపించేదాకా వెళ్ళింది.



# 10. ప్రధాని పదవి

1947 అక్టోబర్‌లో చత్తారి రెండవసారి తన పదవికి రాజీనామా చేసాడు. నిజాంకు మరొకసారి ప్రధానమంత్రిని వెతుక్కునే పని పడింది. ఒక్క సంవత్సరంలో రెండు చెడు అనుభవాలు చూడాల్సి వచ్చింది. ఒకసారి మీర్జా ఇస్మాయిల్‌ను ఎంచుకోవడం ద్వారా, రెండోది చత్తారి పునర్నియామకం ద్వారా. ఈ సారి చాలా జాగ్రత్తగా ఎంపిక చేసుకోవాల్సి వచ్చింది. క్యాబినెట్‌లో మెజారిటీ మంత్రులు ప్రజామోదం ఉన్నవారే కావాలని నిజాం మానసికంగా సిద్ధమయ్యాడు. ఆయన దృష్టిలో ప్రధాని ముఖ్యం. రాబోయే ప్రధాని ప్రభుత్వాన్ని సరిగ్గా నడిపిస్తూ, కష్టసాధ్యమైన బయటి విషయాలను చూస్తూ సమస్యాత్మకంగా మారిన అంతర్గత వ్యవహారాలను చక్కదిద్దాల్సి ఉంది. ఇందుకోసం పాకిస్థాన్ గవర్నర్ జనరల్‌గా ఉన్న జిన్నాను వ్యక్తిగతసలహా అడిగాడు. రాజ్యాంగబద్ధమైన పదవిలో ఉన్న తను ఈ సందర్భంలో వ్యక్తిగతంగా కూడా సలహా ఇవ్వలేనని చెప్పాడు. అలా నిజామ్ స్వంతంగా నిర్ణయం తీసుకోవలసి వచ్చింది. తన వ్యక్తిగత అవసరాల కోసం నిజానికి క్యాబినేట్‌ను మార్చకుండా ఉండాలి. అయితే పాత మంత్రివర్గాన్ని కొనసాగించడం ఆయనకెంత మాత్రం ఇష్టం లేదు.

కొత్తగా ఏర్పాటైన పాకిస్తాన్ క్యాబినెట్‌లో ఆర్థికశాఖ మంత్రిగా ప్రమాణం చేసిన గులాం మహమ్మద్ పేరును పరిశీలించాడు. గులాం మహమ్మద్ గతంలో హైద్రాబాద్‌లో ఆర్థికమంత్రిగా చేసాడు. ఆ కాలంలో ఆయనకు నిజాంతో మంచి సంబంధాలు ఏమీ లేవు. అప్పుడు తన పదవీ కాలం పూర్తి కాకుండానే ఆయన వైదొలిగాడు. ఆయనకు హైద్రాబాద్ మీద ప్రేమ ఉంది. కొన్ని విభేదాలు ఉన్న ప్పటికీ పాలకుడి మీద ఆయనకు చాలా గౌరవం. హైద్రాబాద్ ప్రధానిగా అవకాశం వచ్చినపుడు డాక్టర్లను, తన మిత్రులను సంప్రదించాడు. ప్రస్తుత ఆరోగ్యంతో ప్రధానిగా చేరితే ఆ ఒత్తిడిని తట్టుకోలేనని, అలా తనకు వ్యక్తిగతంగా కాని ప్రధాని పదవికి కాని అది అభిలషణీయం కాదని ఆ అవకాశాన్ని స్పష్టంగా తిరస్కరించాడు. అనారోగ్య కారణాల చేత ప్రధాని పదవి చేపట్టలేకపోతున్నానని, ఇంకేవిధంగా సేవ చేయడానికి ఆహ్వానించినా చాలా ఆనందిస్తానని నిజాంకు చెప్పాడు. ఆయన తిరస్కారం నిజాం సమస్యను పెంచింది. హిందువుల నుండి తీసుకుందామని ప్రయత్నించాడు. కాని ఆనాటి బాధ్యతలను భుజాన వేసుకోవడానికి రాష్ట్రంలో నాయకుడు కనిపించలేదు. నిజాంకి నమ్మదగ్గ బయటివాళ్ళు ఎవరూ కనిపించలేదు. ప్రజానాయకుల అభిప్రాయా లను ఆయన గమనిస్తూ ఉన్నాడు. ఖాసిం రజ్వి నిజాంకు ఒక నోట్ సమర్పించాడు. అందులో ఆయన తనకు బాగా తెలిసిన ఆర్మీ కమాండర్ ఏల్ ఎద్రూస్ పేరు, నవాబ్ దీన్ యార్ జంగ్ పేరు ప్రధానిగా సూచించాడు. నేను ఆయనకు అంతగా తెలియదు. నా పేరు ప్రతిపాదనకు వచ్చినపుడు మొదట ఆయన వ్యతిరేకించాడు. రాష్ట్రం లోపలా బయటా ఆయన ఇంకా వెతుకుతూనే ఉన్నాడు. ఎన్నో పేర్లు ఊహాగానాలు నడిచాయి. ఈ కాలంలో రెండుసార్లు నిజాం నన్ను పిలిపించాడు. కానీ మేం సాధారణ అభిప్రాయాలనే పంచుకున్నాం.

ఒకరోజు ఉదయాన మంత్రివర్గంలో ఇత్తెహాద్ సభ్యుడు రహీమ్ నా దగ్గరకు వచ్చి నిజాం నన్ను ప్రభుత్వం ఏర్పాటు చేయమని ఆహ్వానించేందుకు సిద్ధమయ్యాడని చెప్పాడు. ఈ వార్త నాకు ఆశ్చర్యం కలిగించలేదు. ఈ విషయాన్నే నేను కొంతకాలంగా ఆలోచిస్తూ ఉన్నాను. ఒకవేళ అలాంటి ప్రతిపాదన వస్తే తిరస్కరించాలని నిశ్చయించు కున్నాను. పూర్తి రాజకీయ జీవితం నాకిష్టం లేదు. ఇదివరకు క్యాబినెట్‌లో చేరమని అక్బర్ హైదరి, చత్తారిలు ఆహ్వానించినప్పుడు కూడా తిరస్కరించాను. ఒకసారి చర్చల సందర్భంగా పాకిస్తాన్‌లో నూతనంగా ఏర్పడబోయే క్యాబినెట్లో చేరమని అడిగినప్పుడు కూడా నేను ఆసక్తి చూపించలేదు. తర్వాత నిజాం మధ్యాహ్నం నన్ను

చూడాలనుకుంటున్నట్లు సమాచారమొచ్చింది. నేను నిజాంను కలిసాను. కొత్త హైదరాబాద్ ప్రతినిధి బృంద సభ్యుడు మొయిన్ నవాజ్ జంగ్, రహీమ్ అక్కడ ఉన్నారు. నిజాం నేరుగా విషయం చెప్పాడు. ఆయన సూటిదనం చూసి నేను కొంచెం వెనక్కి తగ్గాను.

రాష్ట్ర శ్రేయస్సు నిజాం శ్రేయస్సు దృష్ట్యా నన్ను తప్పించి ఇంకెవరినైనా ఎంపిక చేసుకోమని మృదువుగా సూచించాను. నిజాం తన కుర్చీలో కూర్చొని నన్ను ప్రత్యామ్నాయంగా పేర్లు చెప్పమన్నాడు. మళ్ళీ నేను బితుక్కుమన్న. కొంతసేపాగి రెండు పేర్లు సూచించాను. వాటిని ఆయన తిరస్కరించాడు. అప్పుడు గతంలో ఆర్థికశాఖను నిర్వహించిన జాహిద్ హుస్సేన్ ఎలా ఉంటాడని అడిగాను. అప్పుడు ఆయన ఢిల్లీలో పాకిస్తాన్ హైకమిషనర్‌గా పనిచేస్తూ ఉన్నాడు. నేను అతను బాగుంటాడు అనుకున్నాను. నిజాం ఒక కాగితం తీసుకొని జిన్నాకు టెలిగ్రాము రాయడం మొదలు పెట్టాడు. తన దృష్టిలో రెండు పేర్లు ప్రధాని పదవికోసం ఉన్నాయని – ఒకటి: జాహిద్ హుస్సేన్, రెండు: నేను. ఇందుకోసం జిన్నా వ్యక్తిగత శ్రద్ధ కావాలని కోరాడు. కొద్దిరోజుల కిందనే తన సలహాలు ఉండవన్న జిన్నా మాటలను ఆయన మరచి పోయాడు. రెండురోజుల తర్వాత జిన్నా జవాబు వచ్చింది. ఈ రెండు పేర్లు వదిలేసి కొత్తవి వెతకమన్నాడు జిన్నా. ఆ టెలిగ్రాం నాకు పంపి చూడమన్నాడు. నాకది ఆశ్చర్యం కలిగించలేదని చెప్పాను. జిన్నా సలహా పాటించమని కూడా చెప్పాను. సుదీర్ఘ చర్చ తర్వాత అక్కడి నుంచి వచ్చాను. తాత్కాలికంగానైనా చాలా సౌకర్యవంతంగా ఫీలయ్యాను.

ఇలా చర్చలు సాగుతుండగా నేను ప్రధాని కాబోతున్నట్లు పుకార్లు వ్యాపించాయి. అన్ని పత్రికలూ నేను ప్రధాని అవుతున్నట్లు రాసాయి. కొన్నైతే పుంఖానుపుంఖాలుగా రాసాయి. హైద్రాబాద్‌లోని ప్రముఖులంతా నన్ను ఆ బాధ్యత తీసుకొమ్మని ఒత్తిడి చేయసాగారు. ఆశ్చర్యమేమిటంటే అందులో చాలామంది నా హిందు మిత్రులున్నారు. వాణిజ్య రాజకీయ వర్గాలవాళ్ళు ఉన్నారు. అన్ని వర్గాల వాళ్ళ ఉమ్మడి అభిప్రాయం నాకు ఆశ్చర్యం కలిగించింది. నిజాంతో నా మొదటి సమావేశం తర్వాత విభిన్న హిందువుల సమూహాల నుండి నాకు ఏ స్థాయిలో సహకారం ఉండవచ్చని నా హిందూ మిత్రులను అడిగాను. వాళ్ళ అభిప్రాయం మిశ్రమంగా ఉన్నప్పటికీ ఆశాజనకం గానే ఉంది. కొంతమంది సలహా మేరకు రహమాన్‌తో, అప్పటికి నిర్బంధంలో ఉన్న స్టేట్ కాంగ్రెస్ అధ్యక్షుడు రామానందతీర్థతో, స్టేట్ కాంగ్రెస్ ప్రముఖుడు బి.రామకిషన్

రావుతో అభిప్రాయాలను పంచుకోవాలను కున్నాను. అందుకు రెండు సమావేశాలు ఏర్పాటు చేసాను. హిందూ సమూహంలో మంచి పేరున్న బ్యాంకరు పన్నాలాల్ పిత్తితో నాకు మంచి స్నేహ సంబంధాలున్నాయి. ఈ రెండు సమావేశాలకు ఆయన్ను పిలిచాను. ఈ సమావేశాలలో స్వామి ఎక్కువగా మాట్లాడలేదు. ఆయన పూర్తి స్వేచ్ఛాజీవి కానందున ఆయన్ని రాజకీయ సలహాలడగడం న్యాయం కాదని నాకు పరోక్షంగా చెప్పాడు. అయితే ఎన్నడూ లేనివిధంగా నాపై ఆత్మీయత కనబరచాడు. పవిత్ర ఖురాన్‌ను లోతైన అధ్యయనం చేస్తున్నట్లు పదేపదే చెప్పాడు.



రామ్‌కిషన్ రావు బాగానే మాట్లాడినప్పటికీ స్టేట్ కాంగ్రెస్ విధానం మీద దాని అధ్యక్షుడిగా రామానంద తీర్థయే సాధికారికంగా చెప్పగలడని స్పష్టం చేసాడు. బాధ్యతలలో ఉన్న వారి నుండి ఏదీ స్వేచ్ఛగా రాబట్టలేమని నాకు అర్థమయింది. పన్నాలాల్ నిరాశ పడ్డాడు. వ్యక్తిగతంగా తీర్థ చేయగలిగినంత సహకారం అందిస్తాడని పన్నాలాల్ హామీ ఇచ్చాడు.

నేను రాజకీయ వాతావరణాన్ని అంచనా వేస్తుండగా రెండు సార్లు ఖాసిం రజ్వీ నా దగ్గరికి వచ్చి ఒకవేళ నేను పదవి చేపట్టేట్లయితే ఆయనది, ఆయన పార్టీది పూర్తి సహకారం ఉంటుందని చెప్పాడు. రాజకీయ అనుబంధాలు లేని వాళ్ళంతా నా అభ్యర్థిత్వం బాగుంటుంది అన్నారు. ఇన్ని హామీలున్నా నేను ఆ బాధ్యతకు సిద్ధపడలేదు. ఇదే సమయంలో ఈ సమస్యను తాత్కాలికంగానైన వాయిదా వేయమని నిజాంకు జిన్నా సలహా ఇచ్చాడు.

ప్రశాంతంగా ఒక దీర్ఘశ్వాస తీసుకొని నా పనుల్లో నేను నిమగ్నమైనాను. కాని నా ప్రశాంతత ఎంతోకాలం నిలవలేదు. కొద్దిరోజుల్లోనే నిజాం నన్ను పిలిచి పరిస్థితులు వివరించి నన్ను ప్రధానిగా వ్యవహరించాల్సిందిగా అడిగే నిర్ణయానికి వచ్చాడు. ఒక భూమిపుత్రుడిగా ఇలాంటి కష్టకాలంలో ఆ ఆదేశాన్ని కాదనలేను. నిజాం కోపంలో ఉన్నాడు కానీ సున్నితమైన పట్టుదలతో చెప్పాడు. నిజాం పట్టుదలకు

ప్రతీక. ఆ రోజు ఆయన పట్టుదల చూడవలసిందే. అప్పుడు నేను తిరస్కరించలేక పోయాను. ఒకటి రెండు రోజుల్లో ఆలోచించి చెబుతానన్నాను.

నేను నిజాంకు ఒక విజ్ఞప్తిని పంపించాను. గతంలో అప్పుడప్పుడు చర్చించిన మధ్యంతర ప్రభుత్వాన్ని ఏర్పాటు చేస్తానన్నాను. ప్రధానమంత్రి, ఉప ప్రధానమంత్రి ముగ్గురు ముస్లింలు, ముగ్గురు హిందువులు, ముగ్గురు అధికారులతో మంత్రివర్గం ఏర్పడుతుంది. కొత్త రాజ్యాంగం ఏర్పడే వరకు ఈ మధ్యంతర ప్రభుత్వం నడుస్తుంది. ఆ తర్వాత శాసనసభ ద్వారా ప్రభుత్వం ఏర్పడుతుంది. హైదరాబాద్ ప్రత్యేక పరిస్థితుల దృష్ట్యా రెండు మతాల మధ్య అధికార సమతుల్యాన్ని పాటించాలని ప్రతిపాదించాను. కనీసం ఆరంభంలో నిజాం నియమించే ప్రధాని, ఉప ప్రధానులలో ఒకరు హిందూ మరొకరు ముస్లిం అయ్యేట్లు రాజ్యాంగంలో పొందుపరచాలని భావించాను. ఈ ప్రతిపాదన నిజాంకు నచ్చింది. ఎందుకంటే తక్షణం ఆయన అధికారాలకు కోత పడదు కనుక. నేను ఈ పదవిని సంధికాలపు బాధ్యతగానే స్వీకరిస్తున్నానని, మూడు నుండి ఆరు నెలల వరకు మాత్రమే ఈ బాధ్యత నిర్వహిస్తానని నిజాంకు తెలియజేశాను. ఈ కాలంలో నిజాం బాగా ఆలోచించుకొని మధ్యంతర ప్రభుత్వ సారథిని ఎంపిక చేసుకోవాలని కూడా సూచించాను. ఆయన దీనికి అభ్యంతర పెట్టలేదు. కాని, దీనిని మా అంతర్గత అవగాహనగా భావించి అధికారికంగా మాత్రం ఒక సంవత్సర పదవిగా ప్రకటించాడు.

నాకు, నిజాంకు మధ్య చాలా ముఖ్యమైన కార్యక్రమమేమిటంటే భారత్‌తో భవిష్యత్ సంబంధాలు. శిథిలమైపోయిన హైద్రాబాద్ భౌగోళిక, రాజకీయ, ఆర్థిక స్థితిగతుల గురించి బాధగా చర్చించుకున్నాం. బలాలు, బలహీనతలను అంచనా వేసుకున్నాం. భారత సంఘపు ఒత్తిడికి ఎంత మేరకు తల ఒగ్గాలని, రాష్ట్రపు పరిమిత స్వాతంత్ర్యాన్నైనా కాపాడుకోవడానికి ఎంత మూల్యం చెల్లించాలని విశ్లేషించుకున్నాం. వివరాల్లో తేడా ఉండవచ్చు. కాని భారత్‌లో ఎట్టి పరిస్థితుల్లో కలవరాదనే విషయంలో మా ఇద్దరి మధ్య చాలా స్పష్టమైన ఏకాభిప్రాయముంది. భారతదేశంతో మంచి స్నేహ సంబంధాల కోసం ప్రయత్నించాలని, వాళ్ళ కోరికలు ఉద్దేశాలను వీలైనంత మేర అంగీకరించాలని నిర్ణయానికి వచ్చాం. పాకిస్తాన్ పట్ల మా దృష్టి నిర్బంధం లేని ప్రేమ.

నిజాము నేను ఇలాంటి అతి ప్రధానమైన వ్యవహారాల్లో తలమునకలై ఉండగా ఒక చిన్న సరదా సంఘటన జరిగింది. నేను అంగీకరించిన చిన్న కాలానికి

నామమాత్రమైన వేతనాన్ని మాత్రమే తీసుకోవాలని అంగీకరించా. నిజాం దీనికి ఒప్పుకోలేదు. ఇది హైద్రాబాద్ సంప్రదాయానికి సంబంధించిన వ్యవహారం. ఇది భవిష్యత్తు ప్రధానులకు ఇబ్బందికరంగా మారుతుంది. నేను వ్యాపార రంగం నుండి వస్తున్నానని ఆ రంగంలో నా సంపాదనతో పోలిస్తే ప్రధాని వేతనం చాలా నామ మాత్రమని నిజాంకు తెలుసు. నా ముందు ప్రధాని సర్ మీర్జా ఇస్మాయిల్ లాగానే నాకు నెలకు 6400/- రూపాయలు చెల్లించాలని ఎవరో సూచించారు. నేను దాని మీద చర్చించడం ఇష్టం లేక నిజాం ఏది నిర్ణయించినా నాకు అంగీకారమని చెప్పాను. అప్పుడక్కడ రహీమ్ ఉన్నాడు. ఆయన 6500 ప్రతిపాదించాడు. నిజాంలో బేరమాడే శక్తి విజృంభించింది. నిజాం కుర్చీలో సర్దుకొని కూర్చున్నాడు. నా వైపు చూసాడు. బల్లను ఒకసారి చరిసి 'మనం రౌండ్ ఫిగర్ రూ. 6000/- (దాదాపు 1800 డాలర్లు) ఎందుకు నిర్ణయించగూడదు' అన్నాడు. ఆయన ప్రయత్నం, అంగీకారం కోసం ఆయన చూపు, ఆయన మొఖంలో చిరునవ్వు నాకు నవ్వు తెప్పించాయి. నాకు అది బాగా సరిపోతుంది అన్నాను. మొదటిసారి ఒక విషయంలో నా మీద ఆయన పై చేయి అయిందన్న మహదానందం ఆయనలో కనిపించింది. ఒక వ్యాపారవేత్తనే అయినా నేను చాలా మంచివాడినని ఇతరులకు చెప్పి ఉంటాడని నేను నమ్మాను.

అలా ప్రాథమిక విషయాలు పరిష్కారం అయ్యాక నేను రెండురోజుల తర్వాత-భారత్‌తో యథాతథ ఒప్పందం సంతకాలు అయిన మరుసటి రోజు బాధ్యతలు తీసుకోవడానికి ఒప్పుకున్నాను. మరుసటి రోజు నన్ను ప్రధానిగా ప్రకటిస్తూ ఫర్మానా (నిజాం ఆదేశాలను అన్నింటిని ఫర్మానాలనేవారు) జారీ అయింది.

30 నవంబర్ 1947 రోజున మధ్యాహ్నం క్యాబినెట్ కార్యదర్శి ఒక చిన్న నల్లటి పెట్టె, మరొక ముద్రిత ఫర్మానాను నా కార్యాలయానికి తెచ్చి బహుకరించాడు. ప్రధాని ముద్ర ఉన్న పెట్టె, ఫర్మానాను స్వీకరించడంతో ప్రధాని పదవీ స్వీకారం అయినట్టే! తర్వాత నిజాం దగ్గరికి వెళ్లి ప్రమాణం చేయాలి కాని నిజాం అది అవసరం లేదని భావించాడు.

పదవీ స్వీకార కార్యక్రమం నా వ్యాపార ప్రదేశంలో జరిగింది. నా వ్యాపార మిత్రులు చాలా మంది హాజరయ్యారు. అందరి మొఖాలలో చాలా ఉద్వేగం, కొంత ఉత్సాహం కనిపించాయి. చాలామంది అదొక గొప్ప రోజుగా భావించారు. కొందరు వేరే విధంగా కూడా భావించి ఉండవచ్చు కాని బయటపడలేదు.

కొత్తగా మంత్రివర్గంలో చేరిన పాత మిత్రులతో ఆత్మీయ వచనాలు పలికి

వీడ్కోలు తీసుకున్నాక క్యాబినెట్ కార్యదర్శి వెంట రాగా అధికార నివాసం షా మంజిల్‌కు ప్రయాణమయ్యాము. నా భార్య, కుటుంబ సభ్యులు మా ఇంటిని వదిలి అధికార నివాసానికి మారడానికి ఇష్టపడలేదు. అలా నా అధికార నివాసం నా ప్రభుత్వ కార్యక్రమాలకే పరిమితమయింది. నేను సాధారణంగా ఉదయం నుండి రాత్రి పొద్దు పోయేవరకు ఆఫీసులోనే ఉండేవాణ్ణి.

# 11. మధ్యంతర ప్రభుత్వ ఏర్పాటు

నేను పదవి చేపట్టిన తర్వాత కొత్త మంత్రి వర్గాన్ని ఏర్పాటు చేయగలిగేంత వరకు పాత ప్రభుత్వాన్నే కొనసాగించాలని నిర్ణయించాను. యధాతథ ఒప్పందం ముగించుకొని మోయిన్ నవాజ్ జంగ్ ఢిల్లీ నుండి తిరిగి వచ్చాడు. కొత్త మంత్రి వర్గాన్ని ఏర్పాటు చేయడం, యధాతథ ఒప్పందాన్ని అమలు పరచడం నా ముందున్న రెండు ప్రధాన కర్తవ్యాలు. స్వాతంత్ర్యం పొందాక భారత్‌లో ఏర్పడ్డ కొత్త ప్రభుత్వం హైద్రాబాద్ నుండి వస్తువుల రాకపోకలను అన్ని రకాలుగా అడ్డగించింది. ఎగుమతులు, దిగుమతుల అడ్డగింపుల ప్రభావం ఆర్థిక వ్యవస్థమీద పడింది. తక్షణ చర్యల ఆవశ్యకత ఏర్పడింది. ఇంకేమాత్రం సమయం వృధా చేయకుండా సమస్య పరిష్కారం చేయాల్సిన అవసరం వచ్చింది.

నేను ఒక రేడియో ప్రసంగం చేసాను. నేనెందుకు ప్రధాని పదవి చేపట్టిందీ, అంతర్గతంగా, విదేశీ వ్యవహారాలలో నా దృక్పథమేమిటో వివరించాను. విదేశీ వ్యవహారాలంటే ప్రాథమికంగా భారత ప్రభుత్వంతో వ్యవహారాలే. స్టేట్ కాంగ్రెస్ నాయకులను, ఇతర సంస్థల నాయకుల విడుదలను కూడా రేడియోలో ప్రకటించాను. ప్రజలంతా కులమత విభేదాలను మరిచి ఒక్కతాటిమీద ముందుకు నడవాలని పిలుపు నిచ్చాను.

రామానంద తీర్థ, ఆయన అనుచరులు విడుదలయ్యారు; వాళ్ళతోను, ఇతర రాజకీయ గ్రూపులతోనూ నేను మధ్యంతర ప్రభుత్వ ఏర్పాటు గురించి చర్చించాను. స్టేట్ కాంగ్రెస్ నాయకుల మధ్య సందిగ్ధత, నిస్సహాయస్థితిని చూసి ఆశ్చర్యపోయాను.

రామానంద తీర్థకు వ్యతిరేకంగా ఒక అపనమ్మకాన్ని గమనించాను. తీర్థ నిరంకుశంగా వ్యవహారించాడు. స్వంతంగా ఏమీ చేయలేని నిస్సహాయస్థితిలో స్టేట్ కాంగ్రెస్ నాయకులు ఉన్నట్లు వాళ్ళ సన్నిహితులు నాకు చెప్పారు. స్టేట్ కాంగ్రెస్ నాయకులు సాధారణంగా, తీర్థ ప్రత్యేకంగా ఢిల్లీలోని ఆలిండియా కాంగ్రెస్ నాయకుల ఆదేశాన్ని పాటించడం, వాళ్ళ సూచనలను అమలు చేయడం మాత్రమే లక్ష్యంగా పెట్టుకున్నారు. కొన్ని రోజుల తర్వాత తీర్థ తమ సంఘం ఇప్పుడు ప్రభుత్వానికి సహకరించాలని అనుకుంటుందని,అయితే అంతకు ముందు రాష్ట్రం బయట ఉన్న వాళ్ళ వర్కింగ్ కమిటీ సభ్యులతో మాట్లాడాలన్నాడు. మీ సభ్యులంతా తిరిగి హైద్రాబాద్‌కు రావచ్చని, ఇప్పుడెలాంటి ఆంక్షలు లేవని, అనుమానాలు ఉండనక్కరలేదని స్పష్టమైన హామీ ఇచ్చాను, అయితే తాను బయటికి వెళ్ళి కొంతమందితో చర్చించాక కాని ఏమీ చెప్పలేనన్నాడు తీర్థ. హైద్రాబాద్ వదిలి వెళ్ళడానికి నా అనుమతి అడిగాడు. తను బయటికి వెళ్ళాల్సింది కూడ వారం - పదిరోజులే అన్నాడు. ఆయన అబద్ధం చెబుతున్నాడని నాకు తెలుసు. అయితే ఆయన మాట మీద వదిలేసాను. ఆయన పూర్తిగా స్వేచ్ఛాజీవి అని, ఆయనకు తోచిన విధంగా ప్రవర్తించ వచ్చునని ఆయనకు తెలియజేసాను.

హైద్రాబాద్‌ను వీడేముందు ఆయన కొన్ని అనుమనాలు నివృత్తి కావాలన్నాడు. అన్ని విషయాలూ మోయిన్ నవాజ్ జంగ్‌తో మాట్లాడమని చెప్పాను. తర్వాత ఏదైనా మాట్లాడాలంటే నన్ను ఎప్పుడైనా కలవ వచ్చునని చెప్పాను. మోయిన్ నవాజ్ జంగ్‌తో చర్చలతో తీర్థ సంతృప్తి చెందినట్లున్నాడు. తిరిగి నన్ను కలవలేదు, మళ్ళీ హైద్రాబాద్‌కు వచ్చేదాక.

తీర్థ రాష్ట్ర సరిహద్దులు దాటాడో లేదో ఆయన సంస్థానానికి వ్యతిరేకంగా చేసిన ప్రకటనలు కుప్పలు తెప్పలుగా రాసాగాయి. పక్క రాష్ట్రాల ప్రభుత్వాలు ఆయనకు మద్దతుగా పత్రికా సమావేశాలు ఏర్పాటు చేయసాగాయి. బొంబాయి, మద్రాసు ప్రావిన్సుల క్యాబినెట్ మంత్రులు ఆయన సమావేశాలకు అధ్యక్షత వహించి మరీ ఆయనకు మద్దతు తెలిపారు. బహిరంగ సభల్లో, పత్రికా సమావేశాల్లో తీర్థ మాట్లాడ సాగాడు. రాష్ట్రంలో హిందువుల మీద దారుణాలు జరుగుతున్నాయని, జైలు నుండి తనెంత సాహసోపేతంగా తప్పించుకొని వచ్చిందీ కథలల్లి మరీ చెప్పసాగాడు ఆయన. అదృష్టవశాత్తు తాను రాష్ట్రం నుండి బయటపడ్డానని చెప్పాడు. అదే సమయంలో

భారత ప్రభుత్వం లోపల వెలుపల ఉన్ననాయకులు, ముఖ్యమంత్రుల స్థాయిలో ఉన్న వారు రెచ్చగొట్టే ప్రకటనలు చేసారు. యధాతధ ఒప్పందంలోని ఒక ముఖ్యమైన క్లాజు – రెండు ప్రభుత్వాలు పరస్పర వ్యతిరేక ప్రచారాలను నిరుత్సాహ పరచాలి. కాని ఆ ఒప్పందం తర్వాత బాధ్యతాయుతమైన స్థానాల్లో ఉన్న భారతీయ నాయకులు ఊహించని అబద్ధపు రెచ్చగొట్టే ప్రకటనలకు తెగబడ్డారు. ఈ విషయాలు భారత ప్రభుత్వం దృష్టికి తెచ్చినప్పుడు స్వతంత్ర భారత దేశంలో పత్రికా స్వాతంత్ర్యం, వ్యక్తిగత స్వేచ్ఛ వల్ల ఎవరు ఏదైనా మాట్లాడవచ్చనే జవాబు వచ్చింది. తర్వాత సంఘటనలను గమనించినట్లయితే 'ఇండియన్ ప్రెస్' అంత స్వేచ్ఛగా ఏమీ లేదని, భారత ప్రభుత్వం దానిని చెప్పుచేతల్లో పెట్టలేనంత దయనీయంగా కూడా ఏమీ లేదని అర్థమయింది.

రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల్లో జరిగిన అలజడుల్లో భాగస్వామ్యముందని అనుమానమున్న వాళ్ళందరినీ గత ప్రభుత్వాలు జైల్లో పెట్టగా నువ్వు ఏ అంచనాతో వాళ్ళందరినీ విడుదల చేసావని నిజాం నన్ను అడిగాడు. ఆ ప్రశ్న విన్నా కాని నా దగ్గర ఏం జవాబు లేదు.

తీర్థ హైద్రాబాద్‌ను వదిలి వెళ్ళిన తర్వాత నిజాంమీద పిరికిపందల దాడి జరిగింది. దాన్నుండి ఆయన అద్భుతంగా తప్పించుకున్నారు. నిజాం రోజువారి మధ్యాహ్నపు కారు ప్రయాణం మీద బాగా శిక్షణ పొందిన ఒక యువకుడు హాండ్‌గ్రెనేడ్ విసిరాడు. ఆ హాండ్‌గ్రెనేడ్ కారు కిటికీకి తగిలి, నేల మీదపడి పేలింది. రొడ్డుమీద గుంత పడింది. విచారణలో లోతైన కుట్ర బయట పడింది. నిజాం ప్రయాణించే రోడ్డు వెంట నలుగురు హాండ్‌గ్రెనేడ్స్‌తో నిలుచున్నారు. ఇద్దరిని పోలీసులు అరెస్టు చేసారు. కాంగ్రెస్ నాయకులు ఆ సంఘటనతో తమకెలాంటి సంబంధం లేదన్నారు కానీ తీర్థకు దానికి ఎలాంటి బాధ్యత లేదనలేదు.

ఈ సంఘటన ద్వారా నిజాం విశిష్ట వ్యక్తిత్వం బయటికి వచ్చింది. ఆయన కారు ఆపాడు. సంఘటన జరిగిన దగ్గరికి వచ్చాడు, ఆ ప్రదేశాన్ని ఆధీనంలోకి తీసుకున్నాడు. గుమిగూడిన జనాన్ని నేరస్తుని దగ్గరికి రావద్దని హెచ్చరించాడు. లేకపోతే పెద్ద ప్రమాదమే జరిగి ఉండేది. తర్వాత ఆ నేరస్తున్ని విచారించడానికి ప్రత్యేక కోర్టు ఏదీ ఏర్పాటు చేయకుండా సాధారణ నేరస్తులలాగానే విచారించాలని ఆదేశించాడు. ఆ నేరస్తుడికి ప్రతి సౌకర్యం, న్యాయ సహాయమూ అందేట్లు శ్రద్ధ వహించాడు.

నలుగురు హిందూ ప్రజాప్రతినిధులు, నలుగురు ముస్లిం ప్రజా ప్రతినిధులు, నలుగురు అధికారులతో ఏర్పడ్డ నూతన ప్రభుత్వం కూడా చిన్న విషయమేమీకాదు. ముస్లిం గ్రూపునుండి మంత్రుల్ని తీసుకోవడం కొంత సులభమే. ఎందుకంటే ఇత్తెహాద్ ఒక అవగాహనకు వచ్చిందంటే నేరుగా తమ ప్రతినిధులను శాసనసభ్యుల నుండి నామినేట్ చేయగలదు. హిందూ శాసనసభ్యుల రాజకీయ ప్రాతినిధ్యాలు వైవిధ్య భరితమైనవి. స్టేట్ కాంగ్రెస్‌తో సహా హిందూ రాజకీయ సమూహాలు ఎన్నికలను బహిష్కరించడం వల్ల శాసనసభలో హిందూ సభ్యులు లేక సమస్య క్లిష్టమైపోయింది. నా వరకు నేను సాంకేతిక కారణాలతో ఏ గ్రూపునూ క్యాబినెట్‌లో లేకుండా చేయరాదనే ఆదుర్దాతో ఉన్నాను. వర్కింగ్ కమిటీ సభ్యులను ఒప్పించి తన ప్రతిపాదనతో వస్తానని వెళ్ళిన తీర్థ ప్రావిన్సులన్ని తిరుగుతూ ఉన్నాడు. తిరిగి వస్తాడన్న ఏ సూచనా లేదు. తీర్థ మీద వ్యతిరేకత ఉన్నప్పటికీ ఆయనను కాదని బాధ్యతలు తమ భుజాలమీదికి ఎత్తుకోవడానికి స్టేట్ కాంగ్రెస్ నాయకులు సిద్ధంగా లేరు. శాసనసభలో సభ్యత్వం లేనప్పటికీ నలుగురికి బదులు ఇద్దరు సభ్యులకు అవకాశం ఇవ్వడానికి నేను ప్రతిపాదించాను. సుదీర్ఘ చర్చల తర్వాత ఇద్దరు సభ్యులను క్యాబినెట్‌కు పంపేందుకు స్టేట్ కాంగ్రెస్ నాయకులు ఒప్పుకున్నారు. అయితే తిరిగి మాటమార్చి ఒక్కరినే నామినేట్ చేస్తామన్నారు. ఆ ఒక్కరు కూడా వ్యక్తిగత హెూదాలోనే, ఎందుకంటే పార్టీ నాయకుడు లేకుండా, వర్కింగ్ కమిటీ అనుమతి లేకుండా పార్టీ తరపున నిర్ణయం తీసుకోలేమని చెప్పారు. నేను ఇంకా ఆగే పరిస్థితిలో లేను. ఒక్కరిని కాంగ్రెస్ నుండి మిగతా ముగ్గురిని శాసనసభలోని ఇతర హిందూ నాయకులనుండి తీసుకోవాలనుకున్నాను.

మంత్రుల్ని నామినేట్ చేసే హక్కు రాజకీయపార్టీలకు ఉన్నప్పటికీ వాటిని నిజాం అంతిమ నిర్ణయంకోసం పంపే అధికారం నా చేతుల్లో ఉంది. ఇత్తెహాద్ ముస్లిం మంత్రుల జాబితాను ఇచ్చింది. ఇత్తెహాద్ ఇచ్చిన జాబితాతో నేనూ, నిజామూ సంతృప్తి చెందలేదు. ఎందుకంటే ఇత్తెహాద్ ఇవ్వగలిగినంత మంచి జాబితా కాదది. అయితే ఇత్తెహాద్ పార్టీ మనుగడను దృష్టిలో పెట్టుకొని ప్రతిపాదించిన పేర్లవి. మంచి వ్యక్తిత్వం గలవాళ్ళు పరిపాలనకు అవసరమైన వాళ్ళుకాదు. ఖాసీం రజ్వీ మనసు పెట్టి తయారు చేసిన పేర్లు కాక, తన సహచరుల ఒత్తిడిలో పంపినవి. ఇత్తెహాద్ వర్కింగ్ కమిటీ తయారు చేసినవి. ఆ పేర్లు మారిస్తే రజ్వీకి ఇంకా కష్టమవుతుంది. నేనాపేర్లు తిరస్కరించి రజ్వీపై ఒత్తిడి తెచ్చాను. పేర్లు మార్చడంకోసం ఆయన



ప్రయత్నించి విఫలమయ్యాడు. నా ముందు రెండే మార్గాలున్నాయి; ఒకటి ఆయన ప్రతిపాదనలను అంగీకరించడం. రెండు–కొత్త ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయలేనని నిజాంకు చెప్పడం. నేను రెండో మార్గానికి సిద్ధమవుతుండగా ఖాసీంరజ్వీ వచ్చి ప్రాథమికంగా ఈ జాబితాను ఒప్పుకొమ్మని, తర్వాత వీళ్ళని హైద్రాబాద్ ఏజెంట్ జనరల్స్‌గా విదేశాలకు పంపించమని చెప్పాడు. తర్వాత నేను మొదట అంగీకరించిన పిదపనే తను పేర్లు ప్రతిపాదించనున్నట్లు చెప్పాడు. నిజాం ఈ జాబితాను ఆమోదించిన పిదప రజ్వీ నేను చెప్పిన ప్రతిపాదనను రాతపూర్వకంగా జారీ చేసాడు.

నిజాం ఆ మంత్రులందరినీ బయటికి పంపిస్తానన్నాడు. రాజ్య హితంకోసం యువరక్తానికి అవకాశమివ్వాలని అన్నాడు. ఆయనకు వేరే విధంగా ఎంతో ప్రీతిపాత్రమైన వాళ్ళను కూడా మంత్రులుగా మాత్రం స్వీకరించ లేదు. 'వాళ్ళు నాకు తెలిసిన వాళ్ళేకానీ వాళ్ళ శక్తి సామర్థ్యాల మీద, నిజాయితీ మీద నాకు నమ్మకం లేదని' నాకు చెప్పాడు. జాబితాను తుది రూపుకు తేవడానికి ఎన్నోసార్లు సవరించాను నేను.

ముఖ్యమైన శాఖల పంపిణీమీద నిజాం అంతే శ్రద్ధగా ఉన్నాడు. ఈ కఠినమైన నిర్ణయాలకు తగిన కారణము, పట్టుదల ఉంది. ఒక నిర్ణయం జరిగిపోయాక నేనెంతో ఊపిరి పీల్చుకున్నాను. మంత్రివర్గాన్ని ఏర్పాటు చేయడం నేను ఊహించినదాని కన్నా చాలా కష్టతరమై పోయింది.

# 12. ఏజంట్ జనరల్ ఆగమనం

సరిహద్దులో శాంతి భద్రతల పరిరక్షణ నా ప్రధాన కర్తవ్యంగా మారిపోయింది. ప్రాణభయం, ఆస్థిపాస్తుల రక్షణ కరువయిందనే భావన ఆ ప్రాంత ప్రజలలో ఏర్పడింది. అక్కడి స్థానిక పరిపాలన నిర్వీర్యమై పోయింది. అక్కడక్కడా ప్రతీకార దాడులు పొడసూపాయి. తీవ్ర ఆగ్రహానికి గురైన కొందరు ప్రజలు అతివాద సమూహాలతో కలిసి భారత భూభాగంలోని ప్రజలపై అక్కడక్కడా దాడులు చేశారు. అలాంటి సంఘటనలు చాలా స్వల్పమే అయినప్పటికీ పత్రికలు దాన్ని పెద్దది చేశాయి. భారతదేశం వాటికి చాలా ప్రచారం కల్పించింది. పక్కనున్న రాష్ట్రాల ప్రభుత్వాలతో మాట్లాడితే అది సులభంగా పరిష్కారం చేయగలిగిన సమస్యే. పక్క రాష్ట్రాలకు చెందిన ముఖ్యమంత్రులు, మంత్రులు నాకు తెలిసినవారే.

ముంబాయి, మద్రాసు, సెంట్రల్ ప్రావిన్సుల ముఖ్యమంత్రులను వారి హోం మంత్రులతో సహా హైద్రాబాద్‌ను సందర్శించవలసిందిగా నేను వ్యక్తిగత ఆహ్వానాలు పంపాను. ఉద్రిక్తతలను తగ్గించడమే నా ఆహ్వానపు లక్ష్యం. ముగ్గురు ముఖ్యమంత్రులలో ఇద్దరు వెంటనే సానుకూలంగా స్పందించారు. సెంట్రల్ ప్రావిన్సు ముఖ్యమంత్రి నేను ఆహ్వానించిన సమయానికి రావడానికి సంసిద్ధత వ్యక్తం చేశాడు. అసెంబ్లీ సమావేశాలు జరుగుతున్నందున తాను మాద్రాసు వీడి రాలేను కాబట్టి అందరం మద్రాసులోనే సమావేశమవుదామని మద్రాసు ముఖ్యమంత్రి ప్రతిపాదించాడు. బాంబే ఒక్కటే చిన్న కారణం చూపి సమావేశం ఇప్పుడు సాధ్యం కాదంది. భారతదేశపు ఏజెంట్ జనరల్ కె.ఎమ్. మున్షీ అటు ఢిల్లీలోనూ, ఇటు ముంబాయిలోనూ ప్రయత్నించి ఈ సమావేశాన్ని అడ్డుకోగలిగాడు. తర్వాత మద్రాసు, సెంట్రల్ ప్రావిన్సులు కూడా తమకు ఢిల్లీ అనుమతి లేదని తప్పుకున్నాయి.

కె.ఎమ్. మున్షీ భారత ఏజెంటు జనరల్‌గా హైద్రాబాద్‌కు నియమితులయ్యారనే వార్త నన్ను ఇబ్బంది పెట్టింది. ఆయన మతతత్వ ధోరణి, గతంలో హైద్రాబాద్‌లో ఆయన వ్యవహరించిన తీరు అందరికీ తెలిసిందే. హైద్రాబాద్ పశ్చిమజిల్లాలలో సత్యాగ్రహం పేర కొన్ని సంవత్సరాల కిందట ఆయన చేసిన నిర్వాకం ఇంకా అందరికీ గుర్తే ఉంది. ఆయన ఎంపికతో భారత్ భవిష్యత్ ఉద్దేశ్యాలు బయటపడుతున్నాయి. ఏజెంట్ జనరల్‌ల నియామకం విషయాలలో గత ప్రభుత్వాల అనధికారిక సూచనలను ఇండియా తుంగలో తొక్కింది. తమకు ఇష్టం వచ్చినవారిని నియమించుకోవచ్చని ఇండియా భావించింది.

మున్షీ నియామకం కాగానే ద్వైపాక్షిక వ్యవహారాలన్నీ ఆయన ద్వారానే రావాలనే వర్తమానం వచ్చింది నాకు. గత బ్రిటీష్ రెసిడెంటు కార్యకలాపాలే మున్షీ చేయనున్నాడని అర్థమయింది. పదవీబాధ్యతలు తీసుకోకుండానే ఆయన మాటలూ, చేతలూ ఆరంభమైనాయి. యథాతథ ఒప్పందం లోని అంశాలకు విరుద్ధంగా పెద్దన్న వేషం ధరించాడు. చరిత్రలో ఎప్పుడూ లేనంత ఉత్సుకత, ప్రచారంతో హైద్రాబాద్ చేరుకున్నాడాయన. ఆయన రాక కంటే కొద్ది రోజుల ముందు ఒక జూనియర్ అధికారుల బృందం వచ్చింది. ఒప్పందం ప్రకారం హైద్రాబాద్ ప్రభుత్వం వారికి వసతి ఏర్పాటు చేయాలి. బ్రిటీష్ రెసిడెంటుకి గౌరవప్రదమైన రెసిడెన్సీ ఉండేది. యథాతథ ఒప్పందం ప్రకారం అవి నిజాం ప్రభుత్వానివి. భారత ప్రభుత్వ విజ్ఞప్తి మేరకు రెసిడెన్సీలోని ఒక బంగ్లాను భారత ప్రభుత్వ ట్రెజరీకి ఇవ్వడం జరిగింది. ప్రత్యామ్నాయ ఏర్పాట్లు జరిగేవరకు ఆ బంగ్లాలో మాజీ సైనికులకు పెన్షన్ వగైరాల పంపిణీ జరుగుతుంది. ఏజెంట్ జనరల్ కోసం మంచి నివాస ప్రాంతంలో ఒక భవనం ఏర్పాటు చేయటం జరిగింది.

విశాలమైన తోట మధ్య భాగంలో ఆ బంగ్లా వుంది. అది ఏజెంట్ జనరల్ జూనియర్ అధికారులు ఇద్దరికీ బాగా నచ్చింది. కాకతాళీయంగా అది నా స్వంత ఇంటికి దగ్గర. ఒకరోజు తర్వాత ఆ భవనం నగరానికి దూరంగా ఉందని, ఏజంట్ జనరల్‌కు రెసిడెన్సీని ఇవ్వవలసిందిగా ఢిల్లీ నుండి వర్తమానం వచ్చిందని ఇద్దరు అధికారులు నాకు తెలిపారు. బ్రిటీష్ అధికారం మాకు దక్కిందని చెప్పడమే ఆ వర్తమానం ఉద్దేశం. ఈ కోరిక చిన్నగా మొదలై చివరికి ఢిల్లీ ఒత్తిడిగా మారి పోయింది.



నిజాంకానీ, నైజాం ప్రజలు కానీ బ్రిటీష్ ఏకస్వామ్యాన్ని అంగీకరించే స్థితిలో లేరు. అలాగే ఏజెంట్ జనరల్‌ని బ్రిటీష్ వారసుడిగా గుర్తించడానికి ఇష్టపడలేదు. ఇండియా కూడా ఈ మొదటి అవకాశాన్ని జారవిడుచుకోదలచుకోలేదు. వేగంగా, ఘాటుగా లార్డ్‌మౌంట్ బాటన్‌కూ నిజాంకు మధ్య టెలిగ్రామ్‌లు నడిచాయి. ఢిల్లీ మొండిపట్టు పట్టింది. హైద్రాబాద్ కూడా అంత మొండిగానే బదులిచ్చింది. చివరికి ఇండియా డిమాండు కొద్దిగా సడలించుకుని తాత్కాలిక ఏర్పాటుగా మాత్రమే రెసిడెన్సీని ఇవ్వమని, ఇంకో మంచి భవనం దొరకగానే అందులోకి వెళ్ళిపోతామని అడిగింది. ఒక సంకేతం లాంటి రెసిడెన్సీని ఏజెంట్ జనరల్‌కు ఒక నిమిషం కూడా ఇచ్చేది లేదని హైద్రాబాద్ కుండ బద్దలు కొట్టింది. ఢిల్లీకి హైద్రాబాద్‌కు మధ్య ఈ ఉత్తర ప్రత్యుత్తరాలు జరుగుతుండగా ఒక నమ్మలేని సంఘటన జరిగింది. గెస్ట్‌హౌస్‌లో వుంటున్న ఇద్దరు భారత ప్రభుత్వ అధికారులు ఒకరోజు అర్ధరాత్రిపూట రెసిడెన్సీ ఆంటీ రూములు రెండింట్లోకి దూరిపోయారు. తెల్లారాక అది చూసి మర్యాదగా అక్కడి నుండి వెళ్ళిపోండి అని చెబితే వాళ్లు అందుకు నిరాకరించారు. వాళ్ళను బలవంతంగా అక్కడినుంచి పంపిస్తే అదొక రాజకీయ సమస్యగా చేయడానికి ఇండియా కాచుక్కూచుంది. నేను అంతే జాగరూకతతో వాళ్ళకు అలాంటి అవకాశం చిక్కకుండా జాగ్రత్త పడుతున్నాను. మరుసటి రోజు లార్డ్‌మౌంట్ బాటన్ నుండి నిజాంకొక టెలిగ్రాం వచ్చింది. హైద్రాబాద్ రెసిడెన్సీని ఏజెంట్ జనరల్‌కు ఇవ్వడం వీలుకాదని

చెప్పినందున, బొల్లారం రెసిడెన్సీనయినా ఆయనకు ఇవ్వవలసిందని ఆ టెలిగ్రాం సారాంశం. హైద్రాబాద్‌కు 15 మైళ్ళ దూరంలో ఉన్న బొల్లారం రెసిడెన్సీ బ్రిటీష్ వాళ్ళ వేసవి విడిది. హైద్రాబాద్ అభ్యంతరం ఒకపక్క విజయవంతం కాగా, నిజాం ప్రత్యామ్నాయ ప్రతిపాదనకు కూడా ఒప్పుకోలేదు. ఆగ్రహోదగ్రమైన ఢిల్లీ క్యాబినెట్ హైద్రాబాద్ రెసిడెన్సీని బలవంతంగా ఆక్రమించాలని నిర్ణయించింది.

హైద్రాబాద్‌తో కుదిరిన ఒక ఒప్పందం ప్రకారం బ్రిటీష్‌వాళ్ళు బొల్లారం లోని కొన్ని ఆర్మీ యూనిట్లను నిర్వహించేవారు. ఈ ఆర్మీ యూనిట్లు, దేశంలోని మిగతా యూనిట్లలాగే భారత ప్రభుత్వ అధీనంలో వెళ్ళాయి. కానీ వాస్తవంగా ఆ యూనిట్లు ఇంకా అక్కడే వున్నాయి. ఆ సైన్యాన్ని ఉపయోగించి హైద్రాబాద్ రెసిడెన్సీని ఆక్రమించవలసిందిగా ఏజెంట్ జనరల్‌కు ఢిల్లీ నుండి ఆదేశాలు వచ్చాయి. బొల్లారం నుండి సైన్యం చర్యలకు దిగుతున్నట్లు నాకు సమాచారం వచ్చింది. వ్యవహారం సున్నితంగా మారింది. హైద్రాబాద్ ఆర్మీ కమాండర్‌ను పిలిచాను. తదనంతర సంఘటనల గురించి హామీ ఇవ్వడంతో పాటు బొల్లారం సైన్యం కదలకుండా చూస్తానని ఆయన చెప్పాడు. నిజాం ఆగ్రహోదగ్రుడై నాడు. ఇండియన్ ఆర్మీ కనుక ముందుకు అడుగు వేస్తే బలప్రయోగంతో నిలువరించాలని ఆదేశాలు జారీ చేశాడు నాక్కూడా తెలియకుండానే. నగరం ఉద్రిక్తంగా, ఆందోళనకరంగా ఉంది, భారతదేశం కూడా. ఆ సాయంకాలం ఖాసిం రజ్వీ ప్రజా సమూహాన్ని ఉద్దేశించి ప్రసంగించాడు. ఇండియా కుటిల పన్నాగంతో దొడ్డిదారిన రెసిడెన్సీని ఆక్రమించి ఆధిపత్యం ప్రదర్శించాలనుకుంటే ప్రజలు ఆ రెసిడెన్సీని నేలమట్టం చేసి ప్రతి ఇటుక ముక్కనూ మూసీలో కలిపేస్తారని ఉద్ఘాటించాడు.

రాత్రంతా నా సహచరులతో, ఆర్మీ అధికారులతో గడిపాను. మరుసటి రోజు ఉదయం సైన్యాన్ని మోహరించాల్సిందిగా ఆదేశించాను. కానీ ఏ నిమిషంలోనైనా ఇండియన్ ఆర్మీతో సఖ్యత కుదిరే అవకాశాన్ని వదులుకోవద్దని కూడా సూచించాను. ఏ చిన్న సంఘటన జరిగినా అది హైద్రాబాద్ ఇండియాల మధ్య పూర్తి స్థాయి యుద్ధానికి దారి తీస్తుందని నాకు తెలుసు. మనం చాలా మూల్యమే చెల్లించుకోవలసి వస్తుందని కూడా తెలుసు. కొద్ది గంటల తర్వాత మున్షీ నుండి నాకు ట్రంక్‌కాల్ వచ్చింది. మున్షీ చాలా మర్యాదగా, స్నేహ పూర్వకంగా మాట్లాడాడు. 'ఈ రాద్ధాంతం కన్నా రాష్ట్రానికి అతిథిగా భావించి కొద్ది రోజుల వరకు తనకు బొల్లారం రెసిడెన్సీ ఇవ్వవచ్చుకదా' అని అడిగాడు. అలా ఇవ్వడం హైద్రాబాద్‌కేమీ నామోషీ కాదు.

ఢిల్లీ గౌరవమూ దక్కుతుంది. తర్వాత రెండు వారాలలో ఇంకో భవనానికి మారతానని వ్యక్తిగత హామీ కూడా ఇచ్చాడాయన. అంత మర్యాదగా మున్షీ ప్రవర్తించడం అదే మొదటిసారి, చివరిసారి కూడా. ఆ ప్రతిపాదన నాకు వ్యక్తిగతంగా రుచించలేదు. పైగా నిజాం కోపం మీద వున్నాడు, ప్రజాభిప్రాయం అందుకు అనుకూలంగా లేదు. అయినా ఆయన ప్రతిపాదనను అంగీకరించాను. బిల్డింగు గొడవగా కనిపించే ఈ వ్యవహారాన్ని ఇంకా సాగదీయవద్దని నిర్ణయించుకున్నాను. ఇండియా చేస్తున్న దుష్ప్రచారం గంటగంటకూ పెరిగిపోతుంది. ఇండియాలో పత్రికలన్నిటిలో 'హైద్రాబాద్ రెసిడెన్సీ' కథనాలే. ప్రపంచమంతా దీనిమీదే శ్రద్ధ పెట్టి చూస్తుంది. మౌంట్‌బాటెన్ తన పలుకుబడిని ఉపయోగించి విదేశీ పత్రికల్లో హైద్రాబాద్ వ్యతిరేక కథనాలు రాయించాడు. ఒకే బిల్డింగు కోసం హైద్రాబాద్ ఎంతో అపరిపక్వంగా, మూర్ఖంగా వ్యవహరించి పెద్ద సైనిక అగాధాన్ని సృష్టించుకుంటుందని విజయవంతంగా ప్రచారం చేయగలిగాడు.

ఎంతగానో ప్రయత్నించి నిజాంను ఒప్పించాను. ప్రభుత్వం తరపున మున్షీని బొల్లారం రెసిడెన్సీకి ఆహ్వానించాను. కొద్దిరోజులు ప్రభుత్వ అతిథిగా మున్షీ బొల్లారం రెసిడెన్సీలో ఉంటారని నేను ప్రకటించాను.

ఇదిలా ఉండగా మున్షీగారి ఇద్దరు అధికారులు మున్షీ తరపున హైద్రాబాద్‌లో కలయిక కోసం ఆహ్వానాలు పంపారు. వందలాదిగా పంపిన ఆహ్వానాలలో హైద్రాబాద్ రెసిడెన్సీని కార్యాలయంగా చూపారు. మున్షీ కూడా ఈ తతంగంతో చాలా ఇబ్బంది పడ్డాడు. ఐతే ఇదంతా ఢిల్లీలోని రాష్ట్ర వ్యవహారాల శాఖ నిర్వాకమని చెప్పాడు. మరొక విడత ఆహ్వానాలు తయారై ఏకంగా నిజాంకు ఆయన కుటుంబ సభ్యులకు, ఇతర అతి ముఖ్యమైన వ్యక్తులకు విందు ఆహ్వానాలు వెళ్ళాయి. మున్షీ కోరిక మేరకు ఆయన ఇబ్బందిని నేను తప్పించాలనుకున్నాను. కొన్ని ఆహ్వానాలు నేను తయారు చేసి మున్షీని కలిసే కార్యాలయాన్ని వేరే చోట చూపించాను.

ఏజెంట్ జనరల్ రాక పెద్ద తుపానును తలపించింది. ప్రజల భావోద్వేగాలు పెరిగిపోయాయి. తర్వాత ఏమి జరగనుందో అనే ఆందోళన ప్రజలలో కనిపించింది. జనవరి 5,1948 రోజున మామూలుగా నడిచే రోజువారీ విమానంలో రావాలని మున్షీ షెడ్యూలు. తర్వాత ఢిల్లీ సూచన మేరకు ఆయన ప్రత్యేక విమానంలో వచ్చారు. హైద్రాబాద్ ప్రభుత్వ ప్రతినిధులను ఆయన ఏర్‌పోర్టులో కలిశారు. బొల్లారం సైన్యం విమానాశ్రయానికి వెళ్ళి గౌరవవందనం చేసింది. కొన్ని వందలమంది స్టేట్ కాంగ్రెస్

కార్యకర్తలు స్వాగతం పలికారు. విమానం దిగి గౌరవ వందనం స్వీకరించి చాలా ఉద్రేకపూరితమైన ఉపన్యాసం ఇచ్చారు. జునాగఢ్ ఆక్రమణలో భారత సైన్యం సాహసాలను కొనియాడారు. అట్లాంటి సాహసాలు ఇంకెక్కడ అవసరమైనా చేస్తారని భరోసా వ్యక్తం చేశారు. బొల్లారం రెసిడెన్సీకి ప్రయాణమై ప్రభుత్వ అతిథిగా ఉండి పోయారు.

భారత ప్రభుత్వంతో ఉన్న అవగాహనలో భాగంగా హైద్రాబాద్ ఏజెంట్ జనరల్ అదేరోజు ఢిల్లీ చేరుకున్నాడు. భారత ప్రభుత్వం నుండి ఆయనకి ఎవరూ స్వాగతం చెప్పలేదు. సాయంకాలం ఒక కార్యదర్శి విమానాశ్రయానికి వచ్చి భారత ప్రభుత్వం తరపున స్వాగతం చెప్పలేక పోయినందుకు విచారం వెలిబుచ్చాడు.

ఈ సంఘటనలన్నీ సాయంకాలం నిద్రపోయేముందు మననం చేసుకున్నాను. రెండవ ప్రపంచయుద్ధానికి ముందు జరిగిన సంఘటనలు నా కళ్ళముందు కదలాడాయి. జెకోస్లొవేకియా దేశాధినేతకూ, ఆయన ప్రతినిధులకూ హిట్లర్ చేసిన అవమానం గుర్తొచ్చింది. జెకోస్లొవేకియాను హిట్లర్ ఆక్రమించడమూ గుర్తుకొచ్చింది.

హిట్లరూ, జర్మనీ కూడా జెకొస్లొవేకియా వల్ల జర్మనీ మనుగడ ప్రమాదంలో పడిందని కూడా ప్రచారం చేసుకోవడం గుర్తుకు వచ్చింది. 'అన్యాయం' అని నాలో నేను అనుకున్నాను. ఆలోచనల్లోనే అలసిపోయాను. నిద్రపట్టింది.



# 13. ఏజంట్ జనరల్ మున్షీ

బొల్లారం రెసిడెన్సీకి దగ్గర్లో బ్రిటీష్ వాళ్ళు ఒక విశాలమైన భవంతిని నిర్మించారు. దక్కన్ హౌజ్ అని దానికి పేరుపెట్టారు. బ్రిటిష్ కమాండర్ అధికార నివాసం అది. సాంప్రదాయం ఉట్టిపడేట్టు కట్టిన గంభీరమైన బంగ్లా అది. బొల్లారం రెసిడెన్సీలో కొద్ది రోజులు గడిపాక మున్షీ ఆ దక్కన్ హౌజ్‌కు మారాలనుకున్నాడు. దానికి దక్షిణ్ సదన్ అని సంస్కృతపు పేరు పెట్టాడు. బాంబే హైకోర్టులో మంచి పేరున్న లాయర్ మున్షీ. ఆయనకు పెద్ద పెద్ద రాజకీయ లక్ష్యాలు ఉండేవి. కానీ సాధించింది మాత్రం తక్కువే. కాంగ్రెస్ హైకమాండ్ దగ్గర ఆయన పలుకుబడి స్థిరంగా లేకపోవడం వల్ల ఒక మంచి స్థానంలో స్థిరపడిపోవాలని ఆయన ఆతృతగా ఉన్నాడు. తరచూ ఇన్‌ఫీరియారిటీ, సుపీరియారిటీలతో బాధపడుతుండేవాడు. తను బ్రాహ్మణుడిని అని గర్వంగా చెప్పుకొంటూ ఉండేవాడు. ఆయన పూర్వాశ్రమం తెలిసినవాళ్ళు ఆయన పుట్టుకతో బ్రాహ్మణుడు కాడనే వాళ్ళు. స్వభావరీత్యా ఆయన మతవాది. యుద్ధం లేకుండా హైద్రాబాద్‌ను భారతదేశంలో కలపాలనే బాధ్యతను ఆయనకు అప్పగించింది ఢిల్లీ. కానీ ఆయనకు స్వభావరీత్యా కాని రాజకీయంగా కానీ అది కష్టసాధ్యమైన పనికింద మారింది.

1759 నుండి వివిధ ఒప్పందాల ద్వారా ఆంగ్లో హైద్రాబాద్ సంబంధాలు కొనసాగినవి. స్వతహసిద్ధమైన బ్రిటీష్ దర్పంవల్ల, రాజకీయబలం వల్ల హైద్రాబాద్ మీద, నిజాం మీద ఇంగ్లీషు వాళ్ళ ఆధిపత్యం కొనసాగింది. బ్రిటీష్ క్యాబినెట్ ఇండియాకు రాజకీయాధికారం అప్పజెప్పేటప్పుడు తమ ఆధిపత్యాన్నంతా ఇండియాకు కట్టబెట్ట బోమనే హామీ ఉంది. హైద్రాబాద్‌కు ఎటువంటి అనుమానానికీ ఆస్కారం లేకుండా ఇది స్పష్టం చేయబడ్డది. 1947 నవంబరులో చేసుకున్న యథాతథ ఒప్పందం ఆధిపత్య పోకడలు ఎంత మాత్రం ఉండగూడదని చెప్పింది. వీటన్నింటినీ తుంగలో తొక్కాలని మున్షీ ఆరాటం. కొత్త ఏర్పాట్లు జరిగే వరకూ హైద్రాబాద్‌కు సంబంధించిన అంతర్జాతీయ వ్యవహారాలు, రక్షణ, సమాచార వ్యవస్థలు 1947 ఆగస్టు 15కు ముందు బ్రిటన్ చూసినట్లే ఇప్పుడు ఇండియా చూడాలనే అర్థం వచ్చే నిబంధన ఒకటి యథాతథ ఒప్పందంలో ఉంది. మున్షీ దాన్ని పదేపదే ప్రస్తావించే వాడు. శతాబ్దాలకన్నా పాత ఫైళ్ళలో ఇలాంటి అవకాశాలను ఆయన వెతికి తీస్తుండేవాడు. పాత దృష్టాంతాలను పట్టుకొని ఇండియాకు అనుకూలంగా అన్వయించి మాట్లాడుతుండే వాడు. ఆ మాటలు రాజకీయంగా ఆసక్తి రేపగానే ఉబ్బితబ్బిబ్బయ్యే వాడు. గతంలో బ్రిటీష్ రెసిడెంట్ పాత్ర ధరించబోయి విఫలమైనాడు. దాంతో కొంత తగ్గాడు. కింది స్థాయివాళ్ళతో తాను బ్రిటీష్ రెసిడెంటు వారసుడిననే భావన కలిగేట్లు ప్రవర్తించేవాడు. అందువల్ల ఉన్న గౌరవం కూడా తగ్గింది. ఒకసారి ఆవేశపడేవాడు. ఒకోసారి ప్రజా వ్యవహారాలలో సమర్థుడిగా కనిపించే వాడు. ఇంకోసారి తన విచిత్ర ప్రవర్తనతో ప్రజల్లో పలుచనయ్యేవాడు. ఇలా ఆయన అనుకున్న విధంగా ముందుకు పోలేక పోయాడు.

ఆయనకు ఇంకొక సమస్యకూడా వచ్చిపడింది. ఢిల్లీ పెద్దలపట్ల ఆయన ఆధిపత్యం చూపించబోయేవాడు. హైద్రాబాద్‌లో చర్చల ద్వారా తేలిన మంచి ప్రతిపాదనలను ఆయన ఢిల్లీకి తీసుకుపోయేవాడు. ప్రతీసారి అవి ఢిల్లీలో బుట్టదాఖలయ్యేవి. మున్షీ తీవ్రనిరాశకు గురయ్యేవాడు. తర్వాత కాలంలో ఉపయోగకరమైన ప్రతిపాదనలను కూడా పంపకుండా పోయాడు. అలా ప్రతి సందర్భంలోనూ హైద్రాబాద్ ఆకాంక్షలు బలి అయ్యేవి.

తొలిరోజుల్లో ఆయన నేరుగా నిజాంతో సంబంధాలు పెట్టుకోవాలని, బ్రిటిష్ రెసిడెంటులా నిజాంను అదుపులో పెట్టుకోవాలని ప్రయత్నించాడు. అందులో విఫలమయ్యాడు. ఆ తర్వాత ఒక ప్రధానిగా ఆయన దృష్టి నా మీద పడింది. ఆయన

సలహాలతో నా పరిపాలనను మెరుగుపరుచుకోవలసిందిగా పలుమార్లు పరోక్ష సందేశాలు పంపించాడు. నా నుండి స్పందన లేకపోయేసరికి ఆయనకు చాలా కోపమొచ్చింది.

ఢిల్లీతో సహకారం లేక, నిజాంనుండి కానీ నా నుండి కానీ ఆశించినంత స్పందన లేక ఆయన దృష్టి స్టేట్ కాంగ్రెస్ మీద పడింది. ఇరుకైన సుల్తాన్ బజార్ నుండి విశాలమైన కార్యాలయంకోసం స్టేట్ కాంగ్రెస్ ఆఫీసు బొల్లారం లోని దక్షిణ్ భవన్‌కు మారిందని అంటుండేవారు. అక్కడ కొంతమంది స్టేట్ కాంగ్రెస్ నాయకులతో పొద్దస్తమానం సమావేశాలు జరుపుతుండేవాడు మున్షీ. స్టేట్ కాంగ్రెస్ నాయకుల సంకుచిత ఆలోచనలకు ఆయన విచారధార ఉపయోగపడింది.

మున్షీ పొద్దంతా విజిటర్లతోనే గడిపేవాడు. వాళ్ళని బాగా ఆదరించే వాడు. పెట్రోలు దుబారా బాగా జరిగేది. దౌత్య గౌరవాన్ని మించి, రేషనింగుని దాటి పెట్రోలు వాడకం ఉండేది. వచ్చిన వాళ్ళే పదేపదే ఆయన దగ్గరకు వస్తుండేవాళ్ళు. ఇలా చాలా రోజులేసాగింది. ఒకసారి ప్రైవేటు ప్రయాణంలో ఆయన ఇక్కడి ప్రజలకు చేసినదాని కన్నా పొందిన గౌరవం తక్కువేనని వ్యాఖ్యానించాడు. అయితే ఆయన భ్రమ ఎక్కువకాలం కొనసాగలేదు. ఆయన దగ్గరి మంత్రులంతా మెల్లగా ఫలితంలేని ఆయన మాటలకు దూరం కాసాగారు. ఇక స్టేట్ కాంగ్రెస్ నాయకులు, పెద్దగా పనిలేని వాళ్ళే ఆయన దగ్గర మిగిలిపోయింది. ఢిల్లీలో హైద్రాబాద్ ఏజెంట్ జనరల్ నాతో మాట్లాడాడు. మున్షీ మాటల్ని ఢిల్లీలో ఖాతరు చేసే వాళ్ళెవరూ లేరని చెప్పాడు. మున్షీ ఒక నెగెటివ్ పాత్ర అని తేలిపోయింది. ఢిల్లీలో ఇంకొక పెద్ద అధికారి కూడా అలాగే చెప్పాడు. మున్షీ మాత్రం ఇలాంటి పరిస్థితిలో గుడ్డివాడిలాగే ప్రవర్తించాడు. మౌంట్‌బాటెన్, నెహ్రూ లిద్దరూ ఈయనను మార్చాలని చాలా సార్లు అనుకున్నారు. ఉన్నత స్థాయిలో ఈయన మార్పు ప్రతిపాదనలు వచ్చినా అవి వాయిదాపడుతూ వచ్చాయి. అలా ఇతరేతర కారణాలు వలన మున్షీ చివరిదాకా ఏజెంట్ జనరల్‌గా కొనసాగాడు.

మామూలుగానే మున్షీ వ్యక్తిగత లక్ష్యాలు నెరవేరే అవకాశం లేదు. ఇలా ఉండగా ఒక విచిత్రమైన సంఘటన జరిగింది. 1948 ఏప్రిల్ మాసారంభంలో మాంక్‌టన్ హైద్రాబాద్ తరపున మౌంట్‌బాటెన్‌తో ముఖ్యమైన విషయాలపై చర్చల్లో ఉన్నాడు. కనుచూపుమేరలో అవగాహన ఒప్పందం కనిపిస్తుంది. అది చూసి మున్షీ

కండ్లల్లో నిప్పులు పోసుకున్నాడు. అతని ప్రమేయం లేకుండా కుదరబోతున్న ఒప్పందం కదా అది! ఏదో ఒక కుయుక్తితో దాన్ని విఫలం చేయాలనుకున్నాడు. 1948 మార్చిలో లండన్ టైమ్స్ ప్రతినిధి ఒకరు హైద్రాబాద్‌ను సందర్శించాడు. ఖాసిం రజ్వీని కలసి కొంతమంది రజాకార్లతో మాట్లాడాలనుకున్నాడు. తన ఉద్యమానికి ప్రచారం కల్పించే వాళ్ళందరితో లాగానే ఆ ప్రతినిధితో ఒక ప్రైవేటు స్థలంలో ఓ రెండువందలమంది రజాకార్లతో, ఓ మధ్యాహ్నంపూట పెరేడు నిర్వహించాడు. అది మార్చి 31. పెరేడు పూర్తయ్యాక రజాకార్లు వెళ్ళిపోయారు. రజ్వీ ఆయన మిత్రులతో కలసి లండన్‌టైమ్స్ ప్రతినిధికి తేనేటివిందు ఇచ్చారు. ఆ తేనేటి విందులో పాల్గొన్నవారి సంఖ్య డజను కూడా దాటదు. ఏ పత్రికల వాళ్ళకూ, ఏ న్యూస్ ఏజెన్సీకి కూడా ఈ సంగతి తెలియదు. ఏప్రిల్ 7వ తేదీన మాంక్‌టన్ మౌంట్‌బాటెన్‌తో చర్చలకు సిద్ధమవుతుండగా హిందుస్తాన్ టైమ్స్‌లో పతాక శీర్షికతో రజాకార్ల వార్త వచ్చింది. 'హైదరాబాద్ ఆయుధ వారోత్సవం' శీర్షికతో వచ్చిన కథనంలో 31 మార్చి రోజున రజాకార్ల పెరేడ్ నిర్వహిస్తూ ఖాసీంరజ్వీ తీవ్రమైన ప్రసంగం చేసినట్లు ఆ వార్తా కథనం ప్రచురితమైంది. హిందువులకూ, హిందూత్వానికి వ్యతిరేకంగా ఖాసీంరజ్వీ మాట్లాడినట్లు నిస్సిగ్గుగా ఆపాదించారు ఆ కథనంలో. లండన్ టైమ్స్ ప్రతినిధిని ఈ కథనం చకితున్ని చేసి ఉంటుంది. ఎందుకంటే వారానికి పైగా ఆయన హైద్రాబాద్‌లో ఉండి ఖాసీంరజ్వీతో గడిపాడు. ఎలాంటి ర్యాలీలు కానీ, ఖాసీంరజ్వీ ఉద్రేకపూరిత ప్రసంగాలు కానీ ఆయనకు ఎదురుకాలేదు. ఆయుధ వారోత్సవం అనేమాటే ఎవరూ వినలేదు. ఇంకే పత్రికకు కాని ఏ వార్తా సంస్థకు కాని అలాంటి సమాచారమే లేదు. ఆ పక్షంలో ఖాసిం రజ్వీ ఉపన్యాసం కానీ, ఆయుధ వారోత్సవం ఊసు కానీ లేదు. ఎన్నడూ లేని విధంగా ఆ కథనం ఢిల్లీలో సంచలనం సృష్టించింది. సహజంగా చాలా మందిలో ఆవేశం రగిల్చింది. మౌంట్‌బాటన్ అగ్రహోదగ్రుడయ్యాడు. మాంక్‌టన్ చాలా ఇబ్బందిపడ్డాడు. ఆ కథనం చదివి చాలా దిగాలుపడ్డాడు. మారిన వాతావరణంలో ఢిల్లీలో ఏమీ చేయలేక హైద్రాబాద్ పయనమయ్యాడు.

ఏర్‌పోర్టునుండి నేరుగా నా దగ్గరికి వచ్చి హిందుస్తాన్ టైమ్స్ పత్రిక నా చేతికి ఇచ్చి ఆ కథనం చదవమన్నాడు. ఆ వార్తాకథనం ఎత్తుగడ చూసి దానికి మూలమేమిటో గుర్తుపట్టాను. గతంలో ఎప్పుడూ లేని విధంగా ఇంటలిజెన్స్ డిపార్టుమెంటు ద్వారా నేను పూర్తి విచారణ చేయించాను. అన్ని పత్రికల ద్వారా పాత్రికేయుల ద్వారా ఆరా తీసాను. రజాకార్ల ర్యాలీ, రజ్వీ ఉపన్యాసం ఎవరికీ తెలియదు. మాంక్‌టన్ కూడా

తన పద్ధతుల్లో దాన్ని నిర్ధారించుకొని ఇది తన ప్రయత్నాలను దెబ్బదీసే పరోక్ష కుట్రగా నిర్ధారించుకున్నాడు. మౌంట్‌బాటన్, మాంక్‌టన్‌ల చర్చల్ని దెబ్బతీసే ఉద్దే శ్యంతో తయారుచేసిన పచ్చి అబద్ధపు కథనమని నేను నెహ్రూకు నమ్మకంగా విన్నవించాను. నెహ్రూ, పటేల్‌లు దీన్ని నమ్మడానికి కొంత సమయం పట్టి ఉండవచ్చు. మౌంట్‌బాటెన్ ఇదంతా  తమ చర్చల్ని చెడగొట్టే కట్టుకథ అని నమ్మడానికి ముందు లండన్‌టైమ్స్ ప్రతినిధితో ఆరా తీసాడు. కొద్ది రోజుల తర్వాత నెహ్రూ నుండి నాకొక ఉత్తరం వచ్చింది. అందులో నెహ్రూ హిందుస్తాన్‌టైమ్స్ కథనం తప్పని ఒప్పుకుంటూనే, రజ్వీ మాత్రం వేరే సందర్భాలలో రెచ్చగొట్టే ప్రసంగాలు చేసాడని పేర్కొన్నాడు. అలా ఆ విషయం ముగిసి పోయినప్పటికీ హైద్రాబాద్ ఢిల్లీ మధ్య చర్చల అవకాశాలు మాత్రం మసకబారాయి. ఈ కుట్ర దక్షిణ్‌సదన్‌లో మొదలై విజయవంతం కూడా అయింది. ఈ వ్యవహారం తర్వాత చాలారోజుల పాటు మున్షీ ముఖంలో విజయ దరహాసం కనిపించింది.

ఏజెంట్ జనరల్ కార్యాలయం కల్పిత కథలతో, చిన్న విషయాలను చిలువలు పలువలు చేసి ఢిల్లీకి చేరవేసేది. ఆబగా ఎదురుచూస్తున్న ఢిల్లీకి కూడా ఇవే రుచించేవి. దౌత్యఒప్పందం ఎలాగూ తన చేతకావట్లేదు కాబట్టి ఇంకెవరివల్లా అది కాగూడదని మున్షీ ఖచ్చితమైన నిర్ధారణకు వచ్చాడు. ఢిల్లీ పాలకులు కూడా ఏమి జరిగినా మున్షీ ఆధ్వర్యంలో జరగగూడదన్న నిర్ధారణకు వచ్చారు. ఇవన్నీ తెలిసి కూడా ఢిల్లీపెద్దలు మున్షీ వారసుడి ఎంపికలో ఏకాభిప్రాయానికి రాలేక పోయారు. వాళ్ళకి దేశం కన్నా వ్యక్తిగత ఇష్టాయిష్టాల పట్ల శ్రద్ధ ఎక్కువ. తన పదవికి ఎసరు పెట్టేవాళ్ళను గుర్తించి వాళ్ళ బలహీనతలతో ఆటలాడేవాడు. ఆయన అన్నంత పనీ చేయగలడని ఢిల్లీ పెద్దలకు తెలుసు. అలా ఎవరికీ ఇష్టం లేకపోయినా పరిస్థితుల ప్రభావంతో ఆయన పదవిలో కొనసాగాడు. ఇక అప్పటినుండి ఢిల్లీ–హైద్రాబాద్‌ల మధ్య సైనిక చర్య జరగవలసిందేనని, అది ఎంత తొందరగా జరిగితే అంత మేలని ప్రచారం ఎత్తుకున్నాడు. ఒక్క మౌంట్‌బాటన్‌ను తప్ప ఢిల్లీ పెద్దలందర్నీ తన వాదనతో ఒప్పించాడు. బొంబాయి, సెంట్రల్ ప్రావిన్సు, మద్రాసు ప్రావిన్సు మంత్రులను కూడా కొంత వరకు ఒప్పించ గలిగాడు. ఆయన ఒకే ఒక్క వైఫల్యం ఏమిటంటే హైద్రాబాద్ స్టేట్ కాంగ్రెస్‌ను ఒప్పించలేకపోవడం, ఆయన విలాసవంతమైన పోకడతో గతంలో కొంతమందిని ఆకట్టుకోగలిగాడు, కానీ ఆయన మాటలు పూర్తి వాస్తవాలు కావని చాలామంది తొందరలోనే గ్రహించారు. ఆయన అనుచరులు బాగా పలచబడ్డారు. ఒక సాధారణ


హైద్రాబాద్ హిందువుకు ఆయన అర్థం కాలేదు.

ఒకనాటి వేసవి కాలపు సాయంత్రం భోజనాలయ్యాక నేనూ, మున్షీ షామంజిల్ మేడపై కూర్చొని చుట్టూరా కనిపించే విశాలమైన లాన్‌లను చూస్తూ మాట్లాడు కుంటున్నాము. ముఖ్యమైన విషయాలు మాట్లాడడం పూర్తయింది. సాధారణమైన విషయాలు మాట్లాడుతున్నాం. అప్పుడు కూడా వాదనలాగానే మాట్లాడాడు. నేను అలసిపోయాను. వాదించే మూడ్‌లో లేను. మిమ్మల్ని పోర్టికో మీద నుండి కిందికి తోయాలనిపిస్తుంది అని నవ్వుతూ అన్నాను.

మున్షీ కింది పేవ్‌మెంట్ మీదకి చూసి నేను నిజంగానే తోస్తాననుకున్నాడు. ఆయన ముఖంలో రంగులు మారాయి. తిట్లు లంకించుకున్నాడు. తను బలహీనుడినని, బ్రాహ్మణుడిని చంపడం మహాపాతకమని తత్తరపడుతూ అన్నాడు.

నేను ఆశ్చర్యపోయాను, సిగ్గుపడ్డాను. నా నుండి ఇంకే హాస్యోక్తి కానీ, అనునయం కానీ ఆయనను సాధారణ స్థితికి తేలేదని అర్థమయింది. కొద్ది క్షణాలు తల నేలకు వేసి పేవ్‌మెంటును చూడసాగాడు. కొన్ని క్షణాలకు తమాయించుకొని లో గొంతుకతో నా దగ్గర సెలవు తీసుకొని వెళ్ళిపోయాడు. ఆయన వెంట వెళ్ళి కారు ఎక్కించాను. పక్క రూం నుండి ఆయన మిలటరీ సెక్రెటరీ వచ్చాడు. ఆ బలిష్టమైన ఆకారమున్న సెక్రెటరీ వచ్చాకే మున్షీ ముఖంలో ధైర్యం వచ్చింది. అప్పుడు మాత్రమే నాతో కరచాలనం చేసి మళ్ళీ కలుస్తానని అన్నాడు.

# 14. గాంధీజీ హత్య



ఢిల్లీలో ఎముకలు కొరికే చలి, 1948 జనవరి 29వ తేదీ దట్టమైన పొగమంచు ఆవరించి ఉంది. ఆల్బూకర్క్ రోడ్డు నుండి చూస్తే జిగేల్ మనాల్సిన బిర్లా ఇంటి లైట్లు పాలిపోయి కళావిహీనంగా ఉన్నాయి. అనుకున్న సమయానికన్నా కొంత ముందుగానే నేను అక్కడికి చేరుకున్నాను. వెంటనే నన్ను విశాలమైన హాలులోకి తీసుకెళ్ళారు. అక్కడ ఒక మూలకు పరిచిన పరుపు మీద మహాత్ముడిగా ప్రసిద్ధి పొందిన గొప్పముని, మోహన్‌దాస్ కరమ్‌చంద్ కాళ్లు ముడుచుకుని కూర్చొని ఉన్నారు. ఆయన చుట్టూ పిల్లలు, పెద్దలు, స్త్రీలు, పురుషులు చాలా మంది గుంపుగా ఉన్నారు. పరస్పర అభివాదాలయ్యాక మహాత్ముడు నన్ను దగ్గరగా జరిగి కూర్చోమన్నారు. అందర్నీ వెళ్ళిపొమ్మన్నట్లు సైగ చేశాడు. అందరూ పక్క గదుల్లోకి వెళ్ళిపోయారు. అందరూ వెళ్ళిపోయాక ఒక నడివయసు మహిళ మా ఇద్దరి మధ్య మిగిలిపోయింది. కేంద్రమంత్రి రాజ్‌కుమారి అమృత్‌కౌర్‌గా ఆమెను మహాత్ముడు నాకు పరిచయం చేశారు. కొంతసేపు మామూలుగా మాట్లాడుకున్నాక రాజ్‌కుమారిని వెళ్ళమంటావా?' అని గాంధీజీ నన్నడిగారు. నాకేమీ అభ్యంతరం లేదని చెప్పాను. మా సంభాషణను ఆమె ఆసాంతం విన్నది. కానీ ఆమె ఎక్కడా కలుగజేసుకోలేదు.

హైద్రాబాద్ సమస్య మీద మహాత్ముడు చాలా ఆతృత కనబరిచారు. తొందరలో ఉభయతారకంగా అది పరిష్కారం కావాలని ఆశించారు. ఆయన నా వాదన పట్ల శ్రద్ధ కనబరిచారు. ఎందుకంటే ఇంకోవైపు వాదన ఆయనకు తెలుసు. హైద్రాబాద్ అభిప్రాయాన్ని, నిజాం అభిప్రాయాన్ని చెప్పాను. సంతోషకరమైన అవగహన తొందరలో కుదరాలన్న నా ఆతృతను ఆయనకు తెలియజెప్పాను. ఆయన అభిప్రాయంలో భాతర్‌దేశంలో గత ఆగస్టు 15నే ప్రజాస్వామ్యం ఏర్పడగా, హైద్రాబాద్ ఇంకా పాతకాలపు పరిపాలనలో ఉండడమే అసలు సమస్య. హైద్రాబాద్ ప్రజాస్వామ్యం దిశగా ముందడుగు వేయలేకపోవడానికి ప్రధాన కారణం ఇండో హైద్రాబాద్ సమస్య పరిష్కారం కాకపోవడమేనని నేను చెప్పాను. యథాతథ ఒప్పందం మీద సంతకాలు అయ్యాక కూడా ఇండియా, హైద్రాబాద్ మధ్య అగాధం అంతరించడం లేదని అన్నాను. చిత్తశుద్ధి, నిజాయితీతో కూడిన అవగాహన తొందరగా కుదరవలసిందన్నారు గాంధీజీ. హైదరాబాద్ రెండువందల మిలియన్ రూపాయలు పాకిస్తాన్‌కు అప్పు ఇవ్వడం దురదృష్టకరంగా గాంధీజీ అభిప్రాయపడ్డారు. కాశ్మీర్ విషయంలో ఇండియా పాకిస్తాన్‌ల వాదనను చర్చకు తెచ్చాడు. ఈ సందర్భం వల్ల యథాలాపంగా పోవాల్సిన విషయాన్ని ఇండియా సీరియస్‌గా తీసుకోవలసి వచ్చిందన్నాడు. అది నిజమేనన్నాను నేను. కాశ్మీర్ విషయమై పాకిస్తాన్‌పై ఇండియా ఐక్యరాజ్యసమితిలో ఆరోపణలు చేసినప్పుడు ఈ విషయం బయటికి వచ్చింది. తర్వాత చాలాసేపు హైద్రాబాద్ అంతర్గత వ్యవహారాల గురించి మాట్లాడాడు. నిజాం నిజంగా అధికార పంపిణీకి సిద్ధంగా ఉన్నాడా అని స్పష్టంగా ప్రశ్నించాడు. హైద్రాబాద్ పరిస్థితులు మార్పును ఆహ్వానిస్తే కచ్చితంగా అధికార పంపిణీ జరుగుతుందని, అదే సందర్భంలో ఏడు శతాబ్దాలకు పైబడ్డ ముస్లిం పాలన ఒక్కసారిగా హిందూ భారతదేశంతో సమానంగా మారడానికి అక్కడి సాంస్కృతిక, స్థానిక పరిస్థితులు సమయం కోరతాయని గాంధీజీకి చెప్పాను. మారుతున్న పరిస్థితుల్లో హైద్రాబాద్ ముస్లింలు సాంస్కృతిక కేంద్రంగా కూడా చాలా మారవలసి ఉందన్నాడు. కొంతసేపు నలభై మిలియన్ల భారతీయ ముస్లింలు వారి సహజత్వాన్ని కాపాడుకోవాలన్నాడు. భారతీయ ముస్లింలకి, ఇండియా తమ స్వంత దేశమనే భావన కలిగే విధంగా మెజారిటీ హిందువులు ప్రవర్తించాలన్నాడు. తన వాదనతో వ్యతిరేకించే వాళ్ళున్నారని తనకు తెలుసునని, వాళ్ళది హ్రస్వదృష్టి అని అన్నాడు. ఇండియన్ ప్రావిన్సుల నుండి హైద్రాబాద్ రాష్ట్రానికి కొనసాగుతున్న ముస్లిం వలసలను ప్రస్తావించాను. దీనికి గాంధీజీ అలజడి సమయాల్లో ఇవి

మామూలేనని చెబుతూ నిజంగా అంతటి వలసల్ని హైద్రాబాద్ జీర్ణించుకోగలదా అన్నాడు. కొద్దిసేపు ఆగి అలాంటి వలసల వల్ల హిందువులలో అభద్రతాభావం ఏర్పడి ఇండియాకు హిందూ వలసలు ఆరంభం కావచ్చుని, అది మంచి పరిణామం కాదని, అలాంటి పరిస్థితులు తలెత్తకుండా చూడవలసిందిగా నన్ను కోరాడు. అలాంటి పరిస్థితే ఉత్పన్నం కాదని, హిందువులు బయటకు పోవాలనే వాదనలో నిజాం చివరి వ్యక్తి అవుతాడని చెప్పాను.

తర్వాత విభజన సందర్భంగా కొనసాగిన, సాగుతున్న ముస్లింల ఊచకోత మీదకి మా సంభాషణ మళ్ళింది. ముస్లింలు అక్కడ కొందరు, ఇక్కడ కొందరు పల్చపల్చగా ఉన్నారని, అందువల వారి భద్రతకు ముప్పు అని, వారికి ఎక్కడికక్కడ కొన్ని ప్యాకెట్లకు తరలించాలని నేను ప్రతిపాదించాను. హైద్రాబాద్‌లో ముస్లింల సంఖ్య పెరిగితే భద్రతగా భావిస్తారని కూడా చెప్పాను. అదే సందర్భంలో ముస్లింల ఆర్థిక స్థితి కూడా మెరుగవుతుందన్నాను. గాంధీజీ ఇది లోతుగా ఆలోచించాల్సిన విషయమని, దీనిమీద మరోసారి మాట్లాడదామని అన్నారు.

తర్వాత చాలా సేపు హైద్రాబాద్ పాకిస్తాన్‌లో కలవడానికి వీలుకాని అంశాలపై మాట్లాడారు. భౌగోళికత, జనాభా, ఆర్థిక స్థితిగతులు కూడా అందుకు అనుకూలించవని – అందువల్ల నేనూ, నిజాం కూడా ఆలోచనకు స్వస్తి చెప్పామని చెప్పాను. గాంధీజీ ఈ విషయం పట్ల ఇంతసేపు మాట్లాడినందుకు ఆశ్చర్యపోయాను. ఇతర భారత నాయకుల్లో ఈ భయం ఉంచవచ్చు కానీ ఇంత బహిరంగంగా ఎప్పుడూ బయట పడలేదు. హైద్రాబాద్ పాకిస్తాన్‌లో కలవాలనుకోవడం లేదని చెప్పాను. అలా కలవాలనుకుంటే ఆగస్టు 15 నాడే కలిసి ఉండేది కానీ ఇండియాలో ఇంత స్నేహ ఒడంబడిక కుదుర్చుకొనేది కాదు.

పాకిస్తాన్‌లో కలవడం జరగదని గాంధీజీకి స్పష్టంగానే చెప్పాను. ఆయన నమ్మాడో లేదో కానీ నమ్మినట్లు అగుపించారు. ఏదో పద్ధతిలో ఇండియాతో కలవడం వల్ల మాత్రమే ఇండో హైద్రాబాద్ సంబంధాలు సురక్షితంగా ఉంటాయని సూత్రీకరణ మొదలుపెట్టారు. హైద్రాబాద్ అందుకోసం శ్రద్ధ తీసుకోవాలన్నట్లు మాటాడారు. ఇండియా అందుకోసం ప్రయత్నించడం తెలివిగల పని కాదని ఆయన భావన. శాంతిని కాపాడడం అన్నింటికంటే ముఖ్యమని, అందుకోసం వ్యక్తిగతంగా నన్ను హామీ ఇవ్వమంటారు. నేను శాంతికి కట్టుబడతానని, ఇండియా ఆయుధం వాడకుండా

హైద్రాబాద్ వాడదని చాలా స్పష్టంగా చెప్పాను. అదే సందర్భంలో హైద్రాబాద్ పూర్తి స్వేచ్ఛా రాజ్యంగా మారుతుందని నేను అనుకోవట్లేదని కూడా చెప్పాను. భౌగోళికంగా, ఇతర విషయాల్లో హైద్రాబాద్ పరిమితులు నాకు తెలుసు. అందువల్లనే పరిమిత ప్రజాస్వామ్యం కొనసాగాలన్న ఆతృత నాది. భారతదేశం చేస్తున్న డిమాండు ప్రకారం హైద్రాబాద్ మీద ఎలాంటి ఆక్రమణనూ నేను ఒప్పుకోను. మైనారిటీల సంఖ్యను పెంచడం ద్వారానే హైద్రాబాద్‌లో ఆయన కోరుకున్న స్థిరత్వం సాధ్యపడు తుందని చెప్పాను. హైద్రాబాద్ ముస్లింలు ప్రస్తుతం అభద్రతలో ఉన్నారని, జనాభాను పెంచుకోవడం ద్వారా మాత్రమే స్థిరమైన ప్రజాస్వామ్య పురోగతి సాధ్యమనే అభిప్రాయంలో ఉన్నారని చెప్పాను. ఇండియా నుండి హైద్రాబాద్‌కు ముస్లింల వలసలను ప్రోత్సహించడం ద్వారానే ఇది సాధ్యపడుతుందని చెప్పాను. ఈ చర్య ద్వారా హైద్రాబాద్‌లో, దక్షిణాదిన సమస్య పరిష్కారానికి ఉపకరిస్తుందని చెప్పాను. ఇది పూర్తిగా హైద్రాబాద్ రాష్ట్రం భవిష్యత్తు కోసం చెబుతున్న మాట అని, ఇండియాతో స్నేహం కోసం చెబుతున్న మాట అని, ఇందువల్ల ఇండియా దుష్ప్రచారాలకు అవకాశం లేకుండా పోతుందని మరొకసారి గాంధీజీకి చెప్పాను. నేను చెప్పింది ఆసక్తిగా విన్న గాంధీజీ స్థిరమైన పరిష్కారానికి ఏ అవకాశం దొరికినా తాను వదిలిపెట్టబోదనని చెప్పారు. నేను చెప్పినవన్నీ శ్రద్ధగా పరిశీలిస్తానని, రాబోయే ఒకటీ, రెండు రోజుల్లో మళ్ళీ మాట్లాడదామని చెప్పారు. గాంధీజీ ప్రోత్సహించే పద్ధతికి సహకరించే ధోరణికి ధన్యవాదాలు  చెప్పాను.

గాంధీజీ మాట్లాడుతూ మాట్లాడుతూ టాపిక్ మార్చారు. సర్దార్ పటేల్ ముస్లిం వ్యతిరేకి అనుకోవడం దురదృష్టకరం అన్నారు. ఆయనకు గాంధీతో వేరే అభిప్రాయాలున్నా పటేల్‌ను ముస్లిం వ్యతిరేకిగా ఎప్పుడూ చూడలేదన్నారు. అది నమ్మమన్నారు. తదనుగుణంగా ముందుకు పొమ్మన్నారు. నాకు పటేల్ గురించి తెలియదని, కాబట్టి తెలియని దాని గురించి ఏమీ చెప్పలేనని అన్నాను.

సంభాషణ ముగింపులో మళ్ళీ రెండు రోజులకు కలవాలనుకున్నాం. మరో ఇరవైనాలుగు గంటల్లో ఏదో జరిగి మా సమావేశం జరగకుండా పోతుందని మా ఇద్దరికీ  అనిపించింది.

నేనూ, నా సహచరులు గాంధీతో జరిగిన చర్చలకు చాలా ప్రాధాన్యతనిచ్చాం. జరిగిన చర్చంతా వారికి చెప్పాను. గాంధీజీ కలుగజేసుకుని న్యాయం చేస్తాడని

మాకు నమ్మకం కలిగింది. మరుసటి రోజు గాంధీతో తర్వాత సమావేశానికి నోట్సు తయారు చేసుకున్నాను. మా సమావేశం పట్ల భారత నాయకుల వైఖరి ఏమిటో నాకు తెలియదు. మా సమావేశాన్ని భారతీయ పత్రికలు ప్రముఖంగానే ప్రచురించాయి కానీ ఎలాంటి వ్యాఖ్యలూ చేయలేదు.

మరుసటి రోజు సాయంకాలం ఆరు గంటల తర్వాత నిజాం గెస్ట్‌హౌస్ లాన్‌లో తిరుగుతూ ఆలోచనల్లో మునిగిపోయాను. బిల్డింగులోపల నుండి మా ఉద్యోగి ఒకరు ఆందోళనగా నా వైపు వచ్చాడు. ఆతృత, ఆందోళన నిండిన స్వరంతో మహాత్మాగాంధీ కొద్ది నిమిషాల క్రితమే తుపాకీ గుళ్ళకు బలైనట్లు రేడియోలో చెప్పారని చెప్పాడు. నేను దిగ్భ్రాంతికి గురై రేడియో దగ్గరికి పరుగెత్తాను. ఔను! ఆలిండియా రేడియో గాంధీజీ హత్యావార్తను పదేపదే ప్రకటిస్తుంది. అనుమానం లేదు. మహాత్ముడు హత్యకు గురయ్యాడు. భారతదేశ స్వాతంత్ర్యం కోసం జీవిత సర్వస్వాన్ని త్యాగం చేసి, భారతీయుల హక్కుల కోసం శిలా సదృశ సంకల్పంతో పోరాడిన మహాత్ముడు చనిపోయాడు. మేమంతా రేడియో చుట్టూ మూగాం. హత్య చేసింది ఒక భారతీయ యువకుడు. అతని మతం ప్రకటించబడలేదు. ముస్లిం అయి ఉండడని మేమనుకున్నాం. ఒకవేళ హంతకుడు ముస్లిమే అయితే రేపటికల్లా ఢిల్లీలో ఒక్క ముస్లిం కూడా ప్రాణాలతో మిగలడని మాలో ఒకరు వ్యాఖ్యానించారు. హైద్రాబాద్ ఏజెంట్ జనరల్ నిజాం గెస్ట్‌హౌస్‌లకు రక్షణ ఏర్పాటు చేశాడు. మా ఉద్యోగుల్లో కొందరు హిందువులు అసలు విషయం తెలుసుకోవడానిక బయటకి వెళ్ళారు. మేమంతా రేడియో మాత్రమే వింటున్నాం. రేడియోలో కొద్ది కొద్ది విరామంతో మహాత్ముడు హత్య గావింపబడ్డాడు. మహాత్ముడు హత్యగావింపబడ్డాడు అనే ప్రకటన పదేపదే వస్తుంది.

ప్రధాని నెహ్రూ, ఉపప్రధాని పటేల్ రేడియోలో ప్రసంగిస్తారని చెప్పారు. నెహ్రూ విచారంగా వణికే గొంతుతో మాట్లాడారు. మహాత్ముడిని ఎలా కాల్చారు? దేశానికి ఎంత నష్టం జరిగిందీ చెప్పారు. కానీ ఎవరు చంపారో చెప్పలేదు. మరో ఇరవై నిమిషాల తర్వాత పటేల్ మాట్లాడాడు. హంతకుడు హిందూ అని చెప్పాడు. ఆ ప్రకటన దు:ఖాన్ని తగ్గించలేదు కానీ భీతిని తొలగించింది. దేవుడా! ఢిల్లీకి మరో రక్త స్నానం తప్పింది.

పోలీసు ఆంక్షల వల ఆ రోజు ఎవరూ బిర్లాహౌస్‌కి పోలేకపోయాం. మహాత్ముడి పార్థివ దేహానికి శ్రద్ధాంజలి ఘటించాం. మధ్యాహ్నం అంతిమయాత్ర ప్రారంభ మయింది. యాత్ర ముందుకు సాగిన కొద్దీ తండోపతండాలుగా ప్రజలు యమునాతీరం

వెంట శోకసముద్రంతో సాగిపోయారు. అంతిమయాత్రను చూసి నేను దు:ఖంలో మునిగిపోయాను.

అవును! మహాత్ముడు వెళ్ళిపోయాడు. హైద్రాబాద్ సమస్యకు గౌరవనీయమైన పరిష్కారం చాలా దూరమైనట్లు అనిపించింది. తర్వాత జరిగిన సంఘటనలు నా భయాన్ని నిజం చేశాయి. గొప్ప మాటలు చెప్పేవాళ్ళు చాలామందే ఉన్నారు. ఆచరించే వాళ్ళే చాలా తక్కువ. గాంధీజీ ఆలోచనా ధోరణి అందరికీ తెలుసు. కానీ కొత్తగా అందివచ్చిన అధికారంతో అవి ఆచరణలో పెట్టడం కుదరలేదు. ఆచరణలో అన్ని ఆదర్శాలను పక్కకు పెట్టారని నాకు తెలుసు.

మహాత్ముడి మరణానికి ముందు నుండే ఆయన శిష్యులు కొందరు దారి తప్పుతున్న సంకేతాలు ఉన్నాయి. ఆయన ఇతర అనుచరలు తమ పూర్వాశ్రమాలకు చేరుకున్నారు. తాను అత్యున్నత స్థాయిలో ఉన్నప్పుడే పోవడం మహాత్ముడి కీర్తికి ఒక రకంగా మంచిదే. ఆయన స్థాయిని తగ్గించే సంఘటనలు ముందుకు వచ్చే పరిస్థితి వస్తే ఆయన అశాంతి రోజులు చవిచూడాల్సి వచ్చి ఉండేదేమో!



# 15. భారతదేశం - హైద్రాబాద్ సమస్యలు

విభజన నిర్ణయం జరిగే వరకు భారతదేశం రెండుగా చీలుతుందని హైద్రాబాద్ అనుకోలేదు. విభజన జరిగాక ఆయ దేశాలలోని పెద్ద సంఖ్యలో ఉండే హిందూ లేదా ముస్లిం మైనారిటీల రక్షణ బాధ్యత ఆయా దేశాలు తీసుకుంటాయని భావించడం జరిగింది. కాబట్టి హైద్రాబాద్ వేచి చూసే ధోరణిని అవలంబించింది. హైద్రాబాద్ ప్రజలలో స్వతంత్ర దేశంగా ఉండాలని సహజ అభిలాష ఉంది. అదే సందర్భంలో హైద్రాబాద్ శక్తి సామర్థ్యాలు బ్రిటీష్ ఇండియా పాలకుల వలన తగ్గించబడ్డాయనే ఎరుక కూడా ఉంది. అందువల్ల భారతదేశంతో ఏదో ఒక రకమైన ఒప్పందం తప్పని సరి అని కూడా తెలుసు. రాష్ట్రంలోని హిందువులు, ముస్లింలు ఇదే అవగాహనతో ఉన్నారు. అయితే దేశ విభజన అనంతరపు అల్లర్లు ఇక్కడి హిందూ ముస్లింల మధ్య ఉన్న రేఖా మాత్రపు వైరుధ్యాన్ని బలిష్టం చేశాయి. కొత్తగా ఏర్పడ్డ రెండు దేశాలలోనూ మైనారిటీలు ఎదుర్కొన్న అగచాట్లను చూశాక అప్పటి వరకు ఉపరితలపు మాటలుగా ఉన్న హిందూ ముస్లింల వైరుధ్యం చాలా ఆవేశపూరితం కాజొచ్చింది. అంతకు ముందు ఇక్కడి ముస్లింలు సంఖ్యాపరంగా మైనారిటీలమనే భావంలో ఎప్పుడూ

ఉండేవారు కాదు. ఇంకా చెప్పాలంటే పాలకుల మతస్తులైనందుకు కొంత వెసులు బాటుగా కూడా భావించేవారు. అలాంటి పరిస్థితుల్లో హైద్రాబాద్‌ను భారతదేశం ఆక్రమించినట్లయితే, భారతదేశంలో తాము ద్వితీయశ్రేణి పౌరులమౌతామనే భావన వారిలో నెలకొంది. రాజకీయాధికారానికి దూరమౌతామనే భావనతో పాటు తమ ఆర్థిక భవిష్యత్తు మీద సహజమైన ఆందోళన మొదలయ్యింది. పట్టణ ప్రాంతంలో ముస్లింలలో ఎక్కువమంది ప్రభుత్వోద్యోగులుగా ఉండేవారు. ఒకవేళ ఆ ఉద్యోగాలు పోతే సమీప భవిష్యత్తులో వారికి ఏ ప్రత్యామ్నాయమూ కనిపించలేదు. అవిభక్త భారతదేశంలో గతంలో పనిచేసిన ప్రోవెన్షియల్ అటానమీలో హిందువులతో కలిసి పని చేసినప్పుడు ముస్లింలు పక్షపాతంలో చూడబడ్డారు. అందుకే భారతదేశంలో కలవడం వల్ల ముస్లింల ఆందోళనకు బహుముఖీన కారణాలున్నాయి. హైద్రాబాద్ పాకిస్తాన్‌లో కలిసే సమస్యే లేదు. రాజ్యాంగబద్ధంగా పాలకుడికి అధికారాన్ని కట్టబెట్టే వరకు హైద్రాబాద్‌ను పాకిస్తాన్‌లో కలిపే ప్రశ్నే ఉత్పన్నం కాదు. అల్పసంఖ్యాకులైన ముస్లీంలు పెద్ద సంఖ్యలో ఉన్న హిందువులు భారతదేశంతో కలిసి ఉంటూ, సాధ్యమైనంత వరకు స్వతంత్ర రాష్ట్రంగా మనుగడ సాగించాలని కోరుకున్నారు. నిజాంది కూడా అదే ఆలోచన. అయితే రాష్ట్రం నలువైపులా భారతదేశం విస్తరించి ఉండడం వల్ల వాస్తవిక దృష్టితో తన సార్వభౌమాధికారంలో కొంత భాగాన్ని వదులుకోవడానికి సిద్ధపడ్డాడు. వాస్తవిక దృష్టి కలిగిన వ్యక్తిగా నిజాం విలీనం కాకుండా ఇతర న్యాయబద్ధమైన అన్ని ఒప్పందాలకు సిద్ధమయ్యాడు. అందరిదీ ఒకే అభిప్రాయం. నిజాంది, హిందువులదీ, ముస్లింలదీ ఒకసారి విలీనమైతే ఎల్లకాలం ఇండియా దయాదాక్షిణ్యాల మీద బతకాల్సి వస్తుందని.

చారిత్రాత్మకంగా అటు హిందూ రాజుల పాలనలోనైనా, ఇటు ముస్లిం రాజుల పాలనలోనైనా హైద్రాబాద్ ఒక స్వతంత్ర దేశంగానే ఉండింది కొద్ది కాలాలు తప్ప. అశోకుడి కాలంలో, కొన్ని శతాబ్దాల తరువాత మొఘలులకాలంలో, చివరగా నూరేళ్ళ పాటు బ్రిటీష్ పాలనలో తప్ప రాష్ట్రంలోని హిందువులు స్వేచ్ఛాప్రియులు. శతాబ్దాలుగా నిజాములను ఇక్కడి హిందూ ప్రజలు పరాయి మతస్తులుగా చూడలేదు. హైద్రాబాద్ సరిహద్దు ప్రాంతాలు తప్ప మిగిలిన భారతదేశంలోని హిందువులకు, ముస్లింలతో నిజానికి స్నేహ సంబంధాలు తక్కువ. హైద్రాబాద్ విషయంలో నిజాం ఉదారంగా వ్యవహరించేవాడు. ఇక్కడి హిందువులు భారతదేశంతో ప్రధానమైన సంబంధాలను కలిగి ఉంటారని ఆయనకు తెలుసు. ఎప్పుడూలేని విధంగా హిందువులలోని పెద్ద

కుటుంబాల వాళ్ళు విద్యావంతులు, ఉన్నత ప్రభుత్వోద్యోగాలలో ముస్లింల ఆధిపత్యం తగ్గించి తమకు భాగస్వామ్యం కల్పించాలని న్యాయమైన కోరికను వ్యక్తం చేయసాగారు. స్టేట్ కాంగ్రెస్, ఇతర హిందూ సంస్థల మద్దతు దీనికి లభించింది. అయితే హిందూ అధికారులు ఉన్న చోట ప్రవర్తన ప్రజానుగుణంగా లేకపోయేది. అందువల్ల ఈ డిమాండ్‌కు ప్రజలలో పెద్దగా ఆమోదం లభించలేదు. ఈ ధోరణి వల్ల హిందూ రాజకీయ సంస్థల కార్యక్రమాలు, ఉద్యమాలు పెద్దగా విజయవంతం కాలేకపోయాయి.

అందువల్ల అసంతృప్తితో భారతదేశపు రాజకీయ నాయకుల వైపు చూసేవారు. ఇక్కడి హిందూ సంస్థల నాయకులు ఎంత సేపటికి వాళ్ళ దృష్టి కార్యక్రమాలని విస్తృత పరచడం మరియు పరపతిని పెంచుకోవడం మీదే ఉండేది. అప్పుడప్పుడు బ్రిటీష్ ఇండియా నాయకుల పిలుపు మేరకు కొన్ని కార్యక్రమాలు ఇక్కడి స్థానిక నాయకులు చేపట్టేవారు. కాని ఇక్కడి పరిస్థితులలో వ్యత్యాసం వల్ల పెద్దగా స్పందన లభించేది కాదు. పెద్ద మొత్తంలో ఆర్థిక వనరులు, శిక్షణ పొందిన వాలంటీర్లు బ్రిటీష్ ఇండియా నుండి వచ్చి కూడా ఇక్కడ ఏమీ చేయలేకపోయేవారు. అక్కడి నాయకుల ఉదారమైన సహాయం వల్ల వచ్చిన కార్యక్రమాలకు ఇక్కడ పెద్దగా స్పందన లభించకపోయినా అక్కడి సంస్థల బార్డర్ పాలసీగా అవి కొనసాగుతూనే ఉండేవి. వాళ్ళ దృష్టిలో హిందూ ప్రజలను ఒక ముస్లిం రాజు పాలించడం సహించరానిదిగా ఉండేది. ఇక్కడి ఆర్థిక పరిస్థితి బాగుండడానికి ఇక్కడి ప్రకృతి, సాంప్రదాయాలు చాలా ఉపయోగపడ్డాయని, అవి భారతదేశంలోని చాలా భాగాలలో కొరవడ్డాయని వారికి తెలుసు. అలాంటి రాష్ట్రాన్ని ఒక ముస్లిం రాజు చేతిలో ఉంచడం నష్టదాయకమని వారి భావన. స్థానిక ప్రజలతో పాటుఉన్న ఇక్కడి ముస్లింలకు మంచి జీవన సౌకర్యాలను అందించడంతో పాటు ఇతర ప్రాంతాలనుండి వలస వచ్చే ముస్లింలను కూడా ఆదరించే హైద్రాబాద్ అదనంగా విలువైన ఎగుమతులు చేయగలిగేది. పత్తి, నూనెగింజలు, పంచదార, బొగ్గు, బంగారం మొదలైన దేశీయ ఉత్పత్తులు ఇక్కడి నుండి ఎగుమతి అయ్యేవి. వీటి ద్వారా చాలా విదేశీ మారకద్రవ్యం లభించేది. భారతీయ నాయకులకు ఇక్కడి హిందువులు ముస్లిం సంస్కృతితో ప్రభావితమయ్యారని కంటగింపుగా ఉండేది. ఈ రకమైన రాజకీయ, సాంఘిక, ఆర్థిక వ్యత్యాసాలను పరిసమాప్తి చేయడానికి ఇండియాతో కలవాలనుకున్నారు. అది ఎంత తొందరగా జరిగితే అంత మంచిదనుకున్నారు.

1947 మధ్య ప్రాంతం వరకూ కొద్దిమంది ముస్లింలు చాలామంది

హిందువులు. దేశవిభజన జరుగుతుందనుకోలేదు. దేశ విభజనను అవశ్యక్లేశంగా కాంగ్రెస్ నాయకులు అంగీకరించారు. విభజన ఒక షాక్ లాంటిది. బ్రిటీష్ ఇండియా లోని తూర్పు, పశ్చిమ భాగాలు పాకిస్తాన్‌లో చేరిపోయాయి. దేశంలోని రాష్ట్రాలన్నీ అయితే పాక్‌లోనో, లేకపోతే ఇండియాలోనో, లేదా స్వతంత్రంగానో ఉండే వెసులుబాటు భారతస్వాతంత్ర్య చట్టం కల్పించింది. ఈ వెసులుబాటు వల్ల సకాలంలో తగిన చర్యలు తీసుకోకపోతే హైదరాబాద్ దక్షిణ పాకిస్తాన్‌గా మారిపోతుందని జాతీయ కాంగ్రెస్ నాయకులకు భయం పట్టుకుంది. ఒకవేళ స్వతంత్ర దేశంగా వ్యవహరిస్తామంటే అదీ సమానమైన భయమే. విభజన తర్వాత కూడా 45 మిలియన్ల ముస్లిములు ఇండియాలోనే ఉండిపోయారు. నిజాంను స్వతంత్రంగా ఉండనిస్తే హైద్రాబాద్ ఒక ముస్లిం సాంస్కృతిక కేంద్రంగా మారి ఇండియాలోని సంస్కృతిని ధిక్కరిస్తుందని వాళ్లకు తెలుసు. అలా భారతనాయకుల దృష్టిలో హైద్రాబాద్ విషయం ఎంతో జాగ్రత్తగా వ్యవహరించాల్సిందిగా మారింది. ఇవన్నీ రహస్యాంలేం కావు. వాళ్ళ రాతల్లో, ఉపన్యాసాల్లో, ప్రకటనల్లో కనిపించేవే. రహస్యంగా, బహిరంగంగా కూడా ఆలిండియా కాంగ్రెస్ నాయకులు హైద్రాబాద్ విధ్వంసాన్ని ప్రబోధించారు.

విభజనానుసరించి జరిగిన సరిహద్దుల ఏర్పాటు వల్ల జరిగిన ఘర్షణలు మైనారిటీలను భయపెట్టిన మాట నిజం. మొదటి దాడి ఎవరినుండి మొదలైందని చెప్పడం ఇప్పుడు కష్టం. సరిహద్దుల వెంబడి జరిగిన దాడులు మీవంటే మీవని నిందించుకొనడానికి రెండు పక్షాలు సిద్ధంగానే ఉంటాయి. ముస్లింల మీద కేంద్ర ప్రభుత్వం కనుసన్నల్లో ఢిల్లీలో జరిగిన సామూహిక హత్యాకాండను ప్రపంచ ప్రతినిధులందరూ చూశారు. అయితే దేశవ్యాప్తంగా జరిగిన దాడులకు అవి ఒక లేశమాత్రపు ప్రతీక మాత్రమే. సరిహద్దుల్లో ఉండేవాళ్ళకు కనీసం తప్పించుకుపోయే అవకాశమైనా దొరికింది. దూరంగా ఉండే హిందువులకు, ముస్లింలకు అలా తప్పించుకునే మార్గం కూడా లేకుండా పోయింది. అత్యాచారాల కథనాలు రెండు మతాల ప్రజలను ఇరు దేశాలలో రెచ్చగొట్టాయి. రెండు వైపులా ఉద్రిక్తతల్ని ఎగదోసేవాళ్ళు తయారయ్యారు. తూర్పు పంజాబ్, పశ్చిమబెంగాల్‌లలో కాకుండా దేశంలోని ఇతర ప్రాంతాలలో కూడా ముస్లింలు చెప్పరాని బాధలకు గురయ్యారు. తమ స్వతంత్ర భారత దేశంలో హిందువులు కాని వారిని, కనీసం హిందువులుగా మారని వారిని లేకుండా చేసి స్వతంత్ర భారతాన్ని పావనం చేయాలనే హిందూ నాయకులు కొందరు బయలుదేరారు. సరిహద్దుల్లో హిందువుల ఆగడాలు




పెరిగిపోయాయి. తర్వాతి కాలంలో రెండు దేశాల ప్రభుత్వాలు కొన్ని చర్యలు తీసుకున్నప్పటికీ పెద్ద ఎత్తున రక్తపాతాలు జరిగిపోయాయి. ఊహించలేనంతగా స్త్రీలు, పిల్లల అపహరణ, మత మార్పిడీలు జరిగాయి. ఇతర ప్రాంతాల్లో కూడా ఈ భయాలు వెన్నాడాయి.

ఈ మారణకాండలో దక్షిణ మరియు మధ్య భారతదేశపు ముస్లింలకు మాన ప్రాణాల కోసం హైద్రాబాద్ సురక్షిత ప్రాంతంగా కనిపించింది. ముస్లింల వలసలు పెద్ద ఎత్తున ప్రారంభయమయ్యాయి. 1947 సంవత్సరాంతానికి దాదాపు మిలియన్ మంది ముస్లింలు సరిహద్దు దాటి హైద్రాబాద్ రాష్ట్రానికి చేరుకున్నారు. వీళ్లందరినీ ఆదుకోవడం ప్రభుత్వానికి శక్తికి మించిన పనైంది. వలసలు ఆపవలసిందిగా పొరుగు రాష్ట్రాల ప్రభుత్వాలకు చేసిన విజ్ఞప్తికి పెద్దగా స్పందన రాలేదు. పల్లె పట్టణాలలో శరణార్థుల సంఖ్య పెరగజొచ్చింది. చివరికి ఇది భారతనాయకుల దృష్టికి వెళ్ళింది. ముస్లింల బెడద పోతుందనే ఆనందంతో పాటు హైద్రాబాద్‌లో మైనారిటీల సంఖ్య పెరిగిపోవడం ప్రమాద సంకేతమనే ఆందోళన మొదలయింది. వారి తక్షణ భయమేమిటంటే ఇక్కడి హిందువులు బయటికి తరిమి వేయబడతారేమోనని. నిజానికి అక్కడక్కడ అలాంటి సంఘటనలు కొన్ని జరిగినయి. పరిస్థితి చేయిదాటిపోతుందని భావించి కొన్ని హిందూ కుటుంబాలు ఇండియాకు వలస వెళ్లిపోవాలని భావించాయి. సత్వరం ఆలోచించి తగు చర్యలు తీసుకోవలసిన అగత్యం ఆలిండియా కాగ్రెస్ నాయకులకు ఏర్పడింది.

ఇక్కడి హిందువుల అభిప్రాయాన్ని గమనించడంలో ఇండియన్ కాంగ్రెస్ నాయకుల అవగాహనాలోపం ఇక్కడ స్పష్టంగా కనిపించింది. ప్రతిసారీ వాళ్లు ఇక్కడ విఫలమవుతుండడం వల్ల ఈ పరిస్థితి దాపురించింది. ప్రతీసారి వాళ్లు స్టేట్ కాంగ్రెస్‌ను

పురిగొల్పుతున్నప్పటికీ స్టేట్ కాంగ్రెస్ ఇక్కడ చేసింది ఏమీలేదు. వాళ్లు ఎంత ప్రయత్నించినా స్టేట్ కాంగ్రెస్ చేయగలిగింది రెండు తీర్మానాలు మాత్రమే.

అవి 1. భారతదేశంలో విలీనం,

2. బాధ్యతాయుత ప్రభుత్వం.

ఇంకొక విషయమేమిటంటే హిందువులలో ఒక ప్రధానవర్గం భారతదేశంలో విలీనం కంటే బాధ్యతాయుత ప్రభుత్వంలో పొందాల్సిన అవకాశాలు చాలా ఉన్నాయని భావించడం. భారతదేశంలో విలీనమైతే తప్ప బాధ్యతాయుత ప్రభుత్వం సాధ్యం కాదనే వాదన చెల్లుబాటు కాకుండా పోయింది. విలీనం, బాధ్యతాయుత ప్రభుత్వానికి హిందూ సమూహాల నుండి పెద్దగా స్పందన లేదు. ఇది భారత నాయకులకు అసంతృప్తి కలిగించింది. హైదరాబాద్‌ను బలవంతంగా విలీనానికి ఒప్పించాలనే నిర్ణయానికి వచ్చారు.

వేగంగా మారుతున్న భారతదేశపు దృక్పథం అటు నిజాంకు, ఇటు ప్రజలకు తెలిసిపోతూ ఉంది. 15వ ఆగస్టు కంటే ముందు అధికారికంగా స్వాతంత్ర్యం అందినప్పుడు భారత నాయకులు లోపాయికారిగా హైద్రాబాద్‌కు రావలసిన నిత్యావసర సరుకులను అడ్డుకున్నారు. చట్టపరంగా అధికారాన్ని స్వీకరించాక సరుకు రవాణాను అధికారికంగానే అడ్డుకున్నారు. సముద్రం మీదుగా హైదరాబాద్ రావలసిన సరుకులను రైల్వేస్టేషన్లలో, రోడ్డమీద సరిహద్దులలో నిలిపివేశారు. భూ సరిహద్దులు మాత్రమే ఉన్న హైద్రాబాద్‌కు ఇది సీరియస్ విషయం. ఇదివరకు అధికారిక అవరోధం లేనప్పుడు చిన్నచిన్న సమస్యలుంటే పరిష్కరించుకుని సరుకులు వచ్చేవి. ఇప్పుడు అధికారికంగా అడ్డుకోవడం మొదలైంది. సాయుధ పోలీసులు అడ్డగిస్తున్నారు. ప్రభుత్వ, ప్రైవేటు సరుకులకు పెద్ద సమస్య వచ్చిపడింది. ఇండియా సరిహద్దుల్లో ఆధునిక ఆయుధాలు గలిగి శిక్షణ పొందిన గెరిల్లా దళాలున్నాయి. ఇవి కేంద్ర మరియు ప్రొవిన్షియల్ ప్రభుత్వాల కనుసన్నల్లో పనిచేస్తున్నాయి. ప్రణాళికాబద్ధంగా ఇవి దాడులు చేస్తున్నాయి. ఇండియా, హైద్రాబాద్ వ్యతిరేక ప్రచారానికి పత్రికలు, రేడియో తమవంతు కృషి చేశాయి. ఈ పద్ధతులను అనుసరించడం వల్ల పరిపాలన కుప్పకూలి, అంతర్గత అలజడి మొదలై నిజామూ, ఆయన ప్రభుత్వం దారికి వస్తుందని ఇండియా అంచనా.

మారిన కాలంలో ఎంత ప్రణాళికాబద్ధంగా చేసిన పనులైనా ఒక్కోసారి అనూహ్యంగా విఫలమవుతుంటాయి. హైద్రాబాద్‌కు సంబంధించిన రాజకీయ



వ్యవహారం ఇండియాతో సరిగ్గా అలాగే జరిగింది. ఆందోళన, నిర్బంధం, సరిహద్దు సంఘటనలు, నలువైపులా ప్రచారం మొదలైన వాటి ప్రభావం ఇండియాలోని నాయకులు అనుకున్నదానికి భిన్నంగా జరిగింది. సరిహద్దుల్లో ముస్లింల మానప్రాణాలు లక్ష్యంగా జరిగిన దాడులు, అంతర్గతంగా సాగిన దాడులు ముస్లింలు మేల్కొనడానికి కారణమైనాయి. గతంలో సాగిన ప్రచారానికి అనుగుణంగా రజాకార్ల ఉద్యమం రాత్రికి రాత్రి ఊపందుకుంది. గతంలో ఎప్పుడూ లేని విధంగా మత ఉద్రిక్తతలు చెలరేగి సామరస్య వాతావరణం దిగజారింది. ఇదే అదనుగా మార్క్సిస్టులు చెలరేగారు. ఈ శక్తుల కార్యక్రమాలు హైద్రాబాద్ సరిహద్దులకు మాత్రమే పరిమితం కాలేదు. సరిహద్దు ఆవలి భారతదేశంలో కూడా ఈ అలజడి కొనసాగింది. హైద్రాబాద్ రాష్ట్రంలో కుట్రచేసి లేపాలనుకున్న అలజడి భారతదేశంలోని ముంబాయి, మద్రాసు లాంటి ప్రాంతాలకు కూడా పాకింది. ఆ రెండు రాష్ట్రాల్లో కూడా శాంతి భద్రతలు తొందరలోనే క్షీణించాయి.

కుల మతాలతో నిమిత్తం లేకుండా హైద్రాబాద్ ప్రజలు దృఢ చిత్తంతో, శక్తి సామర్థ్యాలతో పరిస్థితిని ఎదుర్కొన్నారు. సాధారణ జనజీవనం కొరకు స్థానిక ప్రయత్నాలు ఫలవంతమయ్యాయి. స్థానికంగా ప్రజలు తమ అవసరాలను తీర్చుకో గలుగుతున్నారు. ధరలు పెరిగిపోవడం, సరుకుల దాచివేత లేదు. ఏవైనా వస్తువులు లభించడం లేదంటే ఎవరైనా దుకాణ దారుడు వాటిని దాచిపెట్టడం వల్లగాని లేదా ఎక్కువ రేటుకు అమ్మడం వల్లగాని మాత్రమే. ఏదైనా సరుకు మార్కెట్లో దొరకడం లేదంటే వినియోగదారుడు కోపం లేదా అశాంతికి గురయ్యాడు. ఈ తతంగమంతా హైదరాబాద్‌లో ఉన్న భారత అధికారులు, అనధికార ప్రతినిధులు శ్రద్ధగా పరిశీలి స్తున్నారు. రాష్ట్ర ఆర్థిక స్థితిగాని, సాంఘిక స్థితిగతులు గానీ కుప్పకూలే పరిస్థితిలో లేవని వాళ్ళకు అర్థమయింది. ఇండియన్ యూనియన్ ఎంతగా రెచ్చగొట్టినా ఇక్కడి హిందువులు అలజడికి గాని, తిరుగుబాటుకు గాని ఏమాత్రం ఆసక్తి చూపలేదు. స్వతంత్రమైన, నిష్పాక్షికమైన అభిప్రాయ సేకరణ జరిపితే ఇక్కడి ప్రజలు భారతదేశంలో విలీనానికి ఓటేస్తారా అనే సందేహం కలిగింది. విలీనం, బాధ్యతాయుత ప్రభుత్వం తీర్మానాలు చేసి కూర్చున్న స్టేట్ కాంగ్రెస్ ప్రజల్ని ఆ విషయమై ఉద్యమం చేయమనే పిలుపు ఇచ్చే ఆదేశాలు రాకూడదని కోరుకుంది. ఈ అనూహ్యమైన మార్పుల వల్ల ఇండియా తన పూర్వ పథకాల్ని మార్చుకోవలసి వచ్చింది. హైద్రాబాద్ సమస్యకు విభిన్న పరిష్కారమైనా కావాలి, లేదా ఢిల్లీ లక్ష్యమైనా మారాలి అనిపించింది.

ఆ విధంగా భారత నాయకుల మస్తిష్కాలు పని చేస్తున్నవి. ఇక్కడి ఏజెంట్ జనరల్ సృష్టించీ, విస్తృతపరిచి పంపే కథనాల వల్ల వాళ్ల ఆసక్తి, ఉత్సాహం సన్నగిల్లుతూ వస్తుంది. చిలువలు పలువలు చేస్తూ వేస్తున్న రంగురంగుల కథనాలలో భారతయ పత్రికలను కాంగ్రెస్ ప్రోత్సహిస్తూనే ఉంది. హిందుస్తాన్ టైమ్స్, ఎక్స్‌ప్రెస్ ఆఫ్ బాంబే ఈ కథనాలతో ముందున్నవి. మిగిలిన పత్రికలు ఒకమాదిరి కథనాల కోసం సమాచార శాఖ, రాష్ట్రాల వ్యవహారాల శాఖల మీద ఆధారపడేవి. ఈ దుష్ప్రచారంలో ఆలిండియా రేడియో ముందుండేది. ఈ విపరీత కథనాలను చూసి విదేశీ జర్నలిస్టులు అసంఖ్యాకంగా హైద్రాబాద్‌కు దిగేవారు. వాళ్ళు వ్యక్తిగతంగా కొండొకచో సమూహాలు గా వచ్చేవారు. ప్రభుత్వం వారికి రోడ్ మ్యాప్ ఇచ్చి, పెట్రోలు మాత్రం సమకూర్చేది. వాళ్లు వాళ్ళకు తోచిన విధంగా తిరిగేవారు. కొందరు చాలా దూర ప్రాంతాలకు వెళ్ళేవారు. అనూహ్యమైనదీ, సంచలనమైనది ఏదీ దొరకక వాళ్ళు నిరాశగా వెళ్ళేవారు. పట్టణాల్లో, పల్లెల్లో, పొలాల్లో, ఫ్యాక్టరీల్లో, రోడ్లమీద పనిక్షేత్రాల్లో ఎవరి పనుల్లో వాళ్లు నిమగ్నమై ఉండడం కనిపించేది. కేవలం సరిహద్దు ప్రాంతాలలో మాత్రం ఎడారి ప్రాంతాన్ని తలపించే నిర్మానుష్యం తాండవించేది.

# 16. ఢిల్లీ పెద్దలు

గాంధీజీని కలవకముందు నేను ఢిల్లీలో పటేల్‌ను కలిశాను. సాధారణ విషయాలు మాట్లాడాను. హైద్రాబాద్ వర్తమాన సమస్యలు మాట్లాడడానికి పటేల్ ఇష్టపడలేదు. యథాతథ ఒప్పందానికి తాను అనుకూలం కాదని ఒప్పందం సంతకం కాకముందే అది విఫలమవుతుందని తనకు తెలుసునని చెప్పాడు. అంతా తెలిసి కూడా మౌంట్ బాటెన్, ఇతర సహచరుల కోరిక మేరకు వాళ్ళ సంతృప్తి కోసమే అందుకు అనుమతించాడని, అది ముందుకు సాగేది కాదని ఆయనకు తెలుసు. ఒప్పందం ముగింపు దశకు వచ్చింది. దాని దుష్ఫలితాలు స్పష్టం అవుతున్నాయి. అయితే వాటిలో ఆయన వేలు పెట్టదలుచుకోలేదు. మౌంట్ బాటెన్‌కు, ఇతర సహచరులకు వదిలిపెట్టాడు. అందరూ విఫలమై తన దగ్గరికి వచ్చాకే దాని గురించి ఆలోచించదలిచాడు. ఈ విషయమై ఏమైనా మాట్లాడితే మౌంట్ బాటెన్‌తోనే మాట్లాడుకోవాలని, నిజాంకు భారత నాయకులే నిజమైన నిర్ణేతలని అర్థమయ్యే వరకు మౌంట్ బాటెన్ మాత్రమే ఆయనకు నాయకుడవుతాడు కదా అని వ్యంగ్యంగా వ్యాఖ్యానించాడు. మౌంట్ బాటెన్ ఇండియా తరపు మనిషి కాని మా తరపు ప్రతినిధి కాదు కదా అని నేను అన్నాను. అందుకు హైద్రాబాద్‌ను ఎందుకు నిందించాలి అన్నాను. తానెవరినీ నిందించడం లేదని, ఇండో హైద్రాబాద్ సంబంధాలను నిర్ధారించాల్సింది భారత నాయకులు కాకుండా మౌంట్ బాటెన్ అనే అభిప్రాయంలో నిజాం ఉన్నాడని మాత్రమే అంటున్నానని పటేల్ చెప్పుకొచ్చాడు. తనకు, ఇండియన్ క్యాబినెట్‌కు తెలియకుండా బాటెన్ ఏమీ చేయలేడని నర్మగర్భంగా చెప్పాడు. భారత్ ఇప్పుడొక స్వతంత్ర దేశమని, బాటెన్ దానికి సేవకుడైన మౌత్‌పీస్ మాత్రమేనని చెప్పాడు. సంభాషణ ధోరణికి కొంచెం తగ్గిపోయి బాటెన్‌తో చర్చలు మిగిలి ఉండగా హైద్రాబాద్ విషయంలో ఈ అన్యాయం తగదని చెప్పాను. దీనికి జవాబు చెప్పాల్సింది

నిజాం తప్ప తాను కాదని పటేల్ అన్నాడు.

ఒకరకమైన గందరగోళం, ఆందోళనతో పటేల్ వద్ద సెలవు తీసుకున్నాను. పటేల్ ఒకటి స్పష్టం చేశాడు. బాటెన్ ఇతర సహచరులు తన సహాయం అడిగేవరకు తానందులో వేలు పెట్టనన్నాడు. అదే విధంగా తన అనుమతి లేకుండా బాటెన్ ఏ చర్యా తీసుకోడని కూడా చెప్పాడు. పటేల్ ఏ మార్గంలో వెళ్తున్నట్టు? చర్చలు విఫలమవడం ఖాయమన్నట్లు, అందుకే ఆ చర్చలకు అనుమతినిచ్చినట్లు ఆయన భావంగా బయటపడింది. మొదట నడుస్తున్న చర్చలు విఫలమయినందున ఆయన ఆవేశంతో పరిస్థితిని చక్కదిద్దిన కీర్తి సంపాదిద్దామనే ఆలోచనలో ఉన్నాడా? ఇదంతా నేను మౌంట్‌బాటెన్‌కు, నెహ్రూకు చెప్పేదా? చెబితే ఏం లాభం? ఇది చాలా సున్నితమైన అంశం. హైద్రాబాదీగా నా బాధంతా చర్చలమీదే. పరిస్థితి గజిబిజిగా, ఆందోళనకరం గా అనిపించింది.

మహాత్ముడి హత్యానంతరపు మరుసటి రోజు సాయంకాలం బాటెన్‌తో చాలాసేపు మట్లాడాను. రోజంతా ఎండలో జరిగిన అంత్యక్రియలలో పాల్గొని అప్పుడే వచ్చాడు ఆయన. యమునా తీరంలో జరిగిన అంత్యక్రియల్లో పాల్గొన్న బాటెన్‌కు తలనుండి పాదాల వరకు దుమ్ము కొట్టుకుపోయింది.

ఆయన అలసిపోయినట్లు అనిపించడం వల్ల మిలియన్ల కొద్దీ ప్రజల మరణాలకు సంబంధించిన ముఖ్యమైన విషయాలను మరుసటి రోజు మాట్లాడుకుందామన్నాను. సమయం విలువైందని సంభాషణ కొనసాగిద్దామని అన్నాడు బాటెన్. సంభాషణ ద్వారా ఆయన ఏ మేరకు స్వతంత్రంగా వ్యవహరించగలడో అంచనా వేయడానికి ప్రయత్నించాను. రాజ్యాంగబద్ధమైన గవర్నర్ జనరల్‌గా తన బాధ్యతలు తెలిసినవే అయినప్పటికీ బ్రిటీష్ వారి పాతకాలపు మిత్రుడైన నిజాం రాష్ట్ర వ్యవహారాలను చక్కబెట్టడం కోసం భారత క్యాబినెట్ తనకు బాధ్యత కట్టబెట్టిందని నేనడిగిన ఒక ప్రశ్నకు జవాబుగా ఆయన చెప్పాడు. తర్వాత కాలంలో హైద్రాబాద్ కోసం ఏ చిన్నపనినీ సాధించిపెట్టలేకపోయారు. ప్రతిసారీ ఆయన రాజ్యాంగబద్ధమైన గవర్నర్ జనరల్‌గా, చర్చల సందర్భంగా ఇండియా క్యాబినెట్ చెప్పింది తప్ప మరేదీ చెయ్యలేక పోయాడు. బాధ్యతారహితంగానే ఉండిపోయాడు. ఏదైనా చర్చల్లో పూర్తి వ్యతిరేక శిబిరంతో మాట్లాడడమే సులభమనిపించింది ఈయన పరిస్థితి చూశాక. మౌంట్‌బాటెన్ ఎక్కడ ఉన్నా నిజాంకు, హైద్రాబాద్‌కు మిత్రుడిగా కనిపించేవాడు కానీ ఆయన చేసిందేమీలేదు. నైతికంగా మాత్రం నిజాంకు తగ్గమని సలహాలు ఇవ్వగలిగే స్థాయి మాత్రం ఉన్నవాడు. ఇతర సందర్భాల్లో మాత్రం గవర్నర్ జనరల్‌గా వ్యవహరించ గలిగేవాడు. వ్యక్తిగా బాటెన్ అంత అవమానకరమైన పరిస్థితిలో ఎందుకున్నాడో నాకైతే అర్థం కాలేదు. వ్యక్తిత్వం వల్లగానీ, పదవిరీత్యా కానీ ఆయన అంతకంటే గౌరవప్రదంగా వ్యవహరించాల్సింది. ఆయన ప్రస్తుత స్థితి ఇండియా లోపలా, బయటా అనేక పుకార్లకు దారితీసింది.

స్వతంత్ర భారతదేశానికి గవర్నర్ జనరల్‌గా భారతనాయకులు ఆయనలో ఏదో ప్రత్యేకతను చూస్తారు. అది ఆయనలో లోపించిందనిపించింది. బ్రిటీష్‌వాళ్లు పోయినా వాళ్ల దుష్కృత్యాలు బయటకి రాకుండా ఉండేందుకా ఈయన్ని నియమించింది అనిపించింది. స్వాతంత్ర్యానికి కొద్ది రోజుల ముందే ఆయన ఇండియాతో సన్నిహితంగా ఉన్నాడు. పాకిస్తాన్‌కు జిన్నాను గవర్నర్ జనరల్‌గా నియమించినప్పుడు ఇండియాలో అలాంటి సమర్థులెవరూ తక్షణం కనిపించక మౌంట్ బాటెన్‌ను నియమించారు. అలా నియమించడంలో భారతీయ క్యాబినెట్ తెలివి ఏమిటంటే స్వతంత్ర రాజులను దారిలోకి తెచ్చుకోవడానికి ఈయన బాగా ఉపకరిస్తాడు. ఆయన కొన్నాళ్లు బ్రిటీష్ రాజప్రతినిధిగా పనిచేశాడు. ఢిల్లీలోని కొత్త ఏర్పాట్లకు అనుగుణంగా స్వతంత్ర రాజులకు వినయాన్ని నేర్పడం అప్పటికి ఆయన లక్ష్యం. అలా ఆలోచించినప్పుడు ఆయనను



గవర్నర్ జనరల్‌గా నియమించుకొని తెలివైన పని చేశారనే చెప్పాలి. ఆయన ద్వారా మంచి విషయాలే సాధించారు కూడా. నయానా భయానా స్వతంత్ర రాజులను లొంగదీసుకునే క్షుద్రవిద్యలు బాటెన్ బృందం బాగానే చేయగలిగింది. స్వతంత్ర రాజ్యాల మంత్రులతో జరిగిన ఒక సమావేశంలో ఒక మంత్రి, అమెరికా పర్యటనలో ఉన్న తమ రాజుకు తెలియబరచకుండా భారతదేశంలో విలీనానికి ఎలా అంగీకరిస్తామని అన్నాడట. మౌంట్ బాటెన్ తన ముందున్న పేపర్ వెయిట్ మధ్య నుండి అతని వంక వంకరగా చూస్తూ గేలిచేశాడట. కొన్ని క్షణాల తర్వాత ఆవేశంలో తిట్టిపోశాడట. మీ పాలకుడు విలీనంలోనే తన భవిష్యత్తూ, రాష్ట్ర భవిష్యత్తూ ఉందని చెపుతున్నాడని ఆ మంత్రిని బెదిరించాడట.

ఆ తర్వాత ఆ రాష్ట్రం విలీనపు నిబంధనలకు ఒప్పుకుందని ప్రకటించాడట– ఆ రాష్ట్రమంత్రికి ఒక్క ముక్క కూడా మాట్లాడే అవకాశం ఇవ్వకుండా. ఆ దురదృష్టవంతుడైన మంత్రి తన అసమ్మతిని రికార్డు చేసే ఉంటాడు. కాని ఆ కాలపు ముఖ్యమైన డాక్యుమెంట్లన్నింటిలాగానే అది కూడా చెత్తబుట్టకు చేరి ఉంటుంది. ఆ రాష్ట్రం ఇక కొట్లాడలేక ఊరుకుని ఉండి ఉంటుంది. ఇక ఆ రాష్ట్రపు అధ్యాయం అలా ముగిసి ఉంటుంది.

జాతి గౌరవాన్ని తాకట్టు పెట్టి భారతీయేతరుడైన మౌంట్‌బాటెన్‌ను గవర్నర్ జనరల్‌గా నియమించుకున్నందుకు, తన వ్యక్తిగత ప్రతిష్టను, బ్రిటీషర్ల ప్రతిష్టను దిగజార్చి భారత నాయకులకు ఆయన కావలసినంత సేవను చేసి పెట్టాడు. అంత నీచస్థాయికి దిగజారడానికి మౌంట్ బాటెన్‌కు ఏ కారణం ఉండిఉంటుంది? భారతదేశంలో అంతకుముందు ఆయన చేసిన సేవ కొద్ది నెలలదే. ఆ విధంగా సుఖవంతమైన ఆ పదవిలో మరెన్నో రోజులు కొనసాగలేదు కూడా. అది ఒక నిర్ణీత పని కాదు, మాతృదేశపు సేవ కూడా కాదు. అంత అవమానకరంగా ప్రవర్తించడమేమిటి?

ఆంగ్లేయులు దొరల స్థాయినుండి దిగజారిపోయారని భారతీయులు

భావించసాగారు. ఇది మానవత్వంతో చేస్తున్న పనికాదు, పనిపట్ల ప్రేమ కాదు. మరి ఆయన లక్ష్యం ఏమై ఉంటుంది? ఆయన ధోరణి ఒక మిస్టరీగా మిగిలిపోయింది. అందరూ ఊహాగానాల్లో మునిగిపోయారు, ఆంగ్లేయులతో సహా.

మౌంట్ బాటెన్‌తో మొదట కొన్ని సమావేశాలైన తర్వాత నేరుగా భారత నాయకులతోనే చర్చలు జరిగితే మేలు అనిపించింది. ఆయనతో చర్చల్లో వాస్తవికత తక్కువ. కచ్చితత్వం, ముగింపు దరిదాపుల్లో లేదు. ఆయన ఎందుకలా ప్రవర్తిస్తున్నారో తెలియదు కానీ, ఆయనలో వ్యక్తిగత ఉత్సాహమూ కొరవడింది. వి.పి.మీనన్ ఉత్సాహమూ కొరవడింది. మీనన్, బాటెన్‌ను ఎట్టి పరిస్థితుల్లో పటేల్ సూచించిన దారి తప్పకుడా చూస్తుండేవాడు. ఎక్కడైనా బాటెన్ స్వేచ్ఛగా మాట్లాడినా మీనన్ ఆయనను కచ్చితంగా దారికి తెచ్చేవాడు. ఇది బాటెన్‌కూ అక్కడ ఉన్న వాళ్ళకూ ఇబ్బందికరంగా తోచేది.

మీనన్‌లది ట్రావెన్‌కోర్. ఢిల్లీ పాలనలో కింది నుండి పైస్థాయిదాకా అంతా వీళ్ళే ఉండేవారు. కేంద్ర ప్రభుత్వంలో మీనన్‌ల బాధ పెద్దదని అందరూ అంటూ ఉండే వారు. స్వాతంత్ర్యపు తొలిరోజుల్లో వి.పి.మీనన్‌దే హవా. ఈయన వీపీ గానే ప్రసిద్ధుడు. రాష్ట్రాల శాఖకు కార్యదర్శి, పటేల్‌కు అంతరంగికుడు. పరిస్థితిని బట్టి ఎంత ఎగబాకడానికైనా, ఎంతగా దిగజారడానికైనా సమర్థుడు. పెద్దగా చదువురాదు. ఏ విషయంపైనా పదిలైన్లు రాయలేడు. మంచి స్థానంలో ఉంటాడు. బాస్‌లకు కావలసింది చేసి పెడతాడు. ఆయన మాట్లాడేది నిజమో, అబద్ధమో ఎవరూ చెప్పలేరు. నువ్వు చెప్పింది అబద్ధం కదా అని ఎవరైనా నిలదీస్తే మాత్రం పట్టించుకోడు. నవ్వుతూ వెళ్ళిపోతాడు. చెప్పినదాన్నే పదే పదే చెబుతూ కొత్త విషయంగా నమ్మిస్తాడు. అన్ని సందర్భాలలో చెప్పేది మంచా చెడా అని గమనించకుండా కూడా సరేనంటాడు.

వి.పి. కలుపుగోలు మనిషి. ఆయన యూరోపియన్ పద్ధతుల్లో దుస్తుల్ని ధరించేవాడు. రాత్రీ పగలూ అనే తేడా లేకుండా రియల్ స్కాచ్ లాంటి మంచి మద్యం అందుబాటులో ఉంచుకునేవాడు. తన మాస్టర్లను సంతృప్తి పరచలేకపోయినప్పుడే దాన్ని వాడతాననేవాడు. మంచైనా చెడైనా అతడు ఒక కోరుకునే సేవకుడు. స్వాతంత్ర్యం వచ్చాక ఆయన కార్యాలయంలో, ఇంట్లో గుంపులు గుంపులు స్వతంత్ర రాజులు మూగేవారు. వాళ్ళంతా అతని చిరునవ్వుకోసం ఎదురుచూసేవారు.

ఆయన ఎవర్నీ కాదనేవాడు కాదు. వారందరికీ సాయంకాలాలే ఆయన

సమయమిచ్చేవాడు. సమయం దొరకడమే ముఖ్యమని వాళ్లు ఏ టైమైనా వచ్చే వాళ్లు. వాళ్లు తమ సాంప్రదాయాన్ని ప్రదర్శించడానికి ఆతృత పడేవారు. వాళ్లు అన్నీ చెప్పి అవుననిపించుకునేవాళ్లు. ఆయన అందరికీ అవునని చెప్పేవాడు. వెంటనే మరిచిపోయేవాడు. హైద్రాబాద్ ప్రతినిధులతో మాత్రం ఆయన విభిన్నంగా ఉండే వాడు. అందరికి లాగానే హైద్రాబాద్‌కూ 'ఎస్' అనేవాడు. హైద్రాబాద్ ఏజెంట్ జనరలో, కార్యదర్శో ఒకసారి ఒక ఫిర్యాదు చేశారు. హైద్రాబాద్‌కు పెట్రోలు సప్లై ఏదో ఒక ప్రొవిన్షియన్ గవర్నమెంటులు అడ్డుకుంటున్నాయని ఆ ఫిర్యాదు సారాంశం. వెంటనే స్పందించాడు. అలా అడ్డుకోవడం తప్పంటాడు. హైద్రాబాద్ ప్రతినిధి ఎదురుగానే సంబంధిత అధికారులకు ఫోన్ చేసి వాటిని తక్షణం సరిచేసుకోమంటాడు. ఫోన్‌లోనే అది యధాతథ ఒప్పందం నిబంధనలకు విరుద్ధమంటాడు. వచ్చిన ప్రతినిధి సంతృప్తి పడ్డాక, సంబంధిత అధికారి వద్ద కూడా పరిస్థితిని చక్కబెడదామని వెళ్ళేలోగా వి.పి.మరొకసారి ఫోన్‌చేసి ఇందాక తను చెప్పింది మరచిపొమ్మంటాడు. ఇదీ రాష్ట్రాల మంత్రిత్వశాఖ పనితీరు. అప్పుడప్పుడు మాత్రమే చెప్పిన మాటకు చేసే పనికి పొంతన ఉండేది.

గవర్నర్ జనరల్, భారత మంత్రులు, హైద్రాబాద్ ప్రతినిధుల మధ్య చర్చలు వి.పి. ద్వారానే జరిగేవి. యధాతథ ఒప్పందం తర్వాత ఈ చర్చలు నా ఆధ్వర్యంలో జరిగేవి. ఈ చర్చల మొదటిస్థాయి వి.పి.తోనే ఉండేది. హైద్రాబాద్ ప్రతినిధుల ఆశయాలు, లక్ష్యాలు ఈయన ద్వారానే ఢిల్లీకి తెలిసేవి. అలాగే ఢిల్లీ విషయాలు మాకు. పటేల్ వల్ల విషయం చెడిపోకుండా తాను చూశానని చెప్పుకునేవాడు. మౌంట్‌బాటెన్, నెహ్రూలు కూడా విషయం చెడిపోకుండా చూశారని అప్పుడప్పుడు చెప్పేవాడు. ప్రజాభిప్రాయం మాత్రం చర్చలను తక్షణం ఆపి చర్యలు తీసుకోవాలని ఉందని తరచూ అంటూ ఉండేవాడు. అప్పుడప్పుడు ధైర్యంగా పటేల్ ఇతర నాయకుల అభిప్రాయాలను చెబుతూ ఉండేవాడు. ఆయన చెప్పే అభిప్రాయాలు అక్షరం పొల్లుపోకుండా మరుసటి రోజు హిందూస్తాన్ టైమ్స్‌లో ప్రచురించబడుతూ ఉండేవి! అది ఇండియన్ నాయకులు నడుచుకోవాలనుకుంటున్న ప్రజాభిప్రాయం! రాజకీయంగా ఇదొక చవకబారు ఎత్తుగడగా కనిపించేది.

వి.పి. చేయాల్సిన ఇంకో ముఖ్యమైన పని ఏమిటంటే చర్చల సందర్భంగా కుదిరిన ఒప్పందాలు ఏవీ అమలు కాకుండా చూడడం. నిబంధనలు ఏవీ జారీ కాకుండా చూడడం. ఏదైనా ముఖ్యమైన ఆర్థిక ఒప్పందం కుదిరి ఉంటే దానిని కోల్డ్

స్టోరేజ్‌కి పంపడం. అదే విధంగా సైనిక పరంగా ఏదైనా అవగాహన కుదిరి తుపాకులు, మందుగుండు హైద్రాబాద్‌కు ఇవ్వాల్సి వస్తే వి.పి. తక్షణం సైనికాధికారులతో మాట్లాడి అది ముందు పడకుండా చూడడం. కోపంతో రక్షణశాఖ ఒకసారి ఆయుధ సరఫరా చివరి నిమిషపు ఫోన్ వల్ల ఆగిపోయిందని, ముందు అంగీకరించినట్లు పంపలేమని టెలిగ్రాం ఇచ్చేదాకా వచ్చింది.



నెహ్రూ ఒక ప్రధానిగా ఈ చర్చల్లో అరుదుగా పాల్గొనేవాడు. ఆయన ఎప్పుడూ చర్చకు సిద్ధంగానే ఉండేవాడు. మేం కొన్ని సార్లు కలిశాం. నెహ్రూ చర్చ సమగ్రంగా, ప్రాపంచిక దృక్పథంతో, తాత్వికంగా ఉండేది. అణుబాంబు దాని దుష్పరిణామాలు చర్చించకుండా మా సంభాషణ ఎప్పుడూ ముగియలేదు. ఆయన మానవ వైయుక్తిక, సామూహిక ఆవేశాలు ఎలా ఉంటాయో చెబుతూ వాటిని అలా వదిలేస్తే ఎలాంటి పరిణామాలు సంభవిస్తాయో విశ్లేషించేవాడు. హైస్పీడ్, జెట్ విమానాల లాంటి వాటి వల్ల ప్రపంచం ఎంత చిన్నదిగా మారిపోతుందో చెప్పేవాడు. నెహ్రూకు తన ఆలోచనా విధానం పట్ల స్పష్టతతో పాటు, మానవ గమనం మీద విస్తృతమైన అవగాహన ఉంది. కొన్ని విషయాలు ఆసక్తిగా చెప్పగలిగే నెహ్రూ కొన్ని సందర్భాల్లో రకరకాల ఆలోచనలతో కలగాపులగం చేసి వినేవాళ్ళకు విసుగు కూడా పుట్టించేవాడు.

హైద్రాబాద్ విషయంలో ఆయన అంచనా ఆయనది. మారిన కాలంలో హైద్రాబాద్ స్వతంత్ర దేశంగా ఉండాలనుకోవడం అసహజం. అది జరిగేది కాదు అంటాడాయన. ఒకవేళ మీరన్నదే నిజమైతే అది ఏ రూపంలో, ఏ సమయంలో మారాలన్నది సహజంగా అదే నిర్ణయించుకోవాలి. కాని ఇండో– హైద్రాబాద్ సంబంధాల్ని అది నిర్దేశించుకోవాలి కానీ ఈ ఒత్తిడి ఎందుకని ఆయనతో వాదించాను. స్వతంత్రం పొందిన భారతదేశానికి అంత మెల్లగా నడిచే స్వభావం ఉండదని మాత్రమే నెహ్రూ జవాబు ఉంటుందని నాకు తెలుసు. వేగం అనేది ఆచరణలో అంతగా పనికిరాదని నెహ్రూకు చెప్పాను.

నా దృష్టిలో హైద్రాబాద్ భారతదేశంలోని చాలా భాగాలకంటే ముందుందని, ఒక వేళ మీరనుకునే స్వతంత్ర భారతదేశం వేగంలో, డైనమిజంలో ముందుకు రాగలిగేదాక హైద్రాబాద్‌ను అలా ఉండనీయండి అన్నాను. భారతదేశ ఆర్థిక, సాంఘిక పురోగమనానికి హైద్రాబాద్ కలవడం అవసరమని, అది చర్చల ద్వారా సాధ్యం కాకపోతే చర్యలు తప్పవని అన్నాడు. ఈ మాటలంటున్నప్పుడు స్వభావరీత్యా ఉన్న నెహ్రూలా కాకుండా సైన్య బలంతో మాట్లాడిన ప్రధానిలా కనిపించాడాయన.

ఆ విధంగా ఇండో హైద్రాబాద్ సంబంధాలు బాటెన్, నెహ్రూ, మీనన్ అనే ముగ్గురు రాజకీయ నాయకుల మధ్య నడిచాయి. పటేల్ మాత్రం తెర వెనుక నక్కినా ఆయన నీడ మాత్రం ఆ ముగ్గురి మీద బలంగానే పనిచేసింది. దాదాపు ఎనిమిది వందల మైళ్ళ దక్షిణాన హైద్రాబాద్‌లో ఏజెంట్ జనరల్‌గా ఉన్న మున్షీ అసహనంగా ఢిల్లీ మీద ఈర్ష్యతో రగిలిపోసాగాడు. అందుకు కారణం ఆయనకు ఏ రకమైన విలువ ఇవ్వకపోవడం. హైద్రాబాద్‌పై పురోగతిలో ఏ రకమైన భాగస్వామ్యం కల్పించకపోవడం. ఏజెంట్ జనరల్‌గా హైద్రాబాద్ మీద రాజకీయ విజయం సాధించి తన ఢిల్లీ ప్రత్యర్థుల మీద ఆధిపత్యం సాధించాలనుకున్నాడు మున్షీ. ఆ అవకాశాలు మూసుకుపోయాక చిల్లర వేషాలకు దిగజారిపోయాడు.

హైద్రాబాద్‌కు వ్యతిరేకంగా జరుగుతున్న ప్రయత్నాలను చూసి అటు నిజాయితీ పరులైన అధికారులు, అధికారానికి బయట ఉన్న వ్యక్తులు ఢిల్లీ నాయకుల పట్ల చాలా ఆవేశానికి లోనయ్యారు. కానీ వాళ్ళు అంతకుమించి ఏమీ చేయలేక పోయారు. ఎందరో సంస్థానాధీశులు ఢిల్లీ నుండి అవమానాలను ఎదుర్కొన్నారు. వాళ్ళంతా రహస్యంగానైనా కచ్చితంగా హైద్రాబాద్ అంతిమంగా విజయం సాధిస్తుందని ఆశించారు. ఒక్క బ్రిటీష్ హైకమాండర్ సైన్యాలు తప్ప ఇతర విదేశీ ప్రతినిధుల రక్షణ దళాలన్నీ హైద్రాబాద్ విజయాన్ని కోరుకున్నాయి!

భారత ప్రభుత్వ కనుసన్నల్లో నడిచే పత్రికలు హైద్రాబాద్ పట్ల ఎంత దుష్ప్రచారపు కథనాలు గుమ్మరించినా స్వతంత్రంగా వ్యవహరించే చాలా భారతీయ పత్రికలు ఢిల్లీ ప్రణాళికను విమర్శించాయి. హైద్రాబాద్ వాదనను న్యాయ్యమైనదిగా ప్రకటించాయి. దాదాపు విదేశీ పత్రికలన్నీ హైద్రాబాద్‌ను సమర్థించి ఢిల్లీని విమర్శించాయి. ఇలాంటి నిజాయితీతో కూడిన పత్రికలలో హైద్రాబాద్ వ్యవహారాలపై రాసే వార్తలపై నిషేధం కానీ సెన్సార్‌షిప్ కానీ విధించాల్సి వచ్చింది. యునైటెడ్ ప్రెస్ ఆఫ్ అమెరికా సహకారంతో నడిచే లండన్ టైమ్స్, ది టెలిగ్రాఫ్, ది న్యూయార్క్ టైమ్స్, ది న్యూయార్క్ హెరాల్డ్

ట్రిబ్యూన్ మొదలైన పేపర్ల కథనాలు భారత ప్రభుత్వాన్ని ఇబ్బందికి గురి చేశాయి. విస్తృతమైన సర్క్యులేషన్ ఉన్న ది లైఫ్ అండ్ టైమ్ లాంటి అమెరికా, బ్రిటీష్ సంచికలు వారపత్రికలకు పంపే కథనాలపై సెన్సార్‌షిప్ విధించారు.

హైద్రాబాద్ భవితవ్యాన్ని ఆ విధంగా నిర్ణయించడానికి ఢిల్లీలో రంగం సిద్ధమయింది. చూసేవాళ్ళందరికీ తెలిసిన విషయమేమిటంటే న్యాయం మీద బలం విజయం సాధిస్తుంది. హైద్రాబాద్ మీద ఇండియా తన బలంతో ఆధిపత్యం సాధిస్తుంది. ఇండియా కూడా అంతిమంగా హైద్రాబాద్ నైతిక బలాన్ని అంగీకరిస్తుందని నమ్మే వాళ్ళు కూడా లేకపోలేదు. కరుడు గట్టిన కాంగ్రెసు వాదులు, మత సంస్థలు తప్ప ఇతర ప్రజాసంస్థలన్నీ హైద్రాబాద్ పరిస్థితిపై ఆవేదన చెందాయి.

# 17. అంతర్గత పర్యవసానాలు

**భా**రత నాయకులకు, హైద్రాబాద్ ప్రతినిధులకు మధ్య 1948 ఫిబ్రవరి మాసారంభంలో జరిగిన చర్చలు ఎలాంటి అవగాహనకు రాకుండానే ముగిశాయి. దీర్ఘకాలిక ఒప్పందాలకు పరిస్థితి ఇంకా పరిపక్వం కాలేదని రెండు పక్షాలు అభిప్రాయపడ్డాయి. యథాతథ ఒప్పందంలోని అంశాలు వీలైనంత వరకు అమలు జరపాలని భావించడం జరిగింది. పరస్పర మార్పులు జరుగుతున్న ఈ సందర్భంలో రాజకీయ వాతావరణం మబ్బు పట్టినట్లుగా ఉంది. పాకిస్తాన్‌కు రెండు వందల మిలియన్ల రుణం ఇవ్వడం, హైద్రాబాద్‌లో హైద్రాబాద్ కరెన్సీ మాత్రమే చెల్లుబాటవుతుందని ఆర్డినెన్స్ ఇవ్వడం ద్వారా హైద్రాబాద్ ఒప్పందంలోని నిబంధనలను ఉల్లంఘించిందని భారత నాయకుల ఆరోపణ. యునైటెడ్ ప్రెస్ ఆఫ్ అమెరికాకు చెందిన వైర్‌లెస్ రిసీవింగ్ స్టేషన్ ఏర్పాటుకు హైద్రాబాద్‌లో అనుమతి ఇచ్చారని మరో ఆరోపణ. భారత ప్రభుత్వం దీనిమీద చాలా రచ్చ చేసింది. మరోవైపు ఒప్పందం ప్రకారం ఆయుధ సామాగ్రి సరఫరా చేయకపోవడం వల్ల శాంతి భద్రతలు అదుపు తప్పుతున్నాయని ఇది ఒప్పందాన్ని గౌరవించకపోవడమేనని హైద్రాబాద్ పట్టుబడుతూ వచ్చింది. అదే విధంగా యూరప్, అమెరికాల నుండి హైద్రాబాద్‌కు భారత భూభాగం ద్వారా జరిగే సరుకు రవాణాను భారతదేశపు తీర పట్టణాల్లో అడ్డుకోవడం అలా కొనసాగుతూనే ఉంది. హైద్రాబాద్ వ్యతిరేక ప్రచారం భారత పత్రికల్లో నిరాఘటంగా కొనసాగుతూనే ఉంది. భారత ప్రభుత్వ సంస్థగా ఆలిండియా రేడియో అబద్ధాలతో కూడిన తప్పుడు ప్రచారం చేస్తూనే ఉంది. సరిహద్దులవెంట దాడుల సంఖ్య, ఉధృతీ పెరిగింది. కానీ భారత ప్రభుత్వం వాటిని నియంత్రించడానికి ఎలాంటి ప్రయత్నమూ చేయలేదు. ఇంకా వాటిని భారత కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల

పెద్దలు ప్రోత్సహించిన ఉదంతాలున్నాయి.

ఆరోపణలు, ప్రత్యారోపణల వల్ల ఏ ప్రయోజనమూ ఒనగూడలేదు. హైద్రాబాద్ బృందం చేసే ఢిల్లీ పర్యటనల వల్ల ఉత్సుకత రేకెత్తింది తప్ప ఏమీ సాధించబడలేదు. అసంతృప్తి పెరిగింది. ఈ పరిస్థితి ఒక ఏజెంట్ జనరల్ ఆఫ్ ఇండియాకు ఆనందం కలిగించినట్లు అనిపించింది. నేను ఢిల్లీ నుండి తిరిగి రాగానే చిరునవ్వుతో నన్ను కలిశాడు. కావలసినంత టైం వేస్ట్ చేశారని వ్యాఖ్యానించాడు. అసలు కిటుకు ఆయన దగ్గరే ఉంది. ఆయనతో ఒక అవగాహనకు వస్తే కానీ హైద్రాబాద్ సమస్య పరిష్కారం కాదు. తనను దూరం పెట్టడం వల్లనే అవగాహన కుదరలేదని లోగొంతుకతోనైనా ధైర్యంగానే చెప్పాడు ఆయన.

ఫిబ్రవరి మాసాంతంలో సరిహద్దు దాడులు. రైళ్ళ నిలిపివేతలు లాంటి అరాచకాలు పెరగజొచ్చాయి. ఆతృత, ఆందోళనతో హైద్రాబాద్ చివరికి భారత్ నుండి ఆయుధ సరఫరా కోసం చేసిన ప్రయత్నాలు కూడా విఫలమయ్యాయి. సరిహద్దు ప్రాంత ప్రజల ప్రాణాలు, ఆస్థిపాస్తులు, రైల్వే లైన్లు రక్షించడానికి సరైన ఆయుధాలు లేక ఎంతోమంది పోలీసులు ప్రాణాలు కోల్పోయారు. ప్రతి చిన్న, పెద్ద సంఘటనలకు సైన్యాన్నే పిలవాల్సి వచ్చేది. ఎందుకంటే సైన్యం దగ్గరే కొద్దిగా ఆయుధాలుండేవి. కేంద్రస్థానంలో అవసరాలను గమనించి ట్రూపులను విభజించి చిన్న సంఖ్యను బార్డర్‌లకు పంపాల్సి వచ్చేది. అన్నింటికీ పోలీసులతో పాటు సైన్యాన్ని వాడడం వల్ల వారిలోనూ అలసట పెరిగి పోయింది. దాడులను విజయవంతంగా అడ్డుకున్న సందర్భాలలో పోలీసులకు, మిలట్రీకి అధునాతన ఆయుధాలు కూడా లభించేవి.

దాడులను నిరోధించడం, సరిహద్దు ప్రాంత ప్రజల ప్రాణాలు, ఆస్తులు, రోడ్డు, రైల్వేలను కాపాడడం రాష్ట్ర ప్రధాన కర్తవ్యంగా మారిపోయింది. ఆర్మీ వద్ద పాతవి, పనికిరానివి 15 వందల హెన్రీ మార్టిన్ రైఫిల్సు ఉన్నాయని, మందుగుండు మాత్రం లేదని తెలిసింది. ఆయుధ డిపోకు నేను వెళ్ళి చూశాను. ఆ రైఫిళ్ళకు కొద్దిగా మరమ్మత్తు చేయించి వాడవచ్చునుకున్నాను. ఇక కేవలం మందుగుండు కావాలి. ప్రభుత్వ ఆయుధాగారంలోనే తయారు చేయించాలనుకున్నాను. మొదట కొన్ని ఫెయిల్ అయినప్పటికీ తర్వాత పనికి వచ్చేవాటిని తయారు చేయగలిగాం. యువ శాస్త్రవేత్తలు ఇందులో శ్రమించారు. సమస్యలన్నీ అధిగమించి హెన్రీమార్టిన్ కాట్రిడ్జ్‌లో వాడడానికి మందుగుండును హైద్రాబాద్ స్వంతంగా తయారు చేసుకోగలిగింది.



1500 ఆయుధాలను కొంత మందుగుండుతో సహా ఇచ్చినప్పుడు పోలీసు ఉన్నతాధికారి కళ్ళల్లో ఆనందం నాకింకా గుర్తుంది. కొన్ని నెలలుగా ఆయుధాలు లేక ఆయన ఎంతో విచారంలో ఉన్నాడు. ఆయుధాలు లేక ఆయన శాఖలోని సిబ్బంది ఎంతోమంది చనిపోవడాన్ని తట్టుకోలేని పరిస్థితి ఆయనది. పదివేల 303 రైఫిళ్ళు, రెండు వందల సబ్ మెషిన్ గన్నులు ఆయనకు అవసరంగా ఉండింది. 1500 బాగుచేశాం. 1500 ఆయన అవసరానికి ఎంతమాత్రం సరిపోవుకాని అప్పటికే ఆయనలో కొత్త జవజీవాలు వచ్చాయి. సైన్యంలో తిరుగుబాటు దారులను తిప్పికొడతామనే ధైర్యం వచ్చింది. ఓటమి భయాన్ని తొలగించింది.

హైద్రాబాద్‌ది రెండువేల మైళ్ల సరిహద్దు. చుట్టూరా ఆందోళన. ఆయుధాలే కాకుండా అంతపెద్ద సరిహద్దు వెంట సైన్యాన్ని తరలించడమూ కష్టమే. దాడులు చేసే మూకలు 1500 దాకా ఉండేవారు. సరియైన రక్షణ లేని చోట, స్వల్ప రక్షణ ఉన్న చోట వాళ్ళు సులభంగా దాడులు చేయగలిగేవారు. అదృష్టవశాత్తూ వాళ్ళంతా తుపాకీ శబ్దం వింటే పరుగెత్తి పోయేవారే. రక్షణ లేని కేంద్రాల్లో లూటీలు, హత్యలు చేసేవారు. అనుభవం మీద తెలిసిందేమిటంటే కొద్దిపాటి తుపాకులున్నా వాళ్ళను

నిలువరించవచ్చు. స్థానికులకు ధైర్యాన్ని కలిగించవచ్చు. ఒక వేయి ఔట్ పోస్టులుంటే దాడుల్ని పూర్తిగా అరికట్టవచ్చు. ఆయుధాలు కొన్ని సమకూర్చుకోగలిగితే అన్ని ఔట్‌పోస్టులు ఏర్పాటు చేసుకోవడం పెద్ద కష్టమేం కాదు. ఒకరిద్దరు అనుభవజ్ఞులైన అధికారులతో కొత్తగా నియమించుకున్నవారిని అక్కడ పోస్టు చేయవచ్చు.

యధాతథ ఒప్పందం సంతకాలు చేసే సమయంలో ఇండియా, నిజాం అదనపు ఒప్పందపు పత్రాల మీద కూడా సంతకం చేశారు. హైద్రాబాద్‌కు ఆయుధ సామాగ్రి అవసరమైనప్పుడు ఇండియా సమకూర్చాలని, అలా కూర్చని పక్షంలో ఇండియాకు తెలియజేసి అప్పుడున్న నిజాం ప్రత్యామ్నాయ మార్గాలు వెతుక్కుంటారని ఆ ఒప్పందంలో నిజాం స్పష్టం చేశాడు. ఈ ఒప్పందాన్ని ఉటంకిస్తూ హైద్రాబాద్‌కు న్యాయంగా అవసరమైన ఆయుధ సామాగ్రిని అందిస్తామని గవర్నర్ జనరల్ చెప్పాడు. ఇండెంటును ఇండియా చాలా రోజులు తనవద్ద పెట్టుకుంది. హైద్రాబాద్‌కు అది తక్షణావసరంగా రక్షణ శాఖ అంగీకరించింది. హైద్రాబాద్ అధికారులు ఢిల్లీలోనే కూర్చున్నారు. రాష్ట్రాల వ్యవహారాల శాఖ వారికెన్నో తీపి మాటలు చెప్పింది. ఢిల్లీ ప్రోత్సాహంతోనే సరిహద్దు దాడులు జరుగుతున్నాయని, ఉద్దేశ్యపూర్వకంగానే ఆయుధ సామాగ్రిని సరఫరా చేయడం లేదని హైద్రాబాద్‌కు తెలియక కాదు, హైద్రాబాద్‌కు ఇక వేరే ప్రత్యామ్నాయం లేదు. ఢిల్లీ తన బాధ్యతల నుంచి తప్పుకుందని చాటబడాలి.

సరిహద్దు దాడులు, అలజడులు, అరాచకమనే జబ్బుకు ప్రతిరూపం కావా అని నన్ను తరచూ అడుగుతుంటారు. ఆ అరాచకం నిజమే అయినప్పుడు హైద్రాబాద్ ఢిల్లీతో ఎందుకు తెగతెంపులు చేసుకోదు అని కూడా అంటుంటారు. నిజమే! ఆ జబ్బు వాళ్ళ అంతర్గత రుగ్మతే అని భారతదేశం ప్రపంచానికి నమ్మించాలని చూస్తుంది. తద్వారా తన అసలు లక్ష్యం – హైద్రాబాద్‌ను రాజకీయంగా, సాంఘికంగా, సాంస్కృతికంగా, నైతికంగా లోబరుచుకోవడం నెరవేర్చుకోవాలని. వాళ్ళు హైద్రాబాద్ ను తమ ఉదరంగా చెప్పుకుంటారు. ఉదరాన్ని అసలు శరీరం నుండి దూరం కావడం కానీ, ప్రత్యేక అంగంగా ఉండడంకానీ ఒప్పుకోరట. అది బలహీనుడి మీద బలవంతుడు చేసే వాదన. అది ఆస్ట్రియా, జెకొస్లావేకియాను ఆక్రమించడానికి హిట్లర్ చేసిన వాదన. కాబట్టి హైద్రాబాద్‌కు మిగిలింది ఏమిటంటే అలజడి అనే జబ్బుతో పోరాడటం, భారత్ కుట్రకు వ్యతిరేకంగా తన శక్తి మేరకు తిరగబడటం, ప్రపంచ అభిప్రాయానికి భిన్నంగా ఢిల్లీని పేదదేశంపై దాడి చేసిన ధనిక దేశంగా అభివర్ణించడం.

భౌతిక గాయాలకు, ఆస్తి నష్టానికి హిందువులు, ముస్లింలు సమానంగా

కోపోద్రిక్తులయ్యారు. కాంగ్రెస్ కోసం నినదించిన కొద్దిమంది హిందువులు కూడా సామాన్యుల బాధలను చూసి విచారించారు. ఏజెంట్ జనరల్ ఎంత ప్రయత్నించినా స్టేట్ కాంగ్రెస్ నాయకులు ఒక్క తాటిమీద నిలబడలేదు. ప్రజాజీవితంలో ఉన్నందున వాళ్లు ఒక్కసారిగా మారలేరు కానీ హైద్రాబాద్ పట్ల భారత నాయకుల వైఖరిని వారూ సమ్మతించలేదు. సరిహద్దుల్లో దారుణాల్ని ఎదుర్కొనేందుకు ఏర్పాటు చేసిన పౌరకేంద్రాల్లో వాళ్ళు హృదయ పూర్వకంగా పాలు పంచుకున్నారు. కొందరు స్వచ్ఛంద సేవ చేశారు. ఇది ఒక అనూహ్యమైన పురోగతి. ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఉండే వాళ్ళు కూడా ఇలా సహకరించడానికి కారణం మాత్రం భారత నాయకుల అరాచకాలే.

ఈ సమయంలో రామానంద తీర్థ ఇండియాలో పర్యటిస్తున్నాడు. ఇండియాలోని మంత్రులు అధ్యక్షత వహించే సభల్లో ఆయన ఉపన్యసిస్తుండేవాడు. దుష్ప్రచారాల్ని మాత్రం ఖండిస్తూ ఉండేవాడు. ఆయన అనుచరగణమంతా పోయింది. ఆయన వ్యక్తిగత లక్ష్యాలను పసిగట్టి ఆలిండియా కాంగ్రెస్ ఆయనను దూరం పెట్టింది. ఆయన ఉపన్యాసాలు వినేవాళ్ళ సంఖ్య కూడా బాగా తగ్గిందన్న విషయం ఆయనకు అర్థమయింది.

ఇండియాలో మంచి వ్యాపారమున్న ఒక మిత్రుడు హైద్రాబాద్‌కు వచ్చి నన్ను కలిశాడు. మా సంభాషణ అనేక విషయాల మీద నడిచింది. ఆయన రాజకీయాల గురించి కచ్చితమైన అభిప్రాయాలు వెలిబుచ్చేవాడు. ఇంకే కారణం లేకపోయినా అవినీతి నుండి దూరంగా ఉండేందుకైనా హైద్రాబాద్ భారతదేశంలో కలవకుండా ఉండాలి అన్నాడు. ఒక బయటి వాడుగా పరిశీలించి చెబుతున్నానని హైద్రాబాద్‌లో అవినీతి చాలా తక్కువ అని చెప్పాడు. అవినీతికి పాల్పడే వాళ్ళని పేరున్నవాళ్ళు కూడా చిన్న టిప్పులాంటి వాటితో సంతృప్తిపడే వాళ్ళేనని చెప్పాడు. హైద్రాబాద్ అవతల ఒక కసితో లంచాలు గుంజుతారని, ఇక్కడివాళ్ళకు అంత దుష్ట స్వభావం లేదని, భయం ఉందని చెప్పాడు. హైద్రాబాద్ ప్రభుత్వంలో నిజాయితీ పరులకు, అవినీతి పరులకు మధ్య నిష్పత్తి ఎంత ఉంటుందని నేను ఆయన్ని అడిగాను. ఆయన కొంచెం వింతగా చూసి అన్నాడు : 'భారతదేశంలోని సంఖ్యలో రెండు భాగాలు చేయండి. వాళ్ల మోసాలను నాలుగు భాగాలు చేయండి'. 'ఇండియాకు ఎలాగూ స్వాతంత్ర్యం వచ్చింది కదా! ఇక లంచాలు సమసిపోతాయి' అన్నాను నేను. ఆయన వెంటనే 'నో' అన్నాడు. 'అవినీతిపరులకు కూడా స్వేచ్ఛ వచ్చింది కదా!' అన్నాడు. 'హైద్రాబాద్ ఉద్యోగులకు లంచాలు తీసుకోగలిగే తెలివితేటలు తక్కువ ఉన్నట్లున్నాయి'

అని నవ్వాడు.

పీడించి తీసుకునే లంచాన్ని కానీ ఇచ్చే వాన్ని సంతృప్తి పరిచి తీసుకునే టిప్పును కానీ ఎవరూ సమర్థించలేరు. అదే సందర్భంలో పరిపాలనలో నూటికి నూరుపాళ్ళు నిజాయితీని ఆశించలేం. సరిహద్దు దాడుల్ని ఎదుర్కోవడంలో హైద్రాబాద్ ఉద్యోగులు పూర్తి విజయం సాధిస్తారని నమ్మలేం. ఆ దాడులు చేసేవారికి ఆర్థిక దన్ను, ఆయుధ సంపత్తీ చాలా ఉంది. అయినా అక్కడి ప్రజలు, అధికారులు ఆ దారుణాల్ని చూడలేక తిరగబడే స్థాయికి వచ్చారు. ఉద్యోగం నిర్ణీత సమయం కాకుండా ఎన్ని గంటలైనా పనిచేయడానికి సిద్ధపడ్డారు. ఎలాంటి సౌకర్యాలు లేని రిమోట్ ప్రాంతాలకు ఉద్యోగులు పంపబడ్డారు. అతిసాధారణంగా జీవించడానికి సిద్ధపడే మంచి ప్రణాళికలను తయారు చేసుకున్నారు. కొద్దిమంది తప్ప అవినీతి వాసనలున్న వారు కూడా మంచి లక్ష్యం కోసం సిద్ధపడ్డారు. వారిలో బయలుదేరిన సుస్థితి, ఆయుధ సంపత్తి లేమిని మరిపించింది. రైడర్లు కూడా వీళ్ళని గౌరవంగానే చూడాలనే నిర్ణయానికి వచ్చారు. చిన్నచిన్న దాడులు తక్షణం తగ్గిపోయాయి. పెద్ద దాడులు చాలా ప్రభావవంతంగా జరగసాగాయి. రైడర్లకు ఇప్పుడు ఎక్కువ వెలాసిటీ ఉన్న రైఫిళ్ళతోపాటు, మిషన్ గన్‌లు, ఆటోమాటిక్ వెపన్లు కూడా లభించాయి. వాహనాలు కూడా సమకూరాయి. అప్పుడప్పుడు ఒకటీ రెండు విమానాలు కూడా సరిహద్దుల్లో తిరుగాడుతూ  హైద్రాబాద్ ఠాణాల శక్తి సామర్థ్యాలను రైడర్లకు తెలియజేస్తూ ఉండేవి.

# 18. ఢిల్లీ కరాచీల మధ్య

సర్ వాల్టర్ మాంక్టన్ దశాబ్దానికి పైగా హైద్రాబాద్‌కు రాజ్యాంగ సలహాదారుగా పనిచేశాడు. ఇక్కడి రాజకీయ నేపథ్యం ఆయనకు బాగా తెలుసు. ఇక్కడి ప్రజలు, ముఖ్యంగా ఇత్తెహాద్ వాళ్ళు అవిశ్వాసం వ్యక్తం చేయడం ఆయనను బాధించింది. ఈయన సభ్యుడిగా ఉన్న ఛత్తారి డెలిగేషన్‌ను ఢిల్లీ వెళ్ళకుండా ప్రజాసమూహం అడ్డుకుంది. ఛత్తారి నివాసంతో పాటు ఈయన నివాసాన్ని కూడా ప్రజలు ముట్టడించారు. ఆ కారణంతో అసంతృప్తిగా ఆయన హైద్రాబాద్‌ను వదలివెళ్ళాడు.

నేను ఢిల్లీ నుండి తిరిగి వచ్చాక మాంక్టన్‌ను, ఆయన భార్యను హైద్రాబాద్‌కు రమ్మని లేఖ రాశాను. నా లేఖను అంగీకరించమని నిజాం కూడా వ్యక్తిగతంగా లేఖ రాశాడు. మాంక్టన్ అందుకు అంగీకరించి సతీసమేతంగా తిరిగి వచ్చాడు. ఆయన మౌంట్‌బాటెన్ స్నేహితులు కొంతకాలం పాటు సహచరులు కూడా. వారిద్దరి స్నేహం ద్వారా హైద్రాబాద్ పొందదల్చుకుంది ఏమీ లేనప్పటికీ మౌంట్‌బాటెన్ ద్వారా భారత నాయకుల మనసుల్లో ఉన్న మాట ఏమిటో తెలుస్తుందని ఆశించడం జరిగింది. సత్వర అవగాహన, మంచి లేఖనం మాంక్టన్‌కు స్వంతం. మాంక్టన్, ఆయన శ్రీమతి కూడా మాతోపాటు ఫిబ్రవరి మాసాంతం వరకు ఢిల్లీ పర్యటనలకు వచ్చారు.

ఢిల్లీలో వాతావరణం గత నెలలోలాగే ఉంది. హైద్రాబాద్ ఏజెంట్ జనరల్ మాకు పరిస్థితిని వివరించాడు. పరిస్థితి కష్టంగా ఉందని, హైద్రాబాద్‌కు వ్యతిరేకంగా అడ్డంకులు మరింతగా కఠినతరమవుతున్నాయని చెప్పాడు. ఢిల్లీ హైద్రాబాద్‌కు ఎలాంటి ఆయుధ సరఫరా చేయడానికి సిద్ధంగా లేదని, పైగా ఎంత తొందరగా అక్కడి ఆయుధ సంపత్తి ఖర్చువుతుందో చూద్దామని ఆసక్తితో ఉందని తద్వారా హైద్రాబాద్‌లోని అంతర్గత శాంతి భద్రతలను నిర్వహించలేని స్థితికి, బయటినుండి సరిహద్దుల వెంట

జరిగే దాడులను నిలువరించలేని స్థితికి హైదరాబాద్ త్వరగా రావాలని ఢిల్లీ కోరుకుంటున్నట్టు ఏజెంట్ జనరల్ మాకు వివరించాడు. పౌరసరఫరాలు, అత్యవసరమైన యంత్ర పరికరాలు, మందులు, మందుల దుకాణాలు గడ్డు పరిస్థితిని ఎదుర్కోబో తున్నట్లు చెప్పాడు. బ్రిటీష్ హై కమీషనర్‌తో, వారి సిబ్బందితో తప్ప ఇండియాతో తనకు మంచి సంబంధాలే కొనసాగుతున్నాయని చెప్పాడు. ఇదంతా మౌంట్‌బాటెన్ సాగిస్తున్న వ్యవహారమని మాకు ముందుగానే తెలిసి వచ్చింది.

మళ్ళీ ఒకసారి ఢిల్లీ వెళ్ళాం. మా డెలిగేషన్ ఎప్పటిలాగే హైద్రాబాద్ హౌజ్‌లో దిగింది. మౌంట్ బాటెన్ ఆహ్వానాన్ని మాంక్‌టన్ అంగీకరించాడు. మేం గవర్నర్ జనరల్ నివాసానికి వెళ్ళాం. మేం ఢిల్లీకి వెళ్ళగానే భారత, విదేశీ జర్నలిస్టులు మమ్మల్ని చుట్టుముట్టారు. మా చర్చల గురించి నేను ఒక్క మాట కూడా చెప్పకపోయినప్పటికీ ఆ పాత్రికేయులు నన్ను గౌరవంగానే చూశారు. వాళ్ళు హైద్రాబాద్ పట్ల సానుభూతితో ఉన్నారు. ఇండో హైద్రాబాద్ సంబంధాలలోని అనిశ్చితి ఉభయకుశలోపరిగా పరిష్కారం కావాలని వారు ఆశించారు.

మేం చేరుకున్న గంటలోనే మీనన్ వచ్చారు. ఆయనతో నా సంభాషణ మామూలుగానే సాగింది. ఆయన పాత కథే చెప్పారు. ఇండియాలో హైద్రాబాద్ విలీనం కాకపోతే పరిస్థితులు దేశమంతా చేయిదాటి పోయేట్లు కనిపిస్తున్నాయని ఆయన సందేశం. నేను ఆయనకు చాలా సూటిగా 'నేను వ్యవహారానికి వచ్చాను, వ్యవహారంగానే మాట్లాడుతా'నని చెప్పాను. హైద్రాబాద్ వ్యతిరేక ప్రచారానికి ఇండియా కంకణం కట్టుకున్నప్పుడు ఇంక పాత కథలు వినాల్సిన అవసరం లేదని చెప్పాను. ఇండియా నిజంగా వ్యవహారాన్ని మాట్లాడితే మేం నిజాయితీగా అందుకు సహకరిస్తాం అన్నా. రెండు వందల మిలియన్ల రూపాయల సెక్యూరిటీలు పాకిస్తాన్‌కు హైద్రాబాద్ ఇవ్వడం ఇండో హైద్రాబాద్ సంబంధాలలో ప్రధాన అడ్డంకిగా మారిందని మీనన్ చెప్పుకొచ్చాడు. భారత కరెన్సీని హైద్రాబాద్ వ్యవహారాలలో నిషేధించడం కూడా భారత్‌కు నచ్చలేదని చెప్పాడు ఆయన. ఈ రెండు విషయాల పట్ల ఒక అంగీకారం కుదిరితే తర్వాత చర్చలు సులభమవుతాయని మీనన్ చెప్పాడు. మాంక్‌టన్, మౌంట్ బాటెన్‌తో వ్యక్తిగత సంభాషణ జరిపి వచ్చాక దాదాపు ఇవే విషయాలు ప్రధానమైనవిగా చెప్పాడు. అదే సమయంలో నెహ్రూతో, పటేల్‌తో నేను రెండు సార్లు సుదీర్ఘంగా చర్చించాను. పటేల్‌తో సంభాషణ ఆసక్తికరం, వాటిలో కొన్న రికార్డు చేయాల్సిన అవసరమున్నది.



బయట ప్రచారంలో ఉన్నంతగా తాను ముస్లిం వ్యతిరేకిని కానని ఆయన చెప్పాడు. గాంధీతో నా చర్చల సందర్భంగా పటేల్ పట్ల నా అభిప్రాయాన్ని మార్చడానికి ప్రయత్నించినట్లు గాంధీ పటేల్‌కు చెప్పాడట. పటేల్ నాకు రెండు పేపర్లు చూపించాడు. ఒకటి ఆయన చర్యలను విమర్శిస్తూ వచ్చిన వార్త. రెండవది ఒక దంత వైద్యుడికి కరాచీ నుండి పటేల్ రాసినట్లుగా ఉన్న లేఖ. ఆ లేఖ సారాంశమేమిటంటే అతను కరాచీలో ఉండదలిస్తే సర్దార్ అనిగానీ, వల్లభాయ్ అనిగానీ, పటేల్ అనిగానీ వాడకూడదు. ఒకవేళ ఆ పదాలు వాడుకోదలిస్తే పాకిస్తాన్ వదలి వాడుకోవాలి. ఆ హెచ్చరికను బేఖాతరు చేస్తే ఒక అనామక సంస్థ అతన్ని సమర్ధిస్తుంది. అయితే ఆ దంత వైద్యుడు కరాచీని వీడడానికి ప్రయత్నిస్తే అతని సరుకుల్ని తీసుకెళ్ళడానికి స్థానిక అధికారులు అంగీకరించలేదు. అలా ఎందుకు ఆ పేరు పెట్టుకున్న వాళ్ళకు అన్ని కష్టాలు అని ప్రశ్నిస్తూ పటేల్ కళ్ళనీళ్ళ పర్యంతమయ్యారు. నేను చాలా ఇబ్బంది పడ్డాను. ఒకవేళ నా మతస్థులే అలా చేసి ఉన్నట్లయితే అది సరైన చర్య కాబోదని అన్నాను. ఒకవేళ ఆ పేపర్లు నాకిస్తే నేను ఏదైనా చేయడానికి ప్రయత్నిస్తానన్నాను. తిరిగి ఇచ్చేమాట తీసుకుని ఆ పేపర్లు నాకిచ్చాడు పటేల్.

తిరిగి ఇండో హైద్రాబాద్ వ్యవహారాలకు మళ్ళాం. అప్పుడు కొద్ది నిమిషాల కింద నాతో విషాధంగా మాట్లాడిన పటేల్ మటుమాయమయ్యాడు. చాలా నిర్దాక్షిణ్యంగా హైద్రాబాద్ ఇండియాలో విలీనం కావలసిందేనని తెగేసి చెప్పాడు. ఒకవేళ మౌంట్ బాటెన్, ఇతర సహచరులు ఇంకా ఇతర ప్రయత్నాలేమన్నా చేస్తే దాని ఫలితాలను వారే చవి చూడవలసి వుంటుందని చెప్పాడు. ఇండో హైద్రాబాద్ వ్యవహారం మీద ఢిల్లీ క్యాబినెట్‌లో భిన్నాభిప్రాయాలు ఉన్నట్లు గతంలో నేను విన్న మాటలకి ఇప్పుడు

ప్రత్యక్ష సాక్ష్యం దొరికింది.

చర్చల్లో ఒకసారి బెంగాల్ గవర్నర్ రాజగోపాలాచారి కనిపించారు. పరస్పర అభివాదాలయ్యాక మా చర్చలకు అడ్డమొచ్చినందుకు క్షమాపణ చెప్పి వెళ్ళిపోబోయారు. పటేల్, నేనూ, చారిని మా చర్చల్లో ఉండవలసిందిగా కోరిన పిదమ ఆయన కూడా ఉండిపోయారు. ఓపిగ్గా మా సంభాషణను విని మధ్యమధ్యలో ఆయన చేసిన కామెంట్ల ద్వారా హైద్రాబాద్ వాదన సరియైందనే అభిప్రాయపడినట్లు అనిపించింది. ఆ సందర్భంలో పటేల్‌కు ఒక దూర దేశపు ఫోన్ వచ్చింది. అప్పుడు రాజగోపాలాచారి హైద్రాబాద్ పట్ల ఢిల్లీ ప్రవర్తన చాలా అన్యాయపూరితమైనదని నిజాయితీగా చెప్పాడు. హైద్రాబాద్‌ను ఆయన సమర్థించారు. ఇండో హైద్రాబాద్ సంబంధాల క్షీణతకు పటేల్ కారణమని, అది దురదృష్టకరమని వ్యాఖ్యానించాడు. పటేల్ దృక్పథాన్ని మార్చుకోమన్ని చాలాసార్లు చెప్పానన్నాడు చారి. తాను మద్రాసు వాడినని, అందుకే హైద్రాబాద్ పరిస్థితిని తానే సరిగ్గా అంచనా వేయగలనని కూడా ఆయన చెప్పారు. పటేల్ నిర్హేతుకంగా ప్రవర్తిస్తున్నాడని చెప్పాడు. ఆయనే సర్వాధికారి కాదు కాబట్టి అడుగుతున్నాడని చెప్పాడు. ఇండియాలో ముస్లింల పరిస్థితిపై కూడా ఆయన అంచనా అదేనని చెప్పాడు. ఇండియాలో మైనారిటీల పట్ల మరింత సహనశీలతతో ప్రవర్తించా లని, అయితే పటేల్ అలాంటి అభిప్రాయాలను అసలే ఒప్పుకోడని చెప్పాడు.

మౌంట్ బాటెన్ ఈ విషయంలో ఏమైనా సాయం చేయగలడా అని రాజాజీని అడిగాను. పటేల్ అభిప్రాయానికి భిన్నంగా ఆయన ఏమీ చేయలేడు కానీ ఈ సందర్భంలో ఆయన మధ్యవర్తిత్వం తప్పదన్నాడు. ఈ చిక్కుముడిని విప్పడంలో సహాయం చేయమని రాజాజీని అడిగాను. ఈ పరిస్థితుల్లో తానేమీ చేయలేనని, చేయగలిగే ఏ చిన్న అవకాశం దొరికినా సంతోషంగా చేస్తానన్నాడు.

నెహ్రూతో నా సంభాషణ సాధారణంగానే సాగింది. సుదీర్ఘంగా సంభాషిస్తూ అణుశక్తిని మానవ అభివృద్ధికి వాడుకొంటే ఇండియా పురోగమిస్తుంది అన్నాడు. మౌంట్‌బాటెన్‌తో చర్చలు జరగకుండా తానేమీ మాట్లాడలేనన్నాడు. ఆసియా ఖండంలో ఇండియా నిర్వర్తించాల్సిన పాత్ర గురించి చెప్పాడు. ఉత్తర, దక్షిణ అమెరికా ఖండాలకు యునైటెడ్ స్టేట్స్ ఎలాగో ఆసియాకు ఇండియా అలా కావడానికి ఎక్కువ దూరం లేదని అన్నాడు.

మౌంట్ బాటెన్‌తో కూడా మాట్లాడాను. కొంత అనధికారిక సంభాషణ నడిచింది.

మిగిలింది మూస చర్చ. విదేశీ వ్యవహారాల శాఖ కూడా నిర్వర్తిస్తున్న ఆర్థిక మంత్రి మోయిన్ నవాజ్ జంగ్ ఈ డెలిగేషన్‌లో సభ్యుడిగా మార్చి రెండవ తేదీ చర్చల్లో పాల్గొన్నారు. డెలిగేషన్‌కు నాయకుడిగా చర్చించి హైద్రాబాద్ తరపున యధాతథ ఒప్పందం చేసుకున్నారు. మౌంట్ బాటెన్, మీనన్ ఆయనను టార్గెట్ చేసుకున్నారు.

పాకిస్తాన్‌కు బదిలీ చేసిన సెక్యూరిటీలను ఆయన బహిర్గతం చేసి ఉండాల్సిందన్నారు. అందుకాయనను తప్పుపట్టారు. అందుకు మోయిన్ నవాజ్ జంగ్ సమాధానమిస్తూ తాను ఇండో హైద్రాబాద్ సంబంధాల మీద చర్చలకు వచ్చాను కానీ యధాతథ ఒప్పందానికి సంబంధం లేని హైద్రాబాద్ కార్యక్రమాలను వివరించడానికి కాదు అన్నాడు. హైద్రాబాద్ తన ధనాన్ని కామన్‌వెల్త్ దేశాలలో పెట్టుబడి పెడుతూ వచ్చిందని అది ఇప్పుడు కూడా కొనసాగుతుందని చెప్పాడు. మధ్యలో నేను కలుగజేసుకున్నాను. ఒకవేళ పాకిస్తాన్‌కు సెక్యూరిటీల సరఫరా ఒక్కటే ప్రతిబంధకమైతే ఇప్పుడున్న ప్రత్యామ్నాయం ఏమిటని మౌంట్ బాటెన్‌ను అడిగాను. పాకిస్తాన్ ఆ సెక్యూరిటీలను కరెన్సీలోకి మార్చుకుంటే యధాతథ ఒప్పందంలో కొత్త అధ్యాయం ప్రారంభమవుతుందన్నాడు మౌంట్ బాటెన్. పరస్పర సెక్యూరిటీ మార్పిడి ఐచ్ఛికంగా జరిగినందున ఇక ఆ విషయంలో వెనక్కి పోలేమని నా అభిప్రాయం. అయితే యధాతథ ఒప్పందం పూర్తయ్యేవరకు ఆ సెక్యూరిటీలను ఫ్రీజ్ చేయడమొక్కటే మిగిలింది. అది పాక్ ప్రభుత్వానికి అంగీకారమో కాదో తెలియదు. నేనే కరాచీ వెళ్లి అందుకు ప్రయత్నిస్తానని గవర్నర్ జనరల్‌కు చెప్పాను. ఇది చాలా రిస్క్‌తో కూడిన ప్రయత్నమని హైద్రాబాద్ ప్రతిష్ట, నా వ్యక్తిగత పలుకుబడి ప్రమాదంలో పడే అవకాశం ఉందనీ, అయినా ఇండో హైద్రాబాద్ సంబంధాలలో స్నేహం కోసం ఈ ప్రయత్నం చేస్తానని బాటెన్‌కు చెప్పాను. బాటెన్ తన కుర్చీలో ఎగిరి గంతేసి నేను హైద్రాబాద్‌కు, ఇండియాకు గొప్ప సేవ చేస్తున్నానని చెప్పాడు. ఆ పని చేస్తే ఇండో హైద్రాబాద్ సంబంధాలకు మార్గం సుగమమవుతుందన్నాడు. ఇది కాశ్మీర్ కోసం కాదు, ఇండియా ఇంతగా ఏ విషయానికీ పట్టుబట్టలేదు అని గుసగుసగా అన్నాడు.

ఈ ప్రతిపాదనతో అందరూ సంతృప్తి చెందారు, పటేల్‌తో సహా. కానీ వారి పానకంలో ఇంకా ఒక పుడక ఉండే ఉంది. అదేమిటని అడిగాను. హైద్రాబాద్ రాష్ట్రంలో ఇండియన్ కరెన్సీ వాడకంపై నిషేధం అన్నాడు బాటెన్. ఇది ఏ రకంగా ఇండియాను బాధిస్తుంది అన్నాను మీనన్‌తో. విశాలమైన భారతదేశంలో ఒక

చోటునుండి ఇంకొక చోటుకు పోయే భారతీయులు హైద్రాబాద్ గుండా ప్రయాణం చేయాల్సి వస్తుందని, అందువల్ల ప్రయాణపు భారతీయులు విచారణను ఎదుర్కోవలసి వస్తుందని మీనన్ చెప్పాడు. న్యాయమైన ప్రయాణికులను ఇందుకు మినహాయించితే సరిపోతుందా అని బాటెన్‌తో నేను అన్నాను. సరిపోతుందన్నారు బాటెన్, మీనన్. తదనుగుణంగా కరెన్సీ ఆర్డినెన్స్‌ను సవరిస్తామని మోయిన్ నవాజ్ జంగ్ ఒప్పుకున్నాడు.



అంతా అనుకున్నట్లు జరుగుతున్నట్లు అనిపించింది. మాంక్టన్, మౌంట్ బాటెన్‌లు ప్రత్యేకంగా సంతోషంగా కనిపించారు. యథాతథ ఒప్పందం పూర్తయ్యే వరకు హైద్రాబాద్ పాకిస్తాన్‌కు ఇచ్చిన సెక్యూరిటీలు ఎన్‌క్యాష్ కాకుండా చూడడం కోసం నేను చేసే ప్రయత్నమే మొత్తం వ్యవహారానికి ఇరుసుగా కనిపించింది.

ఈ చర్చల కాలంలో అటు హైద్రాబాద్‌లోనూ, ఇటు ఢిల్లీలోనూ పరిస్థితులు ఉద్విగ్నంగా కనిపించాయి. హైద్రాబాద్ ప్రధాని కరాచీ పర్యటన గురించి ప్రకటించినట్లయితే పెద్ద ఎత్తున ఊహాగానాలకు తెరలేచే అవకాశం ఏర్పడింది. ఆ పర్యటనను రహస్యంగా ఉంచడం అసాధ్యమే కాకుండా అది మరింతగా ప్రమాదకరం. హైద్రాబాద్ ప్రధాని కరాచీ పర్యటనను భారత ప్రభుత్వానికి ఒక సమాచారంగా చెబుదామనుకున్నాను. అయినా పత్రికలతో సమస్యే! ఎప్పటికీ సిద్ధంగా ఉండే మీనన్ మమ్మల్ని చింతపడవద్దని ధైర్యం చెప్పాడు. చాలా ఆశ్చర్యం గొలిపే విధంగా పని చేసి పెట్టాడు. నా ప్రకటన చాలా చిన్న విషయంగా, ఎలాంటి వ్యాఖ్యానాలు లేకుండా భారతీయ పత్రికలలో ప్రచురించబడ్డది. అక్కడి పత్రికలు ఎంతగా ప్రభుత్వాధీనంలో పనిచేస్తాయో చెప్పడానికి ఇదొక గొప్ప ఉదాహరణ.

జిన్నా, పాక్ ప్రధాని, ఇతర పెద్దలు ఫోన్లో సంప్రదించి, మరుసటిరోజే నాతో మాట్లాడేందుకు అవకాశమిచ్చారు. మార్చి 3న నేను కరాచీ వెళ్ళాను. నాతోపాటు హైదరాబాద్ అదనపు ఏజెంట్ జనరల్ యూసుఫ్ యార్‌జంగ్, ఒక ఎ.డి.సి, ఒక వ్యక్తిగత సేవకుడు మాత్రమే ఉన్నారు. గవర్నర్ జనరల్ నన్ను వ్యక్తిగత అతిథిగా ఆహ్వానించాడు. నేను చాలా సంతోషపడ్డాను. ఆయన నాకు మధ్యాహ్న భోజనానికి టైమిచ్చాడు. అందువల్ల ఒకరిద్దరు మంత్రుల్ని కలవడానికి తానొచ్చిన పని గురించి చెప్పడానికి అవకాశం దొరికింది. హైద్రాబాద్ మీద వాళ్ళకెంత ఇష్టం ఉన్నా సెక్యూరిటీల ఫ్రీజింగ్  అనేసరికి వాళ్ళు ఉత్సాహం చూపించలేదు. సెక్యూరిటీలను పాక్ లెక్కలోకి తీసుకుంది. నా ప్రయత్నం ఎంతో అసౌకర్యాన్ని కలిగించనుంది. మహానేత జిన్నాతో నా సంభాషణ విభిన్న తరహాలో సాగింది. ఇండియా పాక్‌ల మధ్య సుహృద్భావం ఏర్పడడానికి ఏది చేయడానికైనా సిద్ధమన్నాడు జిన్నా. ఆయన మంత్రుల అభిప్రాయం చెప్పి వారికి ఆ సెక్యూరిటీలను నిలుపుదల చేయడం సుతారమూ ఇష్టం లేదని చెప్పాను. అవి పాకిస్తాన్‌కు తక్షణావసరమని వాళ్ళు చెప్పారని చెప్పాను. హైద్రాబాద్ కోసం ఎంత చేసినా తప్పులేదని, విలక్షణంగా వేలు ఊపుతూ చెప్పాడు జిన్నా. అదే సాయంత్రం ప్రధాని, ఇతర మంత్రులతో సమావేశం ఏర్పాటు చేయబడింది. జిన్నా కూడా అందులో పాల్గొన్నాడు. కొంత చర్చ నడిచింది. చివరగా ఇండో హైద్రాబాద్ చర్చలు పూర్తయ్యే దాకా సెక్యూరిటీల ఎన్‌క్యాష్‌మెంట్ జరగదని ప్రకటించాడు. వారి ఆదరానికి కృతజ్ఞతలు చెప్పాను. హైద్రాబాద్ మీద పాక్‌కు ఉన్న ప్రేమ ఎంత మాత్రమూ ఈ సంఘటన వల్ల తగ్గగూడదని ఆశించాను. ఆ భయం అక్కర లేదని, హైద్రాబాద్ కోసం పాకిస్తాన్ ఎప్పుడు ఎలాంటి సహాయమైనా నిస్సంకోచంగా చేస్తుందని జిన్నా అభయమిచ్చాడు. దురదృష్టవశాత్తూ కాశ్మీర్ సమస్య వల్ల ఇండోపాక్ సంబంధాలు చెడిపోయి ఇండో హైద్రాబాద్ ఉద్రిక్తతలు సడలింపుకు సహాయపడలేక పోతున్నామని జిన్నా బాధపడ్డాడు. లేకపోతే ఒక స్నేహపూర్వక ఒడంబడిక కోసం రెండు పక్షాలకూ సహాయపడి ఉండేవాళ్ళం అన్నాడు.

భారత్ హైద్రాబాద్‌ల మధ్య వివాదపు ముడి విడిపోయింది. నాకు చాలా ఆనందం కలిగింది. జిన్నా చర్చల సందర్భంగా నన్ను అడిగాడు – సెక్యూరిటీల ఫ్రీజింగుతో నిజంగా ఇండో హైదరాబాద్‌ల సమస్య సమసిపోతుందా అని. ఆయన సందేహం గుర్తుంచుకోదగ్గదే. నాకూ సందేహాలున్నాయి కానీ అవునన్నాను. ఆ సంభాషణ అలా ముగిసిపోయింది. సమావేశమయ్యాక నా గదికి వెళ్ళాను. అలసటతో

కుర్చీలో ఒరిగాను. రెండు దేశాల రాజధానులలో ఎంత తేడా! ఇక్కడ విషయం మీద శ్రద్ధ, పూర్తి నిజాయితీ, చేతల్లో మాటల్లో వాస్తవికత, ఢిల్లీలో పైనుండి కిందిదాకా అనుమానం, భయం. ఇక్కడ ఆలోచిస్తే ఒక కొత్త దేశం, కొత్తగా ఏర్పడ్డ ప్రాథమికస్థాయి పరిపాలన, నిజమైన తక్షణ ఆర్థిక అవసరాల మధ్య హైద్రాబాద్‌కు సహాయం కోసం త్యాగం! అక్కడ ఢిల్లీలో అంతా హైద్రాబాద్ నుండి లాక్కోవాలనే!

చాలా రోజుల తర్వాత స్వేచ్ఛగా అనిపించింది. ఆర్థిక మంత్రి గులాం మహ్మద్ రాత్రి విందుకు ఆహ్వానించాడు. నా సహచరులు నన్ను వెళ్ళమన్నారు. లియాఖత్ అలీఖాన్, ఇతర మిత్రులు అక్కడ ఉన్నారు. రెండు వందల మిలియన్ల డబ్బు చేజారిందనే బాధ ఎవరిలోనూ కనిపించలేదు. చివరికి ఆర్థిక మంత్రిలో కూడా. వారందరిలో ఒకే ఆతృత కనిపించింది. ఇండో హైద్రాబాద్ సంబంధాలు బాగుండాలని, హైద్రాబాద్ తన సంప్రదాయాన్ని, సంస్కృతినీ అన్నింటికంటే ముఖ్యంగా తరతరాలుగా వస్తున్న మత సామరస్యం కలకాలం నిలువాలని. ఆ విందులో చాలామంది దౌత్య ప్రతినిధులు కూడా ఉన్నారు. వారిలో చాలామంది ఎప్పుడో ఒకప్పుడు హైదరాబాద్‌ను సందర్శించినవారే. అక్కడి తీపి జ్ఞాపకాలున్నవారే. నాకు పరిచయం చేయబడ్డ వాళ్లందరూ హైద్రాబాద్‌కు మంచి జరగాలని కోరుకున్నారు. నన్ను అదృష్టం వరించాలని కోరుకున్నారు.

అనుకున్న దానికన్నా ముందుగా పనిపూర్తి చేసుకున్న ఆనందంలో నేను గవర్నర్ జనరల్ ఇతర నాయకులతో కాశ్మీర్ విషయాన్ని ప్రస్తావించాను. మా మాటలు మధ్యాహ్నం మొదలై సాయంత్రం దాకా నడిచాయి. గులాం మహ్మద్‌తో కలిసి లియాఖత్ అలీఖాన్ వచ్చి జిన్నాతో నేను చేస్తున్న చర్చల్లో పాల్గొన్నారు. అర్ధరాత్రి దాటిందాక మా చర్చలు కొనసాగాయి. వెళ్లిపోబోతుండగా కొద్దిసేపు నన్ను ఆగమన్నాడు జిన్నా. మేం కింద కూర్చొని మరో రెండు గంటలు మాట్లాడుకున్నాం. ఐరాస ఆధ్వర్యంలో జమ్ము ఇండియాలో కలవాలని నేనన్నాను. కాశ్మీర్ అటు ఇండియాలో కలవాలా, ఇటు పాకిస్తాన్‌లో కలవాలా అనే దాన్ని ప్రజాభిప్రాయ సేకరణ తేలుస్తుంది. ప్రజాభిప్రాయ సేకరణ ఫలితాలు వచ్చేవరకు షేక్ అబ్దుల్లా, ఆజాద్ కాశ్మీర్ ప్రభుత్వాలు ఆయా ప్రాంతాలను పరిపాలించాలి. ఐరాస పరిశీలకుల ఆధ్వర్యంలో ఇండియా పాక్ సైన్యాలు వైదొలగాలని నేను సూచించాను. ఈ రెండు దేశాల సైన్యం కేవలం అంతర్గత శాంతి భద్రతలను చూసే అవశేషాలుగా మాత్రమే ఉండాలన్నాను. ఆ అవశేష సైన్యాల సంఖ్యను కూడా ఐరాస ఆధ్వర్యంలో నిష్పాక్షిక మిలటరీ నిపుణుల

చేత నిర్ధారించబడాలి. సుదీర్ఘంగా జరిగిన చర్చల్లో నేను ఇండియా పక్షం వహించడం చూసి జిన్నా, లియాఖత్ అలీఖాన్‌లు జమ్మూను వదిలేది లేదన్నారు. ఏది ఏమైనా ఇండియా పాక్‌లు నిజాయితీగా ఉంటే పరిష్కరించుకోగలిగిన విషయంగానే అనిపించింది నాకు.

జిన్నాతో వీడ్కోలు తీసుకుని నా గదికి వస్తుండగా లియాఖత్ అలీఖాన్, గులాం మహ్మద్‌లు నాకోసం ఎదురు చూస్తూ ఉండడం ఆశ్చర్యంగా అనిపించింది. మేం ముగ్గురం మళ్లీ కాశ్మీర్ మీదనే తెల్లారేదాకా మాట్లాడుకున్నాం. చివరగా గుడ్‌లక్ చెప్పి విశ్రాంతి కోసం వెళ్ళారు.

నేనూ ఓ గంట నిద్రపోయాను. పాక్ రాజధానిలో నేను మహా అంటే ఇరవై గంటలు గడిపాను. విమానాశ్రయంలో సిబ్బంది నా కరాచీ యాత్ర విజయాన్ని ప్రశ్నిస్తున్నట్లు అనిపించింది. శారీరకంగా అలసిపోయినా నాలో ఉత్సాహాన్ని అంతా గమనించారు. వాతావరణం బాగుందని కెప్టెన్ ప్రకటించాడు. కరాచీలో నాకు నిద్ర పోయే అవకాశమే పెద్దగా దొరకలేదు. విమానం ఎక్కగానే నిద్రలోని జారుకున్నాను. విమానపు శబ్దం జోకొడుతుండగా. ఢిల్లీలో దిగేందుకు విమానం చక్కర్లు కొడుతుండగా మెలుకువ వచ్చింది.

# 19. హైద్రాబాద్ ప్రతినిధి బృందం చాతుర్యం

ఢిల్లీ ఎయిర్‌పోర్టులో మావాళ్లు నా కోసం ఆతృతగా ఎదురు చూస్తున్నారు. నా సహచరులతో పాటూ పెద్ద సంఖ్యలో పాత్రికేయులు కూడా అందులో ఉన్నారు. నేనేం చెబుతానోనన్న ఆతృత అందరిలో కనిపించింది. సమాచార శాఖ నుండి వారికి కావలసినంత సమాచారం ఉన్నా నా ప్రయత్నపు ఫలితం పట్ల అంతా ఆసక్తి.

కరాచీకి వెళ్ళేముందు కాశ్మీర్ విషయం గురించి నెహ్రూ, పటేల్, మౌంట్‌బాటెన్‌తో కూడా మామూలుగా సంభాషించాను. వాళ్ళంతా కూడా ఆ సమస్య పరిష్కారానికి నా సేవలను ఆశించారు. ఢిల్లీకి వచ్చిన కొద్ది గంటల్లోనే, మార్చి 4న మౌంట్‌బాటెన్‌ను కలిశాను. యధాతథ ఒప్పందం సమయంలో హైద్రాబాద్ ఇచ్చిన సెక్యూరిటీలను ఎన్‌క్యాష్ చేయకుండా ఉండేందుకు పాక్ అంగీకరించినందుకు ఆయన మహదానంద పడ్డాడు. ఆ సెక్యూరిటీలు విడుదలైతే భారత మార్కెట్‌లో ఏర్పడే ప్రతికూల పరిణామాల పట్ల భారత ప్రభుత్వం చాలా ఆందోళనగా ఉండిందని ఆయన చెప్పాడు. దీనివల్ల, హైద్రాబాద్ కరెన్సీ ఆర్డినెన్సును సవరిస్తామన్న మోయిన్ నవాజ్‌జంగ్ హామీ వల్ల భారత్ నుండి హైద్రాబాద్‌కు వస్తు సరఫరాలో ఏర్పడ్డ ప్రతిష్టంభన తొలగిపోతుందని, భారత సముద్ర తీరాల్లో నిలిచిపోయిన హైద్రాబాద్ సరుకులు స్వేచ్ఛగా హైదరాబాద్‌కు చేరగలుగుతాయని, హైద్రాబాద్ కోరుకున్న విధంగా ఆయుధాలు, మందుగుండు

విడుదల అవుతాయని, యధాతథ ఒప్పందంలోని బాధ్యతలన్నీ నెరవేర్చబడతాయని ఆయనలో నమ్మకం ఏర్పడింది.

అప్పుడు నేను కాశ్మీర్ విషయంలో పాక్ నాయకుల వైఖరి చెప్పాను. నా ప్రతిపాదన, అది ఏ రకంగా రెండు ప్రభుత్వాల మర్యాదను కాపాడుతుందో చెప్పాను. కాశ్మీర్‌లో ఉన్న పాకిస్తాన్ ట్రూపుల ఉపసంహరణకు భారత్ పట్టుబడుతుండడం వల్ల ప్రజాభిప్రాయ సేకరణ సాధ్యం కాకపోవచ్చునని ఆయన అన్నాడు. అయితే నా ప్రతిపాదనను భారత నాయకులకు వివరించి వారి స్పందన చెబుతానని బాటెన్ హామీ ఇచ్చాడు. చాలా రోజుల తర్వాత మంచి వాతావరణం ఏర్పడబోతున్న ఈ తరుణంలో భారత నాయకులెవ్వరితోనూ కాశ్మీర్ గురించి నన్ను మాట్లాడవద్దని సలహా ఇచ్చాడు. తర్వాత నా ప్రతిపాదనను భారత నాయకులతో చర్చించి వారందుకు నిరాకరించారని చెప్పాడు. హైద్రాబాద్ క్షేమం దృష్ట్యా నన్ను కాశ్మీర్ విషయం మర్చిపొమ్మని చెప్పాడు. జమ్మూ విషయంలో ఒక ఒప్పందం భారత్ చేసుకుంది (దాన్ని అమలు పరచలేదు) కానీ ఎంతో ఆస్థినష్టం, ప్రాణనష్టం జరిగాక.

నేను కరాచీ నుండి తిరిగి వచ్చాక ఢిల్లీ, హైద్రాబాద్ ప్రతినిధుల మధ్య మౌంట్‌బాటెన్ అధ్యక్షతన ఒక సమావేశం జరిగింది. నిజానికి అదొక్కటే సహృద్భావంతో జరిగిన సమావేశం. అందులో నన్ను అభినందించి యధాతథ ఒప్పంద బాధ్యతలన్నీ భారత్ నెరవేరుస్తుందని చెప్పాడు. సెక్యూరిటీలు, కరెన్సీ ఆర్డినెన్స్ విషయంలో హైద్రాబాద్ అనుకున్న విధంగా వ్యవహరించినందున సరుకు రవాణా, ఆయుధ సరఫరా కొనసాగుతుందని స్పష్టం చేశాడు. సరిహద్దు దాడుల్ని, హైద్రాబాద్ వ్యతిరేక ప్రచారాన్ని కట్టడి చేసేందుకు ప్రభుత్వం కూడా ఒప్పుకుంది. ఎదుటిపక్షం అభిప్రాయాలిన గౌరవిస్తూ ఒప్పందాన్ని అమలు పరచుకోవాలని తీర్మానింపబడ్డది. ఒప్పందం వివరాలను మాంక్‌టన్ రాసిన విధంగా పత్రికలకు విడుదల చేయాలని రెండు పక్షాలు ఒప్పుకున్నాయి.

అప్పటి పరిస్థితుల దృష్ట్యా ఆయుధ సరఫరా విషయం పత్రికా ప్రకటన నుండి తొలగించాలని భారత్ కోరింది. నేను అందుకు ఒప్పుకున్నాను. చాలా సంతోషంగా మా సమావేశం ముగిసింది. పరస్పర అభినందనలు చెప్పుకున్నాం. ఇండో హైద్రాబాద్ సంబంధాలలో కొత్త అధ్యాయం మొదలయిందని అందరం ఒప్పుకున్నాం.

అయితే మా ఆనందం ఎక్కువ సేపు నిలువలేదు. అనుకున్నవిధంగా రెండు

ప్రభుత్వాల తరపున జారీచేయడానికి మాంక్‌టన్ ప్రకటన సిద్ధం చేశాడు. ఆ ప్రకటన ఇలా ఉంది.

"గత కొద్ది రోజులుగా ఘనత వహించిన గవర్నర్ జనరల్ గారి అధ్యక్షతన భారత్, హైద్రాబాద్ ప్రభుత్వాల ప్రతినిధుల మధ్య చర్చలు జరిగాయి. స్నేహపూర్వక వాతావరణంలో జరిగిన ఈ చర్చల్లో అనేక విషయాలు పరిష్కారమయ్యాయి.

యథాతథ ఒప్పంద సమయంలో హైద్రాబాద్ సెక్యూరిటీలను మార్కెట్‌లోకి విడుదల చేయకుండా పాక్‌ను కోరడానికి హైద్రాబాద్ ప్రభుత్వం అంగీకరించింది. హైద్రాబాద్‌లో ప్రయాణించే భారతీయుల సౌకర్యం కోసం ఎలాంటి పెనాల్టీ లేకుండా భారతీయ కరెన్సీ హైద్రాబాద్‌లో మారకం జరిగే విధంగా ఇటీవలి కరెన్సీ ఆర్డినెన్సును సవరించేందుకు కూడా హైద్రాబాద్ ఒప్పుకోవడం జరిగింది. హైద్రాబాద్‌లోకి దిగుమతులపై ఉన్న పరిమితుల్ని తొలగించేందుకు భారత్ ఒప్పుకుంది. వాహనాలు, యంత్రసామాగ్రి, ఇతర వస్తువులు ఇక స్వేచ్ఛగా హైద్రాబాద్‌కు దిగుమతి అవుతాయి. ఇతర విషయాలన్నీ రెండు ప్రభుత్వాలు సహృద్భావంతో పరిష్కరించుకుంటాయి".

గవర్నర్ జనరల్‌గారి కార్యదర్శి ఎర్స్‌కిన్ క్రుమ్ రికార్డు చేసిన మినట్స్ ద్వారా జాగ్రత్తగా డ్రాఫ్టు రాయబడ్డది. ఆయన మాంక్‌టన్ రాసిన ముసాయిదాను చూసి కచ్చితత్వంతో ఉందని నిర్ధారించాడు కూడా. ఆయుధాలకు సంబంధించిన అంశం భారత్ కోరిక మేరకు జాగ్రత్తగా తొలగించబడ్డది. దాన్ని మాంక్‌టన్ నాకు చూపించాడు. తక్కువ మాటల్లో మంచి ఉత్తేజం వచ్చేలా,ఇండో హైద్రాబాద్ సంబంధాలకు తెరిచిన కొత్త పుటలా ఉందని అన్నాను. నా మాటల్ని పట్టించుకోకుండా చాలా జాగ్రత్తగా రాస్తే మంచిదన్నాడు. నేను ఔనన్నాను. ప్రకటన ముసాయిదా భారత ప్రభుత్వ ఆమోదం కోసం మీనన్‌కు పంపించబడింది. నా సహచరులకు పంపించబడింది. తెల్లారితే హైద్రాబాద్ వెళ్లిపోవడానికి నేను తయారవడం మొదలుపెట్టాను.

హైద్రాబాద్ ఏజెంట్ జనరల్ ఆ రాత్రి మంచి విందు ఏర్పాటు చేశాడు. భారత మంత్రుల్ని, విదేశీ రాయబారుల్ని విందుకు ఆహ్వానించాడు. నెహ్రూ రావడానికి నిరాకరించాడు. ఇతర మంత్రులు వస్తామన్నారు. హైద్రాబాద్ హౌస్‌లో ఉత్సాహపూరిత వాతావరణం నాట్యమాడింది. నిరంతర కార్యభారంతో తలమునకలైన సిబ్బంది విశ్రాంతిగా, ఆటవిడుపుగా భావించారు. మీనన్ దగ్గరికి ముసాయిదా ప్రకటన తీసుకువెళ్ళిన కార్యదర్శి రాక ఆలస్యమయ్యేసరికి ఏమై ఉంటుందా అని నాలో ఆలోచన

మొదలయింది. చాలా మంది అతిథులు వచ్చాక కార్యదర్శి వచ్చాడు. దూరం నుంచే చాలా ఆందోళనగా కనిపించాడు. పక్కకి పిలిచి విషయమేమిటని అడిగాను. వ్యవహారం ఏమీ బాగాలేదన్నాడు. ముసాయిదాలో మీనన్ కొన్ని మార్పులు చేసి ఉప ప్రధాని పటేల్‌కు ఇచ్చాడని, పటేల్ కొన్ని మార్పులు చేసి నెహ్రూకు ఇచ్చాడని, నెహ్రూ దాన్ని సమూలంగా మార్చివేశాడని, ఇప్పుడు దానిమీద సంతకం పెట్టడం హైదరాబాద్‌కు చాలా నష్టమని చెప్పాడు. అది మినట్స్ ప్రకారం రాసిన డ్రాఫ్టు అని చెప్పాను. ఇదంతా వాళ్లకు చెప్పానని కానీ ప్రకటన ఉంటే ఇప్పుడు దద్దిన ప్రకారం ఉండాలి, అలా ఉండకపోతే ప్రకటనే అవసరం లేదని వాళ్ళు అన్నారని కార్యదర్శి నాతో చెప్పాడు.

ఈ అనూహ్య సంఘటన నన్ను బాధించింది. డ్రాఫ్టులో పదాలు మారలేదు. స్వభావంలో మార్పు వచ్చింది. మాంక్‌టన్‌ను, ఇతర మంత్రుల్ని పిలిచి నెహ్రూ చేసిన మార్పుల్ని సరిచేసి తిరిగి మీనన్‌కు పంపించాను. ఇన్ని రోజుల శ్రమ కొన్ని పదాలతో మారిపోయినందుకు బాధపడ్డాం. మన మనుగడకు ప్రమాదం లేనంత వరకు భారత ప్రధాని ఆదేశాలను ముసాయిదాలో చేర్చి ప్రకటన తయారు చేయమని మాంక్‌టన్‌కు చెప్పాను. కానీ భారత నియంతలు వాళ్ళు మార్పులతో చేసిన ప్రకటనను ఇసుమంత కూడా తిరిగి మార్చడానికి ఒప్పుకోలేదు. నెహ్రూ రాసిన ప్రకటన ఉంటుందని, లేదా ప్రకటనే ఉండదని మాకు కచ్చితంగా చెప్పారు. ఏ ప్రభుత్వమూ వాళ్ళ ప్రజలకు మొఖం చూపించలేని ఒప్పందాలపై సంతకం పెట్టలేదని తెలిసీ నెహ్రూ అందుకోసం పట్టుబట్టాడు. నెహ్రూ మార్చిన ప్రకటన ఇలా ఉంది.

"గవర్నర్ జనరల్ అధ్యక్షతన భారత, హైద్రాబాద్ ప్రభుత్వాలు గత కొద్ది రోజులుగా చర్చలు జరిపాయి. చర్చలు పూర్తికాలేదు. ఈ మాసాంతంలో హైద్రాబాద్ బృందం తిరిగి ఢిల్లీ వచ్చాక చర్చలు కొనసాగుతాయి.

ఇదిలా ఉండగా హైద్రాబాద్ పాకిస్తాన్‌ల మధ్య మార్పిడి అయిన సెక్యూరిటీలను యధాతథ ఒప్పందం పూర్తయ్యేవరకు ఎన్‌క్యాష్ కాకుండా చూసేందుకు హైద్రాబాద్ అంగీకరించింది. భారత ప్రభుత్వంతో సంప్రదించి కరెన్సీ ఆర్డినెన్స్‌లో సవరణ తెచ్చేందుకు కూడా హైద్రాబాద్ అంగీకరించింది.

యధాతథ ఒప్పందానికి సంబంధించిన ఇతర అంశాలపై సుహృద్భావ వాతావరణంలో, పరస్పర సంప్రదింపుల ద్వారా రెండు ప్రభుత్వాలు సమస్యల పరిష్కారానికి ప్రయత్నిస్తాయి".



స్నేహశీల వాతావరణంలో చర్చలు జరిగాయన్న మాటను కూడా ప్రకటనలో ఉంచదలుచుకోలేదు భారత ప్రధాని. హైద్రాబాద్ అంగీకారాలన్నీ రాశారు కానీ భారత్ అంగీకారం ఒక్కటి కూడా రాయలేదు – సుహృద్భావ వాతావరణంలో, పరస్పర సంప్రదింపుల ద్వారా రెండు ప్రభుత్వాలు పని చేస్తాయని తప్ప. దీనంతటికీ వెనక ఏముంది? ఏది ఉన్నప్పటికీ ఒకటి మాత్రం ఉంది. సూటిగా చెప్పలేక పోవడం, నిజాయితీగా లేకపోవడం. సంయుక్త ప్రకటనలో మార్పులకు కారణం తొందరలోనే తెలిసివచ్చింది. ఎంత ప్రయత్నించినా భారత ప్రధాని ప్రకటన మారలేదు. ఆ ప్రకటనలో భాగస్వామి కావడానికి నేను ఒప్పుకోలేదు. చివరగా ఏ ప్రకటనా జారీ కాలేదు.

మౌంట్‌బాటెన్, మీనన్, హైద్రాబాద్ ప్రతినిధుల ప్రయత్నాలు నిష్ఫలమైనందుకు నెహ్రూ, పటేల్ చాలా ఆనందించారు. పాపం! మౌంట్‌బాటెన్ మీనన్‌లు తర్వాత కాలంలో చర్చల్లో చాలా ఇబ్బందికర పరిస్థితిని ఎదుర్కొన్నారు. అధ్యక్షత వహించడం తప్ప ఈ వ్యవహారంలో మౌంట్‌బాటెన్ చేసేదేమీ లేదని మాంక్‌టన్ తేల్చి వేశాడు. నిజంగా ఆయన నెహ్రూకు కానీ పటేల్‌కు కానీ ఒక్క మాట కూడా చెప్పలేదు.

నిజాయితీగానీ చిత్తశుద్ధిగాని లేని భారత నాయకులతో ఇబ్బందులను ఎదుర్కొంటూ భారత పక్షం వహించడం కంటే ఆయన తప్పుకుంటే గౌరవప్రదంగా ఉండేదని అనుకున్నారు చాలామంది. ఆయనకు మాత్రమే తెలిసిన కారణాల వల్ల ఏమీ చేయలేని పనులలో కూడా ఆయన భాగస్వామి అయ్యాడు. తన దేశీయుడి స్థితికి మాంక్టన్ జాలిపడ్డాడు. నా వరకు నేను బాటెన్ లేకుండానే ఇండియాతో చర్చలు మేలని భావించాను.

బయట ఏం జరుగుతుందో తెలియకుండా విందు గడిచిపోయింది. అందరిలో కలిసి నవ్వడానికి నేను ప్రయత్నించాను. ఎప్పుడూ లేని విధంగా ఏకాంతం దొరికితే బాగుండుననిపించింది. హైద్రాబాద్ రాజకీయ గతిని మలుపుతిప్పింది మార్చి 4. ఒకవైపు అంతా బాగానే ఉన్నట్లు, ఇండో హైద్రాబాద్ సంబంధాలు కొత్తగా మొగ్గ తొడుగుతున్నట్లు అనిపిస్తుంది. రాత్రి కాగానే పరిస్థితి మారిపోయినట్లు అనిపించింది. హైద్రాబాద్ ఏమి చేయగలదో చూద్దామని వేసిన ఎత్తుగడా అనిపించింది. ఒకవేళ అదే నిజమైతే డ్రామాను చాలా జాగ్రత్తగా ముగించి హైద్రాబాద్ తెలివితో బయటపడ్డదని అనిపించింది. హైద్రాబాద్ అన్ని ప్రయత్నాలు చేసింది. భారత్ మాత్రం ఒప్పుకున్న ఏ ఒక్కటీ నిర్వర్తించలేకపోయింది.

# 20. సరిహద్దుల్లో చేజారిన పరిస్థితులు

హైదరాబాద్‌లోని ఇతరులందరిలాగానే ఆందోళనతో ఏజెంట్ జనరల్ మున్షీ ఢిల్లీకి వెళ్ళిన బృందం రాక కోసం ఎదురు చూస్తున్నాడు. ముఖ్యమైన ప్రతి సందర్భంలోనూ తనను దూరం పెట్టడాన్ని జీర్ణించుకోలేక కోపంతో ఉడికిపోతున్న మున్షీ తను లేని ప్రతి చర్చా విఫలం కావాలని కోరుకున్నాడు. ఆయన కోరిక నెరవేరింది. నేను రాగానే ఆనందంతో నన్ను కలిశాడు. ఇండో హైద్రాబాద్ చిక్కుముడిని తాను తప్ప ఎవరూ పరిష్కరించలేరని, అందుకే స్వయంగా గాంధీయే తనను నియమించారని గొప్పలు చెప్పుకున్నాడు. అసలు పరిష్కారం పదిమైళ్ళ దూరంలో ఉన్న 'దక్షిణ సదన్'లో ఉండగా పదేపదే ఢిల్లీకి రావడమూ పోవడమూ వృధాప్రయాస అని తాను ఇది వరకే చెప్పానని గుసగుసలాడాడు. మార్చి 4న ఢిల్లీలో సంయుక్త ప్రకటన తయారవుతుందని తెలియగానే తాను ఢిల్లీకి మాట్లాడానని, అలాంటి సంతకాలేమైనా జరిగితే తాను తక్షణం రాజీనామా చేస్తానని, అది ఢిల్లీ ప్రభుత్వ పునాదుల్ని కదిలిస్తుందని హెచ్చరించానని చెప్పాడు మహాగర్వంతో ఊగిపోతూ. తన మాట ఈ విషయంలో వేదవాక్కని దాన్ని అతిక్రమించలేరని, అప్పటి నుండే ఢిల్లీలో పరిణామాలు వేగంగా మారి ప్రకటన హైద్రాబాద్ బృందం సంతకం చేయలేని విధంగా మారిపోయిందని విజయగర్వంతో చెప్పాడు. చాలా చిద్విలాసంగా నవ్వుతూ ఇప్పుడు మనం ఇండో హైద్రాబాద్ సంబంధాలను సరికొత్తగా మొదటినుండి ప్రారంభిద్దామని చెప్పాడు.

పరిస్థితి గందరగోళంగా మారింది. ఇక్కడి దక్షిణ సదన్ మిత్రుడు టెలిఫోన్ తీగల ద్వారా ఢిల్లీ మంత్రి వర్గాన్ని, గవర్నర్ జనరల్‌ను ఇంతగా ప్రభావితం చేయగలడని

నేను ఏమాత్రం పసిగట్టలేకపోయాను. ఢిల్లీలో రాజకీయాలు ఎంత సంక్లిష్టమైనవంటే ప్రతి ఒక్కరూ ఇంకొకర్ని చూసి భయపడతారు. ఎవరు అసెంబ్లీలో దాడి చేస్తారో, ఎవరు పత్రికాముఖంగా దాడి చేస్తారో ఎవరూ చెప్పలేరు. ఒక ప్రత్యేక సందర్భంలో ఆలిండియా రేడియో, భారత పత్రికలు చేసిన ప్రచారం ఎంత వరకు పోయిందంటే సామాన్య ప్రజల దృష్టిలో హైద్రాబాద్ ఒక భూతంగా మారిపోయింది. హైద్రాబాద్‌కు వ్యతిరేకంగా ఏది చెప్పినా నమ్మే పరిస్థితికి ప్రజలు చేరుకున్నారు. అందువల్ల మున్షీ ప్రయత్నం ఫలించడంలో ఆశ్చర్యంలేదు. మున్షీ ప్రతిపాదించినట్లు ఆయనతో చర్చలు ఆరంభించడానికి నేను ఎంతమాత్రం ఆసక్తి చూపలేదు కానీ మోయిన్ నవాజ్ జంగ్ మాత్రం ఒక ప్రయత్నం చేస్తే మంచిది అన్నాడు. మున్షీతో చర్చలు వృధా అని నిజాం అభిప్రాయం. నిజానికి మేం ఢిల్లీ నుండి వచ్చినప్పుడు ఢిల్లీ నాయకుల ప్రవర్తన విని పెద్దగా ఆశ్చర్యపోలేదు నిజాం. ఆయన ఆశ్చర్యపోయింది ఒక్క మౌంట్ బాటెన్ ప్రవర్తనతోనే. కొంత ఆలోచించి బాటెన్‌కు వ్యక్తిగతంగా లేఖ రాయాలని నిర్ణయించు కున్నాడు. అందులో ఇండియాకు హైద్రాబాద్‌కు మధ్య వివాదాన్ని యధాతథ ఒప్పందంతో పరిసమాప్తి చేయడానికి ఆయన పలుకుబడిని ఉపయోగించ వలసిందిగా ఆ లేఖలో బాటెన్‌ను కోరాడు నిజాం. 'ఈ లేఖలో కోరిన సహాయం చేసినట్లయితే మా ప్రధాని చెప్పినట్లు ఇంకే విధంగా రెండు దేశాల మధ్య అనుమానపు తెరలు రాకుండా హైద్రాబాద్ చూసుకుంటుంది' అని లేఖ ముగించాడు.

మున్షీతో ప్రధానంగా మోయిన్ నవాజ్‌జంగ్ చర్చించాడు. నేను అప్పుడప్పుడు పాల్గొన్నాను. ముఖ్యమైన విషయాల మీద అవగాహనకు రావడానికి కొన్ని రోజులు పట్టింది. చర్చల తర్వాత ఒక డ్రాఫ్టు తయారైంది. సంతకాలు చేసే స్థాయికి వచ్చింది. ఒకరోజు సాయంకాలం భోజనం అయ్యాక నేనూ, మున్షీ దక్షిణ్ సదన్‌లో దానిపై సంతకాలు చేశాం. మున్షీ చాలా సంతోషంలో ఉన్నాడు. భవిష్యత్ ఇండో హైద్రాబాద్ సంబంధాలకు పునాది వేశానని నమ్మాడు. నిజానికి అవి రెండు ప్రభుత్వాలు ఆమోదం పొందవలసి ఉన్నవి. కానీ తాను వచ్చిన అవగాహనపై ఢిల్లీని ఒప్పించగలనని ఆయనకు గట్టి నమ్మకం ఉంది. మరుసటి రోజు ఆత్మ విశ్వాసంతో, విజయం సాధించాననే గర్వంతో ఆయన ఢిల్లీకి పయనమయ్యాడు. చివరికి మోయిన్ నవాజ్ జంగ్ ఏదో స్పష్టత వచ్చిందని సంతృప్తి చెందాడు. గత అనుభవాల వల్ల నాలో అనుమానాలున్నాయి కానీ మంచి జరగాలని ఆశించాను. ఒక్క నిజాంకు మాత్రం ఏమీ జరగదని తెలుసు.

సరిహద్దుల్లో శాంతి భద్రతలు క్షీణించాయి. అధునాతన ఆయుధాల ద్వారా రోడ్డు, రైలు సమాచార వ్యవస్థల్ని తిరుగుబాటుదారులు విచ్ఛిన్నం చేయడం వల్ల పరిపాలనలో ఆందోళన మొదలయింది. సైన్యం ఉన్న చోట్ల పరిస్థితి బాగుండేది. కాని మిగతా చోట్ల పరిస్థితి తిరుగుబాటుదారుల దయ మీద ఆదారపడేది. అన్ని ప్రాంతాల నుండి ఆయుధాల డిమాండ్ పెరిగిపోయింది. జిల్లా అధికారుల సమావేశాలలో తాము సరియైన ఆయుధాలు లేకపోవడంతో పరిపాలనలో ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని వాపోయేవారు.

సివిల్, పోలీసు అధికారుల వాదన సరియైందే. మాకు ఆయుధాలైనా ఇవ్వండి లేదా మమ్మల్ని రిలీవ్ చేసి సైన్యాన్నైనా నియమించడండి అని పోలీసు అధికారులు కోరేవారు. హైద్రాబాద్‌కున్న కొద్దిపాటి సైన్యంతో రెండు వేలమైళ్ళ సరిహద్దును కాపలా కాయడం సాధ్యమయ్యే పని కాదు. ఇక మిగిలిన ఒకే ఒక ప్రత్యామ్నాయం – ఎంతో కొంత ఆయుధాలు, మందుగుండు సరఫరా చేసి తిరుగుబాటుదారులను నిలువరించేందుకు పోలీసులను సమాయత్త పరచడం.

1947 మధ్య కాలంలో నేరుగా ఆయుధ దిగుమతి అవకాశాల గురించి హైద్రాబాద్ ఆలోచించింది. బ్రిటీష్ వాళ్ళు భారత్‌ను వదలడానికి ముందు కాంగ్రెస్ ఆధ్వర్యంలోని ప్రభుత్వాలు భారత భూభాగాల నుండి హైద్రాబాద్‌కు రావలసిన మందుగుండును సూత్రప్రాయంగా వ్యతిరేకించేవికావు. ఒకవేళ మందుగుండు ఇక్కడ లభించనట్లయితే విదేశీ దిగుమతులపై ఆంక్షలుండేవి కావు. అయితే కార్యక్షేత్రంలో పట్టు సంపాదించి ఆయుధ సరఫరాను, సరుకు రవాణాను అడ్డుకోవడం మొదలుపెట్టారు. దార్లో వ్యాగన్లు మాయమై పోయేవి. పూర్తి భూ సరిహద్దు రాష్ట్రమైనందున ఇండియాకు తెలియకుండా మందుగుండు వచ్చే సమస్యే లేదు. నేను ప్రధానిగా బాధ్యతలు చేపట్టినప్పుడు ఎల్–ఎండ్రూస్ యూరప్ నుండి ఆయుధాలు తెప్పించడం కోసం తీవ్ర ప్రయత్నాలు చేస్తూ ఉన్నాడు. అతన్ని వెంటనే వెనకకు రమ్మన్నాను. అతని తిరుగు ప్రయాణంలో బొంబాయిలో విమానం దించమన్నారు. భారత భూభాగం నుండి నేరుగా హైద్రాబాద్ విమానాల అనుమతి లేదన్నారు. ఆయన విమానాన్ని బొంబాయిలో పూర్తిగా పరిశీలించి యుద్ధ సామాగ్రి ఏమీ లేదని నిర్ధారించుకున్నారు. అదే సందర్భంలో హైద్రాబాద్ ఆయుధాల్ని దిగుమతి చేసుకుంటుందని పత్రికలలో దుష్ప్రచారం సాగించారు.

చివరకి నెహ్రూ కూడా ఒక సందర్భంలో హైద్రాబాద్ ఆయుధాల్ని దిగుమతి చేసుకుంటున్నట్లు నివేదికలున్నాయని విమర్శించే స్థితికి వచ్చాడు. హైద్రాబాద్‌కు తీసుకుని పోబడుతున్న ఆయుధాల్ని భారత అధికారులు జప్తు చేసినట్లుగా కూడా ప్రకటించాడు! హైద్రాబాద్ ఒక తుపాకీకానీ, ఒక్క తూటాకానీ కొనుగోలు చేయకుండానే ఈ ప్రచారమంతా జరిగిపోయింది. హైద్రాబాద్‌కు రవాణా జరుగుతుండగా జప్తు చేసిన ఒక్క ఆయుధాన్ని చూపిస్తారా అని నేను నెహ్రూను ఒకసారి సవాలు చేశాను. నెహ్రూ జవాబివ్వలేదు, ఒడుపుగా మాట మార్చాడు.

ఈ దుష్ప్రచారానికి వ్యతిరేకంగా ఏదైనా చేయాలి. రాష్ట్రాల మంత్రిత్వశాఖ సూచన మేరకు రక్షణశాఖ కొన్ని వందల రైఫిళ్లు, కొంత మందుగుండు హైద్రాబాద్‌కు సరఫరా చేయనున్నట్లు చేసిన అస్పష్ట వాగ్దానాన్ని హైద్రాబాద్ ఏజెంట్ జనరల్ నాకు తెలియజేస్తూ వచ్చాడు. ఒకవైపు తిరుగుబాట్లను సరిహద్దుల వద్ద ప్రోత్సహిస్తూ మరోవైపు హైద్రాబాద్‌కు ఆయుధ సరఫరా చేస్తామని చెప్పడంలో ఆంతర్యం నాకు అర్థం కాలేదు. పేరు కోసం కొంత సరఫరా చేస్తారేమో అనుకున్నాను, కానీ అది కూడా జరగలేదు.

పరిస్థితి చేయిదాటి పోతున్నట్లు అనిపించింది. సరిహద్దు దాడులను, చొరబాట్లను నిలువరించలేకపోతే తొందరలోనే శాంతిభద్రతల పేరు మీద భారతదేశం కలుగ జేసుకోవడానికి అవకాశం ఇచ్చినట్లవుతుంది. అంతర్గత శాంతిని కాపాడడానికైనా కచ్చితంగా కొన్ని ఆయుధాలు కావలసిందే. దానికి రెండు మార్గాలున్నాయి. ఒకటి విదేశాల నుండి భారత భూభాగంలో ఆగకుండా దిగుమతి చేసుకోవడం, రెండు వీలయినన్ని ఆయుధాలు ఇక్కడే తయారు చేసుకోవడం. ఆ రెండు ప్రయత్నాలు చేయాలని నేను నిర్ణయించాను.

దిగుమతి చేసుకుంటే ఎలాంటి ఆయుధాలు కావాలి అనే చర్చ వచ్చింది. ఇంకో మాటలో చెప్పాలంటే అంతర్గత శాంతి భద్రతలను చక్కదిద్దడానికి పనికొచ్చే ఆయుధాలా? సరిహద్దు దాడుల్ని నిలువరించగలిగేందుకా? లేక పరిస్థితి అంతదాకా వస్తే ఇండియాతో తలపడేందుకా? అందులో ఏకాభిప్రాయం రాలేదు. హైద్రాబాద్ మీద దాడి చేసేంత తెలివి తక్కువ నిర్ణయం భారత్ తీసుకోదని నా వ్యక్తిగత అభిప్రాయం. భారత్ కొత్తగా జన్మించిన స్వతంత్రదేశం. అది అంతర్జాతీయ స్థాయి పొందవలసి ఉంది. హైద్రాబాద్‌ను రెండవ కాశ్మీరు చేయడానికి అదెంత మాత్రం సాహసం చేయదని నా ఉద్దేశ్యం. పైగా కాశ్మీర్‌కు, హైద్రాబాద్‌కు చాలా తేడా ఉంది. అక్కడ ఇండియా పాక్‌ల మధ్య పోరాటం. కాశ్మీర్ విషయంలో భారత్‌ది జాతీయ పరువుకు



సంబంధించిన సమస్య.

భారతీయుల హృదయానికి తెలుసు – హైద్రాబాద్ భారత పరువును దేశీయంగా కానీ అంతర్జాతీయంగా కానీ తగ్గించలేదు, తగ్గించదు కూడా. హైద్రాబాద్ భౌగోళికంగా, ఇతర అంశాలలో కూడా భారత్‌పై ఆధారపడి ఉంటుంది, కాబట్టి దుందుడుకు చర్యల అవసరమే లేదు. ఈ కారణాల వల్ల ఇండియా అంతర్జాతీయ అభిప్రాయాన్ని తోసిరాజని హైద్రాబాద్ మీద దాడి చేస్తుందని అనుకోవలసిన పని లేదని నా అభిప్రాయం. ఒకవేళ అలాంటి దాడే జరిగితే ఒప్పందాలకు భాగస్వామి అయిన బ్రిటన్ గుడ్డిగా చూస్తూ ఊరుకోదు. అందువల్ల నా అభిప్రాయం ప్రకారం సరిహద్దు దాడుల్ని నిలువరించడం, అంతర్గత శాంతి భద్రతలు కాపాడడం కోసమే ఆయుధాలను దిగుమతి చేసుకోవాలి. ఈ నిర్ణయం వల్ల ఆయుధాల అవసరం కూడా చాలా తగ్గిపోయింది. ఆ నిర్ణయానుసారం లండన్, కరాచీలలో ఉన్న ఏజెంట్ జనరల్‌కు ఆయుధ కొనుకోలు అవకాశాలను పరిశీలించమని వర్తమానం పంపాం. పదిహేను నుండి ఇరవై వేల రైఫిళ్ళు, ఏడెనిమిది వేల టామీ లేక స్టెన్ గన్‌లు, నాలుగైదు మిలియన్ రౌండుల మందుగుండు కావాలని చెప్పాం. రవాణా ప్రత్యామ్నాయాలను,

నేరుగా హైద్రాబాద్ సరఫరాకు ఆలోచించమని కూడా వారికి చెప్పాం.

చిన్న చిన్న ఆయుధాల తయారీకి ప్రయత్నాలు ప్రారంభించాం. ఇంతకుముందే భారత పత్రికలు, హైద్రాబాద్ రాష్ట్రం ఆయుధాల తయారీలో మునిగిపోయిందని ప్రచారం చేశాయి. ఆర్మీ కమాండర్‌ను, ఆర్డినెన్స్ అధికారులను 303 రైఫిళ్ళు ఇతర ఆయుధాల తయారీ గురించి అడిగాను. వాళ్లు ఉత్సాహంతో ముందుకు వచ్చారు. కానీ వాస్తవానికి దూరంగా, అనుభవ రాహిత్యంగా కనిపించారు. అందువల్ల వారికి ఇంజనీరింగు, సాంకేతిక వనరులను సమకూర్చాను. అది కమాండరుకు శక్తికి మించిన పని అనిపించింది. అందువల్ల నా ఆధ్వర్యంలో దాన్ని నిర్వహించడానికి నిర్ణయించుకున్నాను. డిజైన్‌ను సరళీకరించడానికి ప్రయత్నించాను. మొదట పోలీసులకు, పౌర రక్షకుల కోసం తక్కువ సామర్థ్యం కలిగిన ఆయుధాలను ఎక్కువ సంఖ్యలో ఉత్పత్తి చేశాం. తద్వారా సరిహద్దు దాడుల్ని తొలగించాం. సింగిల్ షాట్ 303 రైఫిళ్ళను తయారు చేశాం. రాత్రికిరాత్రి చిన్నచిన్న యూనిట్లు ప్రారంభించాం. కొందరు స్టాండర్డ్ స్టెన్‌గన్లు తయారు చేశారు. కొందరు క్యాట్రిడ్జ్ కేసులు తయారు చేశారు. కావలసినన్ని ఆయుధాలు ఎలాగూ తయారు చేయలేకపోయాం. కొద్దికొద్దిగానైనా ఆయుధాలు తయారు చేసి నిరాయుధులైన సరిహద్దు రక్షకులకు ఒక దారి చూపించాం.

# 21. భారత్ నుండి కొత్తగా బెదిరింపులు

మార్చి 26 మధ్యాహ్నం పూట మున్షీ నుంచి నాకొక ఫోన్ వచ్చింది. మా ఇద్దరి మధ్య కుదిరిన ఒప్పందంతో ఆయన ఢిల్లీ వెళ్ళాడు. ముఖ్యమైన విషయాల మీద మా ఇద్దరి మధ్య కుదిరిన ఒప్పందాన్ని ఢిల్లీలో ఒప్పించి తిరిగి వచ్చి తర్వాత జరగాల్సినవి చూస్తానని ఆయనకు గట్టి నమ్మకముంది. అది తన వ్యక్తిగత విజయంగా ఆయన భావించాడు. ఆయన అనుకున్నదానికంటే ఎక్కువ రోజులు ఢిల్లీలో ఉన్నాడు. ఫలితం మీద నాకు అంతగా నమ్మకం లేదు. తిరిగి వచ్చాక నన్ను తొందరగా కలవాలనే ఆందోళన ఆయనలో కనిపించింది. వెంటనే రమ్మని ఆహ్వానించాను. కొద్దిసేపట్లోనే వచ్చాడు. నా గదిలోకి వస్తూ సంకోచంగా, ఆందోళనగా కనిపించాడు. సాదరంగా ఆహ్వానించి, సాంత్వన పరిచాను. మర్యాద పూర్వక పలకరింపులు అయ్యాక ఆయన జేబులోంచి ఒక సీల్డు కవరు తీసి ఒక గొప్ప సందర్భంలోలా భారత ప్రభుత్వ ఏజెంట్ జనరల్, హైద్రాబాద్ ప్రధానికి అందించినట్లు ఒక లేఖ అందించాడు. మొదట కొంత వెనుకాడినా తర్వాత చిరునవ్వుతో కవరు అందుకున్నాను. అల్టిమేటంలా ఉంది అన్నాను. మున్షీ తల ఊపి మౌనంగానే కుర్చీలో కూర్చున్నాడు. కవరు చించి లేఖ తెరిచాను.

అది 23 మార్చిన వి.పి.మీనన్ నాకు రాసిన లేఖ. అది ఒక నిర్దేశాత్మక

డిమాండు లేఖ. కాకపోతే డిమాండు పూర్తి చేయడానికి సమయం నిర్దేశించలేదు కనుక అల్టిమేటంకు తక్కువ. ఆ లేఖలో గత చర్చల సందర్భంగా తేలిన అంశాల మీద, ఎప్పుడూ చర్చకు రాని అంశాల మీద కూడా డిమాండ్లు ఉన్నాయి. అవన్నీ యథాతథ ఒప్పందం ప్రకారం హైద్రాబాద్ నెరవేర్చాల్సిన బాధ్యతలుగా పేర్కొనబడి నవి. అదనంగా దేశంలోని ఒకే ఒక్క ముస్లిం రాజకీయ సంస్థ అయిన ఇత్తెహాద్‌ను నిషేధించాలనే డిమాండు, దాని అన్ని బ్రాంచీలను మూసివేయాలనే నిర్దేశం.

అది చదివి నేనేమీ మాట్లాడలేదు. మున్షీని తేనీటికి ఆహ్వానించాను. ఆయన సరేనన్నాడు. వ్యక్తిగత, అనధికార సంభాషణకు ఆసక్తి చూపాడు. పైకి లౌకిక రాజ్యమైనా భారత్ ప్రధానంగా హిందూ దేశమన్నాడు. అలాంటి దేశంలో ఎవరు అధికారంలో ఉన్నా భారత భూభాగం మధ్యలో ముస్లిం ఆధిపత్య రాష్ట్రాన్ని ఉండనివ్వడం కష్టమన్నాడు. హిందూ ప్రజలు అధికంగా ఉన్న రాష్ట్రమై ఏదో ఒక రూపంలో ముస్లిం పాలన శతాబ్దాలుగా కొనసాగడం మరొక ప్రధాన కారణమన్నాడు. ఇండియాలో కలిపి తీరవలసిన రాష్ట్రంగా హైద్రాబాద్‌ను చెప్పి ఆయన నిజాయితీగా మాట్లాడారు. ఢిల్లీ ఇప్పటికే తొందరపడి ఉండవలసిందని చెబుతూ ఇప్పుడైనా సూటిగా, ధైర్యంగా ఒక నిర్ణయం తీసుకున్నారని చెప్పాడు. 'యుద్ధం జరుగుతుందా' అని మున్షీని అడిగాను. 'నా దృష్టిలో అది అవసరమే. భారత నాయకులు ఎందుకు ఆలస్యం చేస్తున్నారో అర్థం కావట్లేదు. అది చాలా చిన్న పని కూడా' అన్నాడు. 'కొన్ని వేలమంది ముస్లింలు, అంతే సంఖ్యలో హిందువులు మరణించే అవకాశం ఉంది మిలటరీ చర్యవల్ల. ఈ విలీనంలో అంతమాత్రం తప్పదు' అన్నాడు. ఈ సమయంలో అనవసరంగా కాశ్మీరులో కలుగజేసుకుంటున్నారు కానీ కాశ్మీరును వదిలివేసి హైద్రాబాద్ మీద శ్రద్ధ పెట్టాలన్నది ఆయన వ్యక్తిగత అభిప్రాయం. హైద్రాబాద్‌ను ఆక్రమించడానికి ఇండియాకు ఎక్కువ సమయం పట్టదన్నాడు. ఆ విధంగా కాశ్మీర్ విషయంలో పోయిన పరువును ఇక్కడ దక్కించుకోవచ్చు అన్నాడు. ఎక్కువ ఆలస్యం చేస్తే హైద్రాబాద్ బలపడవచ్చు, సమస్యగా మారవచ్చు అన్నాడు. ఆలస్యమైతే ప్రపంచం దృష్టిలో హైద్రాబాద్ మీద సానుభూతి పెరగవచ్చు. ఐరాస కలుగజేసుకోవచ్చు. అదే జరిగితే భారత్‌కు చిక్కులు పెరగవచ్చు అన్నాడు.

మున్షీ ప్రయత్నమంతా మిలటరీ చర్య తప్పదని నన్ను సిద్ధపరుస్తున్నట్లుగా ఉంది. సైనికపరంగా ఎంత బలహీనంగా ఉన్నా, లొంగిపోవడం కంటే పోరాడడానికే హైద్రాబాద్ సిద్ధపడుతుందని నేను చెప్పడం వల్ల మున్షీ ఇబ్బంది పడి ఉంటాడు.

మున్షీ లేచి నిలబడ్డాడు. మరీ దురసుగా ఉండకపోతే నాకు ఏమీ కాదని చెప్పాడు. అంతా జరిగిపోయాక నేను ప్రధానిగా కూడా ఉండగలనన్నాడు.

మా సంభాషణలో ఆనందం లేకున్నా చిరునవ్వు నవ్వి, కరచాలనం చేసుకుని విడిపోయాం. వెంటనే నిజాంకు ఫోన్ చేశాను. తక్షణం కలుస్తానని చెప్పాను. మా మధ్య జరిగిన సంభాషణ అంతా చెప్పాను. ఢిల్లీ నుండి వచ్చిన లేఖను ఇచ్చాను. సంభాషణ అంతా రాసి గుర్తుపెట్టుకోమని నిజాం నాకు సలహా ఇచ్చాడు. మున్షీ మాట మార్చగలడని కూడా చెప్పాడు. వెంటనే నేను డిక్టేషన్ ఇచ్చాను. ఒక కాపీ నిజాంకు కూడా పంపించాను. నిజానికి ఇది అనధికార సంభాషణే కానీ, రికార్డు చేసుకోవలసిన అవసరం వచ్చింది. ఆ కాపీని నిజాం మౌంట్‌బాటెన్‌కు పంపించాడు. మౌంట్‌బాటెన్ ఇచ్చిన హామీలకు విరుద్ధంగా ఉన్న భారత నాయకుల మస్తిష్కాలలో ఉన్న ఆలోచనలను ఆయనకు గుర్తు చేయడమే ఇందులో ప్రధాన ఉద్దేశ్యం. బాటెన్ ఆ నోటును చదివి ఆందోళన చెంది ఉంటాడు. నెహ్రూకు ఇతర భారత నాయకులకు చూపించి ఉంటాడు. హైద్రాబాద్‌లో ఏజెంట్ జనరల్‌గా మున్షీ నియామకం బాటెన్‌కు సుతారామూ ఇష్టం లేదు. ఆయన వల్ల సమస్యలు వస్తాయని బాటెన్ ముందే ఊహించాడు. మిగిలిన అన్ని విషయాలను ఆమోదించినట్లే భారత నాయకుల అభీష్టం మేరకు మున్షీని కూడా భరించాడు.

ఢిల్లీలో విచారిస్తే నా నోట్‌లో ఉన్న విషయాలు నిజం కావని తేలింది. నిజాం అది ముందే ఊహించాడు. నేను ఆశ్చర్యపోయాను. మున్షీని అడిగితే 'నా ఉద్దేశ్యం అది కాదు, నిజంగా నేను చెప్పాలనుకుంది అది కాదు' అని దాటవేశాడు. ప్రైవేటు వ్యక్తిగత సంభాషణను రికార్డు చేసినందుకు సహజంగానే నన్ను తప్పు పట్టాడు. అది రికార్డు చేసినందుకు నిజాం దాన్ని బాటెన్‌కు పంపించివేసినందుకు నేను అపరాధ భావనకు లోనయ్యాను. నిజమే! అది దౌత్య మర్యాదను భంగపరచడమేననిపించింది. ఇది కాకుండా ఢిల్లీ నాయకుల ఉద్దేశాలు హైద్రాబాద్‌కు ఎలాగోలా చేరిపోయాయి. హైద్రాబాద్ విషయంలో భారత నాయకులు నిజాయితీగా వ్యవహరిస్తారనే భ్రమలు తొలిగిపోయాయి. అయినా, ఇండియా సాయుధ దాడికి పూనుకుంటుందా? నేను అప్పటికీ నమ్మలేకపోయాను. కొత్తగా లభించిన స్వాతంత్ర్యాన్ని దుర్వినియోగం చేసి ప్రపంచం దృష్టిలో భారత్ చులకన కాబోదని నా విశ్వాసం

ఢిల్లీనుండి విధివిధానాల లేఖ అందిన తర్వాత మాంక్టన్ సహేతుకమైన జవాబును ఏప్రిల్ నెల ఆరంభంలో పంపాడు. అనుమానాలు రేకెత్తుతున్న వాతావర

ణాన్ని తొలగించాలని నిజాయితీగా ఆ లేఖ ముగింపులో కోరబడింది. నేరుగా చర్చలకు భారత్ ఒకవేళ అంగీకరించకపోయినా యథాతథ ఒప్పందం ప్రకారం మధ్యవర్తిత్వానికైనా అంగీకరించాలని అందులో కోరడం జరిగింది. భారత్ మధ్యవర్తిత్వానికి ఒప్పుకోదని నాకు తెలుసు. తన ఆధిపత్యం మాత్రమే చూపిస్తుంది. హైద్రాబాద్ మాత్రం రాజ్యాంగబద్ధ చర్చనే ఆహ్వానిస్తుంది.

నా అధికారిక లేఖతో పాటు నిజాం, బాటెన్‌కు ఒక ఉద్వేగపూరితమైన ఉత్తరం రాశాడు. 'నా ప్రధానికి ఢిల్లీ ప్రభుత్వం రాష్ట్రాల వ్యవహారాల శాఖ పంపిన లేఖ ఒక అల్టిమేటంలా ఉందని, అది స్నేహపూరిత వాతావరణాన్ని చెడగొడ్తుందని' నిజాం అందులో పేర్కొన్నాడు. 'మీ పరపతి ఉపయోగించి పరిస్థితిని సరిదద్దవలసిందిగా కోరాడు. ఒప్పందంలోని బాధ్యతలు నిర్వహించడానికి, నెరవేర్చడానికి కష్టమవుతుందని కూడా చెప్పాడు. ఒప్పందం ఏకపక్ష విధానానికి స్వస్తి చెప్పినందున విధి విధానాల నిర్ణయంలో రెండుపక్షాల ఏకాభిప్రాయం అవసరం. లేకపోతే సమస్యలొస్తాయి. అందుకే మధ్యవర్తిత్వం ద్వారా వీటిని పరిష్కరించుకోవాలి. మార్చి 4 ఒప్పందాన్ని హైద్రాబాద్ ఎలా నెరవేర్చిందో ఆ లేఖలో చెప్పాడు. హైద్రాబాద్‌కు ఆయుధాలు, మందుగుండు గురించి ప్రస్తావిస్తూ నిజాం "నాకు బ్రిటీష్ వాళ్ళు ఆయుధాలు, మందుగుండు సరఫరా చేసేవారు. జులై 8, 1947 నుండి నాకు ఎలాంటి ఆయుధ సరఫరా లేదు. మిమ్మల్ని, మీ ప్రభుత్వాన్ని అనేక సార్లు అడగడం జరిగింది. కానీ ఇతర మార్గాల ద్వారా సేకరించుకోవడానికి అభ్యంతరం చెబుతూ కూడా నేరుగా ఎలాంటి సరఫరా చేయలేదు. అందువల్ల నా సైన్యానికి శిక్షణ ఇప్పించలేక, శాంతి భద్రతలను పరిరక్షించలేక ఇబ్బంది పడుతున్నాం" అని రాశాడు. ఆర్థిక ఇబ్బందుల గురించి కూడా దీనంగా రాశాడు "చాలా సందర్భాల్లో సర్ మాంక్‌టన్ ద్వారా మీ దృష్టికి తెచ్చాను. నేను కోరుకున్నట్లు హైద్రాబాద్ స్వతంత్రంగా ఉంటే ఆర్థిక ఆంక్షల ద్వారా ఏదో ఒక మిష కల్పించుకొని భారత్ నా రాజ్యాన్ని ఆక్రమించే అవకాశం ఉందని. 12 ఆగస్టు, 1947న రాసిన లేఖలోని ప్యారా 2 లో మీరన్నారు. "మహా ఘనత వహించిన మీకు విలీనం గురించిన ఆందోళన, తదనంతర ప్రతికూలతలు ఆందోళన కలిగించవచ్చు. కాని కొత్తగా ఏర్పడ్డ భారతదేశ నాయకులు మీ మీద అలాంటి ఒత్తిడి తేరనే నమ్మకం నాకు ఏర్పడింది".

"ఇన్ని హామీలున్నప్పటికీ, యథాతథ ఒప్పందం ఉన్నప్పటికీ బ్రిటీష్ పాలన తొలగినప్పటి నుండీ మాపైన ఆర్థిక ఒత్తిడి పెరిగిపోతూ ఉందన్న సంగతి తమ

దృష్టికి తీసుకువస్తున్నా. అనుమానం లేదు ఒత్తిడి పెరుగుతుంది. మందులు, ఆసుప్రతులకు కావలసిన వస్తువులు, ప్రజలకు మంచినీటి కోసం కావలసిన క్లోరిన్ కూడా ఆగిపోయింది". ఈ నిలుపుదలలకు కావలసినన్ని సాక్ష్యాధారాలున్నాయని, బ్రిటీషర్లు ఇతర విదేశీయులు కూడా దీన్ని నిర్ధారిస్తారన్నాడు. ఈ నిలుపుదల విషయం అబద్ధమని భారత అధికార్లు కూడా ఎవరూ చెప్పలేదని నిజాం రాశాడు.


జులై 9, 1947 న రాసిన లేఖలో నిజాం మౌంట్ బాటెన్‌ని సూటిగా అడిగాడు. ఉపఖండంలో భవిష్యత్తు రాజకీయంలో తన పాత్ర ఎలా ఉండబోతుందో చెప్పాడు నిజాం. కొత్తగా ఏర్పడ్డ రెండు దేశాల్లోనూ చేరనని, తను స్వతంత్రంగానే ఉంటానని ఈ లేఖలో ఆయన కుండ బద్దలు కొట్టాడు. హైద్రాబాద్ రాజ్యాంగస్థితిని, వివిధ ఒప్పందాలలోని నిబంధనల ప్రకారం హైద్రాబాద్ పట్ల బ్రిటీషర్ల బాధ్యతను నిజాం ఈ లేఖలో గుర్తు చేశాడు. ఉపఖండంలో దేశంగా మనుగడ సాగించడంలో బ్రిటీషర్లు ఇవ్వాల్సిన మద్దతునూ కోరాడు. అతి ముఖ్యమైన చారిత్రకమైన ఈ ఉత్తరానికి మౌంట్ బాటెన్ రాజకిరీటం నుండి వచ్చిన జవాబేమిటంటే నిజాం లేఖను ప్రభుత్వానికి పంపించడం జరిగిందని తొందరలోనే జవాబు వస్తుందని. జవాబు ఎలాగూ ఎప్పటికీ రాలేదు. అటు బ్రిటీష్ ప్రభుత్వం, ఇటు భారత ప్రభుత్వం రెండింటికీ దురుద్దేశాలను ఆపాదించకుండా నిజాం అటు విలీనం, ఇటు స్వతంత్ర దేశంగా మనుగడ సాగించడం విషయంలో తన స్పష్టతను ప్రపంచానికి చాటాడు. తన మీద ఒత్తిడి తెచ్చే గ్రూపులో భాగస్వామిని కావద్దని బాటెన్‌ను నిజాం కోరాడు. సరిహద్దుల వెంట భారత దళాలు మోహరిస్తున్నాయన్న పుకార్లు విని, అవి హైద్రాబాద్‌ను మాత్రమే కాకుండా దక్షిణ భారత దేశాన్ని మొత్తం అలజడి పాలు చేస్తాయని బాటెన్‌కు చెప్పాడు. నిజాం లేఖలోని చివరి ప్యారా యథాతథంగా ఇవ్వదగ్గది. అది ఇలా సాగుతుంది "నన్ను సంప్రదించకుండా బ్రిటన్‌కు నాకు ఉన్న అన్ని బంధాలను తెంపివేస్తున్నారు. నాలో నమ్మకం ఉంచరా? బలవంతుడితో సంబంధాన్ని తెంచుకోవడం కన్నా బలహీనుడితో సంబంధం తెంచుకోవడం తక్కువ నష్టం కలిగిస్తుండవచ్చు. కాని చివరిగా తప్పకుండా నష్టం కలిగించి తీరుతుంది. గౌరవనీయులైన తమరు నిజాయితీ, ఆవేదనతో కూడిన నా మాటల్ని మన్నిస్తారని భావిస్తాను".

స్పష్టంగా, సూటిగా ఉన్న నిజాం లేఖ బాటెన్‌కు గట్టి షాకే ఇచ్చి ఉంటుంది. ఆయన ఒక వ్యక్తి మాత్రమే కాదు, మాజీ రాజ ప్రతినిధి. నిజానికి ఏదైనా చేయాలనుకున్నా గొప్పగా చేసే శక్తి ఆయనకు లేదు. భారత నాయకుల అంతర్గత

కార్యక్రమాలను అదుపు చేయగలడని భావించాం. బాటెన్‌ను వ్యక్తిగతంగా, రాయల్ ఫ్యామిలీ ప్రతినిధిగా భారత్ బాగా వాడుకుంది. ఆయన కూడా అందుకు సిద్ధపడ్డాడు. కనీసం కొంత చురుకైన పాత్ర నిర్వహించడానికైనా ఆయన నిజాం లేఖను ఉపయోగించుకుని ఉండవచ్చు. మాంక్టన్ అలా జరుగుతుందనుకున్నాడు. నేను మాత్రం కాదు. నిజాం మాత్రం దాన్నొక అవకాశంగా తీసుకున్నాడు. మాంక్టన్ ఆ లేఖను వ్యక్తిగతంగా బాటెన్‌కు అందజేసేందుకు నిర్ణయించుకున్నాడు.

ఏప్రిల్ 6న మాంక్టన్ ఢిల్లీ వెళ్ళాడు. నిజాం దూతగా అక్కడి ప్రతికూల వాతావరణానికి ఆయన ఆశ్చర్యపోయాడు. ఆయన రాక గురించి ఢిల్లీకి తెలుసు. ఆయన రాక పట్ల అక్కడి అధికారులు సంతోషించలేదు, అనుమానంగా చూశారు. 7వ తేదీ హిందూస్తాన్ టైమ్స్ ఖాసిం రజ్వీ ఇతర రజాకార్ నాయకులు చేసినట్లుగా ఒక గొప్ప కథనం రాసింది. పెద్ద పెద్ద అక్షరాల్లో 'జీహాద్‌కు ఖాసిం రజ్వీ పిలుపు!' అని రాసింది. ఆ ఉపన్యాసం హైద్రాబాద్ ఆయుధ వారోత్సవానిదట! మార్చి 31న ఇచ్చిన ఉపన్యాసంగా పేర్కొని ఏప్రిల్ ఆరున రిపోర్టు చేశారు! రోజూ ఎయిర్ మెయిల్‌లో వచ్చే హిందూస్తాన్ టైమ్స్ ఆ రోజు హైద్రాబాద్‌కు రాకపోవడం ఆశ్చర్యకరం. మాంక్టన్ ఆ పత్రిక కాపీతో 10 తేదీన తిరగి వచ్చాక నాకు తెలిసిందా వార్త. హిందూ సంస్కృతి, హిందూ మతానికి సంబంధించిన నేరపూరిత స్వభావం ఇది. కథరిన్ మేయో తన మదర్ ఇండియాలో దీన్ని గొప్పగా ఉటంకించింది. గోపు పేడను, గోమూత్రానికి పవిత్రతను ఆపాదించుకున్న కోట్లాది దేవతలున్న హిందువుల ప్రవర్తన ఇది. హిందూమతంలో అంతర్గత స్వభావం నాలాగే చాలామందికి తెలియదు. ఖాసీం రజ్వీకి ఏమైనా తెలుసా అన్నదీ అనుమానమే. ఒకవేళ కొద్దో గొప్పో తెలిసినా బహిరంగ ఉపన్యాసాల్లో మాట్లాడగలిగేంత మాత్రం తెలియదు. చేదుగా ఉన్న ఆ వార్తాకథనం కావలసిన ప్రయోజనాన్ని నెరవేర్చింది. అది కావలసినంత ఆగ్రహాన్ని రగిల్చింది. ఢిల్లీనుండి, రాజ్యాంగ సభనుండి ప్రశ్నలు సంధించబడ్డాయి. ఒకవేళ అవి రజ్వీకున్న నిజమైన అభిప్రాయాలే అయినా అవి ఒక బహిరంగ ర్యాలీలో ప్రకటించబడతాయా అని కానీ, అవి ఒక్క హిందూస్తాన్ టైమ్స్‌కే అందుతాయా అని కానీ, ఒకవేళ అందినా వారం రోజుల తర్వాత ప్రచురించబడుతుందా అని కానీ ఎవరూ ఆలోచించలేదు. హైద్రాబాద్‌లో కానీ భారతదేశ వ్యాప్తంగా గానీ ఏ ఒక్క పత్రిక, వార్తా సంస్థ అలాంటి ఒక్క ముక్క కూడా ప్రచురించలేదు.

హిందూస్తాన్ టైమ్స్ సృష్టించిన ఆందోళనా పూరితమైన వాతావరణం వల్ల



మాంక్‌టన్ వ్యవహార పరిధి కుచించుకు పోయింది. మౌంట్ బాటెన్ నుండి సమయం సంపాదించడమే కష్టమయింది. లండన్ టైమ్స్ ప్రతినిధి ఆ కథనంలో సూచించిన తేదీనాడు తాను హైద్రాబాద్‌లోనే ఉన్నానని, ర్యాలీ కానీ, ఆయుధ వారోత్సవం కానీ ఏదీ లేదని, అదంతా ఒక కట్టు కథ అని చెప్పేంత వరకూ బాటెన్‌కు నమ్మకం కుదరలేదు.

మాంక్‌టన్ రాగానే హిందూస్తాన్ టైమ్స్ ప్రతిని పోలీసు ఇంటలిజెన్స్ ఉన్నతాధికారులకిచ్చి త్వరగా విచారణ చేసి నిజం తేల్చమన్నాను.నా ప్రైవేటు వ్యక్తుల ద్వారా కూడా విచారణ చేయమన్నాను. పత్రికల ద్వారా విచారణ చేయమన్నాను. చివరకు రజ్వీని కూడా అడిగి తెలుసుకున్నాను. అందరూ అది కట్టుకథ అని తేల్చారు. మాంక్‌టన్ చాలా అశాంతితో ఉన్నాడు. మాంక్‌టన్ మౌంట్‌బాటెన్‌తో జరిపే చర్చలను భంగపరచడానికి అల్లిన కథనంగా హిందూస్తాన్ టైమ్స్ కథనాన్ని అర్థం చేసుకున్నాం. భారత నాయకుల చర్యలన్నీ హిట్లర్ స్వభావాన్ని సూచిస్తున్నాయని మాంక్‌టన్ భావించాడు. రాజ్యాంగ సలహాదారుడిగా తాను చేయగలిగింది తక్కువేనని ఆయనకు అర్థమయింది. విషయమంతా నిజాంకు చేరవేసి ఇంగ్లాండు వెళ్ళేందుకు సిద్ధపడ్డాడు.

మాంక్‌టన్ నిర్ధారణ సరియైనదే. రెండవ ప్రపంచయుద్ధంలో యూరప్ సంఘటనల్ని ఆయన శ్రద్ధగా గమనించేవాడు. ఆస్ట్రియా, జెకొస్లొవేకియాలతో హిట్లర్ ప్రవర్తన ఆయనకు బాగా గుర్తుంది. గోబెల్స్ ప్రచారం ద్వారా శత్రువులను దుష్ప్రచారంలో ముంచి జర్మన్ యుద్ధవాదులకు సహకరించిన విధానం ఆయనకు బాగా తెలుసు. నిజాంకు, హైదరాబాద్‌లోని ఇతర పెద్దలకు ఆయన అంచనా సరిగ్గానే తోచింది. భారతనాయకులు హైద్రాబాద్‌ను తమలో కలుపుకోవాలనుకుంటున్నారని, హైద్రాబాద్ సైనికంగా వారిని ఎదుర్కోవడం కష్టమని అంచనా వేశాడు. ద్వైపాక్షిక ఒప్పందాలలోని బాధ్యతల వల్ల ఇంగ్లాండు హైద్రాబాద్‌కు ఈ విషయంలో సహాయపడుతుందనుకోవడం భ్రమ అన్నాడు. నైతికంగా రాజ్యాంగబద్ధంగా ఐరాసలో హైద్రాబాద్ విషయాన్ని ప్రస్తావించవచ్చుననుకున్నాడు కానీ ఇండియా చాలా ముందుగానే హైద్రాబాద్‌ను భారత అంతర్గత సమస్యగా నిరూపించే అవకాశాన్ని మరిచిపోయాడు. ఆయన ప్రకారం నిజాము, హైద్రాబాద్ ప్రజానీకం భారత్‌కు లొంగిపోవాలి లేదా సైనిక చర్యకు సిద్ధంగా ఉండాలి. హైద్రాబాద్ ప్రజలు నిజాం కూడా గుర్తించవలసిందేమిటంటే ఆయుధ బలాన్ని ప్రయోగించాలనే ఆతృత ఇండియా నాయకులలో చాలా ఎక్కువగా ఉంది అన్నారు మాంక్టన్.

# 22. ఢిల్లీలో కొత్త ఎత్తులు

నిజాం రాసిన ఉద్వేగపూరితమైన ఉత్తరానికి మౌంట్‌బాటెన్ జవాబిచ్చాడు. తాను రాజ్యాంగబద్ధమైన గవర్నర్ జనరల్ అయినందుకు తనని మన్నించవలసిందిగా బాటెన్ అందులో కోరాడు. గతంలో లేని స్పష్టతను ఇందులో ఇచ్చాడు. ఏప్రిల్ 8న రాసిన లేఖలో తాను హైద్రాబాద్ మిత్రుడినని చెప్పుకుంటూ, రాజ్యాంగ బద్ధ ఏకస్వామ్యమే ఇప్పటి పరిస్థితులకు అనుకూలమని చెప్పాడు. యధాతథ ఒప్పందం అనుకున్నంతగా ఆశాజనకంగా పని చేయడం లేదనే నిజాం అభిప్రాయాన్ని ఆయన తన లేఖలో పంచుకున్నారు. ఆర్థిక దిగ్బంధం గురించి రాస్తూ, కొత్త ప్రభుత్వ ప్రతినిధులు హైద్రాబాద్ మీద ఆర్థిక ఒత్తిడి పెంచడానికి సుముఖంగా లేరనే సంతృప్తి తనకున్నట్టు పేర్కొన్నారు. 'నెహ్రూ, ఇతర మంత్రులు ఆర్థిక దిగ్బంధనానికి ఎలాంటి చర్యలు తీసుకోలేద'ని అన్నాడు. బాధ్యతాయుత ప్రభుత్వ ఏర్పాటు భారత్, హైద్రాబాద్‌ల మధ్య దీర్ఘకాలిక ఒప్పందాలకు పునాది కాగలదని అన్నాడు.

జులై 1947లో నిజాం లేఖలో పేర్కొన్నట్టు వివిధ ఒప్పందాల ప్రకారం హైద్రాబాద్ విషయంలో బ్రిటన్ బాధ్యతల గురించి రాస్తూ "ఈ ప్రశ్నకు ఎప్పుడో జవాబు రాసి ఉండవలసింది. రాజకీయ శాఖలో పని ఒత్తిడి వల్ల ఇది జరగలేదు. అలాంటివి అప్పుడప్పుడు జరుగుతుంటాయి. అది దురదృష్టకరమైందిగా ఒప్పుకుంటాను" అన్నాడు. అంత మామూలు జవాబుతో బ్రిటీష్ రాచరికపు బాధ్యత నుండి చాలా

చిన్న విషయంగా తప్పుకున్నాడు బాటెన్. బ్రిటీష్ రాజప్రతినిధిగా అంత ముఖ్యమైన విషయంలో బాధ్యతల నుండి తప్పుకోవడం నమ్మశక్యం కాని విషయంగా మారింది. లేఖను ముగిస్తూ "మీరెలాగైతే భారత్‌కు వ్యతిరేకమైన చర్యలు చేపట్టే ఉద్దేశ్యంలో లేరో, అలాగే భారత్ కూడా హైద్రాబాద్‌కు వ్యతిరేకమైన చర్యలు చేపట్టే ఉద్దేశ్యంతో లేదు" అని సానుభూతిగా రాశారు.

భారత ప్రభుత్వ అధికారులు రాసిన లేఖ మీద ఆయన సంతకం చేయాల్సి వచ్చిందని లేఖ రాయబడిన విధానం ద్వారా తెలిసిపోతుంది. వ్యక్తిగత పలుకుబడి, బ్రిటన్ పరువు ఎంత పోతుందో అన్న విషయాన్ని ఆలోచించకుండానే ఆయన దానిమీద సంతకం చేశారని కూడా అర్థమవుతుంది. ఈ లేఖ అందిన వారంలోగానే ఢిల్లీలోని ఏజెంట్ జనరల్ నుండి నాకొక వర్తమానం వచ్చింది. దాని సారాంశమేమిటంటే చాలా రోజుల తర్వాత అఖిల భారత జాతీయ కాంగ్రెస్ సమావేశం జరుగనున్నందున నేను ఢిల్లీ వెళ్ళి భారత్ నాయకులను కలవడం మంచిదని. ఈ పరిస్థితుల్లో నా కలయిక అవసరమని నెహ్రూ కూడా భావిస్తున్నట్లు ఏజెంట్ జనరల్ చెప్పాడు. నిజాం ఆశీస్సులు, దేవుని ఆదేశాలతో నేను, మాంక్టన్ ఢిల్లీ వెళ్ళాం మరోసారి. భౌతికంగా, రాజకీయంగా కూడా ఢిల్లీ వాతావరణం వేడెక్కి ఉంది. మా పర్యటన అటు పత్రికలలో, ఇటు ప్రజలలో ఉత్సుకత రేకెత్తించింది.


ఢిల్లీ రాగానే యథావిధిగా మీనన్‌ను కలిశాను. ఓ రెండు గంటల్లోనే పూర్తి కావలసిన మా సంభాషణను మహా ఓపికస్తుడిగా పేరున్న మీనన్ చాలా సాగదీశాడు. బాధ్యతాయుత ప్రభుత్వం, భారత దేశంలో విలీనం అనే అరిగిపోయిన రికార్డును వేసి హైద్రాబాద్‌కు గత్యంతరం లేని పరిస్థితిని కల్పించాడు. ఆయన మాటలు వినీ వినీ నా కర్ణభేరి మొద్దుబారిపోతుందనిపించింది. బోరెత్తిపోయింది. చివరకు హడావుడిగా నన్ను లేపి నెహ్రూ ఇచ్చిన టైం దగ్గరపడిందని హడావుడి చేశాడు. పైగా నా అభిప్రాయాన్ని నెహ్రూకి కూడా ముందుగా చెప్పాలన్నాడు.

ఆయనొక బహిరంగ సభలో ఉన్నాడు. ఆయన వి.పి.మాటల్ని ముందుగా వినాలి కూడా. వి.పి. లోపలికి వెళ్ళి గంటా ఇరవై నిమిషాలకు బయటికి వచ్చాడు. ఏకధాటిగా ఒక గంటకు పైగా మాట్లాడిన సంతృప్తి ఆయన వదనంలో కనిపిస్తుంది. నెహ్రూది సరదా సంభాషణ. తన మాటల్ని ఆయన కాలంతో కొలుస్తారు. ఆయన అలసిపోయి ఉండవచ్చని, తర్వాత మాట్లాడదామని సానుభూతితో సూచించాను. హైదరాబాద్ గురించి బహిరంగ సభలో ఏమి మాట్లాడాడో తెలుసుకున్నాక చర్చలకు

వెళ్ళితే మంచిదనే ఉద్దేశ్యం వల్ల కూడా చర్చలకు వాయిదా కోసం అడిగాను. భారత్ రాజకీయాలు తరచూ అసాధారణంగా మారుతున్నాయి. మొదట ప్రజల్లో ఏదో ఒకటి మాట్లాడి తర్వాత విధాన నిర్ణయం ఎలా చేయాలని భారత నాయకులు ఆలోచిస్తూ కనిపించారు. నెహ్రూ మాత్రం తాను అలసిపోయానని ఒప్పుకునేందుకు ఇష్టపడలేదు. సుదీర్ఘ ఉపన్యాసం తర్వాత తాను మరింత ఉత్సాహంగా ఉంటానని చెప్పాడు. మా చర్చలు మొదలైనై. నెహ్రూ ఆవేశంలో కనిపించాడు. తన జీవితం ఇంకా కొన్నాళ్ళే మిగిలి ఉందని, భారత్‌ను పునర్నిర్మించడానికి చాలా చేయాల్సి ఉందని కానీ అన్ని వైపుల నుండీ రాజకీయాలే తనను చుట్టుముట్టి తన జీవితాశయానికి దూరం చేస్తున్నాయని చెప్పుకొచ్చాడు. హైద్రాబాద్ వ్యవహారం కూడా ముఖ్యమైందేనని చెబుతూ అది భారత్‌లో విలీనమైతే అంతా బాగుంటుందని వ్యాఖ్యానించాడు.

ఇప్పటి వరకు హైద్రాబాద్ విషయంలో భారత ప్రభుత్వం ఒత్తిడి, అణచివేతల గురించే ఆలోచించిందని అవి సత్ఫలితాలివ్వలేదని నేను నెహ్రూకు చెప్పాను. హైద్రాబాద్‌తో స్నేహపూర్వక సంబంధాలు నెరపి చూడమని సలహా ఇచ్చాను. ఆర్థిక దిగ్బంధం చేసి, భారత్‌ను గౌరవించమంటే కుదరదని చెప్పాను. ఆయన ఆలోచనాత్మకంగా స్పందించాడు. అది తన వల్ల జరగడం లేదని, అయినా విషయాన్ని పరిశీలిస్తానని యథావిధిగా హామీ ఇచ్చాడు. దిగ్బంధానికి హైద్రాబాదే కారణమన్నాడు. భారీఎత్తున ఆయుధ దిగుమతిని మేం జప్తు చేశాం కదా అన్నాడు నెహ్రూ. ఒక్క తుపాకీ కూడా మీరు జప్తు చేయలేదని, అసలు అక్రమ రవాణాయే లేదని చెప్పాను. నా సూటి సవాలుకు ఆయన దగ్గర జవాబు ఏమీ లేదు. కొద్ది క్షణాలు ఆగి కోపంతో ఊగిపోతూ 'విలీనానికి అంగీకరించకపోతే దిగ్బంధాన్ని పెంచివేస్తాం. గడ్డిపోచను కూడా హైద్రాబాద్ లోపలికి పోనివ్వం' అంటూ ఆవేశంలోకి వచ్చేశాడు. నా వైపు వేలుతో చూపిస్తూ "హైద్రాబాద్‌ను ముక్కలు చేస్తా" అన్నాడు. అంతకు ముందెప్పుడూ హైద్రాబాద్ మిలటరీ బలహీనత గురించి నేను బెంగపడలేదు. రాజకీయ, వ్యక్తిగత అవమానాన్ని ఒక్కటొక్కటిగా దిగమింగుకున్నాను. ఇంక చర్చించడానికి ఏమి మిగిలిందనిపించలేదు. నెహ్రూలాంటి వ్యక్తులు ఇలాంటి మానసిక స్థితిలో ఉంటే ప్రశాంతమైన అవగాహనకు రావడం కష్టమని పేర్కొంటూ లేచాను.

థ్రోంబోసిస్‌తో బాధపడుతున్న ఉప ప్రధాని పటేల్ అప్పుడప్పుడే కోలుకుంటున్నాడు. నా మొదటి పర్యటనలోనే పరామర్శిద్దామనుకున్నాను. ఎంత అవరోధాలు ఉన్నా ఆయన నాతో మాట్లాడాలనుకున్నాడు. హైద్రాబాద్ విషయాల గురించి



మాట్లాడాలనుకున్నాడు. మరుసటిరోజు ఆయన్ని కలిసాను. ఆయన పడక మీద ఉన్నాడు. ఒక వైపు మీనన్ ఉన్నాడు. నేను మరోవైపు కూర్చున్నాను. ఆయన చాలా బలహీనంగా కనిపించాడు కానీ ఇండో హైద్రాబాద్ వ్యవహారాల మీద మాట్లాడడానికి ఆతృత చూపించాడు. సంభాషణ ప్రారంభించే ముందు మీనన్ హైద్రాబాద్ సరిహద్దు దాడుల వార్త ఒకటి తెచ్చాడు. యధావిధిగా అందులో హైద్రాబాద్ తప్పిదం చూపించబడ్డది. అది బొంబాయి ప్రభుత్వ నివేదిక. ఢిల్లీ గోబెల్స్ ప్రచారానికి తెగబడ్డది. భారత్ ఏ ఒక్క అవకాశాన్ని వదులుకోకుండా హైద్రాబాద్ మీద దుష్ప్రచారం చేసింది. ఈ సంఘటన ఉదయం జరిగినట్టు తనకు గంటకిందనే ఫోను వచ్చిందని మీనన్ చెప్పాడు. నాకు ఆ సంఘటన మీద ఏ నివేదికా లేనందున ఏమీ మాట్లాడలేక పోయాను.

కొంత సేపటికి మీనన్ వెళ్ళిపోయాడు  కానీ పటేల్ ఆ నివేదిక తాలూకు సంఘటననే ఆలోచిస్తూ ఉండిపోయాడు. రజాకార్ల వల్ల హైద్రాబాద్ సరిహద్దుల్లోని భారత భూభాగంలో శాంతి భద్రతలకు విఘాతం కలుగుతుందన్నాడు పటేల్. దీనికొకటే పరిష్కారం – విలీనం అన్నాడు పటేల్. విలీనం హైద్రాబాద్‌కు ఆనందకరమైంది కాదని చెప్పాను పటేల్‌కు. అయితే సరిహద్దు సంఘటనలను ఆదుపు చేయడానికి

ప్రొవెన్షియల్ ప్రభుత్వాలతో కలిసి చర్యలు తీసుకుంటానని, అలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా చూస్తానని హామీ ఇచ్చాను. హిందుస్తాన్ టైమ్స్ ఖాసీం రజ్వీకి ఆపాదిస్తూ రాసిన రిపోర్టు మీదకి చర్చ మళ్ళింది. ఆ నివేదికలోని అసత్యాల వల్ల ఢిల్లీలో ఆందోళనకరమైన వాతావరణం ఏర్పడిందని చెప్పాను. ఆ నివేదికలోని ఉపన్యాసం వాస్తవమని తన వ్యక్తిగత విచారణద్వారా రుజువైందని పటేల్ చెప్పాడు. నిజాన్ని వినే పరిస్థితిలో ఆయన లేడు. అది అబద్ధమని సవాలు చేసాను. దానికి పటేల్ "ఒక వేళ నీకు అలాంటి నివేదికలే అందుతున్నాయంటే నీ పదవికి రాజీనామా చేయడం మంచిది" అన్నాడు.

మా సంభాషణల్లో చాలా సార్లు పటేల్ నన్ను రాజీనామా చేయమని సలహా ఇచ్చాడు. నాకు చాలా ఇబ్బందికరంగా అనిపించింది. తరచూ ఆయన ఆవేశంలోకి రావడం, ముఖం మీద చమటలు పట్టడం, వాటిని ఆయన తుడుచుకోవడం గమనించాను. నాకు అసౌకర్యంగా అనిపించింది. నేను ఒక హార్ట్ పేషెంట్ దగ్గర కూర్చున్నాను. ఆయన ఆవేశపడడం చూస్తున్నాను. ఆయన అలసిపోయినట్లు కనిపిస్తున్నాడు ఆయినా నన్ను ఉండమంటున్నాడు. ఆయన ఏది మాట్లాడినా విని బదులు చెప్పకుండా ఉండి, గౌరవ ప్రదంగా బయటపడదామని నిర్ణయించుకున్నాను.

చివరికి పటేల్ దగ్గర నుండి బయట పడ్డా. ఆయన కార్యదర్శి నన్ను సాగనంపాడు. ఒక హార్ట్‌పేషెంటుతో మాటలు నన్ను చాలా ఇబ్బంది పెట్టాయని అతనికి చెప్పాను. అందుకు ఆయన ఇప్పుడు పటేల్ బాగానే ఉన్నాడని, మీరు వివరంగా మాట్లాడి ఉండి ఉండాల్సిందన్నాడు. ఒక వేళ చర్చలు ముగియక పోతే ఇంకో రోజు ఏర్పాటు చేస్తానని కూడా చెప్పాడు. ధన్యవాదాలు చెప్పాను. ఇంకెప్పుడూ హార్ట్ పేషెంట్‌తో మాట్లాడగూడదని నిర్ణయించుకున్నాను.

ఒకటీ రెండు రోజుల తర్వాత నెహ్రూనివాసంలో భోజన విరామం తర్వాత నెహ్రూ, నేను ఇండో-హైద్రాబాద్ వ్యవహారంపై చర్చించాం. బొంబాయిలో జరుగనున్న ఆలిండియా కాంగ్రెస్ సమావేశం కన్నా ముందు కొంత పురోగతి రావాలన్న ఆరాటం ఆయనలో కనబడింది. నేనూ అదే అభిప్రాయంతో ఉన్నాను. కానీ ఎక్కడా ఏకాభిప్రాయానికి రాలేక పోయాం. బాధ్యతాయుత ప్రభుత్వ ఏర్పాటు అనేది పూర్తిగా అంతర్గత వ్యవహారమైనప్పటికీ మేం దానికి కట్టుబడి ఉంటామని హామీ ఇచ్చాను. నిజాం కూడా అందుకు మాట ఇచ్చాడు. అదే ప్రధాన డిమాండు అయితే అందుకు నా బాధ్యతగా చెప్పమని నెహ్రూకు చెప్పాను. రాజకీయ సంబంధమైన విభేదాలు

ఇంకా కొలిక్కి రాలేదు. భారతదేశంలో విలీనానికి నెహ్రూ ప్రకారం ప్రత్యామ్నాయంలేదు. దానికి నేను ఏ హామీ ఇవ్వలేను. అయితే పరిస్థితి ఇంకా దిగజారిపోకుండా చూడమని మాత్రం కోరాను. బాధ్యతాయుత ప్రభుత్వం ఏర్పాటుకు ఫర్మానా జారీ చేయమని నిజాంను కోరతానని హామీ ఇచ్చాను.

ఇండియాను విడిచి వెళ్ళే లోపు ఇండో–హైద్రాబాద్ చిక్కుముడిని పరిష్కరించాలన్న ఆతృత మౌంట్‌బాటెన్‌లో ఉన్నట్లు నాకు తర్వాత అర్థమయింది. ఈ సమయంలో ఆయన చాలా హేతుబద్ధంగా ఉన్నట్లు, హైద్రాబాద్ దృష్టి కోణంతో ఆలోచించినట్లు అనిపించింది. ఆయన తక్షణం ఇచ్చిన సలహా ఏమిటంటే కొంతమంది హిందువులను నా మంత్రి వర్గంలోకి తీసుకోమని, నేను ప్రధాని బాధ్యతలు చేపట్టినప్పటి నుండి ఈ పని చేయాలనే అనుకుంటున్నాను, స్టేట్ కాంగ్రెస్ నాయకులు కూడా మంత్రివర్గంలో చేరాలనే ఆసక్తితో ఉన్నారు కానీ ఆలిండియా కాంగ్రెస్ నాయకుల ఆంక్షల వల్ల వాళ్ళు బహిరంగంగా ముందుకు రాలేదు. హిందువుల అవకాశాలను ఆలిండియా నాయకులు తొక్కి పెడుతున్నారని, ఢిల్లీ పెద్దలను కాదనే ధైర్యంలేక స్టేట్ కాంగ్రెస్ నాయకులు తీవ్ర అసంతృప్తితో ఉన్నారని ఒక సీనియర్ స్టేట్ కాంగ్రెస్ నాయకుడే నాతో అన్నాడు. ఆయన పరిస్థితి ఇబ్బందికరంగా ఉంది. ఏదో ఒక ఒప్పందం భారత్–హైద్రాబాద్‌ల మధ్య కుదిరితే ముందుకు పోవచ్చని ఆయన భావించారు. ఢిల్లీ ప్రభుత్వ ఏకోన్ముఖ పోకడలు నిలువరించ గలిగితే స్టేట్ కాంగ్రెస్ నాయకులను మంత్రి వర్గంలోనికి తీసుకోవడం కష్టం కాదని చెప్పాను. ఇది చాలా కష్టమైన సందర్భమని ఒప్పుకుంటూ, హైద్రాబాద్ స్టేట్ కాంగ్రెస్ నాయకులను స్వేచ్ఛగా నిర్ణయం తీసుకునే విధంగా ఢిల్లీ అనుమంతించేట్లు చూసేందుకు ప్రయత్నిస్తానని చెప్పాడు బాటెన్.

హైద్రాబాద్ స్టేట్ కాంగ్రెస్ నాయకులకు స్వేచ్ఛ కల్పించేందుకు మౌంట్ బాటెన్ గట్టిగా కృషి చేసారన్నది అనుమానమే, ఆయన ప్రయత్నించినా అనుకున్న ఫలితం ఎలాగూ వచ్చేది కాదు. మౌంట్‌బాటెన్ సూచించిన విధంగా నిజాం ఫర్మానా జారీ చేసాడు. శతాబ్దాలుగా వస్తున్న మత సామరస్యాన్ని కాపాడమని కోరాడు. భారతదేశపు ఇతర ప్రాంతాలలో తలెత్తే ఉద్యమాలను ఇక్కడ గుడ్డిగా అనుకరించవద్దని కోరాడు. బాధ్యతాయుత ప్రభుత్వ రూపం గురించి చర్చించడానికి ఒక కమిటీని వేసాడు. స్టేట్ కాంగ్రెస్ ఇతర రాజకీయ సంస్థలను బాధ్యతలు తీసుకోమ్మని కోరాడు. ఫర్మానా ప్రతి ఒకదానిని బాటెన్‌కు పంపిస్తూ భారత నాయకులు ఇంకా కొత్త చిక్కులను

తేబోరని ఆశించాడు.

ఫర్మానా సమస్యలను పరిష్కరిస్తుందని నేను ఆశించాను. తొందరగానే మా భ్రమలు పటాపంచలైనాయి. ఏప్రిల్ 24 న అఖిల భారత కాంగ్రెస్ కమిటీ ముందు నెహ్రూ మాట్లాడుతూ భౌగోళిక, ఆర్థిక అనివార్యతల దృష్ట్యా హైద్రాబాద్ భారత్‌లో కలవాల్సిందేనని చెప్పాడు. "హైద్రాబాదుకు రెండే ప్రత్యామ్నాయాలున్నాయి. అవి విలీనం లేదా యుద్ధం" అని నెహ్రూ ప్రకటించాడు. ఏప్రిల్ 26 న మరొక సమావేశంలో మాట్లాడుతూ "హైద్రాబాద్ వ్యవహారంలో భారత్ ప్రయత్నం అలసిపోయే దశకు చేరుకుంది" అన్నాడు.

నెహ్రూ ప్రకటనలు ప్రపంచవ్యాప్తంగా ప్రకంపనలు రేపాయి. ఆయన ప్రకటనలు మూలమూలలా చర్చకు వచ్చాయి, అవి హిట్లర్ మాటలుగా పోల్చబడ్డాయి. ఆ ప్రకటనల పట్ల వచ్చిన వ్యతిరేకత విదేశాలలోని భారత రాయబారుల ద్వారా ఆయనకు తెలిసే ఉంటుంది. రెండు రోజుల తర్వాత తను ఆవేశంలో మాట్లాడిన మాటలను సవరించుకోవాలనుకొని ఉండి ఉంటాడు. "హైద్రాబాద్ రాష్ట్రంలోని కొంతమంది భారత ప్రభుత్వ వ్యతిరేక చర్యలకు పాల్పడుతున్నారా లేదా అన్నది ప్రశ్న. ఆ వ్యక్తులు హైద్రాబాద్ ప్రభుత్వానికి ప్రాతినిధ్యం వహిస్తారా అన్నది మాకు తెలియదు. హైద్రాబాదు ప్రభుత్వం వారిని నిలువరించలేదా నిలువరించ దలుచుకోలేదా మాకు తెలియదు. ఎట్టి పరిస్థితుల్లో అది ఇంకా కొనసాగకూడదు. ఒక వేళ హైద్రాబాద్ ప్రభుత్వం వారిని అడ్డుకోకపోతే, వారిని అడ్డుకోవడానికి ప్రత్యామ్నాయ మార్గాలను అన్వేషించాల్సి వస్తుంది" అన్నాడు నెహ్రూ.

భారత నాయకులతో కలిగిన రకరకాల అనుభవాలతోపాటు, ప్రధాని స్థాయి నాయకుల ప్రకటనలు మాకు చాలా ఆశ్చర్యం గొలిపాయి. రెండు రోజుల్లో ఆయన 'యుద్ధమో, విలీనమో' మాటనుండి 'భారత ప్రభుత్వ వ్యతిరేక చర్యలు'గా మార్చేసాడు. మరుసటి రోజు నేను అసెంబ్లీలో మాట్లాడవలసి ఉండె.నా దృష్టిలో భారత్‌కు వ్యతిరేకంగా హైద్రాబాద్ పనిచేసే అవసరమే లేదని చాలా స్పష్టంగా చెప్పాను. మనమున్న పరిస్థితుల్లో భారత్‌కు సన్నిహితంగా ఉండి తీరవలసిందే అని చెప్పాను. రక్షణ, విదేశీ వ్యవహారాలలో మనం భారత్‌పై ఆధారపడి ఉన్నామని చెప్పాను. ఉపన్యాసం తయారు చేస్తున్నప్పుడు ఎలాంటి అనుమానపునీడ రాకుండా స్పష్టం చేసాను. వాస్తవికంగా ఉండాలని, ఇండియాతో స్నేహంగా ఉండాలని, భారత్‌కు ఏదైనా ఆపద వస్తే అది హైద్రాబాద్ మనుగడను కూడా ప్రమాదంలో పడేస్తుందని నా ప్రజలకు స్పష్టం

చేసాను. అదే సందర్భంలో హైద్రాబాద్ మీద ఢిల్లీ తన అభిప్రాయాలను రుద్ద వద్దని, హైద్రాబాద్ భారత్‌తో స్నేహం కోరుతుందని భారత్‌కు చెప్పాను. ఇంకొక మాటకూడా భారత్‌కు స్పష్టంచేసాను. "నేను గాంధీ సిద్ధాంతాన్ని పాటిస్తున్నాను. లోపలా బయటా శాంతి వర్ధిల్లాలని కోరుకుంటున్నాను. అయినా భారత్ విధ్వంసకర రీతిలో మిలటరీ చర్యకు పూనుకుంటే, సైనికశక్తిలో చిన్నదైనప్పటికీ హైద్రాబాద్ తన శక్తిమేరకు దాన్ని ఎదుర్కొంటుంది" అని ప్రకటించాను.

కాంగ్రెస్ తప్ప అందరూ నా ప్రకటనను స్వాగతించారు. నేను వాస్తవిక దృక్పథంతో మాట్లాడానని ఇక భారతే అవగాహన కోసం ముందుకు రావాలని పత్రికలు రాసాయి. ఒక్క కాంగ్రెస్ నాయకత్వంలోని ప్రభుత్వం, హిందుస్థాన్ టైమ్స్ మాత్రం నేనొక సవాలు విసరినట్టు రాసాయి.

నెహ్రూ ఇంకా సమస్యాత్మకమైన ప్రకటనలు చేసాడు. ఏప్రిల్ 24 నాడు యుద్ధం లేదా విలీనం అన్నమాట తెలిసిందే. రెండు రోజుల తర్వాత 26 వ ఏప్రిల్‌నాడు సరిహద్దులలో శాంతి భద్రతలు తప్ప మిగిలినవన్నీ రెండవ ప్రాధాన్యత అంశాలు అంటూ ఒక వేళ వాటిని సరిదిద్దలేకపోతే భారత్ అందులో కలుగజేసుకుంటుంది అన్నాడు. మరో అయిదు రోజుల తర్వాత మే 1 నాడు పత్రికలతో మాట్లాడుతూ ఆతృతగా తన ఎగుడుదిగుడు ఊహలన్నీ చెప్పాడు. హైద్రాబాద్‌కు రెండు ప్రత్యామ్నాయాలున్నాయన్నాడు.

ఒకటి విలీనం-తద్వారా భారత్‌లో భాగస్వామ్యం, లొంగి ఉండడం కాదు. రెండవదది సహాయక ఆధీనం. తాను బొంబాయి సమావేశంలో యుద్ధం అనేమాట సమస్యకు పర్యాయంగా వాడానని చెప్పాడు. భారతదేశ అంతర్భాగంలో కాని సరిహద్దుల్లోకాని విదేశీ భూమికను భారత్ సహించదన్నాడు. హైద్రాబాద్ తప్పనిసరిగా భారత్‌లో భాగవుతుందని వక్కాణించాడు. ఏ దేశ విలీనాన్ని భారత్ బుద్ధిపూర్వకంగా కోరుకోదని, సైనిక చర్యద్వారా అది సాధ్యంకాదని, ప్రజాభిప్రాయానికి అనుగుణంగా ఆ దేశ భవిష్యత్తు ఉంటుందని చెప్పాడు. అదే సమయంలో హైద్రాబాద్ ఒక్కటే రాచరికంలో ఉందని, సాంఘీకంగా వెనకబడి ఉందని మిగిలిన భారతదేశం ప్రజాస్వామ్యంలో ఉండగా హైద్రాబాద్ రాచరికంలో మనజాలదని, బాధ్యతాయుత ప్రభుత్వం ఏర్పాటు ఇప్పటికి అవసరమని వ్యాఖ్యానించాడు. తర్వాత సరిహద్దుల గురించి మాట్లాడుతూ సరిహద్దు ప్రాంతపు శాంతి ఇప్పటి తక్షణావసరమన్నాడు. ఆర్థిక దిగ్బంధం అంటే చాలా పెద్ద విషయమని, కేవలం ఆయుధాలు, యుద్ధ

సామగ్రి హైద్రాబాద్ చేరకుండా ఆంక్షలున్నాయన్నాడు. అత్యుత్సాహంలో భారత అధికారులు ఇతర సరుకులను కూడా ఆపి ఉండవచ్చునన్నాడు. హైద్రాబాద్ మీ డిమాండ్లన్నీ ఒప్పుకున్నట్లయితే విలీనం డిమాండును వదిలి వేస్తారా అని ఒక పాత్రికేయుడు ప్రశ్నించాడు. నెహ్రూ కోపంతో 'రెండే ప్రత్యామ్నాయాలున్నాయి. అవి విలీనం లేదా సహాయక ఆధీనం' అని జవాబిచ్చాడు. ఏది ఏమైనా రక్షణ, విదేశీ వ్యవహారాలు, సమాచార వ్యవస్థలను మాత్రం హైద్రాబాద్ భారత్‌కు ఇవ్వాల్సిందేనని చెప్పాడు.

నెహ్రూ మాటలన్నీ తికమకగా ఉన్నాయి. సహాయక ఆధీనం అంటే ఏమిటో ఎవరూ వివరణ ఇవ్వలేక పోయారు. కొన్నిరోజులు పోయాక మీనన్‌ను అడిగితే అది నెహ్రూయే చెప్పాలన్నాడు. వివరణ అడిగితే అసహనంతో దాట వేసేవాడు నెహ్రూ.

బలపడుతున్న ప్రజాభిప్రాయాన్ని గందరగోళ పరచడమే నెహ్రూ ప్రకటనల ఉద్దేశ్యం. పటేల్ ఆధ్వర్యంలోని ఆయన ఇతర మిత్రులు బయటి ప్రతిస్పందనలను గమనించారు కాని హైద్రాబాద్‌ను ఎలా త్వరగా ఆక్రమించగలమన్న దాని మీద మత్రమే వారి శ్రద్ధ.

# 23. నిజాం పరీక్ష

మే మాసపు తొలిరోజుల్లో ఢిల్లీకి రావలసిందిగా నిజాంకు ఒక సందేశం పంపించాడు మౌంట్‌బాటెన్. అది ఢిల్లీ హిట్లర్ల క్రూర ప్రణాళిక. నిజాంకు పూర్తిగా తెలుసు కావలసిన పత్రాల మీద సంతకాలకోసం వేసిన ఎత్తుగడ అని. నేను కలసినప్పుడు మౌంట్‌బాటెన్ లేఖను నా చేతిలో పెట్టాడు నిజాం. నేను లేఖ చదవడం పూర్తి అవుతుండగా దానికి ఆయన రాసిన జవాబు నా చేతిలో పెట్టాడు. నేను చదివాను. ఏమీ మాట్లాడలేదు. నిజాం ఏ వ్యాఖ్యలూ రావని అర్థం చేసుకున్నాడు. ఏ మార్పూ సూచించలేక మౌనంగా ఉండిపోయాను.

నిజాం చాలా వినయంగా రాసాడు ఢిల్లీకి రాలేని అశక్తతను వివరిస్తూ, ఇండియా నుండి వెళ్ళి పోయే ముందు ఒక్కసారి హైద్రాబాద్ రావలసిందిగా బాటెన్‌ను ఆహ్వానించాడు. బాటెన్‌కు హైద్రాబాద్ రావాలని ఉన్నా ఆయన ఢిల్లీ పెద్దలు అందుకు అంగీకరించట్లేదన్నది తెలిసిన విషయమే. ఇక నిజాం రాజు స్వతంత్రుడు కాదని, రజాకార్ల చేతిలో పావు అని ప్రచారం ప్రారంభించారు. ఆ ప్రచారం ఎందాక పోయిందంటే మౌంట్‌బాటెన్ తన స్వంత ప్రతినిధిని హైద్రాబాద్‌కు పంపించి సమాచారం తెప్పించుకోవడం మొదలుపెట్టాడు. మే నెలలో కాంప్‌బెల్ జాన్సన్‌ను పంపించాడు. కాంప్‌బెల్ జాన్సన్ రెండవ ప్రపంచ యుద్ధకాలంలో మౌంట్‌బాటెన్‌కు ఇలాంటి సేవలే అందించాడు. ఢిల్లీ నుండి అంతర్గతంగా అందుతున్న సమాచారం నన్ను ఇబ్బంది పెట్టసాగింది. అందుకే బాటెన్ దూతను సాదరంగా ఆహ్వానించాను, తద్వారా ఢిల్లీకి, బాటెన్‌కు సరియైన సమాచారం అందుతుందని భావించాను.

నిజాం భిన్నంగా ఆలోచించాడు. దుష్ప్రచారానికి ఎంతబాధపడ్డాడో బాటెన్ దూతను పంపడాన్ని అంతగా వ్యతిరేకించాడు. మొదట కాంప్‌బెల్ జాన్సన్‌ను ఆయన గుర్తించదలుచుకోలేదు కాని నేను సమాధాన పరిచిన పిదప కాంప్‌బెల్‌ను కలుసు కోవడానికి సుముఖత చూపించాడు. ఆయన స్వంతంగా కాంప్‌బెల్‌ను కలవడానికి ఇష్టపడక నేను పరిచయం చేయాలనుకున్నాడు. నిజాంను కలువబోతున్నందుకు కాంప్‌బెల్ చాలా సంతోషంగా ఉన్నాడు కాని మధ్యలో నేను ఉండడం ఆయనకు కొంత నిరుత్సాహం కలిగించింది. నిజాంను ఏకాంతంగా కలిసే అవకాశం దొరుకుతుందని బాటెన్ చెప్పినట్లు మాంక్‌టన్ చెప్పాడు.

మే నెల మధ్యాహ్నం హైద్రాబాద్‌లో చాలా వేడిగా ఉంటుంది. కృత్రిమ శీతలీకరణ లేదా ఏర్‌కండీషనింగు నిజాంకు నచ్చదు. అందువల్ల వేసవి కాకను, నిజాం ఆగ్రహాన్ని సమానంగా చవిచూవడలసి వచ్చింది కాంప్‌బెల్. ఎంతో సన్నిహితంగా ఉండే నేను కూడా ఇబ్బందిపడే విధంగా ఘాటుగా, సూటిగా మాట్లాడాడు నిజాం. తన వేదనను బాటెన్ ముందు వెళ్ళగక్కడానికి ఎంతో కాలం నుండి వేచి చూస్తూ ఉన్నట్లనిపించింది ఆయన ధోరణి చూస్తే. చివరికి సంభాషణ ఎలా ఉందని కూడా నన్ను అడిగాడు. అవసరమైన దానికంటే ఎక్కువగా బయటపడి మాట్లాడారన్నాను, 'అందుకే నిన్ను ఉండమన్నాను' అన్నాడు!

కాంప్‌బెల్ జాన్సన్ ప్రజలను కలుస్తూ, పర్యటిస్తూ గడిపాడు. సరిహద్దు దాడులు చేసే వాళ్ళను పరిశీలించాడు. ఆయన పర్యటనను కాంగ్రెస్ పత్రికలు విమర్శించాయి. మౌంట్‌బాటెన్ వ్యక్తిగత పరిశీలకుడిని పంపడాన్ని తప్పుబట్టాయి. కాంప్‌బెల్ జాన్సన్ పర్యటన వల్ల ఇండో–హైద్రాబాద్ సంబంధాలు బాగుపడతాయని ఎవరూ భావించ నప్పటికీ హైద్రాబాద్ వ్యవహారమంతా నిజాం చేతిలోనే ఉందని ఆయన ఇష్టానుసారమే హైద్రాబాద్ డిమాండ్లు ఉన్నాయని బాటెన్‌కు తెలుస్తుందని భావించడం జరిగింది.

వైరుధ్యాలు సమసిపోయేందుకు సూచనలిస్తూ ఏప్రిల్ 5వ తేదీన భారత ప్రధానికి ఒక సుదీర్ఘమైన లేఖ రాసాను. వివాదమున్న అంశాలన్నిటినీ యధాతథ ఒప్పందం పరిధిలో మధ్యవర్తిత్వానికి ప్రయత్నించమని లేఖ ముగింపులో సూచించాను. మే మధ్యనాటికి కూడా ఈ లేఖకు ఏ జవాబు రాలేదు. తర్వాత రాష్ట్రాల వ్యవహారాల శాఖ నుండి గట్టి జవాబు వచ్చింది. అది బెదిరింపులాగే ఉంది.

అందులో యధాతథ ఒప్పందాన్ని హైద్రాబాద్ బహిరంగంగా ఉల్లంఘించిందని

ఆరోపించబడ్డది. కొత్త ఆరోపణలు కూడా చేయబడ్డాయి. అందువల్ల మధ్యవర్తిత్వానికి అవకాశం లేకుండా పోయిందని చెప్పారు.

రజాకార్లకు మద్దతు చెబుతుందని, సరిహద్దుల్లో శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తుందని, మెజారిటీ హిందువులను భయకంపితుల్ని చేస్తుందని, భారత వ్యతిరేక ప్రచారం చేస్తుందని హైద్రాబాద్ మీద ఆరోపణలు చేసారు ఆ లేఖలో. హైద్రాబాద్ ధోరణి మీద భారత ప్రభుత్వం నిరసన వ్యక్తం చేస్తూ "యథాతథ ఒప్పందాన్ని అమలు పరచడంలో విఫలం చెందిన మీరు నిస్సందేహంగా విలీనం మాట మర్చిపోయారు. బాధ్యతాయుత ప్రభుత్వ ప్రకటనకూ సిద్ధపడలేదు" అని ఆరోపించింది. హైద్రాబాద్ పాక్‌తో స్నేహం చేస్తూ దక్షిణ భారతదేశ శాంతి భద్రతలను భంగపరుస్తున్నదని, మత సామరస్యాన్ని చెడగొడుతున్నదని ఆరోపించింది!

భారత, హైద్రాబాద్‌ల మధ్య కుదిరిన యథాతథ ఒప్పందం ఒక్క సంవత్సరం పాటు వివాదాస్పదమైన అంశాలను మధ్యవర్తిత్వానికి అవకాశం కల్పించింది. ఎనిమిది నెలల ముందే హైద్రాబాద్ మధ్యవర్తిత్వం కోసం అభ్యర్థించింది. ఆ అభ్యర్థనకు జవాబివ్వడానికి భారత్ ఆరువారాల సమయం తీసుకుంది. యధాతథ ఒప్పందంలో సగం కాలం ఇంకా మిగిలే ఉన్నా సమయం లేదన్న వంకతో హైద్రాబాద్ అభ్యర్థనను తిరస్కరించింది.

భారత ప్రధానికి నేను రాసిన జవాబులో ఆ తప్పుడు ఆరోపణలన్నింటినీ ఖండించాను. వివాదాస్పద అంశాలన్నీ నిష్పాక్షిక మధ్యవర్తిత్వానికి అప్ప జెప్పాలని పట్టుబట్టాను. నా సుదీర్ఘమైన లేఖను నాలుగు ముఖ్యమైన అంశాలతో ముగించాను.

మొదటిది: హైద్రాబాద్ ఢిల్లీతో చాలా స్నేహపూర్వక, సాదర సంబంధాలను కొనసాగించాలనుకుంటుంది.

రెండు: రెండు దేశాల మధ్య విభేదాలను స్నేహపూర్వక చర్చల ద్వారా పరిష్కరించుకోవాలనుకుంటుంది. ఒక వేళ అది సాధ్యం కాకపోతే తక్షణం మధ్య వర్తిత్వానికి అంగీకరించాలనుకుంటుంది.

మూడవది: రజాకార్లు ప్రైవేటు సైన్యాలు కావు. సరిహద్దు దాడులకు పాల్పడే వారి నుండి, అంతర్గత అలజడి శక్తులనుండి తమ ప్రాణాలు, ఆస్తులు రక్షించుకోవడానికి ఏర్పడ్డ వ్యక్తుల సమూహాలు అవి. ఇండియాలోని స్థానిక ప్రావిన్సులతో సత్సంబంధాలు నెరపడం ద్వారా సరిహద్దులలో శాంతిని స్థాపించుకోవాలని హైద్రాబాద్ భావిస్తుంది.



నాలుగు: పత్రికలను, రేడియోను ఆధీనంలోకి తెచ్చుకోవడం ద్వారా ఇండో హైద్రాబాద్ సంబంధాలను చెడగొట్టే ప్రచారాన్ని నిరోధించడానికి పరస్పర అంగీకార యోగ్యమైన ఏకాభిప్రాయానికి రావాలని హైద్రాబాద్ కోరుకుంటుంది.

ముగింపు ఇలా రాసాను–

"భారత హైద్రాబాద్ సంబంధాలు దిగజారడం పట్ల మీలాగే విచారపడే వ్యక్తుల్లో నేనూ ఉన్నాను. ప్రస్తుతం అనుమానాలకు తావివ్వడం మంచిది కాదు. ఆర్థిక దిగ్బంధం, నిత్యావసరాల సరఫరాలో కోతలాంటి పైన చెప్పిన అంశాలు (మందులు, ఇతర అత్యవసరాలు) ఇటీవలి నివేదికల ప్రకారం ఆహారపదార్థాల నిలుపుదల పరస్పర స్నేహానికి పనికి వచ్చేవి కావు. ఢిల్లీ శక్తి సామర్థ్యాలు హైద్రాబాద్‌కు తెలుసు. ఢిల్లీది బలంలేని చర్యలుగా మేమెప్పుడు భావించలేదు. అవకాశం వస్తే హైద్రాబాద్, భారత్‌కు నమ్మకమైన మిత్రుడు, పనికి వచ్చే సహచరుడు, సహాయపడే సన్నిహితుడు కావాలని ఆతృతపడుతుంది. మరి భారత్ ఎందుకు హైద్రాబాద్‌ను అనుమానంగా చూసి దాని మనుగడను సమస్యాత్మకం చేయాలి? భారతదేశం ఉదాత్తమైన ఆశయంతో, సమున్నత లక్ష్యాలతో మనుగడలోకి వచ్చింది. నిజాయితీగా హైద్రాబాద్ సాచిన స్నేహహస్తాన్ని తిరస్కరించడం వల్ల భారత్‌కున్న గంభీరమైన ప్రతిష్ట నిలబడదు."

కొంతకాలం తర్వాత ఢిల్లీలోని హైద్రాబాద్ ఏజెంట్ జనరల్ సూచన మేరకు నేను ఢిల్లీ వెళ్ళాను. మౌంట్‌బాటెన్ నిష్క్రమించే రోజు దగ్గరపడ్డ కొద్దీ సమస్యకు ఏదో పరిష్కారం దొరుకుతుందని హైద్రాబాదీలు ఆతృతగా ఎదురు చూస్తున్నారు. నేను ఢిల్లీకి బయలుదేరుతుండగా నిజాం మౌంట్‌బాటెన్‌కు ఒక టెలిగ్రాం పంపించాడు. గవర్నర్ జనరల్‌గానే కాకుండా ఇంగ్లాండు రాయల్ ఫ్యామిలీ సభ్యుడిగా భారత్ హైద్రాబాద్‌ల మధ్య న్యాయమైన, సముచితమైన అవగాహన కోసం ప్రయత్నించాలని నిజాం అందులో కోరాడు.

మే 23న నేను ఢిల్లీ వెళ్ళేటప్పటికి బాటెన్ దూరంగా ఉన్నాడు, మరో రెండు రోజులకు కానీ రాడు. నేను ఢిల్లీ చేరగానే పత్రికల్లో గానీ ప్రభుత్వ వర్గాల్లో కానీ నా రాకలోని ప్రయోజనాన్ని చెడగొట్టే ఏదైనా కథనం నడుస్తుందా అని ఆరాతీసాను. ఆయన ఔనన్నాడు. నా ప్రతి పర్యటనను చెడగొట్టే వాతావరణాన్ని సృష్టించడానికి ఢిల్లీలో గోబెల్స్ సిద్ధంగానే ఉంటారు. ఢిల్లీకి వచ్చిన ప్రతిసారీ భారత ప్రభుత్వ ప్రతినిధులు పరిస్థితిని నిలువరించడం కష్టమైపోయిందని చెబుతారు. హైద్రాబాద్‌పై మిలటరీ చర్య ఆగిపోవడానికి ఏకైక మార్గం భారత్‌లో హైద్రాబాద్ విలీనమేనని వ్యాఖ్యానిస్తారు. ఈ సారి అల్లిన కథనం బొంబాయి మద్రాస్ ఎక్స్‌ప్రెస్ రైలుపై హైద్రాబాద్ భూభాగంలో నడుస్తుండగా దాడి. ముగ్గురు భారత సైనికుల్ని హైద్రాబాద్ నిర్బంధించిందని కూడా కథనం.

ఆ సంఘటనల మీద కావలసినంత రచ్చ నడిచింది. ఈ ఘటన ముందే వేసిన ప్రణాళిక అని నాకు సమాచారం లేదు. వి.పి.మీనన్‌కు మాత్రం చాలా సమాచారముంది. ఇక విలీనాన్ని వాయిదా వేయడానికి అవకాశం లేనంతగా ప్రేరేపించగలిగేంత సమాచారం. ఢిల్లీ అధినాయకులు ఇంకెంత మాత్రమూ ఆలస్యం చేయగూడదు అనుకోదగినంత. ఇతర వర్గాల ద్వారా నాకు తెలిసిందేమిటంటే కాశ్మీర్‌లో భారత సైన్యానికి గట్టి ఎదురు దెబ్బతగిలిందని, దాన్నుండి ప్రజల దృష్టిని మళ్ళించడానికి అదే సమయంలో ఈ కథను అల్లారని, ప్రజల దృష్టిని మరల్చడానికి సులభంగా దొరికే అంశం హైద్రాబాద్!

నెహ్రూ, ఇతర నాయకులతో నా చర్చలు ఏమంత నిర్మాణాత్మకంగా సాగలేదు. ఒక కొత్త విషయాన్ని నేను గమనించాను. అదేమిటంటే ఢిల్లీలోని ప్రముఖులందరూ నిజాం క్రియాశీలమైన వ్యక్తి అని, ఇదంతా మంత్రులు, కొద్దిమంది నాయకుల అభీష్టం మాత్రమే కాదని అవగాహనకు వచ్చారు. ఇదంతా మౌంట్‌బాటెన్ వ్యక్తిగత

దూత హైద్రాబాద్ పర్యటన వల్ల వచ్చిన అవగాహన. నిజాం స్వంతంగా నిర్ణయాలు తీసుకోలేడని మౌంట్‌బాటెన్ మస్తిష్కంలో ఉన్న అనుమానం సమూలంగా పటాపంచలయింది.

మౌంట్‌బాటెన్ ఢిల్లీకి తిరిగి వచ్చాడు కానీ నాతో చర్చలకు సమయం చిక్కలేదు. ఇప్పుడు బాటెన్ హైద్రాబాద్‌పై నిజాలు తెలిసి, స్పష్టతతో ఉన్నాడు. తాను వెళ్ళిపోయేరోజు దగ్గర పడుతున్నకొద్దీ సమస్య ఒక కొలిక్కి వస్తుందని ఆశించాడు. విలీనం మినహా ఏ ప్రత్యామ్నాయం లేదని భావిస్తూ ప్రస్తుత పరిస్థితిలో విలీనం కాని పరిష్కారమేదైనా ఉంటే బాగుండుననుకొన్నాడు. తక్షణ పరిష్కారానికి నేను చేయగలిగిందంతా చేస్తానని బాటెన్‌కు చెప్పాను, తాను వెళ్ళేలోగా ఏదో ఒకటి జరగాలని చెబుతూ, సమస్య పరిష్కారం కాకముందే తాను వెళ్ళిపోతే హైద్రాబాద్ పరిస్థితి ఎలా ఉంటుందో నాకు వివరించి చెప్పాడు. భారత నాయకులంతా సైనిక చర్యకు సిద్ధపడ్డారని తానే వారిని ఆపుతున్నానని చెప్పాడు. తాను భారత ప్రభుత్వంనుండి వైదొలగిన వెంటనే ఏదో ఒక విషయంతో భారత సైన్యాలు కదులుతాయని చెప్పాడు. హైద్రాబాద్ వ్యతిరేక ప్రచారాన్ని పెంచి వేసి ప్రపంచం దృష్టిలో సైనికచర్య అవసరమైన చర్యగా భావించే పరిస్థితి సృష్టిస్తారని చెప్పాడు. హైద్రాబాద్‌తో పోలిస్తే భారత్ శక్తి సామర్థ్యాలు చాలా ఎక్కువని చెప్పాడు. భారత్ ఐక్యరాజ్యసమితి (ఐరాస)లో తనకు అనుకూలంగా చూపించుకో గలదని చెప్పాడు. హైద్రాబాద్ విషయంలో భారత్‌ది న్యాయమైన చర్య అని చూపించి ఐరాసను జోక్యం చేసుకోకుండా చేయగలదని ఆయన నమ్మాడు. బ్రిటన్ ఓటు ఎటు మొగ్గుతుందో నమ్మకంగా చెప్పలేనని చెబుతూ, హైద్రాబాద్ కోసం బ్రిటన్ భారత్‌తో దూరం పెంచుకుంటుందని తాను అనుకోనని చెప్పాడు. బ్రిటన్ వదిలిన సైన్యాలు, సకల ఆయుధ సంపత్తితో ఎలా హైద్రాబాద్ మీదికి పరుగులు తీస్తాయో, భారత సైన్యపు ఆయుధాల ధాటికి హైద్రాబాద్ మిలటరీ ఎలా తట్టుకోలేని పరిస్థితిని ఎదుర్కొంటుందో ఆయన వివరంగా చిత్రించినట్లు చెప్పాడు. నిజాం ఒక చురుకైన వ్యక్తి అవుతాడని ఒకవేళ ప్రపంచాభిప్రాయాన్ని దృష్టిలో పెట్టుకొని నిజాంను నిర్బంధించకపోతే కూడా వాస్తవంలో బందీగానే ఉండవలసి ఉంటుందన్నాడు. నేను, నా ఇతర సహచరులు మొదటి దెబ్బకే చస్తామని చెప్పాడు. నేను దాడుల్ని నిరోధించే క్రమంలో విఫలమైతే విలీనం విజయవంతం కాకుండా తన శక్తి మేరకు అడ్డుకుంటానని చెప్పాడు. అయితే భారత నాయకులు సైనిక చర్యకు పకడ్బందీ ప్రణాళికలు వేసినందున విలీనానికి అంగీకరించకుంటే హైద్రాబాద్ తన దైన్యాన్ని చవి చూడవలసి

ఉంటుందన్నాడు.

మౌంట్‌బాటన్‌కు నా చిత్తశుద్ధి మీద పూర్తినమ్మకం ఉన్నా భారత నాయకుల నమ్మకరాహిత్యం ఆయనకు తెలిసింది. భారత నాయకుల దృష్టిలో నేను పాక్ మద్దతుదారునని ఆయన చెప్పాడు. పాక్ ప్రతినిధిగా ఒక సందర్భంలో నేను ఐరాసకు వెళ్ళడమే వాళ్ళ అభిప్రాయానికి హేతువు. నా రాజీనామావల్ల భారత నాయకుల మెదళ్ళకు శాంతి లభిస్తుందని చెప్పాడు. నా రాజీనామా ఇండో హైద్రాబాద్ సంబంధాలను మెరుగు పరుస్తుందంటే, హైద్రాబాద్ కోసం నా రాజీనామా అవసరమంటే ఒక్క నిముషం కూడా నేను పదవిలో ఉండనన్నాను. అదే సందర్భంలో నా దేశాన్ని చులకన చేస్తే తట్టుకునే వ్యక్తులలో నేను చివరి వాణ్ణి. అవసరమైతే సేవకు లేదా రక్తాన్ని ఇవ్వడానికైనా సిద్ధమని చెప్పాను. బాటెన్ చెప్పిన ప్రతిమాటా నిజాంకు, నా ఇతర సహచరులకు చెబుతానని, రాజీనామా కూడా చేస్తానని చెప్పాను. అదే సందర్భంలో నిజాం, ఇతర హైద్రాబాద్ ప్రజలు ఇది హైద్రాబాద్‌కు చేసే సేవనుండి తప్పుకోవడమవుతుందని అంటే పదవి వదులుకోవడానికి నేను చివరి వ్యక్తిని అవుతానన్నాను.

ఆ రోజు రాత్రి బాటెన్ చెప్పిన విషయాలు లోతుగా ఆలోచించాను. గతంలో ఎన్నడూ లేనంతగా నిరుత్సాహ పడిపోయాను. హైద్రాబాద్ వెళ్ళగానే నిజాంకు రాజీనామా సమర్పించాలనుకున్నాడు. దాని వల్ల చిక్కుముడి విడిపోయేటట్లుంటే అది చిన్న విషయమేంకాదు. మధ్యలో చర్చల్లో ఏ నిర్ణయం తీసుకోలేను. నేను పదవి నుండి తప్పుకున్నాక నిజాం విధానాలలో మార్పు వస్తుందని మాత్రం అనుకోలేను. మానసికంగా అలసిపోయాను. వ్యక్తిగత విషయాన్ని జిత్తులతో ప్రవేశపెట్టగానే ఎదుటివారి అభిప్రాయం, దూరదృష్టి మందగించడం ఆశ్చర్యకరం, ప్రధాన విషయాలమీద దృష్టి పెట్టకుండా నా మెదడు మొద్దు బారిపోయేందుకు వేసిన ఎత్తుగడగా అనిపించింది.

మున్షీ హైద్రాబాద్‌లో ఏజెంట్ జనరల్‌గా ఉన్నది పెద్ద విషయం కాదని తేలిపోయింది కానీ రెండు వైపులా అనుమానాలు పెరిగిపోయాయి. తొందరలోనే మున్షీ స్థానంలో కొత్తవారొస్తారని ఒకటీ రెండు పేర్లు చెప్పాడు బాటెన్.

చర్చల సారాంశంగా రక్షణ, విదేశీ వ్యవహారాలలో హామీ లభించినట్లైతే భారత్ హైద్రాబాద్‌తో ఒక అంగీకారానికి రావచ్చని బాటెన్ తేల్చాడు. ఇక్కడ

అంగీకారానికి ఒక ఆధారం దొరికినట్లనిపించి నేను అందుకు సిద్ధపడ్డాను. చట్టసభల ఏర్పాటు, రక్షణ, విదేశీ వ్యవహారాలు, సమాచార రంగంలో వారు కోరుకున్న పెత్తనానికి మాత్రం అంగీకరించదలుచుకోలేదు, ఎందుకంటే అది విలీనంకంటే తక్కువేమీ కాదు. అయితే చట్ట సభల మీద పెత్తనం తప్పించి రక్షణ, విదేశీవ్యవహారాలు, సమాచారరంగం విషయంలో భారత్‌తో పుర్తిగా సహకరిస్తామని భారత్‌కు తెలియజేయాలని ఆరాట పడ్డాను. భారతదేశంలోలాగా తక్షణం చట్టసభల ఏర్పాటుకు నిజాం చర్యలు తీసుకోగలడని చెప్పాలని అనిపించింది. ఒక రకంగా ఇది కూడా విలీనానికి సూక్ష్మ రూపమవుతుందని అనిపించినా, వేరే మార్గం ఏదీ నా చేతిలో ఉన్నట్లు తోచలేదు. హైద్రాబాద్ సమగ్రతను కాపాడుకోవడమే మిగిలిన ఏకైక గొప్ప లక్ష్యమనిపించింది నాకు.

భారత్‌తో కలసి భారత రక్షణకు విదేశాలతో పోరాడడం, తద్వారా హైద్రాబాద్ అంతర్గత అనిశ్చితిని దారిలో పెట్టడం గొప్ప ఆలోచనగా తోచింది నాకు. ఢిల్లీ ప్రతినిధుల మాటలు ఇందుకు భిన్నంగా ఉన్నాయి. వాళ్ళు హైద్రాబాద్ సైన్యం మీద ఆంక్షలు పెట్టడానికి సిద్ధంగా ఉన్నారు తప్ప ఏవేని విపత్కర పరిస్థితిలో దాన్ని వాడుకోవచ్చనే ఆలోచనలో లేరు. హైద్రాబాద్ ఢిల్లీ స్నేహంకోసం చేతులు చాస్తుండగా, ఢిల్లీ మాత్రం హైద్రాబాద్‌ను ఒక అనవసర దేశంగా చూస్తూ దాని మనుగడను పరిసమాప్తి చేయాలనే ఆలోచనలో ఉంది.

చర్చల సారంగా తేలిందేమిటంటే భారత్‌లో లాగా శాసన సభ ఏర్పాటు, రక్షణ, విదేశీ వ్యవహారాలు, సమాచార రంగంలో భారత్‌తో కలిసి వ్యవహరించాలని, హైద్రాబాద్ సైన్యం ఇరవైవేలకు కుదించాలని, ఇతర రక్షణ దళాలు ఎనిమిది వేలకు పరిమితం చేయాలని నిర్ణయించబడ్డది. ఇదంతా నిజాం దృష్టికి తీసుకెళ్తానని, అదే సందర్భంలో ఆర్థిక, అంతర్గత స్థిరత్వం దెబ్బతినకుండా హైద్రాబాద్‌కు రాష్ట్రాంతర్గత కరెన్సీ, లావాదేవీలలో విదేశీ వ్యవహారాలలో స్వేచ్ఛ ఉండాలని స్పష్టం చేసాను. విదేశీ లావాదేవీలన్నింటిని ప్రత్యేక పద్దును కొనసాగించినంత వరకు భారత రిజర్వు బ్యాంకు ద్వారా జరపడానికి అంగీకరించాను. హైద్రాబాద్ అంతర్గత తపాలా, సమాచార వ్యవస్థలు స్వతంత్రంగా వ్యవహరిస్తాయని చెప్పాను. ఒప్పందాలన్నీ సరిగ్గా అమలు జరిగితే హైద్రాబాద్ ఒక స్వతంత్ర దేశంగా ఉండి తీరాలని పట్టుబట్టదు కానీ ఐరాసలోని అంతర్జాతీయ ఆహార సంస్థ, ఆరోగ్య సంస్థ, అంతర్జాతీయ ద్రవ్యనిధి వంటి సంస్థల్లో సభ్యత్వం పొందడం కోసం భారత్ సహకారం కోసం ఎదురు చూస్తుందని

చెప్పాను. అలాంటి సభ్యత్వం పెద్ద కష్టమేమీ కాదని, పైగా అది భారత్‌కు లాభిస్తుందని నెహ్రూ భావించాడు.

హైద్రాబాద్‌లో ప్రభుత్వం రూపురేఖలు అన్నది ఒక పెద్ద ప్రశ్నగా మిగిలింది. వాళ్ళ అవసరం కోసం హైద్రాబాద్‌ను ఒక చర్చనీయాంశం చేసారని బాటెన్‌కు, నెహ్రూకు తెలుసు. అది అంతర్గతంగా జరుగుతున్న స్నేహశీల చర్చలు కాబట్టి ఆరునెలల్లో ప్రభుత్వ రూపురేఖలు మారిపోతాయని నేను చెప్పాను. భారత్‌లో వివిధ వర్గాల ప్రజల మధ్య సమస్యలు లేనప్పుడు హైద్రాబాద్‌లో కూడా మైనారిటీలకు సమస్యలు ఉండవని చెప్పాను. ఇప్పుడున్న పరిస్థితుల వల్ల మైనారిటీల భయాలు సులభంగా తీసివేయదగ్గవేమీ కావని చెబుతూ ఇంతకంటె మెరుగైన పరిస్థితి వస్తుందని చెప్పాను. ముస్లింలు హిందువులు సమాన భాగస్వామ్యంతో ఏర్పడే ప్రభుత్వమే దీనికి సరియైన పరిష్కారం అని చెప్పాను. పరిపాలనలో పాలు పంచుకోవద్దని ఢిల్లీ నాయకులు స్టేట్ కాంగ్రెస్ నాయకులకు చెప్పి ఉండకుండా ఉంటే పరిస్థితి ఇప్పటికే ఇంకా మెరుగ్గా ఉండి ఉండేదని నెహ్రూకు చెప్పాను. హైద్రాబాద్ వ్యవహారాలలో ఢిల్లీ పరోక్ష జోక్యం వల్ల రెండు దేశాల మధ్య అగాధం పెరిగిందని చెప్పాను. ముస్లీంలు మైనారిటీ స్థానంతో సంతృప్తి చెందాలన్నాడు నెహ్రూ. భారత కాంగ్రెస్ నాయకులు హైద్రాబాద్ హిందువులకిచ్చిన మాటను నిలబెట్టుకుంటారన్నాడు.

ఢిల్లీ హైద్రాబాద్ చిక్కుముడి వీడకపోవడానికి గల కారణాలలో నేను కూడా ఒకడినని మానసికంగా నన్ను దెబ్బ తీసారని నేనన్నాను. అందువల్ల నిజాంకు, నా ఇతర సహచరులకు చెప్పకుండా నేను ఔనని కాని, కాదని కాని చెప్పలేని పరిస్థితికి వచ్చాను. నేను హైద్రాబాద్‌కు వెళ్ళి మాట్లాడి తిరిగి వచ్చి చర్చిస్తానని మౌంట్ బాటెన్‌కు. నెహ్రూకు చెప్పాను.

ఢిల్లీ ఒక ప్రత్యేకమైన ప్రాంతం. భారత ప్రభుత్వ నాయకుల మనస్తత్వం, మానసిక స్థితి అవగాహన కావాలంటే అక్కడ కొంత అనుభవం కూడా ఉండాలి. అక్కడి వాద ప్రతివాదాలు చిన్నస్థాయిలో ఉంటాయి. భారతదేశం రాజకీయంగా, పరిపాలనా పరంగా స్థిరపడడానికి, అది స్థిరపడ్డాక అక్కడి నాయకులు విశాలమైన దృక్పథాన్ని ఏర్పరచుకోవడానికి చాలా సమయం పడుతుందని విదేశీ దౌత్య వర్గాలు భావిస్తాయి. నేను ఢిల్లీలో ఉన్నప్పుడు అక్కడి అధికార వర్గాలలో ఒక వదంతి ప్రచారం లోకి వచ్చింది. తరతరాలుగా వచ్చిన ఆస్తి వల్ల నిజాం అణుబాంబును తయారు చేయించుకున్నాడని, హెలికాప్టర్లను కూడా సమకూర్చుకున్నాడని, సమస్య

జటిలమైనప్పుడు భారతదేశం లోని ప్రధాన నగరాల మీద అణుబాంబులు ప్రయోగిస్తాడన్నది ఆ వదంతి. ఆ కారణం వల్లనే భారత్ బలప్రయోగానికి వ్యతిరేకంగా గట్టిపట్టుతో హైద్రాబాద్ ఉన్నదని అక్కడ అనుకున్నారు. నిజాం విదేశీ శక్తులతో రహస్య ఒప్పందం చేసుకున్నాడని అందువల్ల ఆపత్కాలంలో వారు నిజాంకు ఎంతైనా సహాయపడతారని ప్రచారం జరిగింది. అత్యున్నత స్థాయిలో దాన్ని నమ్మడం జరిగిందా లేదా అని నమ్మకంగా చెప్పలేము. కాని రెండవ శ్రేణి ఆ ప్రచారాన్ని నమ్మింది! అహింస గురించి ఎంతగానో ప్రచారం చేసుకున్న ఢిల్లీలోని నాయకత్వం పైనుండి కిందిదాకా నశ్వరమైన జీవితంలోని నైతిక శక్తిని గుర్తించలేక పోయింది. మనిషికి నీతి ముఖ్యమనే వాళ్ళూ ఉన్నారు కానీ వారి గొంతు ఆదిలోనే నొక్కబడ్డది.

# 24. ఒత్తిడిలో ప్రజాభిప్రాయం

నరాలు తెగే ఉత్కంఠల మధ్య ఢిల్లీ నుండి బయట పడ్డందుకు నేను ఆనందించాను. గతంలో ఇలాంటి సందర్భాలలో సర్ వాల్టర్, లేడీ మాంక్‌టన్‌ల ఆనందకరమైన సహచర్యం ఉండేది. వారిలో ఆనందమే కాకుండా వ్యక్తిగత రక్షణ కూడా ఉన్నట్లనిపించేది. మౌంట్ బాటెన్, వాళ్ళు ప్రయాణించే విమానానికి నమ్మకమైన ఎ.డి.సి.లను ముందుగానే పంపేవాడు. నాకోసం ముందుగా ఎడిసిలను పంపి విమాన ట్రయల్ చేద్దామన్నాడు హైద్రాబాద్ ఏజెంట్ జనరల్. మొదట ఆ ఆలోచనను పరిహసించాను కానీ పట్టుబట్టేసరికి ఒప్పుకున్నాను. ఢిల్లీ వ్యవహారాలు నా కన్నా ఆయనకు బాగా తెలుసు!

నిజాం నా కోసం ఆతృతగా ఎదురు చూస్తున్నాడు. విమానం దిగిన వెంటనే ఆయన్ని కలిసి అన్ని వివరాలూ చెప్పాను. అక్కడ విలువైన రాజ్యాంగ విషయాలున్నాయి. ఈ దశలో మాంక్‌టన్ ఉంటే చాలా ఉపయోగకరంగా ఉండేదని ఇద్దరమూ భావించాం. హైద్రాబాద్‌కు తర్వగా రావాలని నేను ఆయనకు తంతి పంపాను. నిజాం కూడా సత్వరం హైద్రాబాద్ వచ్చి తీరాలని తంతి పంపాడు.

నేను ఢిల్లీ నాయకులకు కంటగింపుగా ఉన్నానని మౌంట్ బాటెన్ చెప్పాడని, నేను తప్పుకుంటే ఇండో హైద్రాబాద్ సమస్య పరిష్కారాన్ని వాళ్ళు సుముఖత చూపవచ్చని చెప్పితే నిజాం బాధపడ్డాడు, ఆవేశంలోకి వచ్చాడు. భారత్‌తో వ్యవహారం చక్కబడడం అన్నింటికంటే ముఖ్యమని, అందుకు నా రాజీనామాను అంగీకరించామని కోరాను. నిజాం దాన్ని తీవ్రంగా వ్యతిరేకించాడు. ఈ క్లిష్ట పరిస్థితిలో తను కానీ, హైద్రాబాద్

ప్రజలు కానీ ఏ మార్పుకూ ఒప్పుకోరని చెప్పాడు. నాకు వ్యక్తిగత ప్రమాదం ఉందంటేనే అందుకు ఒప్పుకుంటానన్నాడు. నా కారణాలు రాజీనామా సందర్భంగా చెబుతానని వాటిని ఆయన బహిర్గతం చేయొచ్చని చెప్పాను. వ్యక్తిగతం ఏమీ లేదని, హైదరాబాద్ కోసం తన రాజీనామా అని, బాధ్యతలకు ఎప్పుడూ భయపడలేదని చెప్పాను. వెంటనే కాగితం తీసుకుని తీవ్రమైన పదజాలంతో బాటెన్‌కు ఒక లేఖ రాశాడు. అందులో నేను ఎంతగా పట్టుబట్టినా నా రాజీనామాను ఆమోదించడం లేదని, నన్ను బాధ్యతల నుండి కూడా తప్పించలేనని చెబుతూ, ఇలాంటి సలహాలు వస్తే అవి మౌంట్ బాటెన్‌వేనని భావించాల్సి వస్తుందని బాధతో రాశాడు.

నాకు స్వాగతం చెప్పడానికి విమానాశ్రయానికి వచ్చిన సహచరులకు కొందరికి నేను రాజీనామా చేయబోతున్నానని చిన్న లీకు ఇచ్చాను. గంట లోపల నేను నిజాంను కలిసి వచ్చేవరకు ఆ వార్త దావానంలా వ్యాపించింది. నా కార్యాలయం సందర్శకులతో కిక్కిరిసిపోయింది. వ్యక్తిగత సందేశాలతో మునిగిపోయాను నేను. స్టేట్ కాంగ్రెస్ నాయకులు కూడా సందేశాలు పంపిన వారిలో ఉన్నారు. దేశంలోని అన్ని వర్గాలకు సరియైన సేవ చేస్తున్నానని అన్నారు వారంతా ముక్త కంఠంతో. ఆ తర్వాత రాజీనామా రచ్చ పక్కన పెట్టి కొత్త శక్తితో పనిచేయడం మొదలు పెట్టాను. మౌంట్‌బాటెన్‌తో రెండు రోజుల కింద మాట్లాడినప్పటి నిరుత్సాహం కొంత తగ్గింది.

భారత ప్రభుత్వంతో ఈసారి ఏదో ఒక ఒప్పందం కుదుర్చుకోవాలన్న ఆతృత హైద్రాబాదీయులందరిలోనూ కనిపించింది. హైద్రాబాద్ అంతర్గత సైన్యంపై భారత అధికారాన్ని చాలా మేరకు తగ్గించాలని ప్రతిపాదించటం జరిగింది. విదేశీ వ్యవహారాలలో భారత ప్రభుత్వం రాజకీయంగా స్వేచ్ఛగా వ్యవహరించవచ్చని చెప్పాను. స్వతంత్ర రక్షణ విధానం లేకుండా స్వతంత్ర రాజకీయ వ్యవస్థ మనగలగడం అర్థరహితమని నా భావన. ఆర్థిక, ద్రవ్య నియంత్రణ కోసం గట్టిగా పట్టుబట్టడం జరిగింది. ఎందుకంటే అవి కూడా లేకంటే భారతదేశం హైద్రాబాద్ మనుగడే లేకుండా చేసినట్టవుతుంది. నేరుగా గాని, పరోక్షంగా గానీ, ఇప్పుడు గానీ, భవిష్యత్తులోగానీ భారతదేశ ఆధిపత్యం ఎంత మాత్రమూ కొనసాగకుండా పట్టుబట్టడం జరిగింది. భారతదేశం ఏదేని బయటి దేశంతో యుద్ధంలో మునిగి ఉంటే హైద్రాబాద్ రాష్ట్రంలోని ఏ ప్రాంతంలోనైనా భారత సైన్యం విడిది చేయవచ్చు. ఒప్పందంలో హైద్రాబాద్ బలహీనపక్షం అయినందున రెండు ప్రభుత్వాల మధ్య ఏ విషయం లోనైనా ఏకాభిప్రాయం కుదరనప్పుడు ఆ అంశాన్ని ఒక నిష్పాక్షిక మధ్యవర్తిత్వానికి

నివేదించాలన్న వెసులుబాటును పెట్టించాను. అయినా ఒక విషయంలో విభేదం ఉంది. హైద్రాబాద్ శాసనసభలో ముస్లింలు 40 శాతానికి మించరాదనే ఒక అనధికార ఒప్పందానికి భారత ప్రభుత్వం పట్టుబట్టింది. అందులో 45 శాతం వరకు రాజీ పడవచ్చు. అయితే ఆ ఒప్పందం వచ్చేవరకైనా సమానత్వం పాటించాలని హైద్రాబాద్ ముస్లింలు అభిప్రాయపడ్డారు.

మాంక్టన్ అన్ని పనులు పక్కన పెట్టుకుని వీలైనంత త్వరగా రావడం మంచిదయింది. వచ్చిన దగ్గరనుండి శ్రమకోర్చి అటు ఢిల్లీ పెద్దల కోరికలను సంతృప్తి పరుస్తూ ఇటు హైదరాబాద్‌కు కావలసిన కనీస రక్షణలు చేర్చుతూ ముసాయిదాను తయారు చేయడంలో మునిగిపోయాడు. ముసాయిదాను మిత్రవర్గం విస్తృతంగా చర్చించి నిజాం ప్రతినిధికి చేర్చబడింది. జూన్ ఏడవ తేదీనాడు ముగ్గురు సభ్యులున్న ప్రతినిధి బృందం ఢిల్లీ వెళ్ళింది. నేను నాయకుడిగా, ఉప ప్రధాని పింగళి వెంకట్రామిరెడ్డి (హిందూ), రవూఫ్ (ఇత్తెహాద్), రాజ్యాంగ సలహాదారుడు మాంక్టన్ సభ్యులుగా.

హైదరాబాద్ శ్రద్ధగా ముసాయిదా తయారు చేస్తూ పోతే, నెహ్రూ తన ఉప న్యాసాలతో పరస్పర విరుద్ధమైన ప్రకటనలు చేస్తూ పోయాడు. "హైద్రాబాద్‌కు పరిష్కారం ఉంటుంది. అంతిమంగా అది విలీనంగానే ఉంటుందని మేం హైద్రాబాద్‌కు స్పష్టం చేశాం" అని జూన్ రెండు నాడు ఊటకముంద్‌లో మాట్లాడుతూ చెప్పినట్లు తెలిసింది. ఇప్పుడున్న పరిస్థితిలో హైద్రాబాద్‌లో తప్పక బాధ్యతాయుత ప్రభుత్వం ఉండాలన్నాడు. ఒకచోట "బలవంతంగా విలీనం చేయాలని మేమనుకోం. భారత రక్షణకు ఆపద వాటిల్లేటట్లు ఉంటే మేము ఆ పని చేయవలసి వస్తుంది" అన్నాడు. ఆ పరిస్థితికి ఉదాహరణ చెబుతూ "ఒకవేళ హైద్రాబాద్ శత్రురాజ్య స్థావరంగా మారితే" అన్నాడు. జూన్ 6న ఢిల్లీలో మాట్లాడుతూ "భారతదేశానికి నడుమ ఒక స్వతంత్ర దేశం ఉంటే మా రక్షణకు ప్రమాదం" అన్నాడు. హైద్రాబాద్‌తో వ్యవహారాన్ని చక్కబరుచుకునేందుకు సైన్యాన్ని సిద్ధం చేస్తున్నామని ఒక వంక చెబుతూ మరో వంక హైద్రాబాద్ చిక్కుముడిని విప్పేందుకు ప్రశాంతంగా, స్నేహపూర్వకంగా ప్రయత్నిస్తున్న ట్లు చెప్పాడు. రెండు ప్రభుత్వాలు ముసాయిదా తయారీలో ఉన్నప్పుడు ఆయన ఇలాంటి ప్రకటనలు చేస్తూ వచ్చాడు. ఇక ఉప ప్రధాని డెహ్రాడూన్‌లో గుండె నొప్పి తర్వాత విశ్రాంతిలో ఉన్నప్పటికీ హైద్రాబాద్ విషయంలో పురోభివృద్ధిని ఆరా తీస్తూనే ఉన్నాడు. తనకు తెలియకుండా నెహ్రూ కానీ, ఇతర క్యాబినెట్ సహచరులు కానీ ఏ నిర్ణయమూ తీసుకోకుండా చూస్తున్నాడు.

జూన్ 7న మధ్యాహ్నం మౌంట్ బాటెన్‌తో సుదీర్ఘంగా మనసు విప్పి మాట్లాడాను. హైద్రాబాద్‌లోని హిందువులంతా, ముస్లింలలో చిన్న సమూహం విలీనానికి అనుకూలంగా ఉన్నట్లు ఆయనకు అవగాహన ఉన్నట్లు అనిపించింది. ఈ చిక్కుముడి వీడడానికి మిగిలిన అన్ని సందర్భాలలోలాగానే పూర్తి ప్రజాస్వామ్యబద్ధంగా ప్రజాభిప్రాయ సేకరణ జరగాలని పట్టుబట్టాడు. విలీనం గానీ స్వతంత్ర దేశంగా మనుగడ సాగించడం గానీ ప్రజాభిప్రాయం మేరకు జరగాలన్నాడు. ఇది పూర్తిగా కొత్త ప్రతిపాదన. నా వద్ద ఏ అభిప్రాయమూ లేదు. నిజాం నుండి ఎలాంటి సూచనా లేదు. అదే సమయంలో ఏమి జరగాలన్నది ఆ దేశ ప్రజల ఇష్టం మీదే కదా అనుకున్నాను. ముస్లింలకన్నా హిందూ ప్రజాస్వామ్య ప్రీతి తక్కువ అని నేను అనుకోలేదు. ఒకసారి హైద్రాబాదీల మనోభావన గూడా ప్రపంచానికి ఎందుకు తెలియకూడదు? ఒకవేళ నా అభిప్రాయానికి భిన్నమైన అభిప్రాయంతో నా దేశవాసులు ఉంటే, నా దేశ హిందువులు ఉంటే దానికి అడ్డుగా నిలబడడానికి నాకే హక్కూ లేదు. అన్నీ ఆలోచించి అన్ని సమస్యలకూ ఒకే పరిష్కారమవుతుదని నేను తీర్మానించాను.

స్వతంత్ర సంస్థతో ప్రజాభిప్రాయ సేకరణకు నేను అంగీకరించడం మౌంట్ బాటెన్‌కు పెద్ద ఆశ్చర్యంగా మారింది. ఒక్కసారి వెనక్కు తగ్గాడు. ఇది తన ప్రతిపాదన మాత్రమేనని, తన ప్రభుత్వం చెప్పిన మాటకాదని అన్నాడు. అయినా ఇది కాల పరీక్షకు నిలబడ్డ, ప్రజాస్వామ్యబద్ధమైంది కాబట్టి దీనికి ఎవరూ కాదనరాదన్నాడు. తర్వాత తన కార్యదర్శిని పిలిచి మినట్సు చెప్పడం మొదలు పెట్టాడు. ఇది ప్రభుత్వం చెప్పింది కాదని చెబుతూ మినట్సు చెప్పడం పూర్తి చేశాడు. పొరపాటు నివేదికలకు తావులేకుండా ఉండేందుకు మౌంట్ బాటెన్ స్వంత కార్యాలయం తయారు చేసిన మినట్లు ఈ కింద ఇస్తున్నాను.

ఎ) హైద్రాబాద్ రాష్ట్రం భారతదేశంలో విలీనం కావాలా లేక స్వతంత్ర దేశంగా ఉండాలా అనే విషయమై నిర్వహించే ప్రజాభిప్రాయ సేకరణ స్పష్టమైన తిరుగులేని పరిష్కారంగా భావించేందుకు అంగీకరించనైనది.

బి) ఒక దీర్ఘకాల పరిష్కారంగా ప్రజాభిప్రాయ సేకరణ ప్రయోజనాలేమైనా ఉంటే అవి తక్షణం ఇండో హైద్రాబాద్‌ల మధ్య అంగీకారమయ్యేంత వరకు ఎవరూ ఏకపక్షంగా వ్యవహరించకూడదు. కాబట్టి స్నేహాన్ని పునరుద్ధరించే అంతర్గత ఒప్పందమే ప్రాతిపదిక కావాలి.

సి) సత్వరం భారతదేశం చేయదగ్గ కొన్ని పనులు

1. కొందరు వ్యక్తులను మార్చడం

2. హైద్రాబాద్‌లో గవర్నర్ జనరల్ పర్యటన

3. దిగ్బంధం అనేది లేకుండా చేయడం, హైద్రాబాద్‌లోకి వస్తు సరఫరాను అనుకూలంగా అనుమతించడం.

డి) స్వల్పకాలిక అంగీకారం, మంచి సంబంధాల పునరుద్ధరణ కోసం తక్షణం హైద్రాబాద్ చేయాల్సిన ప్రాథమిక కార్యక్రమం సమత్వంతో కూడిన కొత్త ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయడం. సమత్వంతో కూడిన ప్రభుత్వ ఏర్పాటు భారతదేశానికి అగీకారం కాకపోయినా హైద్రాబాద్‌కు ఇంతకంటే వెనక్కి పోగల అవకాశం లేదు. కానీ కొత్త ప్రభుత్వం ఏర్పాటు వాస్తవికంగా ఉండాలి. ప్రస్తుత ప్రభుత్వం రద్దు కావాలి, కొత్త ప్రభుత్వం ఏర్పాటు కావాలి. ఇప్పటి మంత్రుల్లో కొందరు కొత్త ప్రభుత్వంలో ఉండాలి.

ఇ) కొత్త ప్రభుత్వంలో 12 స్థానాలుండాలి (10కి అవకాశం). సగం సంఖ్య, ప్రధానమంత్రితో సహా మెజారిటీ కమ్యూనిటీ నుండి ఉండాలి. పోర్టుఫోలియోలు సమంగా పంచాలి. ప్రస్తుత శాసనసభ ప్రాతినిధ్యం కూడా కొత్త ప్రభుత్వంలో ఉండాలి. కాబట్టి ఆరు హిందూ స్థానాలకు ప్రస్తుతం సభ్యుల నుండి ఇద్దరిని ఎంచుకోవాలి. అలాగే ముస్లింల నుండి కూడా ఒకరిద్దరిని (ఇత్తెహాద్ సభ్యులు కాని వారిని) నియమించుకోవాలి.

ఎఫ్) విశాల ప్రాతిపదిక మీద సమత్వం పాటిస్తూ ఎన్నికతో కూడిన రాజ్యాంగ సభను రెండు మూడు నెలల్లో ఏర్పాటు చేయాలని హైద్రాబాద్ తలపోస్తుంది. ఇది ఏర్పాటయితే, రెండు ప్రధాన మతాలను ప్రతిబింబిస్తే, ఇదే తాత్కాలికంగా శాసన సభగా పనిచేస్తుంది.

జి) రాజ్యాంగ సభ ఏర్పాటై కార్యక్రమాలు చేపట్టేవరకు ప్రస్తుత శాసన సభ పని చేయకుండా ఉంచేందుకు అంగీకరించనైనది.

హెచ్) ప్రజాభిప్రాయసేకరణ జరిపే సంస్థ ఎవరనే ప్రశ్న తలెత్తింది. బయటి సంస్థ చేయాలని అంగీకరించబడ్డది. భారత ప్రభుత్వమైతే బాగానే ఉండేది కానీ ఇటీవలి కాశ్మీరు విషయం వల్ల ఐరాసను ఎంచుకోవాలని నిర్ణయించబడ్డది. కానీ ప్రస్తుత పరిస్తితుల్లో ఇది నమ్మకమైనది కాదు. కాబట్టి ఇతర ప్రత్యామ్నాయాలు

1. కామన్ వెల్త్

2. అంతర్జాతీయ న్యాయస్థానంలో జడ్జీల ప్యానెల్

3. స్విట్జర్లాండ్ లేదా స్వీడన్ లాంటి నిష్పాక్షిక దేశాల సంస్థల ద్వారా

ఐ) ప్రజాభిప్రాయ సేకరణకు సంబంధించినంత వరకు హైద్రాబాద్‌లో పార్టీలకు అతీతంగా ఉపన్యాసాలకు స్వేచ్ఛ, పత్రికా స్వేచ్ఛ, రేడియో ప్రసంగాలకు అవకాశం ఉండాలి. ఇతర పార్టీలను నిందించడం కాకుండా తమ వాదానికి అనుకూల అంశాలను ప్రచారం చేసుకోవడానికి ప్రయత్నించాలి. ఏ ప్రభుత్వమూ, ప్రభుత్వ సంస్థ ప్రజాభిప్రాయ సేకరణకు ముందు ఎన్నికలకు ఖర్చు పెట్టడంకానీ లంచాలు ఇవ్వజూపడం కానీ చేయకూడదు. రాష్ట్రం వెలుపలి పార్టీలు కానీ సంస్థలు కానీ జోక్యం చేసుకోకూడదు.

భారత ప్రభుత్వ గవర్నర్ జనరల్ మౌంట్ బాటెన్ హైద్రాబాద్ ప్రధానిగా నాకు మధ్య కుదిరిన అభిప్రాయపు పూర్తి పాఠం అది.

నాకివ్వబడిన అధికారాల కంటే ఎక్కువగానే నేను అంగీకరించాను. ఎందుకంటే అవన్నీ ప్రజాస్వామికమైనవేననే భావన నాకుంది. హైద్రాబాద్ స్వతంత్రంగా ఉండాలనే అభిప్రాయం పరీక్షలో నెగ్గకపోతే అది వ్యర్థమైన అభిప్రాయమే. హైద్రాబాద్‌లో కొన్ని ప్రాంతాలలో నిరసనలు రావచ్చనే కొద్దిపాటి ఆందోళన తప్ప మిగతాదంతా నైతికంగా సరియైనదేనని, తదనంతర పరిణామాలను ఎదుర్కోవడానికి సిద్ధమేననే భావనతో సమావేశం నుండి బయటకు వచ్చాను.

అయితే ఆ ప్రతిపాదనలు ఢిల్లీ రాజకీయ వర్గాలను ఒక ఊపు ఊపాయి. మొదట, భారత నాయకులు పదేపదే కోరుతున్న ప్రజాభిప్రాయ సేకరణకు నేను అంగీకరించడం ఒక ఆశ్చర్యం కింద మారింది. రెండవ అంశమేమిటంటే ఒకవేళ ప్రజాభిప్రాయం భారత్‌కు వ్యతిరేకంగా వస్తే ఏమి జరుగుతుందనే ఆందోళన భారత నాయకులలో మొదలైంది. చివరికి భారత్ ఏ సాహసమూ చేయదని తేలిపోయింది. నెహ్రూ ఇందులో ఆసక్తి చూపినట్లు తెలిసింది కానీ మౌంట్‌బాటెన్ వచ్చిన అవగాహన నుండి బయటపడడానికి ఢిల్లీలోని పెద్ద తలలు ఆలోచనాలోచనలో పడ్డాయి.

ఇంకా ముసాయిదాలూ ఒప్పందాలూ తుది రూపానికి తెస్తున్న మాంక్టన్ అందులోని అంశాల్ని చూసి నా ధైర్యానికి ఆశ్చర్యపోయాడు. బ్రిటీష్ క్యాబినెట్ ప్లాన్ ప్రకారం ఇది పాలకుడు ఒప్పుకోవలసిన అంశమని అభిప్రాయపడ్డాడు. ఇండో

హైద్రాబాద్ సంబంధాలు క్యాబినెట్ ప్లాన్ పరిధి దాటిపోయాయని ఈ విషయం ఒక్కసారి తేలిపోయి అందరికీ ఆమోదయోగ్యమైన పరిష్కారం లభించడానికి ఇదే మేలని నేను చెప్పాను.

నేను అంగీకరించిన ముసాయిదా మీద భారత్ తీవ్రంగా చర్చిస్తున్న తరుణంలో మరుసటి రోజు నేను నెహ్రూతో జరిపిన సంభాషణ నన్ను తీవ్ర గందరగోళంలో పడేసింది. నెహ్రూ ధోరణి చూస్తే 'సుడెటన్ లాండ్' విషయంలో హిట్లర్ ధోరణి జ్ఞప్తికి వచ్చింది. 'ప్రజాస్వామ్య పద్ధతిలో హైద్రాబాద్ ఇండియాతో కలిస్తే మరీ మంచిది. కానీ హైద్రాబాద్ ఎట్లాగైనా ఇండియాలో కలవాల్సిందే' అన్నాడు ఆయన! ప్రజాస్వామ్య భావన నుండి వైదొలిగాననే భావన రాకుండా జాగ్రత్త పడుతూ ఇండియా ఆలోచనను వదులుకోవడానికి ఇష్టంలేని తనాన్ని ప్రదర్శించాడు.

మీనన్ జాగ్రత్తగా మాట్లాడాడు. ప్రజాభిప్రాయ సేకరణ అనే ఆట బొమ్మ మీద ఆధారపడే సాహసం చేయదని ఆయన తేల్చేశాడు. ఒకవేళ హైద్రాబాద్ ప్రజాభిప్రాయ సేకరణ జరిపించాలనుకుంటే మొదట విలీనం జరుగుతుంది. తర్వాత నిజాం, ఆయన ప్రభుత్వ నిర్ణయం తప్పా ఒప్పా అనే అభిప్రాయ సేకరణ జరుగుతుంది అన్నాడు. హైద్రాబాద్ భవిష్యత్తును అక్కడి ప్రజలు నిర్ణయిస్తారని భారతదేశం పదేపదే ప్రవచించిన దానికి అర్థమేమిటని నేను మీనన్‌ను ప్రశ్నించాను. దానికి ఆయన దగ్గరేం జవాబు లేదు కానీ హైద్రాబాద్ విలీనం ఆలస్యమయ్యే కొద్దీ భారత్‌లో ఆందోళన పెరిగిపోతున్నదని, అందువల్ల భారత్ నాయకులు దీన్ని ఇంకెంతో కాలం కొనసాగించలేకపోతున్నారని చెప్పాడు. ఫ్రాన్స్ ఓడిపోయాక శాంతి ఒప్పందం మీద సంతకం పెట్టేటప్పుడు హిట్లర్ ఆలోచనలకు బ్రిటన్ లొంగనందుకు హిట్లర్ అనుచరులు ఇలాగే చేసి ఉంటారని మీనన్‌తో అన్నాను.

అందుకు 'హైద్రాబాద్ బ్రిటన్ కాదు, భారత్ సైనిక శక్తిని హైదరాబాద్ ఒక్క రోజు కూడా తట్టుకోలేదు' అన్నాడు మీనన్.

'మరింత ఆలస్యమెందుకు?' అన్నాన్నేను.

'అవసరం లేని చోట రక్తపాతం, పోరాటం ఎందుకు ప్రపంచాభిప్రాయానికి భిన్నంగా?' సూటిగా అన్నాడు మీనన్!

ఒకటి మాత్రం నిజం ఆయన చెప్పిన దాంట్లో. బ్రిటన్ సైన్యమంతా అటే ఉంది మరి.

ఆ రోజు రాత్రి నా సహచరులకు చెప్పాను. ఇండో హైద్రాబాద్ సంబంధాలలో నాటకీయ పరిణామాలు సంభవించబోతున్నాయని, అవేమిటో ఊహించమని అడిగాను. సరిహద్దు వెంట భారీ అలజడి జరిగిందని, దానికి హైద్రాబాదే బాధ్యురాలని నివేదిక వస్తుందని ఒకరి వెంట ఒకరు చెప్పారు. నేనూ ఔనన్నాను. మేం ఎక్కువకాలం ఉండవలసిన అవసరం పడలేదు.

మరుసటి రోజు, జూన్ 9 న హైద్రాబాద్ ముసాయిదా సమావేశం ఏర్పాటయింది. మౌంట్ బాటెన్ నివాసం దగ్గర ఒక ప్రభుత్వ చాంబర్‌లో ఈ సమావేశం ఏర్పాటయింది. షెడ్యూల్ ప్రకారం మొదట మీనన్ హైద్రాబాద్ ప్రతినిధులతో చర్చించి గవర్నర్ జనరల్‌కు పంపుతాడు. అనుకున్న సమయం కంటే చాలా ఆలస్యంగా మీనన్ వచ్చాడు. ఆయన బహుశా ప్రధాని గవర్నర్ జనరల్‌తో చర్చల్లో మునిగి ఉండవచ్చు. ఈసారి ఆయన రక్షణ కార్యదర్శి మరియు రాష్ట్రాల వ్యవహారాల శాఖ సహాయకుడితో వచ్చాడు. రక్షణ శాఖ కార్యదర్శి రావడం అనూహ్యం. ఆయన నా వైపు బెదిరించినట్లు చూశాడు. నాకు అలాగే అనిపించింది.

మీనన్ తాను ప్రధాని నెహ్రూ దగ్గరనుండి వస్తున్నానని మొదట ఆయన తరపున మాకు కొన్ని విషయాలు చెప్పాలన్నాడు. తర్వాత ఆయన సహాయకుడి వైపు తిరిగి ఈ మధ్యాహ్నం బొంబాయి ప్రభుత్వం నుండి వచ్చిన టెలిగ్రాంను చదవమన్నాడు. హైద్రాబాద్ పోలీసులు రజాకార్లు బొంబాయిలోని ఒక ప్రాంతం పై మెషిన్‌గన్లతో దాడి చేశారని ఐదుగురు పోలీసులు, ఇద్దరు గ్రామస్తులు మరణించారని, మరికొందరు గాయపడ్డారని టెలిగ్రాంలో ఉంది. ఇలాంటి సంఘటనలు మరెప్పుడు జరిగినా భారత సైన్యం, పోలీసులు హైద్రాబాద్ భూభాగంలోకి చొరబడి నేరస్తులను పట్టుకోవాలని ప్రధాని నెహ్రూ ఆదేశించారని మీనన్ చెప్పాడు. ఈ ప్రత్యేక సందర్భంలో నేరస్తులు దొరకాలని హైద్రాబాద్ తగు మూల్యం చెల్లించాలని భారత్ ఆదేశించింది. ఇదంతా మేం ఊహించిందే, ఆ వార్తలేవీ మాకు మాత్రం రాలేదు మరి! నాకు ఎలాంటి వివరాలు లేవు కాబట్టి ఏమీ చెప్పలేనన్నాను. తదుపరి మా ఊహలను ఆశ్చర్యపరుస్తూ ఇంకొక వార్త వచ్చింది. మీనన్ ఇలా అన్నాడు "ఇప్పుడు ఎక్కడ ఉన్నామో భారత్‌కు అర్థం కావడం లేదు. పాక్ ప్రభుత్వ ప్రతినిధి బృందం కానీ పాక్ ప్రతినిధి కానీ హైద్రాబాద్‌లో ఉండి సలహాలిస్తున్నట్లు భారత్ ప్రధానికి నమ్మదగ్గ, కచ్చితమైన సమాచారం ఉంది". నా స్పష్టమైన, ఆవేదన, కోపంతో కూడిన ఖండనతో ఆ విషయంపై

ఇంకా ముందుకు చర్చ సాగలేదు. భారత ప్రతినిధులు కూడా దీన్ని నమ్మలేదు. ఎప్పటిలాగే వేసిన పథకంగా భావించుకున్నారు.

మీనన్ భారత ప్రభుత్వం తరపున నాలుగు అంశాలు ముందుంచాడు.

ఒకటి – రక్షణ, విదేశీ వ్యవహారాలు, సమాచార రంగానికి సంబంధించినంత వరకు హైద్రాబాద్ తక్షణం భారత్‌లో విలీనం కావాలి.

రెండు – తక్షణం బాధ్యతాయుత ప్రభుత్వం ఏర్పాటు కావాలి.

మూడు – రజాకార్లను తక్షణం నిషేధించాలి.

నాలుగు – మొత్తం సైన్యాన్ని ఇరవై వేలకు కుదించాలి.

ఇవన్నీ తాత్కాలికమని తర్వాత పూర్తి బాధ్యతాయుత ప్రభుత్వానికి చర్యలు ఉంటాయని మీనన్ చెప్పాడు. తక్షణం విలీనానికి భారత ప్రభుత్వం సిద్ధంగా ఉందని ఒకవేళ హైద్రాబాద్ ప్రభుత్వం ప్రజాభిప్రాయానికి అంతగా సిద్ధపడితే అది తర్వాత నిర్వహించుకోవచ్చని భారత్ భావిస్తుందని ఒక ప్రశ్నకు సమాధానంగా మీనన్ చెప్పాడు. భారత్ ప్రతినిధుల అకస్మాత్తు ఉద్రేకం వల్ల మాంక్‌టన్ వెనక్కి తగ్గాడు. ముసాయిదా పరిశీలిద్దామన్నాడు. తక్షణం విలీనానికి అంగీకరించేంత వరకు, ఇదివరకే చెప్పిన మూడు విషయాలపైన హైద్రాబాద్ శాసనసభ ఏర్పడే వరకు ఏ ముసాయిదాను భారత్ చూడదని మీనన్ స్పష్టం చేశాడు.

భారత్ హైద్రాబాద్‌ల మధ్య దౌత్య సంబంధాలలో క్లిష్టమైన స్థితి ఏర్పడింది. రేపు ఏం జరుగుతుందో చెప్పలేని పరిస్థితి ఏర్పడింది. కొన్ని వివరణలు అడగడం తప్ప నేనేమీ చెప్పలేదు. ఏదైనా ఉంటే రాసి నా సహచరులకు చూపించి ఆ తర్వాత భారత ప్రతినిధులకు ఇవ్వాలనుకున్నాను. కాగితం తీసుకుని సమాధానం రాసి నా సహచరులకు, మాంక్‌టన్‌కు చూపించాను. కొన్ని సవరణలు చేసి తిరిగి నాకు ఇచ్చారు. అప్పుడు దాన్ని భారత ప్రతినిధులకు చదివి వినిపించాను. వాళ్ళు శ్రద్ధగా ఆలకించారు. భారత్ సూచించిన విధంగా ప్రజాభిప్రాయ సేకరణ ద్వారా హైద్రాబాద్ భవిష్యత్తు నిర్ధారించబడేందుకు హైదరాబాద్ అంగీకరించిందని నేను చెప్పాను. ప్రస్తుతం భారత్ 'ఇప్పుడే ఇక్కడే విలీనం', బాధ్యతాయుత ప్రభుత్వం, రజాకార్ల నిషేధం, సైన్యాన్ని తగ్గించడం అనే ప్రతిపాదనతో ముందుకు వచ్చింది. ఈ డిమాండ్లు అంగీకారమో కాదో చెప్పమన్నది. భారత్ సరికొత్తగా, అనూహ్యంగా చేసిన ప్రతిపాదనను తీవ్రమైన వేదనతో స్వీకరిస్తున్నామని, విషయమంతా నిజాంకు వివరిస్తామని, నిజాం స్వయంగా



సమాధానం ఇస్తాడని నేను చెప్పాను. ఈ పరిస్థితుల్లో మేం తక్షణం హైద్రాబాద్ వెళ్తామని నిజాంకు నివేదిస్తామని, తర్వాత నిజాం స్పందిస్తారని చెప్పాను.

జూన్ 21 మౌంట్‌బాటెన్ నిష్క్రమించడానికి నిర్ణయమైన తేది. ఆయన వెళ్ళిపోవడానికి ముందు సమస్య పరిష్కారమవుతుందన్న ఆశ సన్నగిల్లింది. అందువల్ల నేనూ, నా సహచరులు మాంక్‌టన్‌తో కలిసి హైద్రాబాద్ వచ్చాం. మాంక్‌టన్ వెనక ఉండడానికి నిర్ణయించుకున్నాడు. జూన్ 11న ఒక పత్రికా సమావేశం పెట్టి హైద్రాబాద్ నిర్ణయం వెల్లడించాను. ఢిల్లీలో చెప్పబడ్డట్లు దాడులు బొంబాయి ప్రావిన్సులో జరగలేదు. హైద్రాబాద్ లోపల జరిగినట్లు విచారణ ద్వారా తెలిసింది. పెద్ద సంఖ్యలో భారత్ నుండి తిరుగుబాటుదారులు సరిహద్దులు దాటి దోపిడీలు, లూటీలు, హత్యలకు పాల్పడ్డారు. ఒకచోట వారికి హైద్రాబాద్ పోలీసులు ఎదురుపడితే పోలీసుల మీద ఎదురుకాల్పులు జరిపితే బొంబాయి పోలీసులు ముగ్గురు, నలుగురైదుగురు పౌరులు మరణించారు. ఇదంతా హైద్రాబాద్‌కు లోపల జరిగింది. కానీ భారత్ చెప్పినట్లు బొంబాయి ప్రావిన్సులో కాదు, హైద్రాబాద్ పౌరులు కూడా ఎంతోమంది మరణించారు. ఆ మరణాల ఊసే లేదు. భారత్ అల్టిమేటం ఇవ్వడానికి కారణం

అది. గత సంఘటనల్లోలాగా ఇది కేంద్ర, ప్రావిన్సు ప్రభుత్వాలు అల్లిన కథ మాత్రం కాదు.

జూన్ 11న నెహ్రూ నైనిటాల్‌లో మాట్లాడుతూ హైద్రాబాద్‌ను ప్రస్తావిస్తూ ఆసక్తికరమైన వ్యాఖ్యలు చేశాడు. స్వతంత్ర హైద్రాబాద్ ప్రమాదకరమని, అది భారత్‌లో విలీనమైతే దానికి గౌరవం, మర్యాద దక్కుతుందన్నాడు. విదేశీ పత్రికలను ప్రస్తావిస్తూ హైద్రాబాద్‌ను విలీనం కమ్మని భారత్ బెదిరిస్తుందని రాసిన పత్రికల కథనాలను విమర్శించాడు. ఒక వర్గం భారతీయ పత్రికలను విమర్శించాడు. ఈ పరిస్థితిలో భారత్ గట్టిగా ఉండడం హైద్రాబాద్‌ను వ్యతిరేకించడం కోసం కాదని, కలల భారతదేశం కోసమని చెప్పాడు! కలను నిజం చేసుకోవడం కోసం ఒక పాత ఇంటిని కూల్చడానికి వెనుకాడకూడదన్నాడు. స్వతంత్ర హైద్రాబాద్ అన్న మాట అక్కడ వినిపించినప్పుడు ఆయన సంతోషించాడని ఒక వార్త వచ్చింది. కానీ అది పచ్చి అబద్ధమే. "ఒకవేళ భారత్ మరణిస్తేనే హైదరాబాద్ స్వతంత్రంగా ఉంటుంది. వేరే విధంగా కాదు" అన్నాడు ఆయన.

ప్రధాన మంత్రి హోదాగల వ్యక్తి ప్రకటనలు అలా కొనసాగుతూ ఉన్నా, దౌత్య చదరంగంలో ముగించకుండా ఆడిన ఆట ఎలా ఉందో తరువాత అధ్యాయంలో చూద్దాం

# 25. చర్చల ముగింపు

జూన్ 11న నేను పత్రికా ప్రకటన చేస్తూ భారత్, హైద్రాబాద్ మధ్య చర్చలు కొనసాగే విషయం నాకు తెలియదని చెప్పాను. ప్రతినిధి బృందం తిరిగి వచ్చాక కూడా మౌంట్ బాటెన్‌తో సంప్రదిస్తూ మాంక్‌టెన్ ఏదో అవగాహన కోసం ప్రయత్నిస్తూనే ఉన్నాడు. నాకు ఒక సుదీర్ఘమైన వర్తమానం పంపుతూ హైదరాబాద్ విషయంలో ఆయన, బాంటెన్ ఎంతో ఆందోళనలో ఉన్నారని చెబుతూ, విషయమై పునరాలోచన చేయాలని, 14వ తేదీన మళ్ళీ ఢిల్లీ పోవాలని చెప్పాడు. బాటెన్ నిష్క్రమణ దగ్గర పడుతున్నందున ఏదో ఒక అవగాహనకు రావాలన్న ఆతృత కనబరచింది. రాష్ట్రమనుగడకు సంబంధించిన విషయాలు తప్ప మిగిలిన అన్ని సవరణలను ఒప్పుకోవడానికి సిద్ధపడింది హైద్రాబాద్. రక్షణ, విదేశీ వ్యవహారాలు, సమాచార రంగాలలో సమాంతర చట్టాలు చేయుడానికి సూత్రప్రాయంగా అంగీకరించింది. రజాకార్లను సాధ్యమైనంత వరకు నియంత్రించడంతో పాటు దాని మిలటరీ కార్యక్రమాలు తొలగించాలని నిర్ణయించింది. ఢిల్లీ కోరిన విధంగా సైన్యాన్ని ఇరవై వేల వరకు తగ్గించడానికి అంగీకరించింది. అయితే భారత్ ఆయుధ సరఫరాలో విఫలమయితే హైద్రాబాద్ ఇతర దేశాల నుండి దిగుమతి చేసుకుంటే వాటిని భారత్ భూభాగం నుండి రవాణా కావడానికి అంగీకరించాలన్నది. అదే సందర్భంలో ఆధిపత్యాన్ని మాత్రం సూత్రబద్ధంగా కానీ ఆచరణలో కానీ అంగీకరించమని తేల్చి చెప్పింది. అదే సందర్భంలో హైద్రాబాద్ విదేశీ వ్యవహారాలు, రక్షణ రంగాన్ని భారత్‌కు అప్పజెప్పడం ద్వారా చాలా వరకు దాని సార్వభౌమత్వాన్ని భారత్‌కు

అప్పుజెప్పుతున్నందువలన హైద్రాబాద్ ఆర్థిక స్వాతంత్ర్యాన్ని భారత్ కాపాడాలని కోరింది. భౌగోళిక స్థితి వల్ల, రక్షణ విదేశీ వ్యవహారాలను భారత్‌కు అప్పుజెప్పడం వల్ల ఆర్థిక, వాణిజ్య, ఇతర వ్యాపార కార్యక్రమాల మీద పూర్తి స్వేచ్ఛ లేకపోతే హైద్రాబాద్ మనుగడయే కష్టమవుతుందనే భయందోళనలు పొడసూపాయి. భారత్‌ను సంతృప్తి పరిచేందుకు బాధ్యతాయుత ప్రభుత్వం ఏర్పాటు కోసం నిజాం చేసే ఫర్మానాను భారత్‌కు ముందుగా చూపించాల్సి ఉంది. భారత ప్రభుత్వ అధికారులకు అది అనధికారికంగా ముందే చూపబడ్డది. రాజ్యాంగ బద్ధ ప్రభుత్వం కోసం 1949లో రాజ్యాంగ సభ ఏర్పాటు చేయబడుతుంది. "నేను (నిజాం) నిర్ణయించే పద్ధతి ప్రకారం, హైద్రాబాద్ సంప్రదాయాన్ని దృష్టిలో ఉంచుకుని అది ఉంటుంది" అన్నది ఫర్మానా. అది బాటెన్, భారత ప్రతినిధులకు నచ్చింది. సభలో ముస్లింలు, ముస్లిమేతరులు నిష్పత్తి మీద కూడా చర్చ జరిగింది. సంప్రదాయం ప్రకారం ఇద్దరికీ ఆమోదయోగ్యంగా లేని విషయాలన్నీ మధ్యవర్తిత్వానికి పంపాలని, మధ్యవర్తిత్వపు నిర్ణయానికి రెండు పక్షాలు కట్టుబడాలని అంగీకరించబడ్డది.

సత్వర పరిష్కారం కోసం మంత్రివర్గం ఎంత దాకా పోయిందో చూసి నిజాం ఆశ్చర్యపోయాడు. నిజాం అంగీకరించాడు. మాంక్టన్, బాటెన్ ముందుగా సూచించినట్లు 14వ తేదీన ప్రతినిధి బృందం ఢిల్లీ వెళ్ళింది. బాటెన్ మమ్మల్ని సాదరంగా ఆహ్వానించాడు. తను వెళ్ళిపోయేలోగా సమస్యను పరిష్కరించడానికి తానెంత ఆతృతగా ఉన్నాడో చెబుతూ, అవసరమైతే కొన్ని గంటల కోసమైనా హైద్రాబాద్‌కు రావాలనుకున్నానని చెప్పాడు. ఉప ప్రధాని అంగీకారం కోసం తానే డెహ్రాడూన్ వెళ్ళి వచ్చానని, అది కూడా నా వ్యక్తిగత గౌరవం వల్లనే ఆయన ఒప్పుకున్నాడని బాటెన్ చెప్పాడు. మొదట మీనన్‌తో తర్వాత గవర్నర్ జనరల్‌తో మా సమావేశం నిర్ణయించబడ్డది. మీనన్ మా ముందు ఓ కొత్త ముసాయిదా పెట్టాడు. అది అనుకున్న దానికి భిన్నంగా ఉంది. అదివరకే చర్చించి అంగీకరించిన అంశాలు కూడా అందులో లేవు. రాష్ట్ర రక్షణ దళాలకు సంబంధించిన ప్రాథమిక విషయాలలో మార్పు ఉంది. మీనన్ ముసాయిదా ప్రకారం హైద్రాబాద్ సైన్యం '1939, రాష్ట్రాల రక్షణ దళాల' కిందకు వెళ్తుంది. అది బ్రిటన్ ఆధిపత్యాన్ని సూచించేది. '1939 స్కీము' ప్రకారం బ్రిటన్ స్థానంలో భారత్ ఉంటుందన్నాడు మీనన్. ఇది మాటల్లో, చేతల్లో కూడా భారత ఆధిపత్యాన్ని సూచిస్తున్నందున దీనిని అంగీకరించలేమన్నాను. క్లాజులు ఏమైనా ఉండనివ్వండి కానీ '1939 రాష్ట్రాల సైన్యాల స్కీము'ను తొలగించమని, భారత్

ఏకస్వామ్యాన్ని తొలగించమని నేను పట్టుబట్టాను. వారు వినలేదు. మరొక వింత ప్రతిపాదన చేశారు.

అదేమిటంటే అత్యవసరమైతే భారత సైన్యం హైద్రాబాద్‌లో ఎక్కడైనా విడిది చేస్తుందట. భారత దేశానికి ఏదేని బయటి దేశంతో యుద్ధం వచ్చిన పరిస్థితిలో అలా సైన్యాన్ని హైద్రాబాద్‌లో ఉంచడానికి ఇదివరకే అంగీకరించడం జరిగింది. ఇక ఇప్పుడు భారతదేశం ఎప్పుడు అత్యవసర పరిస్థితిని ప్రకటించినా రాష్ట్రంలో సైన్యాన్ని ఉంచుతుందట. నాకు అభిజ్ఞ వర్గాల ద్వారా తెలిసిందేమిటంటే హైద్రాబాద్ ఒప్పందం మీద సంతకం చేయగానే రాష్ట్రంలోనే ఎమర్జెన్సీ ప్రకటించి, భారత సైన్యాన్ని దించుతారు. బ్రిటీష్ సైన్యంలా అక్కడే శాశ్వతంగా ఉంచుతారు. అలా శాంతియుతంగా, చట్టబద్ధంగా భారత మిలటరీ ఆధిపత్యం హైద్రాబాద్ మీద ఏర్పడుతుంది.

మిగతా విషయాలైన ఆర్థిక, వాణిజ్య రంగాల మీద ఎలాంటి అంగీకారానికి రావడానికి భారత్ సిద్ధంగా లేదు. ఎక్కువకు ఎక్కువగా వాళ్ళు ఒప్పుకోవడానికి సిద్ధంగా ఉన్నదేమిటంటే ఈ అంశాలన్నిటినీ భవిష్యత్తులో సానుకూలంగా చర్చించడానికి ఒప్పుకుంటుంది. దాంట్లో కూడా హైద్రాబాద్‌కు వ్యాపార, ఆర్థిక కార్యకలాపాల స్వేచ్ఛ ఇవ్వడానికి ఢిల్లీ సిద్ధంగా లేదు. అన్నిటికంటే ఆశ్చర్యకరమైన విషయమేమిటంటే మధ్యవర్తిత్వానికి సంబంధించింది. ఒప్పందం ఎలాంటి అనుమానాలకు, సందేహాలకు తావు లేకుండా ఉంది. కాబట్టి మధ్యవర్తిత్వపు అవసరమే లేదని భారత ప్రతినిధి భావించాడు. హైద్రాబాద్ కోరిన పక్షంలో ఏదైనా చర్చించేందుకు అభ్యంతరాలు ఉండవని కూడా ఆయన భావించాడు.

సమావేశం నిష్ఫలంగా సాగదీయబడ్డది. ఎలాంటి మార్పులు లేకుండా ముసాయిదా మీద సంతకం చేయాలని లేకపోతే ఒప్పందం నుండి భారత్ వైదొలుగుతుందని భారత ప్రతినిధులు చెప్పారు. ఢిల్లీ వాతావరణం వేడెక్కినట్లు, ఉద్రిక్తంగా ఉంది. అందరూ ఏదో జరుగుతుందని ఆందోళనగా ఉన్నారు. పత్రికల వాళ్ళు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు, వాళ్ళను తప్పించుకోవడం కష్టం. ప్రతి ముఖంలోని నవ్వునూ, విషాదాన్ని అన్వయించుకోవడానికి వాళ్ళు సిద్ధంగా ఉన్నారు.

మరుసటి రోజు బాటెన్, నెహ్రూ, మీనన్ కలిసి పటేల్‌ను ఒప్పించడం కోసం డెహ్రాడూన్ వెళ్ళారు. మా ప్రతి ఢిల్లీ పర్యటనను పురస్కరించుకుని ప్రతిసారీ జరిగిన వింతలు ఈ సారి జరగనందుకు ఆశ్చర్యపోతూ ఉన్నాం. అయితే మా ఆశ్చర్యం

ఎక్కువ సేపు నిలువలేదు. మౌంట్ బాటెన్ డెహ్రాడూన్ నుండి తిరిగి వచ్చిన మరుసటి రోజు ఆయన్ని కలిశాం. ఆయన మాతో వింతగా, అమర్యాదకరంగా ప్రవర్తించాడు. మొదట్లోనే ఆయన నాకు మోయిన్ నవాజ్ జంగ్‌కు మధ్య అంతకు ముందటి రోజు జరిగిన టెలిఫోన్ సంభాషణల సారాంశం ఆయనకు నెహ్రూ ద్వారా అందింది. ఆ సారాంశం ఏమిటంటే చర్చలు అంతగా అవసరం ఉన్నట్లు నేను భావించలేదని. అంతకు మించిన వివరాలు చెప్పలేదు కానీ భారత ప్రభుత్వం నియమించిన ప్రత్యేకమైన వ్యక్తులు మా సంభాషణలను పర్యవేక్షించారట. ఆ ఆరోపణ విని నేను అవాక్కయ్యాను. కొద్దిగా నవ్వి నన్ను నిరాశపరచడానికి వేసిన కొత్త ఎత్తుగడ ఇది అన్నాను. మన చర్చలన్నీ గతంలో జరిగినవీ, రికార్డు కూడా అయినవేనని ఆయనతో అన్నాను. ఆ చర్చలు కూడా బాగా గందరగోళం మధ్య జరిగినవి. తరచూ కాస్త నిశ్శబ్దంగా ఉండి వినదల్చుకుంటే వినండి అని చెప్పుకోవలసి వచ్చేది. ఇలాంటి పరిస్థితుల మధ్య, అదీ భారతీయ టెలిఫోన్లలో భారత్‌కు వ్యతిరేకంగా మాట్లాడడానికి ఎవరైనా ప్రయత్నిస్తారా? ఒకవేళ ఉద్దేశ్యపూర్వకంగా ఇండియాకు తెలిసిపోవాలనుకుంటే తప్ప! గతంలో తప్పుడు నివేదికల వల్ల వచ్చిన ఆవేదనను  అర్థం చేసుకున్న బాటెన్, నెహ్రూకు ఆ విషయం చెప్పి అలాంటి నివేదికలను పట్టించుకోవద్దని చెబుతానని హామీ ఇచ్చాడు. ఇలాంటి తంత్రాలను నేను ఎంతమాత్రం పట్టించుకోలేదు! ఇలాంటి ఎత్తుగడలను ఢిల్లీలో ఎన్నో చూశాం.

మరొకసారి మౌంట్ బాటెన్ అధ్యక్షతన చర్చల్లో మునిగి పోయాం.

చర్చలు జరుగుతుండగానే ఒప్పందం మీద అదేరోజు సంతకాలు జరగాలని, పరిస్థితి ఉద్రిక్తంగా ఉందని, ఇంక ఒక్క రోజు కూడా ఆలస్యం చేయలేమని భారత ప్రతినిధి చెబుతూ వచ్చాడు. హైద్రాబాద్ కోరిన ఆర్థిక రక్షణలకు పూర్తి వ్యతిరేకంగా ఉన్నది ముసాయిదా. అయితే దీన్ని పటేల్ ధ్రువీకరించాలని ఇంకేమైనా మార్పులు, చేర్పులు చేయడం భౌతికంగానూ, ఇతరేతర దృష్టికోణం నుంచి చూసినా సాధ్యం కాదని మౌంట్ బాటెన్ చెప్పాడు. ఇతర అంశాలపై వ్యక్తం చేసిన అభ్యంతరాలకూ ఆయన నుండి హైద్రాబాద్‌కు అదే సమాధానం లభించింది. అంశాల వారీగా అదే సమాధానం లభించినప్పుడు అలాంటి ముసాయిదా రాసుకోవడం వృథా అని చెప్పాను. అందుకు ఆయనకు కోపం వచ్చింది. చర్చలు రాత్రి తొమ్మిది గంటల వరకు సాగినై. రాత్రి భోజనానికి ఎవరికో టైమిచ్చినందున బాటెన్ అసహనంతో కూర్చున్నట్లు నిపించింది. ఆయన టేబుల్ మీద చేతితో చరుస్తూ "నేను చెబుతున్నా, హైద్రాబాద్‌ది



అయిపోయింది. అయిపోయంది, అయిపోయింది" అన్నాడు. కొద్దిసేపు శూన్యంలోకి తేరిపార జూశాడు.

కుర్చీలోంచి లేచి ఒక్క ఉదుటన డోరు వద్దకు వేగంగా కదిలాడు. విసురుగా డోరు తీసి వెళ్ళిపోయాడు. ఆ విధంగా, భారత ప్రతినిధులకు కూడా ఇబ్బంది కరంగా ఆ రోజు సమావేశం ముగిసింది. ఆయన దేశీయుడి అభ్యంతరకరమైన ప్రవర్తనతో వాల్టన్ మాంక్టన్ అవమానంగా భావించాడు. కోపంతో ఊగిపోయాడు.

అర్ధరాత్రి దాటుతుండగా మేం బస చేస్తున్న నిజాం ప్యాలెస్‌లోకి ఒక కారు వచ్చింది. వేసవి కాలపు వేడిమి నుండి ఉపశమనానికి భోజనం తర్వాత మేం లాన్‌లో కూర్చున్నాం. మాంక్టన్ కూడా అక్కడే ఉన్నాడు. ఆ రోజు సమావేశ వివరాలు నాతో చర్చిస్తున్నాడు. అది ప్రభుత్వపు కారు. అందులోంచి గవర్నర్ జనరల్ గారి సమావేశ కార్యదర్శి కల్నల్ క్రమ్ దిగారు. ముగింపు దశలో ఉన్న చర్చలు అలా అర్ధాంతరంగా

ఆగినందుకు ఆయనా, మౌంట్ బాటెన్ కూడా చాలా బాధపడ్డట్లు మాటల సందర్భంగా చెప్పాడాయన. మేం కూడా అలాగే బాధపడ్డామని చెప్పాను. అంతమాత్రం చేత హైద్రాబాద్ అన్నీ కోల్పోవడానికి మేం ఒప్పుకోమని కూడా చెప్పాను. సాయంత్రం జరిగిన ఇబ్బందికరమైన సంఘటనకు గవర్నర్ జనరల్ తరపున క్రమ్ క్షమాపణ చెప్పాడు. ముసాయిదా అంగీకారానికి ముందు కనీసం టెలిఫోన్‌లోనైనా నేను నిజాంను సంప్రదించాలని ఆయన చెప్పాడు. పొద్దున్నే మాట్లాడతానని చెప్పాను.

పొద్దున మోయిన్ నవాజ్ జంగ్‌కు ఫోన్ చేసి ఢిల్లీలో జరిగిన తతంగమంతా చెప్పాను. మా సంభాషణ రికార్డవుతున్న శబ్దం మాకు తెలుస్తూ ఉంది. కాని దాన్ని లెక్కచేయలేదు. నా వర్తమానం నిజాంకు చేరింది. జవాబు కూడా వచ్చింది. పూర్తి వివరాలు తెలియకుండా నాతో నేరుగా మాట్లాడకుండా తానేమీ చెప్పలేనన్నాడు నిజాం. నిజాం చెప్పిన సంగతి పొద్దున్నే మళ్ళీ వచ్చిన క్రమ్‌కు చెప్పాను. నిజాంతో నేరుగా మాట్లాడేందుకు త్వరలో హైద్రాబాద్ వెళ్తున్నానని చెప్పాను.

నేను హైద్రాబాద్ వెళ్తున్న సంగతి తెలిసిన బాటెన్ వెళ్ళకముందు ఒకసారి కలవాలని వర్తమానం పంపించాడు. రాత్రి జరిగింది గుర్తుచేసుకుంటే వెళ్ళాలనిపించ లేదు కానీ ఎలాగోలా చివరకు ఒప్పుకున్నాను. కలిశాం. మౌంట్ బాటెన్, మీనన్ టేబుల్‌కు అడ్డంగా మాకు ఎదురుగా కూర్చున్నారు. నిన్న వివిధ అంశాల మీద వేగంగా జరిగిన సమావేశపు వివరాల పత్రాలను క్రమ్ అందరికీ పంచాడు. సమావేశం సంక్షిప్తంగా, గౌరవప్రదంగా, అనాసక్తికరంగా జరిగింది. ఒకవేళ నిజాం ఈ ముసాయిదాకు అంగీకరిస్తే తక్షణం సంతకం చేయాలని మరొక రోజు జరిగిపోవడానికి కుదరదని బాటెన్ పట్టుబట్టాడు. నిజానికి హైద్రాబాద్ నుండి ఢిల్లీ రావడానికి విమాన ప్రయాణమే సగం రోజుదాకా పడ్తుంది. చివరకు ఒక సహచరుడిని ఇక్కడ ఉంచి పొమ్మని, నిజాంతో చర్చించి ఆయన అంగీకరిస్తే ఆ విషయం ఢిల్లీలో ఉండి పోయిన సహచరుడికి ఫోన్ ద్వారా విషయం చెబితే ముసాయిదా మీద ఆయన సంతకం చేస్తాడని నాకు సూచించారు. నేను ఒప్పుకున్నాను. రవూఫ్‌కు హైద్రాబాద్‌లో ఉండి తీరవలసిన పని ఉందని అన్నందున ఉప ప్రధాని పింగళి వెంకట్రామారెడ్డిని ఢిల్లీలో ఉంచాలని నిర్ణయించాను.

తిరిగి వచ్చేముందు గవర్నర్ జనరల్ కార్యదర్శి ఇచ్చిన పత్రాలను ఒకసారి తిరగవేశాను. అంతర్గత పరిపాలనా సంస్కరణల గురించి నిజాం చేయవలసిన ఫర్మానా (ప్రకటన) కొత్త రూపాన్ని అందులో చూసి ఆశ్చర్యపోయాను. 1949

ఆరంభంలో హైదరాబాద్‌లో రాజ్యాంగ సభ ఏర్పడుతుందని, అందుకోసం నిజాం ఒక ప్రకటన చేస్తారని భారత్ అంగీకరించింది. "హైద్రాబాద్ సంప్రదాయాలను దృష్టిలో ఉంచుకుని నేను తర్వాత నిర్ణయించిన విధంగా" శాసనసభ ఏర్పడుతుందని నిజాం ప్రకటించాలి. గతంలో చర్చల సందర్భంగా నిజాం ప్రకటనలో అస్పష్టత కొనసాగించే బదులు 'పార్టీ' ప్రాతిపదికగా హిందూ, ముస్లింలతో కూడిన రాజ్యాంగ సభ ఏర్పడుతుందని ప్రకటిస్తే బాగుంటుందని నేను సూచించి ఉన్నాను. నెహ్రూ పట్టుబట్టినప్పుడు భారత ప్రతినిధులు "మెజారిటీ ప్రజలకు , మైనారిటీలకు సమాన ప్రాతినిధ్యపు ప్రతిపాదనకు భాగస్వాములైనట్లయితే భారత నాయకులు భవిష్యత్తులో ఇబ్బందికర పరిస్థితి ఎదుర్కోవలసి వస్తుందని" చెప్పారు. అది అక్కడి పాలకులకు, ప్రజలకు సంబంధించిన విషయమైనందున ఆ ప్రకటన బాధ్యత నిజాంకే వదిలివేస్తే మంచిదని వారు సూచించారు కూడా. నేను పట్టుబట్టిన పిదప భారత ప్రతినిధి "హైద్రాబాద్ సంప్రదాయాల దృష్ట్యా" అనే పదాలు ఉంచేందుకు అంగీకరించాడు. అంత సుదీర్ఘమైన చర్చ జరిగిన తర్వాత ఉండాల్సినవి ప్రతిపాదించిన పదాలు ఎందుకు తొలగించబడ్డాయో నాకు అర్థం కాలేదు. ఈ సంఘటన చిన్న అలజడికి కారణ మయింది. దీని గురించి తర్వాత చెబుతాను.

ఢిల్లీ సంఘటనతో నిజాం చాలా నిరుత్సాహపడ్డాడు. నేనెంతగానో పట్టుబట్టి న ఆర్థిక రక్షణల విషయంలో కూడా రాజీ పడేందుకు నిజాం సిద్ధపడ్డాడు. కానీ రెండు పక్షాలు వైరుధ్యంలో పడినప్పుడు స్వతంత్ర మధ్యవర్తిత్వం ఏర్పాటు చేసుకోవడానికి అవకాశం లేకపోవడాన్ని ఒప్పుకోవడానికి ఆయన సిద్ధంగా లేడు. ఎమర్జెన్సీ పేరుమీద భారత సైన్యాలు హైద్రాబాద్‌లో తిష్టవేసే అంశం కూడా ఆయన ఒప్పుకోలేనిదే. భారత్ బయటిదేశంతో యుద్ధంలో మునిగినప్పుడైతే పరవాలేదు కానీ భారత్ అభీష్టం మేరకు హైద్రాబాద్‌లో భారత సైన్యం ఉండకూడదని ఆయన భావన. చివరగా ఫర్మానాలో అభిప్రాయాలు, ప్రత్యేకతలు వదులుకోవడానికి ఎంత మాత్రం సిద్ధంగా లేడు. అవి వదులుకుంటే తన దృష్టికోణంలో చేయాల్సింది ఇంక ఏమీ మిగలదని ఆయన భావన.

జూన్ 16న నిజాం, మాంట్‌బాటెన్‌కు ఒక సుదీర్ఘమైన టెలిగ్రాం ఇచ్చాడు. అందులో ఫర్మానాలో ఉండి తీరవలసిన పదాల గురించి, ఆర్థిక రక్షణల గురించి, వివాదాల సమయంలో నిష్పాక్షిక మధ్యవర్తిత్వం గురించి పట్టుబట్టాడు. అవి లేకుండా ఈ ముసాయిదాను అంగీకరించలేనని చెప్పాడు. ఫర్మానాతో తొలగించబడ్డ సజీవ

పదాల తొలగింపును తప్పుబడుతూ నిజాం రాసిన టెలిగ్రాం ఢిల్లీకి చేరేటప్పటికే అక్కడ పెద్ద అలజడి నడుస్తుంది. ఆ పదాలు తొలగించబడ్డ ఫర్మానా నమూనా మాంక్‌టన్‌కు ఒకరోజు ముందు అందజేయబడ్డది. అంతకు ముందే అవి తొలగించబడ్డా నేను మాత్రం చివరి నిమిషంలో, నేను హైద్రాబాద్‌కు వస్తూ ఉండగా ఇచ్చిన కాపీలలో మాత్రమే తొలగించి ఇచ్చారని అబద్ధమాడుతున్నానని నా మీద ఆరోపణలు వచ్చాయి. మాంక్‌టన్ వెంటనే బయల్దేరి మరుసటి రోజు హైద్రాబాద్ వచ్చాడు. పింగళి వెంకట్రామారెడ్డి మాత్రం “మాంక్‌టక్‌కు ఇచ్చిన ప్రతుల సంగతి తెలియదు కానీ నాకు కానీ మీర్ లాయక్ అలీకి గాని చివరి నిమిషంలో ఇచ్చిన ప్రతులలో మాత్రమే ఆ పదాలు తొలగించబడ్డా” యని చెప్పాడు. ఆ పదాల తొలగింపు గనుక తెలిసినట్లయితే ఇతర అప్రధాన విషయాల మీద చర్చకు సమయం వెచ్చించే వారమే కాదు. ఈ వ్యసహారం మాంక్‌టెక్‌ను ఇబ్బందికర పరిస్థితిలోకి నెట్టింది. పదాల తొలగింపు ఆయన దృష్టికి వచ్చినట్లయితే వాటిని నొక్కిచెప్పడం ఆయన బాధ్యత అని రెండు పక్షాలు భావించాయి. మాంక్‌టన్ సున్నితమనస్కుడైపోయాడు. హైద్రాబాద్‌కు వచ్చాక ఆయనను యధాస్థితికి తేవడానికి నాకు చాలా కష్టమయింది.

మాంక్‌టక్ కోరిన మీదట నిజాం 17వ తేదీన మరొక టెలిగ్రాం పంపాడు. ఆ పదాలు తొలగించిన ప్రతి ముందుగా మాంక్‌టక్‌కు గానీ, ఇతర ఏ ప్రతినిధికి గానీ ఇవ్వనందుకు అందులో నిరసన తెలిపాడు. ఇండో – హైద్రాబాద్ సమస్య పరిష్కారానికి ప్రయత్నిస్తున్నందుకు అందులో బాటెన్‌కు కృతజ్ఞతలు చెప్పాడు. పరిస్థితి పక్వమైనందున బాటెన్ తలుచుకుంటే తను వెళ్ళేలోపల భారత్ నాయకులను ఒప్పించి ఈ సమస్యను పరిష్కరించవచ్చుననే ఆశాభావం వ్యక్తం చేశాడు. నిజానికి విషయం బాటెన్ చేతిలో లేదు. బాటెన్ మాటలకు తలలూపేందుకు ఢిల్లీ నాయకులు సిద్ధంగా లేరు. అన్ని టెలిగ్రాములకు బాటెన్ ఇచ్చిన జవాబు ఒక్కటే. దిగజారిన ఆయన పోస్టు వల్ల టెలిగ్రాములన్నీ తదుపరి చర్యల కోసం భారత ప్రభుత్వానికి మాత్రం పంపబడుతుండేవి.

టెలిగ్రాముల బదలాయింపుతో మౌంట్ బాటెన్ నీడలో జరిగిన ఢిల్లీ చర్చలు ముగిశాయి. ఆందోళన, ఏదో జరుగనుందన్న భావన అంతటా, గడిచిన కొద్దిరోజులుగా ఏమి జరిగిందనే ఆసక్తిలో ప్రజలు మునిగిపోయారు. అందుకే నేను 17 జూన్ నాడు ఒక పత్రికా సమావేశంలో సూచన ప్రాయంగా జరిగిన విషయాలు వెల్లడించాను. భారత్ ఉన్నత దేశం కాబట్టి హైద్రాబాద్ అన్ని డిమాండ్లను వదులుకోవాలన్నది

చెప్పాను. భారత్‌లో హైదరాబాద్ విలీనం మీద నిజాం అంగీకరించనప్పటికీ ప్రజాభిప్రాయ సేకరణకు కూడా భారత్ సిద్ధంగా లేదని చెప్పాను. హైద్రాబాద్ చేసిన ఏ ప్రతిపాదనను భారత్ అంగీకరిచలేదని, ఢిల్లీ చెప్పిన ప్రతిదాన్ని హైద్రాబాద్ అంగీకరించాలని ఢిల్లీ ఆశిస్తుందని చెప్పాను. అయితే హైద్రాబాద్ మాత్రం భారత్‌తో శాంతియుత చర్చల ద్వారా సమస్యలను పరిష్కరించుకోవాలని ఆశిస్తుందని చెప్పాను. గౌరవ ప్రదమైన ఒప్పందం కోసం ఎదురుచూస్తుందని చెప్పాను.

మరుసటి రోజు నెహ్రూ ఒక పత్రికా సమావేశంలో మాట్లాడాడు. ఆ సమావేశం లో అంగీకరించలేని ఒక ముసాయిదా పెట్టాడు. "ప్రతిపాదనలు నిజాం ముందు ఉన్నాయి. పెట్టవలసిన సంతకాన్ని ఆయన ఎప్పుడైనా పెట్టవచ్చు" అని ప్రకటించాడు. ఆర్థిక దిగ్బంధం, సరిహద్దు నిరోధం కొనసాగుతుందని చెప్పాడు. ముసాయిదా ప్రభావాలు చాలా వివరంగా చెప్పాడు నెహ్రూ. నిజాంతో టెలిఫోన్ సంబంధాల్లో ఉండి కూడా హైద్రాబాద్ ప్రతినిధి బృందం ఒక ముగింపునకు రాకపోవడం ఒక ప్రతిబంధకమని కూడా ఆయన చెప్పాడు.

అయితే కనుచూపుమేరలో ఒప్పందం కుదిరే అవకాశం ఉన్నప్పుడు ప్రతిసారీ ప్రతిపాదనల్లో భారత ప్రభుత్వం చేస్తున్న మార్పుల గురించి సహజంగానే ఆయన ప్రస్తావించలేదు.

హైద్రాబాద్‌కు రెండే ప్రత్యామ్నాయాలున్నాయని ఆయన చెప్పాడు.

అవి : భారత్ పెద్దరికాన్ని అంగీకరించడం, తద్వారా భారత్ అడిగినదల్లా ఇవ్వడం, ఫలితంగా ఏమీ ఆశించకపోవడం.

ఇక రెండవది నేరుగా భారత్‌లో విలీనం. 'పెద్దరికాన్ని అంగీకరించడం' అన్నది బ్రిటీష్ వాసనల వల్ల చెడ్డపదంగా మారిపోయిందని చెబుతూ ఇక మిగిలిన ప్రత్యామ్నాయం విలీనమే అని ప్రకటించాడు.

రజాకార్లను, వాళ్ళ ఉపన్యాసాలను విమర్శించాడు. హైద్రాబాద్ ప్రభుత్వం రజాకార్ల చెప్పుచేతల్లో నడుస్తూ ఉందని చెబుతూ భారత్ ఇప్పటికే దాడి చేసి ఉండేదని చెబుతూ కానీ చర్చల ద్వారా లక్ష్యం సాధించగలమని ఆశిస్తున్నట్లు చెప్పాడు. ఈ క్షణంలోనైనా ఉపయోగించేందుకు భారత్ సిద్ధంగా ఉందని చెబుతూ అయితే మహాత్ముడి ప్రబోధాలు ఇంకా తమ ముందు ఉన్నాయని ప్రకటించాడు.

రంగులు మార్చే మాటలు ఎన్ని చెబుతూ ఉన్నా హైద్రాబాద్ 'నిర్ణీత స్థలంలో సంతకం' మాత్రం పెట్టి తీరాలన్నాడు. హైద్రాబాద్‌కి దాసోహం అనలేని అధికార దర్పం ఢిల్లీది. బ్రిటీష్ వాళ్ళు ఇండియాకు ఇచ్చిపోయిన విధ్వంసకర ఆయుధాల ధాటికి మనం సిద్ధంగా ఉండాలని ఆ రోజు రాత్రి నిజాంతో అన్నాను. ఏ మిలటరీ కోణం నుండి చూసినా యుద్ధం రెండు సమానం కాని శక్తుల మధ్య అని స్పష్టంగా చెప్పాను. ఇది నీతికీ బలానికీ మధ్య యుద్ధమని, హైద్రాబాద్‌ది కేవలం నైతిక బలమని చెప్పాను. ఎన్నో అవరోధాలు ఉన్నా, హక్కుల కోసం పోరాడుతూ కొన్ని మెట్లు దిగడమొక్కటే గౌరవప్రదమైన పరిష్కారమని చెప్పాను. సరియైన నిర్ణయమే నిజమైన పరాక్రమమని చెప్పాను. పరాక్రమోపేతమైన నిర్ణయం తీసుకోవడానికి ఇదే సరియైన సమయమని నిజాంకు గుర్తు చేశాను. నా పదవి నుండి తక్షణం వైదొలుగుతానని, నా సహచరులను కూడా తొలగిపొమ్మంటానని, తద్వారా మీరు స్వేచ్ఛగా, స్వయంగా నిర్ణయం తీసుకోవచ్చని చెప్పాను. అయితే నిజాం ధైర్యంగా న్యాయానికి, కష్టాలకు తలవంచుదామనుకున్నాడు. 'ఏమవుద్దో కానీ' అన్నాడు. అర్ధరాత్రి దాటాక విడిపోయాం, ఒక ఉద్వేగభరితమైన కరస్పర్శతో. మా సాధారణ రోజు వారీ సమావేశాలకు పూర్తిగా భిన్నమైన విధంగా.

# 26. ఐకమత్యానికి ఢిల్లీ ప్రమాద ఘంటికలు

భారత్ ఏమి చేయనుందనే ఊహలకు తెర లేచింది. ఆర్థిక దిగ్బంధం పెరిగిపోతుంది. సరిహద్దుల కట్టడి ఎక్కువయింది. ప్రపంచాభిప్రాయానికి భిన్నంగా హైద్రాబాద్‌లోకి సాయుధ బలగాలను పంపి దురాక్రమణదారుగా భారత్ నమోదు కానుందా?

మౌంట్‌బాటెన్ ఖాళీ చేసిన గవర్నర్ జనరల్ స్థానంలో రాజగోపాలాచారి కూర్చున్నాడు. భారత్, హైదరాబాద్ సంబంధాలలో ఏర్పడ్డ అగాధాన్ని ఆయన పూడ్చాలనుకుంటున్నాడా? పూడ్చగలడా? చారి మద్రాసు వాడు. హైద్రాబాద్‌కు మద్రాసు ప్రావిన్సుకు చిరకాలంగా సాన్నిహిత్యముంది. మద్రాసు వాళ్ళు చాలా వరకు లౌకికులు అనే పేరుంది. హైద్రాబాద్ సంస్కృతి, సంప్రదాయాల పట్ల వారికి గౌరవం ఉంది. రాజాగోపాలాచారి శాంతి కాముకుడు. వాచ్యంగా కన్నా ఆచరణలో ఆయన గాంధేయవాది. భారత నాయకులందరికన్నా ఆయనకు దార్శనికత ఎక్కువ. పరిపాలనా సామర్థ్యం ఉంది. ప్రొవెన్షియల్ అనాటమీ నడిచిన రోజులలో ఆరు కాంగ్రెస్ పాలిత రాష్ట్రాలలో మద్రాసు పాలన బాగుంది. నెహ్రూ, పటేల్ ఆయనది సాగనిస్తారా?

నిజాం రాజగోపాలాచారికి ఒక ఆదరణీయమైన టెలిగ్రాం పంపాడు. ఆయన పదవిలోకి రావడం వల్ల ఇండో హైద్రాబాద్ సంబంధాల్లో కొత్త అధ్యాయం మొదలు కావాలని ఆశించాడు. రెండు దేశాల సంబంధాలలో పడిన చిక్కుముడిని వ్యక్తిగత శ్రద్ధతో ఆయన విడదీస్తారని ఆశించాడు. చారి పంపిన టెలిగ్రాం కూడా అంతే ఆదరణీయంగా ఉంది. దౌత్య సంబంధాలలో ముసిరిన చీకట్ల మధ్య ఒక వెలుగురేఖలా కనిపించింది. పదవీబాధ్యతలు స్వీకరించగానే హైద్రాబాద్ ఏజెంట్ జనరల్‌ను పిలిపించి ఇండో– హైదరాబాద్ సమస్య పరిష్కారానికి తను చేయగలగిదంతా చేస్తానని హామీ ఇచ్చాడు. భారత ప్రభుత్వం సచివాలయం నుండి సంబంధిత ఫైళ్ళను అడిగాడు చారి. ఆయన చర్య ఢిల్లీ అధికారవర్గంలో ఆవేశపు తుఫానునే రగిల్చింది. చివరికి రాజాజీకి ఒక హెచ్చరిక చేయబడ్డది. అదేమిటంటే హైద్రాబాద్ సమస్య పూర్తిగా



పటేల్‌కు సంబంధించింది, కొద్దిగా అందులో నెహ్రూకు కూడా సంబంధం ఉన్నది. గవర్నర్ జనరల్ అందులో కలుగజేసుకోక పోవడం మంచిదని ఆ హెచ్చరిక సారాంశం.

రాజగోపాలాచారి తీవ్రమైన విసుగుతో హైద్రాబాద్ వ్యవహారాన్ని వదిలి పెట్టాడు. తన విసుగును ఆయనేం రహస్యంగా ఉంచలేదు. గవర్నర్ జనరల్ పదవి కేవలం అలంకార ప్రాయమేనని ఆయన చెప్పుకొచ్చాడు. నాగపూర్‌లో ఆయన చేసిన ప్రకటన చూశాక తర్వలో ఆయన రాజీనామా చేస్తాడని ఊహాగానాలు వచ్చాయి. తర్వాత ఆయనకూ, అసలైన ఢిల్లీ పెద్దలకు మధ్య అవగాహన కుదిరి ఆ విషయం సద్దుమణిగినట్లుంది.

భారత ప్రభుత్వం తర్వాత ఎత్తుగడలేమిటి? వాటిని ఎలా ఎదుర్కోవాలనేదే హైద్రాబాద్ ఎదురు చూపుగా మారింది.

ఆర్థిక దిగ్బంధంతో పాటు సరిహద్దు దాడులను పెంచడం ద్వారా ఏర్పడే అశాంతి వాతారవణాన్ని తనకు అనుకూలంగా మలచుకొని సైన్యాన్ని సరిహద్దుల వెంట మోహరించి,తర్వాత ఒక్కొక్క ప్రదేశాన్ని ఆక్రమించుకోవాలన్నది భారత ప్రభుత్వ ఎత్తుగడగా ప్రచారం మొదలయింది. అది నిజమైనా, కాకపోయినా ప్రజలను

భూభాగాన్ని రక్షించుకోవడం హైద్రాబాద్‌కు ముఖ్యం. తదనుగుణంగా ఏర్పాటు మొదలయింది. అర్ధాయుధ పౌరరక్షకులు రెండు వేల మైళ్ళ హైదరాబాద్ – భారత్ సరిహద్దు వెంట అక్కడక్కడా నియమించబడ్డారు. పౌరరక్షకుల ప్రభావం మొదలయింది. దాడుల సంఖ్య తగ్గింది. కానీ కొద్ది సంఖ్యలో జరిగే దాడుల సాంద్రత, కేంద్రీకరణ శక్తి పెరిగింది. 303 రైఫిళ్ళు, ఆటోమేటిక్ ఆయుధాలతో శిక్షణపొందిన సరిహద్దు దాడులు చేసేవారి ముందు పౌరరక్షక దళాల పాతకాలపు మజుల్ లోడెడ్ గన్స్ వెలవెలబోయాయి. సహజంగానే సరాసరి ఎదురుకాల్పులు జరిగినప్పుడు పౌర రక్షకులకు పెద్ద సంఖ్యలో ప్రాణనష్టం సంభవించేది. రైడర్లది పైచేయి అయ్యేది. సరియైన ఆయుధాలు లేకుండా రైడర్లను ఎదుర్కోలేమన్నది స్పష్టం. ఇంకొకటి కూడా స్పష్టం. ఆయుధాలేమైనా సమకూర్చుకోవాలి లేదా ఒక్కటొక్కటిగా ప్రాంతాలను రైడర్లకైనా వదిలివేయాలి.

గవర్నర్ జనరల్, నిజాం మధ్య కుదిరిన యథాతథ ఒప్పందంలోని అవగాహన ప్రకారం భారత్ ఆయుధ సరఫరా చేయలేకపోయినప్పుడు, హైద్రాబాద్‌కు విదేశాల నుండి ఆయుధాలను దిగుమతి చేసుకునే వెసులుబాటు ఉంది. ఢిల్లీ నుండి ఆయుధ సహాయం అందనందున హైద్రాబాద్ ఇతర అవకాశాలను ఉపయోగించుకో వాలనుకుంది. లండన్‌లో ఉన్న హైద్రాబాద్ జనరల్ ఆయుధాల కొనుగోలు చేయ గలను కానీ వాటిని భారత్ భూభాగం నుండి హైద్రాబాద్ చేర్చడమే అసలు సమస్య అన్నాడు. భారత ప్రధాని ఆదేశాల ప్రకారం సరిహద్దులన్నీ మూసివేయబడి ఉన్నవి. భారత తీరపట్టణాలలో హైద్రాబాద్‌కు రావలసిన వివిధ రకాల వస్తువులే ఆగిపోయి ఉండగా, ఆయుధాలు రవాణా కావడం అసాధ్యం. ఒకే అవకాశం మిగిలింది. ఆకాశమార్గం ద్వారా నేరుగా హైదరాబాద్‌కు ఆయుధాలు రప్పించండం.

అటు నిజాంకు, ఇటు ప్రభుత్వానికి ఇది తేల్చలేని సమస్యగా మారింది. రాజకీయ వాతావరణం వేడెక్కిన పరిస్థితిలో పోలీసులు, సైన్యం కోరిన ఆయుధాలు తెప్పించడం నిజంగా సమస్యే. సాయుధ చొరబాట్లు పెరిగిపోతున్నందున అత్యవసరంగా ఏదో ఒకటి చేయకపోతే దేశం తిరుగుబాటు దారుల పరమైపోతుంది.

చివరకు విదేశీ ఆయుధాలను భారత భూభాగం నుండి వాయు రవాణా ద్వారా ఆయుధ కొనుగోలుకు నిజాం అంగీకరించాడు. మూడు మిలియన్ పౌండ్లను మంజూరు చేశాడు. వాయు రవాణాలో ప్రాథమికంగా అనేక సమస్యల్ని అతికష్టం మీద పరిష్కరించగలిగాం. అతిపెద్ద సమస్య మాత్రం మిగిలే ఉంది. అదేమిటంటే

ఆయుధాలను తెచ్చే విమానాలకు తిరుగు రవాణా ఇంధనం ఉండదు. విమానంలోనే ఇంధనం కూడా తెచ్చుకోవాలి. ఆ విధంగా వాటి రవాణా సామర్థ్యం గణనీయంగా తగ్గిపోయింది. రవాణాకు రాత్రి సమయాన్ని ఎంపిక చేశాం. ఇది ఎలాగో ఇండియాకు తెలిసిపోయింది. హైద్రాబాద్‌లోని ముఖ్యమైన విమానాశ్రయాలలో గూఢచారులను పెట్టింది. వాళ్ళు వెంటనే భారత భూభాగం నుండి రాత్రి విమానాలను నిషేధించారు. ఇండియాలో రాడార్ వ్యవస్థలు ఉన్నాయో, ఉంటే ఎంత బలంగా ఉన్నాయో తెలియదు. ఒకటి మాత్రం నిజం. హైద్రాబాద్‌కు వచ్చే పోయే విమానాలను వాళ్ళు గుర్తించలేరు. విమానాలు రాత్రి దిగే వెసులుబాటు హైద్రాబాద్ విమానాశ్రయాలలో సరిగా లేదన్నది మాత్రం వాస్తవం. ఇండియన్ ఎయిర్ లైన్స్ లైట్–అప్‌లు మాత్రం హైద్రాబాద్‌లో కూడా చాలా బాగున్నాయి. తర్వాత ఆలోచించి పగటిపూట మాత్రమే, రోజువారీ దారిలో మాత్రమే తక్కువ అనుమానం వచ్చేట్లు భారత భూభాగం నుండి ఆయుధ రవాణా చేయాలని నిర్ణయించాం.

నేను దిగులుతో ఉన్న ఈ సమయంలో సిడ్నీ కాటన్ అనే పైలట్ నన్ను పలకరించాడు. ఆయన బ్రిటీష్ పౌరసత్వం తీసుకున్న ఆస్ట్రేలియన్. ఆయన ఒక వ్యాపారపు పనిమీద వచ్చాడు. రవాణా దిగ్బంధం వల్ల వేరు సెనగ రాష్ట్రంనిండా నిలువ అయిపోయింది. బ్రిటీష్ హై కమిషనర్ కానీ భారత్ భూభాగం నుండి రవాణాకు అనుమతి ఇప్పిస్తే వేరుశనగను అమ్ముతామని చెప్పాను. తర్వాత అధికారుల్ని కలవమని ఆయనకు చెప్పాను. వీడ్కోలు తీసుకోబోయిన అతను ఆగి కూర్చుని మళ్ళీ ఏదో చెబుతానన్నాడు. దిగ్బంధం వల్ల అతి ముఖ్యమైన వస్తువులు అవసరమైతే నేరుగా హైద్రాబాద్‌కు సరఫరా చేసే ప్రతిపాదన పెట్టాడు. తర్వాత మెల్లగా ఆయుధాల వాయు రవాణా కూడా చేస్తానన్నాడు. ఆయన ప్రతిపాదన నాకు ఆశ్చర్యం కలిగించలేదు. దాని గురించి చర్చించే ఆసక్తి కూడా నేను చూపలేదు. ఆ రోజుల్లో ఇలాంటి ప్రతిపాదనలు చాలా మంది చేశారు. అందులో కొందరు భారత ఇంటలిజెన్స్‌శాఖ పంపిన వాళ్ళు కూడా ఉన్నారు. ఇలాంటి ప్రతిపాదనలతో ఒకరిద్దరు నాదాకా వచ్చారు. వాళ్ళను ఎంతమాత్రం దగ్గరకు రానీయలేదు. సిడ్నీ కాటన్‌కు కూడా అదే చెప్పాను. తిప్పి పంపించాను. ఇతను లండన్‌లోని హైద్రాబాద్ ఏజెంట్ జనరల్‌ను కలిశాడు. ఆయన ఎలాగూ ఈ పనిమీదే ఉన్నాడు కనుక ఇతన్ని ఒక ఆయుధ రవాణా ఏజెంటుగా పెట్టుకున్నాడు. ఇతరులతో పోల్చినప్పుడు సిడ్నీ కాటన్ సమర్థుడు, నమ్మదగినవాడుగా నిరూపించుకున్నాడు. ఇదంతా ఎంతో ఖర్చుతో కూడుకున్న వ్యవహారం. కానీ గత్యంతరం

లేదు. అన్ని రకాల ఆహార పదార్థాలు, ఆసుపత్రులకు కావలసిన ఎక్స్‌రే ఫిల్ములు, పెన్సిలిన్ లాంటి మందులు, చివరకు పిల్లల ఆహారపు డబ్బాలు అన్నీ ఆయుధాలు, మందుగుండు సామాగ్రితో పాటు రవాణా అయ్యాయి సమయానుసారంగా.

303 రైఫిళ్ళు, స్టెన్‌గన్‌లు వాటి మందుగుండు దిగుమతి అయ్యాయి. కొద్దిమొత్తమే అయినా క్రమంగా అందుబాటులోకి రావడం వల్ల సరిహద్దు భద్రతలో మెరుగుదల కనిపించింది. వచ్చిన ఆయుధాలను ప్రాధాన్యతాక్రమంలో మొదట సైన్యానికి, ఆ తర్వాత పోలీసులకు, చివరగా పౌరరక్షణ దళాలకు ఇవ్వడం జరిగింది. సరిహద్దులలోనే కాకుండా రైలు మార్గాల వెంట కూడా అల్లర్లు మొదలయ్యాయి. ఎన్నో రైళ్ళకు పట్టాలు తొలగించారు. ఫిష్ ప్లేట్లు తొలగించారు. వంతెనలను ధ్వంసం చేశారు. నిరాయుధులైన నిర్వహణా సిబ్బందిని నిర్దాక్షిణ్యంగా చంపివేశారు. దిగుమతి అయిన ఆయుధాల వల్ల పరిస్థితి కొంత మెరుగయింది. పాతకాలపు ఆయుధాలైన మస్కట్‌లను, మజుల్ లోడర్లను మామూలు ప్రాంతాలకు తరలించి అధునాతన ఆయుధాలను అలజడి ప్రాంతాలకు రవాణా చేశాం. పౌర రక్షక దళాలకు ఆయుధాలు సరఫరా అయ్యాక సరిహద్దుల వెంట వందలాది మైళ్ళ పొడవున అక్కడక్కడ నియమించబడిన చిన్నచిన్న పోలీసు బృందాలను ఉపసంహరించుకోగలిగాం. వాళ్ళను కేంద్రస్థానానికైనా పిలిపించాం లేదా ముఖ్యమైన స్థానాలలోని క్యాంపుకు జతగానైనా పెట్టాం.

రవాణా కోసం, పరిశ్రమల కోసం పెట్రోలు, ఆయిల్, లూబ్రికెంట్ల కొరత ఈ సందర్భంలో బాగా వేధించింది. గతంలో పెట్రోలియం సరఫరా మీద ఆంక్షలు పెట్టిన భారత్ ఈసారి పెట్రోలియం, పెట్రోలియం ఉత్పత్తుల మీద నిషేధం విధించింది. ఒక్క చుక్క కూడా ఇప్పుడిక సరిహద్దు దాటదు. ఈ చర్యను ముందే ఊహించినప్పటికీ హైద్రాబాద్‌లో నిలువ సామర్థ్యం తక్కువగా ఉన్నందున ఇంకే ముందస్తు చర్యలు చేపట్టలేకపోయాం. చాలా సందర్భాలలో పది లేదా ఇరవై రోజులకు సరిపడా సరుకును నిలువచేసుకునే వాళ్ళం. తీవ్రమైన అవరోధాలు ఏర్పడితే ముప్పై రోజుల వరకు కూడా నిలువ పెట్టుకోగలిగే వాళ్ళం.వెదజల్లినట్లుగా ఉండే అవసరాలు కలిగిన దేశంలో రైళ్ళద్వారా జరిగే సరఫరా నిలిచిపోయినట్లయితే కొన్ని వారాలలోనే పరిస్థితి చేయిదాటిపోయి పరిపాలన స్థంభించిపోతుంది.

దిగజారిపోతున్న పరిస్థితుల్ని దక్షిణ సదన్ నుండి మున్షీ సంతృప్తితో వీక్షిస్తున్నాడు. రవాణా స్థంభించిపోతే తీవ్రమైన ఆహార సంక్షోభం వచ్చి ప్రభుత్వం నడవలేని స్థితి వస్తుందని ఆయనకు తెలుసు. అయితే తొందరగానే ఆయన భ్రమలు తొలగిపోయాయి.

ఆల్కహాలు కేంద్రాలు సింథటిక్ పెట్రోలు తయారు చేయడాన్ని, అత్యవసర రవాణాకు అది ఉపయోగపడడాన్ని ఆయన చూశాడు. తీవ్రమైన ప్రయోగాల ద్వారా దేశీయమైన వృక్షాలను ఉపయోగించి భౌతిక, రసాయనిక చర్యలతో ఆల్కహాల్‌ను జత చేయగా వచ్చిన నూనెతో డీజిల్ ట్రక్కులు నడవడమూ ఆయన చూశాడు. ఆముదం ఇతర ఔషధాలను లూబ్రికెంట్లుగా వాడగలిగారు. కనుచూపుమేరలో ఆహార సంక్షోభం జాడ లేకపోగా పరాధీనత, ఆందోళనల నుండి బయటపడిన ప్రజలలో ఆత్మ విశ్వాసం, నమ్మకం కనిపించాయి. ఇన్ని అసౌకర్యాలను ఎదుర్కొంటున్నా సమాజంలోని హిందూ, ముస్లిం, క్రిస్టియన్, పార్సీ, సిక్కు మతస్తులెవరిలో కూడా భయం, ఆందోళనా కనిపించక పోవడాన్ని ఆయన గమనించాడు. సమాజంలోని అన్ని వర్గాల ప్రజలు చిత్తశుద్ధితో ప్రత్యామ్నాయాలను ఆలోచించి దేశీయ సామర్థ్యంతో ఆలోచనలను ఆచరణలోకి తెచ్చి పరిస్థితి నుండి బయటపడడానికి ప్రయత్నిస్తుండడమూ ఆయన గమనించాడు. ప్రతి ఒక్కరూ తన కొరకు కాకుండా ఇతరులకు ఎలా సహాయపడగలనని ఆలోచించడాన్ని ఆయన చూశాడు. ఈ మతమూ, ఆ మతమూ అని కాకుండా హైద్రాబాద్ గౌరవాన్ని కాపాడడానికి అందరూ ప్రయత్నించారు. వాళ్ళలో వాళ్ళకున్న తగాదాలు, విభేదాలు హైద్రాబాద్‌ను రక్షించిన తర్వాత చూసుకుంటామనుకున్నారు. ఇది పట్టణాల భావనే కాదు, దేశపు మూలమూలనా ఇదే భావన. మున్షీ కోరుకున్నట్లు, ఒక దశలో ప్రభుత్వం కూడా భయపడ్డట్లు ఏ ఆహార సంక్షోభమూ రాలేదు.

అద్భుతమైన సహకారంతో పరిస్థితి స్థిరపడసాగింది. రైతుల ఉద్వేగం ఎంత వరకు వచ్చిందంటే వాళ్ళ వద్దనున్న సరుకుల్ని ఇవ్వడమే కాకుండా వాళ్ళకున్న ముతక ఎడ్లబండ్ల మీద వాటిని అవసరమైన చోటుకి కూడా పంపించారు. దాచుకున్న సరుకులను పంచిపెట్టడానికి సిద్ధపడ్డ రైతుల దాతృత్వం గతంలో ఎప్పుడూ ఊహించని గొప్ప సంఘటన. ఈ సంక్షోభపు రోజుల్లో హిందువులైన రైతులంతా ఆహార ధాన్యాల రవాణాకు ఏకతాటిపై పనిచేశారు. ఈ మొత్తం వ్యవహారంలో ధాన్యానికి, రవాణాకు న్యాయమైన ధర తప్ప మరేదీ ఆ రైతులు అడగలేదు. ఒకటీ రెండు మినహాయింపులు తప్ప చిన్నాపెద్ద తేడాలేకుండా ప్రభుత్వ ఉద్యోగులంతా తాము ఏరకంగా సహాయ పడగలమా అని ఆలోచించారు. గ్రామాల్లో, పట్టణాల్లో ప్రజలు కూడా అలాగే ఆలోచించారు. స్త్రీలు, పురుషులు అంతా తాము ఏదైనా చేయాల్సిన తరుణం వచ్చిందని ఆతృత కనబరిచారు. కరడుగట్టిన కాంగ్రెసు వాదులు కూడా స్పందించడం ఇక్కడ చెప్పుకోదగ్గ విషయం. రాజకీయ విభేదాలు ఎన్ని ఉన్నప్పటికీ, జాతీయ కాంగ్రెసుతో

కలిసి ఉన్నప్పటికీ, మాతృభూమి హైద్రాబాద్ కోసం పని చేయవలసిన తరుణం వచ్చిందని, హైద్రాబాద్ వ్యతిరేకుల మీద పోరాడకుండా ఉండలేమని, హైద్రాబాద్ మునిగి పోతూ ఉంటే మౌన వీక్షకులుగా ఉండలేమని వారు భావించారు. మాతృభూమి రక్షణ కోసం తమ వంతు పాత్ర నిర్వహించడానికి వాళ్ళు సిద్ధపడ్డారు.

త్యాగం, ఆత్మవిశ్వాసంతో కూడిన ప్రజల భావన మున్షీకి ఆయన చుట్టూ ఉన్న వాళ్ళకు మింగుడు పడలేదు. వాళ్ళకు మింగుడుపడలేదు. వాళ్లను మరింత ఆశ్చర్యపరుస్తూ రాజకీయ ఖైదీలను విడుదల చేయనున్నట్లు ప్రభుత్వం ప్రకటించింది. ఒక్క రామానంద తీర్థ మాత్రం జైలు నుండి విడుదల కావడానికి ఇష్టపడలేదు. ఎంతగా నచ్చజెప్పినప్పటికీ స్టేట్ కాంగ్రెస్ అధ్యక్షుడి హోదాలో జైలులో ఉండడం ద్వారా గతంలో కోల్పోయిన ప్రజా మద్దతును తిరిగి పొందవచ్చనే రాజకీయ లక్ష్యంతో ఆయన జైలులోనే ఉండిపోయాడు. గతంలో ఒక సందర్భంలో ఆయనను విడుదల చేయాలని మున్షీ చెబితే నేను ఒప్పుకున్నాను. అయితే భారత్‌లో కొనసాగుతున్న ఉద్రిక్తతల వల్ల ఆ నిర్ణయం మంచిది కాదని నాకు సలహాలు వచ్చాయి.

ఆర్థిక దిగ్బంధంలాంటి భౌతిక చర్యల వల్ల హైద్రాబాద్ ప్రజల సుస్థితిలో మార్పు రాదని మున్షీకి అర్థమయింది. కష్టకాలంలో మరింత ఉత్సాహంతో హైద్రాబాదీలు పని చేస్తారని తెలిసివచ్చింది. హిందువులంతా మున్షీ, భారత్ భావించినట్లు భారత్ వైపు నిలబడక మాతృభూమి వైపు నిలబడ్డారు. ప్రజల ఉత్సాహపూరితమైన మద్దతు వల్లనే ప్రభుత్వం పని చేస్తూ భారత్ నుండి వచ్చిన ఒత్తిడిని తట్టుకోగలిగింది. కొద్దిపాటి రైఫిళ్ళు, స్టెన్‌గన్‌లతోనే రైడర్లను నిరోధించగలిగింది. సమీప భవిష్యత్తులో రైడర్ల బెడద లేకుండా చేసుకోగలిగింది. అడపాదడపా జరిగే సంఘటనలు తప్ప ప్రభుత్వం కొత్త ఉత్సాహంతో గతంలో ఎన్నడూ లేనంత సామర్థ్యంతో పని చేస్తుంది. కొన్ని చట్టవ్యతిరేక సంఘటనలు జరిగినా వాటిని తట్టుకోగలిగాం.

దీన్‌దార్ల పేరు మీద ఒక ముస్లీం ఫకీర్ల సమూహం అరాచకాలు, దొమ్మీలకు పాల్పడింది. కానీ హిందూ ప్రజలు మాత్రం భారత పత్రికల దుష్ప్రచారం, రేడియోలో వ్యతిరేకత వార్తలు, స్టేట్ కాంగ్రెస్ నాయకుల ప్రబోధం మధ్య వాస్తవంగా జరుగుతున్న సంగతులను అంచనా వేయగలిగారు. తమ స్వంత నిర్ణయానికే కట్టుబడ్డారు. కమ్యూనిజం పేరుమీద జరిగే అశాంతి చర్యలు కట్టడి చేయబడ్డాయి. ఆ తలనొప్పి గతంతో పోలిస్తే చాలా వరకు తగ్గింది. గతంలో నిత్యకృత్యంగా ఉండే రైళ్ళ పట్టాల తొలగింపు, పట్టాల విధ్వంసం, రోడ్ల విధ్వంసం, ప్రభుత్వ ఆస్తుల విధ్వంసం ఇప్పుడు

బహు అరుదుగా జరిగే సంఘటన కింద మారింది. రైళ్ళు ఇతర వాహనాలు కొద్ది సంఖ్యలోనైనా వేళకు నమ్మకంగా నడుస్తున్నాయి. దిగ్బంధం వల్ల ఆగిన తవ్వకాలు, పరిశ్రమలు కొంత సరుకుల కొరత ఉన్నా తిరిగి సాధారణ స్థితికి చేరాయి. కొరత వల్ల సరుకులు మితంగా లభిస్తున్నా అన్ని వర్గాల ప్రజల్లో ఆశలు చిగురించడం మొదలయింది.

హైద్రాబాద్‌లో అంతర్గతంగా ఇలా జరుగుతుందని ఊహించని ఢిల్లీ పెద్దలు దిగులులో మునిగి తమ ప్రణాళికలను నిలిపివేశారు. తన దౌత్య వైఫల్యంతో బాధపడుతున్న మున్షీకి ప్రస్తుత పరిస్థితి మరీ బాధాకరంగా మారి ఆర్థిక దిగ్బంధం నిష్ప్రయోజనమయిందన్న బాధ కలిగించింది. హైద్రాబాద్‌పై సైనిక చర్య ఆలస్యం కావడం ఆయన భరించలేకపోయాడు. హైద్రాబాద్‌లో మిలటరీ సమాయత్తం గురించి కథలల్లి ఢిల్లీకి పంపించడం మొదలు పెట్టాడు. ప్రతిరోజూ ఒక కథను సృష్టించేవాడు. బ్రిటన్, అమెరికా, పాక్‌లతో స్నేహం చేసి భారత్‌ను నిర్మూలించాలని హైద్రాబాద్ పథకం వేస్తుందని సాక్ష్యాలు పుట్టించేవాడు.

హైద్రాబాద్ సైన్యం లక్ష దాటిందని, అనుబంధ సైన్యం వాలంటీర్లు కలిసి అర మిలియనుకు చేరారని చెప్పాడు. ఢిల్లీ మాత్రం ఆయన నివేదికను నమ్మేది కాదు. కాని దుష్ప్రచారం ద్వారా బెదిరించి లొంగదీసుకోవాలని ఆలోచించేది. హైద్రాబాద్ మీద భారత్ పెత్తనాన్ని బ్రిటన్, అమెరికా ప్రజలు వ్యతిరేకిస్తుండడాన్ని భారత నాయకులు జీర్ణించుకోలేకపోయారు. కాశ్మీరు విషయంలో పురోగతి లేదు కానీ అక్కడ అంతకుమించి చేసేది ఏమీ లేదని వారు భావించేవారు. స్వాతంత్ర్యం వచ్చిన దగ్గరనుండి భారత్‌లో ఆర్థిక పరిస్థితి దిగజారుతూ ఉంది. ఇంటా, బయటా భారత్ పొందిన వైఫల్యాల వల్ల ప్రజల్లో అసంతృప్తి పెరిగి అశాంతికి కారణమవుతున్నాయి. అన్ని వైఫల్యాల నుండి దృష్టి మరల్చడానికి బ్రిటీష్ వాళ్ళిచ్చి వెళ్ళిన ఆయుధాలతో హైద్రాబాద్ మైదానం మీద విజయం సాధించడమే అవసరమని భారత నాయకులు భావించారు. కొన్ని నెలల నుండి సిద్ధంగా ఉన్న సైన్యాన్ని భారత్‌పై దండెత్తడానికి తొందరపెట్టాలని నిర్ణయించారు.

# 27. ఏడుగురు నానజ్ అమర వీరులు

గవర్నర్ జనరల్ హోదాలో ఇండో హైద్రాబాద్ సమస్య పరిష్కారానికి రాజగోపాలాచారి అశక్తత వ్యక్తపరచడం, అన్ని దౌత్యమార్గాలనూ పటేల్, నెహ్రూలు మూసివేయడం వల్ల సహాయం కోసం బ్రిటన్, అమెరికాలను అర్థించింది హైద్రాబాద్. ఆరవ కింగ్‌జార్జ్‌కు, అధ్యక్షుడు ట్రూమన్‌కు, బ్రిటన్ ప్రధాని క్లెమంట్ అట్లీకి నిజాం వ్యక్తిగతంగా లేఖలు రాసాడు. భారత ప్రభుత్వపు ఎత్తుగడల గురించి అందులో వివరించాడు. సిద్ధంగా ఉన్న భారత సైన్యాల ఆక్రమణ గురించి అందులో వివరించి ఒక అడుగు వేసి ఆ పరిస్థితి నుండి బయట పడేయాల్సిందిగా దీనంగా అర్థించాడు. బ్రిటన్ పార్లమెంటులో ప్రతిపక్ష నాయకుడుగా ఉన్న విన్‌స్టన్ చర్చిల్‌కు నేను అదే రకమైన విజ్ఞప్తి చేసాను. రిచర్డ్ బీమెంట్ ఆ లేఖను బ్రిటన్ మహారాజు దగ్గరికి తీసుకు వెళ్ళడానికి స్వతహాగా ముందుకు వచ్చాడు. బీమంట్ ఎంతగా ప్రతిఘటించినా ఢిల్లీలో ఆయనను అడ్డగించారు. భారత ప్రభుత్వ అధికారులు లేఖను చించి సభ్యత మరిచి ప్రవర్తించారు.

అమెరికా, బ్రిటన్‌ల నుండి నిజాం లేఖకు సమాధానాలు వచ్చాయి. హైద్రాబాద్ పరిస్థితి పట్ల వాళ్ళు విచారం వ్యక్తం చేసారు. అయితే యధాతధ ఒప్పందం ప్రకారం హైద్రాబాద్ విదేశీ వ్యవహారాలను 1947 నవంబరు 29వ తేదీ నుండి ఒక సంవత్సరం పాటు భారత్ నిర్వహించాలని ఉన్నందున తాము ఏమీ చేయలేమని అశక్తత వ్యక్తం చేసారు. అంటే ఇంకా ఐదునెలలు గడవాలి. అయితే 1948 నవంబరు 29 దాకా భారత్ ఆగుతుందా లేక అన్ని ఒప్పందాలను తుంగలో తొక్కి దాడికి పాల్పడుతుందా? హైద్రాబాద్ ముందు ఇదొక పెద్ద సమస్య. అందుతున్న సమాచారం ప్రకారం ఇండియా ఏదైనా చేయగలదు. ప్రపంచాభిప్రాయానికి భిన్నంగా భారత్ ఎంతవరకు సైన్యాన్ని

నడిపించగలదు? సైనిక చర్య జరిగిన పక్షంలో ఐరాస ఎంతమేరకు సకాలంలో నియంత్రించగలదు? దాడి జరిగిన పక్షంలో హైద్రాబాద్ ఏమి చేయాలి? ఎలాంటి ప్రతిఘటనా లేకుండా భారత దళాలను రానియ్యాలా? నామమాత్రంగా ఎదుర్కోవాలా? శక్తిమేరకు ప్రతిఘటించాలా?

నిజాం ముందు, ప్రభుత్వం ముందు అన్నీ సమస్యలే. తర్వాత తీసుకోవలసిన చర్యలకు ముందు పరిస్థితిని సరిగ్గా అంచనా వేయాలి. దుష్ప్రచారం, దిగ్బంధం, సరిహద్దు దాడులు హైద్రాబాద్‌ను లొంగతీయలేవని, తక్షణం ఇంకేదైనా గట్టి చర్యలుంటే తప్ప రహైద్రాబాద్ దారికి రాదని ఢిల్లీకి అర్థమయింది. భారత మంత్రి వర్గంలోనే రెండు రకాల అభిప్రాయాలున్నాయి. ప్రపంచాభిప్రాయానికి రభిన్నంగా పోతే ఎలా ఉంటుందని నెహ్రూ ఆలోచన. బహిరంగ దాడికి పాల్పడితే తదనంతర పరిణాయాలు ఎలా ఉంటాయోనని ఆయన సంశయం. పటేల్ వర్గం మాత్రం అనేక కారణాల వల్ల ఈ సమస్యను తొందరగా పరిష్కరించాలని తలపోసింది. శతాబ్దాలుగా వస్తున్న సాంప్రదాయాల వల్ల, గాంధీజీ తరచూ ప్రవచించిన అహింస వల్ల హిందువులు అతిసౌమ్యులుగా మారిపోయారని, హైద్రాబాద్ మీద యుద్ధంచేయడం ద్వారా హిందువులలో ఆత్మవిశ్వాసాన్ని కలిగించాలని పటేల్‌కున్న లక్ష్యం. ఆయన ధోరణి ప్రపంచాభిప్రాయాన్ని లెక్కచేయకుండా ఉండేది. ఐరాస మీద ఆయనది ధిక్కారమే. సత్వరఫలితాలు రావాలంటే కొంత సమయం కావాలని ఒకవైపు సైన్యం కోరుతుంది. హైద్రాబాద్ మీదా డాడి జరిగితే పాక్ తటస్థంగా ఉంటుంది. బహుళదేశాల యుద్ధాలలో పాలు పంచుకోవడానికి పాక్ సిద్ధంగా లేదు. అందువల్ల పాకిస్తాన్ ఏంచేయపోతుందీ భారత్‌కు తెలియాలి.

ఈరోజుల్లో నిజాం తన ఆర్మీ కమాండర్‌తో సుదీర్ఘంగా చర్చించాడు. ఒక వేళ భారత దేశం పుర్తిస్థాయిలో దండయాత్ర చేస్తే హైద్రాబాద్ ఎక్కువకాలం నిలువరించలేదన్నది అందరికీ తెలిసిన విషయమే. తేల్చుకోవలసిన విషయమేమిటంటే హైద్రాబాద్ నిజంగా ఎన్ని రోజులు నిలువరించగలదు? భారత్ దాడిని ఎంతమేరకు ఎదుర్కోగలిగినా ప్రపంచం దృష్టిలో అది న్యాయసమ్మతమే; ఎందుకంటే తక్షణం భారత్‌లో విలీనం కావలసిన పరిస్థితిలో హైద్రాబాద్ చిక్కుకుపోయింది. ఆర్మీ కమాండరు అటు నిజాంకు, ఇటు ప్రభుత్వానికి సమయాను సారంగా ఇచ్చిన హామీల ప్రకారం భారత సైన్యాలు ఏదిశ నుండి దాడి చేసినా ప్రధాన పట్టణాల మీద పట్టు సంపాదించడానికి కనీసం మూడు నెలలు పడుతుంది. ఆర్మీ కమాండరు ఆశావాదాన్ని

నేను పంచుకోలేదు. కాని హైద్రాబాద్ సైన్యాలు, భారత దళాలను రాజధానికి కాకుండా నాలుగు నుండి ఆరు వారాలపాటు నిలువరించగలవని నమ్మాను. ప్రపంచం మద్దతు కూడగట్టడానికి ఐరాసను ఇతర ప్రపంచశక్తులను హైద్రాబాద్‌కు మద్దతుగా రంగం మీదికి రప్పించడానికి ఈ సమయం సరిపోతుందని నేను భావించాను.

మరొక ముఖ్యమైన విషయమేంటంటే హైద్రాబాద్ స్టేట్ కాంగ్రెస్ పేరు మీద తెలివిగా ప్రవర్తించి ప్రభావం చూపగలిగిన స్థాయికి ఎదిగిన భారత అనుకూల శక్తులు హైద్రాబాద్ రక్షణ వాదానికి విఘాతం కలిగిస్తారా? ఏదైనా పెద్ద అసౌకర్యం కలిగిస్తారా? అన్నది. అయితే సమూహం ప్రభుత్వం వైపు నిలుస్తుంది. ఒకవేళ భారత అనుకూల వర్గాలు ఏదైనా విఘాతం కలిగించినా మతాలకు అతీతంగా హైద్రాబాద్ ప్రజలు దాన్ని ఎదుర్కోగలుగుతారు. నిజాం దాదాపు ప్రతిరోజు పౌర, మిలటరీ అధికారులలో విస్తృతంగా చర్చలు జరుపుతూ వచ్చాడు. ఆయనలో ఎంత ఆతృత ఉన్నా ఎంత మాత్రం ఆందోళన కనిపించనీయలేదు.

నేను ఢిల్లీలోని హైద్రాబాద్ ఏజెంట్ జనరల్‌కు స్పష్టమైన ఆదేశాలిచ్చాను; భారత నాయకులతో సయోధ్యకు ప్రయత్నించమని. విలీనం తప్ప రాజకీయ ఆర్థిక స్వాతంత్ర్యాలకు విఘాతం కలుగనంతవరకు ప్రతిష్ట, హక్కుల విషయమై ఎలాంటి త్యాగానికైనా సిద్ధపడి ఒప్పందానికి ప్రయత్నించుమని చెప్పాను. బ్రిటిష్ హైకమీషనర్ తప్ప ఢిల్లీలోని విదేశీ రాయబారులంతా హైద్రాబాద్ పట్ల ఎంతో సానుభూతితో ఉన్నారు. ఏరకంగా వీలైతే ఆ రకంగా సహాయం చేయడానికి సిద్ధపడి ఉన్నారు. అమెరికాకు భిన్నంగా, బ్రిటిష్ హైకమీషనర్ ప్రవర్తన పూర్తి విచిత్రంగా చెప్పడానికి వీలు లేకుండా ఉంది. బ్రిటిష్ హైకమీషనర్ ఐతే సానుభూతితోనైనా ఉండాలి; లేదా నిష్పాక్షికంగానైనా ఉండాలని అనుకున్నాం. భారత్, హైద్రాబాద్‌ల మధ్య అవగాహన కోసం బ్రిటన్ చేయగలిగిందంతా చేస్తుందని బ్రిటన్ మహారాజు, ప్రధాని అట్లీ చెప్పినట్లు సమాచారం. అధికారంలో లేకపోయినా, ప్రతిపక్షనాయకుడిగా విన్‌స్టన్ చర్చిల్ హైద్రాబాద్‌కు తన సంపూర్ణ మద్దతు ఉంటుందని బహిరంగంగా నాతో చెప్పాడు. ఇవన్నీ ఇలా ఉంటే ఢిల్లీలోని బ్రిటిష్ హైకమీషనర్ సిబ్బంది మాత్రం విరుద్ధంగా ఉండడమే కాకుండా స్నేహానికి విఘాతం కలిగేలా ప్రవర్తించేవారు.

అయితే బ్రిటన్‌లో భారత అనుకూల విధానం కలిగిన లేబర్ పార్టీ ప్రభుత్వం ఉండడం, భారత నాయకుల పట్ల వ్యక్తిగత సానుకూలత ఉన్న అట్లీ ప్రధానిగా ఉండడం, మంత్రి వర్గంలో భారత్‌కు అనుకూలుడైన, శక్తిమంతుడైన స్టాన్‌ఫర్డ్ క్రిప్స్




ప్రభ వెలిగిపోతూ ఉండడం రహస్యాలేంకావు. అయినా శతాబ్దాలుగా బ్రిటన్, హైద్రాబాద్‌ల బంధానికి కారణమైన అవగాహణలు, ఒడంబడికలను బ్రిటన్ అంత సులభంగా తృణీకరిస్తుందని ఊహించలేదు. ఆ రోజుల్లో బ్రిటిష్ హైకమాండర్ సహాయకుడొకరు తరచుగా ఢిల్లీ, హైద్రాబాద్‌లకు తిరుగుతూ ఉండేవాడు. బ్రిటిష్ హైకమిషన్ సభ్యుడిగా అతడికి మొదట్లో ఎంతో గౌరవం లభిస్తూ ఉండేది. అయితే అతడు కేవలం గౌరవ మర్యాదలకోసం వస్తున్నాడని అర్థమయింది. పనిలో పనిగా అతడు హైద్రాబాద్‌లోని బ్రిటన్, అమెరికా వాసుల ఇండ్లకు వెళ్ళి వాళ్ళను ఉద్యోగాలు వదిలివేయమని హైద్రాబాద్‌కోసం ఎలాంటి సహకారం, సానుభూతి చూపించవద్దని చెప్పడం మొదలు పెట్టాడు.

జూలై మధ్యలో భారత ప్రభుత్వం దక్కన్ ఏర్‌వేస్ లైసెన్స్‌ను రద్దు చేసింది. భారత భూభాగంలో దక్కన్ విమానాలను నిషేధించింది. హైద్రాబాద్‌లో ఉన్న ఏకైక ఏర్‌వేస్ అది. రోజూ బొంబాయి, బెంగుళూర్, మద్రాసు, ఢిల్లీకి సర్వీసులను నడిపేదది. కొద్దిరోజుల తర్వాత హైద్రాబాద్ ద్వారా మద్రాసు నుండి ఢిల్లీ వెళ్ళే గ్రాండ్ ట్రంక్ ఎక్స్‌ప్రెస్ హైద్రాబాద్ మీదనుండి కాకుండా వేరే దారిలో గుండ్రంగా తిరుగుతూ పోవడం మొదలయింది. ఈ చర్యలు చాలా అసౌకర్యాన్ని కలిగించాయి. ఫలితంగా హైద్రాబాద్ నుండి వచ్చేపోయే టెలిగ్రాంలు పంపిణీ చేయబడవు. హైద్రాబాద్, ఢిల్లీలోని తన ఏజెంట్ జనరల్‌తో ప్రత్యక్ష సంబంధాలను కోల్పోయింది. టెలిఫోన్ సంభాషణలు కూడా కష్టమైపోయాయి; టాపింగు జరుగుతుందని కాదు, లైన్లలో తీవ్ర అంతరాయాల వల్ల.

ఈ రోజుల్లో ఒక దురదృష్టకరమైన సంఘటన జరిగింది. హైద్రాబాద్ రాష్ట్ర పశ్చిమ సరిహద్దుల్లో కొన్ని ప్రాంతాలు నలువైపులా భారత భూభాగంచే చుట్టబడి వుండేది. అలాగే హైద్రాబాద్ కూడా కొన్ని భారత భూభాగాలకు చుట్టూ ఆవరించి ఉండేది. హైద్రాబాద్‌కు ఈ ప్రాంతాలతో మంచి పరిపాలనా నియంత్రణ లేకుండా భారత అధికారులు ఏర్పాటు చేసారు. హైద్రాబాద్ అధికారులు, ఉద్యోగులు భారత భూభాగం ద్వారా ఈ మూలలకు రాకుండా భారత అధికారులు కావలసినన్ని అడ్డంకులు కల్పించారు. తద్విరుద్ధంగా హైద్రాబాద్ భూభాగం గుండా భారత అధికారులు వారి భూభాగంలోని మారుమూలలకు చేరుకోవడానికి ఇక్కడి అధికారులు వెసులుబాటు కలిగించారు. ఉన్నతాధికారుల ఆదేశాలు ఉన్నప్పటికీ, సహజమైన ఇబ్బందుల వల్ల ఇక్కడి అధికారులు రహదారులను అదుపాజ్ఞల్లో పెట్ట లేకపోయారు. అందువల్ల ప్రయాణీకులకు తరచూ ఇబ్బందులు తలెత్తాయి. బార్సి అలాంటి ఒక భారత భూభాగం. ఇక్కడ గతంలో భారత్ మిలటరీ యూనిట్‌ను నిర్వహించింది. ఇక్కడి భారత అధికారులు హైద్రాబాద్ భూభాగం నుండి వెళుతున్నప్పుడు హైద్రాబాద్ కస్టమ్స్ పాయింట్ ఉండేది. అక్కడ కస్టమ్స్ మర్యాదలను పాటించకుండా భారత అధికారులు హైద్రాబాద్ అధికారులను పోలీసులను కించపరుస్తూ, బెదిరిస్తూ దాటిపోయేవారు. అక్కడ మిలటరీ క్యాంపు పెట్టి సివిల్ అధికారులను బాధ్యతల నుండి తప్పించాలని పట్టుబడుతూ ఉండేవారు. అయితే ప్రభుత్వం మాత్రం హైద్రాబాద్ సైన్యాన్ని భారత ట్రూపులతో నేరుగా కలవడానికి అవకాశం కలిగించ వద్దనుకుంది. అందుకే హైద్రాబాద్ మిలటరీని సరిహద్దులకు మూడు మైళ్ళు దూరంగా వెళ్ళి పొమ్మని శాసించింది. అదొక ఇబ్బంది కరమైన ఆదేశమే. హైద్రాబాద్‌లో పెద్ద ప్రజా విమర్శ వచ్చింది దీనిపై. ఎవరి మెప్పుకోసం ప్రజారక్షణకు దూరంగా మూడు మైళ్ళు జరిగారని సూటిగానే అడిగారు. దానికి మే మిచ్చిన జవాబు ఒక్కటే, రెండు వైపులా సైన్యం మోహరించ్చడం మంచిదికాదని సరిహద్దుల్లో ఉన్న పోలీసులకు కూడా స్పష్టమైన ఆదేశాలిచ్చాం. రైడర్ల నుండి ప్రజలను కాపాడడం తప్ప ఇంకా దుందుడుకు చర్యలూ చేపట్ట వద్దన్నాం. నానజ్ వద్ద ఉన్న పోలీసులు, పౌరరక్షకులకు ముప్పై తుపాకులు, ఆరు 303 రైఫిళ్ళు, ఆరు పాత హెన్రీ మార్టినీలు, రెండు స్టెన్‌గన్‌లు, మిగతావి పాత మజెల్ లోడర్స్ మాత్రం అందుబాటులో ఉన్నది. ఒక్కొక్క తుపాకికి పది రౌండ్లకు మించని మందుగుండు ఉంది.

నానజ్ వద్ద ఉన్న పౌర రక్షకులు, పోలీసులు రైఫిళ్ళు ఎక్కు పెడుతు సైనికులు రోజూ పెట్టే అవమానాలను భరించలేక పోయారు. ఒక రోజు భారత సైనికుల

కాన్వాయ్ రోజులాగానే తుపాకులు ఎక్కు పెడుతూ వెళ్ళిపోయింది. అక్కడి రక్షకులు, పోలీసులు ఆయుధాలు అందుకున్నారు. ఒక వేళ భారత కాన్వాయ్ దాని చర్యలను పునరావృతం చేస్తే ఎదుర్కోవాలని నిర్ణయించుకుంది. వెంటనే ఇంకొక భారత కాన్వాయ్ వచ్చింది. కస్టమ్స్ మర్యాదలకు నిరాకరించింది. ఎగతాళి చేసింది. ఒక భారత సైనికుడు గాలిలోకి కాల్చాడు. ప్రతిగా ఇటు వైపునుండి కూడా గాలిలోకి ఒక తుపాకి పేలింది. అది భారత సైనికులకు హైద్రాబాద్ పోలీసు, రక్షకుల మధ్య పోరాటం గా మారిపోయింది. రెండు వైపులా సైనికులు గాయపడ్డారు. భారత సైన్యం వారి క్షతగాత్రులను తీసుకొని వెళ్ళిపోయింది. కొద్ది సేపట్లో మరికొన్ని భారత సైన్యాల వాహనాలు వచ్చాయి. కనిపిస్తూనే కాల్పులు ఆరంభించాయి. హైద్రాబాద్ పికెట్ వెంటనే సిద్ధమయింది. మజుల్ లోడర్, హెన్రీ మార్టినీస్ ఉన్న వారిని గ్రామంలో ఉంచి, 303, స్టెన్‌గన్‌లు ఉన్నవారితో కస్టమ్స్ కేంద్రం నిర్వహించబడింది. వాళ్లు కాల్చారు. వస్తున్న వాహనాలను ఆ కాల్పులు కొంత ఇబ్బంది పెట్టాయి. వెంటనే ఆ సైనిక వాహనాలు వెనుదిరిగిపోయాయి.

కొంతసేపటి తర్వాత భారత సైనిక వాహనాలు రెండు వైపుల నుండి రాజొచ్చాయి. వస్తూనే కాల్పులు ఆరంభించాయి. రక్షణ దళాలు గ్రామంలోని వివిధ ప్రాంతాలలో దాక్కొని భారత దళాలు దగ్గరికి వచ్చేదాకా వేచి చూశాయి. అప్పుడు కాల్చి గాయ పరిచాయి. భారతసైన్యాలు వాహనాలను విడిచి దూరంగా జరిగాయి. ఆ తర్వాత కొంత వ్యవధానంతో చెదురుమదురుగా కొన్ని గంటలపాటు రెండు వైపుల నుండి కాల్పులు జరిగాయి. నానజ్ గ్రామానికి రెండు వైపుల రోడ్డు భారత భూభాగానికే పోతుంది. ఇతర హైదరాబాద్ రాష్ట్ర భూభాగానికి చేరాలంటే భారత్ నుండి ప్రయాణం తప్పనిసరి. నానజ్ అధికారులకు కాలి నడకన తప్ప ఎలాంటి సమాచారపు ఆధారం లేదు. పైగా భారత సైనికులకు వైర్‌లెస్ సెట్లు అమర్చి ఉన్నాయి. బలంగా సంకేతాలున్నాయి. అదే సమయంలో నానజ్ అధికారుల మందుగుండు తగ్గిపోయింది. ధైర్యం ఉన్నవాళ్ళు వాహనాలలోని 303 మందుగుండును, రైఫిళ్ళను దొరకబుచ్చు కున్నారు. ఇవన్నీ సంపాదించుకుని మళ్ళీ దాక్కున్నారు. భారత సైనికులు అధునాతన ఆయుధాలతో ముందుకు రాసాగారు. అయినా ఏడుగురికి మించని రక్షకులు వ్యూహాత్మకంగా దాక్కొని పోరాటానికి సిద్ధపడ్డారు.

ఎడతెగని కాల్పులు కొనసాగుతున్న యుద్ధ వాతావరణం ఆ ఏడుగురు హైద్రాబాద్ వీరులను భయపెట్టలేకపోయింది. ఆ ఏడుగురు వీరులు ప్రాణాలకు

పణంగా పెట్టి గాయాలను లెక్కచేయక పోరాడారు. అమరులయ్యారు. భారత సైనికుల గాయాలు గొప్పగా కొనియాడబడ్డాయి. ఎనభైమంది దాకా చనిపోవడమో, తీవ్రంగా గాయపడడమో జరిగిందని అనధికార నివేదికలు వచ్చాయి. గ్రామస్థులు కూడా గాయపడ్డారు. ఇండ్లు వదిలి చెల్లాచెదరయ్యారు. ఇండ్లన్నీ ధ్వంసమయ్యాయి. కొద్ది ఇండ్లు మాత్రమే సురక్షితంగా మిగిలాయి. రాత్రయ్యాక భారత్ సైన్యాలు మరిన్ని వచ్చాయి. గ్రామాన్ని పూర్తిగా ఆక్రమించాయి. గొడవ సద్దు మణిగిందనుకొని తమ హిందూ సహవాసులతో పాటు గ్రామానికి చేరుకొన్న ముస్లిం స్త్రీలను పురుషులను, పిల్లలను ఆ సైన్యం ఊచకోత కోసింది. కొందరు హిందూ గ్రామస్థులకు కూడా అదే గతి పట్టింది. ఆస్తులు దోపిడీకి గురయ్యాయి. చివరకు ఆ గ్రామాన్ని భారత సైన్యం ఆధీనంలోకి తీసుకుంది.

ఈ సంఘటన రెండు వైపులా ఉద్రిక్తతల్ని పెంచింది. హైద్రాబాద్ తీవ్ర నిరసన వ్యక్తం చేసింది. అయినా భారత్ మాత్రం నానజ్‌ను వదిలిపెట్టలేదు. నానజ్‌ను కోల్పోవడం హైద్రాబాద్‌కు తీవ్రమైన అప్రతిష్టగా మారింది. నానజ్‌ను తిరిగి పొందాలంటే మిలటరీ దాడి ఒక్కటే మార్గం. అందులోనూ భారత్‌కు రెండు వైపుల రోడ్డు ద్వారా సమాచార వ్యవస్థ ఉండగా హైద్రాబాద్‌కు మాత్రం భారత్ భూభాగం ద్వారానే నానజ్ చేరే వీలుంది. నిజాం చాలా దిగ్భ్రాంతి చెందాడు. నానజ్‌ను తిరిగి స్వాధీనం చేసుకోవాలనే ఆందోళన మొదలయింది. ఈ ఒత్తిడిని తట్టుకొని దౌత్యమార్గాల ద్వారానే ఈ సమస్యను పరిష్కరించుకోవాలని నేను నిర్ణయించాను. అయితే అలాంటి పరిష్కారం కష్టమని నాకు తెలుసు.

నానజ్ సంఘటన భారత నాయకులలో రెండు అభిప్రాయాలను ఏర్పరచింది. ఒకటేమిటంటే హైద్రాబాద్ సైన్యంతో పాటు పౌర రక్షకులు కూడా తక్కువేమీ కాదని, కొద్దిసంఖ్యలో ఉండి కూడా ఆయుధలేమితో కూడా చాలా సాహసోపేతంగా పోరాడ గలరని, అది చిన్నగా తీసివేయదగిన అంశం కాదని భారత నాయకులకు అవగత మయింది. రెండవది – ఎట్టి పరిస్థితిలో కూడా భారత సైన్యంతో నేరుగా హైద్రాబాద్ సైన్యం పోరాటానికి దిగకుండా చూడాలని హైద్రాబాద్ ప్రభుత్వం భావిస్తుందని కూడా అర్థమయింది. కాబట్టి హైద్రాబాద్‌లోని ఏదైనా ప్రాంతాన్ని ఆక్రమించడం సురక్షితం. తర్వాత కాలంలో భారత్ చేసిన దాడులు ఈ అవగాహనను బలపరిచాయి.

ఔరంగాబాద్, నల్గొండ, వరంగల్ జిల్లాలలో ఇలాంటి సంఘటనలే జరిగాయి. చాలా సందర్భాలలో భారీ ఆయుధ వాహనాలలో, కొన్ని సార్లు చిన్న చిన్న 'టాంకులతో

దళాలు పూర్తిస్థాయిలో ఆస్థి నష్టం, ప్రాణనష్టం కలిగించి వెళ్ళాయి. దాదాపు ప్రతిచోట పోలీసులు, పౌర రక్షకులు తుడిచిపెట్టుకుపోయారు. ఎంత నిరసనలు వ్యక్తమైనా భారత వైఖరిలో మార్పు రాలేదు.

ఈ కాలంలో కొద్దిపాటి దౌత్యకార్యం నడుస్తుంది. నిరాశాజనకంగా ఉన్న రాజకీయ వాతావరణంతో పాటు విమాన రాకపోకలు రద్దవడం వల్ల సమాచార వ్యవస్థ చాలా దెబ్బతిని ఉంది. కరాచీలోని ఏజెంట్ జనరల్ ఏర్పాటు చేసిన సమాచార వ్యవస్థ ఒక్కటే హైద్రాబాద్‌ను మిగతా ప్రపంచంతో కలిపి ఉంచింది. ఢిల్లీలోని ఏజెంట్ జనరల్‌కు కూడా కరాచీ ఏజెంట్ జనరల్ నుండి సమస్యాత్మకమైన మోర్స్‌కోడ్ ద్వారా భిన్నమైన పద్ధతిలో, భిన్నమైన సమయాలలో సమాచారం అందుతూ ఉండేది.

భారత ప్రభుత్వం తీవ్రమైన ప్రయత్నాల ద్వారా కూడా మోర్స్‌కోడ్‌ను డీకోడ్ చేసుకుని సమాచారం రాబట్టుకోలేకపోయింది.

ఆగస్టు తొలి రోజుల్లో ఒకనాడు నా పాత మిత్రుడు రామస్వామి మొదలియార్ నుండి ఫోన్ వచ్చింది. ఢిల్లీలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడ్డాక ఆయన మైసూర్ దీవాన్‌గా నియమించబడ్డాడు. అప్పుడు రాజగోపాలాచారి దక్షిణభారత పర్యటనలో భాగంగా మైసూర్‌లో ఉన్నాడు. గవర్నర్ జనరల్ నిజాంకు ఒక ముఖ్యమైన వర్తమానం పంపిస్తున్నాడని రామస్వామి చెప్పాడు. ఆ వర్తమానాన్ని ఒక మైసూరు అధికారి తెస్తున్నాడని, ఆ అధికారి హైద్రాబాద్‌లోకి ప్రవేశించగానే ఒక సహచరుణ్ణి ఏర్పాటు చేస్తే మంచిదని చెప్పాడు. హైద్రాబాద్‌లో ప్రయాణం చాలా సురక్షితం. అయితే ఆయనకు రక్షణ అనేది గవర్నర్ జనరల్ అభీష్టం అని చెప్పినందున నేను సరే అన్నాను.

పరిస్థితుల పట్ల వ్యక్తిగత సానుభూతి చూపిస్తూ అన్నీ మంచి దిశగానే జరుగుతాయని ఆశాభావం వ్యక్తం చేశాడు. ఎన్నో విషయాలు చెప్పాల్సి వున్నా చెప్పలేక పోతున్నందుకు విచారం వ్యక్తం చేశాడు. ఆయనకు హైద్రాబాద్ అంటే ప్రేమ, హైద్రాబాద్ సేవలోకి రమ్మని ఆయనను అనేకసార్లు అడిగి ఉన్నాను. ఆయనకు భారత కాంగ్రెస్ నాయకులకు పెద్దగా మంచి సంబంధాలు లేవు. మద్రాసులోని ఒక పత్రికకు సంపాదకత్వం వహిస్తున్న ఆయన కుమారుడు భారత నాయకుల విధానాలను విమర్శిస్తున్నాడు. హైద్రాబాద్ మీద భారత్ నాయకుల ఆధిపత్య పోకడలను ఆయన బహిరంగంగానే విమర్శించాడు. ఇండో హైద్రాబాద్ సంబంధాల వ్యవహారంపై

ఐరాసలో భారత్ తరపున వాదించడానికి అలాంటి వాళ్ళు ఉంటే బాగుండేదని నేను అనుకున్నాను. ఆయన దృష్టి భారత్ కోణంలో ఒకలాగే ఉండేది. ప్రపంచదేశ ప్రతినిధులతో ఆయనకు మంచి సంబంధాలున్నాయి. ఐరాస చార్టర్ మీద మౌలిక సంతకం చేసి వాళ్ళలో ఆయన ఒకడు. కాశ్మీరు విషయంలో ఇండియా, దాని ప్రతినిధి గోపాల్‌దాస్ అయ్యంగార్ ఐరాస ముందు ఒక హాస్యపు సరుకుగా మారి పోయారు. భారత ప్రధాని నెహ్రూ సోదరిగా, స్థిరత్వ లేని మహిళ విజయలక్ష్మీ పండిట్ ఐరాస ముందు హైదరాబాద్ విషయాన్ని ముందుకు తీసుకుపోలేకపోయారు. కానీ అనైతికమని నమ్మిన విషయాన్నే న్యాయమని వాదించడానికి ఒప్పుకోవడం ఆశ్చర్యం. కాంగ్రెస్ నాయకుల దృష్టిలో పడి తన కొడుకు భవిష్యత్తును భద్రం చేయడానికి వచ్చిన అవకాశంగా దీన్ని ఆయన భావించి ఉండవచ్చు.

రామస్వామి చేసిన టెలిఫోన్ విషయం నిజాంకు చెప్పాను. గవర్నర్ జనరల్ నుండి ఏమి రాబోతుందనే ఉత్సుకత మొదలయింది. వర్తమానం వచ్చింది. వర్తమానాన్ని తెచ్చిన వ్యక్తి వ్యక్తిగతంగా నిజాంకే ఇస్తానంటాడు. కచ్చితంగా అలాగే ఇవ్వాలనుకుంటే అది ఇవ్వకుండానే వెళ్ళిపోవచ్చని చెబితే, నిజాం వ్యక్తిగత కార్యాలయంలో ఇచ్చాడు.

'కింగ్ జార్జ్ – 4' లేఖను గవర్నర్ జనరల్ ముందుమాటతో వచ్చిన వర్తమానం అది. నిజాం రాసిన లేఖకు అది జవాబు. ఢిల్లీ కస్టమ్స్ అధికారులు నిజాం రాసిన లేఖను చించి చూసిన సంగతి తెలిసిందే. కింగ్ జార్జ్ లేఖ ఆశాభావంతో కూడుకుని ఉంది. తన భారత భూభాగానికి, శతాబ్దాలుగా నమ్మకమైన దాని మిత్రుడికి త్వరలోనే ఆమోదయోగ్యమైన మైత్రి కుదరాలని ఆయన అందులో ఆకాంక్ష వ్యక్తం చేశాడు. బద్దలు కావడానికి సిద్ధంగా ఉన్న అగ్ని పర్వతం లాంటి పరిస్థితికి వాస్తవిక పరిష్కారమేదీ అందులో చూపలేదు.

చివరగా హైద్రాబాద్ వ్యవహారాన్ని ఐరాస భద్రతా సమితికి నివేదించాలని నిర్ణయించబడ్డది. ఐరాస చాప్టర్ ప్రకారం హైద్రాబాద్ వ్యవహారం నేరుగా భద్రతా మండలికి నివేదించవచ్చా లేదా ఇతర సభ్యదేశం ద్వారా తీసుకుపోవలసి ఉంటుందా పరిశీలించమని మాంక్టన్‌ను కోరడం జరిగింది. హైద్రాబాద్ మనుగడ మీద అన్ని దేశాలకు సానుభూతి ఉంది కాబట్టి నేరుగా ప్రాతినిధ్యం సమర్పించుకోవచ్చని భావించడం జరిగింది. సభ్యులు కాని దేశాలు నేరుగా అభ్యర్థన చేసుకోవచ్చని, సెక్షన్ 35(2) ప్రకారం భద్రతా మండలి ఆ అభ్యర్థనలను పరిశలించవచ్చు.

భద్రతా మండలిలో ప్రతిపాదించడానికి ఒక మంచి బృదం కావాలి. నేను తక్షణం ఐరాస భద్రతా మండలి త్వరలో సమావేశం కానున్న లేక్ సక్సెస్ లేదా పారిస్‌కు వెళ్లాలని చాలామంది అభిప్రాయపడ్డారు. అయితే మహా విపత్తు పొంచుకొని ఉన్న సందర్భంలో నేను హైద్రాబాద్ వదలడం తెలివైన పని కాదు. క్యాబినెట్లో చర్చించాక ఆర్థిక, విదేశీ వ్యవహారాల మంత్రి మోయిన్ నవాజ్ జంగ్ బృందాన్ని పంపాలని నేను, నిజాం నిర్ణయించాం. అతను యథాతథ ఒప్పందం చివరి దశలో బాధ్యత వహించిన వాడు, ప్రస్తుత రాజకీయ స్థితిగతులు ఆయనకంటే బాగా ఇంకెవరికీ తెలియవు. ఐరాసలో కొంత పాత అనుభవం ఉన్న వారెవరినైనా ఈ బృందానికి జత చేయాలనే ఆరాటంలో ఉన్నాను. గతంలో ఐరాస సమావేశానికి వెళ్ళివచ్చిన అలీయవార్ జంగ్ పేరు తీశాను.ఆయన సిద్ధంగా ఉన్నాడు. కానీ వ్యక్తిగత కారణాల వల్ల మోయిన్ నవాజ్ జంగ్ నేతృత్వంలో పోలేనన్నాడు. నేను నాయకత్వం వహించాలని ఆయన పట్టుబట్టాడు. అది సాధ్యం కాదని చెప్పాక ప్రతినిధి బృందానికి ఐరాసలో సమర్పించేందుకు డాక్యుమెంటు తయారు చేసి మాత్రం ఇస్తానని చెప్పాడు. అద్భుతమైన డాక్యుమెంటు తయారు చేసి ఇచ్చాడు. అది తీసుకొని మోయిన్ నవాజ్ జంగ్ పారిస్‌కు వెళ్ళాడు.

# 28. కొన్ని అంతర్గత ఒత్తిడులు

తుఫాను ముందు ప్రశాంతత ఆవరించింది కొంత తడవు. అప్పుడప్పుడు బహిరంగ సభల్లో నెహ్రూ చేస్తున్నన్న పరస్పర విరుద్ధ ప్రకటనలు, భారతీయ పత్రికలు, రేడియో చేసే దుష్ప్రచారాల నడుమ ఇటు హైద్రాబాద్ కానీ అటు భారత్‌కాని చేసే దౌత్య ప్రయత్నాలలో కొద్ది పాటి కదలిక కనిపించేది. అదే సందర్భంలో తలెత్తిన కొన్ని అంతర్గత ఒత్తిళ్ళ గురించి కూడా చెప్పుకోవాలి.

ఢిల్లీలోని హైద్రాబాద్ ఏజెంట్‌జనరల్ జయీన్ యార్‌జంగ్ నివేదికలు చాలా గందరగోలంగా ఉండేవి. సమాచార అడ్డంకుల వల్ల వివరణలు తీసుకోలేక నేను, నిజాం కూడా చాలా సందర్భాలలో విసిగిపోయాం. ఆయనను తరచూ హైద్రాబాద్‌కు పిలవడం కూడా కష్టమైన పనే. ఢిల్లీలోని విదేశీ రాయబారులను హైద్రాబాద్ పట్ల సానుకూల పరచడంలో ఆయన ప్రయత్నం విలువైనది. కాని నిజాంకే అంతగా సంతృప్తి కలిగించలేదు. రాష్ట్రాల మంత్రిత్వశాఖతో, ఇతర భారత నాయకులతో వ్యవహారంలో ఆయన పాత్ర కష్టతరమైనదే. కాని అనుకున్న దానికన్నా చాలా తక్కువ ప్రయత్నం ఆయనది. ఆయన ప్రయత్నం క్రమానుగతంగా లేదు. ఆయన నివేదికలు నిజమైనవా లేక ఆయన స్వంత అభిప్రాయాలా అర్థంకాకుండా ఉండేది.

ఆయన జులైలో హైద్రాబాద్ వచ్చినప్పుడు నిజాంతో చాలా సేపు మాట్లాడాడు.

నన్ను కలిసి ఢిల్లీ వ్యవహారాలన్నీ చెప్పాడు. రాష్ట్రాల వ్యవహారాల శాఖ మిలటరీ చర్యకు ఆతృతపడుతూ ఉన్నప్పటికీ రక్షణ శాఖ మాత్రం ఆ సంసిద్ధతకు చాలా దూరంలో ఉందని, కనీసం అందుకు మూడు నాలుగు నెలలైనా పడుతుందని చెప్పాడు. నవంబర్ మాసాంతానికి గాని భారత్ మిలటరీ చర్య చేపట్టలేదని ఆలోగా నేను రాజకీయ, వ్యూహాత్మక ప్రణాళికలు సిద్ధం చేసుకోవచ్చని చెప్పాడు. యథాతథ ఒప్పందకాలం నవంబర్ చివరికి పూర్తవ్వబోతున్నందున ఆయన అంచనా వాస్తవికంగానే ఉంది.

ప్రపంచం దృష్టిలో ఒప్పందాన్ని విఘాత పరచిన దేశంగా పేరుమోయడానికి భారత్ ఇష్టపడదు. మరుసటిరోజు ఉదయం నిజాంను కలిసి ఇదేవిషయమై మాట్లాడాను. జయీన్ యార్‌జంగ్ ఇదే విషయం మీద నిజాంకు చెప్పిన దానికి నాతో చెప్పిన దానికి చాలా వ్యత్యాసముందని గుర్తించాం. భారత సైన్యాలు సిద్ధంగా ఉన్నాయని అవి హైద్రాబాద్ మీదా ఏక్షణాన్నైనా దాడి చేయగలవని నిజాంకు చెప్పాడు. ఇతర విషయాలలో కూడా వ్యత్యాసముంది. ఢిల్లీలో ఇంకొకర్ని నియమించుమని నిజాం పట్టుబట్టాడు. కొంత ఆలోచించి సీనియర్ సివిల్ సెర్వెంట్ అహ్మద్ మోహియొద్దీన్ రజ్వీని జయీన్ యార్ జంగ్ స్థానానికి పంపాలని నిర్ణయించాం. అహ్మద్‌మోహియొద్దీన్ రజ్వీకి, ఖాసీం రజ్వీ పేరుతో పోలిక ఉండడం కూడా ఆలోచించవలసిన విషయమైంది. నిజానికి వాళ్ళిద్దరికి ఎలాంటి సంబంధం లేదు. ఢిల్లీలో 'రజ్వీ' అంటే మండి పోయే పరిస్థితి ఉంది. అసలే అత్యంత క్లిష్టమైన పనిలో అహ్మద్ మోహియొద్దీన్‌కు తన ఇంటిపేరు పెద్ద అడ్డంకిగా మారే ప్రమాదం కనిపించింది. అయితే తొందరలోనే ఈ 'పేరు' గందరగోళాన్ని ఢిల్లీ అర్థం చేసుకుంటుందని భావించాం. అదే సమయంలో జయీర్ యార్‌జంగ్ తన కుటుంబ అవసరాలకోసం ఢిల్లీలో ఉండేందుకు సెలవడిగాడు. ఆయన భార్య కాలు విరిగి నడవలేని స్థితిలో ఉన్నందున అక్కడే ఉండేందుకు అనుమతి ఇచ్చాం.

నిజాం మీర్జా ఇస్మాయిల్‌తో మాట్లాడుతూ ఉన్నాడని, ఇండో-హైద్రాబాద్ చిక్కుముడి విప్పడానికి ఆయన సహాయం కోరుతున్నాడని పుకార్లు వ్యాపించాయి. మీర్జా ఇస్మాయిల్ ఢిల్లీ పర్యటనలో ఉన్నాడు. ఆయన చేసిన కొన్ని ప్రకటనలు ఆయన హైద్రాబాద్ పక్షాన మాట్లాడుతున్నట్లుగా వచ్చాయి. మీర్జా ఇస్మాయిల్‌ను ముస్లింలు నమ్మరు. ఇత్తెహాదీలకైతే ఆయన పొడ అసలే గిట్టదు. హిందువులకు కూడా ఆయన అంటే గౌరవం లేదు. గతంలో హైద్రాబాద్‌లో ఆయన పని చేసినప్పటి రికార్డే అందుకు

కారణం. అలాంటి వ్యక్తి హైద్రాబాద్ గురించి మాట్లాడం అందరినీ గందరగోల పరచింది. ఖాసిం రజ్వీ నా దగ్గరకు వచ్చి మీర్జా ఢిల్లీ పర్యటన మతలబు చెప్పమన్నాడు. నాకు ఆవిషయం పెద్దగా తెలియదు. పత్రికల్లో వచ్చింది నిజం కాదని అతని గురించి నేనేమీ చెప్పలేనన్నాను. నిజాం నాకు మాట మాత్రంగా కూడా ఈ విషయమై చెప్పలేదు. పుకార్ల గురించి నేను ఆయనను అడగదలుచుకోలేదు.

పుకార్లు వచ్చాక నాకు అర్థమయిందేమిటంటే నిజాం ప్రభుత్వ నిర్ణయాలను వ్యతిరేకించే సమూహాలతో సుదీర్ఘమైన చర్చలు జరిపాడు. నిజాం ఎవరెవరిని కలిసాడని నేను వ్యక్తిగతంగా శ్రద్ధ పెట్టలేదు, ఎందుకంటే అన్ని విధాన నిర్ణయాలలో నిజాముకు, ప్రభుత్వానికి ఏకాభిప్రాయముంది. రోజువారి సంభాషణల్లో భాగంగా ఈ పుకార్ల గురించి ఢిల్లీలో మీర్జా ఇస్మాయిల్ ప్రకటన గురించి నిజాంతో ప్రస్తావించాను. నేనడిగిన అంశం మీద ఆయన ఏమీ చెప్పదలుచుకున్నట్లు అనిపించలేదు నాకు. ప్రభుత్వ విధానాలను వ్యతిరేకించే వారితో నిజాం సమావేశమవడం అనేక ఊహా గానాలకు తావిస్తుందని చెప్పాను. తన విశేషాధికారాలను ఉపయోగించి చేసే సమావేశాల గురించి చర్చపెట్టడం ఇష్టం లేదని నిజాం చెప్పాడు. మొదటిసారి నిజాం నుండి అలాంటి మాట విన్నాను. నిజాంకు, ప్రభుత్వ విధానానికి మధ్య అలాంటి మర్యాదలేమిని గతంలో నేను ఎప్పుడూ ఎదుర్కొని ఉండలేదు. ఎన్నో పెద్దపెద్ద విషయాలు, ఇండో–హైద్రాబాద్ సంబంధాలతో సహా చాలా సహృదయతతో చర్చించుకున్నాం. పరస్పర వైరుధ్యం ఎప్పుడూ పొడచూపలేదు. అలా నిజాం చేసిన వ్యాఖ్య వల్ల కలిగిన బాధకన్నా ఇలాంటి కీలకమైన సమయంలో నిజాం, ప్రభుత్వం ఏకాభిప్రాయంతో లేకపోవడం నన్ను కుంగదీసింది.

ఆఫీసుకు తిరిగి వచ్చాను. నా పదవీ స్వీకారానికి ముందు నేను పెట్టిన నిబంధనతో లేఖ రాసాను. ఆరు నెలల వరకే ఈ పదవిని నిర్వహిస్తానని ఆ నిబంధన, ఇప్పటికి సంవత్సరం కావస్తున్నా పదవి నిర్వహిస్తూ ఉన్నానంటే అందుకు కారణం హైద్రాబాద్ ఒక సంక్షోభంలో ఉంది. అటు ప్రజలు, ఇటు నిజాం నామీద ఎనలేని విశ్వాసం కనబరిచారు. నేను ఇదవరకటి గౌరవాన్ని ఇక పొంద లేనన్నది నిజం–కనీసం నిజాం నుండి, ఇలాంటి అతి ముఖ్యమైన సందర్భాలలో నిజాంకు, ప్రభుత్వానికి మధ్య ఎంత చిన్న విభేదమైనా హైద్రాబాద్ విషయంలో నష్టం చేకూరుస్తుంది. హైద్రాబాద్ రక్షణ కోసం నిజాం సమయానుగుణంగా ఏ నిర్ణయమైనా తీసుకొని సమర్థించుకోగలరు. అందుకే తక్షణం రాజీనామా చేసి నిజాంకు హైద్రాబాద్ రక్షణలో




మరింత స్వేచ్ఛను కల్పించదలచినట్లు నా రాజీనామా లేఖలో పేర్కొన్నాను.

నా రాజీనామా లేఖ పంపేముందు నా మంత్రివర్గ సహచరులెవ్వర్నీ సంప్రదించ లేదు. రాజ్య రక్షణకు సంబంధించి విలువైన ఈ తరుణంలో నేను నిబంధనలను పక్కన పెట్టాను. నా రాజీనామా లేఖ అందిన అర్ధగంటలో పాలెస్‌కు తక్షణం రమ్మని నిజాం నుండి పిలుపు వచ్చింది. మళ్ళీ మేం ఎదురెదురుగా! చిన్నగా కోపం నటిస్తూ 'ఏదైనా ఉంటే మొహం మీద అనేస్తా, అనేస్తా' అన్నాడు.

మళ్ళీ తన విశేషాధికారం గురించి మాట్లాడుతూ తమ వ్యతిరేకులతో మాట్లాడితే కేవలం విమర్శలే కాకుండా సలహాలు వస్తాయన్నాడు. అన్ని వర్గాల వారితో మాట్లాడి అందరి అభిప్రాయాలు విన్న తర్వాత మనం అనుసరిస్తున్న పద్ధతే సరియైందని తేలిందన్నాడు. నా రాజీనామా పత్రంలోని నిబంధనలకు నిజాం పెట్టిన అప్పటి నిబంధన గుర్తు చేసాడు. దేశం సంక్షోభంలో ఉన్నప్పుడు నా సేవలు కొనసాగుతాయని నిజాం పెట్టిన నిబంధన. సంక్షోభం పూర్తి కాలేదని అది ముమ్ముందు రాబోతుందని నిజాం చెప్పాడు. ఈ పరిస్థితుల్లో నా రాజీనామా లోపలా, బయటా నష్టం కలిగిస్తుందని చెప్పాడు. నిజాం తన జేబులో నుండి ఒక కాగితం తీసి నాకిచ్చి చదవమన్నాడు. అది మీర్జా ఇస్మాయిల్ రాసిన లేఖ. అందులో దిగిజారిన ఇండో–హైద్రాబాద్ సంబంధాల పట్ల ఆవేదన వ్యక్తం చేసాడు. తనకు ఢిల్లీ నాయకులతో సత్సంబంధాలు

ఉన్నాయని, నిజాం అనుమతిస్తే హైద్రాబాద్ విషయమై ఢిల్లీ వెళ్ళి గౌరవప్రదమైన అవగాహనకు ప్రయత్నిస్తానని అందులో రాసాడు. ఇంకొక కాగితం ఇచ్చాడు. అది నిజాం మీర్జాకు రాసిన లేఖ ప్రతి. మీర్జాకు ధన్యవాదాలు చెబుతూ భారత్‌తో మైత్రికి ప్రయత్నించమని నిజాం అందులో కోరాడు. తర్వాత మరొక లేఖలో మీర్జా, ఢిల్లీలో పరిస్థితులు నేను ఊహించిన దానికంటే దారుణంగా ఉన్నాయని, తక్షణం ఏదైనా చేయాలని రాసాడు. నన్ను తక్షణం ఢిల్లీ పంపించి ఏదో ఒక ఒప్పందం చేసుకొమ్మని అందులో సూచించాడు. నన్ను ఢిల్లీ పంపించడానికి అంగీకారమేనని, కాని ఇదివరకటి ముసాయిదాలో హైద్రాబాద్ కోసం ఒకటీ, రెండు రక్షణలు చేర్చాలని నిజాం కోరాడు.

ఈ లేఖల్లో ఏమైనా తప్పిదం ఉందా అని నిజాం నన్నడిగాడు. అందులో ఏం తప్పు కనిపించడం లేదని అది ప్రజలకు విడుదల చేస్తే కూడా తప్పులేదని నేను చెప్పాను. ఆయన అందుకు ఒప్పుకోలేదు. అయితే విదేశీ వ్యవహారాల శాఖనుండి ఒక అనధికారిక సమాచారం విడుదల చేయించవచ్చని చెప్పాడు. అందులో మీర్జా ఇస్మాయిల్‌ది వ్యక్తిగత పర్యటన అని దానికి నిజాంకు సంబంధం లేదని చెప్పాలన్నాడు.

ఈ అంతర్గత వ్యవహారం ఎంత వేగంగా తలెత్తిందో అంతే వేగంగా సమసి పోయింది. ఆగస్టు తొలివారంలో జయీర్ యార్‌జంగ్ మీర్జానుండి రెండు వర్తమానా లను మోసుకొచ్చాడు. ఒకటి నిజాంకు, రెండవది నాకు. భారతప్రభుత్వం ఆయన విమానానికి ప్రత్యేక అనుమతినిచ్చింది. నిజాంను కలిసి మీర్జా లేఖను అందించి నా వద్దకు వచ్చాడు. అందులో నన్ను తక్షణం ఢిల్లీ వచ్చి భారత ప్రభుత్వం తయారు చేసిన ముసాయిదాపై కొద్ది మార్పులతో సంతకం చేయమని కోరాడు.

అది వీలుకాదనుకుంటే తక్షణం ఢిల్లీ వచ్చి ఆయనను, ఇతర ఢిల్లీ నాయకులను కలవమన్నాడు. నేను వెళ్ళకపోతే పరిస్థితి చేయిదాటిపోతుందన్నాడు. జయార్ యార్ జంగ్‌ను ఢిల్లీ పరిస్థితి గురించి అడిగాను గతంలో ఉన్నంత సమాచారం ఆయన దగ్గరలేదు కాని నవంబరు మాసాంతంలోగా ఏమీ కాదని ఆయన నమ్మకం. రాష్ట్రాల శాఖ ఆతృత, మున్షీ ఆహ్వానం ఎలా ఉన్నా మిలటరీ శాఖ దీన్ని ఆషామాషీగా తీసుకోవడం లేదని, చాలా ముందస్తు ప్రణాళిక అవసరమంటుందని ఆయన భావన. నేను ఢిల్లీ వెళ్తే ఇండో–హైద్రాబాద్ సంబంధాలలో మెరుగుదల ఉంటుందా అని అడిగాను. తనకు తెలియదని, ఊహించలేనని చెప్పాడు.

నిజాంను కలిసి మీర్జాలేఖను చూపించాను. నేను చదవకముందే దాదాపుగా

ఆ లేఖలో ఉన్న విషయం ఆయనకు తెలుసు. జేబులోంచి మీర్జా ఆయనకు రాసిన లేఖ తీసి నాకిచ్చి చదవమన్నాడు. తన పాతమిత్రుడైన రాజగోపాలాచారిని కలిసాక కేవలం మీనన్‌ను కలిసినట్లు తెలుస్తుంది ఆ లేఖలో. ముఖ్యమైన వ్యక్తులైన పటేల్‌ను కాని నెహ్రూను కానీ ఆయన కలవలేదు. మీనన్ ప్రకారం సంపూర్ణ విలీనం, బాధ్యతాయుత ప్రభుత్వం ప్రతిపాదనలు మాత్రమే మీర్జాకు తెలిసాయి. మౌంట్‌బాటెన్ నిష్క్రమణకు ముందు జూన్‌లో భారత్ తయారు చేస్తే హైద్రాబాద్ నిరాకరించిన ముసాయిదా మీద సంతకాలు చేయించడానికి ప్రయత్నిస్తున్నట్లు మీర్జా అందులో చెప్పాడు. ఆయన ప్రకారం నేను ఢిల్లీ వెళ్ళి సంతకం చేస్తే భారత్ అందుకు అంగీకరిస్తుంది. నిజాం వ్యక్తిగత రక్షణ గురించి మీర్జా శ్రద్ధ కనబరచాడు. భారత సైన్యాన్ని స్వయంగా నిజామే ఆహ్వానించి సికింద్రాబాద్, బొల్లారంలో బ్రిటిష్ సైన్యం మాదిరిగా ఉండవలసిందిగా కోరితే నిజాం స్థానం, అధికారం పదిలంగా ఉంటుందని సూచించాడు. నిజాం నుండి అలాంటి ప్రతిపాదన వస్తే భారత ప్రభుత్వం నిజాం మీదా కోల్పోయిన విశ్వాసాన్ని తిరిగి నిలుపుకుంటుంది, తక్షణం స్పందిస్తుంది అన్నాడు. రెండవ సూచన హైద్రాబాద్ ప్రభుత్వాన్ని మార్చాలని. ఆ ప్రభుత్వం మీద భారత నాయకులకు అసలు విశ్వాసం లేదు. మీర్జా లేఖను పూర్తిగా చదివాను కాని ఏమీ వ్యాఖ్యానించలేదు.

నిజాం నా వ్యాఖ్యల కోసం ఆగకుండా మీర్జాకు ఆయన రాసిన జవాబు చూపించాడు. నిజాం రక్షణ గురించి, రాచరికం గురించి శ్రద్ధ పెట్టినందుకు ధన్యవాదాలు తెలుపుతూ తనను రక్షించడానికి భారత సైన్యాన్ని ఆహ్వానించమని చేసిన సూచనకు ఆశ్చర్యం ప్రకటించాడు. 'ఎవరి నుండి రక్షణ?' అని అడిగాడు నిజాం ఆ లేఖలో. లేఖను సంక్షిప్తి చేస్తూ భారత్‌తో గౌరవప్రదమైన ఒప్పందం కోసం ప్రయత్నం జరుగుతుందని ఆశించాడు. ఏదైనా జరుగుతుందనే ఆశ ఉన్నట్టయితే నన్ను పంపడానికి ఎల్లప్పుడూ సిద్ధమేనని, కాని ఇప్పుడు చెప్పిన దాని ప్రకారం అలాంటి అవసరం ఉన్నట్లుగా లేదని మీర్జాకు రాసాడు నిజాం. నేను ఏమీ మాట్లాడలేదు. నిజాం కూడా ఏమీ వినాలనే ఆసక్తి చూపలేదు.

రేపు ఢిల్లీ వెళ్ళేముందు మీర్జాకు ప్రత్యుత్తరం తీసుకు పోయేందుకు నా వద్దకు రమ్మన్నాను. జయిార్ యార్‌జంగ్‌ను. నిజాంను కలిసాక సాయంత్రం పొద్దుపోయాక నాదగ్గరకు వచ్చాడు. నా జవాబు కోసం ఆతృతగా చూసాడు కాని, నిజాం జవాబు చూసాక ఏం రాయలో నాకు తోచలేదు. జయిార్ ద్వారా ఢిల్లీలో ఏం జరుగుతోంది,

మిలటరీ చర్య సంసిద్ధత ఏమిటన్నది తెలుసుకోవడానికి ఎక్కువ ఆసక్తి చూపించాను. నవంబరు చివరి దాకా ఏమీ జరగదని అతని సమాచారం, నమ్మకం.


మీర్జాకు జవాబు సిద్ధంగా లేదని, తర్వాత పంపిస్తానని చెప్పాను. అతను వెళ్ళాక బొల్లారంలో సైన్యం విడిది పెట్టాలన్న భారత్ ప్రతిపాదనను ఆలోచిస్తూ కూర్చున్నాను. తర్వాత సంఘటనలు నా భయాల్ని నిజం చేసాయి. మీర్జా ఇస్మాయిల్ వినూత్న ఆలోచనకు భారత్ ఋణపడి ఉండాల్సిందేనని తర్వాత కాలంలో భారత ప్రభుత్వ రికార్డుల్లో నమోదు చేయబడ్డ ఆయన ఆలోచనల వల్ల తెలిసింది.

ఆగస్టు మధ్యలో భారత ప్రధానికి ఒక లేఖ రాసాను. కొనసాగుతున్న ఉద్రిక్తతల వల్ల, ఆర్థిక దిగ్బంధం వల్ల పౌరజీవనం ఇబ్బందులకు గురవుతుందిని అందులో రాసాను. హైద్రాబాద్ సరిహద్దుల మీద భారత సైనికుల దాడులు,ఉభయ తారకంగా ఉండే ఒప్పందానికి రావడంలో వైఫల్యం, యధాతథ ఒప్పందంలోని నిబంధనల ప్రకారం నిష్పాక్షిక మధ్యవర్తిత్వానికి భారత్ అంగీకరించక పోవడం వల్ల భారత హైద్రాబాద్ వ్యవహారాన్ని సానుకూలంగా పరిష్కరించమని ఐరాసను కోరబోతున్నామని రాసాను. లేక్ సక్సెస్‌కు భారత్ ద్వారా వెళ్ళే ప్రతినిధి బృందానికి కావలసిన వసతులు కల్పించ వలసిందిగా భారత ప్రభుత్వాన్ని కోరడం జరిగింది. ఈ లేఖ పంపిన వారం రోజుల్లో భారత ప్రభుత్వం నుండి జవాబు అందింది. ఇండో–హైద్రాబాద్ వ్యవహారం పూర్తిగా అంతర్గత వ్యవహారమని, హైద్రాబాద్ చారిత్రకంగాకాని, ప్రస్థుత స్థితిలో కాని ఐరాసకు తీసుకుపోదగ్గ హక్కు లేదని, అందువల్ల ప్రతినిధి బృందానికి వసతులు కల్పించలేమని ఆ లేఖ సారాంశం.

ఇంగ్లాండు మహరాజు ఉత్తరాన్ని గవర్నర్‌జనరల్ ముందుమాటతో నిజాంకు వ్యక్తి గతంగా పంపించాడు. ఆ లేఖను అందుకొని రాజాజీ తన పరపతిని ఉపయోగించి భారత్, హైద్రాబాద్‌ల మధ్య ఒక పరిష్కారానికి ప్రయత్నించాలని నిజాం కోరాడు. రాజాజీ సుదీర్ఘమైన ప్రత్యుత్తర మిచ్చాడు. మీర్జా ఇచ్చిన సలహాను పాటించుమని, రాష్ట్రంలోని రాజకీయాన్నంతా తన చేతుల్లోకి తీసుకొమ్మని, రజాకార్ సంస్థను నిషేధించుమని సూచించాడు. లోపలా బయటా రజాకార్ల వల్ల శాంతి భద్రతలు క్షీణిస్తున్నాయని అందులో పేర్కొన్నాడు. హైద్రాబాద్ దగ్గరలో ఉన్న బొల్లారానికి భారత్ సైన్యాన్ని ఆహ్వానించి భారత ప్రభుత్వంతో మైత్రికి పునాది వేయమని అందులో సూచించాడు. నిజాం దానికి జవాబిస్తూ భారత నాయకుల తప్పుడు భావనలను నిందించాడు. మీర్జాకు హైద్రాబాద్ లోని పరిస్థితులు, సాంప్రదాయాలు తెలియవన్నాడు.

భారత సైన్యాలు హైద్రాబాద్‌లో అనుమతించడం అనే ప్రశ్నే ఉత్పన్నం కాదన్నాడు. అయితే వాస్తవికమైన, న్యాయబద్ధమైన దృష్టితో ఆలోచించమని, ఆత్మగౌరవం ఉన్న వాళ్ళెవ్వరూ అంగీకరించలేని నిబంధనలు పెట్టవద్దని నిజాం రాజాజీని కోరాడు. విశాలమైన దృష్టికోణం, న్యాయబద్ధత ఉన్న రాజాజీ భారత నాయకులతో మాట్లాడి గౌరవ ప్రదమైన పరిష్కారానికి ప్రయత్నించవలసిందిగా అర్థించాడు. తన వైపునుండి నిజమైన స్నేహానికి చేయగలిగిందంతా చేస్తానని నిజాం హామీ ఇచ్చాడు.

ఐరాస బృందానికి వసతులు కల్పించమని భారత్ చెప్పిన మాట ఊహించలేనిదేం కాదు. ప్రతినిధి బృందం పోయేమార్గం కావాలి. ప్రతినిధి బృందం కార్యదర్శి అప్పటికే లండన్‌లో మాంక్‌టన్‌ను కలిసి ఐరాసలో సమర్పించే ముసాయిదా తయారు చేస్తున్నాడు. ఐరాస క్లిష్టమైన, మెల్లగా నడిచే సంస్థ అని తెలిసిందే. మాంక్టన్ అన్ని దేశాలను సత్వరం ఆకర్షించే నివేదిక తయారీలో ఉన్నాడు. ఏదిఏమైనా హైద్రాబాద్ తనంతట తానుగా యధాతథ ఒప్పందాన్ని ఉల్లంఘించవద్దని చెప్పాడు. అదే సందర్భంలో వాస్తవిక విషయాల మీద అవగాహణ కలిగించుకోవడం కోసం పారిస్‌లో సమావేశం కాబోతున్న భద్రతా మండలి సభ్యదేశాల ధోరణి తెలుసుకోవడానికి అన్ని అవకాశాలను వాడుకోవడం జరుగుతుంది.



# 29. మరణశయ్య మీద జిన్నా

విమాన విన్యాసాల కన్నా ఎక్కువ ఉత్సుకత. ఒక బలహీనమైన వెన్నెల రాత్రి నేను కరాచీకి ప్రయాణమవుతుండగా నాకు ఎదురైంది. రన్‌వే మీద దూరం దూరంగా హరికేన్ లాంతర్లు మెరుస్తున్నాయి. రన్‌వే మీద పలుచగా ఉన్న లాంతర్లను గానీ, భారతీయ వైమానిక విమానాల మెరుపుల్ని కానీ సిబ్బంది ఏ మాత్రం పట్టించుకోవడం లేదు. నేనెవరో వాళ్ళకు తెలియదు. చాలా స్వేచ్ఛగా మాట్లాడుకుంటున్నారు. లాండింగులో బాంబుల గురించి కాల్పుల గురించే వాళ్ళ భయమంతా. ఒక్కసారి గాల్లోకి ఎగిరాక భారతీయ విమానాల గురించిన చింతలేదు. రాడార్ సిస్టమ్ మీద కొంత నమ్మకముంది.

హైద్రాబాద్ మీద భారత్ మిలటరీ చర్య చేపడితే పాకిస్తాన్ వైఖరి ఏమి ఉంటుందని హైద్రాబాద్ తెలుసుకోవలసి ఉంది. భారత్ సాయుధ దాడి చేస్తే పాక్ మౌన ప్రేక్షకుడిగా ఉండిపోదని చాలాసార్లు మహానేత జిన్నా అన్నాడు. అది మంచిదే. అయితే ఇప్పుడు కచ్చితమైన ప్రణాళికకు సమయం వచ్చింది. పరిస్థితిని అంచనా వేసే బాధ్యత కరాచీలోని ఏజెంట్ జనరల్‌కు అప్పజెప్పడం జరిగింది కాని పరిణామాలు వేగంగా మారుతున్నందున నన్ను సత్వరం ఒకసారి కరాచీకి వచ్చి పొమ్మని అతడు అడగసాగాడు.

ప్రయాణం చాలా కష్టంతో కూడుకుని ఉన్నదని నిజాం భావన. కాని నాకు అది పెద్ద సమస్య కాదని చెప్పాక నిజాం అనుసరించాడు. అన్ని విషయాలు నిజాం చర్చించాడు. ప్రతి వివరాన్ని తెలుసుకుని ఆయన దృష్టికోణంలో పూర్తి నోట్ తయారు చేసుకున్నాను. నిజాం వ్యక్తిగత పత్రాలు కరాచీ నుండి తేవడానికి ఒప్పుకున్నాను.

నా మంత్రి వర్గ సహచరులకు కూడా నా కరాచీ పర్యటన వివరాలు తెలియకుండా రహస్యం పాటించాను. నా భార్యకు నా సోదరికి వీడ్కోలు చెప్పాను. వారిక్కూడా చివరి నిమిషంలో నేను ఎక్కడికి వెళ్తుందీ చెప్పాను. వాళ్ళు విని అర్థం చేసుకుని నా ప్రయత్నంలోని తీవ్రతను, అందులో ఇమిడి ఉన్న ప్రమాదాన్ని అంచనా వేశారు. కానీ ఏమీ అనలేదు. ఒక గంట ముందే ఇచ్చిన సమాచారంతో అర్థరాత్రి పూట మిలటరీ వాహనం మా ఇంటికి వచ్చి నన్ను తీసుకొని వంద మైళ్ళ దూరంలోని విమానాశ్రయానికి చేర్చింది. ఇంటి నుండి బయలు దేరిన మూడు గంటల్లో నేను ఆకాశయానంలో ఉన్నాను. భౌతికంగా అలసిపోయి సీటుకు ఒరిగాను. నా సేవకుడు, ఒక ఎ.డి.సి. కుషన్లు నా కిందికి జరిపి బ్లాంకెట్ కప్పారు.

కరాచీలో విమానం నేలకు దిగాక మేల్కొన్నాను. కనుచూపు మేరలో ఏర్ ఫీల్డు మొత్తాన మానవమాత్రులు కనిపించడం లేదు. ఒంటరి కారు విమానానికి దగ్గరగా వచ్చింది. వేగంగా నేనందులో ఎక్కాను. కరాచీ విషయాలన్నీ అక్కడి ఏజెంట్ జనరల్ ముస్తాక్ అహ్మద్ కార్లో చెప్పాడు. జిన్నా ప్రస్తుతం క్వెట్టాలో ఉన్నాడని, క్వెట్టా వెళ్ళడానికి విమానం సిద్ధంగా ఉందని ముస్తాక్ చెప్పాడు. కారు గులాం మహ్మద్ ఇంటికి వెళ్ళింది. అతను నా కోసం ఆత్రుతగా ఎదురు చూస్తున్నాడు.

ఆదరాబాదరాగా గడ్డం గీసుకొని, స్నానం చేసి గులాం మహ్మద్‌తో కాఫీ తాగాను. ఆయన నాతో అనేక విషయాలు మాట్లాడాడు. ప్రత్యేకంగా హైదరాబాద్‌కు ఆయుధాల సరఫరా గురించి మాట్లాడాడు. వివిధ నిఘా నివేదికల గురించి చెప్పాడు. భారత్ పాక్ సరిహద్దులోని సాయుధ దళాలను ఉపసంహరించుకొని హైద్రాబాద్ సరిహద్దుకు చేర్చిందని చెప్పాడు. ఆయనకున్న సమాచారం ప్రకారం భారత దళాలన్నీ హైద్రాబాద్ చుట్టూరా, కాశ్మీరు లోయలోనే ఉన్నాయి. పాక్ దళాలు భారత్‌పై దాడి చేస్తే భారత్ పరిస్థితి ఏమిటని అడిగాను. నిఘా నివేదికల ప్రకారం భారత సైన్యాలు హైద్రాబాద్ చేరే సరికి పాక్ దళాలు ఢిల్లీ చేరుతాయని చెప్పాడు. హైద్రాబాద్ మీద ఆక్రమణ మొదలైతే పాక్ సీరియస్‌గా తీసుకుంటుందా అని అడిగాను. జిన్నా ఒక్కడే ఈ ప్రశ్నకు జవాబు చెప్పగలడని అతను అన్నాడు. వీలైనంత డబ్బు బంగారం పాక్

చేరవేస్తే మంచి సహాయం అందగలదని చెప్పాడు.

మిగిలిన కొద్ది సమయంలో కాఫీ తాగడం పూర్తి చేసి ఇద్దరం ఒక కారులో విమానాశ్రయం చేరాం. పాకిస్తాన్ ఏర్ ఫోర్స్ విమానం సిద్ధంగా ఉంది. నేను, నా సహాయకుడు, ఒక ఎ.డి.సి. అందులోకి ఎక్కాం. క్వెట్టా వెళ్ళాక అక్కడి నుండి జైరాత్ వెళ్ళి జిన్నాను కలవాలని చెప్పారు. క్వెట్టాలో దిగగానే గవర్నర్ జనరల్ వ్యక్తిగత సిబ్బంది ఒకరిద్దరు కలిశారు. జిన్నా రెండు రోజుల ముందే క్వెట్టాకు తిరిగి వచ్చినందున నేను జైరాత్‌కు పోవలసి రాలేదు.

జిన్నా నివాసానికి చేరేసరికి అందరి ముఖాలలో ఆందోళన కనిపించింది. ఇద్దరు ముగ్గురు డాక్టర్లున్నారు. గంట కింద ఒక ఇంజెక్షన్ ఇచ్చారని, దాంతో తీవ్రంగా రియాక్షన్ అయిందని, చాలా బాధతో, పాక్షికంగా సుప్తచేతనలో ఉన్నారని జిన్నా గురించి చెప్పారు. కొద్ది సేపయ్యాక జిన్నా శ్రీమతిని కలిశాను. ఆమె సహజంగానే ఆందోళనలో ఉండి ఇలా రియాక్షన్ కావడం ఇది మొదటిసారి కాదని చెప్పింది. ఓ రెండు గంటల్లో సాంత్వన చేకూరుతుందని, నేను కలవవచ్చని ఆశించాను.

ఉదయం 11 గంటలకు కొద్ది ముందుగానే నేను క్వెట్టా చేరాను. ప్రతి నిమిషం భారంగా తోచింది. ఒంటిగంటకు నాకు భోజనం పెట్టారు. కొద్ది సేపట్లో జిన్నా తేరుకుంటారని ఆశతో జిన్నా గదిలోకి వెళ్ళి నిరాశగా వస్తూ ఉండింది. చివరకు నేను క్వెట్టాలో ఉన్నానని ఆయనని కలవడం కోసం పక్కగదిలో వేచి చూస్తున్నానని చెప్పగలిగింది. అయితే జిన్నా మాత్రం తన బాధ ఇంకా తగ్గలేదని, రెండు వేళ్ళు సంకేతంగా చూపించాడని ఆమె చెప్పింది.

మధ్యాహ్నం మూడు గంటల ప్రాంతంలో జిన్నాను కలవగలననే ఆశ వదులుకున్నాను. నేను కరాచీలో ఇంకొందర్ని కలిసి తెల్లవారేలోగా హైదరాబాద్ తిరుగు ప్రయాణం కావలసి ఉంది. ఇంకొక అర్ధగంట ఆగాక జిన్నా త్వరగా తేరుకుని నన్ను కలిసే అవకాశాలు తక్కువగా ఉన్నాయని డాక్టర్లు చెప్పారు. నేను జిన్నానుండి కొన్ని పత్రాలు తీసుకుపోవలసి ఉంది. జిన్నా శ్రీమతికి కాని ఆయన వ్యక్తిగత సిబ్బందికి కానీ అవి ఎక్కడున్నాయో తెలియవు. అవి ఆయన వ్యక్తిగతంగా దాచిపెట్టి ఉంటారు.

నాలుగు గంటల ప్రాంతంలో నిరుత్సాహంగా, బాధాకరంగా క్వెట్టా నుండి బయలుదేరాను. కరాచీలో విమానం దిగగానే ఒక కారు నన్ను గులాం మహ్మద్ ఇంటికి తీసుకు వెళ్ళింది. కొంత సేపయ్యాక లియాఖత్ అలీఖాన్ అక్కడికి వచ్చాడు.

అమెరికన్ రాయబార కార్యాలయానికి విందుకు వెళ్తున్నాడాయన. డిన్నర్‌లో తన లేమి బాగుండదని చెప్పి త్వరగా తిరిగి వస్తానని వెళ్ళాడు. గులాం మహ్మాద్ అతన్ని అనుసరించాడు. నేనొక్కడినే భోజనానికి కూర్చున్నాను. నాకది భోజనంలా అనిపించలేదు.

లియాఖత్ అలీఖాన్, ఇతరులు పదిగంటల కల్లా వస్తారని అనుకున్నాను. కానీ అనుకున్న దానికన్నా చాలా ఆలస్యంగా వచ్చారు. ఆఫారుల్లా ఖాన్, మహమ్మద్ అలీ కూడా వచ్చారు. గులాం మహమ్మద్ కొంత ఆలస్యంగా వచ్చాడు. జిన్నా అనారోగ్యం గురించి చెప్పాను. వాళ్ళంతా ఆశ్చర్యంగా చూశారు. విషయంలోని ప్రాముఖ్యతను, సత్వరత్వాన్ని మాత్రమే నేను వాళ్ళకు చెప్పగలను. స్పెషలిస్టు కోసం లండన్‌కు తరలించాలనే చర్చ వచ్చింది. అప్పుడు హైద్రాబాద్ రాజకీయ ఊహాత్మక విషయాల గురించి చర్చించాం. ఒక నమ్మకమైన, నిర్ధారించుకున్న సమాచారం పాకిస్తాన్‌కు చేరింది. దాని ప్రకారం సెప్టెంబర్ 21 భారత్ సైన్యానికి హైద్రాబాద్ మీద దాడికి ముహూర్తంగా నిర్ణయమైంది. ఇది దాదాపుగా మాకున్న సమాచారం లాంటిదే. గులాం మహమ్మద్ ఇంతకు ముందు పాక్ సరిహద్దుల నుండి భారత్ సైన్యాలు కాశ్మీర్, హైద్రాబాద్ చుట్టూరా మోహరించాయని చెప్పాడు. జఫరుల్లాఖాన్ ఐరాస, పారిస్ సమావేశాలకు వెళ్తున్నాడని తెలిసింది. భద్రతా మండలిలో ఆయన చేయగలిగిందంతా చేస్తాడు. కొన్ని 'ఆంటీ ఎయిర్ క్రాఫ్ట్ గన్స్' పాకిస్తాన్ నుండి కావాలని అడిగాను నేను. కాని అవి చాలా పెద్దగా ఉంటాయని రవాణా కష్టమవు తుందని చెప్పారు. కొన్ని ఆంటీ టాంక్ గన్స్, ఆంటీ టాంక్ మైన్స్ తీసుకుపోగలమని అన్నారు.

హైద్రాబాద్ మీద భారత్ దాడి చేస్తే పాకిస్తాన్ ఏం చేయబోతోందో తెలుసు కోవాలని నా ఆదుర్దా. పాక్ మౌన ప్రేక్షక పాత్ర వహించదని జిన్నా అన్న సంగతి అందరికీ తెలుసు. భద్రతా మండలి చురుకైన పాత్రలో జోక్యం చేసుకుంటుందని జఫరుల్లా ఖాన్ చెప్పాడు. కాని పాక్ ఏం చేస్తుందని నేనడిగిన సూటి ప్రశ్నకు అక్కడున్న వారి నుండి జవాబు రాలేదు. పాక్ ఇందులో కలుగజేసుకోగల స్థాయిలో లేదని భావించవచ్చా అన్నాను. అది అసలు విషయం కాదు. దానికి కచ్చితమైన జవాబు జిన్నా వద్ద ఉంది కాబట్టి ఇంకెవరూ ఏమీ చెప్పగలిగే పరిస్థితిలో లేరని లియాఖత్ అలీ ఖాన్ చెప్పాడు.

చర్చ చాలా సేపు సాగింది. భారత్ మిలటరీ ప్రణాళికలు, హైద్రాబాద్

నిరోధక శక్తి, అంతర్జాతీయ స్పందనలు, భద్రతా మండలి సభ్య దేశాల ధోరణి, ముఖ్య శక్తుల స్థానభ్రంశం చర్చల్లో చోటు చేసుకున్నాయి. తెల్లారగట్ల రెండయింది. తెల్లారేవరకు నేను భారత భూభాగం దాటాలి. ఇకనుండి ప్రతి నిమిషం ప్రమాదాన్ని పెంచేదే. అందరికీ వీడ్కోలు చెప్పి విమానాశ్రయానికి వచ్చాను. కొన్ని నిమిషాల్లోనే గాల్లోకి ఎగిరాం.

కరాచీకి వస్తున్నప్పటికంటే ఇప్పుడు విమాన సిబ్బంది ఎక్కువ ఆసక్తితో కనిపించారు. ఏది ఏమైనా అల్లాను తలుచుకొని బయటుదేరాను.

అలసిపోయాను. సిబ్బంది పరుపు, బ్లాంకెట్ పరిచారు. నిద్రపోయాను. మధ్యలో లేపవద్దని ముందే చెప్పాను. నేను నిద్ర లేచేసరికి విమానం దిగబోతూ ఉంది. పట్టపగలయింది. విమానం దిగి మిలటరీ కారెక్కాను. ఏర్ పోర్టు అధికారి మా విమానం ఆలస్యంగా రావడం మంచిదయిందని నా చెవిలో గుసగుసలాడాడు. అంతకు అర్ధగంట ముందే ఆరు భారత సైనిక విమానాలు చక్కర్లు కొట్టి తూర్పు వైపుగా వెళ్ళాయని చెప్పాడు.

నేను ఇంటికి చేరిన కొద్ది నిమిషాలకే మున్షీ నుండి ఫోన్ వచ్చింది. నేను వెంటనే ఫోన్ ఎత్తి మాట్లాడాను. ఒకటి రెండు రోజుల్లో భోజనానికి రావాలని పిలిచాడు. సరేనన్నాను కానీ కొంత ఆలస్యంగా వస్తాననన్నాను. నేను నిన్న ఇంట్లోనూ, ప్రధాని కార్యాలయంలోనూ లేకపోవడం మీద ఆయనకు వచ్చిన నివేదికలను నిర్ధారించుకోవడం కోసం కావచ్చు. నిజాంకు ఫోన్ చేసి ప్యాలెస్‌కు బయలుదేరాను.

జిన్నా ఆరోగ్యం, నేను జిన్నాను కలువలేక పోవడం గురించి నిజాం నాలానే బాధపడ్డాడు. నివేదికల ప్రకారం సెప్టెంబర్ 20-23 మధ్య జీరో అవర్ (భారత్ దాడి) ఉంటుందని చెప్పాను. ఆర్మీ కమాండర్‌ను పిలిపించాం. రక్షణ గురించి ఆయన ప్రణాళికను సుదీర్ఘంగా చర్చించాం. భారత సైన్యాలను ఎన్ని రోజులు నిలువరించగలమనే ఆందోళన నిజాంకు నాకు ఉంది. రాజధాని హైద్రాబాద్‌కు భారత సైన్యం రావడానికి కనీసం ఎనిమిది వారాలు పడుతుందని ఆయన చెప్పాడు. కమాండర్ వెళ్ళిపోయాక దాడుల్ని నాలుగు వారాలు నిలువరించినా సరిపోతుందని, అది సాధ్యం కూడా అని చెప్పాను నిజాంకు.

తర్వాత ముఖ్యమైన విషయం ఐరాసకు ప్రతినిధి బృందాన్ని పంపడం. ప్రతినిధి బృందం సభ్యులు ఖరారయ్యారు. మోయిన్ నవాజ్‌జంగ్ నాయకత్వం వహిస్తాడు.

రహీం, శ్రీపాదరావు, శ్యాంసుందర్, మీర్ నవాజ్‌జంగ్ సభ్యులు. జహీర్ అహ్మద్ కార్యదర్శిగా వ్యవహరిస్తాడు. ఆయన ఇప్పటికే యూరప్ వెళ్ళాడు. మోయిన్ నవాజ్ జంగ్, శ్యాం సుందర్ వెళ్ళడానికి సిద్ధంగా ఉన్నారు. రహీం, శ్రీపాదరావు తర్వాత వెళ్తారు.

మోయిన్ నవాజ్ జంగ్ శ్యాంసుందర్‌తో కలిసి సెప్టెంబర్ 9వ తేదీన సాయంత్రం బయలుదేరేందుకు నిర్ణయించబడ్డది. ఆయన భార్య కూడా తోడుగా వెళ్తుంది. మధ్యాహ్నం నిజాంతో సుదీర్ఘమైన చర్చ జరిగాక ఆత్రంగా ఇంటికి వెళ్ళి సర్దుకోవడం మొదలు పెట్టాడు. వాళ్ళు వెళ్ళడానికి అర్ధగంటకు ముందు నేను వాళ్ళింటికి వెళ్ళి కలిశాను. ఆయన కూతురు, కొడుకు వాళ్ళ తల్లిదండ్రులు సర్దుకోవడాన్ని చూస్తున్నారు. తర్వాత ఏం జరుగుతుందో ఎవరికి తెలుసు? ఆ ఇద్దరు చిన్నారులు నా ఒడిని చేరగూడదని కోరుకుంటున్నాను. మోయిన్ నవాజ జంగ్, ఆయన భార్య వాళ్ళ కొత్త బాధ్యతల్లో పిల్లల భారం గురించి ఆలోచించినట్లు కనిపించలేదు. వచ్చే ఉపద్రవాలను చూడకుండా గుడ్డిగా వ్యవహరించవద్దని, పిల్లలిద్దరినీ వెంట తీసుకెళ్ళమని సూటిగా చెప్పాను. ఆత్రంగా అప్పుడు కొన్ని బట్టలను, ఇతర అవసరాలను ఒకటి రెండు సూట్‌కేసులలో పెట్టుకున్నారు. అందరి కళ్ళలో కన్నీళ్ళు ఉబికి వస్తుండగా వీడ్కోలు చెప్పాను.

# 30. మహానేత అస్తమయం

మోయిన్ నవాజ్ జంగ్ కుటుంబంతో మహా క్షేమంగా కరాచీ చేరారని ముష్తాఖ్ అహమ్మద్ నుండి మరుసటి రోజు ఉదయం వచ్చిన వైర్‌లెస్ సందేశాన్ని డీకోడ్ చేసి నాముందు పెట్టడంతో నా ఆందోళన ఉపశమించింది. నిజాంను కలిశాను. పాకిస్తాన్ ఎలాంటి పాత్రను నిర్వర్తిస్తుంది? ఒక వేళ జిన్నా అనారోగ్యం ఎక్కువకాలం కొనసాగితే పరిస్థితి ఏమిటి అన్నదానిపై మేం సుదీర్ఘంగా చర్చించుకున్నాం. ఐరాస క్రియాశీల పాత్రపై నిజాంకు గొప్ప నమ్మకం లేదు. జిన్నా ఏదైనా చేయగలడని ఆయన అభిప్రాయం. మళ్ళీ కమాండర్‌ను పిలిచాం. ఎలా, ఎంతకాలం భారత్ సైన్యాలను నిలువరించగలమని అడిగాం. ఇండియా ఎంత సైన్యాన్ని ఉపయోగించినా రాజధానికి చేరుకోవడానికి కనీసం ఎనిమిది వారాలు పడుతుందని స్పష్టంగా చెప్పాడు.

భారత సైన్యం చేయబోయే దాడితో పాటు భారత కాంగ్రెసు వాలంటీర్లు అంతర్గతంగా ఏదైనా అలజడి చేస్తారేమోననే భయం నాలో మొదలయింది. దేశంలోకి చొరబడ్డ కాంగ్రెస్ వాలంటీర్లు మున్షీతో సంప్రదింపుల్లో ఉన్నారు. గ్రామీణ పట్టణ ప్రాంతాలన్నిటిలో కూడా హిందూ, ముస్లింల మధ్య సామరస్యం కొనసాగుతుంది. అందరి లక్ష్యం మాతృభూమిని రక్షించడమే. అయితే కొంతమంది హిందువులు, ముస్లిములు మున్షీ చేత ప్రభావితమైనవారు, భయానికి గురైనవారు కూడా ఉన్నారు. వాళ్ళు స్థానిక సంఘర్షణను సృష్టించే అవకాశం ఉంది. విధ్వంసం చెలరేగే ప్రమాదం కూడా ఉంది. ఒకరోజు హిందూ ప్రముఖుడు పన్నాలాల్ నా వద్దకు వచ్చాడు. మిలటరీ చర్య సందర్భంగా పరిస్థితి చేయిదాటి పోతే అత్యాచారాలు జరిగే ప్రమాదముందని ఆయన హిందూ మిత్రులు కొందరు వారి కుటుంబాలను హైద్రాబాద్ నుండి బయటికి పంపించి వేశారని చెప్పాడు. ఆయన స్వంత కుటుంబాన్ని మాత్రం బయటికి పంపడానికి ఒప్పుకోక నా ప్రతిస్పందన కోసం వచ్చాడు. నేను ఆయన కుటుంబాన్ని మా ఇంటికి ఆహ్వానించాను. నా కుటుంబంలోని ఏ ఒక్క వ్యక్తి బతికి

ఉన్నా ఆయన కుటుంబాన్ని రక్షించుకుంటామని చెప్పాను. మేం నిజంగా హైదరాబాద్‌ని రక్షించగలమా అని ఆయన ప్రశ్నించాడు. అది నాకు తెలియదని చెప్పాను. నాకు తెలిసిందల్లా పోరాడడమే, శరణువేడడం కాదని చెప్పాను. సెప్టెంబర్ 9వ తేదీన నిజాం, గవర్నర్ జనరల్ రాజగోపాలాచారికి మరొకసారి విజ్ఞప్తి చేశాడు. తన పరపతి ఉపయోగించి, హైద్రాబాద్ దృష్టికోణం నుండి ఇండో హైద్రాబాద్ సంబంధాలలో ఆనందాన్ని నింపమని కోరాడు. సెప్టెంబర్ 10 తేదీ నాడు రాజాజీ జవాబిస్తూ భారత సైన్యాన్ని ఆహ్వానించమని, భారత్ ఇతర డిమాండ్లను ఒప్పుకొమ్మని పాత జవాబే ఇచ్చాడు.

ఈ సమయంలోనే తూర్పు సరిహద్దులో ఒక గుర్తించదగ్గ ఒక సంఘటన జరిగింది. సరిహద్దుల్లో హైద్రాబాద్‌లోకి చొచ్చుకొచ్చిన భారత భూఖండాలున్నాయి. అలాగే ఇండియాలోకి చొచ్చుకున్నట్లున్న హైద్రాబాద్ భూఖండాలున్నాయి. అయితే వాటిని భారత్ ఆక్రమించి హైద్రాబాద్ ఉద్యోగులను, పౌరులను రాకపోకలు లేకుండా అడ్డుకున్నాయి. ఎన్ని నిరసనలు వ్యక్తం చేసినా ఫలితం లేకుండా పోయింది. హైద్రాబాద్ నిరసనలు చేస్తూనే ఉంది. నానజ్ సంఘటన తర్వాత ప్రతీకార చర్యలన్నీ నిలుపుదల చేయడం జరిగింది. తూర్పు సరిహద్దులోని కోదాడలో సైనిక క్యాంపు ఏర్పాటు చేయబడ్డది. ఇది పూర్తిగా హైదరాబాద్ భూభాగంలో ఉండి శాంతిభద్రతలు కాపాడడం, సాయుధ దాడులను అడ్డుకోవడం లక్ష్యంగా పని చేస్తూ ఉండేది. ఒక రోజు ఉదయం ఒక జూనియర్ అధికారి పర్యవేక్షణలో క్యాంపు నడుస్తుండగా ఒక పెద్ద సైజు భారతీయ సైనిక దళం 75 ఎమ్.ఎమ్. కాల్పులతో చొచ్చుకొని వచ్చింది. అనేకమంది పౌరులు మరణించారు. ఆస్థి నష్టం జరిగింది. కొద్దిసేపట్లోనే గ్రామమంతా నిప్పుపెట్టబడ్డది. హైద్రాబాద్ దళాన్ని చుట్టుముట్టిన భారత సైన్యం ఎలాంటి ప్రతిఘటన లేకున్నా విచక్షణా రహితంగా కాల్పులు జరిపింది. అనేక మంది అక్కడ గాయపడ్డారు. అందిన వైర్‌లెస్ సందేశాలను బట్టి భారతదేశపు ప్రధాన దాడి ప్రారంభమయిందని రక్షణ దళాల కేంద్రం విశ్లేషించింది.

భారత సైనిక బలగాలు హైద్రాబాద్ భూభాగం ద్వారా మునగాల జమీందారీకి చేరుకొని హైద్రాబాద్ లోపల యాభై మైళ్ళ దగ్గర క్యాంపు చేశాయి. భారత భూభాగం ద్వారా వారి భూఖండానికి చేరుకొనే అవకాశం ఉండగా హైద్రాబాద్ భూభాగం నుండి ప్రయాణిస్తూ ఆస్థినష్టం, ప్రాణనష్టం కలిగించడానికి కారణమేమిటో అర్థం కాలేదు.

దాదాపు మొత్తం క్యాంపు వశమైపోయినందున పౌరుల ద్వారా అడపాదడపా సమాచారం మాత్రమే వస్తూ ఉంది. 303 రైఫిళ్ళు మాత్రమే కలిగిన క్యాంపు అడపాదడపా జరిగే సాయుధ దాడులను ప్రతిఘటించడానికే సరిపోయింది. అశక్తత, సమాచార లోపం ఆ క్యాంపుకు అదనపు సమస్యలు. భారత సైన్యపు ట్యాంకులు హైదరాబాద్ భూభాగంలో స్థిరపడి రాజధానికి కేవలం యాభై మైళ్ళ దూరాన ఉన్నాయన్నది మరొక ఆందోళన. నిజాం నుండి కింది వరకు అంతా ఆందోళన. ఉద్వేగ పూరితంగా మంత్రి వర్గ సమావేశం జరిగింది. హైద్రాబాద్ సైన్యపు సమాచారలేమి, సంసిద్ధతలేమి అందరినీ కలవర పరిచింది. ఆర్మీ కమాండర్ జవాబు చెప్పలేని చిక్కు పరిస్థితి ఎదుర్కొన్నాడు. ఇంకే సైనిక విభాగం అంత దయనీయమైన స్థితిలో ఉండ కూడదని, ఇలాంటి పరిస్థితి పునరావృతం కారాదని స్పష్టం చేశాం. ఇప్పటి నుండి భారత సైన్యం దాడి ఎప్పుడు జరిగినా పూర్తి సంసిద్ధతతో ఉండాలని, ఆర్మీ విభాగాలన్నింటినీ సిద్ధపరచాలని ఆయనను హెచ్చరించడం జరిగింది. ఆ నిర్ణయం ఒక రూపం దాల్చడానికి ఒక సేకరణ ఆదేశాన్ని ఇవ్వమని నిజాంను కోరాను. అదేరోజు సాయంకాలం నిజాం ఆదేశాన్ని ఇచ్చాడు. 20వ తేదీ నుండి సైనిక చర్యకు భారత ప్రభుత్వం నిర్ణయించినట్లు అప్పటికి మాకు తెలియదు.

యథావిధిగా అర్ధరాత్రి దాటిన తర్వాత రెండు గంటల ప్రాంతంలో నిద్రకు ఉపక్రమించాను. నిద్ర పట్టకముందే పక్కనున్న టెలిఫోన్ మోగింది. అది ఉద్రిక్తమయిన సందేశమే అయి ఉంటుందని నాకు తెలుసు. మంత్రులు, సైనిక పోలీసు ఉన్నతాధికారులు మాత్రమే ఆ సమయంలో నాకు ఫోన్ చేస్తారు. ఫోన్ చేసింది పోలీసు ఉన్నతాధికారి. జిన్నా మరణవార్త ఇప్పుడే అందిందని చెప్పాడు. దిగ్గున లేచాను. కలా నిజమా అర్థం కాలేదు. కాని అదొక విషాద వాస్తవమని అర్థం చేసుకున్నాను. కరాచీనుండి అనేక సందేశాలు వచ్చాయని అలా ఆ మరణవార్త నిర్ధారించుకున్నానని పోలీసు అధికారి చెప్పాడు.


నిద్రపోలేకపోయాను. నిజాంకు కూడా ఈ వార్త తెలిసింది. అర్ధగంట దాకా మంచం మీద పడుకుని ఆలోచనల్లో మునిగిపోయాను. ప్రాతఃకాల ప్రార్థన అయ్యాక ఖురాన్ వచనాలు చదివి జిన్నా ఆత్మ శాంతికి ప్రార్థించాను. వ్యక్తిగతంగా ఎంతో వేదన చెందాను. అసలే అతి సున్నితంగా ఉన్న హైద్రాబాద్ సమస్య జిన్నా అకాల మరణంతో ఇక సరికొత్తగా ఎదుర్కోవాలి. రోజు కన్నా ముందుగా ఆ రోజు నిజాంను కలిశాను. మక్కా మజీదులో సామూహిక సంతాప గీతాలను ఆలపించాలని

నిర్ణయించడం జరిగింది. అందుకు ఏర్పాట్లకోసం ఆదేశించడం జరిగింది. ప్రజలకు ఆ రోజు సెలవు ప్రకటించడం జరిగింది. పరిస్థితి సమీక్షకు కూర్చున్నాం.

జిన్నా మరణం వల్ల భారత్ ఏ క్షణాన్నైనా దాడి చేయవచ్చని నిజాంకు చెప్పాను. నిజాం దాన్ని అంగీకరించలేదు. ప్రపంచం దృష్టిలో చెడు అభిప్రాయం కలుగుతుందని భారత్ వెనుకాడుతుందని ఆయన చెప్పాడు. ఇక పాకిస్తాన్ ప్రభావ వంతమైన పాత్ర నిర్వహించలేదన్న నా మాటను నిజాం సమర్థించాడు. భారత్ చర్య ముందా, వెనకా అనేది మాత్రమేనని చెప్పాడు. తిరిగి వస్తూ రక్షణ దళాల మోహరింపు గురించి కమాండరుతో కలిసి చాలా సేపు చర్చించాను. పెద్ద సమస్య ఏమిటంటే సైన్యం తక్కువగా ఉంది. సరిహద్దు విశాలంగా ఉంది. నిఘా నివేదికల ప్రకారం భారత సైన్యాలు కనీసం పన్నెండు విభిన్న ప్రాంతాల నుండి దాడికి సిద్ధపడుతున్నాయి. వాళ్ళ ప్రధాన కేంద్రీకరణ పడమర నుండి బొంబాయి – హైద్రాబాద్ రహదారి మీద, తూర్పు వైపు నుండి మద్రాసు– హైద్రాబాద్ రహదారి వెంట. ఈ ప్రాంతాలలో కొన్ని నెలల నుండి మిలటరీ సన్నద్ధత జరుగుతుంది. కొన్ని వారాలుగా రోడ్లమీద ప్రజల రాకపోకల్ని అడ్డుకుంది భారత్. ఈ కేంద్రాల నుండి చుట్టూ చాలా వైపులకు చొచ్చుకొని పోయే అవకాశం ఉంది. అయితే వాళ్ళ అసలు లక్ష్యం రాజధాని.

హైద్రాబాద్ సైన్యంలో ఫిరంగులు తక్కువగా ఉండడం అతిపెద్ద బలహీనత. యుద్ధటాంకులు పంపాల్సిన స్థావరాలు చాలా ఉండగా మొత్తం సైన్యం వద్ద ఉన్న ఫిరంగులు ఇరవై ఐదుకు మించవు. మిగిలిన అన్ని కేంద్రాలకు పదాతి దళాలే. కంపెనీ నుండి బెటాలియన్ వరకు వాటి సంఖ్య ఉంటుంది. రక్షణ కేంద్రానికి యూనిట్లకు మధ్య వైర్‌లెస్ సమాచార వ్యవస్థలున్నాయి కానీ అన్ని యూనిట్లను పూర్తిగా కలిపేంతగా లేవు.

పది సైనిక బెటాలియన్లకు మించని బలముంది. ఓ రెండు రెజిమెంట్లు అలంకారప్రాయమే. పది బెటాలియన్లకు కూడా ఉన్న మందుగుండు అంతంత మాత్రమే. ప్రతి యూనిట్‌కు కొన్ని చిన్న కాలిబర్ బ్రెన్‌గన్‌లు, కొన్ని రెండు అంగుళాల, మూడు అంగుళాల మోర్టార్‌లు మాత్రం ఉన్నాయి. ఆంటీ టాంక్ మైన్లు కొద్దిగా సరఫరా అయినాయి. అవి వ్యూహాత్మక ప్రాంతాలలో పని చేసే దళాలకే ఇవ్వబడతాయి. ఫీల్డుగన్‌లు లేకపోవడం అన్ని యూనిట్లకు పెద్ద సమస్య. 200 ఎమ్.ఎమ్. ఒర్లికాన్ గన్‌ల కోసం ఎంత ప్రయత్నించినా అవి సమయానికి రాలేదు.



నైరుతి సరిహద్దులో ఒకటి, పశ్చిమ సరిహద్దులో ఒకటి, వాయువ్య సరిహద్దులో ఒకటి, తూర్పు హద్దులో ఒకటి, ఆగ్నేయ హద్దులో ఒకటి చొప్పున రక్షన బెటాలియన్లను నిర్ణయించడం జరిగింది. పశ్చిమ, ఉత్తర, వాయువ్య దళాల అవసరాల కోసం బీదర్‌లో ఒక కేంద్రం ఏర్పాటు చేయబడింది కానీ తర్వాత ఎత్తివేయడం జరిగింది. అలాగే తూర్పు, నైరుతి దళాలకు సహకరించేందుకు నకిరేకల్లులో ఒక కేంద్రం ఏర్పాటు చేయబడింది. ఇతర దళాలలో కొద్దికొది సమూహాలతోనే సైన్యం పంపించబడింది. అయితే స్థానిక వాలంటీర్లతో వాటిని బలోపేతం చేయడం జరిగింది. చిన్నదళం కేంద్రంలో ఉంచబడింది. ఉనికి దృష్ట్యా దక్షిణం, ఈశాన్యం నుండి దాడుల అవకాశం తక్కువ.

సైనిక దళాల కమాండర్ ఉత్సాహంగా కనిపించాడు. జిన్నా మరణం వలన భారత్ ఏ క్షణాన్నైనా దాడి ప్రారంభించవచ్చని అతనితో చెప్పాను నేను. అతడు నిజాంలాగా తన అభిప్రాయమేదీ చెప్పలేదు కాని యూనిట్లన్నీ సిద్ధంగా ఉన్నాయని తాను అన్నింటినీ సంసిద్ధపరిచానని చెప్పాడు.

నేను చాలా అశాంతితోనే ఉండిపోయాను. సంఖ్యలో స్వల్పత, ఆయుధాల లేమి నన్ను బాధించాయి. నేను కార్యాలయానికి రాగానే ఖాసీం రజ్వీ వచ్చాడు. జిన్నా మరణ వార్త అందరినీ సమానంగా బాధించింది. అందువల్ల ఎక్కువసేపు మాట్లాడుకోలేకపోయాం. నేను అనసవరమైన ఆందోళన ఏమీ కనబరచలేదు కాని భారత్ దాడి వేగిరం కావచ్చనే సూచన ఇచ్చాను. అది అతన్ని పెద్దగా బాధించినట్లు అనిపించలేదు. అది ఎంత తొందరగా జరిగితే అంత మంచిదన్నట్లు మాట్లాడాడు. ఒకసారి ఆయన మిలటరీ కమాండర్‌తో మాట్లాడాడని, కమాండర్ చెప్పిన విషయాల మీద సంతోషపడ్డాడని చెప్పాడు. నేను ఏదీ వినే ఆసక్తిలో లేను. తను వెళ్ళి కొన్ని

రజాకార్ల దళాలను ఏర్పాటు చేయాలన్నాడు. నేను నవ్వి అతన్ని వెళ్ళనిచ్చాను. రాబోయే ఘోరమైన దాడుల గురించిన భయోత్పాతం అతనికి కొంత తెలిసినట్లు అగుపించింది.

భారత సైన్యం దాటవలసిన వంతెనలు పేల్చివేసే శిక్షణ ఏదీ హైద్రాబాద్ సైన్యానికి ఉన్నట్లు లేదు. సివిల్ ఇంజనీరింగ్ శాఖను అందుకు సిద్ధం చేశాను. కూల్చివేతలకు సంబంధించిన ప్రణాళికలకోసం, రక్షణ సమూహాలను సాంకేతిక శాఖల ఉన్నతాధికారులతో సమన్వయ పరిచి నమ్మకమైన వ్యక్తులను సిద్ధం చేయడం కోసం నేను రోజులో చాలా సమయం వెచ్చించాను. జిన్నా ఆత్మశాంతి ప్రార్థనలు జరిగాయి. నేను వెళ్ళేసరికే నిజాం వచ్చి ఉన్నాడు. రవాణా సౌకర్యాలు లేకపోయినప్పటికీ పెద్ద సంఖ్యలో ప్రజలు హాజరయ్యారు. మజీదుకు చుట్టూరా రోడ్లన్నీ ప్రజా సందోహంతో నిండిపోయాయి. ప్రార్థనల తర్వాత సాయంత్రం కలవమని నిజాం చెప్పాడు. నేను కలిశాను. మున్షీ నన్ను కలుస్తానని చెప్పడం వల్ల నిజాంతో ఎక్కువసేపు ఉండలేక పోయాను.

మున్షీ ఏదో చెప్పాలనుకుంటున్నట్లు అనిపించింది నాకు. ఆయన చాలా మాట్లాడాడు. అందులో ఎంత నిజముంది, కల్పించి చెప్పేది ఎంత ఉందని తక్షణం తెలుసుకోవలసిన అవసరం ఏర్పడింది నాకు. నమ్మకం, వాస్తవం అనేవి మున్షీకి చాలా దూరమైన విషయాలు. అయితే ఆయన చెప్పిన వాటిలో ఏవీ నిజాలో, ఏవి కల్పితాలో నిర్ధారించుకోగల పరిస్థితిలో నేనున్నాను. జిన్నా క్వెట్టాలో మరణించాడని, కరాచీకి తీసుకువచ్చాక దాన్ని ప్రకటించారని ఢిల్లీ తనకు తెలిపిందని మున్షీ నాకు చెప్పాడు. జిన్నా కరాచీలో మరణించాడని ముష్తాఖ్ అహ్మద్ స్పష్టంగా చెప్పాడు. అయితే ఢిల్లీ మున్షీకి అలాంటి సమాచారం ఇచ్చిందా లేదా అది ఆయన అల్లిన కథా నాకు తెలియదు.

మా ముచ్చట్లు చాలా విషయాల మీద నడిచాయి. భారత్ దాడి తొందరలో మొదలవుతుందని, పరిస్థితి అంతా నా చేతుల్లో ఉందని మున్షీ అన్నాడు. అదెట్లా అని నేనడిగాను. అందుకు ఒకటే మార్గముందని, భారత్ దళాలను ఆహ్వానించి బ్రిటీష్ సైన్యంలా కంటోన్మెంట్‌లో నిలువడానికి ఏర్పాటు చేయాలని చెప్పాడు. అలా జరిగితే అంతా బాగుంటుందని, నిజాం వ్యక్తిగత స్థాయి నిలబడుతుందని చెప్పాడు. పటేల్, నెహ్రూలు నన్ను ప్రధానిగా కొనసాగనిస్తారని మున్షీ వ్యక్తిగత హామీ ఇచ్చాడు. ఆయన బ్రిటీష్ రెసిడెంటులా ఉంటాడు కాబట్టి ఆ తర్వాత అందరూ హాయిగా కోరుకున్నట్లు

ఉండవచ్చుట!

ఆయన చెప్పినదాన్ని నేను శ్రద్ధగా వినడంలేదని మున్షీ అర్థం చేసుకున్నాడు. కొంచెం ఆందోళనగా, సాయుధ సంఘర్షణలో తాను ఏమి చేయాలి, ఎలా ప్రవర్తించాలని అడిగాడు. మిలటరీ చర్య జరిగే కంటే ముందు ఆయన, ఆయన సిబ్బంది హైద్రాబాద్‌ను వదిలిపెట్టి పోవడం మంచిపని అని చెప్పాను – తక్షణం మిలటరీ చర్య జరిగి హైద్రాబాద్‌ను వీడడమే కష్టమైతే తప్ప. ఒక్క క్షణం ఏం మాట్లాడాలో ఆయనకు అర్థం కాలేదు. భౌతికంగా అదొక అసాధ్యమని చెబుతూ అంతకంటే ముఖ్యంగా భారత ప్రభుత్వం అందుకు అంగీకరించదన్నాడు. కొంత సేపయ్యాక ఢిల్లీలో హైద్రాబాద్‌కు కూడా ఒక ఏజెంట్ జనరల్ ఉన్నట్లు గుర్తు చేయడానికి ప్రయత్నించాడు. ఏజెంట్ జనరల్‌కు ఇచ్చే మర్యాద ఇంకోచోట ఏజెంట్ జనరల్‌కు ఇచ్చే మర్యాదను పోలి ఉంటుందని చెప్పాను. చివరగా ఆయన సిబ్బందితో సహా హైద్రాబాద్ వదిలి వెళ్ళడమే మిగిలిందని చెప్పాను.

లేకపోతే ఆయనను అక్కడి నుండి తరలించి ఏదైనా ఒక చోట హైద్రాబాద్ అతిథిగా ఉంచుతాం కాని బయటి ప్రపంచంతో సంబంధం లేకుండా చేయబడుతుందని చెప్పాను. కొంత అశాంతికి లోనయ్యాడు ఆయన. ఒకవేళ స్వేచ్ఛ కలిగిన ఏజెంటుగా ఉంటే కొంత ఉపయోగకరమైన సేవ చేసే వాడిని అన్నాడు. ప్రతిగా నేనేమీ మాట్లాడలేదు. కొంత ప్రయత్నం తర్వాత ఇక నా నుండి ఏ సమాచారమూ రాబట్టలేనని ఆయన ఊరుకున్నాడు. ఆయన మాటలను బట్టి చూస్తే చర్య ఎంతో దూరంలో లేదని తెలిసిపోతుంది. – ఆ విషయం తెలియగూడదని ఆయన ఎంతగా జాగ్రత్త పడుతున్నా, బయట పడగూడదని ఎంత ప్రయత్నించినా ఆయనలో భయము, ఆనందమూ సంభాషణల్లో బయట పడుతూనే ఉన్నాయి.

మున్షీ వెళ్ళేటప్పటికి అర్థరాత్రయింది. చర్చల సారాన్ని నిజాంకు చెప్పడానికి ఆలస్యమైన సమయమిది. అయితే ఆర్మీ కమాండర్‌కు భారత దళాలు రేపే రానున్నాయని చెప్పాను. ఆయన చాలా బాధ్యతాయుతంగా 20వ తేదీకన్నా ముందు సైనిక చర్య జరగబోదని చెప్పాడు.అయినా మరుసటి రోజే దళాలు రాబోతున్నాయని అన్ని వైపుల హైద్రాబాద్ దళాలను సంసిద్ధపరచమని ఆదేశించాను. నేను యుద్ధ సామగ్రి శాలలను తిరిగి చూశాను. తిరుగు ప్రయాణంలో నా వ్యక్తిగత సిబ్బందిని, కారును వదిలేసి ఏకాంతంగా బయటికి నడిచాను. రోడ్డుమీద చాయి బండీల దగ్గరకు వెళ్ళి చూశాను. అనూహ్యంగా అర్థరాత్రి పూట చాలా రద్దీ ఉంది అక్కడ. అందరూ గట్టిగా స్వేచ్ఛగా

మాట్లాడుకుంటున్నారు. భారత సైన్యం దాడి చేయబోతుందని, హైద్రాబాద్ భారత సైన్యాన్ని ప్రతిఘటించడంపై ఒక్కొక్కరి ఒక్కో తీరున మాట్లాడుకుంటున్నారు. అత్యవసర పరిస్థితిలో ఏమి చేయాలనే విషయంలో ఎవరి ప్రణాళిక వారికుంది. ఎవరు కూడా భయంలో లేరు. ఆ క్షణాన నేనొక్కడినే ఆందోళనగా ఉన్నవాడిగా తోచింది.

రోజుకన్నా ఎక్కువగా అలసిపోయి ఇంటికి వచ్చాను. రెండు గంటల నిద్రను వృథా పుచ్చుకున్నాననుకున్నాను.

రోజు కన్నా ఆలస్యంగా నిద్ర లేచానంటే ముందురోజు బాగా అలసిపోయి ఉంటాను. సత్వరం కాలకృత్యాలు తీర్చుకొని ఉదయపు ప్రార్థన చేశాను. వ్యక్తిగత సేవకుడిని పిలిచి ఏమైనా ఫోన్లు వచ్చాయా అని అడిగాను. అతడు లేదని చెప్పాడు. భారత సైన్యం ఏ దిక్కు నుండి రావడం మొదలైనా ఈపాటికి నాకు సమాచారం వచ్చి ఉండేది. కమాండర్‌కు ఫోన్ చేసి అంతా క్షేమమా అని అడుగుదామనుకున్నాను. కానీ నేనే మొదట భయపడ్డట్లు ఉండకూడదని మిన్నకున్నాను. పోలీసు ఉన్నతాధికారికి అంతకు ముందు రోజు రాత్రి జరిగిన ప్రమాదం మిషతో ఫోన్ చేశాను. ఒకటి రెండు చోట్ల రోజువారీగా జరిగే దాడులు తప్ప విశేషం ఏమీ లేదు. నేను పొరపడ్డానని, ఆర్మీ కమాండర్ చెప్పినట్లు 20వ తేదీనే భారత్ దాడి ముహూర్తం నిర్ణయించారని సమాధాన పడ్డాను.

రోజులాగా నిజాం వద్దకు వెళ్ళే సరికి ఆయన ఆర్మీ కమాండర్‌తో సంభాషిస్తూ ఉన్నాడు. భారత సైన్యాలు ఎప్పుడు వస్తాయి? ఎన్ని రోజులు మనం నిలువరించగలమని ప్రశ్నలు. కమాండర్ నమ్మకంగా ఆశావాదంతో ఉన్నాడు. నిజాం అనుమానిస్తూ ఉన్నాడు. అతను వెళ్ళిపోయాక మొత్తం వ్యవహారాన్ని నేనెలా చూస్తున్నానని నన్ను అడిగాడు. రెండు మూడు నెలలు భారత సైన్యాన్ని నిలువరిస్తామన్న కమాండరు మాటల్ని నేను నమ్మలేదన్నాను. మూడు నాలుగు వారాలు అడ్డగించగలిగితే గొప్ప విషయమేనని, అయితే ఎట్టి పరిస్థితిలో రాజధానికి రాకుండా రెండు వారాలైనా ఆపగలగాలని నేను చెప్పాను. భద్రతామండలి ఈ బహిరంగ దాడి మీద ఏదైనా క్రియాశీలమైన చర్య తీసుకోవడానికి కనీసం రెండు వారాల సమయమైనా కావాలి అన్నాను.

అనవసరమైన ఆర్మీ కమాండర్ ఆశావాదం నన్ను చింతకు గురిచేస్తుందని చెప్పాను. పరిస్థితిలోని సాంద్రత గుర్తించడంలో, ఘోరాన్ని అంచనా వేయడంలో ఆయన సామర్థ్యాన్ని అనుమానించాను. ఆయన మిలటరీ పరిజ్ఞానంతో చెబుతున్నాడా

లేదా ఊహాజనితమైన మాటల్ని చెబుతున్నాడా అని ఆశ్చర్యపోయాను. ఆయన కచ్చితంగా క్రమశిక్షణ గలిగిన వాడే, సైనిక దళాలను సరిగ్గా నిర్వహించగలిగినవాడే. కాని బహుముఖ యుద్ధ వ్యూహాన్ని నిర్వహించగల సమర్థుడా? దేశపు భౌగోళిక, ఉపరితలాల గురించి ఆయనకున్న పరిమితమైన అవగాహన పట్ల నాకు అనుమానం. స్థానిక చిత్రపటాల గురించి అతనికి నేను అవగాహన కల్పించినా ఆయన తన లెఫ్టినెంట్ల మీద ఆధారపడుతున్నారు. నిజాం నా మాటలు శ్రద్ధగా విని, నా అభిప్రాయా లను పంచుకుని తక్షణం అతని స్థానంలో వేరొకరిని నియమించమని నాకు చెప్పాడు. ఆ విపత్కర పరిస్థితిలో ఎల్.ఎడ్రూస్ స్థానంలో మరొకరిని నియమించడం అంత సులభమైనపని కాదు. ఆర్మీ సీనియర్ అధికారులలో అంతటి సమర్థులెవరూ కనిపించలేదు. జూనియర్ అధికారిని నియమిస్తే పరిపాలనా పరంగా ఇబ్బందు లొస్తాయి. సైన్యం సుస్థితి ఉన్నత స్థాయిలో ఉండాల్సిన తరుణంలో అది దెబ్బతింటుంది.

ఈ సమస్య మీద నిజాం, నేను చాలా సేపు తర్కించాం. మరొక సమర్థుడైన చీఫ్ ఆఫ్ ది స్టాఫ్ రాజీనామా చేసి కొత్త సమస్య సృష్టించాడు. స్వతహాగా బ్రిటీషరైన చీఫ్ బ్రిటన్ భూభాగంగా ఉన్న భారత్‌పై తుపాకీ ఎక్కుపెట్టకూడదు కాబట్టి రాజీనామా చేయమని ఢిల్లీలోని బ్రిటన్ హైకమిషనర్ సూచన మేరకు ఆయన రాజీనామా చేశాడు. ఈ పరిస్థితుల దృష్ట్యా ప్రస్తుత పరిస్థితిలో ఎలాంటి మార్పు చేయకుండా ఉన్నంతలోనే పరిస్థితికి అనుగుణంగా బాగా పని చేయించాలని నిర్ణయించుకున్నాం.

మిగిలిన రోజంతా ఆర్మీ కేంద్రంలో గడిపాను. నా వ్యక్తిగత కోరిక మేరకు, సూచనలు సలహాలు మఫ్టీలో ఇవ్వడానికి, వాస్తవంగా సాయుధ పోరు ఆరంభమయ్యే వరకు అందుబాటులో ఉండడానికి బ్రిటీష్ చీఫ్ ఆఫ్ ద ది స్టాఫ్ అంగీకరించాడు. ఈ గడిచిన సమయమంతా నాకు ఆర్మీ కమాండర్ శిక్షణగా మారిపోయింది.

# 31. దండయాత్ర ప్రారంభం

1948 సెప్టెంబర్ 13వ తేదీ తెల్లవారు జామున నా పడక పక్కనున్న టెలిఫోన్ భీకరంగా మోగడంతో మేల్కొన్నాను. ఆర్మీ కమాండర్ నేరుగా చేశాడు. రిసీవర్ ఎత్తకముందే ఇది భారత దళాల పురోగమనానికి సంబంధించిన వార్త అయి ఉంటుందని అనుకున్నాను. అది అదే. గడచిన పదిహేను నిమిషాలుగా ఐదు విభిన్న సెక్టార్ల నుండి భారత దళాలు పెద్ద సంఖ్యలో పురోగమిస్తున్నట్లు సమాచారమొచ్చిందని ఆర్మీ కమాండర్ చెబుతున్నాడు. అతను నాతో మాట్లాడుతూ ఉండగానే బీర్, అహ్మదాబాద్, వరంగల్ విమానాశ్రయాల మీద శక్తివంతమైన బాంబు దాడులు జరుగుతున్నట్లు సమాచారం వచ్చింది. ఏం చేయాలని అడిగాడు అతను.


ఏం చెప్పమంటున్నావు అని నేను అడిగాడు. మళ్ళీ 'మనవాళ్ళను అడ్డుకొమ్మని చెప్పు' అన్నాను.

'మంచిది సర్' అని ఫోన్ పెట్టేశాడు.

మళ్ళీ నేను ఫోన్ చేసి వివిధ దశల నుండి వచ్చే సమాచారాన్ని చెబుతూ ఉండమని చెప్పాను. తను ఆఫీసుకు వెళ్తున్నానని, వెళ్ళగానే అన్నీ వ్యక్తిగతంగా నిర్దేశిస్తానని చెప్పాడు.

'సెభాష్, అంతామంచి జరగాలని' అన్నాను.

రోజు కంటే అరగంట ముందు నిద్ర లేచాను. ఉదయపు ప్రార్థన చేసి సిద్ధమయ్యాను. అదే సమయంలో మరికొన్ని ఫోన్లు వచ్చాయి. పోలీసు ఉన్నతాధికారి నుండి కొన్ని, సైనిక కేంద్రం నుండి కొన్ని, మరిన్ని కేంద్రాల నుండి భారత దళాలు ముందుకు వస్తున్నాయని, చాలా చోట్ల భారత వైమానిక దళ విమానాలు బాంబులు కురిపిస్తున్నాయని వాటి సారాంశం.



నిజాంను కలవడానికి ముందు సైనిక కేంద్రానికి వెళ్ళాను. ఆర్మీ కమాండర్ తన గదిలోనే ఆపరేషన్ వ్యవస్థను ఏర్పాటు చేసుకున్నాడు. ఇతర సిబ్బంది భౌగోళిక మ్యాపు మీద దాడులు జరుగుతున్న ప్రాంతాలను, ప్రతిఘటన దళాలున్న ప్రాంతాలను చూపిస్తుండగా పరిశీలిస్తూ ఆయన పనిలో తలమునకలుగా ఉన్నాడు. గతంలో అందిన నిఘా నివేదికల ప్రకారం, ఉదయం నుండి అందుతున్న సమాచారాన్ని బట్టి పెద్ద దాడి రెండు వైపుల నుండి సాగుతోంది. పశ్చిమాన షోలాపూర్– హైద్రాబాద్ రహదారి వెంట, తూర్పున మచిలీపట్నం – హైద్రాబాద్ రహదారి మీద, రెండు వైపులా పెద్ద సంఖ్యలో యుద్ధ టాంకులు కదుల్తున్నాయి. వాయువ్య సరిహద్దులో మూడు చోట్ల తేలికపాటి స్టువర్ట్ టైప్ టాంకులు ముందు నడుస్తుండగా వాటి వెనక ఆయుధ వాహనాలు, పదాతి దళాల వాహనాలు అనుసరిస్తున్నాయి. ఉత్తరాన ఆయుధాల వాహనాలు, ఇతర మోటరైజ్డ్ యూనిట్లు ఐదుచోట్ల చొచ్చుకు వస్తున్నాయి. ఈశాన్యంలో వార్ధా నది మీదుగా భారత సైన్యం రైళ్ళలో రావడం మొదలైంది. తూర్పున మచిలీపట్నం రోడ్డున సాగుతున్న ప్రధాన దళానికి అదనంగా సరిహద్దు వద్ద తేలికపాటి టాంకులు ఆయుధ వాహనాలు విభిన్న మార్గాల ద్వారా చొచ్చుకుని రాసాగాయి. నైరుతి సరిహద్దులో వాహనాలతో కూడిన పదాతి దళాలు ఐదు సమూహాలుగా పురోగమిస్తున్నాయని తెలిసింది. కొందరు రైల్వే బ్రిడ్జి మీదుగా తుంగభద్రను దాటుతున్నట్లు తెలిసింది. కొద్ది సేపట్లోనే వివిధ దిశల్లో, విభిన్న మార్గాల్లో దాడి చేస్తున్న వివిధ స్థాయిల్లో బలమున్న భారత దళాల గమనాన్ని మ్యాపులో

గుర్తించడం జరిగింది.

భారత్ ప్రధానమైన దాడిని షోలాపూర్ వద్ద ప్రారంభించింది. షెర్మాన్ టాంకుల వరస, వాటి వెనకాల సైనికులతో కూడిన వాహనాలు అక్కడ మోహరించాయి. ఇక్కడ కొన్ని నెలలుగా భారత్ దాడికి సిద్ధమవుతూ వచ్చింది. ఆ ప్రాంతంలో పౌరులను నియంత్రించింది. ఇక్కడి నుండి ప్రధాన రహదారి మీదుగా నల్‌దుర్గ్, హుమ్నాబాద్, జహీరాబాద్ ద్వారా హైద్రాబాద్ చేరవచ్చు. లేదా నల్‌దుర్గ్‌ను వదిలేసి ఉస్మానాబాద్ – లాతూర్ రోడ్డులో బీదర్ ద్వారా నైరుతి దిశగా ప్రయాణించి జహీరాబాద్ చేరవచ్చు. లేదా బీదర్ నుండి ఇంకే రోడ్డు ద్వారానైనా రాజధానికి చేరవచ్చు. హైద్రాబాద్ ప్రతిఘటన దళాల కంటే వారు ప్రయాణించే భూభాగమే భారత సైన్యాన్ని ఎక్కువగా ఇబ్బంది పెట్టింది. దక్కన్ పీఠభూమిలోని ఈ ప్రాంతం కొండలతో కూడిన మలుపులతో లోతైన ఒంపులతో సహజంగా పరుచుకున్న రహదారుల వల్ల ప్రయాణం కొంత కష్టతరంగా ఉంటుంది. ఈ దారుల్లో రావడం తప్ప భారత్ సైన్యానికి ఇంకే గత్యంతరం లేదు.

పశ్చిమ సరిహద్దు నుండి భారత్ దాడిని మొదలే ఊహించి నల్‌దుర్గ్ లోయ వద్ద రక్షణ దళాన్ని హైద్రాబాద్ సిద్ధం చేసింది. '25 పౌండర్ ఫీల్డ్ గన్స్' నాలుగింటితో కూడిన ఒక బెటాలియన్‌ను అక్కడ ఉంచడం జరిగింది. నల్‌దుర్గ్ గ్రామం వద్ద రెండు వైపులా ఉన్న మూడు నాలుగు వందల అడుగుల ఎత్తైన కొండలను ఆనుకుని లోతుగా నది ప్రవహిస్తుంది. రెండు వైపులా తీరం వెంట ఉన్న రోడ్డును లోయ అడుగు భాగంలో ఉన్న చిన్న వంతెన కలుపుతుంది. ఆ వంతెనను పేల్చివేసి ఎడమవైపుకు కాపలా ఉండి సాధ్యమైనంత కాలం భారత్‌ను నిలువరించాలని హైద్రాబాద్ ప్రణాళిక. చాలా దూరంగా ఉన్న పైభాగం నుండో, కింది భాగం నుండో చాలా ఎగుడు దిగుడు నేలపై ప్రయాణిస్తే తప్ప ఈ మార్గం మూసివేస్తే దగ్గరగా మరో మార్గం ద్వారా వచ్చే అవకాశం లేదు.

ఈ లోయలో తప్ప జిల్లా కేంద్రమైన ఉస్మానాబాద్‌తో సహా ఎక్కడా రక్షణ ఏర్పాట్లు చేయలేదు. రక్షణ వ్యూహం రీత్యా ముఖ్యమైన స్థానమైన ఎగుడు దిగుడుగా ఉన్న మంజీరా తీర పట్టణం లాతూర్‌లో భారత దళాల గమనాన్ని పసిగట్టడానికి రెండో రక్షణకేంద్రం ఏర్పాటు చేయడమైనది. షోలాపూర్ – హైద్రాబాద్ రహదారి వెంట, నల్‌దుర్గ్ దగ్గర లోతైన రక్షణ చర్యలు తీసుకోబడ్డాయి. నల్‌దుర్గ్‌కు నలభై మైళ్ళ దూరంలో భారత దళాల పురోగమనాన్ని అడ్డుకోవడానికి ఒక ఏర్పాటు

చేయబడ్డది. డ్యాం పక్కన హైద్రాబాద్‌కు వంద మైళ్ళ దూరంలో వ్యూహాత్మకంగా ఏర్పాటు చేయబడ్డదది. ఇక్కడ పదిమైళ్ళు రోడ్డు పూర్తి కచ్చాగా, మలుపులతో కూడి దళాల పురోగమనాన్ని సులభంగా అడ్డగించడానికి అనువుగా వుంటుంది. ఇక్కడి నుండి రాజధానికి సగం దూరం వరకు కేవలం ఒక్కచోట దళాన్ని సహజంగా నియంత్రించగలిగే రోడ్డు ఉంది. ఇక అక్కడి నుండి రాజధానికి పదిమైళ్ళ దూరంలో ఉన్న లింగంపల్లి తప్ప రోడ్డు అంతా సజావుగా ఉంది.

భారత సైనిక దళాల బ్రిగేడ్ 13వ తేదీ ఉదయం పదిమైళ్ళ దాకా పురోగమించింది. అందులోంచి ఒక చిన్న సమూహం ఉత్తరందిశగా తిరిగి ఉస్మానా బాద్ వైపు వెళ్ళగా ప్రధాన దళం మాత్రం తూర్పు వైపు ప్రయాణించి నల్‌దుర్గ్ దిశగా కదిలింది. భూమి మీద సైన్యపు సహకారంతో భారత వైమానిక దళం నల్‌దుర్గ్ లోయకు రెండు వైపులా ఎడతెగని బాంబు దాడులు చేసింది. జాగ్రత్తగా మెల్లగా ప్రయాణిస్తూ ప్రధానదళం నల్‌దుర్గ్‌లోని హైద్రాబాద్ రక్షణ దళానికి అతి సమీపానికి చేరింది. రక్షణ దళాలు కేవలం ఆరు రౌండ్ల (మరో నివేదిక ప్రకారం ఎనిమిది రౌండ్లు) షెర్‌మాన్ టాంకుల మీద కాల్చారు. ఖంగుతిన్న షెర్‌మాన్ టాంకుల దళం వేగంగా వెనక్కు తిరిగింది.

ఉత్తర దిశలో వచ్చిన దళాలకు ఎలాంటి ప్రతిఘటన ఎదురు కాలేదు. వాళ్ళు క్షేమంగా ఉస్మానాబాద్ చేరారు. ఇంకా ఉత్తరంగా ప్రయాణించి మెస్ది ద్వారా లాతూర్ వైపు రాసాగారు. ఎలాంటి ప్రతిఘటన లేకున్నా వాళ్ళు పురోగమించింది తక్కువే.

తూర్పున భారత దళాలు సురక్షితంగా హైద్రాబాద్ భూభాగానికి కొన్ని రోజుల కిందనే వచ్చి మునగాల వద్ద ఆగి సూర్యాపేట వైపు ప్రయాణించసాగాయి. అవి అలాగే నేరుగా ప్రయాణించి రాజధానికి చేరుకుంటాయా అనే విషయంలో అస్పష్టత ఉండింది. రక్షణ దళాలు ఈ దారిలో మూసీతీరం వద్ద ఉన్నాయి కానీ వాళ్ళ వద్ద మోర్టార్లు తప్ప ఫీల్డు గన్స్ లేవు. వాళ్ళ సామర్థ్యం అనుమానాస్పదం, అన్ని రక్షణ దళాల్లోకి అదే బలహీనమైనది. ఈ దారిలో భారత్ సైన్యాలు ప్రయాణించే మూసీ లోతట్టు కాజ్‌వేని దాటితే రాజధానికి చేరుకోవడానికి అనేక మార్గాలున్నాయి. అయితే 13వ తేదీ నాటికి సూర్యాపేట వరకు వచ్చాయని అవి నేరుగా హైద్రాబాద్ రానున్నాయని తెలిసింది. ఈ దారిలో రక్షణ ఏర్పాట్లు బాగున్నాయి.

తూర్పు సరిహద్దులోని ఇతర ప్రాంతాల వార్తలు పెద్దగా ఆందోళన కలిగించ లేదు. విడిపోయిన చిన్న దళాలు చిన్న చిన్న టాంకులతో కదులుతున్నా పెద్దగా పురోగమనం లేదనిపించింది. అన్నింటి కంటే చెడ్డవార్త రాజురా నుండి వచ్చింది. వార్ధా నది మీద రాజురా వద్ద వంతెన ఇండియా, హైద్రాబాద్‌ను కలుపుతూ ఉంది. ఇక్కడ రైల్వే ఇంజనీరు, సైన్యం, పోలీసులతో ఉన్న అవగాహన ప్రకారం భారత సైన్యాలు పురోగమిస్తే ఆ బ్రిడ్జిని పేల్చి వేయాలి. అయితే అసలైన సమయానికి ఆ రైల్వే ఇంజనీరు ఆరుమైళ్ళ దూరంలో నిద్రిస్తున్నాడు. భారత సైన్యం ఆయుధాలతో సహా పట్టాలెక్కినప్పుడు నిప్పు పెట్టడానికి ఎవరూ సిద్ధంగా లేరు. భారత సైన్యం క్షేమంగా వంతెన దాటింది. నది దక్షిణపు ఒడ్డు చేరింది. తర్వాత రక్షణ దళాలు నదికి దక్షిణపు ఒడ్డున ఉన్న స్థానిక వంతెనలు చాలా పేల్చి వేసినప్పటికీ పెద్దగా ప్రయోజనం లేకపోయింది.

ఉత్తర, వాయువ్య సరిహద్దుల నుండి పెద్దగా వార్తలు లేవు. చిన్న చిన్న అస్పష్టమైన సమాచారం కొంత గందరగోళపరిచేది. ప్రధానమైన ఆందోళన హెడ్గాన్ – నాందేడ్, హింగోలి – నాందేడ్ రోడ్లపై ఉండేది. జాల్నా నుండి కొంత గందరగోళపరిచే వార్తలొచ్చేవి. ఔరంగాబాద్ సరిహద్దుల నుండి అసలు వార్తలే రాలేదు. పశ్చిమ సరిహద్దులో ఉన్న బీదర్ జిల్లాలో పెద్దగా రక్షణ చర్యలు చేపట్టలేదు. అయినా భారత సైన్యాల గురించిన వార్తలేమీ రాలేదు. కానీ పూర్తిగా నైరుతి ప్రాంతంలో ఉన్న మునీరాబాద్ హుబ్లీ – మునీరాబాద్ రైల్వే లైన్ల వెంట పెద్ద అలజడి జరిగినట్లు వార్తలొచ్చాయి. ఈ ప్రాంతంలో చిన్న సంఖ్యలో రక్షణదళం, ప్రధానంగా నీటి పారుదల శాఖ ఇంజనీర్లతో కూడిన వాలంటీర్లతో ఏర్పాటయింది. అయినా అక్కడ మంచి రక్షణ చేయగలిగారు. భారత అధికారుల పర్యవేక్షణలో పెద్దగా శిక్షణ లేని మైసూరు దళాలను ఇక్కడి రక్షణదళం తుడిచిపెట్టింది. అక్కడ హైద్రాబాద్ భూభాగానికి చెందిన మీటర్ గేజ్ రైలు మార్గాన్ని పూర్తిగా తమ ఆధీనంలోకి తీసుకుంది రక్షణదళం. నిజానికి ఈ దళం తుంగభద్రను దాటి హోస్పేట్ మొదలైన భారత పట్టణాలను ఆక్రమించే దాకా వెళ్ళింది.

వివిధ ప్రాంతాల నుండి వ్యత్యాసమున్న వార్తలతో పాటు, వైమానిక దాడులు, భూభాగంలోకి చొరబాట్లు దురదృష్టకరంగా పరిణమించాయి. వరంగల్, బీదర్, రాయచూర్, ఆదిలాబాద్, ఔరంగాబాద్ వైమానిక ప్రాంతాలు భారత వైమానిక దాడులతో దద్దరిల్లాయి. అక్కడ ఎలాంటి రక్షణలు లేవు. ఇంకా పిచ్చిలేపిన

అంశమేమిటంటే అక్కడ పడే ప్రతి ఐదు బాంబులలో ఒకటి రన్‌వే మీద పడుతుంది. కేవలం హైద్రాబాద్‌కు పదిహేను మైళ్ళ దూరంలో ఉన్న ఏరోడ్రాంలో మాత్రమే ఆంటీ ఏర్‌క్రాఫ్ట్ ఏర్పాట్లు ఉన్నాయి. బహుశా అందువల్లనే అది తెలిసి భారత వైమానిక దళాలు అటు ఛాయలకు కూడా రాలేదు.

కొంత సేపు రక్షణ కేంద్రంలో గడిపిన తర్వాత రోజు కంటే కొంత ముందుగా నిజాంను కలిశాను. ఉదయం నుండి ప్రతి కొద్ది నిమిషాలకొకసారి ప్రతి సమాచారమూ టెలిఫోన్‌లో ఆయనకు చేరవేస్తూనే ఉన్నాము. విషయానికి రావడానికి పెద్ద ఉపోద్ఘాతాలలోకి పోలేదు. దాడి తాజా స్థితిని చర్చించి భవిష్యత్ ప్రణాళికల గురించి ఆలోచించాం. ఆర్మీ కమాండర్‌ని పిలిచాం. నిజాం చాలా వివరంగా మాట్లాడబోయాడు. యుద్ధ సన్నాహాలలో ఉన్నందున ఆర్మీ కమాండర్ ఆర్మీ కేంద్రాన్ని వదలి ఎక్కువసేపు ఉండలేడని నేను నిజాంకు గుర్తు చేశాను. నిజాం అందుకు ఒప్పుకొని కమాండర్‌ను వెళ్ళమన్నాడు. నేను కూడా వెళ్తానని, ఫోన్ చేస్తూ ఉంటానని అన్నాను.

సాధారణ ప్రభుత్వోద్యోగులతో మాట్లాడినప్పుడు పాతకాలంలో ఉపయోగించిన వైర్‌లెస్ సంకేతాలను సైన్యం ఇప్పటికే ఉపయోగిస్తుందని, అది ఎప్పుడో మార్చి వేయవలసి ఉన్నదన్న సంగతి నాకు తెలిసింది ఆ సంకేతాలు భారత అధికారులకు తెలుసునని ఎవరో అంటే చాలామంది అది నిజమేనన్నారు. నేను ఆశ్చర్యంతో పాటు బాధపడ్డాను. కొత్త సంకేతాలు తయారు చేయడం జరిగిందని, కాని వాటిని భారత్ సైన్యం ఇప్పటికే సంపాదించిందని చెప్పారు. ఏర్పాట్లలో ఒక్కొక్క విషయం లోపలికి వెళ్ళి ఆలోచించిన కొద్దీ ఆశ్చర్యపోవడం నా వంతైంది. సమర్థులైన సిబ్బంది ఉన్నా దూరదృష్టి, ప్రణాళికా లోపం ఉన్నట్లు అనిపించింది. వైద్యం, సరుకుల సరఫరా, రవాణా, ఆయుధాలు మందుగుండు పంపిణీ, గిడ్డంగి నిర్వహణ మొదలైన ప్రతి విషయంలో ఆర్మీ కమాండర్ అసంపూర్ణ ఏర్పాట్లు చేసి ఇప్పుడు ప్రతి విషయాన్ని నాకు నివేదించి సూచనలు, పౌర శాఖల సహాయాన్ని అడుగుతున్నాడు.

ఆర్మీ కేంద్రస్థానమే ఇప్పటి నుండి నేను ఉండాల్సిన ప్రదేశమని నాకు అనిపించింది. ఎవరినీ తప్పుపట్టే సమయం కాదు. ఆర్మీ కమాండర్‌ను నమ్ముకోవడమే అసలైన తప్పిదం. దాన్ని ఇప్పుడు దిద్దుకోలేం. నిజాంకు తర్వాత ఈ విషయం చెప్పినప్పుడు దిగ్భ్రమకు గురయ్యాడు. పరంపరగా అందుతున్న నిస్తంత్రీ సందేశాలను డీకోడ్ చేసి అందజేయడం జరుగుతుంది. వాటిని డీకోడ్ చేయడంలో భారత సైన్యం కూడా మనంతటి వేగంలోనే ఉంటుందని, వాటిని కోడింగ్‌లో పంపడం వృథా

ప్రయాస అన్నాను. అయినా అందులో నేను తల దూర్చలేదు. ప్రతి సమాచారాన్ని ఆర్మీ కమాండర్ నాకు పంపిస్తూ నా అనుమతి తర్వాతే ఆదేశాలు ఇస్తూ ఉన్నాడు. ఆయన ఆత్మ విశ్వాసం మొత్తం సన్నగిల్లినట్లు కనిపించింది. విచారపడకుండా పరిస్థితిని ధైర్యంగా ఎదుర్కోమని చెప్పాను. నేను నిజాం వద్దకు వెళ్ళాను. తరచుగా కలిసి ఆయన ఆందోళనను తగ్గించడమే నా పని. నిజాం దగ్గర సెలవు తీసుకుని కొన్ని ముఖ్య పనులు చూసుకోవడానికి, ఒక ముద్ద భోజనం చేయడానికి నా కార్యాలయానికి పరుగు పెట్టాను. ఈ సంక్షోభంలో నా కుడిభుజం మహబూబ్ అలీఖాన్. ఆయన అనుభవమున్న, ప్రశాంతంగా ఆలోచించగల, తెలివితేటలున్న పౌర అధికారి. విషయమంతా ఆయనకు చెప్పి ఒక అతిముఖ్య రహస్య సమాచారాన్ని రాసి మంత్రులకు, కరాచీలోని ఏజెంట్ జనరల్ ముస్తాఖ్ అహ్మద్‌కు పంపించమని చెప్పాను. ఆయన అందరికీ సమాచారమిచ్చి ఐరాస ప్రతినిధి బృందానికి కూడా పంపించాడు. నేను బాధ్యతలు తీసుకోగానే నా తరపున అతి ముఖ్యమైన వ్యవహారాలు నిర్వహించడానికి గాను మహబూబ్ అలీఖాన్ కోసం డైరెక్టర్ జనరల్ ఆఫ్ కో ఆర్డినేషన్ అనే పోస్టు సృష్టించి ఆయనను నియమించాను. భారత్ దాడి ప్రారంభమయ్యాక కె.ఎమ్. మున్షీని హైద్రాబాద్ అతిథులు ఉండే ప్రభుత్వ అతిథి గృహానికి తరలించే బాధ్యత ఆయనకు పెట్టాను.

జాగ్రత్తగా, గౌరవప్రదంగా ఆయన తరలింపు ఉండాలని ఆయనకు చెప్పాను. ఒక సైనిక అధికారి ద్వారా గౌరవప్రదంగా, సంతృప్తికరమైన పద్ధతిలో ఈ పని పూర్తి చేశానని, మున్షీ ఇప్పుడు లేక్ వ్యూ అతిథి గృహంలో క్షేమంగా ఉన్నాడని చెప్పాడు. మున్షీ నివాసం వద్ద కాపలా ఉండే భారత దళాన్ని నిరాయుధుల్ని చేసి మిలటరీ బరాక్‌లో ఉంచడం జరిగింది. ఈ వార్తను రేడియోలో ప్రసారమయ్యేట్లు ప్రత్యేకంగా చూడమని చెప్పాను. తద్వారా ఢిల్లీలోని హైద్రాబాద్ ఏజెంట్ జనరల్‌కు అలాంటి మర్యాదే దొరకాలని నా ఉద్దేశ్యం.

రెండు గంటల తర్వాత సైనిక కేంద్రానికి వెళ్ళిన నాకు ఆశనిపాతంలాంటి వార్త ఎదురైంది. నల్‌దుర్గ్ దగ్గర ఉంచిన దళం భారత విమానాలు వేసిన బాంబులు, దూసుకు వస్తున్న సాయుధ సైన్యపు కాల్పుల వల్ల ఉదయానికల్లా తుడిచి పెట్టుకుపోయిందని ఆర్మీ కమాండరు చెప్పాడు. అందులో మిగిలిన వాళ్ళను వెనక్కు తగ్గమని ఆదేశించాడు. రెండు ఫీల్డు గన్‌లను బాంబర్లు ఉపయోగించలేదని చెప్పాడు. బాంబుల మోత వల్ల ఒక ఫీల్డు గన్ పేలి బాంబరు కూడా అందులో కాలిపోయాడని,

మిగిలిన ఫీల్డు గన్ ఏమయిందో తెలియదని చెప్పాడు. ఉదయం కాల్పులు జరిపినప్పుడు భారత దళం వెనక్కి తగ్గిన సమయంలో మళ్ళీ కాల్పులు జరపడానికి రక్షణ దళానికి ఎందుకు ఆదేశాలు ఇవ్వబడ్డాయో నాకు అర్థం కాలేదు.

అసలు నల్‌దుర్గ్‌లోయలో దళం పేల్చివేయబడిందా అని కోపంగా అడిగాను. లేదు అన్నాడు. వంతెనకు బాంబులు అమర్చడం జరిగింది. చేయవలసిందల్లా దాన్ని పేల్చడమే. అయితే దళంలో మిగిలిన వాళ్ళు దూరంగా వెళ్ళిపోయారు. వంతెన అలాగే మిగిలిపోయింది. కొన్ని ఫీల్డు గన్నులు అక్కడే వదిలివేశారు. దళం విచ్ఛిన్నమయ్యే బదులు పునర్నిర్మాణ ప్రయత్నం ఎందుకు జరగలేదు? వైమానిక బాంబుల వల్ల అది సాధ్యం కాలేదని నాతో చెప్పాడు.

నా విశ్వాసం దెబ్బతిన్నది. ఇప్పటినుండి ప్రతి కొత్త నిర్ణయం తీసుకునే ముందు నా అనుమతి తీసుకొమ్మని చెప్పాను. ఆర్మీ కమాండర్ వెంటనే అందుకు అంగీకరించాడు. పడమర దిశ నుండి వచ్చే వార్తలు ఆందోళన కలిగించాయి. మధ్యాహ్నం నాలుగు గంటల ప్రాంతంలో భారత దళాలలోని ప్రధాన సమూహం వంతెన దాటి పురోగమిస్తున్నదని వార్త వచ్చింది. ఆ వంతెనను పేల్చకుండా తెలివితక్కువగా వదిలేసి భారత దళాల గమనాన్ని నిరోధించడానికి హైద్రాబాద్‌కున్న గన్‌షాట్ అవకాశాన్ని జారవిడుచుకున్నట్లయింది. ఈ రోజు భారత దళాలు ఇంకా ముందుకు రాలేవని కమాండర్ చెప్పాడు. రక్త మాంసాలున్న ఏ సైనికుడూ ఒక్క రోజులో అంతకంటే ఎక్కువ దూరం దూసుకురాలేడని ఆయన వాదించాడు. ఆయన ప్రకారం దళాన్ని సిద్ధం చేయడానికి మరుసటి రోజంతా పడుతుంది. మరుసటి రోజు దళాన్ని సిద్ధపరచి కొండలతో కూడుకొని వ్యూహాత్మకంగా రక్షణకు అనుకూలమైన హుమ్నాబాద్ వద్ద కేంద్రీకరించడానికి అతను నాతో అంగీకరించాడు. దళంలోని మిగతా విభాగాలకు తక్షణం సిద్ధమై హుమ్నాబాద్‌కు భారత సైన్యం కన్నా ముందు చేరుకోవాలని సమాచారం పంపబడ్డది.

ఆర్మీ కమాండర్ పూర్తి సమయం కేంద్రకార్యాలయంలోనే ఉండడానికి మంచం కూడా తెప్పించుకున్నాడు. విడతల వారీగా పనిచేసే సాధారణ సిబ్బందిని ఇరవైనాలుగు గంటలూ సమాచారమిస్తూ ఉండమని ఆదేశించాడు. ప్రధానమైన విషయాలన్నీ నాకు కూడా నివేదించమని చెప్పాడు. నిజాంతో గంటసేపు సమావేశమయ్యాక సాయంత్రం సైనిక కేంద్రంలో అర్ధరాత్రి దాకా కూర్చున్నాను. ఏర్‌ఫీల్డులపై బాంబుల వేతకు తప్పించి గుర్తించదగిన కొత్త సమాచారమేదీ లేదు. బీదర్ ఏర్‌ఫీల్డు గతంలో

ఆయుధ రవాణాకి బాగా ఉపయోగపడింది. తర్వాత వరుసగా భారత విమానాలు ఆ ప్రదేశాలలో చక్కర్లు కొడుతూ ఉన్నందున అక్కడికి వచ్చే విమానాలను వరంగల్ ఏర్‌ఫీల్డుకు దారి మళ్ళించడం జరిగింది. కొంతకాలం పాటు భారత వైమానిక దళానికి ఆ విషయం తెలియక వారి విమానాలు అక్కడ తిరగాడుతూనే ఉన్నాయి. తర్వాత అప్పుడప్పుడు వరంగల్ ఏర్‌ఫీల్డు మీద, తరచుగా చికల్తానా ఏర్ ఫీల్డు మీద భారత విమానాలు తిరగాడుతూ ఉండేవి. కాని చికల్తానాలో ఎన్నడూ విమానాలు దిగలేదు. పదేపదే వాళ్ల విమానాలు అక్కడ తిరగడం వెనుక అసలు ఉద్దేశ్యం అక్కడ దిగి ఆ విమానాశ్రయం మీద ఆధిపత్యం సంపాదించడం అని భయపడ్డాం. అప్పుడు రన్‌వేకు అడ్డంగా గుంతలు తవ్వించి, రోడ్డురోలర్లు పెట్టి కొన్ని భారీ వస్తువులు వేసి విమానాలు దిగడానికి అవకాశం లేకుండా చేయాలని నిర్ణయించాను. బీదర్, వరంగల్ విమానాశ్రయాలు రెండూ దాడులకు గురవుతున్నందున బయటినుండి సరుకులతో వచ్చే విమానాలను హకీంపేట విమానాశ్రయానికి దారి మళ్ళించడం జరిగింది. అప్పుడది హైద్రాబాద్‌లోని పౌరరవాణా విమానాశ్రయం. అక్కడ ఆంటీ ఏర్‌క్రాఫ్ట్ విధానం అందుబాటులో ఉంది.

నల్‌దుర్గ్‌లోయలో వంతెన పేల్చివేత, వార్ధా నది మీద రైల్వే వంతెన పేల్చివేత ప్రణాళికలు విఫలమయ్యాక, సైన్యం ఇంకే విధ్వంస ప్రణాళికనూ విజయవంతంగా ఆచరణలో పెట్టలేదని అంచనాకు వచ్చాను నేను. ప్రజా పనుల శాఖలోని ఇంజనీరింగ్ ఉద్యోగులు మాత్రమే ఆ పనులు చేయగలరని నాకు అనిపించింది. నిజానికి ఆ నిర్మాణాలన్నీ ఒక కాలంలో వారు నిర్మించినవే. ఎంతో సమస్యతో కూడుకుని ఉన్న ఆ లక్ష్యాన్ని వాళ్ళు తక్షణం స్వీకరించడానికి ముందుకు వచ్చారు. వివిధ ప్రాంతాలలో ఉన్న సైనిక సమూహాలు వీరితో సమన్వయ పరుచుకోవాలని భావించాను. అందుకు అవసరమైన 'గన్ కాటన్ స్లాబ్‌లు' కొద్దిగానే అందుబాటులో ఉన్నాయి కానీ డైనమైట్లు మాత్రం కావలసినంత ఉంది. ఇప్పుడు కావలసింది చాకచక్యంగా, విఫలం కాకుండా కార్యాన్ని నిర్వర్తించవలసిన వ్యక్తులు. సరిగ్గా అప్పుడే ధైర్యం, ఉత్సాహం ఉన్న, శిక్షణ పొందిన ఒక సమూహం నాకు దొరికింది.

# 32. కొనసాగిన దండయాత్ర

దండయాత్ర రెండవరోజు సెప్టెంబర్ 14న ఎక్కడి నుండీ పెద్దగా ఆందోళన కలిగించే వార్తలు లేవు. వాయువ్య ప్రాంతంలోని ముఖ్యమైన పట్టణం జైనా భారత దళాలనుండి తిరిగి స్వాధీనం చేసుకోబడ్డది. జైనా ఆక్రమణకు గురైందని సమాచారమే మొదట లేకపోవడం ఆశ్చర్యం కలిగించింది. ఆర్మీ కమాండర్ అభిప్రాయం ప్రకారం భారత దళాలు ముందుకు రావడంలో ఆ రోజు ఏ పురోగతి ఉండదు. ఎందుకంటే ఆ రోజు దళాల్ని సమకూర్చుకోవడం మరియు విశ్రాంతి తీసుకోవడం కోసం సమయం పడుతుంది.

మధ్యాహ్నం అవుతున్న కొద్దీ మంచి వార్తలు చెడ్డవార్తలు కుప్పలు తెప్పలుగా వచ్చి పడసాగాయి. రేడియోలో మధ్యాహ్నం వార్తల్లో భారత దళాలు ముందుకు కొనసాగడంతో అన్ని వైపుల నుండి తీవ్ర ప్రతిఘటనలు ఎదురవుతున్నాయని చెప్పారు. ఆ వార్తలు మూర్ఖమైనవి కాదనిపించింది.

సంతోషం కలిగించే విషయం ఏంటంటే భారత దళాల నడకకు ఆశ్చర్యకరంగా కొద్దిపాటి ప్రతిఘటనలు ఎదురయ్యాయి. మొదటిరోజు అనుభవం ఏమిటంటే ప్రతిఘటన లేనంత వరకు భారత దళాలు వేగంగా దూసుకువచ్చాయి. కాని కొన్ని రైఫిల్ తూటాలు కూడా సాయుధ దళాల్ని భయపెట్టాయి. ఇది అన్ని వైపులా గుర్తించబడ్డది. ఎక్కడైతే భారత దళాలకు యుద్ధ ట్యాంకుల దన్ను లేదో అక్కడ శిక్షణ లేని రక్షకులను కూడా

ఎదిరించలేక పోయారు. నీటి పారుదల శాఖలోని కార్మికులు వాలంటీర్లుగా ఉన్నా నైరుతి సరిహద్దులో ఉన్న మున్నీరాబాద్ రక్షణ దళం ఒక సైనిక కంపెనీ ట్రూపు ఆధ్వర్యంలో మైసూరు రాష్ట్ర బెటాలియన్‌ను తుడిచిపెట్టింది. తుంగభద్ర నదిని దాటి మద్రాసు భూభాగంలోకి చొరబడింది. ఈ క్రమంలో సాదిక్ అలీఖాన్ అనే వీరుడైన ఇంజనీరును జీపులో రోడ్డు దాటుతుండగా భారత దళాలు మాటువేసి చంపాయి. ఎంతోమంది వాలంటీర్లు, ఇతరులు గాయపడ్డారు. కాని అందువల్ల నిరుత్సాహపడలేదు.

వాళ్ళు అడిగిందల్లా అవకాశం ఉంటే పోరాడడం కోసం కొన్ని ఆయుధాల్ని అదనంగా ఇమ్మని, ముందురోజు ఉత్తర దిశగా ప్రయాణించి రక్షణ లేని ఉస్మానాబాద్ వద్దకు చేరుకున్నారు. ఆ ప్రాంతం నుండి ఇప్పుడు కొత్త వార్తలు వస్తున్నాయి. ఆ పట్టణంలో రక్షణ దళాలు లేవని తెలిసి కూడా భారత సైనిక ట్యాంకులు కాల్పులు జరుపుతూ అక్కడికి చేరుకున్నాయి. పట్టణాన్ని ఆక్రమించాక పౌరులను ఊచకోత కోయడం ప్రారంభించారు. ప్రత్యేకంగా ముస్లిం స్త్రీల, పురుషుల, పిల్లల వెంటబడ్డారు. తప్పించుకోగలిగిన కొద్దిమంది మాత్రం పరుగెత్తుకొని వెళ్ళి పంటచేల మాటున దాక్కున్నారు. మానవ హననం ముగిశాక సైన్యం కొంత సమూహాన్ని అక్కడ వదిలి ఎస్ది వైపు కొనసాగింది. అక్కడి నుండి మంజీరా కాజ్‌వే దాటి లాతూర్ బీదర్ వైపు వెళ్తున్నట్లు తెలిసింది. కానీ మరుసటి రోజు ఈ దళం పురోగమించిన సంగతి పెద్దగా తెలియరాలేదు. కాజ్‌వేకు బీదర్ వైపునకు రక్షణ దళాలు బాగానే ఉన్నందున భారత దళాలను కొంత వరకు అడ్డుకోగలవని భావించబడ్డది. నల్‌దుర్గ్ పతనం తర్వాత భారత సైన్యాలు లాతూర్ వైపుగా పెద్ద మొత్తంలో దాడికి పాల్పడకపోవచ్చని భావించబడ్డది. అందువల్ల అక్కడి రక్షణ దళాలలోని కొంత భాగాన్ని మరియు 25 పౌండర్ ఫీల్డుగన్‌లను వెనక్కి రప్పించి బీదర్ వద్ద ఉంచమని ఆర్మీ కమాండర్‌కు చెప్పాను. ఇంకా వీలైతే వాటిని జహీరాబాద్ కొండల మాటున ప్రభావవంతమైన రక్షణ కోసంగాను జహీరాబాద్‌కు రప్పించమని కూడా కోరాను. ఆయనకు అది నచ్చలేదు. ఒకవేళ భారత సైన్యాలు బీదర్ ద్వారా వచ్చి ముందుకు సాగితే వారికి ఒకటికంటే ఎక్కువ దారుల ద్వారా రాజధానికి వచ్చే అవకాశం ఏర్పడుతుందని ఆయన వాదించాడు. అప్పుడు ఆ దళాలు ఏ మార్గంలో వెళ్ళనున్నాయో అంచనా వేసి ఆ మార్గంలో రక్షణ దళాలను మోహరించడం కష్టమని చెప్పాడు. ఆయన వాదనను చివరగా నేను అంగీకరించాను. ఆయన ప్రణాళిక ప్రకారం పని చేసుకొమ్మని చెప్పాను.

నల్‌దుర్గ్ లోయను దాటిన భారత దళంలోని ప్రధాన భాగం మధ్యాహ్నానికల్లా హుమ్నాబాద్ వైపు రాగలదని అంచనావేయడం జరిగింది. కానీ అది ఉత్తరంగా ప్రయాణించి కళ్యాణి వైపు రోడ్డెక్కిందని తెలిసింది. ఈ ఊహించని పరిణామంతో ఏమీ అర్థం కాలేదు. అది రవాణా యోగ్యం కాని పూర్తి కచ్చా రోడ్డు, ట్యాంకులు కాని, లారీలు కానీ పోవడం చాలా కష్టం. కళ్యాణి వైపు ప్రయాణించడంలో వారి ఉద్దేశ్యం ఏమై ఉంటుంది? కళ్యాణి నుండి ఎలాంటి సమాచార వ్యవస్థ లేదు. ఆ ప్రాంతంలో రేడియో సంకేతాలు కూడా లేవు. మేమంతా అంచనాల్లో మునిగిపోయాం.

మధ్యాహ్నం వాయువ్య సరిహద్దులో పెద్ద పట్టణం అయిన ఔరంగాబాద్. భారత దళాల వశమైందన్న దుర్వార్త వచ్చేటప్పటికి నేను నిజాం వద్ద ఉన్నాను. ఈ ప్రకంపనతో మేము నిశ్చేష్టులం అయ్యాం. కొద్ది నిమిషాలు నోట మాట రాలేదు. నిజాం కళ్ళ నుండి రెండు కన్నీటి బిందువులు రాలి పడ్డాయి. నాది కూడా అదే స్థితి. కానీ నా అంతరంగ వేదనను బయటపడకుండా అణుచుకున్నాను. ఆత్మ విశ్వాసం కోల్పోయినందుకు నిజాం దాదాపు క్షమాపణ కోరాడు. నేనక్కడి నుండి రక్షణ కేంద్రానికి వెళ్ళిపోయాను. ఉత్తరం నుండి, పడమర నుండి తేలికపాటి ట్యాంకులతో కూడిన వాహన దళాలు చొచ్చుకు వస్తూ ఉన్నప్పటికి, జాల్నా ఇంకా మన అధీనంలోనే ఉందని తెలిసింది. సాయంత్రానికో రేపటికో అది వారి వశమైపోతుంది అన్న సంగతి అర్థమైంది. అక్కడ రక్షణ చర్యలు ఏమీ లేవు. ఇంకొక దళం పడమర నుండి బీదర్ వైపు దూసుకొని వస్తుంది. బీదర్ కూడా వశమైనట్టే అనిపించింది.

ఆర్మీ కమాండర్ గత 36 గంటలుగా తన డెక్ మీదే ఉన్నాడు. కొంత విశ్రాంతి తీసుకొమ్మని నేను చెప్పాను. కంట్రోల్ రూంలో ఉన్న మంచం మీద ఆయన ఒరిగాడు. నేను బాధ్యత తీసుకున్నాను. ముఖ్యమైన అవసరం వస్తే మాత్రం నిద్రలేపుతానని చెప్పాను.

తూర్పు వైపు నుంచి కొత్త వార్తలు రాజొచ్చాయి. తూర్పు వైపున వైరా, పాలేరు కాలువలు రక్షణగా ఉన్నాయి. వాటిలోకి పూర్తిస్థాయిలో నీటిని విడుదల చేయమని ఆదేశించాను. కిందిస్థాయిలో కాలువలను తెగ్గొట్టమని చెప్పాను. చెప్పిన పని విజయవంతంగా కార్యరూపంలో పెట్టారు. పెద్ద మొత్తంలో నల్ల మట్టి నేలలు నీళ్ళలో మునిగిపోయాయి. కొన్ని చోట్ల రోడ్లు తెగిపోయాయి. భారత దళాల పురోగమనాన్ని అవి నిరోధించాయి. నిజానికి కొన్ని ట్యాంకులు, చాలా రవాణా వాహనాలు అక్కడ

చిక్కుబడి పోయాయి. ఇలా నీట మునిగిన ప్రాంతాలు కొద్దిగా సూర్యాపేటకు తూర్పు వైపున ఉన్నాయి. కానీ దక్షిణం వైపు ఎక్కువగా మునగలేదు. మిగతా భారత సైనిక దళాలు హుజూరాబాద్ – మిర్యాలగూడ రోడ్డు ద్వారా మూసీ కాజ్‌వేను దాటాయి. మూసీకి పడమటి భాగంలో ఉన్న రక్షణ దళాలు చాలా శక్తిహీనంగా మారిపోయాయి. నిజానికి అక్కడ రక్షణ దళాల వార్తలేవీ మాకు అందలేదు. దూసుకొస్తున్న దళాలకు రెండు ప్రత్యామ్నాయపు దారులున్నాయి. ఈ దళం ఉత్తరంగా ప్రయాణించి నల్లగొండ, నకిరేకల్లు ద్వారా సూర్యాపేట నుంచి వచ్చే ప్రధాన దళానికి కలవవచ్చు. లేదా పడమరగా ప్రయాణించి ఏదేని రోడ్డు ద్వారా రాజధాని చేరవచ్చు.

కానీ, దండయాత్ర రెండవ రోజు చీకటి పడేదాక ఆ దళం యొక్క పురోగమనం పెద్దగా నమోదు కాలేదు. అదే సందర్భంలో సూర్యాపేట – నకిరేకల్ రోడ్డులో మూసీ నది మీద ఉన్న వంతెనలన్నీ పేల్చివేయమని ప్రజాపనుల శాఖ సివిల్ ఇంజనీర్లను నేను ఆదేశించాను. రెండు వంతెనలను విజయవంతంగా పేల్చి వేశారు కూడా. హిమాయత్‌సాగర్ వరద గేట్లను ఎత్తివేయమని తద్వారా నది దిగువభాగంలో దళాల గమనాన్ని నిరోధించమని ఆదేశించాను.

సంఘటనల్ని సమీక్షించడానికి కొద్దిసేపు మంత్రి వర్గ సమావేశాలు జరిగాయి. సాయంకాలం మరొకసారి నిజాంను కలిశాను. మధ్యాహ్నం కంటే తక్కువ ఆందోళనతో కనిపించాడాయన. కొత్త సమాచారమంతా నివేదించాను. ఆయన విన్నాడు. అంత నిరుత్సాహంగా సమాచారం స్వీకరించడం ఆయన్ని మొదటి సారి చూశాను. మళ్ళీ రక్షణ కేంద్ర కార్యాలయానికి వచ్చాను. కొన్ని గంటల విశ్రాంతి తరువాత ఆర్మీ కమాండర్ మళ్ళీ విధుల్లో చేరాడు. ఖాసీం రజ్వీ వచ్చాడు. మొట్టమొదటిసారి ఏమైనా రజాకార్లు కార్యరంగంలోకి దిగడానికి సిద్ధంగా ఉన్నారా అని అడిగాను. దక్షిణ ప్రాంతంలో తూర్పు ప్రాంతంలో వినియోగించడానికి ఎలాంటి సైన్యం లేకపోవడం వల్ల అలా అడగడమొక్కటే మార్గమైంది. అతను వెంటనే స్పందించాడు. కావలసినంత మందిని ఇస్తానన్నాడు, కానీ ఆయుధాలు మాత్రం తప్పక కావాలన్నాడు. నాలుగైదు ప్రాంతాలు తిరిగేసి మళ్ళీ వచ్చాడు రజ్వీ. దాదాపు నాలుగు బెటాలియన్ల రజాకార్లు అవసరాన్ని బట్టి ఏ దిశకు పోవడానికైనా సిద్ధంగా ఉన్నారని చెప్పాడు. తన సొంత కొడుకులిద్దర్ని మొదటి బెటాలియన్‌లో చేర్చాడు. ఆ బెటాలియన్‌ను ప్రమాదం ఎక్కువగా ఉన్న ప్రాంతానికి పంపించమన్నాడు.

అర్ధరాత్రి దాటాక ఆర్మీ కమాండర్ నన్ను ఇంటికి వెళ్ళి కొద్దిగా విశ్రాంతి తీసుకొమ్మని చెప్పాడు. మిగిలిన రాత్రంతా పెద్దనష్టమేమీ జరగదని చెప్పాడు. అక్కడ్నుంచి నా కార్యాలయానికి వెళ్ళాం. అక్కడ నా వ్యక్తిగత సిబ్బంది కరాచీలోని హైద్రాబాద్ ఏజెంట్ జనరల్ ముస్తాఖ్ అహ్మద్ పంపిన సందేశాలలోని సంకేత భాషను పరిష్కరిస్తూ కనిపించారు. నిజానికి అతనొక్కడే నిస్తంత్రీ సందేశంతో హైద్రాబాద్‌ను ప్రపంచంతో కలిపి ఉంచుతున్నాడు. అతనికి ఉన్న సిబ్బంది చాలా తక్కువ. తన కుటుంబ సభ్యులతోనే అతను సంకేత భాషను డీకోడ్ చేసుకుంటూ ఉంటాడు. అతను గంటగంటకూ సమాచారాన్ని ఇస్తూ తీసుకుంటూ లండన్‌లోని ఏజెంట్ జనరల్ మీర్ నవాజ్ జంగ్ ప్రతినిధి బృందానికి సమాచారం ఇస్తూ ఉంటాడు. నరాలు తెగే ఉత్కంఠ పూరితమైన ఉద్యోగం ఆయనది. హైద్రాబాద్ సమాచారాన్ని పాకిస్తాన్ ప్రభుత్వానికి అందజేసి అవసరమైన సహకారాన్ని అందించడం కూడా ఆయన బాధ్యతే. హైద్రాబాద్‌కు కావలసిన ఆయుధ సేకరణ బాధ్యత కూడా ఆయనదే. మా ఇద్దరి మధ్య అనేక సందేశాల ఆదాన ప్రదానం జరుగుతుంది. అతి తక్కువ మంది సిబ్బందితో 24 గంటలూ పని చేస్తూ ఒక్క ప్రయత్నమూ విడవకుండా పని చేస్తాడు.

హైద్రాబాద్ రక్షణవిధానంలోని ప్రత్యేకత దృష్ట్యా బలానికి వ్యతిరేకంగా ఐరాస ముందు హైద్రాబాద్‌కు ఉన్న ఆశ, నమ్మకం. భద్రతా మండలి సకాలంలో తీసుకోగలిగే చర్య ఒక్కటే హైద్రాబాద్‌కు ప్రాణభూతమైంది. భద్రతా మండలి పారిస్‌లో సమావేశంలో ఉంది. సెప్టెంబర్ 13న హైద్రాబాద్ ప్రతినిధి బృందం పారిస్ చేరుతుంది. భారత దాడి ఒక వారం తరువాత మొదలౌతుందని ఆశించడం జరిగింది. జిన్నా మరణం వలన హైద్రాబాద్ ప్రతినిధి బృందం కరాచీ నుంచి బయలు దేరడం ఆలస్యమైంది. బయలుదేరే ముందు జిన్నా మరణం వలన భారత్ ప్రయత్నాలను వేగిర పరుస్తుందని మోయిన్ నవాజ్ జంగ్ హెచ్చరించాడు. ఏది ఏమైనా ప్రతినిధి బృందం ఒక్క నిమిషాన్ని కూడా వృధా చేయదు. లండన్‌కు వెళ్తూ మార్గ మధ్యంలో కైరోలో ఆగినప్పుడు భారత సైన్యాలు దాడిని ప్రారంభించాయని ఆయనకు సమాచారం అందింది. అతను వేగంగా లండన్ చేరడం కోసం మరో విమానం ఎక్కాడు. దురదృష్టం కొద్దీ ఆ విమానం ఇంజన్ సమస్య వల్ల కొన్ని గంటలు ట్రిపోలిలో ఆగిపోయింది. తరువాత ప్రతినిధి బృందం 13వ తేదీ సాయంత్రం లండన్ చేరింది. అక్కడి నుండి మొదట అందుబాటులో ఉన్న విమానం ఎక్కి 14వ తేదీ ఉదయానికి పారిస్ చేరింది. పారిస్ చేరిన ప్రతినిధి బృందం కార్యదర్శి జహీర్ అహ్మద్‌ను, మాంక్‌టన్ చొరవ వల్ల

నియమించబడ్డ ప్రొఫెసర్ లాటర్ పట్‌ను కలిసింది. అక్కడ అదనంగా కోవర్డ్ ఛాన్స్ అండ్ కంపెనీ ప్రతినిధులు, మాంక్టన్ నియమించిన ప్రొఫెసర్ కూడా  ఉన్నారు. అక్కడికి చేరగానే ఐరాస సెక్రటరీ జనరల్ సోబోలెవ్‌తో మోయిన్ నవాజ్ జంగ్ సంబంధాన్ని ఏర్పరచుకున్నాడు. కావాల్సిన పత్రాలు, విధి విధానాలు వేగంగా పూర్తి చేశాడు. 16వ తేదీ మధ్యాహ్నం భద్రతా మండలి తదుపరి సమావేశం ఉంది. మాంక్టన్ ఎప్పుడవసరమైతే అప్పుడు పారిస్‌కి రావడానికి సిద్ధంగా ఉన్నాడు.

సెప్టెంబర్ 15వ తేదీ తూర్పు దిశ నుండి అతిపెద్ద ప్రమాదం ముంచుకొచ్చింది. పడమటి నుంచి కొన్ని వార్తలు వచ్చాయి. భారత ప్రధాన దళం దాలం నుంచి కళ్యాణి చేరింది. నిజాం ఆ ఉదయం చాలా ఆందోళనగా కనిపించాడు. ఆర్మీ కమాండర్‌ను పిలిపించి పరిస్థితిని నిరుత్సాహంగానే సమీక్షించాం. ఆర్మీ కమాండర్ ధైర్యంగా కనిపించలేదు. భద్రతా మండలి ఏదైనా నిర్ణయం తీసుకునే వరకు హైద్రాబాద్ సైన్యాలు భారత్‌ను నిలువరించగలుగుతాయా అని నిజాం నన్ను అడిగాడు. భద్రతా మండలి వారం రోజులకంటే ముందు ఏ నిర్ణయమూ తీసుకోలేదు అని అంతవరకు భారత్‌ను నిలువరించడం మన బాధ్యత అని నేను చెప్పాను. పడమటి వైపునుండి వచ్చే దళాలను అంతవరకు నిలువరించవచ్చు కాని తూర్పు వైపు నుంచి వచ్చే భారత సైన్యాన్ని అడ్డుకోవడానికి తగినంత సైన్యం లేదని ఆర్మీ కమాండర్ చెప్పాడు. ఏదేమైనప్పటికీ వారం రోజుల వరకు భారత్ సైన్యాన్ని రాజధాని వరకు రాకుండా నిలువరించడం అసాధ్యమేమీ కాదన్నాడు.

కొద్దిసేపు మంత్రివర్గ సమావేశం జరిగింది. ఆ తర్వాత భారత సైన్యాలు చారిత్రాత్మక బీదర్ నగరపు మీనార్‌లకు కనుచూపు మేరలో ఉన్నాయని ఢిల్లీ రేడియో ప్రకటించిందని తెలిసింది. ఆ వార్తను నేను నమ్మలేదు. నేరుగా రేడియో వార్త వినడానికి పక్క గదిలోకి వెళ్ళాను. ఆ వార్త బులిటన్ మొత్తం హైద్రాబాద్‌లో మోహరించిన భారత సైన్యాల గురించే ఉంది. చివరగా చారిత్రాత్మక బీదర్ నగర మీనార్‌లు టవర్ల సమీపానికి భారత సైన్యం చేరిందని ముగించింది. మళ్ళీ నేను డెక్ వద్దకు రాగానే ఆర్మీ కమాండర్ నుండి ఫోన్ వచ్చింది. పెద్ద సైనిక పటాలం కళ్యాణి – బీదర్ రహదారి మీద నడుస్తున్నట్లు సమాచారం వచ్చిందని ఆయన చెప్పాడు! గోడకు వేలాడదీసిన దేశ చిత్ర పటాన్ని చూశాను. అక్కడ రోడ్డు లేదు. వెంటనే రహదారుల చీఫ్ ఇంజనీర్‌కు ఫోన్ చేసి బీదర్ – కళ్యాణి మధ్య రహదారి ఉందా అని అడిగాను. అవును, ఉన్నదన్నాడు. మంచి రోడ్డు ఇటీవలే పూర్తి అయిందని చెప్పాడు. ఆ రోడ్డు

కొత్తగా వేసే మ్యాపులో చూపిస్తామని చెప్పాడు. దేవుడా! ఆ రోడ్డు పూర్తయి ప్రజావాడకానికి వదిలినట్లు తెలియదు. ఆర్మీ కమాండర్‌కు కూడా తెలియదు, నిఘా వ్యవస్థకూ తెలియదు. ఒక్క భారత సైన్యానికి మాత్రం తెలుసు!

ఇది నాకొక ఆశనిపాతం. బీదర్ ఒక సరఫరా కేంద్రం. బీదర్‌లో యుద్ధ దళాలు లేవు. కళ్యాణి బీదర్‌కి మధ్య దారి చాలా దుర్గమంగా ఉంది. భారత సైన్యాల రాకకు అననుకూలంగా ఉంది. అక్కడ ఎలాంటి రక్షణ లేకపోవడం వల్ల భారత్ సైన్యాలు చాలా సులభంగా బీదర్ చేరాయి. బీదర్ రావడం వల్ల లాతూర్ – బీదర్ కాజ్‌వేలో రక్షణ దళాన్ని తప్పించుకొని కొద్దిగంటల్లో గట్టి స్థానమైన హుమ్నా బాద్‌కు చేరుతుంది. పరిస్థితి క్లిష్టమైపోయింది. బీదర్‌కు జహీరాబాద్ కేవలం 12 మైళ్ళ దూరం. జహీరాబాద్ నుండి హుమ్నాబాద్‌కు 40 మైళ్ళు. అంతా గందరగోళంగా మారింది. సాధారణ స్థితిలో నియంత్రణ చేయలేక పోయిన ఆర్మీ కమాండర్ ఇప్పుడు చక్కదిద్దగలడా?

నేను వెంటనే ఆర్మీ కేంద్రానికి వెళ్ళి సాధారణ సిబ్బంది ఆర్మీ అధికారులతో సమావేశమయ్యాను. లాతూరు విభాగం పరిసమాప్తమైంది. బీదర్ తప్ప వారికి మరో మార్గం లేదు. ఒకటే ప్రశ్న. హుమ్నాబాద్ బెటాలియన్‌ను జహీరాబాద్ – హైద్రాబాద్ రహదారి మీద రక్షణ కోసం జహీరాబాద్‌కు తరలించగలమా? అక్కడ మాత్రమే రక్షణ చర్యలకు అవకాశముంది. వేరే దళాలేవీ సిద్ధంగా లేనందున హుమ్నాబాద్ దళాన్ని జహీరాబాద్‌కు తరలించడమొక్కటే ఏకైక మార్గం.

హుమ్నాబాద్ దళం బాగా అలసిపోయి ఉన్నందున తెల్లవారేలోగా 50 మైళ్ళ దూరంలో ఉన్న జహీరాబాద్‌కు తరలడం కష్టమని ఆర్మీ కమాండర్ అభిప్రాయ పడ్డాడు. ఇతర అధికారులు మాత్రం అది కష్టమేమీ కాదన్నారు. భారత సైన్యం కూడా బాగా అలసిపోయి ఉందని అది కూడా బీదర్‌ను దాటి రావడం కష్టమని హైద్రాబాద్ సైన్యంతో జహీరాబాద్‌లో తలపడలేవని అభిప్రాయపడ్డారు. చివరగా 25 పౌడర్ గన్స్ మరియు ఇతర భారీ ఆయుధాలతో హుమ్నాబాద్ దళాన్ని జహీరాబాద్ దగ్గర ఉన్న కొండల ప్రాంతానికి తక్షణం ప్రయాణించాల్సిందిగా హుమ్నాబాద్ దళాన్ని ఆదేశించాను. తక్షణం బీదర్‌ను ఖాళీ చేయమని సాధ్యమైన అన్ని సరుకుల్ని అక్కడ్నుంచి తరలించమని కూడా ఆదేశించాను. ఒకవేళ భారత సైన్యాలు జహీరాబాద్‌కు రాకుండా బీదర్ నుండి వేరే మార్గం ద్వారా నేరుగా రాజధానికి వస్తే పరిస్థితి ఏమిటన్న ప్రశ్న తలెత్తింది. ఒకవేళ అలా జరిగితే అది మన దురదృష్టం. ఏది ఏమైనా మనకు ఇతర



రహదారుల మీద రక్షణ చేయగలిగే అవకాశం లేదు. చివరిగా ఆర్మీ కమాండర్, భారత సైన్యాలు జహీరాబాద్ ద్వారానే వచ్చే అవకాశం ఉందని చెబుతూ, అక్కడే రక్షణ చర్యలు చేపట్టాలని అన్నాడు.

ఆదేశాలిచ్చాక నా కార్యాలయానికి వచ్చాను. సంఘటనలు పూర్తి వ్యతిరేక మార్గంలో పోతున్నందున ఎలాంటి ప్రణాళికలు వేయాలో అర్థం కాలేదు. భద్రతా మండలి ఇక్కడ సంఘటనలు జరుగుతున్నంత వేగంగా స్పందిస్తుందా? కొద్దిసేపు ఆలోచించాక నాకు రెండే ప్రత్యామ్నాయాలు కనిపించాయి. ఒకటి : భారత్‌కు ఒక నివేదన ప్రసారం చేస్తూ రక్తపాతాన్ని ఆపమని భారత్ ప్రతిపాదించే న్యాయమైన విధానాన్ని అంగీకరిస్తామని కోరడం. ఒకవేళ ఆ ప్రసారానికి స్పందన లేకపోతే చివరి దాకా పోరాడటం. రెండవది : ఆయుధాల్ని వదిలేసి పోరాటాన్ని ఆపడం. మొదటి దాని ప్రకారం 15వ తేదీ మధ్యాహ్నం హైద్రాబాద్ రేడియోలో భారత నాయకులకు ఆ విజ్ఞప్తి చేశాను. ముస్తాఖ్ అహ్మద్‌కు కూడా ఒక సందేశం పంపిస్తూ తక్షణం పాకిస్తాన్ ప్రభుత్వాన్ని స్పందించమని ఉన్న పరిస్థితులకు అనుగుణంగా ఏదో ఒక అవగాహన కుదర్చడం కోసం మధ్యవర్తిత్వం నెరపమని, కోరమని అడగడం జరిగింది. నా విజ్ఞప్తి ప్రసారాన్ని అనేక మార్లు పునఃప్రసారం చేసినా ఢిల్లీ రేడియోలో ఆనాటి అర్ధరాత్రి వరకు దాని ఊసే ఎత్తలేదు.

నిజాంను సాయంకాలం కలిశాను. ఆ తరువాత కూడా కలిశాను. గంట

గంటకూ అతని ఆందోళన మారుతూ వచ్చింది. ఆయన చాలా ఆందోళనలో పడిపోయి ఆత్మ విశ్వాసం కోల్పోయాడు. భద్రతా మండలి ఏదైనా చేస్తుందని ఇంకా నమ్ముతున్నావా అని నన్నడిగాడు. ఉదయం నుంచి అటువైపు నుంచి వార్తలేమీ లేనందున ఏమీ చెప్పలేక పోయాను. ఇంకా ఆశ ఉందని సాధ్యమైనంత వరకు పరిస్థితిని ఎదుర్కోవాలని చెప్పాను.

తూర్పున, దక్షిణాన పరిస్థితులు సంతృప్తికరంగా ఏమీ లేవు. కానీ పడమటి దిశ కన్నా కొంత నయం. నేను అర్ధరాత్రి ఆర్మీ కేంద్రానికి వెళ్ళేసరికి కమాండర్ నిద్రిస్తున్నాడు. మిగిలిన సిబ్బంది ఎప్పటిలాగానే చురుకుగా ఉన్నారు. కొత్త సమాచార మేమీ లేదు. అర్ధరాత్రి ఏదీ జరిగి ఉంటుందని అనుకోలేం. ముస్తాఖ్ అహ్మద్ పొడవాటి అంటీ ట్యాంక్ గన్‌లను రెండు ఏర్‌క్రాఫ్ట్ లలో పంపించగలిగాడు. వాటిని దించుకోవడం కొంచెం కష్టమైంది. ఎలాగోలా దించి ఆర్మీ కేంద్రానికి తెచ్చి బిగించారు. నేను వాటిని చూశాను. అవి కొద్దిరోజుల ముందు వచ్చుంటే బాగుండేది. వాటిని ఎలాంటి పెద్ద ఆయుధాలు లేని తూర్పు రక్షణ దళాలకు పంపించాం.

# 33. దిగజారిన అంతర్గత పరిస్థితి

హైద్రాబాద్ సాయుధ సైనిక చర్య ప్రపంచవ్యాప్తంగా అన్ని పత్రికల్లో పతాక శీర్షికగా వచ్చింది. పారిస్‌లో సమావేశంలో ఉన్న ఐరాస భద్రతామండలి పత్రికల ద్వారా, దాని స్వంత యంత్రాంగం ద్వారా హైద్రాబాద్, భారత్ ప్రతినిధి బృందాల ద్వారా పరిస్థితిని అవగతం చేసుకుంది. కొన్ని సమూహాలను మినహాయిస్తే భారత దండయాత్రను అందరూ ఖండించారు. ఇంగ్లాండు, అమెరికాలలో ప్రజాగ్రహం గట్టిగా పెల్లుబికింది. ప్రపంచ వ్యాప్తంగా ప్రతి దేశంలో వ్యక్తమైన ప్రజాభిప్రాయానికి అనుగుణంగా భద్రతామండలి వేగంగా క్రియాశీలకంగా చర్యలు తీసుకోవలసి ఉంది.

పారిస్ పరిస్థితులు కొద్దికొద్దిగా తెలుస్తున్నాయి. సెప్టెంబర్ 16న భద్రతా మండలి హైద్రాబాద్ సమస్యను చర్చించడానికి సమావేశమవుతూ ఉంది. మోయిన్ నవాజ్ జంగ్ ఆయన సహచరులు భద్రతామండలి సభ్యులకు హైద్రాబాద్ సమస్య మీద అవగాహన కలిగించడానికి శతవిధాల ప్రయత్నిస్తున్నారు. భారత్ అనుకూల వైఖరి అనుసరిస్తున్న జాతీయ చైనా ప్రతినిధులు, ఏ కచ్చితమైన అభిప్రాయం లేని రష్యా తప్ప మిగిలిన సభ్యులందరూ భారత్ దాడికి తీవ్ర వ్యతిరేకంగా ఉన్నారు. రామస్వామి మొదలియార్ ఆధ్వర్యంలో భారత ప్రతినిధి బృందం పూర్తిగా సంసిద్ధమై వచ్చింది. వాళ్లు తెర వెనుక ప్రయత్నాలలో కూడా చురుకుగా ఉన్నారు. భద్రతా మండలి కచ్చితంగా ఏ చర్య తీసుకుంటుందీ ఊహించలేకపోయినప్పటికీ అందరు సభ్యులకు విషయం పూర్తిగా అవగతమై ఉన్నందున భారత్ దాడికి ముగింపు పలకడానికి అవకాశం ఉన్నట్లు అనిపించింది. ఇంగ్లండ్, అమెరికా, ఫ్రాన్స్, సిరియా, అర్జెంటినా, కెనడా ప్రతినిధులు భారత దాడికి వ్యతిరేకంగా ఉన్న తమ ఆమోదాన్ని ఉప

సంహరించుకోవడానికి తిరస్కరించగా చైనా తప్ప మిగిలిన దేశాలన్నీ పెద్దగా వ్యతిరేకించలేదు.

మూసీ మీద సెప్టెంబర్ 15వ తేదీ వంతెనను పేల్చకముందు సూర్యాపేట వద్ద ఉన్న రక్షణ దళాలు పడమటి తీరానికి సర్దుకున్నాయి. తూర్పు నుండి వస్తున్న భారత దళాల రాకను అడ్డుకోవడం కోసం మూసీ వంతెన ప్రాంతం నీటిలో మునిగిపోవడానికి గాను హిమాయత్ సాగర్ వద్ద గేట్లను తెరిచి పెట్టడం జరిగింది. హిమాయత్ సాగర్ చెరువుకు ఈ బ్రిడ్జికు మధ్య 100 మైళ్ళ దూరం. ఆ నీళ్ళు వంతెన వద్దకు చేరుకోవడానికి మూడు రోజుల సమయం పడుతుంది. వంతెన వద్ద భారత దళాల నడకను అడ్డుకోవడానికి కావలసినంత నీరు వదిలితే హిమాయత్ సాగర్ పూర్తిగా ఖాళీ కావాలి. ఆ రకంగా అది వ్యర్థ ప్రయత్నం. ఏదైనా ప్రయోజనం ఉంటే ఆ వరద గేట్లు తీసి పెట్టమని ఆర్మీకమాండర్‌కు చెప్పాను.

నది పొంగి పొర్లుతుందని ఆయన ఆశాభావంతో ఉన్నాడు. అక్కడి రక్షణ దళాలను నకిరేకల్లుకు రావలసిందిగా ఆయన ఆదేశించాడు. ఆయన ఉద్దేశం ప్రకారం రక్షణ దళాలు నకిరేకల్లులో ఉండి అటు సూర్యాపేట నుండి ఇటు మిర్యాలగూడ నల్లగొండల నుండి వచ్చే భారత దళాలను అడ్డుకోవచ్చు. ధ్వంసమైన వంతెన దగ్గరి స్థలం ఎలాంటి రక్షణ ఇవ్వలేకపోయింది. మేమిలా చర్చల్లో ఉండగానే భారత దళాలు ధ్వంసమైన వంతెన స్థానంలో తాత్కాలిక వంతెనను నిర్మించుకుని నదిని దాటుతున్నాయని సమాచారం వచ్చింది. భారత దళాల పురోగమనాన్ని నిరోధించడం కోసం పడమటి తీరంలో చిన్న సైన్య సమూహాన్ని ఉంచితే బాగుండేదని ఆర్మీ కమాండర్ అన్నాడు.

సెప్టెంబర్ 16వ తేదీ ఉదయం భారత సైన్యాల ప్రధానదళం బీదర్‌ను దాటింది. మధ్యాహ్నానికి బీదర్ – జహీరాబాద్ రోడ్డులో నడుస్తూ ఉంది. ఈ సమయానికి హుమ్నాబాద్‌లో ఉన్న 25 పౌండర్ గన్నులు, రక్షణ దళాన్ని జహీరాబాద్‌కు రప్పించి బీదర్ లో క్యాంపు చేసిన బ్రిగేడియర్ ఆధీనంలో ఉంచడం జరిగింది. కొండల్లో నక్కి చివరి దాకా పోరాటం చేయమని ఆదేశించడం జరిగింది. కనీసం హుమ్నాబాద్ నుంచి దళాన్ని రప్పించి భారత సైన్యానికి ఎదురు నిలుపగలగడం ఉత్సాహాన్నిచ్చింది. జహీరాబాద్ భూభాగం హుమ్నాబాద్ లాగే అనుకూలంగా ఉంటుంది. రక్షణ దళాన్ని సరిగ్గా ఉపయోగించ గలిగితే కావలసినంతగా భారత్‌ను నిరోధించగలుగుతాం.

నేను ఉదయం మధ్యాహ్నం కూడా నిజాంను కలిశాను. మాట్లాడాను. ఆయన

రోజులాగా మౌనంగా ఉండలేదు. భారత నాయకులకు రేడియో ద్వారా నేను చేసిన విజ్ఞప్తిని ఢిల్లీ పట్టించుకోలేదు. భారత దళాలు అనూహ్యంగా పురోగమిస్తున్నప్పుడు భారత ప్రభుత్వం నా ప్రకటనకు స్పందించదని నిజాం భావించాడు. పాకిస్తాన్ కూడా వ్యూహాత్మకంగా కానీ, రాజకీయంగా కానీ, పెద్దగా ఏమీ చేయలేదని ఇద్దరమూ భావించాము. భారత ప్రధాన సైనిక దళాలన్నీ హైద్రాబాద్‌లో ఉన్నందున కాశ్మీర్ రాష్ట్రాన్ని నియంత్రించగలిగిన పఠాన్ కోట్ – జమ్మూ రోడ్డును ఆక్రమించడం ద్వారా కాశ్మీర్ విషయంలో పాకిస్తాన్ ఆధిపత్యం సాధించగలిగే అవకాశం లేదా? అది పాకిస్తాన్‌కు ఉపయోగపడుతుంది. కానీ, హైద్రాబాద్‌కు ఏమీ లాభం లేదు అన్నాడు నిజాం. ఏది ఏమైనా జిన్నా తరువాత పాకిస్తాన్‌ను అంత ధైర్యంగా ముందుకు నడిపేవారు ఎవరూ లేరు. ఇక మిగిలిందల్లా ఐరాస భద్రతాసమితి కలగజేసుకోవడమే. అప్పటిదాకా భారత దూకుడును నియంత్రించడం గురించి నిజాం ఏమీ మాట్లాడలేదు.

కొద్దిసేపు మంత్రివర్గ సమావేశం జరిగింది. భద్రతా మండలి తీసుకునే చర్యల గురించి చర్చించడం జరిగింది. మంత్రి వర్గంలో మిశ్రమాభిప్రాయం వ్యక్తమైంది. ఆ మధ్యాహ్నం పారిస్‌లో జరిగే భద్రతామండలి సమావేశపు ఫలితాల కోసం అందరమూ ఎదురుచూడసాగాం. ఆర్మీ కమాండర్‌కు పారిస్ సమాచారం అందిస్తూ వచ్చాం. ఆయన ప్రాధాన్యత ఆయనకు ఇప్పుడు బాగా అర్థమైంది. దక్షిణం నుండి వస్తున్న భారత సైన్యాలు తూర్పు నుండి పడమర దిశగా ప్రయాణిస్తున్నాయని తెలిసింది. అవి నల్లగొండ ద్వారా వెళ్ళి సూర్యాపేట– నకిరేకల్లు రోడ్డులో నడుస్తున్న ప్రధాన దళాన్ని కలుస్తాయా లేక అలాగే పశ్చిమంగా ప్రయాణించి దేవరకొండ – హైదరాబాద్ దారిలో ప్రయాణిస్తాయా తెలియకున్నది. ఈ ప్రాంతంలో ఎలాంటి రక్షణ దళాలు లేవు. కాబట్టి కొంత మంది సైనికాధికారులతో వీలైనంత మంది రజాకార్లను పంపి ఈ తేడాను అధిగమిద్దామనుకున్నాను. రవాణా, సరుకులు, ఆహార పదార్థాలు, పౌర అధికారుల ద్వారా పంపించాను.వాళ్ళు ఈ పనిని చాలా సమర్థవంతంగా నిర్వహించారు. ఐతే భారత దళాలు ఆ దిశగా రానేలేదు.

హైద్రాబాద్ సైన్యానికి ఆంటీ ట్యాంక్ మైనులు కొద్దిగానే ఉన్నాయి. ఉన్న వాటిని సహేతుకంగా విభజించి జహీరాబాద్ – హైద్రాబాద్ రోడ్డు మీదకు, నకిరేకల్లు – హైద్రాబాద్ రోడ్డుకు పంపించాను. పౌర అధికారులు తెల్లవారే వరకు వాటిని చేరవలసిన ప్రదేశాలకు చేర్చారు. వాటిని ప్రధాన రహదారులకు పక్కన ఉన్న బైపాస్ రోడ్డుకు చేర్చడం కష్టమైన పని.

చేయాల్సింది చాలా ఉంది. సమయం తక్కువగా ఉంది. కాలం వేగంగా పరిగెడుతుంది. నాకు వీలైన సమయంలో రమ్మని నిజాం నుండి పిలుపు వచ్చింది. ఇప్పటికే ఈరోజు 2 సార్లు కలిసి ఉన్నాను. మధ్యాహ్నం పొద్దుపోయాక మళ్ళీ కలిశాను. పొద్దటి రెండు సమావేశాల్లో చాలా ఉదాసీనంగా ఉన్నట్లు అనిపించిన నిజాం ఇప్పుడు ఎప్పటిలా చురుకుగా కనిపించాడు. తాజా పరిస్థితి ఆయనకు వివరించాను. ఆర్మీ కమాండర్‌తో సుదీర్ఘంగా మాట్లాడాడు. ప్రతి అరగంటకూ సైనిక కేంద్రం నుండి టెలిఫోన్ ద్వారా సమాచారం అందుకుంటూ ఉన్నాడు. పారిస్ నుండి భద్రతామండలికి సంబంధించిన వార్త ఎప్పుడు అందుతుందని భావిస్తున్నావని నన్నడిగాడు. పారిస్‌ల సమయం మనకంటే ఐదు గంటలు వెనకబడి ఉంటుందని, అందువల్ల ఇంకొక నాలుగు గంటల తర్వాత భద్రతామండలి సమావేశానికి కూర్చుంటుందని గుర్తు చేశాను. రేపు ఉదయానికి కాని అటునుండి ఏదైనా వార్త వినలేమని అవగాహనకు వచ్చాం. ఇద్దరమూ కాసేపు మౌనంగా కూర్చున్నాం. అతికష్టం మీద నిజాం కొన్ని మాటలు మాట్లాడాడు. తర్వాత మిన్నకుండిపోయాడు. నా అంచనాలన్నీ తప్పాయన్నాడు. “పాకిస్తాన్ ప్రేక్షకుడిగా మిగిలిపోయింది, హైద్రాబాద్ సైన్యాలు నిస్సహాయ ప్రదర్శన చేస్తున్నాయి, భద్రతామండలి ఇంకా సమావేశం కావలసి ఉంది. భారత సైన్యాలు అన్ని వైపుల నుండి రాజధాని వైపు దూసుకొస్తున్నాయి” అన్నాడు నిజాం.తనూ, తన కుటుంబం పెద్ద ప్రమాదంలో పడ్డామని ఇప్పుడు నిజాం భావించారు. ఏదో ఒక నిర్ణయం తీసుకోవలసిన సమయం ఆసన్నమైందని అనుకున్నాడు.

పరిస్థితిని క్షుణ్ణంగా పరిశీలించానని చెబుతూ నాతో నిజాయితీగా మాట్లాడాలను కుంటున్నానన్నాడు. రెండు మార్గాలు కనిపిస్తూ ఉన్నాయన్నాడు. ఒకటి నేను మంత్రి వర్గంతో సహా రాజీనామా చేసి భారత్‌తో కలిసి రాజకీయ నిర్ణయమైనా తీసుకునే అవకాశాన్ని నిజాంకు కల్పించడం. నేను రాజీనామా చేయడానికి అంగీకరించని పక్షంలో నిజాం వ్యక్తిగతంగా ప్రకటన చేస్తూ తనకూ రాజ్యానికీ ఏ సంబంధం లేదని ప్రజావళికి చెప్పడం. తద్వారా తదనంతరం జరిగే పరిణామాలకు నా నాయకత్వంలోని ప్రభుత్వమే బాధ్యత వహించడం. భారత్‌తో కలిసి ఏ రకమైన ఒప్పందం చేసుకోవాలని అనుకుంటున్నారని నేను ఆయనను అడిగాను. తన విచక్షణను ఉపయోగించి చేయగలిగిందంతా చేస్తానని మాత్రమే అప్పుడు చెప్పగలిగాడు. కొంతసేపు ఆగి నా జవాబు ఉదయం తొమ్మిది గంటల వరకు కావాలని చెప్పాడు. అది కూడా స్పష్టంగా, కచ్చితంగా కావాలన్నాడు.



పొద్దటి నుండి నిజాం ధోరణి చూస్తుంటే ఆయనలో ఏదో పెద్ద మార్పు కనిపించింది. అది ఎలా వచ్చిందో తెలియదు. అడిగిన సమయానికి నా జవాబు ఇస్తాను కానీ అది ప్రభుత్వం జవాబు కాబోదన్నాను. నా వ్యక్తిగత అభిప్రాయం తెలియజేస్తాను తర్వాత పది గంటలకు మంత్రి వర్గ సమావేశం ఏర్పాటు చేసి ప్రభుత్వ నిర్ణయం తెలియజేస్తాను అన్నాను. కొద్దిగా ఆశాభంగం చెందినట్లు కనిపించినా తర్వాత ఒప్పుకున్నాడు.

పాలెస్‌కు తిరిగి వస్తూ నిజాం అన్న మాటల్ని నెమరువేసుకున్నాను. సైనిక కేంద్రానికి వచ్చే వరకు నా నిర్ణయం కఠిన వాస్తవాల ఆధారంగా ఉండాలి అనుకున్నాను. నిజాం ఉన్నా లేకున్నా గెలుపునకు ఏ చిన్న అవకాశమున్నా పోరాడాలి అనుకున్నా. అయితే ఇప్పటికే దిగజారి ఉన్న స్థితి నిజాం లేకుండా మరింత దయనీయంగా ఉంటుంది. మిగిలిన సైన్యంతో ఏం చేయగలుగుతాను? ఆర్మీ కమాండర్‌ను ఎలా సంబాళించగలుగుతాను? నేను స్వంతంగా వ్యవహరించగలుగు తానా? నా మదిలో అనేక ప్రశ్నలు.

ఆర్మీ కేంద్రానికి ఎటువైపు నుంచీ కొత్త వార్తలు రాలేదు. కమాండర్ కొద్ది సేపటి కోసం ఇంటికి వెళ్ళాడు. ఇతర సిబ్బందితో నేను చర్చిస్తూ కూర్చున్నాను. భారత దళాల గమన వేగం, రక్షణ దళాల నిరోధ సామర్థ్యాన్ని బట్టి భారతసైన్యం

రాజధాని చేరడానికి కనీసం మూడు రోజులు పడుతుందని వారన్నారు. సకాలంలో ఉపయోగకరంగా భద్రతాసమితి ఏమైనా చేస్తుందోనని వాళ్ళంతా ఆతృతగా ఎదురు చూస్తున్నారు.

కమాండర్ తిరిగి వచ్చాడు. తూర్పులో కొద్దిపాటిగానే రక్షణ దళాలున్నాయని, పడమటి నుండి కంటే తూర్పు నుండి భారత సైన్యం వేగంగా రావచ్చని ఆయన భయపడ్డాడు. ఎక్కడికైనా పంపించడానికి వెయ్యిమంది రజాకార్లు సిద్ధంగా ఉన్నారని ఖాసీం రజ్వీ నాతో చెప్పాడు. రజాకార్లను, పౌరరక్షకులను తూర్పుదిశగా వెళ్లమని ఆదేశించాను. లాండ్ మైన్‌లు పెట్టమని రోడ్డుకు అడ్డంగా కందకాలు తవ్వి భారత సైన్యాలను అడ్డగించమని ఆదేశించాను. జహీరాబాద్ కొండ ప్రాంతంలో రక్షణ దళంలో సైనికుల గురించి కమాండర్‌తో ఆరా తీశాను. ఈ దళాలను బీదర్‌లో ఉన్న బ్రిగేడియర్ ఆధీనంలో ఉంచారు. ఆయన నిర్వహణపై ఆర్మీ కమాండర్ పూర్తి నమ్మకంతో ఉన్నాడు.

దాడి ప్రారంభమైన తర్వాత మొదటి సారిగా రక్షణ దళాలు ఆహారానికి పొట్లాలపై ఆధారపడ్డాయి. మంచి, వేడి ఆహారం తక్షణావసరంగా మారింది. పౌరుల పర్యవేక్షణలో వంటలు చేసి సాయంత్రానికల్లా చాలా చోట్లకు పంపబడింది.

నిజాంకు నాకు మధ్య సాయంకాలం జరిగిన సంభాషణ గురించి లోతుగా యోచించే సమయం దొరకలేదు. ఆర్మీ కేంద్రం నుండి ప్రధాని అధికార నివాసం షామంజిల్‌కు వెళ్ళాను. అక్కడ ముస్తాఖ్ అహ్మద్ నుండి వచ్చిన సమాచారం డీకోడ్ చేయబడి నా కోసం సిద్ధంగా ఉంది. నేను అక్కడికి వెళ్ళేసరికి నిజాం నుండి రెండు మూడు సార్లు ఫోన్ వచ్చింది. తక్షణం రమ్మన్నాడు నన్ను. ముస్తాఖ్ అహ్మద్ పంపిన సమాచారంపై ఒక దృష్టి సారించి నిజాం పాలెస్‌కు వెళ్ళాను. ఏ కొత్త విషయం చెబుతాడో అని భయపడ్డాను.

ఆయన పెద్దగా చెప్పిందేమీ లేదు. నేనాయనకు చెప్పాల్సింది కూడా లేదు. మేం మాట్లాడుకునేంతలో ఆర్మీ కేంద్రం నుండి రెండుసార్లు ఫోన్ వచ్చింది. కొత్త వార్తలేవీ లేవని దాని సారాంశం. మేం మాట్లాడుతూ ఉండగా రెండు విమానాలు చాలా కిందివైపు నుండి పోతూ చెక్కర్లు కొట్టాయి. అవి భారత ఏర్‌ఫోర్సు విమానాలా లేక మా సరఫరా విమానాలా మాకు తెలియదు. కొద్ది సేపట్లో నిజాం పాలెస్ చుట్టూ కొన్ని బ్రెన్‌గన్‌లను జార విడిచినట్లు గమనించాం. తర్వాత కాసేపటికి చప్పుడు తగ్గింది. మన విమానాలను పేల్చివేయడం జరిగిందా అని కంగారు పడ్డాను.

నేను ఆర్మీ కేంద్రానికి వెళ్ళాల్సి ఉంది. నిజాం నన్ను గంటకు కానీ వదలలేదు. సాయంత్రపు సంభాషణ వల్ల నేనెలా ఫీలవుతున్నానని నిజాం అంచనా వేయడానికి ప్రయత్నిస్తున్నాడని నాకనిపించింది. కానీ నేను ఆ చర్చే కాకుండా జాగ్రత్తపడ్డాను. భద్రతామండలి తీర్మానాల వార్త తెలియగానే వెంటనే నివేదిస్తానని నిజాంకు మాట ఇచ్చాను.

మొదటిసారి నాకూ నిజాంకు మధ్య కనిపించని తెర అడ్డుపడుతున్నట్లు అనిపించింది. ఇద్దరమూ మానసిక దూరంలో మాట్లాడుకుంటున్నాం. నాకది బాధే. కానీ బాధపడడానికి సమయం లేదు. ఆర్మీ కేంద్రానికి వచ్చి ఏ దిశ నుండీ కొత్తవార్తలు లేవని తెలుసుకున్నాను. కమాండర్ రూం గంభీరత ఏమీ లేదిప్పుడు. సాధారణ ఉద్యోగులు కమాండ్ రూంలో కూర్చొని వివిధ రకాల పనులు చేస్తున్నారు. ఖాసీం రజ్వీ రజాకార్లను సమకూరుస్తూ రవాణా కోసం తరచూ వచ్చిపోతూ ఉన్నాడు. సైన్యం స్థితి గురించి రజ్వీకి వివరంగా తెలుసు. అయినా ఆయన దాన్ని లెక్కచేయలేదు. ఆయన ఎప్పటిలాగే ఉత్సాహంగా, ధైర్యంగా కనిపించాడు.

# 34. క్షీణించిన సామర్థ్యం, లొంగుబాటు

అర్ధరాత్రి దాటాక పడమటి దళాల బ్రిగేడియర్ ఆర్మీ కమాండర్ గదిలోకి వచ్చాడు. అర్ధరాత్రికంటే ముందు భారత సాయుధదళాల ప్రధాన విభాగం మసక వెన్నెలలో జహీరాబాద్ నుండి హైద్రాబాద్ దిశగా ప్రయాణిస్తుందని చెప్పాడు. యుద్ధటాంకులు దగ్గరకు రావడం వల్ల రక్షకదళాల 25 పౌండర్‌గన్స్ కాల్పులు జరిపి నాలుగు షెర్మాన్ టాంకులను పేల్చి వేశాయి. అప్పుడు భారత దళం నాలుగు భాగాలై జహీరాబాద్ దిశగా వెనకడుగు వేసింది. ఇక రేపు ఉదయం వరకూ భారత దళం ముందుకు కదలలేదని భావించి తదుపరి ఆదేశాలకోసం తాను హైద్రాబాద్ వచ్చినట్లు చెప్పాడు. అతడు ఆందోళనలో ఉన్నట్లు, గందరగోళంగా మాట్లాడుతున్నట్లు అనిపించింది. అతను వెళ్ళిపోయాక అతను చాలా ఆందోళనలో ఉన్నాడని, కమాండ్ చేయలేని స్థితిలో ఉన్నట్లు అనిపిస్తుందని ఆర్మీ కమాండర్ అన్నాడు. ఆర్మీ కేంద్రంలో ఉన్న ఇంకో కమాండర్‌ను పిలిచి బాధ్యత అప్పగించాలనుకున్నాం. అతన్ని పిలిచి అన్ని సూచనలు ఇచ్చాం, పరిస్థితిని వివరంగా చెప్పాం. వెళ్ళేటప్పుడు అతనికి నేనొక వ్యక్తిగత విజ్ఞప్తి చేస్తూ భారతదళాలను ఎట్లాగైనా నిలువరించమని, హైద్రాబాద్ భవితవ్యం ఇప్పుడు తనచేతుల్లో ఉందని చెప్పాను. ఏ అవకాశాన్నీ వదిలిపెట్టనని, చివరిదాకా పోరాడతానని అతను హామీ ఇచ్చాడు. శుభాకాంక్షలు చెప్పాం. అతను తక్షణం వెళ్ళిపోయాడు.

ఇప్పుడు పడమటి దిశ ప్రాధాన్యత సంతరించుకుంది. తూర్పుదిశ నుండి

ఎలాంటి పురోగతి వార్తాలేదు. కొత్త కమాండర్ పడమటిదిశను ఎలా నిర్వహిస్తాడోనన్న చింత నాలో బయలుదేరింది. అర్ధరాత్రి రెండు గంటల ప్రాంతంలో ఆర్మీ కమాండర్‌తో సరిగ్గా ఢీకొనమని, ప్రతి విషయాన్ని వ్యక్తిగతంగా చూసుకొమ్మని చెప్పాను. ఆయన అందుకు అంగీకరించి బయలు దేరడానికి సిద్ధమయ్యాడు. ఆయన బదులు ఒక సీనియర్ అధికారిని కార్యాలయంలో నియమించడం జరిగింది. సాధారణ సిబ్బంది లాండ్‌మైన్‌లకోసం తూర్పు, పడమర దిశల్లో తిరిగుతూ ఉన్నారు. సైన్యానికి సహకరించడంకోసం పౌర ఉద్యోగుల్ని వినియోగించడం జరిగింది.

సెప్టెంబరు 17వ తేది తెల్లవారు జామున నాలుగు గంటలు దాటింది. సాధారణ ఉద్యోగులలోని పెద్దమనుషులు కొందరు నన్ను ఇంటికి వెళ్ళి కొద్దిగా విశ్రాంతి తీసుకొమ్మని సూచించారు. గత రెండు రాత్రుల నుండీ సరిగ్గా నిద్రలేదు నాకు. కొంతసేపయ్యాక ఆర్మీ కేంద్రంనుండి బయలుదేరాను. ఇంటికి వెళ్తూ దారిలో షామంజిల్‌లో ఆగాను. ముస్తాఖ్ అహ్మద్ పంపిన సమాచారాన్ని విశ్లేషిస్తున్న సిబ్బంది రహస్య గదిలోకి వెళ్ళాను. పారిస్ నుండి భద్రతా మండలికి సంబంధించిన సమాచారమేదీ లేదు. పారిస్ సమాచారం ఏదైనా వస్తే వెంటనే నాకు తెలుపమని చెప్పాను. ఇంటికి వచ్చి మంచంమీద ఒరుగుదామనుకుంటుండగా అర్జెంటుగా మాట్లాడడానికి రైల్వే చీఫ్ అధికారి ఫోన్ చేసాడు. బీబీనగర్ నుండి రైల్వేఫోన్ ద్వారా అందిన సమాచారం మేరకు బీబీనగర్ పరిసర ప్రాంతంలో కాల్పుల శబ్దం భారీగా వినిపించిందని భారత సైన్యం బీబీనగర్ హైద్రాబాద్ మార్గంలో రాజధానికి వస్తుందని తెలిసింది.

“ఏంటీ? బీబీనగర్ రైల్వేస్టేషన్ దగ్గర కాల్పులా! భారత సైన్యం బీబీనగర్‌కు ఎలా వస్తుంది?” నేను ఆశ్చర్య పోయాను. అది తనకు తెలియదు కానీ ఆ వార్తను నిర్థారించుకున్నానని భారత దళాలు బీబీనగర్ నుండి హైద్రాబాద్ వైపు పయనిస్తున్నా యని ఆయన చెప్పాడు. బీబీనగర్‌లో భారత సైన్యాలు! రాజధానికి కేవలం ముప్పైమైళ్ళ దూరంలో! పైగా ఎలాంటి రక్షణదళాలు లేని మార్గం! నాకొక పెద్ద షాక్. అంటే నకిరేకల్ వద్ద రక్షణ దళం తుడిచిపెట్టుకు పోయి ఉండాలి. లేదా భారతదళం నకిరేకల్-జనగాం ద్వారా కానీ, నార్కెట్‌పల్లి-భోనగిరి ద్వారా కాని రక్షక దళాలను బైపాస్ చేసి ఉండాలి. గతంలో దాలెం వద్ద రక్షక దళాలను బైపాస్ చేసి బీదర్‌లో ప్రత్యక్షమయ్యాయి భారత దళాలు. అదే పునరావృతమై ఉంటుంది. ఆర్మీ కేంద్రానికి ఫోన్ చేసాను. తూర్పువైపున ఎలాంటి కొత్త సమాచారం లేదని చెప్పారు. ఆ దిశలో

ఇండియన్ ఏర్‌ఫోర్స్ బాంబులు వేస్తున్నా, మెషిన్‌గన్‌లతో కాల్పులు జరుపుతున్న రక్షక దళాలు సరిగ్గానే ఉన్నాయని చెప్పారు. నేను అందుకున్న వార్త వారికి చెప్పాను. వారు కూడా ఓ నిమిషం కింద ఆ వార్త అందుకున్నారు. కలవరపడ్డారు. ఎవరూ లేని దారిలో వాటిని ఆపడానికి ఏమైనా అవకాశం ఉందా? అందిన నివేదికలే నిజమైతే నాలుగు ఐదు గంటల్లో భారత సాయుధదళాలు రాజధాని చేరుకుంటాయి. ఆ దిశగా పంపించడానికి సైన్యంలేదు. ఆ దారి వెంట ఎదుర్కోవడానికి ఏ అవకాశమూలేదు.

ప్రయత్నం చివరి దశకు చేరింది. బీబీనగర్ నుండి నేరుగా రాజధానికి వస్తున్న సైన్యానికి ఎదురొడ్డ గలిగేదేదీ లేదు. రైల్వే అధికారిని మరొకసారి సంప్రదించాను. ఆయన మరొకసారి ఆ వార్తను ధ్రువీకరించాడు. ఇంకా కొద్ది సమయమే మిగిలింది. తక్షణం నేను ఏదైనా చేయాలి. నేను కాళ్ళు చేతులు కడుక్కొని ఉదయం ప్రార్థనకు సిద్ధమయ్యాను. ప్రార్థన అయ్యాక ఖురాన్ వాక్యాలను చదివి దుస్తులు వేసుకుంటుండగా ఆర్మీ కమాండర్ వచ్చినట్లు చెప్పారు. అతనికి కాఫీ ఇమ్మని చెప్పి కొద్దినిమిషాల్లో ఆయనను కలిసాను. ఆయన పడమటి దిశ నుండి నేరుగా నా నివాసానికి వచ్చాడు. ఆయన అలసిపోయినట్లు, ధైర్యం కోల్పోయినట్లు కనిపించాడు. రక్షణ యూనిట్లను చూశానని, అవి బాగా అలసిపోయి ఉన్నాయని ఇంకెంత మాత్రం అవి ఎదుర్కోలేవని అవగాహనకు వచ్చినట్లు చెప్పాడు. ఈ సాయంత్రానికల్లా భారత సాయుధ బలగాలు రాజధానికి వచ్చేస్తాయని చెబుతూ ఏదేని రాజకీయ పరిష్కారానికి ప్రయత్నించమని సలహా ఇచ్చాడు. సైనిక అడ్డగింపు ఇంకెంతో సేపు సాధ్యం కాదని చెప్పాడు.

మౌనంగా ఆయన చెప్పింది విని తూర్పు ప్రాంతపు వార్త తెలుసా అని అడిగాను. ఆర్మీకేంద్రంలో లేనందున తనకు తెలియదని చెప్పాడు. రైల్వే అధికారి నుండి వచ్చిన సమాచారం చెప్పాను. ఆయన ఆశ్చర్యపోయి భారత దళాలు నకిరెకల్ రక్షణ యూనిట్‌ను బైపాస్ చేసి ఉంటాయని చెప్పాడు. ఈ వేగంలో భారత దళాలు ఉదయానికే రాజధానికి చేరుతాయని, పరిస్థితిని తలుచుకుంటే ఘోరంగా తోస్తుందని అన్నాడు.

నా కార్యాలయం షామంజిల్‌లో కనుక్కున్నాను. ముస్తాఖ్ అహ్మద్‌నుండి సుదీర్ఘ సమాచారాలు వస్తున్నాయి. అవి డీకోడ్ అవుతున్నాయి. బహుశా అవి పారిస్ వ్యవహారాలనుకుంటా. బహుళ విభజనాత్మక పరిష్కార వ్యవస్థ ఏర్పాటు చేయబడింది. అందువల్ల పరిష్కారం విసుగు పుట్టేంతగా ఆలస్యం అవుతుంది.

ఎంతగానో ఎదురు చూసిన ఐరాస భద్రతా మండలి సమావేశం సెప్టెంబర్ 16న మధ్యాహ్నం (1948) బ్రిటిష్ ప్రతినిధి సర్ అలెగ్జాండర్ కాడగాన్ అధ్యక్షతన పారిస్‌లో జరిగింది. సమావేశంలో ప్రాథమిక అంశం హైద్రాబాద్ దరఖాస్తును పరిశీలనకు చేపట్టి విచారించాలా అన్నది. కొన్ని సాంకేతిక విషయాల వల్ల దరఖాస్తు తిరస్కరించబడే అవకాశం ఉన్నందున ఇది హైద్రాబాద్‌కు అతి ముఖ్యమైన వ్యవహారం. సమావేశం ఆరంభంలో చైనా ప్రతినిధి తినియాంగ్ హైద్రాబాద్ అంశాన్ని గురించి తమ ప్రభుత్వం నుండి ఎలాంటి సూచనలు లేనందున సెప్టెంబరు 20 వరకు వాయిదా వేయవలసిందిగా  కోరాడు.

అయితే పరిస్థితిలోని వేగం దృష్ట్యా సమయం వృధా కాకుండా చర్చనైనా ఆరంభించాలని సర్ అలెగ్జాండర్ కాడగాన్ అభిప్రాయపడ్డాడు. పరోడి (ఫ్రాన్స్) అధ్యక్షుణ్ణి సమర్థించాడు. ఒక్క రోజు వాయిదా వేయాలని బెల్జియం కోరింది. ఆగస్టులోని భారత స్వాతంత్ర్య చట్టం, 1947 ప్రకారం హైద్రాబాద్ స్థితి గురించి సమాచారం కోసం తమ అధ్యక్షుడిని సంప్రదించేందుకు సమయం కావాలని మాలిక్ (యు.ఎస్.ఎస్.ఆర్.) కోరాడు. సరియైన సమయంలో కావలసిన సమాచారం ఇస్తానని అధ్యక్షుడు చెప్పాడు. దరఖాస్తును ఎజెండాలో పెట్టేందుకు జోసెఫ్ (యు.ఎస్.ఎ.) సమర్థించాడు. ఆర్సీ (అర్జెంటీనా) దరఖాస్తును స్వీకరించాలని గట్టిగా పట్టుబట్టాడు. 396 ఐరాస ఛార్టర్‌లోని లక్ష్యాలు, ఉద్దేశాల ప్రకారం ప్రపంచంలోని ఒక భూభాగాన్ని మరొక దేశం ఆక్రమిస్తుందని, ప్రజలు చంపబడుతున్నారని నివేదికలుండగా భద్రతా మండలి ఆ దరఖాస్తును వాయిదా  వేయలేదని ఆర్సీ వాదించాడు. బాగా చర్చ జరిగాక చైనా ప్రతిపాదనను ఓటింగుకు పెట్టగా ఒక్క చైనా అందుకు అనుకూలంగా ఓటువేయగా మిగిలిన దేశాలు ఓటింగుకు దూరంగా ఉన్నాయి. మరికొంత చర్చ జరిగాక హైద్రాబాద్ దరఖాస్తును స్వీకరించాలా లేదా తిరస్కరించాలా అనే విషయమై అధ్యక్షుడు ఓటింగు పెట్టాడు. ఎనిమిది మంది స్వీకరించాలని ఓటు వేయగా ముగ్గురు దూరంగా ఉన్నారు. అలా దరఖాస్తు పద్ధతిప్రకారం స్వీకరించబడింది. ఎజెండాలో చేర్చబడింది. హైద్రాబాద్ ప్రతినిధి బృందం నాయకుడు మోయిన్ నవాజ్ జంగ్‌ను దరఖాస్తు సమర్పణకు ఆహ్వానించాడు అధ్యక్షుడు. మోయిన్ నవాజ్ జంగ్ చాలా శక్తిమంతంగా, వివరంగా హైద్రాబాద్ దరఖాస్తును ప్రవేశపెట్టాడు. భద్రతా మండలిని తక్షణం కలుగజేసుకోవలసిందిగా, రక్త పాతానికి ముగింపు పలకవలసిందిగా, భారత్ చేస్తున్న విధ్వంసం నుండి హైద్రాబాద్‌ను కాపాడమని కోరాడు. దండయాత్రకు భారత్‌కు

ఉన్న కారణం చిన్నదని, హైద్రాబాద్ తన రక్షణ కోసం ఈ దరఖాస్తు చేయడం న్యాయమని భద్రతా మండలికి విన్నవించాడు.

ఇద్దరు ప్రతినిధులు మాట్లాడాక అధ్యక్షుడు సమావేశాన్ని ముగించాడు. సభ్యులు పరిస్థితిని జాగ్రత్తగా అధ్యయనం చేయడానికి తదుపరి చర్చకు 20వ సెప్టెంబర్, సోమవారానికి (1948) వాయిదా వేసాడు.

హైద్రాబాద్ దరఖాస్తును ఎజెండాలోకి స్వీకరించడం ఒక విజయం. అయితే 20వ సెప్టెంబరుకు వాయిదా పడడం చింతించాల్సిన విషయం. హైద్రాబాద్ విషయ సాంద్రత ప్రతినిధి బృందానికి తెలుసు, 20వ తేదీ వరకు వాయిదా అన్నది చాలా ఆలస్యం కింద లెక్క. వాళ్ళు భద్రతా మండలిలోని ప్రతి సభ్యుడిని కలిసి తక్షణ చర్య కోసం విజ్ఞప్తి చేసారు. వాళ్ళ స్పందన బాగానే ఉంది. శనివారం 18వ తేదీ కంటే ముందు సమావేశం ఏర్పాటు చేయడం భౌతికంగా సాధ్యంకాదు. కాబట్టి ఆ రోజు చేస్తానని చెప్పాడు. కాల్పుల విరమణ తీర్మానపు అవకాశాన్ని ప్రతి సభ్యుడితో వ్యక్తిగతంగా హైద్రాబాద్ ప్రతినిధి బృందం కలిసి చర్చించింది. చైనా తప్ప అందరూ అందుకు సానుకూలంగా స్పందించారు. ఒక్క రష్యా మాత్రం దానికి దూరంగా ఉండే అవకాశం కనిపించింది. అప్పటిదాకా హైద్రాబాద్ రావడం ఆసక్తికరంగా తోచింది.

అలా భద్రతా మండలి తక్షణం కొద్దిగానే చేయగలిగింది. ఇక్కడ భారత సైన్యాలు కేవలం ముప్పై మైళ్ళ దూరం నుండి ఎలాంటి అడ్డగింపు లేకుండా రాజధాని వైపు నడుస్తున్నాయి. అదే దూకుడుతో భారత సైన్యాలు రాజధానిని ముట్టడిస్తే ఎంతటి రక్తపాతం జరుగుతుందో ఎవరూ ఊహించలేరు. ఉస్మానాబాద్, కళ్యాణి, బీదర్ మొదలైన పట్టణాలలోకి చొరబడ్డప్పుడు భారత సైన్యం చేసిన మారణకాండ అందరికీ తెలిసిందే. స్త్రీలు, పురుషులు, పిల్లలు ప్రత్యేకంగా ముస్లీంలపై ప్రతీకారాత్మకంగా జరిపిన దాడులు గుర్తున్నాయి. పెద్దస్థాయిలో మతఘర్షణలు ఏర్పడి రాజధానిలో అవి ఎంతదూరం పోతాయో తెలియని స్థితి దాపురించింది. నేనింకా సమయాన్ని వృధా చేయలేను. నిజాం కూడా శాంతికోసం, సామూహిక హత్యాకాండను నిరోధించడం కోసం ప్రయత్నిస్తాడనుకుంటా. నేను రాజీనామా చేసి నా సహచరులను కూడా అందుకు సంసిద్ధపరచాలని అనుకున్నాను.

ఆర్మీ కమాండర్ వెళ్ళిపోగానే నేను షామంజిల్‌కు వెళ్ళాను. ముసాఖ్ అహ్మద్

నుండి అనేక సందేశాలు వచ్చాయి. ఒక సందేశంలో సరియైన సమయంలో నన్ను హైద్రాబాద్ వీడి భారత్ చేతిలో చిక్కే దుర్గతిని తప్పించుకొమ్మని పాకిస్తాన్ నాయకులు కోరారు. పారిస్‌లోనున్న భద్రతా మండలి వార్తలు అందుతున్నాయి. ఉదయం 9.30 గంటలకు ఒక అత్యవసర మంత్రివర్గ సమావేశం కోసం ఆదేశించాను. ఖాసిం రజ్వీ ఫోన్ చేసి నేనెలా ఉన్నానో అడిగాడు. పరిస్థితి అంతా వివరించి ఒక్కరోజే మిగిలి ఉందని చెప్పాను. ప్రశాంతంగా ఉండమని, ఎలాంటి ఆందోళనలు, మతఘర్షణలు జరగకుండా చూడమని, అతన్ని కోరాను. దండయాత్ర ప్రారంభమైనప్పటి నుండి కూడా ఎలాంటి మత ఘర్షణలు జరగలేదని, దాడి వల్ల హిందువులు, ముస్లింలు సమానంగా ఆపదలు ఎదుర్కొంటున్నారని చెప్పాడు. అందుకు ఒప్పుకుంటూనే కచ్చితమైన ప్రశాంతత, మత సామరస్యం గతంలో కంటే ఇప్పుడు ఎక్కువ అవసరమని నొక్కి చెప్పాను.

ఉదయం 8 గంటలకు నిజాంను కలిసాను. ఆయన అప్పటికే ఆర్మీ కమాండర్‌తో మాట్లాడాడు. పారిస్‌లో భద్రతా మండలి వార్తలను ఆయనకు నివేదించాను. భద్రతా మండలి కాల్పుల విరమణ తీర్మానం చేయకుండా ఎంత చర్చ సాగినా ఏం లాభమని నిజాం నన్నడిగాడు. మనమంతా దండు నడుపుతున్న భారత సైన్యం చేతిలో కాల్పులకు గురై చనిపోయాక, లేదా బందీలయ్యాక ఎవరి లాభంకోసం భద్రతా మండలి చర్యలు తీసుకుంటుంది తెలుసుకోవాలను కుంటున్నానని అన్నాడు. “కొద్ది గంటల్లో భారత సైన్యపుబలం మన మీద పడుతుంది. ఎంతకాలం వేచి చూసి ఆశిస్తాం? భారత సైన్యం దాడి చేస్తున్న పద్ధతిలో రాజధాని చేరితే ఎంతస్థాయి రక్తపాతం సంభవించ బోతుంది? భారత సైన్యాలు ఇదివరకే ఆక్రమించిన పట్టణాల పరిస్థితి ఏమిటి?” అన్నాడు నిజాం. ‘అవును!’ అన్నాను నిజాంతో నేను అన్నీ గమనిస్తూ ఉన్నాను. ఒక వేళ హైద్రాబాద్ కోసం మరణం అవసరమైతే నేనందుకు సిద్ధంగా ఉన్నాను. నిజాం ఆలోచనలన్నీ సరియైనవే. నేనూ నా సహచర మంత్రులు రాజీనామా చేస్తామని నిజాంకు చెప్పాను. కావలసింది జరుగుతుంది.

నిజాం నుండి వీడ్కోలు తీస్కొని వెనక్కి వెళ్తూ కొద్ది నిమిషాలు ఆర్మీ కేంద్రానికి వెళ్ళాను. కమాండర్ ఇంకారాలేదు. పౌర అధికారులు నన్ను కలిసారు. కొత్త నివేదికలు ఏమీ లేవన్నారు. భారత దళాల గమనాన్ని చూడడం కోసం బీబీనగర్–హైద్రాబాద్ రోడ్డుపై వెళ్ళిన మన సైనికులు ఇంకా తిరిగి రాలేదని చెప్పారు.

మంత్రివర్గ సభ్యులు, సీనియర్ ప్రభుత్వ కార్యదర్శులు అప్పటికే షామంజిల్‌కు

వచ్చి నాకొరకు వేచి చూస్తున్నారు. తక్షణం సమావేశం ప్రారంభించాం. తాజాగా మిలటరీ పరిస్థితి, ఉదయాన ఆర్మీ కమాండర్ చెప్పిన విషయాలు, రైల్వే అధికారి నుండి అందిన వార్త, పూర్తి వ్యవహారాన్ని వ్యక్తిగతంగా చేతుల్లోకి తీసుకోవడమో లేక ప్రభుత్వ వ్యవహారంలో తనకు సంబంధం లేదని బహిరంగంగా ప్రకటించడం కోసమో నిజాం తీసుకున్న నిర్ణయాన్ని సమావేశంలో వివరించాను. పరిస్థితిని బాగా అర్థం చేసుకొని ప్రతి ఒక్క మంత్రీ మాట్లాడాలని, వారివారి అభిప్రాయాలను సూటిగా స్పష్టంగా చెప్పాలని మంత్రి వర్గ సభ్యులకు విజ్ఞప్తి చేశాను. కొద్ది సేపు మౌనం రాజ్యమేలింది. ఉపప్రధాని పింగళి వెంకట్రామారెడ్డి మొదట ఆ మౌనాన్ని ఛేదించాడు. దేశపు సార్వభౌమత్వంకోసం ప్రాణం ఇవ్వడానికైనా ఎప్పుడూ సిద్ధమని స్పష్టంగా చెప్పాడు. ఏ విధంగానైనా పరిస్థితినుండి బయట పడేయడానికి పాలకుడు ప్రయత్నించి నట్లయితే తన బాధ్యతనుండి తప్పుకొని రాజు ఆదేశాలను శిరసావహించడానికి సిద్ధంగా ఉండాలి. ఉద్దేశ్యంలోని నిజాయితీ దృష్ట్యా ప్రతి మంత్రీ, దేశంలోని ప్రతి పౌరుడు దేశంకోసం పని చేయాలి.

ముందుచూపుగల నా పాలనలో ఏ తప్పుడు నిర్ణయమూ జరగదని ఆయన చెప్పాడు. ఒంటరి పోరాటంలో విఫలమైనప్పటికి, ఆయుధ బలాల ముందు తల వంచాల్సి వచ్చినప్పటికి గౌరవ ప్రదమైన ముగింపునకు తాను కానీ ఏ దేశభక్తుడు కానీ కాదనలేడు అన్నాడు. తాను చివరిసారిగా మాట్లాడుతున్నానని, కొద్ది గంటల్లో తాను కాల్చిపడవేయబడ వచ్చునని చెబుతూ అది అగౌరవమైన మరణమని తాననుకోవడం లేదని ఆయన అన్నారు. నా వైపు తిరిగి నేను రాజీనామాచేస్తే తాను కూడా వెంటనే రాజీనామా చేస్తానన్నాడు. ఆయన ఉపన్యాసం చిన్నదే కాని విభ్రాంతి గొలిపింది. ఒకరి తర్వాత ఒకరు అందరూ అదే భావం భిన్నపదాల్లో వ్యక్తం చేసారు. దేశరక్షణ కోసం ప్రభుత్వం అన్ని ప్రయత్నాలు చేసిందని, దుర్మార్గమైన భారత ఆయుధ బలం ముందు లొంగిపోయిందని ఒక తీర్మానం రాయబడ్డది. నిజాంకు రాజీనామాలు సమర్పించబడ్డాయి. ఏకగ్రీవంగా రాయబడ్డ తీర్మానాన్ని వెంటనే నిజాంకు పంపించాను.

మంత్రివర్గ సమావేశం నుండి బయటికి వచ్చేటప్పటికి ఇద్దరు అధికారులు నా కోసం నిలుచున్నారు. నిఘాకోసం వెళ్ళిన సైనికులు తిరిగి వచ్చారని బీబీనగర్ రోడ్డులో భారత దళాల జాడ కనిపించలేదని చెప్పారు. రైల్వే అధికారి చెప్పిన సమాచారం నిజం కానట్లుంది. తూర్పున కాని, పడమర కానీ చెదిరిన దళాల పునరేకీకరణ తప్ప సైన్యాల కొత్త పురోగతి ఏదీ లేదని నివేదించారు. అయితే ఇండియన్ ఏర్‌ఫోర్స్



విమానాల బాంబుదాడులు మాత్రం కొనసాగుతూనే ఉన్నాయని చెప్పారు. ప్రభుత్వం రాజీనామా చేసిందని చెప్పినప్పుడు వాళ్ళల్లో కన్నీళ్ళు ఉబికాయి. 'ఎందుకు సర్! మనం పోరాడి ఇంకా కొంత కాలం భారత సైన్యాలను అడ్డుకోగలం' అన్నారు వాళ్ళు. 'సెబాష్' అన్నాన్నేను. సందేహం లేదు త్వరలోనే మనం చనిపోతాం. కాని మన విశ్వాసం సడలిపోగూడదు.

నిజాం నుండి తొందరగా రమ్మని పిలుపు వచ్చింది. నన్నెందుకు రమ్మంటున్నాడో నాకు తెలుసు. నేను అక్కడికి వెళ్ళేసరికి పోలీసు ఉన్నతాధికారి, ఆర్మీ కమాండర్‌తో కొత్త ప్రభుత్వ ఏర్పాటు గురించి చర్చిస్తున్నాడు నిజాం. నా ఆధ్వర్యంలోని ప్రభుత్వం రాజీనామా చేసిందని మున్షీకి వర్తమానం పంపించాడు. కొత్త ప్రభుత్వ ఏర్పాటు ప్రతిపాదనలను భారత ప్రభుత్వ ప్రతినిధిగా మీకు పంపిస్తానని ఆయనకు సందేశం అందజేసాడు. నేను ఏ చర్చలో పాల్గొనలేదు. వాళ్ళు వెళ్ళాక పరిస్థితులు అంతగా అనుకూలంగా లేనందున తన వద్దనున్న రహస్య పత్రాలు రికార్డులు ధ్వంసం చేయమని సానుభూతితో చెప్పాను.

కొన్ని ముఖ్యమైన పత్రాలను, రికార్డులను ఆయన పరిశీలించాడు. నా సలహాను లోతుగా ఆలోచించి తన వ్యక్తిగత కార్యదర్శిని పిలిచి ముఖ్యమైన పత్రాలను ధ్వంసం చేయమని చెప్పాడు. ఆ తరువాత నేను షామంజిల్‌కు తిరిగి వచ్చాను. నా వ్యక్తిగత సిబ్బందిని పిలిచి నా కార్యాలయంలోని రహస్య విభాగాన్ని ధ్వంసం చేయమని, ప్రత్యేకంగా వైర్‌లెస్ సమాచారంలోని సంకేతాలను ధ్వంసం చేయమని కోరాను. నేను అప్పుడు ముస్తాక్ అహ్మద్‌కు ఒక చివరి సందేశాన్ని పంపించాను. నిజాం కోరిక మేరకు భారత దేశపు దుర్మార్గమైన బలానికి లొంగిపోతూ రాజీనామా చేశామని అందులో చెప్పాను. ఇదే చివరి సందేశమని కూడా చెప్పాను. మరికొన్ని గంటల్లో మేమంతా ఈ ప్రపంచంలో మిగిలి ఉండకపోవచ్చని చెప్పాను. హైద్రాబాద్ పతాకాన్ని ఎగురవేస్తూ ఉండాలని మోయిన్ నవాజ్ జంగ్‌కు ఐరాస భద్రతా మండలిలో వాదం కొనసాగిస్తూ ఉండాలని చెప్పమని అన్నాను. అందరిలో విషాదం అలుముకుంది. కొందరు ఉద్యోగుల కళ్ళనుండి కన్నీరు కారింది.

నిజాం దగ్గరి నుండి వెళుతూ మున్షీని కలిసాను. ఇక్కడి వైర్‌లెస్ మరియు టెలిఫోన్ లైను, టెలిగ్రాఫ్ లైన్ భారత్‌తో అనుసంధానం కావాలని కోరాడు. ఆయన కూడా నిజాం లాగే కొత్త ప్రభుత్వ ఏర్పాటులో వ్యక్తుల కోసం అన్వేషిస్తున్నాడు. కొత్త ప్రభుత్వంలో ఆయన ప్రధాన సలహాదారు. ఎంత విషప్రచారం చేసినప్పటికీ హిందూ ముస్లింల మధ్య ఒక్క ఘర్షణ కూడా జరగలేదని ఆయనకు గుర్తు చేశాను. భారత సైన్యం ఇతర పట్టణాలను ఆక్రమించినప్పుడు జరిగిన ఊచకోత జరగకుండా చూసేందుకు తన పరపతిని ఉపయోగించమని మున్షీని కోరాను. ఆయన నా విజ్ఞప్తికి స్పందించినట్టు కనిపించాడు. పౌరులకు సంబంధించినంత వరకు ఎలాంటి రక్తపాతం జరగకుండా చూసేందుకు తాను అన్ని ప్రయత్నాలు చేస్తానన్నాడు.

నిజాం టెలిఫోన్ చేసి ఆహ్వానించినందున శుక్రవారం ప్రార్థనల కోసం పబ్లిక్ గార్డెన్స్‌లోని చిన్న అందమైన మసీదులో ఆయనతో కలిసి ప్రార్థనకు వెళ్ళాను. మధ్యాహ్నం నన్ను కలవమని నిజాం చెప్పాడు. నేను అంగీకరించాను. అక్కడి నుండి రహస్య పత్రాలన్నీ ధ్వంసమైనవని నిర్ధారించుకునేందుకు షామంజిల్‌కు వెళ్ళాను. నా వ్యక్తిగత సిబ్బంది నా చివరి సందేశం కూడా ముస్తాక్ అహ్మద్‌కు పంపించామని, రహస్య పత్రాలన్నీ కాల్చి బూడిద చేసామని చెప్పారు.

మధ్యాహ్నం రేడియో స్టేషన్‌కు వెళ్ళి హైద్రాబాద్ ప్రజలకు ఒక సందేశం ఇచ్చాను సంక్షిప్తంగా. హైద్రాబాద్ ఇంకెంతో సేపు భారత సైన్యాలను ఎదుర్కొన జాలదని, అందువల్ల హైద్రాబాద్ స్వాతంత్ర్య రక్షణలో విఫలమైనందున రాజీనామా చేస్తున్నామని ప్రకటించాను. స్త్రీలకు, పిల్లలకు, పురుషులకు ఈ వైపరీత్యాన్ని ఎదురుకోడానికి సిద్ధంగా ఉండమని చెప్పాను. కొత్త పరిస్థితిలో జీవించడానికి సిద్ధంగా ఉండమని, ఆ పరిస్థితి తాత, ముత్తాతల నుండి మనం జీవించిన దానికన్నా భిన్నంగా ఉంటుందని చెప్పాను. మత సామరస్యాన్ని పాటించమని అది మన ఐకమత్య జీవనానికి సంకేతమని, ఒక్క సంఘటన కూడా జరగకుండా చూడాలని కోరాను. దేవుణ్ణి నమ్మమని వారిని దేవుడి రక్షణలో వదిలేసాను.

రేడియో స్టేషన్ నుంచి బయటికి వస్తూ దుకాణాలలో పెద్ద శబ్దంతో నడుస్తున్న రేడియోల వద్ద గుంపులుగా మూగి వింటున్న ప్రజల్ని చూశాను. దాదాపుగా ప్రతి ఒక్కరు ముకుళించిన హస్తాలతో కళ్ళ నుండి జారుతున్న కన్నీళ్ళతో కనిపించారు. ఆ దృశ్యాన్ని చూసి నా కళ్ళనుండి బొటబొటా కన్నీళ్ళు రాలిపడ్డాయి. నేను షామంజిల్‌కు తిరిగి వచ్చి ఖాసీం రజ్వీకి ఫోన్ చేసాను. ప్రశాంతంగా ఉండమని, మత ఘర్షణలకు తావివ్వవద్దని ప్రజలను కోరుతూ రేడియోలో ప్రసంగించమని కోరాను. మొదట అతనందుకు ఒప్పుకోలేదు కానీ తుదకు అందుకు అంగీకరించి, రేడియో కేంద్రానికి వెళ్ళాడు. ప్రజలలోని అన్ని వర్గాలను ప్రశాంతంగా ఉండమని శాంతి భద్రతలను కాపాడమని మత సామరస్యాన్ని కాపాడమని చాలా సంయమనంతో కూడిన ప్రభావవంతమైన ప్రసంగం చేసాడు.

ఒక ముఖ్యమైన పని, అతి కష్టమైన పని ఇంకా మిగిలిపోయింది. అది వాడకుండా ఉండిపోయిన ఆయుధాలు, మందుగుండు సామగ్రిని ధ్వంసం చేయడం. వాటిని ధ్వంసం చేయమని ఆందోళనగా ఆదేశించాను. ఆశ్చర్యకరంగా అప్పటికి నేను పదవికి రాజీనామా చేసి ఉన్నప్పటికీ నా ఆదేశాలు సమున్నతంగా పాటించబడ్డాయి.

ఒక చిన్న సంఘటన, కానీ గుర్తుంచుకోదగిన సంఘటన నన్ను కదిలించింది. నా మంత్రి వర్గ సహచరుడు రహీం నా గదిలోకి పరుగెత్తుకొచ్చి ఒక దీనమైన అభ్యర్థన చేసాడు. ఖాసీం రజ్వీని పాకిస్తాన్‌కు కానీ, ఇంకేదైనా ఇతర దేశానికి కానీ పంపించమని కోరాడు. మనమంతా చంపివేయబడతాము కానీ దండు నడుపుతున్న భారత సైన్యాలు ఖాసీం రజ్వీని మాత్రం ప్రాణాలతోనే ముక్కలు చేసి వాలంటీర్లకు ఆహారంగా ఇస్తారని చెప్పాడు. ఆత్మవిశ్వాసం కోల్పోయి, నిజాయితీగా చేసిన ఈ విజ్ఞప్తికి నేను చలించిపోయాను. నేను ఆర్మీ కమాండర్‌కు ఫోన్ చేసి ఖాసీం రజ్వీ పాకిస్తాన్ వెళ్ళడానికి గాను ఇంధనంతో కూడిన ఒక విమానాన్ని సమకూర్చగలరా అని అడిగాను. అతను అది అసాధ్యమని చెప్పాడు. ఒకవేళ అతను అందుకు ప్రయత్నించినా భారత వైమానిక దళాల విమానాలు దాన్ని కూల్చివేయడం ఖాయమని చెప్పాడు.

నాకు నిజాంను కలవాలని లేదు. కానీ పదే పదే పిలుపులు వస్తున్నాయి. నేను గతంలో కలసినప్పుడు లొంగుబాటను సూచించే ఆయుధాన్ని భారత సైన్యానికి ఎవరు బహుకరించాలి అనే చర్చ వచ్చింది. ఆర్మీ కమాండర్ ఆ పనిని తాను చేస్తానని అన్నాడు. అక్కడ ఉన్న వాళ్ళలో కొందరు కమాండర్ ఇన్ చీఫ్‌గా ప్రకటించబడ్డ బేరార్ యువరాజు బహుకరిస్తే బాగుంటుందని అభిప్రాయపడ్డారు. నిజాం వివేచనతో ఆలోచించి ఇందులో నా అభిప్రాయం కోరలేదు.

అంతకుముందు రోజు సాయంత్రం మున్షీ సూచన మేరకు ఆయన జాగ్రత్తగా రాసిచ్చిన సందేశాన్ని రేడియో స్టేషన్‌కు వెళ్ళి ప్రకటించడానికి అంగీకరించాడు. ఇందులో ప్రత్యేకంగా చెప్పదగ్గ విషయం ఏమిటంటే ఐరాస భద్రతా మండలిలో దరఖాస్తు సమర్పించడానికి వెళ్ళిన హైదరాబాద్ ప్రతినిధి బృందాన్ని ఉపసంహరించుకుంటున్నట్లు నిజాం ఆదేశం ఉండడం. ఆ తరువాత మున్షీ కూడా ఒక రేడియో ప్రసంగం చేస్తారు. ఈ రెండు ప్రసంగాల సారాంశం ఒక్కటే. గత ప్రభుత్వం చేసిన తప్పిదాలు, ప్రత్యేకంగా అప్పటి ప్రజానాయకులు, అప్పటి ప్రభుత్వం బాధ్యతా రహితంగా చేసిన కార్యకలాపాలను భారత ప్రభుత్వ ఆధ్వర్యంలో ఏర్పడబోయే కొత్త ప్రభుత్వంలో సరిదిద్దడం జరుగుతుంది.

మరుసటి రోజు ఉదయం అవకాశం చిక్కినప్పుడు నేను సూచించిన విధంగా ముఖ్యమైన పత్రాలను కాల్చివేశారా అని అడిగాను. అందుకు ఆయన అవునన్నాడు. తదుపరి సెప్టెంబర్ 18వ తేదీ మధ్యాహ్నం సైన్యాల దళపతి మేజర్ జనరల్ చౌదరి

హైద్రాబాద్ ఆర్మీ కమాండర్ ఆయన సహచరులు తోడ్కొని రాగా వాహన శ్రేణిలో బొల్లారం రెసిడెన్సీకి చేరుకున్నాడు. నిజాం తన వ్యక్తిగత దూతలైన జుల్ఖాదర్ జంగ్, అబుల్ హసన్ సయ్యద్ అలీ, అలీ యవార్‌జంగ్ ఇంకా ఒకరిద్దరిని తన తరపున చౌదరి వద్దకు పంపించి శుభాకాంక్షలు అందజేసాడు. మున్షీ సూచించిన విధంగా కొత్త ప్రభుత్వాన్ని ప్రకటించడానికి గాను ఆయన అనుమతి కోరాడు. నిజాం పిలువనంపినందున నేను వెళ్ళి మాట్లాడుతూ ఉండగా చౌదరి వద్దకు నిజాం పంపిన దూతలు అధైర్యంగా పారిపోయిన మొహాలతో తిరిగి వచ్చారు.

కొత్త ప్రభుత్వ ఏర్పాటు గురించి ఏమీ వినేదిలేదని నిజాం నుంచి ఏ సలహాలు అక్కరలేవని చౌదరి తిరస్కరించాడని చెప్పారు. చౌదరి ఆధ్వర్యంలో మిలటరీ పరిపాలన కొనసాగించడం ఉద్దేశంగా కనబడిందని అన్నారు.

"ఏమిటేమిటీ?" అని నిజాం ఆశ్చర్యపోయి నావైపు తిరిగి "కానీ, లాయక్‌అలీ, ఇది మున్షీతో కుదిరిన అవగాహనకు వ్యతిరేకం కదా" అన్నాడు.

"ఏమి అవగాహన?" అని అడిగాను నేను.

ఆయన జవాబివ్వలేదు.

అప్పుడు నాకు ఆ సంభాషణలో ఉండకూడని వ్యక్తిననిపించింది.

నేను వెళ్తానన్నాను. వస్తున్నప్పుడు నిజాం రేపు మళ్ళీ రమన్నాడు. గతంలో ఎప్పుడూ లేని విధంగా రాగలనో లేదో అని సందేహం వ్యక్తం చేసాను.

ఇంటికి వచ్చాక, భారత దళాలు 19వ తేదీన ఉదయం పడమటి నుండి, మధ్యాహ్నం తూర్పునుండి రాజధాని చేరనున్నాయని తెలిసింది. సాయంకాలం వార్తాహరుడొకరు పోలీసు ఉన్నతాధికారి నుండి నాకొక లేఖ తెచ్చి ఇచ్చాడు. అది మిలటరీ గవర్నరు ఆదేశాల ప్రకారం నన్ను గృహనిర్బంధం చేస్తున్నట్లు ఆదేశం. నేను ఇల్లు వదిలి వెళ్ళరాదని నిర్దేశం. జరగబోయే అత్యాచారాలను ఊహించి, నన్ను హత్య చేసే దృశ్యాలకు దూరంగా ఉంచాలనే ఉద్దేశంతో మా సోదరితో సహా నా కుటుంబాన్ని నగరంలోని మారుమూలలో ఉండే మిత్రుల ఇంటికి అప్పటికే పంపించాను. ఆ ఆదేశాన్ని అందుకున్నాక ఏకాంతంగా చాలా విశ్రాంతిగా భావించాను. నన్ను చిన్ననాటి నుండి శ్రద్ధగా పెంచినటువంటి, జన్మతః అరబ్బు అయనటువంటి గురువు కళ్ళనీళ్ళ పర్యంతమైనాడు.

సాయంకాలం పోలీసు ఉన్నతాధికారి ఫోన్ చేసాడు. అంతకుముందు



చెప్పినట్లుగా తాను నన్ను కలవలేక పోతున్నందుకు క్షమాపణ కోరాడు. అరెస్టు చేసినందుకు చింతిస్తూ తనకలాంటి ఆదేశాలు ఉండడం వల్ల అలా చేయవలసి వచ్చిందన్నాడు. నాకంతా తెలుసునని చింతించవలసిన పని లేదని చెప్పాను. ఖాసీంరజ్వీ పరిస్థితి ఏమిటని అడిగాను. అతన్ని రేపు పట్టుకుంటామని చెప్పాడు.

కొద్ది సేపటికే ఖాసీం రజ్వీనుండి ఫోన్ వచ్చింది. ఆయన ఎప్పటిలాగే గాంభీర్యంతో మాట్లాడాడు. రూపు ఉదయం అల్పాహారానికి రానా అని గతంలోలాగే అడిగాడు. నాకేం చెప్పాలో తెలియలేదు. అయినా నువ్వెప్పుడూ రావచ్చునే చెప్పాను. అయితే ఆయన భవిష్యత్తు ఆయనకు అవగతమౌతున్నట్లే అనిపించింది.

ఇలాంటి కష్టకాలంలో నా పరిస్థితిని పంచుకోవడం న్యాయం కాదని భావించి మరుసటి రోజు ఉదయం అకస్మాత్తుగా నా కుటుంబం తిరిగి వచ్చేసింది. వాళ్ళు వెనక్కి రాగలిగినందుకు నాకు ఆశ్చర్యం వేసింది. నా టెలిఫోను కట్ చేసారు. అయినా చిన్న చిన్న వార్తలు నాకందుతూ ఉన్నాయి. భారత సైన్యం విజయగర్వంతో తూర్పు పడమర దిశల నుండి రాజధానికి చేరింది. బ్రిటిష్ వాళ్ళు నిర్మించి భారత దేశాన్ని

వదిలి వెళ్ళే వరకు ఉన్న బొల్లారం మిలిటరీ కేంద్రానికి ఈ భారత సైన్యాలు పోనున్నాయి.

సాయంకాలం దృఢంగా ఉన్న ఆర్మీ అధికారి ఒకరు ఇంటికి వచ్చి నన్ను కలవాలన్నాడు. నేను కిందికి దిగి ఆయనను కలిసాను. ఆయన విదేశీయుడిలా కనబడ్డాడు. స్పష్టంగా, వినమ్రంగా కొద్ది మాటల్లోనే రేపు పొద్దున్న నన్ను తీసుకొని వెళ్ళిపోతామని చెప్పాడు. "కాల్పులకు దళాలు సిద్ధంగా ఉన్నాయా?" చిరునవ్వుతో అడిగాను. ఆయన కళ్ళల్లో నీళ్ళు చూసి ఆశ్చర్యపోయాను. నా ప్రశ్నలకు జవాబు చెప్పలేకపోతున్నందుకు క్షమించమని కోరాడు. సాల్యూట్ చేసి వెళ్ళిపోయాడు.

నన్ను రేపు తీసుకుపోతారన్న వార్త విని నా భార్య, నా సోదరి, నా పిల్లలు కలత చెందారు. కానీ చివరికి కోలుకున్నారు. ఆ రాత్రి వాళ్ళెవరూ నిద్రపోయి ఉండరు. నాకు మిగిలిన గంటల్ని ముక్కలుగా కత్తిరించుకొని కొంత సేపు కుటుంబంతో మాట్లాడడానికి, నిద్రకు, ప్రార్థనలకు నిర్దేశించుకున్నాను. పాటించాను.

మరుసటి రోజు ఉదయాన్నే మిలటరీ వాహనాల కాన్వాయ్ నా ఇంటిని చుట్టుముట్టింది. కానీ ఎవరూ ఇంట్లోకి రాలేదు. రోజంతా వేచి చూసాం. రాత్రైంది తెల్లవారింది. ఎవరూ లోపలికి రాలేదు. అక్కడికి వచ్చిన సైన్యం సైనిక కేంద్రంతో సంభాషణలో ఉన్నట్లు అనిపించింది. చివరగా ఎలా వచ్చిన వాహనాలు అలా వెళ్ళిపోయాయి. మేము అలాగే వేచి చూస్తూ ఉన్నాం. తదుపరి ఏమీ జరగలేదు. బహుశా భద్రతా మండలి సమావేశానికి, దీనికీ ఏదైనా సంబంధం ఉండి ఉండవచ్చు. గంటలు, రోజులకింద మారిపోయాయి. రోజులు నెలలయ్యాయి. సంవత్సరాలు గడిచాయి. నాకేమీ జరగలేదు. ప్రత్యేకించి చెప్పదగ్గదేదీ నా దృష్టికి రాలేదు. చివరికి ఒక రోజు అదృష్టవశాత్తు తప్పించుకోగలిగాను.

**- అయిపోయింది -**

# లాయక్ అలీ ఎలా తప్పించుకున్నాడు?

1666లో ఔరంగజేబు చెర నుండి చాకచక్యంగా తప్పించుకున్న శివాజీ గురించి చాలా మందికి తెలుసు. ఇలాంటివన్నీ చాలా ప్రాచీన చరిత్రలోని అద్భుతాలని మనం అనుకుంటాం.

1950లో గృహనిర్బంధం నుండి నాటకీయంగా తప్పించుకున్న హైద్రాబాద్ చివరి ప్రధాని ఉదంతం కూడా అంతే ఆసక్తిదాయకమైంది. పకడ్బందీ ప్రణాళిక వేసుకుని, దాన్ని జాగ్రత్తగా అమలుపరచి బయటపడ్డాడాయన. ఆయన తప్పించుకున్న విధానం ప్రభుత్వానికి తలవంపులు తేగా, తక్కిన ప్రపంచానికి మాత్రం అదొక వినోదాంశంగా మారిపోయింది.

స్వతహాగా ఇంజనీరైన మీర్ లాయక్ అలీ తర్వాత పారిశ్రామికవేత్తగా మారాడు. అనూహ్యంగా డిసెంబర్ 1, 1947న ఆయన హైద్రాబాద్ ప్రధానిగా నియమించబడ్డాడు. హైద్రాబాద్ ప్రధానిగా నియమించబడేనాటికి ఆయన ఐక్యరాజ్య సమితిలో పాకిస్తాన్ ప్రతినిధిగా పనిచేస్తున్నాడు.

1948 సెప్టెంబర్ పోలీసు చర్య అనంతరం ప్రస్తుతం అమృతామాల్ ఉన్న చోట, బేగంపేటలో ఆయన గృహనిర్బంధం చేయబడ్డాడు.

కాలం గడిచింది. 26.1.1950న భారత రాజ్యాంగం అమలులోకి వచ్చింది. అప్పుడు అతను విడుదల చేయబడతాడని భావించడం జరిగింది. కానీ అలాంటిదేమీ జరగలేదు. లాయక్ అలీ భార్య, ఆయన సోదరి, ఆయన మిత్రులు ఒక పథకం వేశారు. న్యాయవాది అబ్దుల్ ఖువి తరచూ పాకిస్తాన్‌కు వెళ్ళి వస్తూ తప్పించుకోవడానికి కావలసిన పత్రాలు తయారు చేశాడు.

## లాయక్ అలీ అస్వస్థత

ఇంటి చుట్టూ పోలీసు పహారా ఉన్నప్పటికీ లాయక్ అలీ కుటుంబ సభ్యులకు, ఆయన భార్యకు కూడా బయటికి వెళ్ళి వచ్చే స్వేచ్ఛ ఉండేది. ఆ కాలపు ఆచారాన్ని బట్టి కుటుంబ స్త్రీలు వచ్చేపోయే కారు కిటికీ అద్దాలకు పరదాలు ఉండేవి. కారు బయటికి వెళ్ళినప్పుడల్లా మహిళా గార్డులు కారులో ఎవరు వెళ్తున్నది చూసేవారు. తరచూ లాయక్ అలీ శ్రీమతి మాత్రమే బయటికి వెళ్తూ, వస్తూ ఉన్నందున సెక్యూరిటీ చెక్‌లో కొంత ఉదాసీనత వచ్చింది.

ఒకరోజు లాయక్ అలీ జబ్బు పడినట్లు ఆయన శ్రీమతి ప్రకటించింది. లాయక్ అలీ జబ్బు పడ్డట్లు ప్రవర్తించడం మొదలు పెట్టాడు. ఆయన శ్రీమతి తరచూ ఫిజీషియన్ వద్దకు పోతూ, వస్తూ, మందులు తెస్తూ ఆందోళనగా తిరగసాగింది. ఆమెలో కనిపిస్తున్న ఆందోళన, వచ్చేపోయే వాళ్ళలోని ఆతృతతో ఇంటి లోపలా, గేటు దగ్గర ఉన్న సెక్యూరిటీకి, ఇతరులకు లాయక్ అలీ అనారోగ్యం గురించి తెలిసిపోయింది. ఇలా పక్షం రోజులు గడిచిపోయింది. తమ ప్రధానమైన బందీ అనారోగ్యం గురించి సెక్యూరిటీ సిబ్బంది కూడా వాకబు చేయడం మొదలైంది.

ఇదే సమయంలో లాయక్ అలీ బంధువుల ఇంటిలో పెళ్ళి జరుగుతున్నట్లు ప్రకటించబడ్డది. ఒక లారీలో వంట పాత్రలు, ఇతర సామాగ్రి లాయక్ అలీ ఇంటి నుంచి తరలించబడ్డవి. లంబాడీలు రోజూ వచ్చి నృత్యం చేసి పోతుండడం మొదలయింది. వారికి లాయక్ అలీ తరపున బహుమానాలు, తరచుగా మిఠాయిలు పంచిపెట్టేవారు. సెక్యూరిటీ సిబ్బందికి కూడా వాతావరణం ఆహ్లాదకరంగా ఉన్నట్లు తోచింది.

## పరదా కారు

1950 మార్చి 3న పని మనిషి వచ్చి బేగం డాక్టరు వద్దకు వెళ్ళడానికి కారు కావాలని అడిగింది. కారు పోర్టికో కిందకి రాగానే లాయక్ అలీ సైలెంట్‌గా కారు ఎక్కాడు. ఏమాత్రం అనుమానపడని గార్డులు మరోవైపు ఉండిపోయారు. పేషెంటు పడుకొని ఉన్నట్లు భ్రాంతిగొలిపే విధంగా లాయక్ అలీ పడక మీద మెత్తలు పరిచి దుప్పటి వేశారు. లాయక్ అలీ శ్రీమతి పై అంతస్తుకు వెళ్ళి దాచుకుంది. లాయక్ అలీ నేరుగా వాళ్ళ సోదరి ఇంటికి వెళ్ళాడు. అక్కడి నుండి వేరే కారులో అబ్దుల్ ఖవి ఇంటికి చేరాడు. అసలు కారు తిరిగి లాయక్ అలీ ఇల్లు చేరింది. మందులు

తీసుకుని బేగం ఇంటికి వచ్చిందని పనిమనిషి చెప్పింది. పై అంతస్తులో దాక్కున్న లాయక్ అలీ శ్రీమతి మేడ దిగి భర్త పడక గదిలోకి వచ్చింది. మెత్తలతో కూడిన భర్త పడక దగ్గరికి వచ్చి లాయక్ అలీతో చెబుతున్నట్లుగా 'డాక్టర్ గారు మందులు మార్చాడు' అని చెప్పింది. మందులు వేసినట్లుగా నటించింది. కిటికీ దగ్గర డ్యూటీలో ఉన్న మహిళా గార్డు ఇదంతా నిజంగానే భావించి ఊరుకుంది.

పరదాలతో కూడిన కారు అబ్దుల్ ఖవి ఇంటిదగ్గర సిద్ధంగా ఉంది. లాయక్ అలీ, ఆయన మేనల్లుడు ఆయనను కలిశారు. ముగ్గురూ కారెక్కారు. కారు గుల్బర్గా వైపు పయనించింది. నగర శివార్లు దాటాక లాయక్ అలీ కారు కిటికీ పరదాలు పక్కకి జరిపాడు. మాతృదేశాన్ని చివరిసారిగా చూశాడు.

నాలుగు పడకల ఫస్ట్‌క్లాస్ కంపార్ట్‌మెంట్ సికింద్రాబాద్‌లో బుక్ చేయబడింది. కానీ ప్రయాణీకులు గుల్బర్గాలో రైలు ఎక్కుతారని చెప్పబడింది. ప్రయాణీకులు ముగ్గురే అయినప్పటికీ రహస్యంగా ఉండడం కోసం నాలుగు సీట్లు రిజర్వు చేయబడ్డవి.

గుల్బర్గా మజీదులో ప్రార్థన చేసి రైల్వే స్టేషన్‌కు చేరుకున్నారు. మరుసటి రోజు ఉదయం బొంబాయి రైల్వే స్టేషన్లో దిగారు. స్నానం, అల్పాహారం అయ్యాక విమానాశ్రయం చేరుకున్నారు. గులాం అహ్మద్ పేరుతో లాయక్ అలీ విమానమెక్కాడు.

## పోలీసు ఉన్నతాధికారి తోసిన కారు

హైద్రాబాద్‌లో మరో రెండు రోజులు నిశ్శబ్దంగా గడిచింది. శ్రీమతి లాయక్ అలీ మెత్తలకు మందులు తినిపిస్తూ వచ్చింది. మతాచార్యుల బృందాలకు జబ్బున పడ్డ మాజీ ప్రధాని పేరున కానుకలు పంచబడ్డాయి. మరుసటి రోజు శ్రీమతి లాయక్ అలీ తన దగ్గరున్న కరెన్సీ నోట్లను కొన్ని కట్టలుగా కట్టింది. ఒక నమ్మకమైన అరబు సేవకుడికి అవి ఇచ్చి కొందరు సేవకుల పేర్లు చెప్పి వారికి ఆదివారం నాడు వాటిని పంచిపెట్టమని చెప్పింది. తర్వాత ఆమె తన సోదరుడి ఇంటికి వెళ్ళింది. అక్కడి నుండి ఒక పరదాలు కట్టిన కారులో బొంబాయి విమానం కోసం విమానాశ్రయానికి పయనించింది. విమానాశ్రయానికి చేరేముందు కారు చెడిపోయింది. డ్రైవరు కిందికి దిగి కారును తోయడం మొదలుపెట్టాడు. పక్కనుండి ఇన్‌స్పెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ జెట్లీ కారు వచ్చి ఆగింది. ఉదారమైన వ్యక్తిత్వమున్న జెట్లీ పరదా కారు ఆగిపోవడం చూసి దాన్ని తోయడానికి కిందికి దిగాడు.

లాయక్ అలీ విమానంలో కరాచీ చేరగా ఆయన కుటుంబం ఎస్.ఎస్.సబర్మతీ ఓడ ఎక్కారు.


లాయక్ అలీ తప్పించుకున్న వార్త మొదట రేడియో పాకిస్తాన్‌లో ప్రకటించబడ్డది. ఇండియా హౌజ్ వద్ద ఒక విందుకు లాయక్ అలీ హాజరైనట్లు ఆ ప్రకటన తెలియజేసింది. పాకిస్తాన్‌లో భారత హై కమిషనర్ ప్రకాశ భారత హెూం మంత్రి సర్దార్ పటేల్‌కు ఫోన్ చేసి 'లాయక్ అలీ విడుదల అయ్యాడా?' అని అడిగాడు. లేదని చెప్పి పటేల్ హైద్రాబాద్‌లో విషయాన్ని వాకబు చేశాడు. అప్పుడు కానీ ప్రభుత్వానికి జరిగిన వ్యవహారం అర్థం కాలేదు.

## షౌకతున్నిసా మీద కేసు

నిర్లక్ష్యానికి బాధ్యులైన అధికారుల మీద ప్రభుత్వం చర్యలకు ఉపక్రమించింది. లాయక్ అలీ తప్పించుకోవడానికి పథకం వేసినందుకు ఆయన సోదరి షౌకతున్నిసా బేగం మీద కేసు నమోదయింది. హైద్రాబాద్ పబ్లిక్ సేఫ్టీ అండ్ పబ్లిక్ ఇంటరెస్ట్ రెగ్యులేషన్, హైద్రాబాద్ పీనల్ కోడ్ కింద లాయక్ అలీ నిర్బంధించ బడ్డాడని, భారత రాజ్యాంగం అమలులోకి వచ్చినందున పాత హైదరాబాద్ చట్టాల కింద పెట్టిన లాయక్ అలీ నిర్బంధమే అక్రమమని కోర్టు ప్రకటించింది. నేరమే లేనప్పుడు కుట్ర అనే ప్రశ్నే తలెత్తదు. షౌకత్‌తో పాటు అందరి మీద కేసు కొట్టివేయబడ్డది.

24 అక్టోబర్ 1970న న్యూయార్క్‌లో ఉదయపు ప్రార్థన చేస్తూ లాయక్ అలీ మరణించాడు. ఆయన పార్థివదేహం మదీనాకు తెచ్చి ఖననం చేయబడ్డది.

***(01.7.2000న నరేంద్ర లూథర్ బ్లాగులోని కథనం ప్రకారం...)***



**HYDERABAD VISHAADAM**
(TRAGEDY OF HYDERABAD)
by **Mir laik ali**
Translated by
**Dr. Anugu Narasimha Reddy**

స్వతహాగా ఇంజనీరైన మీర్ లాయక్ అలీ తర్వాత పారిశ్రామికవేత్తగా మారాడు. అనూహ్యంగా డిసెంబర్ 1, 1947న ఆయన హైదరాబాద్ ప్రధానిగా నియమించబడ్డాడు. హైదరాబాద్ ప్రధానిగా నియమించబడేనాటికి ఆయన ఐక్యరాజ్య సమితిలో పాకిస్తాన్ ప్రతినిధిగా పనిచేస్తున్నాడు. 1948 సెప్టెంబర్ పోలీసు చర్య అనంతరం ప్రస్తుతం అమృతామాల్ ఉన్న చోట, బేగంపేటలో ఆయన గృహ నిర్బంధం చేయబడ్డాడు.

- నరేంద్ర లూథర్

కె. జితేంద్రబాబు సంపాదకత్వంలో డాక్రి వాళ్ళు ప్రచురించిన ఆ పుస్తకం చదివి ఆశ్చర్యపోయాను. అది మనకు తెలియని మన చరిత్రలా అనిపించింది. ఇందులో రెండు విషయాలు నన్ను ఆకర్షించాయి. ఒకటి – వస్తువు, రెండు – దాన్ని చెప్పిన పద్ధతి. ట్రాజెడీ ఆఫ్ హైద్రాబాద్‌లో మొదటి అధ్యాయం 'దేశ విభజన తర్వాత'. ఇది ఒక చేయితిరిగిన కథారచయిత రాసినట్లు ఉంది.

- డా॥ ఏనుగు నరసింహారెడ్డి

హైద్రాబాద్ సంస్థానం భారతదేశంలో విలీనం జరగడానికి దోహద పడిన కారణాలను, జరిగిన సంఘటనలను, జరిపిన సంప్రదింపులను అర్థం చేసుకోవడానికి ఈ పుస్తకం దోహదపడుతుంది. తెలంగాణ చరిత్రనీ, ప్రత్యేకించి హైద్రాబాద్ చరిత్రనీ అధ్యయనం చేయడానికి ఉపకరిస్తుందీ రచన.

- కె.జితేంద్రబాబు

మీర్‌లాయక్ అలీ 'ట్రాజెడీ ఆఫ్ హైద్రాబాద్' ఓ విలక్షణమైన రచన. ఆనాటి నిజాం రాష్ట్ర ప్రధానిగా, హైద్రాబాద్ దేశభక్తుడిగా, హైద్రాబాద్ రాష్ట్ర స్వాతంత్ర్యం కోసం తీవ్రంగా ప్రయత్నించి విఫలమైన వ్యక్తి. ఆనాటి న్యాయాన్యాయాలను తనదైన తూనికరాళ్ళతో బేరీజు వేసి ఆవేదనతో రాసిన గ్రంథమిది. 1947 ఆగస్టు 15 నుండి 1948 సెప్టెంబర్ 17 వరకు నడిచిన ఉద్విగ్నభరితమైన హైద్రాబాద్ చరిత్రని తెలుసుకోడానికి ఉపకరిస్తుంది.

- గుడిపాటి

పాలపిట్ట బుక్స్
హైదరాబాద్